# నాయన

## కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని జీవిత చరిత్ర




920
64589
64.589

గుంటూరు లక్ష్మీకాంతము

ॐ

# నాయన

అను

(కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని
జీవిత చరిత్ర)




రచన :

గుంటూరు లక్ష్మీకాంతము

© సర్వహక్కులు : చెల్లాయమ్మా రావు అనబడు
జె. వి. యస్. లక్ష్మి.

ప్రథమ ముద్రణ - 1958
ద్వితీయ ముద్రణ - 1964
తృతీయ ముద్రణ - 1998

920
C.14413

ప్రతులకు :

జె. వి. యస్. లక్ష్మి,
(W/O, J.G.K. MURTY)
64, బర్కిట్ రోడ్డు, టి.నగర్,
చెన్నై - 600 017.

64589

***Price Rs.* : 100/**

ముద్రణ :
నాగార్జున్ ప్రింటర్స్,
డాక్టర్ రాధాకృష్ణన్ నగర్,
చెన్నై - 600 021.



BHAGAVAN SRI RAMANA MAHARSHI

# అంకితము

ఈ ముద్రణ శ్రీ నాయనగారి పాదసేవలు చేసి
ధన్యులైన నా జ్యేష్ఠ సోదరి **కీ.శే. సూరమ్మ,**
మరియు ఆమె భర్త ("నాయన" జీవిత చరిత్ర
గ్రంథకర్త అయిన)
**కీ.శే. గుంటూరు లక్ష్మీకాంతముగార్లకు**

**జె.వి.యస్. లక్ష్మి**
(చెల్లాయమ్మారావు)

# పరిచయము

కావ్యకంఠ బిరుదాంకిత శ్రీ వాసిష్ఠ గణపతిముని యొక్క సంపూర్ణ జీవిత చరిత్రయే ఈ 'నాయన' గ్రంథము. దీనిని చక్కని కూర్పుతో మా బావగారైన కీ.శే. గుంటూరు లక్ష్మీకాంతముగారు రచించిరి. చిత్ర విచిత్రానుభవములతోను, అపూర్వ యోగ సిద్ధులతోను, వివిధ విలాసములతోను నిండిన శ్రీ గణపతిముని పవిత్ర జీవిత చరిత్ర అందరకు మార్గదీపిక.

గుంటూరు లక్ష్మీకాంతముగారు మా జేష్ఠ సోదరియైన సూరమ్మ గార్ని వివాహము చేసుకొని కలకత్తాలో బి.యన్. రైల్వేలో ఉద్యోగము చేయు చుండెడివారు. నాకు యెనిమిదేండ్ల వయసప్పుడు కలకత్తాలో వారితో వుండుట తటస్థించినది. ఆ సమయములో శ్రీ నాయనగారు మా అక్కగారింట్లో బస చేసినారు. అప్పుడు నాకు వారి సేవ, ఉపదేశ భాగ్యము కలిగినది. వారి మెప్పు, అనుగ్రహము పొందితిని.

నాకు వివాహమైన తరువాత నేను నా భర్త శ్రీ జొన్న్యల గోపాల కృష్ణమూర్తిగారు (Sri జె.జి.కే మూర్తి) ఉద్యోగరీత్యా కలకత్తాలో మా అక్కగారింటికి వచ్చితిమి. దరిమిలా మా అక్కగారి నిర్యాణానంతరము మా బావ గుంటూరు లక్ష్మీకాంతముగారు తన ఉద్యోగమునకు రాజీనామా చేసి తిరువణ్ణామలై శ్రీ రమణాశ్రమము చేరుకొనిరి. శ్రీ రమణ మహర్షివద్ద కొంతకాలము వుండి, ఆయన ఆజ్ఞానుసారము ''నాయన'' జీవిత చరిత్రను వ్రాయుటకు కావలసిన విషయములను సేకరింప మొదలిడిరి.

మేము ఉద్యోగరీత్యా మద్రాసు వచ్చితిమి. గుంటూరు లక్ష్మీకాంతముగారు కూడా మాతో వుంటూ శ్రీ నాయన జీవిత చరిత్రను వ్రాసి 1958లో ప్రథమ ముద్రణ, 1964లో ద్వితీయ ముద్రణ చేయించినారు. శ్రీ నాయనగారి రచనలు చాలా వరకు వివిధ ప్రదేశముల నుండి సేకరించి వాటిని కూడా ముద్రించిరి. ఇదియేకాక మా కుటుంబమునకు వివిధ రంగములలో తగిన సమయములలో మంచి



గుంటూరు లక్ష్మీకాంతము

సూచనలు యిచ్చి మాకందరికీ మార్గదర్శకులు గురు తుల్యులైనారు. ఆయన, 1966లో నిర్యాణమునకు ముందు శ్రీ నాయన జీవిత చరిత్రనూ, శ్రీ నాయన యితర రచనలనూ పునర్ముద్రణ సేవ చేయమని ఆదేశించిరి.

తదుపరి 1978 లో శ్రీ నాయన శత జయంతుత్సవ సందర్భమున శ్రీ జి. కృష్ణగారిచే ఆంగ్లమున సంక్షిప్తముగా నాయన జీవిత చరిత్రను ప్రచురింతిమి.

గత కొన్ని సంవత్సరములుగా ఈ గ్రంథము తృతీయ ముద్రణ కొరకు నా భర్త శ్రీ జె.జి.కె. మూర్తిగారు మరియు నా కుమారులు ప్రయత్నము చేసినారు. ఈ తరుణంలో శ్రీ నాయన, శ్రీ గుంటూరు లక్ష్మీకాంతముగార్ల స్ఫూర్తి, ప్రేరణలతో ద్వితీయ ముద్రణ చేసిన వెల్డన్ ప్రెస్ యజమానులు శ్రీ G. సాంబశివరావుగారు ఈ తృతీయ ముద్రణ కూడా చేయుటకు అంగీకరించినారు. వారికి, వారి కుటుంబమునకు శ్రీ రమణ గణపతుల అనుగ్రహము ఉండుగాక. ఈ ముద్రణకు ముఖ్య కారకులై అన్ని విధముల సహాయ సహకారములందించిన నా భర్త శ్రీ జె.జి.కె. మూర్తి గారికి మరియు కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ శ్రీ రమణ గణపతుల అనుగ్రహము ఉండుగాక.

| | |
|---|---|
| చెన్నై | జె.వి.యన్. లక్ష్మి |
| 17-01-1998 | (చెల్లాయమ్మారావు) |

*****

## గుంటూరు లక్ష్మీకాంతముగారి

# సంగ్రహ జీవిత చరిత్ర

గుంటూరు లక్ష్మీకాంతము యలమంచిలి కాపురస్థుడు. అతని జననము యలమంచిలిలో 25-1-1900 తేదీని. అతని రెండవ మాసమున తండ్రిగారగు లక్ష్మణశాస్త్రిగారు మరణించిరి. తండ్రిగారు న్యాయవాది. లక్ష్మీకాంతము ఆరవయేట తల్లిగారైన వెంకు సోదెమ్మగారిని కోల్పోయెను. ఆరుగురు సోదరులలో లక్ష్మీకాంతము కనిష్ఠుడు. అతని జ్యేష్ఠ సోదరులగు వెంకటసుబ్బారావుగారియొక్కయు, వారి సతీమణి అయిన విశాలాక్షమ్మగారి యొక్కయు పోషణలో లక్ష్మీకాంతము పెరిగెను. తలిదండ్రులకన్న మిన్నగ పెంచిన ఆ పుణ్యదంపతుల కతడు కృతజ్ఞుడై యుండెను.

స్కూలుఫైనల్ వరకు లక్ష్మీకాంతము చదువు యలమంచిలి, అనకాపల్లి, తుని గ్రామములలో జరిగెను. గణితశాస్త్రమనిన అతనికి చాల ప్రీతి. స్కూలుఫైనల్‌లో నుండగా గణితశాస్త్రమందలి బి.ఏ. కోర్సు నతడు పూర్తిచేసెను. ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం సంపాదించెను. విశాక్షమ్మగారు విదుషీమణి. లక్ష్మీకాంతము మున్నగు బాలుర కామె భారత, భాగవత గ్రంథములందలి పద్యములను చదివి వినిపించెడివారు. లక్ష్మీకాంతములోని ఆస్తికత కది అంకురార్పణగ భావించెదను.

లక్ష్మీకాంతమునకు ఆటలన్న ఆసక్తి మెండుగ నుండెడిది. ఫుట్‌బాలు ఆటలో నతడు ప్రవీణుడు; బేడ్మింటన్ ఆటలో ప్రంటుగా నతడు రాణించెడివాడు. టెన్నిసులోకూడ కొంత కృషి చేసెను.

లక్ష్మీకాంతము విజయనగరం మహారాజావారి కళాశాలలో ఇంటర్మీడియట్ చదివెను. ఆ రెండు సంవత్సరములు అతని ఆరోగ్యము పాడయ్యెను. రెండవ సంవత్సరము ప్రభుత్వ పరీక్ష కతనిని పంపుటకు ప్రిన్సిపాలుగారు అంగీకరింపలేదు. కాని లక్ష్మీకాంతముయొక్క తెలివితేటలు గుర్తించిన కెమిస్ట్రీ లెక్చరరుగారు ప్రిన్సిపాలు మెప్పించి లక్ష్మీకాంతమును పరీక్షకు పంపునట్లు చేసెను. అతడు పరీక్ష వ్రాయుచుండగ జ్వరము తీవ్రముగ తగిలి వాలిపోయెను. ఆయేడు పరీక్ష అట్లయినది. మరుసటి యేడు పరీక్షలో నుత్తీర్ణుడయ్యెను. పై చదువులు నిరాకరించెను.

లక్ష్మీకాంతము వివాహము 1921 సంవత్సరంలో శ్రీ ఆకెళ్ల సూర్యనారాయణ గారి కుమార్తె అరసవిల్లి సూరమ్మతో జరిగెను.

ఉద్యోగాన్వేషణలో జమ్‌షెడ్‌పూరు వగైరాలు తిరిగివచ్చి విశాఖ జిల్లాలో రెవిన్యూ డిపార్టుమెంటులో చేరి యలమంచిలి, చోడవరం, నరసీపట్నం గ్రామములలో ఉద్యోగము చేసెను. దానితో అతడు సంతుష్టినందక కలకత్తాలోనున్న మిత్రుల కోరికపైని కలకత్తా వెళ్లి బి.ఎన్. రైల్వే కేంద్ర కార్యాలయంలో ఉద్యోగము సంపాదించి ఖర్గర్‌పూరులో కాపురము పెట్టెను.

లక్ష్మీకాంతము నిరాడంబర ఆస్తికుడు; సేవాపరాయణుడు. అతని జ్యేష్ఠ సోదరులగు వెంకటసుబ్బారావుగారు దివ్యజ్ఞాన సమాజ సభ్యులు. ఆ సమాజ గ్రంథములను లక్ష్మీకాంతము చదివెడివాడు. అతని మామగారగు ఆకెళ్ల సూర్యనారాయణగారు పూర్వ బంధువులు. ఆయన మహాభక్తుడు, సాధకుడు. లక్ష్మీకాంతము మున్నగు వారి కాయన వివేకానందస్వామివారి ఉపన్యాసములు చదివి వినిపించెడివారు. హఠయోగ మభ్యసించమని అందరను ప్రోత్సహించువారు. లక్ష్మీకాంతములోని ఆస్తికత కివి పునాదులు. అతని భార్య అగు అరసవిల్లి సూరమ్మ అతని కన్ని విధముల అనుకూలవతి. ఆమెకుకూడ ఆస్తికత మెండు.

లక్ష్మీకాంత మొకసారి నాగపూరు బాబా సందర్శనమునకు నాగపూరు వెళ్ళెను. ఆ ప్రాంతమంతయు అతనికి క్రొత్త. రైల్వే స్టేషనులో దిగి అతడు బాబాగారి ఆశ్రమమును గురించి ఎవరినడిగి తెలుసుకొనవలయునని యోచించుచుండ, ఒక పోలీసు కాన్‌స్టేబుల్ అతనిని సమీపించి 'మీరు సీతారామదీక్షితులుగారి తమ్ముడా' అని ప్రశ్నించెను. తెలుగు మాటకు పోలికనుబట్టి బాంధవ్యమెత్తుటకును లక్ష్మీకాంతము విస్మయమందెను. ఆ కాన్‌స్టేబుల్ సీతారామదీక్షితులుగారి శిష్యుడనని చెప్పి లక్ష్మీకాంత మాయన తమ్ముడే అని తెలుసుకుని జట్కాబండిని మాట్లాడి లక్ష్మీకాంతమును బాబాగారి ఆశ్రమమునకు పంపెను. సీతారామదీక్షితులు, అతని రెండవ అన్నగారు ఉపాధ్యాయులుగానుండిరి. ఆశ్రమములో బాబాగారు పరుండి యుండి లక్ష్మీకాంతముతో యేమియు మాటాడకుండుటకు లక్ష్మీకాంతము చిన్నబడి తిరుగుముఖము పట్టెను. తిరుగు ప్రయాణములో అతడు వాల్తేరు స్టేషనులోదిగెను. ప్లాట్‌ఫారంమీదనే ఒక అపరిచిత యువకు డతనిని సమీపించి ఛత్రపూరులోనున్న బాబాగారి శిష్యులొకరు తన్నంపెననియు, విశాఖపట్నంలోని రత్నమను ఫొటోగ్రాఫరు వద్ద బాబాగారి ఫొటో ఉండుననియు, దానిని సంపాదించమని చెప్పినారనియు లక్ష్మీకాంతముతో చెప్పి అదృశ్యుడాయెను. మహాత్ముల శక్తికి కాంత మబ్బురపడెను.

తాను రివ్వపాటొందినను బాబా అనుగ్రహించినాడని సంతుష్టినందెను. మరునాటి ఉదయమున లక్ష్మీకాంతము రత్నా స్టూడియోకి వెళ్ళుసరికి నొకరొకడు దానినూడ్చుచు అతని రాకకు చిరాకుపడెను. వారి మధ్య నడచిన సంభాషణ లోపలి నుంచి వినిన రత్నముగారు స్టూడియోలోనికి వచ్చి లక్ష్మీకాంతమును ప్రశ్నించిరి. ఆయనకు వెంకటసుబ్బారావుగారితో పరిచయముండుటను స్నేహపూర్వకముగ బాబా ఫొటో నొకదానిని లక్ష్మీకాంతమున కిచ్చెను.

ఖర్గర్‌పూరునుండి కొందరు స్నేహితులు నాగపూరు బాబా ఆశ్రమమునకు వెడలుచు లక్ష్మీకాంతమును వారితో రా కోరిరి. లక్ష్మీకాంతము భార్యతో కూడ వెళ్లెను. అచ్చట ఒక మహాత్ముడు పిచ్చివానివలె తిరుగుచుండెను. అతడెవరిని తాకిన వారు భగవదనుగ్రహమునకు పాత్రులగుదురని వాడుక. లక్ష్మీకాంతమునకు అనుభవము కలిగినది.

లక్ష్మీకాంతము, భార్య బేలూరు మఠమునకు తఱచు వెళ్ళుచుండెడివారు. అతని కలకత్తా జీవిత మతనిలోని వెలుగుల నెన్నిటినో బహిర్గతమొనర్చెను. ఉద్యోగమును సంపాదించిన కొంత కాలములోనే అతడు పై అధికారుల మెప్పును బడసెను. అతని ఉద్యోగకాలములో పై అధికారులందరు అతనిపై ప్రత్యేక అభిమానమును చూపెడివారు. లక్ష్మీకాంతమువల్ల ఉపకారమును పొందిన వారనేకులు. బి.ఎన్. రైల్వే ఉద్యోగులందరకు ప్రియుడు. కలకత్తాలో ఆంధ్ర బాలబాలికలకు ప్రత్యేక పాఠశాల లేదని లక్ష్మీకాంత మొక పాఠశాల ప్రారంభించెను. అతని సోదరుడైన సత్యనారాయణగారి కుమార్తె లిరువురును, సారథి సత్యనారాయణగారి పిల్లలు కొందరును మొదటి విద్యార్థులు. పరికరము లేవియు లేవు. కనుక లక్ష్మీకాంతము నూతన పద్ధతి నవలంబించెను. తెలుగు పద్యములు విద్యార్థులకు వినిపించి వారిచే కంఠస్థము చేయించుట, నోటిని లెక్కలు కట్టుట, ఇంగ్లీషున సంభాషించుట, మధ్యమధ్య కథలు చెప్పుట నూతన విధానము. కొలది మాసములలో ఆ విద్యార్థులకు కలిగిన వికాసమున కాశ్చర్యపడి ఖర్గర్‌పూరులోని చాలమంది తెలుగువారు తమ పిల్లల నా పాఠశాలకు పంపసాగిరి. చందాలు, విరాళములు చేరెడివి. ఉద్యోగములకని కలకత్తా చేరిన కొందరు తెలుగువారు ఉపాధ్యాయులుగా నియమింపబడిరి. పాఠశాల వృద్ధినందెను. ఒక మహాశయుడు చాల గ్రంథములను కొని లైబ్రరీ యేర్పాటు చేయించెను. కొందరు కుర్చీలు, బల్లలు మొదలగు సామగ్రి కూర్చిరి. ఆ పాఠశాల పద్ధతులను మహానుభావులెందరో మెచ్చుకొని విరాళము లిచ్చిరి. కలకత్తా మేయరగు శ్రీమతి సేనుగుప్తాగారు కార్పొరేషను గ్రాంటు మంజూరు చేయించిరి.

లక్ష్మీకాంతము ఖద్దర్‌పూరులోని బస అతిథి అభ్యాగతుల కొక వసతిగా నుండెను.

అప్పుటనే లక్ష్మీకాంతమునకు కావ్యకంఠ శ్రీ గణపతిముని గారితో పరిచయము, సేవాభాగ్యమును కలిగెను. శ్రీ గణపతిమునిగారు అతని బసలో సుమారొక సంవత్సరముండిరి. వారి అనుగ్రహమునకు లక్ష్మీకాంతమును. అరసవిల్లియు పాత్రులైరి. ఆ దంపతులు శ్రీ రమణ మహర్షిగారి దర్శనమునుకూడ చేసుకొని, వారి అనుగ్రహమున పొందిరి.

1941 సంవత్సరంలో అరసవిల్లి స్వర్గస్థురాలాయెను. లక్ష్మీకాంతమంత ఉద్యోగమునుండి రిటైరయి స్వగ్రామమును చేరుకొనెను.

అతడు హోమియోపతి వైద్యగ్రంథములను పఠించి ముఖ్య ఔషధములను, డీసేను మందులను చాల తెప్పించి యుంచుకొనెను. ఆ మందులతో నతడెందరికో సహాయపడెను. స్వయంసేవకు వెనుకాడని అతనివల్ల నెందరెందరో సేవలందిరి. పెద్దవదినెగారికిని, పెద్దఅన్న గారికిని అతడు చేసిన సేవ అమోఘము. అతని అయిదవ అన్నయగు శ్రీహరి భార్యయు, కుమారుడును కె. జి. హాస్పిటల్‌లో నుండగా వారిని గురించి లక్ష్మీకాంతము విశాఖపట్నములో నెలలాదిగనుండి వారిని కాపాడెను. ఇటులనే కష్టమెప్పుటనున్న అతని తోడ్పాటచ్చట నుండెడిది.

లక్ష్మీకాంతము శ్రీ గణపతిమునిగారి అముద్రిత గ్రంథము లెన్నిటినో ప్రచురించెను. 'నాయన' అను శ్రీ గణపతిమునిగారి జీవిత చరిత్రను వ్రాసెను. భార్య మరణానంతరమున తరచుగ అతడు శ్రీ రమణ మహర్షిగారిని సందర్శించెడివాడు. ఆ ఆశ్రమవాసుని రీతి శ్రీ మహర్షిగారి నిర్యాణము తరవాతకూడా తిరువణ్ణామలై వెళ్లెడివాడు.

అతని అప్పులలో అప్పులు అతని ఒక మరదలగు జె. చెల్లాయమ్మ, ఆమె భర్త జె. జి.కె. మూర్తిగారలు. ఆ దంపతు లతనిని తండ్రిగా, గురువుగా భావించి సేవించిరి. లక్ష్మీకాంతమునకు కేన్సరు వ్యాధి సంభవించినది. దీని చికిత్స సందర్భమున ఆ దంపతులు చేసిన సేవ అపరిమితము. ఆ చికిత్స ఫలితముగ లక్ష్మీకాంతము కొన్ని మాసములు బాగుగనుండెను. తరవాత మరల ఆ వ్యాధి లక్షణములు పొడచూపి క్రమముగా అతనిని లొంగతీసినది. అతడు 31-1-1966 తేదీ రాత్రి గం. 1-40 ని. లకు భౌతిక దేహమును విడిచెను.

# విజ్ఞప్తి

ఈ గ్రంథమున కిది ద్వితీయ ముద్రణము. దీనిలో ముఖ్య కథాభాగమం దెట్టి మార్పులు చేయబడకున్నను, ‘షరా’ రూపమున నిదివఱకు ముద్రింపబడిన భాగములలో కొన్ని విడువబడి, మఱికొన్ని సంక్షిప్తము గావింపబడెను. మఱియు మూడవ యనుబంధమైన ‘ప్రచండ చండీపటలము’ నకు బదులుగా ఈశావాస్యోపనిషత్తునకు శ్రీ నాయన రచించిన లఘుభాష్య మచ్చొత్తింపబడెను.

నాకు శ్రీ నాయనగారి గ్రంథ ప్రచురణోద్యమమం దాదినుండి చేదోడు వాదోడై యున్న నా కోడల్లుడు చిరంజీవి జి.జి.కె. మూర్తిన్ని (జనరల్ మేనేజరు, ఉషా సేల్స్ ప్రయివేటు లిమిటెడ్, మద్రాసు), అతని భార్యయగు సౌ॥ వెంకట సుబ్బలక్ష్మిన్ని (చెల్లాయమ్మారావు) చెన్నపట్టణమందే ముద్రణము నేర్పరచి, నాకు సదుపాయములమర్చి, నన్ను కృతార్థుని గావించినందులకు వారిపై యథా పూర్వానుగ్రహమును శ్రీ రమణ గణపతులు బరపి, వారికి, వారి కుటుంబమునకు నాయురారోగ్యైశ్వర్యాది సంపదలను సమకూర్చుగావుత.

ఈ ముద్రణ కార్యమును భక్తిశ్రద్ధలతో గావించి, 28 దినములలో పూర్తిచేసిన శ్రీ వెల్లన్ ప్రెస్, వాషర్మన్‌పేట వారికి నా ధన్యవాదములు. ఇట్టి ప్రచురణముల కాకరమగుచు వారి ప్రెస్ శ్రీ రమణ గణపతుల కృపచే వర్ధిల్లుగాక.

యలమంచిలి
విశాఖ జిల్లా
తే. 25-5-1964

ఇట్లు,
బుధజన విధేయుడు,
గుంటూరు లక్ష్మీకాంతము

# పండితాభిప్రాయములు

## కావ్యకళాకోవిద శ్రీ గుం॥ సీతారామదీక్షితులు, తుని.

కం॥ సూర్యునిఁ దేజమువలె ఋషి
వర్యుండగు రమణు ననుభవము వాగ్విధి ధీ
వర్యులు మెచ్చగ నే యా
చార్యుఁడు ప్రకటించె, నది సుసంగత మిందున్.

## డా. యన్.సి. వేంకటరాఘవాచారి, తుని.

"చెలికించెన్ జవినించె సూక్ష్మపదముల్ ఛేదించి బోధించె, నూ
త్న విధానంబుల వేదచోదిత తపోధర్మంబు గాన్పించె, శ్రా
వ్య వినోదార్థములన్ బురాణగత గాథాంతర్య మొప్పించె నీ
సువచోగుంభన కావ్యకంఠ చరితస్తోత్రైకమాత్రంబొకో?"

## కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, ఎం.ఏ.,

ఈ గ్రంథము పేరు 'నాయన'.

రచయిత శ్రీ గుంటూరు లక్ష్మీకాంతముగారు. చరిత్ర శ్రీ గణపతి మునిది. 'నాయన' యని శ్రీ రమణ మహర్షి గణపతిమునిని ప్రేమగాఁ బిలుచు పేరు. శ్రీ గణపతిముని శిష్యపరంపర యాంధ్ర ద్రవిడ దేశములందు దోసతోటవలె నల్లుకొన్నది. శ్రీ గణపతి ముని, శ్రీ రమణుడు - మహర్షి. ఈ మహావాసిష్ఠులు పర్వతగుహాంతరముల, వివిక్తస్థలముల నేకాంత తపస్సు ఏండ్లతరబడి చేసినవారు. మహాకవి. సంస్కృతమున వారి రచన లుపాసనా బహుప్రదీపములు. వారి చరిత్ర అవశ్యపఠనీయము. శ్రీ లక్ష్మీకాంతముగారి శైలి సులభము, నిర్దుష్టము. ఇంతకుమించి వ్రాయవలసినది లేదు. ఉపాస్యమైనదానిని గురించి యెక్కువ చెప్పుట యవివేకము.

## ఆర్షవిద్యాభూషణ శ్రీ జటావల్లభుల పురుషోత్తము, ఎం.ఏ.,

శ్రీ కావ్యకంఠ గణపతిశాస్త్రిగారి పవిత్ర జీవిత చరిత్రను శ్రీ గుంటూరు లక్ష్మీకాంతముగారు సరళ సరస శైలిలో రచించి ఆంధ్ర సారస్వతమున కమూల్యభూష నొసగినారు. తెలుగులో జీవిత చరిత్రములే తక్కువ. ఉన్నవైనను ఎక్కడి వారివో. మనకు దగ్గఱగ నుండి యనేక విషయములలో మనము అర్థము చేసికొనగల మహాపురుషుల చరిత్రలు మరింత యరుదు. అందునను సంస్కృత విద్వాంసుడు, తపస్వి, పారమార్థిక జీవనుడునయిన మహాపురుషుని యొక్క జీవిత చరిత్ర మిదివరకు లేనేలేదు. ఈ లోపమును శ్రీ లక్ష్మీకాంతముగారు పూరించినారు. సారస్వతులేకాక, ఆధ్యాత్మిక సాధకులు కూడ ఉత్తేజము నొందగల దివ్యఘట్టము లెన్నియో యీ గ్రంథమున నిబద్ధములై యున్నవి.

ఇంతటి బృహద్గ్రంథము నింత సర్వజనాకర్షకముగా రచించిన శ్రీ లక్ష్మీకాంతముగారి జన్మ సార్థకము.

భాషలో సరళమై, శైలిలో మధురమై, విషయములో గంభీరమైన యీ పవిత్ర గ్రంథమునకు ఆంధ్రులెల్లరు స్వాగతమిడి జేజేలు పెట్టెదరని నా దృఢవిశ్వాసము.

## పత్రికాభిప్రాయములు

గణపతిముని జననం మొదలు (17-11-1878) వారు కీర్తిశేషులగు వరకు (25-7-1936) విస్తృతమైన వారి సమగ్ర జీవిత కథనమే 'నాయన' అనే గ్రంథం.

ఈ సమగ్ర కథనంలో అబ్బురపాటు కల్గించునవీ, ఔరా అనిపించునవీ, అయ్యో అనిపించునవీ, ఆనందబాష్పములను రాల్పించునవీ, ఆవేదనతో కనుల చెమరింపజేయునవీ అనేక సంఘటనలు కానవస్తాయి.

- (ఆంధ్రప్రభ)

అనేక విచిత్ర గాథలతో కూడిన ఈ మహనీయుని జీవిత చరిత్ర నవలకంటె ఆకర్షణీయంగా చదివిస్తున్నది. ఇది యీ సంవత్సరం వచ్చిన జీవిత చరిత్రలలో తలమానికమైనది.

- (స్వతంత్ర)

It is a big work of 783 pages, replete with thrilling episodes. Written in simple and faultless style, it is a valuable contribution to Telugu literature.

- (The Weekly Mail)

# విషయసూచిక


i ఉదయప్రభా ఖండము

1. వంశచరిత్రము ... 1
2. ప్రాదుర్భావము ... 5
3. బాల్యము, మాతృవియోగము ... 12
4. సారస్వతవైభవము, వివాహము ... 16
5. తపోయాత్రలకు ప్రేరణము, పెట్టుబడి ... 21

ii తపఃప్రబోధ ఖండము

1. భద్రకసుకేతుల ప్రేరణములు - ప్రథమ తపోయాత్ర ... 28
2. నాసికా సంస్కారము, ఈశ్వర దర్శనము - ద్వితీయ తపోయాత్ర ... 35
3. భువనేశ్వరీ మధుకటాక్షము, తృతీయ తపోయాత్ర ... 41
4. నవద్వీప విజయము ... 47
5. తారామంత్రసిద్ధి - చతుర్థ తపోయాత్ర ... 56

iii వృత్తిఖండము

1. దైవకల్పితమైన దక్షిణదేశయాత్ర - అరుణాచలశక్తి ... 62
2. అరుణాచలవాసము, 'స్థూలశిరస్సు'ను నాత డగపడుట ... 72
3. పూర్వజన్మ మిత్రలాభము, చెన్నపురమం దవధాన కీర్తిలాభము ... 81
4. కార్యాంకురములు ... 97
5. వేలూరు వాసము ... 102
6. విచిత్ర ప్రేరణము, ఉద్యోగ విరమణము ... 118

iv తపస్స్వరూప తత్త్వావతార ఖండము

1. శ్యామలాంబ కృపచే దివ్యార్థతను బొందుట ... 124
2. ఈశ్వరుని పిలుపు ... 130
3. ఈశ్వర రథము కదలి వాసిష్ఠ మనోరథము నీడేర్చుట ... 133
4. సిద్ధోపదేశము, ప్రసిద్ధ నామకరణములు ... 138
5. ఉమా సహస్రస్తుతి రచనము ... 144
6. ఉమాస్తుతి ఫలముగా కార్తికేయావతరణము ... 152

## V రేణుకానుగ్రహ ఖండము


1. గురుని హస్తదీక్ష ... 161
2. తిమిరములను ఖండించి, యుమాస్తుతిని రేణుక స్వయముగా స్వీకరించుట ... 166
3. రేణుకయొక్క నిజ కథాస్ఫూర్తి ... 174
4. రేణుక దర్శనమిచ్చి, యస్త్రవిద్యా దర్శన మిచ్చుట ... 178
5. పాపపరిహారము ... 184
6. సంహారము, ఉమాస్తుతి పునరుద్భవము ... 187
7. వేలూరవాస మంతమై, ప్రచారక జీవితమున కుపోద్ఘాతము ప్రాప్తించుట ... 194


## vi ప్రచార ఖండము


1. చెన్నపురమందు ప్రచారక జీవితము ... 200
2. కాలడి యాత్ర ... 205
3. ఉడిపియొద్ద బలరామ క్షేత్రమందు తపస్సుచే అస్త్రమంత్ర సిద్ధి ... 209
4. గోకర్ణక్షేత్ర దర్శనము, అపూర్వ నవ్యజీవిత ప్రారంభము ... 216
5 సికింద్రాబాదావాసము ... 228
6. సికింద్రాబాదావాసము ... 233
7. అమ్మకుత్తర దేశ యాత్రలు ... 239
8. మందసా వాసము, మహేంద్రగిరియందు తపస్సుచే పరశురామ దర్శనము ... 245


## vii మునివైభవ ఖండము


1. క్షేత్రరథము మాతృరూపము గౌరి పరశురామప్రీతి యగుట ... 254
2. శ్రీ రమణ గీతారచనము ... 261
3. సికింద్రాబాదావాసము, తపశ్శక్తి పాకవిశేషము ... 269
4. కపాలభేదన సిద్ధి, ఇంద్రాణీస్తుతి ... 276
5. ఇంద్రాణి యనుగ్రహముచే మహర్షి తల్లి మాతృభూతేశ్వరియై, యాశ్రమ నిర్మాణ దేవియగుట ... 288
6. నూత్న బాధ్యతలు, రాజకీయము ... 303
7. 'పూర్ణ' యను కథాఫలముగా గృహబాధ్యతలు నివారించుట ... 310

8. విశాలాక్షమ్మ నిర్యాణము, ఆశ్రమములో 'శ్రీ' చక్ర ప్రతిష్ఠ ... 317
9. సికింద్రాబాదు, హైదరాబాదులలో సంచారము ... 321
10. కష్టదినములు ... 328

viii వేదవాసిష్ఠ ఖండము

1. శ్రీ అరవిందయోగిని సందర్శించుట ... 333
2. స్వీయచరిత్ర వివరణము ... 338
3. గురుప్రేరణమున బహుదూరమున నున్న 'శిరసి' పోయి, ఋషితుల్యుడగుట ... 342
4. ఆనందాశ్రమము, శిరసి ... 352
5. కుళువేలో వేదవాసిష్ఠతత్త్వము స్ఫుటమగుట ... 366

ix సిద్ధపురుష ఖండము

1. కలువరాయిలో నాయన కాశ్రమ నిర్మాణము, తత్ప్రవేశమునకు ఖడ్గపురము వెళ్లుటచే భంగము ... 374
2. ఖడ్గపురమందు ప్రచారలోపము ... 378
3. కలకత్తా వాసము ... 381
4. భౌతిక దేహమును వీడి, దివ్యశరీరధారియై సిద్ధపురుషు డగుట ... 405
5. ఉపసంహారము
అనుబంధము i ... 412
అనుబంధము ii ... 431
అనుబంధము iii ... 436
అనుబంధము iv ... 445

✱ ✱ ✱

# i ఉదయ ప్రభాఖండము

-: అధ్యాయములు :-

1. వంశ చరిత్రము
2. ప్రాదుర్భావము
3. బాల్యము, మాతృవియోగము
4. సారస్వతవైభవము, వివాహము
5. తపోయాత్రలకు ప్రేరణము, పెట్టుబడి




కావ్యకంఠ శ్రీ వాసిష్ఠగణపతిముని

శ్రీ

గురవేనమః

తొలి ప్రకరణము

# వంశచరిత్రము

ఆంధ్రరాష్ట్రములో విశాఖపట్టణ మండలమునందు 'బొబ్బిలి' గ్రామమున కాలుమైళ్ల దూరమున 'కలువరాయి' యను నొక చిన్న గ్రామము కలదు. ఒకప్పుడు రాతిపై కలువ పుట్టిన కారణమున నీ గ్రామమున కిట్టి పేరుంచ బడినట్లక్కడివారు చెప్పుదురు. ఇది పండితులచే 'కుముదోపల' మనియు కీర్తింపబడెను.

(కుముద = కలువ. ఉపలము = రాయి)

ఈ గ్రామములో 'నబాబు అయ్యల సోమయాజు'లను నింటిపేరుగల బ్రాహ్మణకుటంబ మొకటి స్వల్పసంఖ్యాకమై యున్నను మిగుల ఖ్యాతి వడసి యున్నది. ఇక్కడకీ కుటుంబస్థులు వచ్చి మన కథాకాలము నాటికి మూడు పురుషాంతరములు మాత్రము గతించెను. వీరికంతకు పూర్వము గోదావరి మండలములోని 'వక్కలంక' గ్రామమును, అంతకింకను పూర్వము దత్త మండలములోని 'నంద్యాల' గ్రామమును నివాసములై యుండెడివి. జానకీ పరిణయమను నాటకమును రచించి నంద్యాలలో పేరువడసిన రామభద్ర దీక్షితకవి వీరి కుటుంబస్థుడే. నంద్యాలకు పూర్వ మీ కుటుంబమువారు చోళమండల ములో కుంభకోణ ప్రాంతమున 'వలంగైమాన్ అగ్రహారమందు చిరకాల నివాసమున్నందున వీరు వడమ బ్రాహ్మణులుగను, ఋగ్వేదీయులుగను గణింప బడుచున్నారు. వీరివలెనే చోళమండలమునుండి తూర్పుతీర ప్రాంతములకు తమ నివాసములను మార్చుకొనిన బ్రాహ్మణ· కుటుంబములు పెక్కుగలవు. చోళమండలము ద్రవిడ రాష్ట్రమునకు జెందిన కారణమున వీరందరు ద్రవిడులని పిలువబడుచు బ్రాహ్మణులలో నొక ప్రత్యేక శాఖగా నెంచబడుచున్నారు. ఈ ద్రవిడ శాఖకు జెందినవారిలో 'అయ్యల. సోమయాజు'లను నింటిపేరు గల బ్రాహ్మణకుటుంబము లెన్నియో యున్నను, 'నబాబు' బిరుదము మాత్రము కలువరాయిలోని అయ్యల సోమయాజుల వారికే కలదు. వీరికీ బిరుద మెప్పుడెట్లు లభించెనో చెప్పనలవికాదు. కాని, గోదావరి మండలము చేరుటకు పూర్వ మీ బిరుదమున్నట్లు స్పష్టముగా నీ కుటుంబస్థులు చెప్పుటవలనను, ఇది యొక్క పురుషునకు గాక కుటుంబమునకు జెందినదిగా నుండుటవలనను, వీరి

పూర్వులొకప్పుడు పెద్ద జమీందారులై తురకల పరిపాలనమం దిట్టి బిరుదముచే పిలువబడియుందురని యూహించుకొనవచ్చును.

ఈ కుటుంబస్థులలో కలువరాయి నివాసముగా నేర్పఱచుకొనిన తొలి పురుషుడు జగన్నాథశాస్త్రి. ఇతడు విద్య నభ్యసించుట కీ ప్రాంతము వచ్చి, కలువరాయికి చెంతనున్న 'నందబలగ' అను గ్రామములో కొంతకాలమున్న పిదప శ్రీకాకుళములో నొక గురువు నాశ్రయించెను. ఆ సమయమందు కలువరాయిలో గంటి సర్వప్ప శాస్త్రియను నాతడు గ్రామాధిపతియై, సుమారేబది యకరములుగల శ్రోత్రియ భూమిని, తొమ్మిది గడపలుగల యింటిని గలిగి చుట్టుప్రక్కల బ్రాహ్మణులలోకెల్ల శ్రీమంతుడై యుండెను. ఇతని భార్య పేరు లక్ష్మమ్మ. ఈ దంపతుల కొక్క కుమార్తెతప్ప మఱి సంతానము లేనందున విద్యాబుద్ధులున్న బాలు డెవడైన పేదవాడైనను తమ కల్లుడైనచో వాని నిల్లరికముంచుకొని తమ యాస్తి నతని కీయ జూచుచుండిరి. నందబలగలో చదువుకొనుచున్నప్పుడే జగన్నాథశాస్త్రి సర్వప్పశాస్త్రి దృష్టిలోబడెను. బాలుడు గొప్పకుటుంబమునకుగూడ జెందినవాడని తెలిసి సర్వప్పశాస్త్రి యతని నల్లుని గావించుకొనుటకు తన మనస్సున నిశ్చయించుకొనెను. కాని, యుక్తసమయము వచ్చువఱకు తన నిశ్చయమును తన భార్యకైన నెఱింగింపదలచలేదు. ఇట్లుండగా సర్వప్పశాస్త్రి కుటుంబసహితముగా నొకప్పుడు 'కాశి' యాత్రకేగి యక్కడ మరణించెను. మరణించునప్పుడు మాత్రము అతడెట్లో తన యభీష్టమును భార్య కెఱింగించినందున నామె స్వగృహము చేరిన పిదప భర్త కోర్కెచొప్పున శ్రీకాకుళమునుండి జగన్నాథశాస్త్రిని రావించి, యతనికి తన కుమార్తెనిచ్చి వివాహముగావించి, వివాహకాలమందు తనకు గల తొమ్మిది గడపల యింటిని, యావదాస్తిని అల్లునకు ధారబోసెను. ఆస్తితో పాటు మామగారి గ్రామాధిపత్యము గూడ ప్రాప్తించుటచే కలువరాయి యతనికి శ్రీపదమయ్యెను. జగన్నాథశాస్త్రి యనంతరమున తన యేకైక పుత్రుడైన భీమశాస్త్రికి గ్రామాధిపత్యము లభించెను. భీమశాస్త్రికి నరసింహ శాస్త్రి, సర్వేశ్వరశాస్త్రి, ప్రకాశశాస్త్రి యను ముగ్గురు పుత్రులు కలిగిరి. వారిలో జ్యేష్ఠుడైన నరసింహశాస్త్రి తన తండ్రి యనంతరమున గ్రామాధిపత్యమును, కుటుంబాధిపత్యమునుగూడ పొంది సోదరులతో నవిభక్తుడై యుండెను. ఇతడే మన కథానాయకుని తండ్రి.

నరసింహశాస్త్రి తన పూర్వులవలె నాయుర్వేద, జ్యోతిష, మంత్రశాస్త్రము లందు విశారదుడై, పెక్కు మంత్రముల నుపాసించుచు, చూపరుల కొక మంత్ర మూర్తివలె గాన్పించువాడు. శ్రీవిద్యాదీక్షను పొందిన వీరి వంశస్థులలో నితడైదవ పురుషుడు. గ్రామాధిపత్యవశమున నితడు లోకవ్యవహారములందును ప్రజ్ఞ బడసి చుట్టుప్రక్కల గ్రామస్థుల కట్టి వ్యవహారములందు నేతయయ్యెను. ఇతని భార్య

పేరు నరసమాంబ. ఈమె లోగిశ అగ్రహారములోని (ఇది కలువరాయి కిఱువదిమైళ్ల దూరము) పప్పువారి పిల్ల. ఈమెయు భక్తిసంపద గలిగి, భర్తచే ననుగ్రహింపబడిన కొన్ని మంత్రముల ననుదినము శ్రద్ధతో జపించుచు, భర్త కెల్లవిధముల ననుకూలవతియై యుండెను. ఈమెకు సూర్యభగవానుడు, నీమె భర్తకు డుంఠి గణపతియు నిష్టదైవములు.

నరసింహశాస్త్రి దేశసంచారముజేసి బాల్యమందే పెక్కు అనుభవములను, లోకజ్ఞానమును బొందెను. సిపాయి విప్లవమునాటికి పిన్నవయస్కునైనను, విప్లవము నణచు నెపముతో మనలను పరిపాలించిన దొరలు గావించిన క్రూరకృత్యముల యొక్క నిదర్శనములను దారిపొడవునను తన సంచారమందు గాంచినప్పుడు నరసింహశాస్త్రి ఖిన్నుడైపోయెను. తురకల వలన సగము సంకరము గావింపబడిన మన జాతిమతము లీ దొరల పాలనమందు నిర్వీర్యములొనర్పబడుచున్నట్లు గ్రహించి యతడు కడు దుఃఖించెను. నాటినుండియు నరసింహశాస్త్రి హృదయ మావేశ పూరితమై దేశక్షేమమున కుపాయములను వెదుకజొచ్చెను. జాతికి మతము వీర్యము; మతమునకు మానవబుద్ధి వీర్యము; మానవబుద్ధికి వేదానుసార ప్రవర్తనమే వీర్యము; కనుక నట్టి ప్రవర్తనమందు స్ఖలించుటయే మన భారతీయుల దుర్గతికి మూల కారణమయ్యెనని యితడు గుర్తించెను. కాని, గుర్తించి యేమిచేయగలడు? వేదకాలపు ఋషుల సంప్రదాయములను తిరుగ దేశమందు నెలకొల్పుటకు తనకు సామర్థ్యములేదని యెఱుంగును గనుక తనకట్టి సామర్థ్యమున్న పుత్రునైన ననుగ్రహింపుమని తన యిష్టదైవము నతడు ప్రార్థింపజొచ్చెను. క్రమముగా నరసమాంబకు గూడ దేవతాప్రసాదము నీరీతిగా బడసి దేశమున కర్పించుటకంటె నధికమగు నుత్కృష్టకార్య మింకొకటి లేదని తట్టినందున నామెయు భర్త వలెనే పూర్వముకంటె నధిక నియమనిష్ఠలతో మంత్రజప స్తోత్రారాధనలను చేయదొడగెను. ఈ పూనిక దైవప్రేరితమనియే భార్యాభర్తలుభయులు నమ్మియుండుటచే వారి కట్టి పుత్రుడుదయించునను విషయములో సందేహవర్జితులై తమ విధినిమాత్ర మశ్రద్ధజేయక నిర్వర్తించుచుండిరి.

అట్టి దేశాభిమానులు, మతాభిమానులు, పూతచరిత్రులునగు నరసమాంబా నరసింహశాస్త్రులకు తమ నోముల ఫలముగా జన్మించిన వ్యక్తియే గణపతిముని. ఎవడు నరసమాంబా నరసింహశాస్త్రుల పుణ్యము నుపాధిగా గొని జన్మించెనో, ఎవడు మాటలు వచ్చినప్పటినుండియు వాక్సిద్ధిని, బహుళ విద్యావిలాసములను ప్రకటించెనో, ఎవడు బాల్యము దాటక పూర్వమే అపాయము లేని తపస్సు నుపాయముగా గొని దేవతలవలన మధుకటాక్షమును బొంది తన్మూలమున సిద్ధకవియై విద్వత్సభలందు మణివలె ప్రకాశించెనో, ఎవడు ప్రౌఢవయస్సు రాకపూర్వమే శరీరాకృతిని పొందిన తపస్సు వలె చూపరులకు గన్పట్టుచు నాత్మవిద్యాప్రవేశమందు

తనకంటె వయస్సున పెద్దవారలకు గూడ నాయకుడయ్యెనో, ఎవడు మంత్రమూర్తియై పెక్కుమందికి గురువయ్యెనో, ఎవని యందు సాహిత్య సారము మూర్తీభవించి కంఠగత ప్రాణావశిష్టయై నిట్టూర్పు లొనర్చుచున్న గీర్వాణవాణి ప్రపంచమునకు తిరుగ జీవనమును పోసెనో, ఎవడు నిగమాగమ దేవతా తత్త్వరహస్యములను పునరుద్ధరించి వేదఋషుల భక్తితత్త్వమును చాటించెనో, అట్టి మహానుభావుడు, వేదములను ధరించినవాడు, శాస్త్రములను హస్తగత మొనర్చినవాడు, వాసిష్ఠ గోత్ర సంభూతుడు, కీర్తియే మూర్తిగా గలవాడునగు గణపతిమునియొక్క అతి చిత్ర చరిత్ర వైభవముల నెఱిగించు కథాంశముల నింక ననుసరింతము.

★★★★

ఓం

## రెండవ ప్రకరణము

# ప్రాదుర్భావము

గణపతిముని ప్రాదుర్భవించుటకు పూర్వము నరసమాంబా నరసింహ శాస్త్రుల కొక పుత్రుడు జన్మించెను. వారాశపడుచున్న లక్షణము లీ పుత్రుని జాతకమందు గోచరించనందున నతనికి 'భీమశాస్త్రి' యను తాతగారి పేరుంచబడెను. భీమశాస్త్రికి రెండేండ్ల లేతవయస్సునందే యొక ఘోరరోగ మంకురించి, చికిత్సలకు లొంగక పీడించుచు, తుదకొకనాడు ప్రాణములను హరించు పరిణామమును పొందెను. అనాడింక చేయునదిలేక నరసమాంబ తన యిష్టదైవమగు సూర్యభగవంతునే శరణమును పొందుచు నిట్లు ప్రార్థించెను: "తండ్రీ! మానవ చికిత్సకు లొంగని యీ రోగమును నివారింప నీవే సమర్థుడవు. నీ కృపను వీనిపై బరపి వీనిని నాకు దక్కింపవేడెదను. నీ యనుగ్రహమునకు వీడు పాత్రుడై బ్రతికినయెడల వీని పుట్టుజుత్తులు నీచే నధిష్ఠింపబడిన 'అరసవల్లి' క్షేత్రమందు తీయింతును." ఈ విధముగా ప్రార్థించి యరసవల్లి సూర్యనారాయణ దైవమున కామె యక్షతలను, కానీడబ్బును కలిపి యొక క్రొత్తగుడ్డలో ముడుపు కట్టెను. ఇట్లు కట్టిన కొద్ది నిముసములలో నేమి యద్భుతమహిమయోగాని బాలుడు బ్రతుకునను నాశ తోచెను. పిదప క్రమముగా రోగ ముపశమించి దైనందినాభివృద్ధిచే నారోగ్యము బాలునియందు చేకూరెను. అటుపిమ్మట బాలునకు మూడవయేడు వచ్చినంతనే మ్రొక్కుబడి చెల్లించుకొనుటకు దంపతు లొక శుభదినమున అరసవల్లి యాత్ర గావించుకొనిరి.

'అరసవల్లి' క్షేత్రము శ్రీకాకుళమున కొక మైలు దూరమున నున్నది. కలువణాయి కిది నాటుమార్గమున సుమా రేబదిమైళ్లుండును. ఈ క్షేత్రము శ్రీమంతమై, యాశ్రితజనులకు శరణాగతమై యొప్పుచు, దీనరక్షణ పరాయణు డని కీర్తిగాంచిన ఆదిత్యనారాయణుని శివంకర కరప్రసార కళావిలాసములకు రంగస్థలమైయున్నది. ఇచ్చట నాలయములోని విగ్రహముయొక్క కిరీటాగ్రమును ప్రభాత సూర్యుని ప్రథమ కిరణ ముత్తరాయణమందును, దక్షిణాయనమందును గూడ నొకే విధముగా చుంబించుచు నవీన శాస్త్రజ్ఞులకు విస్మయమును కలిగించుచుండును. సూర్యప్రీతియగు రథసప్తమీ దివసమునా డిచ్చట ప్రతి సంవత్సరము పెద్ద యుత్సవము జరుపబడును. ఈశ్వర సంవత్సరమందు వచ్చిన యట్టి పుణ్యదివసమునాడే (9-2-1878) భీమశాస్త్రిని తోడ్కొని నరసమాంబా

నరసింహశాస్త్రులీ క్షేత్రమును దర్శించినందున నెటు జూచినను ఉత్సవ కోలాహలముతో నిండి, క్షేత్రమానాడు భూలోకస్వర్గమువలె గన్పట్టుచు, మాటి మాటికి నరసమాంబకు గగుర్పాటును కలిగింపజొచ్చెను.

ఇంక బాలునకు పుట్టుజుత్తులు తీయించి, వారందరు యథావిధిని స్నానప్రదక్షిణాదులు గావించుకొని, భగవత్సన్నిధికి పోవుసరికి నరసమాంబ పులకాంకురితగాత్రియయ్యెను. సూర్యాష్టాక్షరీమంత్రమందే లక్ష్యముంచుకొని యామంత్రమూర్తికి సాష్టాంగప్రణామములర్పించుసరికామె యొకానొక దివ్యా వేశమును పొందినట్లయ్యెను. ఆవేశభరమున సాంజలిబద్ధయై యట్లే నిలిచి యామె భగవంతున కీ విధముగా విన్నవించుకొనెను: ''తండ్రీ! నీ యనుగ్రహ పోషమువలన రక్షింపబడిన బాలున కిచ్చట పుట్టజుత్తులు తీయించితిమి. నీ కృప నింతటితో నాపివేయకుము. నీవు సర్వజ్ఞుడవు గనుక మా లక్ష్యమును నీ వెఱుగుదువు. ఆ లక్ష్యమున కనువగు పుత్రుని ప్రసాదించి మమ్మనుగ్రహింప వేడెదను. అట్టి ప్రసాదము వలన మాకు జన్మాంతర సద్గతిని గూడ ననుగ్రహించిన వాడవగుదువు. ఈ జన్మమందును, జన్మాంతరమందును గూడ నీవే శరణమని నమ్మియుంటిని. కనుక ప్రసన్నుడవగుము, తండ్రీ ప్రసన్నుడవగుము.''

ఆ దినమంతయు భగవత్ప్రసన్నతను పొందిన వ్యక్తి వలెనే నరసమాంబ హృదయ మానందపరవశమై యుండెను. దంపతులుభయులు నుపవాస దీక్షబూని, పగలంతయు మంత్రధ్యానముతో గడపి, రాత్రియగుసరికొక శుచియైన ప్రదేశమును నిర్మించుకొని యందు నిద్రించిరి. పరుండినంతనే గాఢనిద్రాపరవశురాలైన నరసమాంబ తెలతెలవారుచుండగా నొక దివ్యస్వప్నముచే తెలివిగాంచెను. ఆ స్వప్నమందు సూర్యాలయ ప్రాకారపు వెనుక భాగమునుండి యొక కాంచన స్త్రీ ప్రాదుర్భవించి యగ్నిపూర్ణమగు బంగారు కలశమును చేతులతో ధరించి తన కెదురుగా వచ్చినట్లును, తన్ను సమీపించినంతనే యపూర్వానుగ్రహదృష్టి ప్రసారముల నామె తనపై బరపుచు తన చేతులందా యగ్ని కలశమునుంచి, దిక్కుల నొక్కసారి తెల్లబరచు చల్లని కాంతి తరంగములతో గూడిన మందహాస శీకరములను వెదజల్లుచు, నామె యంతర్ధానమైనట్లును నరసమాంబ గాంచెను. వెంటనే హర్షాశ్చర్యములచే కన్నులు తెరువబడి చూచుసరికి దిక్కులు తెల్లవారుచున్నను, ఆమెకది మందహాస ప్రభవలనే కొంత తడవు వఱకు దోపజొచ్చెను. పిదప బాహ్యస్మృతి క్రమముగా కలుగుకొలది తా జూచినది స్వప్నమనియు, స్వప్నమైనను దేవతాప్రసాదసూచకమనియు బోధపడెను. కాని, నాటినుండియు బాహ్యస్మృతులెంత గాఢముగానున్నను, ఆమె కీ స్వప్నము జ్ఞప్తికి వచ్చినచో నితర స్మృతులన్నియు లిప్తమాత్రమున మాయమై, యా స్వప్నమందగ్ని కలశము తన చేతులందుంచబడినప్పుడు కలిగిన యపూర్వానుభవము, దేవియొక్క మందహాసద్యుతియు స్మృతిపథము నాక్రమించి పరవశత్వమును పొందించెడివి.

నరసమాంబ లేచుసరికి నరసింహశాస్త్రి కాలకృత్యములను దీర్చుకొనుటకు వెడలెను. అతడు మఱలివచ్చినంతనే యామె తన స్వప్నము నెఱిగించి, దాని భావమేమని యడిగెను. స్వప్నఫలితములను, స్వప్నార్థములను చెప్పుటలో నరసింహశాస్త్రి నిపుణుడు. అతడొక్కక్షణ మాలోచించి, భార్య యదృష్టమును కొనియాడి యిట్లుడివెను. "నీ స్వప్నము దైవికమనుటలో సందేహము లేదు. ఆ కాంచనాంగి నిజముగా సూర్యశక్తియగు హిరణ్మయి. ఆమె యగ్నినే ధరించును, అగ్నితత్త్వమే యామె స్వరూపము. ఆ తత్త్వముతోడనే యామె లోకములను సృజింపుచు, పోషింపుచు, భుజింపుచున్నది. ఆమె ధరించిన యగ్నిని నీచేత నుంచుటనుబట్టి నీ కగ్నియంశముగల పుత్రు ననుగ్రహించినట్లు నాకు దోచుచున్నది. అది నిజమగుటకు నీయందింక గర్భలక్షణములు గోచరించవలెను."

ఇంతలో తిరుగు ప్రయాణమునకు బండ్లు సిద్ధమయ్యెను. దంపతులు త్వరత్వరగా స్నానమాచరించి, మరియొకసారి యాలయములోనికి బోయి, వరములిచ్చుటలో విశ్రుతకీర్తి నొందిన సూర్యభగవానుని, అతని శక్తినిగూడ దర్శించుకొని, వారికడ సెలవుగైకొని, విడువలేక విడువలేక యా క్షేత్రమును వీడిరి.

నరసింహశాస్త్రి తలచినట్లు మఱికొద్ది దినములలో నరసమాంబయందు గర్భలక్షణములు గోచరించెను. ఈసారి తన నోములు పండెనని దంపతులిద్దరు తలచి పూర్వముకంటె నధికోత్సాహముతో దైవచింతనము సల్పజొచ్చిరి. ఏడవ మాసము చేరబడినతోడనే నరసమాంబను పుట్టింటికి బంపి, నరసింహశాస్త్రి తానుగూడ తన యిష్టదైవానుగ్రహమును పొందుటకై కాశీక్షేత్రమునకు పయన మయ్యెను.

రైలుమార్గ మా రోజులలో నన్ని గ్రామములకు బడని కారణమున నరసింహశాస్త్రి కొంతదూరము కాలినడకను, కొంతదూరము రైలుపైని పోయి బహుధాన్య సంవత్సర అశ్వయుజ మాసాంతమునకు (అక్టోబర్, 1878) కాశీ చేరగలిగెను. అక్కడ అన్నపూర్ణా విశాలాక్షీ, విశ్వేశ్వరులను దర్శించిన పిదప ఢుంఠి గణపతి యాలయములో నతడు దీక్షబూని కార్తికమాసమునుండి జపము చేయదొడగెను. పగళ్లుపవాస నియమమున జపించుచు రాత్రులు పాలాహారముగ గైకొనుచుండెను. ఇట్లతి శ్రద్ధతో కార్తిక బహుళాష్టమివఱకు గడపుసరికి అష్టమినాడొక దైవప్రసాద సూచకమగు దర్శనము గలిగెను.

అష్టమినాడు మధ్యాహ్నము రెండుగంటలగుసరికొక శిశువు గణపతి విగ్రహమునుండి వెడలి తనకడకు ప్రాకుచు వచ్చి తనతొడపై నెక్కి, యంతర్ధాన మైనట్లు నరసింహశాస్త్రి నేత్రములకు గన్పట్టెను. ఆ శిశువు తనను సోకినంతనే కలిగిన యానందపారవశ్యమున కన్నుల నతడు తెఱచెను. శిశువెచ్చటను గాన్పించలేదు. ఈ దృశ్యము జాగ్రదవస్థకు జెందునా లేక మఱియొక యవస్థకు చెందునాయను

మీమాంసకు లోనుగాక తనకప్పుడు కలిగిన దివ్యప్రమోదానుభవమునే యతడు తలపోయసాగెను. అరసవల్లి క్షేత్రమందదివఱకు భార్య పొందిన కటాక్ష ప్రమోదము నిత డామెవలె నప్పుడనుభవింపజాలకున్నను, ఇప్పుడనుభవింపగలిగెను. నరసమాంబ గర్భమందు నిజముగా దైవాంశము ప్రవేశించెననియు, అట్టి యంశసంభూతు నిదే సమయమున నామె ప్రసవించెననియు తెల్పుటకే దయాళుడైన గణపతి యీ దర్శనము ననుగ్రహించినట్లు నరసింహశాస్త్రి నిశ్చయాత్మకుడయ్యెను. వెంటనే యతడు తన దీక్షను విడిచి, గణపతి దైవముకడ సెలవుగైకొని యనుజ్ఞ బడసినవానివలె కాశికానగరము వీడి, యొకటిన్నర మాసము లగుసరికి లోగిశ గ్రామము చేరెను.

శ్వశురగృహము చేరుచుండగనే పుత్రజనన వార్తను విని నరసింహశాస్త్రి చిత్తమున నుప్పొంగెను. మఱియొక్క ఘడియలో గృహము చేరగా నతనిని భార్య యెదుర్కొని పుత్రునందిచ్చెను. భక్తిపరవశమున నతడు పుత్రుని తొలుత కన్నుల కద్దుకొని పిదప ముద్దాడెను. ఆనందోద్వేగమున తనకు గలిగిన దర్శనము నతడెఱిగింపగా, భార్య యింకొక వార్త దెలిపి యతని సంతోషమును హెచ్చించెను. ఆమె యిట్లు చెప్పెను: "మీ దర్శన సమయమునకు సరిగా బాలుడుదయించెను. ఉదయించినప్పుడు కొంతసేపటి వఱకు బాలుని చుట్టియున్న యొకానొక దివ్యాద్భుత తేజస్సు నాచే చూడబడెను." ఈ వాక్యములకు నరసింహశాస్త్రి స్వర్గమందుకొనెను. దైవాంశను నవమాసములు ధరించుటేగాక, పుత్రుని తేజస్సును గూడ గాంచిన నరసమాంబ భాగ్యమును కొనియాడెను. నిజముగా పుత్రవతులైన స్త్రీలలో నామె మిగుల గణింపదగిన స్త్రీ యయ్యెనని యతడు సంతోషించెను. బాలుని జనన సమయమునకు జాతకచక్ర మీ దిగువ విధమున నున్నది.

## సవ్యకుండలీ చక్రము

మీ. మే.

| | | | |
|---|---|---|---|
| శ | | | |
| ల | రాశి | | కే |
| గు రా | | | చం |
| | ర బు | శు కు | |

(బహుధాన్య సంవత్సర కార్తిక బహుళాష్టమీ మఖానక్షత్ర ప్రథమ చరణయుక్త భానువాసరమున సూర్యోదయాది 20 గడియలకు కుంభ లగ్నమందు జననము - ఇంగ్లీషు తేది: (17-11-1878) జననకాల కేతు మహాదశా శేషము (6సం. 11మా.)

సాయనరీత్యా గణపతిమునిచే పిదప సంస్కరింపబడినది దిగువ విధముగా మున్నది.

రైవతపక్షరీత్యా అయనాంశ, 18-11

చైత్రపక్షరీత్యా అయనాంశ, 22-9

# రవ్యాదిసాయనస్ఫుటము

## స్ఫుటకుండలి

| మీ. | మే. | | |
|---|---|---|---|
| ల12<br>శ11 | | | |
| గు7<br>రా9 | అంశా సంఖ్య సహిత రాశిచక్రం | | |
| | | | చం7<br>కే3 |
| బు 3 | ర11<br>శు5<br>కు10 | | |

| | రాశి | - | డిగ్రీ | - | భాగలు |
|---|---|---|---|---|---|
| రవి | 7 | - | 24 | - | 56 |
| చంద్ర | 4 | - | 20 | - | 41 |
| కుజ | 7 | - | 4 | - | 48 |
| బుధ | 8 | - | 8 | - | 16 |
| గురు | 10 | - | 1 | - | 53 |
| శుక్ర | 7 | - | 20 | - | 28 |
| శని | 11 | - | 26 | - | 12 (వక్రి) |
| రాహు | 10 | - | 7 | - | 35 |
| లగ్నం | 11 | - | 28 | - | 43 |
| రాశ్యం | 8 | - | 26 | - | 56 |

అపసవ్యకుండలి

| మీ. | మే. | | |
|---|---|---|---|
| ల శ | | | |
| గు రా | రాశి | | |
| | | | చం కే |
| బు | ర కు శు | | |

పిదప నొక శుభదినమున బాలునకు నామకరణము చేయబడి, భార్యా భర్తల యిష్టదైవనామములు రెండు నుండునట్లు 'సూర్యగణపతిశాస్త్రి' యను పేరుంచబడెను. కాని, తండ్రి తరచుగా తనకిష్టమైన 'గణపతి' నామముతోడనే పిలుచుటవలన 'సూర్య' అను పదము క్రమముగా జారిపోయి, గణపతిశాస్త్రి యను పేరు స్థిరమై నిలిచెను. పిదప బాలుడు పెరిగి పెద్దవాడైన తరువాత సూర్య గణపతులుభయులు నొక్కరేయనియు, వేదమందామూర్తి 'వృషాకపి' యను పేరుతో కీర్తింపబడుటయు నెఱిగి 'సూర్య' అను పదము ద్విరుక్తియని గ్రహించెను. అంతేగాక, తన యింటిపేరునకు బదులు గోత్రనామమును వైదిక ఋషులవలె ధరించెను. వీరి గోత్రము కౌండిన్య, మైత్రావరుణ, వాసిష్ఠ ఋషులతోగూడి 'కౌండిన్యస' గోత్రమని వాడబడుచున్నను, కౌండిన్య వంశములోని పిదప వాడైన వాసిష్ఠుని పేరుతో గోత్రమును చెప్పుకొనుట సమంజసము గనుక 'వాసిష్ఠగణపతిశాస్త్రి' యని తన పేరు చెప్పుకొనదొడగెను. అటుపిదప ఈయన తపోవృత్తిని చూచినవారీయనకు 'ముని' బిరుదము నిచ్చుట వలన నితడు 'వాసిష్ఠ గణపతిముని' యయ్యెను. ఇతని యాధ్యాత్మిక గురువగు భగవాన్ శ్రీ రమణ మహర్షి యితనిని 'నాయన' యని తొలి పరిచయము నుండి పిలుచుటచే నాధ్యాత్మిక ప్రపంచమందీ క్లుప్తనామమే సిద్ధమై సర్వవ్యాప్తమయ్యెను. ఈ నూత్న నామకరణ మొక నూత్న జీవితమునే నిజముగా ప్రారంభింపజేసెను. అది కలిగిన సమయము మున్ముందు తెలియగలదు.

ఓం

మూడవ ప్రకరణము

# బాల్యము, మాతృవియోగము

దైవాంశసంభూతులు శైశవమునుండి దివ్యాద్భుతలీలల బ్రదర్శింతురను నమ్మిక భారతీయులకు గాఢముగా గలదు. ఈ నమ్మికకు భాగవతమునందలి శ్రీకృష్ణచరిత్రమే హేతువై యుండును. అవతారపురుషుల చరిత్రలను చదివినప్పుడు అన్నియు శ్రీకృష్ణచరిత్రమును బోలియుండలేదని మనకు విశదమగుచున్నను, దివ్యపురుషులను గుర్తించుటకీ లీలాప్రదర్శన మొక పడికట్టు కావలెనని మన బుద్ధి ప్రేరేపించుచుండును. నరసింహశాస్త్రి మంచి విమర్శబుద్ధి గలవారైనను, భ్రమకు లోనయి, గణపతి శైశవమందిట్టి లీలల కొఱకు నిరీక్షింపదొడగెను. కాని, గణపతి శైశవమంతయు నొక విచిత్రలీలాఘట్టమై యుండి తల్లిదండ్రుల కిది ముదము నిచ్చుటకు బదులు దుఃఖమును కూర్చెను. అది యెట్లనిన, బాలుడాఱేండ్లప్రాయము వచ్చువఱకు మూర్ఛ, ప్లీహరోగము, జ్వరము మొదలుగాగల బాలారిష్టములకు మాటిమాటికి లోనయి, మాటలులేక కంఠ నాళములు బద్ధములై, యాహారమందుగాని, విహారాది వినోదములందుగాని ముచ్చట లేనివాడై, యెల్లప్పుడు నొక తూష్ణీకస్థితియందుండి, యితర బాలురు క్రీడలచే నాకర్షింప జూచినను ఉద్రేకములేకయుండెను. ఈ స్థితి తల్లితండ్రులకు నిరుత్సాహ కారణమయ్యెను. బంధువులకు పరిహాసకారణమయ్యెను.

వాక్కుల కాధారమై, సర్వనాడులకు పోషణభూతమై, మూలాధారము నధిష్ఠించి యే యగ్ని యుండునో, ఆ యగ్ని నిరభ్యంతరమై నాడులయందు వికసించునప్పుడు బాహ్యవిలాసచేష్టలకు లోపముండదనియు, నాడులయం దభ్యంతరములు సంభవించినప్పుడా యగ్ని వికాసము మాటిమాటికి మూలమునకు కొట్టబడి మూర్ఛాద్యభావ చేష్టలకు కారణమగుననియు శాస్త్రము చెప్పుచున్నది. అందులకే నాడీ శుద్ధికొఱ కట్టి పరిస్థితులం దాయసాగ్ని చికిత్స (కాల్చిన లోహముతో నొసలు మొదలగు నాడీబంధ ప్రాంతములను తాకుట) వైద్యశాస్త్రమందు విధింపబడెను. వైద్యశిఖామణియగు నరసింహశాస్త్రి కీ చికిత్స తెలిసియు పుత్రుని యందుండు మోహముచే నిట్టి ఘోరచికిత్సను చేయజాలక, పలువిధములగు నితర చికిత్సలను బాలుని కాఱేండ్లు వచ్చువఱకు చేసి విఫలుడయ్యెను. తుద కొకనాడు విధిలేక చేసినట్లే అయసాగ్ని చికిత్సను గావించి తత్ఫలమునకు నిశ్చేష్టులై, యింతకాల మశ్రద్ధచేసినందుల కతడు కడు నొచ్చుకొనెను.

అగ్ని స్పర్శ యను స్వల్పచికిత్సావ్యాజమునకు బాలునియందణగి యున్న అగ్ని యొక్క పెట్టున నుదయించి, ప్రభాతసూర్యు డంధకారములను తొలగించినట్లు, నాడులందు మాతృగర్భకోశ సంబంధమైయుండు తమస్సులను త్రుటిలో హరించెను. అవి హరించుసరి కింతకాలమునుండి బాలునిబట్టి వేధించుచున్న రోగలక్షణములు మాయమై, తత్స్థానమున యోగలక్షణములను దోపజేయు చైతన్యము ప్రాణమనోబుద్ధులందు స్పష్టమయ్యెను. కంఠనాడులుగూడ తెఱువబడి, యెవరివల్లను శిక్ష బొందకుండగనే మాటలు గుత్తులు గుత్తులుగా బాలకోకిల ధ్వనులతో వెడలి తల్లితండ్రులకు, బంధువులకు, నిరుగుపొరుగువారలకు గూడ విస్మయమును కలిగించెను. నాటినుండి బాలుడు దైవాంశ సంభూతుడను నమ్మిక ధ్రువమయ్యెను.

వెంటనే బాలున కుపనయనాక్షరాభ్యాసములు గావింపబడెను. చిన్న పాఠశాలను నడుపుచున్న పినతండ్రియగు ప్రకాశశాస్త్రి బాలునకు ప్రాథమికవిద్యాగురువయ్యెను. అక్షరము లలవడిన పిదప బాలరామాయణములోని ప్రథమ సర్గ ప్రథమ పాఠక పుస్తకమయ్యెను. బాలు డద్దాని నొప్పగించి, శివసహస్రమునుగూడ నవలీలగా కంఠస్థమొనర్చి, యేకసంథాగ్రాహియను కీర్తిని బడసెను. అప్పటి కాఱవయేడు ముగిసి, యేడవయేడు ప్రాప్తించెను. అంత లేతవయస్సునందే బాలునియం దసాధారణ ధారణా పద్యస్ఫురణలు గన్పట్టుట జూచి ప్రకాశశాస్త్రి ప్రత్యేక శ్రద్ధ గైకొనజొచ్చెను. బాలునకు క్రీడలం దాసక్తియున్నను, అత డవకాశ మిచ్చువాడుగాడు. అవకాశ మెప్పుడైన జిక్కినప్పు డాటలందును బాలగణపతి నాయకుడే. ఇంక లక్ష్య భేదమతని సొమ్మై పెద్దలకు గూడ విస్మయము గొల్పెడిది.

ఈ విధముగా పదేండ్ల ప్రాయమువఱకు ప్రకాశశాస్త్రి యొద్దనే విద్య నభ్యసించుచు, కావ్యపాఠముల నొకవంక మొదలిడి యింకొకవంక గణితశాస్త్రములోని 'లఘువరాశరి,' 'శ్రీపతి' గ్రంథములను ముగించెను. పంచాంగ గణనమా యీడునకే వశమొనర్చుకొని బాలగణపతి సిద్ధాంత గణితమం దొక సులభ మార్గమును జూపి, పంచాంగ గణనమందు శుద్ధిప్రకరణ మనబడు నొక పథకమును రచించి గురువునకు గురువు కాగలిగెను. అంతేగాక, జ్యోతిషఫలములను జెప్పుటయం దసమాన ప్రజ్ఞ జూపుచు బాలజ్యోతిష్కుడనియు, సిద్ధజ్యోతిష్కుడనియు కీర్తిబడసెను. ఒకనాడొక బాలిక జాతకమును జూచి యామెకు రాబోవు గండము నెఱిగించగా నామె తండ్రి బెంగగొనెను. గండ మేరోజున వచ్చునని చెప్పబడెనో ఆ రోజున తండ్రి యెంత జాగ్రత్త గైకొనినను బాలిక యిల్లు విడచి యొక సెలయేటి యొడ్డున నాడుచు, కాలుజారి నీటిలోపడి కొంతదూరము కొట్టుకొనిపోయి యొక తుప్పలో జిక్కుకొని స్పృహదప్పి యుండెను. ఆమెకొఱకు వెతకుచున్న తండ్రి యామె ప్రాణములు పోవు లోపున నామెను రక్షించుకొని బాలగణపతిని వేనోళ్ల కొనియాడెను.

ఆ పదియవ యేటనే 'పాండవ ధార్తరాష్ట్ర సంభవ'మను ఖండకావ్య మొకటి సంస్కృతమున రచించి, తన భాషాకౌశలమును, కవితాధోరణిని ప్రదర్శించుసరికి ప్రకాశశాస్త్రి బాలుని ప్రజ్ఞకు తూగజాలకపోయెను. మఱియు 34 శ్లోకములతో గూడిన యీ గ్రంథము నొక్క గంటలో బాలగణపతి రచించి, తనయందు సహజమైయున్న సంపద యెట్టిదో నిరూపించి తండ్రిని, పినతండ్రిని ఆశ్చర్యమున ముంచెను. మచ్చున కీ కావ్యములోని కొన్ని శ్లోకములు దిగువ నీయబడుచున్నవి.

మంగళ శ్లోకము

1. "జగద్గురూ నహం వందే బ్రహ్మావిష్ణు మహేశ్వరాన్ ।
వాణీ లక్ష్మీ శివానాథాన్ సృష్టి స్థిత్యంత కారిణః ॥

-:కావ్యము:-

2. యశో ధిర్దిగిభ శ్రేణీ దంతకాంతి మలిమ్లుచైః ।
మండితః పాండు రిత్యాసీ ద్భారతో భారతే నృపః ॥

3. తస్య పర్యాగమక్షస్య ప్రజ్ఞయైవ విలోచనీ ।
ధృతరాష్ట్ర ఇతి భ్రాతా జ్యేష్ఠః శ్రేష్ఠమతే రభూత్ ॥

4. పూర్వజే నామునా పాండోః పరిణీతా గుణోన్నతా ।
సుబలస్య సుతా రాజ్ఞో గాంధారీ నామ సుందరీ ॥

5. సా రామా యౌవనారంభే కించి త్పరిచితా నపి ।
జనుషాంధం పతిం ప్రాప్య విసస్మారేవ విభ్రమాన్ ॥

6. యాదవీ యామినీనాథ వదనా కాచిదంగనా ।
కాలే తస్మి న్పృథా నామ పృథివీమండలే బభౌ ॥"

ఇట్లు పదేళ్ల వయస్సు వచ్చుసరికి కవియు, జ్యోతిష్కుడునై బాలుడు తన పేరు సార్థకము చేసికొనెను. గణపతి ప్రాదుర్భావమునకు పిదప నాలుగేండ్లకు నరసమాంబా నరసింహశాస్త్రుల కొక కుమార్తెయు, మఱి మూడేండ్ల కొక కుమారుడును పుట్టిరి. కుమార్తె కన్నపూర్ణయనియు, కుమారునకు శివరామశాస్త్రియనియు నామకరణముల జేసిరి. శివరామశాస్త్రిని పినతండ్రి యగు ప్రకాశశాస్త్రి దత్తత గావించుకొనెను. శివరామశాస్త్రి పుట్టిన మఱి మూడు సంవత్సరములకు నరసమాంబ కిద్దరు కవలపిల్లలు పుట్టిరి. ప్రసవించుట కొక గంట పూర్వమామె గణపతి నిట్లడిగెను: "నాయనా, ఇప్పుడు పురుడు వచ్చిన వారి కెట్లుండును?" వెంటనే బాలజ్యోతిష్కుని ముఖమునుండి సమాధాన మిట్లు వెడలెను: "అమ్మా, యిప్పుడు పురుడు వచ్చినవారు మరణింతురు." ఈ వాక్యమున కామె భీతిజెందక, తన్ననుగ్రహించుటకై పుట్టిన పుత్రుని వాక్కువలన తనకు శరీర విముక్తి ప్రాప్తించినచో

నంతకంటె కోరదగిన దింకేమియు లేదని భావించి, జ్ఞాన వలె మనస్సున ప్రీతిబొందెను. మఱియొక గంటలో నామె ప్రసవించి, కవలపిల్లల గాంచి, వారితోగూడ నామెయు మృతినొందెను. ఇట్లు సర్వధారి సంవత్సర అశ్వయుజ శుద్ధాష్టమి నాటి సాయంకాలము (12-10-1888) పూతచరిత్రురాలైన నరసమాంబ 35 సంll నడిమి వయస్సునందే తన తపఃఫలితము నిహమందుగాంచి పరమం దనుభవించుటకై దివికేగెను.

గణపతి ప్రశ్న ఫలమును చెప్పినప్పు డెదుటి వసారాలో కూర్చుండిన ప్రకాశశాస్త్రి యాలకించెను. కాని, లెక్కనైన కట్టక అడిగిన వెనువెంటనే సమాధానము చెప్పినందులకు బాలుడు హాస్యమాడుచుండెనని తలచి యతడూరకుండెను. మఱియొక గంటకది నిజమగుట జూచి, బాలుని వాక్యమే యమోఘమై నరసమాంబను చంపెనని యతడు ఘోషించగా, ఆ ఘోషను విని, తన వాక్సిద్ధి తనకే యపకారమొనర్చెననుకొని గణపతి గుండె ఝల్లుమని, మౌనముద్ర నాశ్రయించెను.

నాటినుండి గణపతి స్థితి యెల్లరను తిరుగ కలవరపరచజొచ్చెను. ఎవరితోడను మాట్లాడడు; అడిగిన బదులు చెప్పడు; తోడిబాలు రాటలకు పిలిచినను వినిపించుకొనడు. శరీరమం దేమియు రోగముగపడదు. మానసికముగా నేదైన బాధపడుచుండెనేమో యనినచో నెక్కసారియైన నుస్సురనడు. నరసమాంబను తలచుకొని యింటిలోని యాబాలవృద్ధము విలపించుచున్నను, బాలుడు కంట తడిపెట్టడు సరికదా చలించనైన చలించడు. అన్నిటియందును తటస్థభావమే. దీనికి ప్రకాశశాస్త్రి కారకుడయ్యెనని యతనిని పైకిగాకున్నను లోపల తిట్టుకొననివారు లేరు. పాపము! బాలునియందు వాక్సిద్ధిని గుర్తించినందుల కతని కిది ఫలమయ్యెను.

ఓం

నాలుగవ ప్రకరణము

# సారస్వతవైభవము, వివాహము

గణపతియొక్క తూష్ణీక స్థితి నరసింహశాస్త్రికి దుర్భరమగుచుండెను. శైశవమందు శరీర మెన్ని బాధలు పడుచున్నను, తనకు గాదను నట్లాఱు సంవత్సరములెట్టి తూష్ణీక స్థితిని బాలుడు ప్రదర్శించెనో. అట్టి స్థితి వించు మించుగా నిప్పుడవలంబించెను. పుత్రుని హెచ్చరించుటకు తండ్రి యొక్క క్షణమైనను విడువక చిత్రవిచిత్రములగు కథలను, లోకయాత్రలను చెప్పుచుండెను. వినుచున్న వానివలె బాలుడు గన్పట్టుచున్నను, వానియందుద్రేకములు గోచరించకుండుట నరసింహశాస్త్రికి సందేహకారణమై, యది జన్మతః వచ్చి భావిజీవితమందు ప్రదర్శితము గాబోవు జ్ఞానలక్షణమైన నిర్విషయమానసస్థితి యేమోయని యట్టి బాలుని యోగ సాధనమునకు భంగము గలుగకుండున ట్లుపాయముల నాలోచింపదొడగెను. ఇది నరసింహశాస్త్రి పిచ్చియూహలని యింటిలోనివారు నిరసించుట జూచి పొరుగువారుకూడ నిర్భయులై బాలుని గుఱించి తమ తమ యభిప్రాయములను వెల్లడిచేయుచు, బాలుడింటికంతకు నాపద దెచ్చుటకే పుట్టినవని కొందఱు, నరసమాంబ భూతమై యావేశించుచున్నదని మఱికొందఱు, నరసింహశాస్త్రి మంత్రములు బెడిసికొట్టినవని యింకను కొందఱు జంకులేక పల్కజొచ్చిరి. నరసింహశాస్త్రి చెవి నివి సోకినను వీని కతడు లక్ష్యపెట్టక, తన మనోనేత్రమున కవగతమగు బాలుని దివ్యప్రకర్షయందే లక్ష్యముంచుకొని, యిది బహిర్గతమైనప్పుడీ మాటు బాలునియందు ప్రకటితమై గాంచదగు వైభవములకొఱకు నిరీక్షించుచుండెను.

ఈ తీరున గణపతి రెండుమాసము లించుమించుగా గడపిన పిదప నొకనాడు హఠాత్తుగా తన మౌనమును విడచి, మబ్బును విడచిన మార్తాండునివలె హెచ్చిన తేజస్సుతోడను, వృద్ధిజెందిన గ్రహణధారణ సామర్థ్యములతోడను ప్రకాశించెను. నాటినుండి బాలుని విజ్ఞానము పండితులకుగూడ విస్మయము గలిగింపజొచ్చెను. వికసించిన ఆ మేధకు కావ్యపాఠము లేవియు జాలకుండెను. పదునొకటవ యేడు పూర్తిగాక మునుపే రఘువంశమం దేడు సర్గలు, కుమారసంభవ మందు మూడు సర్గలు, మేఘసందేశము సంపూర్ణముగను, శబ్దధాతు సమాసము లతో ముగించి, తన ప్రజ్ఞ నెఱింగికొనినవానివలె గణపతి వేదుల వేంకటరాయ శాస్త్రియను నొక పండితుని కడ భారవి కావ్యమనబడు క్లిష్టమగు కిరాతార్జునీయ మును పాఠము మొదలిడి తండ్రికి ప్రీతిగూర్చెను.

ఈ యసాధారణ బుద్ధిప్రకర్షకు బంధువులు వశ్యులై, గణపతి నల్లుని గావించుకొనుట కొకరికంటె నొక రాతురపడుచు నరసింహశాస్త్రి కొత్తిడిని కలిగింప దొడగిరి. భీమశాస్త్రికిని, సోదరియగు అన్నపూర్ణకును తల్లి బ్రతికియుండగనే వివాహములైపోయెను. కుటుంబమందు బాల్యవివాహము లాచారమైయుండెను. అందువలన నరసింహశాస్త్రి బంధువుల యొత్తిడికి లొంగి, కలువఱాయి కొక మైలుదూరమున నున్న బొమ్మికపాడు గ్రామములోని 'కర్రా'వారి పిల్లను బాలగణపతికి పండ్రెండవయేడు దాటక పూర్వమే వివాహము గావించెను. ఆమె పేరు విశాలాక్షి. ఆమె వృష సంవత్సర మాఘ బహుళ పంచమీ హస్తానక్షత్రయుక్త జయవారమునాడు జన్మించి (7-2-1882) వివాహము నాటి కెనిమిదేండ్లు నిండని వయస్సు గలిగియుండెను. పేరుకు తగినట్లామె విశాలనేత్రములు గలిగి, యా నేత్రములకు తగినట్లు విశాలబుద్ధినికూడ కలిగి గణపతి కెల్లవిధముల తగియుండెను.

వివాహానంతరమున భార్యనుద్దేశించి గణపతి యొక సరసకావ్యమును బాల్యచాపల్యముచే రచించి, తనకు పాఠము చెప్పుచున్న వేంకటరాయశాస్త్రికి జూపగా నతడు బాలుని రసికతకును, కవిత్వపటిమకును కడుంగడు మెచ్చుకొనెను. అది రెండు సర్గల కావ్యమై 'భృంగదూత' మను పేరుతో వృత్తబద్ధమందు కాళిదాసుచే రచింపబడిన 'మేఘదూత' ననుసరించియుండెను. కాని, కవిత్వమందున్న ప్రీతిచే రచింపబడిన తన లఘుకావ్యమునకును, మహాకవియగు కాళిదాసుని కావ్యమునకును అజగజాంతరమున్నదని యెంచి బాలకవి సిగ్గుచే తన కావ్యమును చించి పాఱవేసెను. వివాహమైనప్పటి నుండి యీ విధముగా నెన్నో పద్యశతకముల నల్లుచు భారతినిగూడ చేబట్టుటకు గణపతి సాహసింపదొడగెను. పూర్వకవుల ధోరణికి తన పద్యములు తుల్యము గాకున్నవని వ్రాసినవాటి నెప్పటికప్పుడు చింపివేయుచున్నను, ప్రతిదినము చేయు రచనలవలన పదునాలుగేండ్ల ప్రాయమా బాలకవికి వచ్చుసరికా కవిత మోహించినదానివలె వరించి, వశ్యయై, యాశుధారారూపమున బాలుని యందు పరిణమించి ప్రకాశించెను. అటుపిదప గణపతి వయస్సుతోపాటామెయు పెరుగుచు, రమణీయ యౌవనాకృతులను దాల్చుచు, తుదకు భువనసమ్మోహనాకారమగు విజరూపమును పొంది కవితా లోకమును జయించి, గణపతి కీర్తిని దిగంతవ్యాప్త మొనర్చెను. బాల్యము దాటక పూర్వమే యా కవిత యెట్టి రమణీయాకృతిని బొందెనో మచ్చున కీ దిగువ శ్లోకములను తిలకింపుడు :

శ్లో॥ "వందామహే మహాదేవం యస్య వందారవో జనాః ।
వ విందంతి పున ర్మాతుః కుచ కుంభ పయోరసం ॥" 1

(అనగా ఎవరికి నమస్కరించి జనులు తల్లిపాలను త్రాగుటకింక పుట్టరో, అట్టి మహాదేవునకు నా నమస్కారములు.)

శ్లో॥ "కాకోలముంచగర్వం బడబానలముంచతీవ్రతాదర్పం।
వేగవతీ జల మే త ద్దారుణ చూడామణీర్జయతి ॥" 2

(అర్థము - ఓ కాకోలవిషమా! నీ గర్వము (చేదు రుచియందు) నింక విడువుము. ఓ బడబానలమా! నీకు తీవ్రత గలదను దర్పమును - కాల్చివేయుటలో తీవ్రత - విడువుము. ఎందువల్లననగా, ఈ వేగవతీనది (సాలూరు గ్రామము చెంత నిది యున్నది) యొక్క జలము దారుణత్వమందు మేటియైయున్నది - అనగా ఈ నీరు దారుణమగు చేదురుచి గలిగి గొంతుకను కాల్చుటలో నత్యంత తీవ్రమైనది).

శ్లో॥ "ఇహ కేషాంచి దేషాచేన్న సంతోషాయ కాక్షతిః।
కి మానందాయ కాకానాం బాలకోకిల కాకలీ ॥" 3

(అర్థము - నా యీ వాణి కొందరల్పజ్ఞులకు సంతోషమీయనిచో నాకేమి నష్టమున్నది? కాకుల యానందము కొఱకు బాలకోకిల ధ్వనిచేయునా?

చూచితిరా! పదునాలుగేండ్లు రాకపూర్వమే బాలుడే విధముగా తన వాణిని గుఱించి చెప్పగలిగెనో! అప్పటికే పంచకావ్యములను ముగించి. చంపూరామాయణము, శాకుంతలము, ఉత్తరరామచరిత్రము, కువలయానందము, చంద్రాలోకము, ప్రతాపరుద్రీయము మొదలగు సాహిత్య గ్రంథములను పూర్తిగావించి, శీఘ్రముగా పద్యగద్యముల నల్లుటకు, సరళముగా సంస్కృతమున మాట్లాడుటకు ప్రజ్ఞ బడసియుండెను. అటుపిదప పదునెనిమిదవ యేడు వచ్చువఱకు జన్మస్థలమైన లోగిశ గ్రామములో కొంతకాలము, బొబ్బిలి సంస్థాన సంస్కృత పాఠశాలలో కొంతకాలము నధ్యయనమొనర్చి వ్యాకరణ సిద్ధాంత కౌముదిని పూర్తిగావించెను. ఒకప్రక్క వ్యాకరణాలంకార శాస్త్రముల నతి త్వరిత గతిని ముగించుచు నింకొక ప్రక్క వాల్మీకి వ్యాసప్రోక్త పురాణేతిహాసములను సావధానముగా జదివి, వానిని బోధజేయు ప్రజ్ఞనుకూడ బాలు డలవఱచుకొనెను.

'రాజ్యమైన చేయవలెను. లేదా భారతమైన చదువవలెనను వార్యోక్తి దెప్పిన గణపతి యప్పటికే భారతము ననేక పర్యాయము లత్యంత ప్రీతితో పఠించెను. ఈ పఠనము చేయుకొలది ధీవిక్రమము ప్రజ్వలించి పవిత్రాదర్శములను కల్పించుకొనజొచ్చెను. అప్పటికే ఛందోవ్యాకరణాలంకార కావ్యేతిహాసపారగుడై, అష్టావధాని వక్త, ఆశుకవియునై యున్నను, పూర్వ ఋషులవలె తాను భగవచ్ఛక్తిని స్పృశించు కవిత్వము నలవఱచుకొని నూత్న ప్రపంచ నిర్మాణ ప్రజ్ఞను బొందవలెననియు, అస్త్రశక్తి యనుగ్రహశక్తులను బడయవలెననియు వాంఛ దట్టముగా హృదయమందలుముకొనినందున తత్సాధనార్థ మా ఋషులవలె తాను తపస్సును స్వీకరించుటకు గణపతి చిత్తమాయత్తపడజొచ్చెను.

ఈ తపః ప్రబోధమునకు పురాణ పఠనమనెడి మథన ముద్దీపన కారణ మైనను, జన్మాదినుండి నిరుపమాన స్థాయి గలిగి గణపతియందు నిగూఢమై యున్న యొకానొక దివ్యాంతర్జ్వాల దీని కాధారమయ్యెననుటలో సందేహము లేదు. ఆ యంతర్జ్వాల శైశవమం దాతేండ్లవఱకు కప్పబడియుండి, యటు పిదప దివ్యాద్భుత ధీరూపమున పరిణమించి, కావ్య శాస్త్రేతిహాసములను కబళించుచువచ్చి, యిప్పుడు తత్సారభూతమగు తపస్సును స్వరూపముగా పొందుటకును, లోకహిత మహత్తర కార్యములను బూనుటకును నుంకించుచుండెను. ఈ వికాసమునకు పురాణములవలె తండ్రియు సహకారభావ సంపాదకుడయ్యెను. ఎట్లనగా, నతడు శుద్ధ పంచాక్షరి - మేధా దక్షిణామూర్తి - నారాయణాష్టాక్షరి - సౌరాష్టాక్షరి - చండీనవాక్షరి - మాతంగి - బాల - వారాహి - భువనేశ్వరి - మహాగణపతి - పంచదశి - షోడశి యను ద్వాదశ మహామంత్రములను పుత్రునకు తపస్సాధనోపకరణములవలె నిచ్చి గురువయ్యెను. ఈ మహా మంత్రముల ననుదినము శ్రద్ధతో జపించుచున్నను, గణపతి కింటికడ నిశ్చల మంత్రధ్యానముచే స్థిరరూపమును పొందుట కన్నియు నాటంకములై తోచెను. కనుక సతతేదైన పవిత్ర క్షేత్రము జేరదలచి, తగు సమయము కొఱకు నిరీక్షింపదొడగెను.

ఇట్లుండ విశాలాక్షమ్మ యుక్తవయస్కురాలైన వార్త దెలిసెను. వెంటనే నరసింహశాస్త్రి విశేషోత్సవమున నేర్పాట్లు చేయదొడగెను. గణపతిమాత్ర మందుల కిష్టపడలేదు. అందులకు కారణము గార్హస్థ్యమునకు పూర్వము కొంత తపస్సు చేయవలెనను నూహతప్ప వేఱుగాదు. గార్హస్థ్యమొక కూపము వంటిదనిగాని, భార్య మాయాస్వరూపిణియై బంధకారణముగుననిగాని, బంధముక్తిని కాంక్షించు వాడందువలన ప్రథమ సోపానముగా భార్యను విసర్జించి కాషాయవస్త్ర సన్న్యాసమును స్వీకరించవలెననిగాని చెప్పు శుష్క వేదాంతయుక్తు లెన్నడును గణపతి తలకెక్క లేదు సరికదా అట్టి యుక్తులను ప్రచారము చేయువారు దేశద్రోహులనియు, మత వంచకులనియు నతడు బాల్యమందే గ్రహించెను. మన భారతజాతిని నిర్వంశ మొనర్చు పద్ధతి నవలంబించుటచే వీరు దేశద్రోహు లగుచున్నారనియు, మాయకు స్త్రీత్వమేగాని పుంస్త్వము లేదని కల్పించుటచే మతవంచకులగు చున్నారనియు, కాషాయ ముండనాదులచే సన్న్యాస స్థాయిని పొందినట్లు ప్రవర్తించుచున్నను వీరు సంఘమును వీడక యాత్మవంచకులై సంఘ మందొక క్రొత్తపీడను వ్యాప్తమొనర్చుచున్నారనియు గణపతి బాల్యమందే యెఱిగికొనెను. మన మతాచారముల కాదర్శప్రాయులైన వైదిక ఋషులు విరాగులయ్యు భార్యలను విసర్జించలేదు. అర్ధాంగులైన స్త్రీల నేకార్యమందు ననర్హలుగా నెంచలేదు. తమ లోపములను కప్పిపుచ్చుకొని, నేరున్నది గదా యని స్త్రీలను దూషించి వారికి తపస్సున కవకాశమీయక కేవల భోగవతులుగా వారిని చూడలేదు. గార్హస్థ్యమునకు

పూర్వమే తపస్సు నలవఱచుకొని మన పూర్వఋషులు తమ యర్ధాంగులకు గురువులై, వారిని తరింపజేయు భారము వహించి నిజమగు భర్తలు కాగలిగిరి. కనుక ఋషి సంప్రదాయమును మన్నించు గణపతి గార్హస్థ్య ప్రవేశమునకు కొంత వ్యవధిగోరెను. పుత్రుని భావము తండ్రి గుర్తించెను. కాని, భార్యలను చేరుటకు పూర్వము మన ఋషులెట్టి పవిత్రాధికారములను పొందగలిగిరో, అట్టి యధికార మప్పుడే తన పుత్రునకు చేకూరెనని యతని విశ్వాసము. తండ్రీ కొడుకుల కందువలన కొంత వాదము సంభవించెను. కోడలు నింటికి తెచ్చుకొని యామెకును మంత్రదీక్షను కల్పించుటకు తండ్రి ముచ్చట పడుచున్నట్లే వాదమునుండి గణపతి గ్రహించి, యా ముచ్చట నొక షరతుపై చెల్లించుట కియ్యకొనెను.

ఆ షర తెట్లనిన, ఆఱుమాసములు తా నింటికడ నున్నచో నాఱు మాసములు తపోయాత్రపై బోవుటకు తండ్రియు, భార్యయుగూడ నంగీకరింపవలెనని కోరెను. పుత్రుని సమత్వబుద్ధికి తండ్రి సంతసించి యంగీకరించెను. అటుపిదప కోడలి కీ విషయ మెఱిగించుట కతడు బొమ్మకపాడు వెళ్లెను. ఆమె యీ వార్త నాలకించి, చిన్నవోక, తన యభిప్రాయము నిట్లు వెలిబుచ్చెను: "మీ కొకరిద్దరు మనుమలు పుట్టిన తరువాత నాకును తపమొనర్చుటకు సంపూర్ణ స్వేచ్ఛను మీ పుత్రుడీయ గల్గినచో, నేను వారి షరతున కియ్యకొందునని చెప్ప వేడెదను." ఈ వాక్యమునకు నరసింహశాస్త్రి హర్షాశ్చర్యములచే గగుర్పాటు బొందెను. విశాలాక్షి తన భర్తకు తీసిపోదని యింటిలోనివారు, పైవారుగూడ గణపతిని పరిహసించిరి. వివాహ మొక శుభ ముహూర్తమున జరుపబడెను. పిదప నామె యత్తవారింటికి రాగా, గ్రామస్థు లీ గడుసుపిల్లను చూచుటకు తీర్థప్రజవలె మూగిరి. అప్పటి కామెకు 15వ యేడు, గణపతికి 18వ యేడు నడచుచుండెను.

ఓం

అయిదవ ప్రకరణము

# తపోయాత్రలకు ప్రేరణము, పెట్టుబడి

విశాలాక్షమ్మ అత్తవారింటికి చేరినతోడనే మామగారి యాజ్ఞ చొప్పున తన భర్తకడ మహాగణపతి, శ్రీవిద్యా దీక్షలను రెండింటిని గైకొని శ్రద్ధతో జపింప దొడగెను. వయస్సున చిన్నదైనను, ఆమె తన బుద్ధిసూక్ష్మతవలనను, పనిపాట్ల యందు నేర్పువలనను పెద్దలకు పెద్దయై, భర్తయొక్క, మామయొక్క, ఇరుగు పొరుగులయొక్కయు మెప్పు నచిర కాలములో పొందగలిగెను. ఒకనాడు భోజనము చేయుచు నరసింహశాస్త్రి ఛలోక్తిగా "నీవు నేర్చిన రెండు మంత్రములలో దేని నధిక శ్రద్ధతో జపించుచుంటి"వని కోడలి నడుగగా నామె మామగారి ఛలోక్తిని త్రుటిలో గ్రహించి, యిట్లు సమాధానమిచ్చెను: "బాహ్యమునకు గణపతిని సేవింపుచు, నాంతర్యమున పరమేశ్వర ప్రీతికొఱకు పార్వతిని సేవించుచుంటిని." ఈ వాక్యముల పొందికకు నరసింహశాస్త్రి సంతసించి "శభాష్" అనెను. గణపతి మాత్ర మిట్లు తలపోయదొడగెను: "నేను గణపత్యంశ సంభూతుడనని యీమెకు మా తండ్రి చెప్పెను గాబోలు, చెప్పి, యామె నేటినుండిగూడ నా ముదము కొఱకిట్లు పల్కించుట కీ చమత్కారము చేసి యుండవచ్చును. అతని దర్శనానుభవముల కతని నమ్మిక సహజము గావచ్చును. కాని, యితరుల కా యనుభవములు ప్రమాణములు కాజాలవు. కనుక వారియం దిట్టి యూహలనేల కల్పించవలెను ? నా యందు బాల్యమునుండి ప్రకటితమైన విద్యాప్రావీణ్యము, వాక్శుద్ధియు బాహ్యలక్షణములైనందున, వానివి ప్రమాణములుగా చూపుట తగదు. నిజముగా నే నట్టి యంశసంభూతుడనైనచో, నా యందా స్ఫూర్తి ముఖ్యముగా నుండవలెను. అది నా యందు కప్పబడియున్నచో నెందువల్ల కప్పబడెను? దానిని విప్పుటకు నేనేమి చేయవలెను? నా బ్రతుకు హాస్యాస్పదము గాకుండుట కీ సమస్యను నేను తొలుత సాధించితీరవలెను. అందుకొఱకు నాకు తపస్సే శరణ్యమగుగాక !"

గణపతి కా నాటినుండి యేమియు తోచుటలేదు. తపస్సున కెక్కడికైన పోవలెనని హృదయ మాందోళన పడెను. ఎక్కడికి పోవలెనో తెలియదు. ఎన్నడును దూరముగా బోయి యెఱుగడు. తండ్రి నడిగినచో తండ్రి యభ్యంతరపెట్టునని తోచెను. కనుక మిత్రుడైన వేంకటశాస్త్రిని సలహా కోరెను. ఇతడు మిత్రుడేగాక గణపతి కడ మంత్రదీక్షను పొంది, వయస్సున పెద్దవాడైనను గణపతికి శిష్యు డయ్యెను. అతడు వెంటనే గృహపలాయనము నిశ్చయించి, తాను తోడువచ్చుట

కంగీకరించెను. గణపతికి సోదరుడైన భీమశాస్త్రి వీరి యాలోచనము నెట్లో గ్రహించి, తనను గూడ వారు తీసికొనివెళ్లని యెడల ముందుగనే పెద్దలకిది యెఱింగించెదనని యతడు బెదరించెను. కనుక భీమశాస్త్రి, వేంకటశాస్త్రి, గణపతిశాస్త్రి - ముగ్గురు శాస్త్రులు కలసి గోదావరీ పుణ్యనదియొక్క సప్తశాఖలలో వాసిష్ఠ నామమున బరగు శాఖను తొలుత పొందుటకు నిశ్చయించి, తగు సమయముకొఱకు నిరీక్షించిరి. ఇంతలో శ్రావణ మాసపు నోముల కొఱకు విశాలాక్షి నామె పుట్టింటివారు తీసికొనివెళ్లిరి. గణపతి కది మంచి సమయ మయ్యెను. మిగిలిన యిద్దరు వెల్లప్పుడు సంసిద్ధులే యైనందున నొకనాటి వేకువజామున లేచి, గణపతిని లేపి, రాజమహేంద్రవర నగరమునకు పలాయన మొనర్చిరి. ఇది 1896 సం॥ ఆగష్టు నెలాఖరున జరిగెను.

రాజమహేంద్రవర నగరము వారు సురక్షితముగా చేరిరి. నగరము జన సంకులమై యున్నందున పడవపై నొక సీమను చేరదలచియుండగా భీమశాస్త్రికి విసుగుదోచి "కలియుగములోని మనమెక్కడ, పూర్వయుగములోని ఋషులెక్కడ ? వారికిని, మనకును సాటిలేదు. మనకు తపస్సు దుస్సాధ్యము గనుక మన మింటికి పోవుద"మని నిరుత్సాహవచనములను బల్కెను. కాని, భీమశాస్త్రి వచనములకు గణపతి సమ్మతింపనందున, నతడొక్కడు వెనుకకు మఱలి యింటికి పోయెను. పిదప మిగిలిన యిద్దరు కోనసీమకు బోయి, యచ్చట పేరమ్మ అగ్రహారమునకు చెంత నున్న కౌశికీ నదియొడ్డున తపస్సున కుపక్రమించిరి.

సుమా రొకటిన్నర మాసము లతి దీక్షతో శివపంచాక్షరి, మహాగణపతి మంత్రములను జపించినను గణపతి మనస్సున తీవ్రత గాన్పించలేదు. ఇంతలో వేంకటేశ్వరునిచే వ్రాయబడిన యొక లేఖ కింటినుండి జవాబు వచ్చెను. అందులో వారిద్దరిని వెంటనే స్వగృహమునకు మఱలిరండని యుండెను. తనకు తెలియకుండ మిత్రునిచే వ్రాయబడిన లేఖకిది ఫలమయ్యెనని యెంచి, గణపతి తపస్సును ముగించి స్వగ్రామము వంకకు మఱలెను. 'సిగడాం' స్టేషనులో రైలుదిగి కలువరాయి కభిముఖులై యుండగా గణపతి బుద్ధి మారిపోయెను. వేంకటశాస్త్రి నక్కడ విడచి, రిక్తహస్తములతో నున్నను గణపతి 'వారణాసి' పోదలచి, యింకొక దారి బట్టెను. ఆ దారిలో నొక మైలు నడచునరి కతడు రామచంద్రపుర అగ్రహారము నుదయము పదిగంటల వేళకు చేరెను. ఆ దినము కార్తిక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధి ద్వాదశి) పుణ్య దినమగుటవలన (17-10-1896), గణపతి కా యూర శ్రమపడకుండ రెండణాల దక్షిణ యుక్తమైన భోజనము లభించెను. "క్షణశః కణశశ్చైవ విద్యామర్థంచ సాధయేత్" అను నీతివాక్యము చొప్పున నతడా స్వల్పదక్షిణను గైకొని, దానితో రైలుపై 'దూసి' స్టేషనువఱకు పోయి, యా గ్రామమం దొక సాధుపురుషుడు యాత్రికులకు సహాయమొనర్చుటయందు శ్రద్ధగలవాడని యెఱింగి,

వానిని కలసెను. అత డాంధ్ర మహాభారతమును శాంతిపర్వమువఱకు గణపతిచే చదివించి, పురాణము నత్యవలీలగను, త్వరితముగను చదివినందులకు సంతసించి, యాఱురూపాయిల నిచ్చి సహాయమొనర్చెను.

ఆ ధనసహాయమును దైవకృపవలె నెంచి గణపతి పరిగ్రహించి, దానిలో కొంత వెచ్చించి రైలుపై 'టెక్కలి' గ్రామ మా సాయంకాలమునకు చేరెను. ఆ పురమం దొక సమృద్ధ బ్రాహ్మణగృహము గాన్పించగా నచ్చటకు బోయి, యజమాని యింట లేకున్నను, ఆకలికి తట్టుకొనలేక నేదైన నింత పెట్టుడని లోని స్త్రీలను గణపతి కోరగా దస్సిపోయిన బాలుని ముఖము జూచి వారింత పాడియన్నమును పెట్టిరి. పాడియన్నము తినుట కలవాటుపడని గణపతి రాత్రి వంటయగువఱకు నుండజాలక, యెట్లో తిని, విశ్రాంతికొఱకు వీధి యరుగుపై కూర్చుండెను. ఇంతలో చీకటిపడెను. గృహయజమానియైన రామదాసుపంతులు పొలమునుండి వచ్చెను. అతడు బాలుని యాకలికథ నింటిలోని వారివలన విని, తిరుగ తనతో భుజించుటకు గణపతిని పిలచెను. కాని, గణపతి తన కింక ఆకలిలేదని చెప్పి తప్పించుకొనెను. మఱికొంతసేపటి కా యరుగుపై నిద్దరు కాశికి బోవు యాత్రికులు చేరి, గణపతితో కొంత సంభాషించిన పిదప చీట్లపేకను తమ పంచి నుండి తీసి గణపతినిగూడ నాడుమనిరి. బాల్యమునుండి చతురంగము, దశావతారము, పేక, లక్ష్యభేదము మొదలగు క్రీడలలో ప్రసిద్ధుడైన గణపతి వారి స్నేహమునుగోరి, వారితో చీట్లాటకు బూనుకొనియుండగా నావలి యరుగుపై కొందరు పెద్ద లొక వృద్ధజ్యోతిష్కుని వెంటనిడికొని వచ్చి కూర్చుండిరి. రామదాసు పంతులు గూడ వచ్చి కొన్ని జాతకముల నా జ్యోతిష్కుని ముందర నుంచెను..

జ్యోతిష్కుడు తన ప్రజ్ఞకొలది జాతకఫలములను చెప్పుచుండెను. గణపతి తనయాటయం దశ్రద్ధ జూపకున్నను, జ్యోతిష్కుని పల్కులందే శ్రద్ధనుంచి, కొంత తడవగుసరికి "ఇతడు జ్యోతిషమందు జ్ఞానము లేనివా"డని తన యభిప్రాయమును రామదాసుపంతుల కెఱిగించెను. ఆ మాటలకు వృద్ధుడు క్రుద్ధుడై "నీ కందులో జ్ఞానమున్నచో చూడు"మని తన యొద్దనున్న జాతక పత్రములను గణపతి ముందర పరచెను. బాలజ్యోతిష్కుడు శాంతముగా వాని నవలోకించి, యొకవంక చీట్లాట నాడుచు నింకొకవంక రామదాసుపంతులు కోరిన ఫలములను చెప్పసరి కక్కడి వారందఱు బాలుని ప్రజ్ఞకు విభ్రాంతులైరి. గణపతి పండితుడని తెలియక తనయింటివా రతనికి పాడియన్నము పెట్టినందులకు రామదాసుపంతులు సిగ్గుపడి, యతనిని తగురీతి సత్కరించు నుద్దేశ్యముతో మఱునాటి కాప యత్నించెను. కాని, తన యాత్రాసఖులుండుట కిష్టపడనందువ గణపతి వారి తోడును పోగొట్టుకొనజాలక వారితో కలసి వెళ్లిపోవుటకు నిశ్చయించెను.

అప్పుడు రామదాసుపంతులింకొక విధముగా బాలున కుపకారము చేయదలచి వృద్ధజ్యోతిష్కునితో నేమేమో కొంతతడవు మంతనములు సల్పిన పిదప లోనికి పోయి పరుండెను.

వేకువజామున గణపతియు, నతని సఖులును ప్రయాణమగు సమయమునకు వృద్ధుడు వచ్చి, వారితో గలసి ప్రయాణమయ్యెను. అతడు ప్రత్యుపకారము చేయువానివగిది వారిని తెల్లవారుసరికి నందిగ్రామము చేర్చి, యక్కడ ధర్మశాలలో బసచేయుడని హితవుబల్కి, తా నింకొక వీధి బడి మాయమయ్యెను. వారు కాలకృత్యములను తీర్చుకొని మఱికొంత తడవుకు ధర్మశాల చేరిరి. వీరు వచ్చులోపున వృద్ధుడా ధర్మశాలయం దప్పుడు బసచేసియున్న 'వారణాసి అచ్యుతరామశాస్త్రి' యను నొక పండితునితో కొంత మాట్లాడి వెళ్లిపోయెను.

అచ్యుతరామశాస్త్రి యాంధ్రసంస్కృతముల రెండింటియందును కవియై, ధర్మశాలాధికారియైన కృష్ణమ్మ నాయుడను నాతనికి మిత్రుడై, నాయుడప్పుడు రుగ్ణతజెంది యున్న కారణమున నతనికి ధైర్యము బల్కుటకై వచ్చి యుండెను. కవిత్వమునకు తోడతనియందు మంచి యుక్తిగలదు. కనుకనే గణపతి ధర్మశాలలో నడుగిడినంతనే యచ్యుతరామశాస్త్రి యతని కెదురుగా వచ్చి, స్వాగత మిచ్చుచు నిట్లు పలికెను: ''గత రాత్రి యొక యేనుగు నా స్వప్నమందగపడి, యది నరాకృతితో ధర్మశాల ప్రవేశించి నా మిత్రుని గుఱించి కుశలప్రశ్న చేసి, తిరుగ గజాకృతితో వెళ్లిపోయెను. ఆ నరాకృతి నిన్నన్ని విధముల పోలియున్నది. నీ పేరు గణపతియై యుండవచ్చును. అది సరియేనా?'' గణపతి ''ఔ'' ననెను. అంతట అచ్యుతరామశాస్త్రి గణపతికి స్నానపానాదులను కల్పించిన పిదప నతనికి తన మిత్రుని పరిచయము కల్పించుటకు కృష్ణమ్మ నాయుడింటికి గొంపోయెను.

కృష్ణమ్మనాయుడు బహుళ భూస్వామి, కృష్ణభక్తుడు, సజ్జనసేవానిరతుడు, ఉదారబుద్ధిగలవాడును. అతని కిరువురు భార్యలు. ప్రథమ భార్యకు సంతానము కలుగనందున నత డీ రుగ్ణతకు కొంచెము పూర్వమే రెండవ భార్యను పరిగ్రహించెను. కనుకనే చికిత్సలకుగాని, గ్రహశాంతులకుగాని లొంగక చీకాకు పఱచుచున్న తన ప్రస్తుత విధి విషయమై యతడు బెంగపెట్టుకొనియుండెను. పైని చెప్పబడిన వృద్ధ జ్యోతిష్కుడితనికిగూడ గణపతి యాగమన వార్త ముందుగనే తెలియజేసినందున, గణపతి వచ్చినంతనే పరిచయమున్నవాని వగిది యితడు గౌరవాదరణములను జూపెను. అటుపిదప గణపతిచేత తన జాతకపత్రమునుంచి, ''బాబూ! మీ ప్రభావమును నేను వినియుంటిని. తిరుగ శైశవమును కోరువానివలె మీ ముఖమునుండి ప్రియవాక్కును వినగోరెద''నని యతడు పల్కెను. జాతకపత్రమును పరీక్షించి గణపతి ధైర్యవాక్కు నిట్లు చెప్పెను: ''ఈ రోగమిప్పుడు ఘోరముగనున్నను, మూడు మాసముల కిది నిశ్శేషమై దీనినుండి

నీవు మాత్ర జన్మను పొందినట్లు తేరెదవు. అటుపిమ్మట నీ కచిరకాలములో ద్వితీయ భార్యవలన నొక కుమార్తె పుట్టును. నీకు దత్తపుత్రుడుండును.'' దీనితో నాయుడు పగము కుదుటపడెను. పిదప నతడు తన రోగ నివారణమగువఱకు గణపతి నాపుజేసి, గణపతియొక్క యాత్రాసఖులకు మాత్రము కొంత ధనమిచ్చి పంపివేసెను.

కాశి చేరిన పిదప తపస్సును చేయదలచెను గనుక దానిని గణపతి భావికాలమునకు విడచి, కృష్ణమ్మనాయుడప్పుడు సమకూర్చిన సత్కారముల తోడను, పండిత సహవాస సల్లాపముల తోడను చతురంగాది క్రీడా వినోదముల తోడను కాలమును సుఖముగా వెళ్లబుచ్చుచుండెను. మధ్య మధ్య నతడు తన ప్రతిభావిలాస కౌశలముల నన్ని విధముల బ్రదర్శించి యచ్యుతరామశాస్త్రివంటి పండితులను మెప్పించుచుండెను. ఒక దీర్ఘ పద్యము నొకడు చదివినచో, దానిని వెంటనే ముందునుండి వెనుకకు, వెనుకనుండి ముందుకు వ్రాసి జూపుచుండును; పుస్తకము తనకిచ్చినచో దానిని తెఱచి, రెండు చేతులతో పై కెగురవేయుచు, మఱల బోర్లించుచు, తెఱచియుండిన పుటలోని పంక్తుల ననాయాసముగా జదువుచుండును చతురంగమం దిచ్చగలవారిని నాలుగైదు స్థలములందు గూర్చుండబెట్టి, వారందరితోడను అన్ని దిక్కుల నొకేసారి చతురంగమాడి వారి నోడించుచుండును. కవిత్వమం దిచ్ఛగలవారికి మాటలకంటె త్వరితగతిని సంస్కృత శ్లోకములనల్లి చెప్పుచుండును. ఇట్లు వివిధ వైభవములతో గూడిన ధీసంపదను, అతులిత మాధురీ మహిమగల వాణిని బ్రదర్శించు గణపతి చుట్టును విద్వజ్జనులు నిత్యము పరివేష్టించుచుండ నతడు మూడు మాసములను మూడు దినములవలె గడుపుసరి కతని వాక్కే జీవనదండమై ప్రవర్తించి, కృష్ణమ్మనాయుని కారోగ్యమును కూర్చెను.

నాయుడు ప్రత్యుపకారమును జేయు నుద్దేశముతో గణపతియొక్క తండ్రి నక్కడకు రావించి, తండ్రీకొడుకు లుభయులకు చెరి యర్ధనూట పదార్లను కట్నమిచ్చి గౌరవించి, గణపతి కిట్లు ప్రత్యేకముగా తన కృతజ్ఞత వెలిగించెను: ''బాబూ! భగవంతు డప్రతిహతమగు మహిమను మీయం దుంచెను. మీకింత పసితనమందే కాశ్యాది దూర దేశ నివాసము తగదని యెంచి మీ తండ్రిని రావించితిని. మీ కీ తపోయాత్రలు మీ తండ్రియే తగు సమయమందు కూర్చు గాక! మీ యాత్రలకు నేనును తోడ్పడదలచితిని. ఎట్లనగా, మీ కేడాది కేబది రూపాయిల చొప్పున నేను జీవించియున్నంతవఱకు వార్షిక ధనము నిచ్చెదను. అదిగాక మీ కవసరము గలిగినప్పుడు ఈ భక్తుని సహాయము నెంతవఱకైనను వినియోగించుకొని యీ ప్రాణమందు మీకున్న యధికారమును సార్థకము గావించుకొనవచ్చును. నన్ను మన్నించి యిప్పటి కింటికి వెళ్లగోరెదను.''

ఆహా! గృహమునుండి పలాయనమొనర్చి తండ్రి మనస్సును నొప్పించిన దోషము తన కంటకుండునట్లును, తన భవిష్యద్యాత్రలకు పెట్టుబడి సమకూరునట్లును, కృష్ణభాగవతుడైన యీ కృష్ణమ్మనాయుని యనుగ్రహించినట్లును భగవంతుడిన్ని విధముల నుపకరించు ఘట్టమును తన జీవితమున కుపోద్ఘాతముగా కల్పించినట్లు గణపతి గ్రహించి, పొంగిన హృదయముతో నాశువున భగవంతుని రెండు శ్లోకములచే స్తుతించి, యింకొక శ్లోకముచే కృష్ణమ్మనాయుని యుదారబుద్ధిని కొనియాడి యతని నాశీర్వదించి, మిత్రులకడ సెలవుగైకొని, తండ్రివెంటబడి వెళ్లునప్పు డచ్యుతరామశాస్త్రివంటి ధీరుడుగూడ గణపతిని విడువజాలక కంట తడిపెట్టెను.

# తపఃప్రబోధ ఖండము

-: అధ్యాయములు :-

1. భద్రక సుకేతుల ప్రేరణములు - ప్రథమ తపోయాత్ర
2. వాసికాసంస్కారము, ఈశ్వరదర్శనము - ద్వితీయ తపోయాత్ర
3. తృతీయ తపోయాత్ర - భువనేశ్వరి మధుకటాక్షము
4. నవద్వీప విజయము
5. చతుర్థ తపోయాత్ర - తారామంత్రసిద్ధి

౧

## మొదటి ప్రకరణము

# భద్రక సుకేతుల ప్రేరణములు

(ప్రథమ తపోయాత్ర)

నందిగ్రామమందు లబ్ధమైన కీర్తితోడను, హృదయమందు వృద్ధిజెందిన తేజస్సుతోడను గణపతి యిల్లు చేరిన తోడనే భర్తను సేవించుటకు విశాలాక్షమ్మ తన పుట్టింటి నుండి వచ్చి, సూర్యకాంతిని బొందిన పద్మమువలె వికసించిన చైతన్యము గలదయ్యెను. ఆ సమయమందు తపస్సంబంధమగు చింత వాసిష్ఠునకు శాంతించెను. వ్యాకరణ విచారణ, మహాభారత సమవలోకనము, ఇతర పురాణేతిహాస పఠనము, చతురంగాది క్రీడలు మొదలగువానితో కాలమును గడపుచుండెను. నవమాసము లీ విధముగా మాతృగర్భ మాయయందు మునిగియుండు జీవుని పగిది వాసిష్ఠుని తపోకాంక్ష విద్యావినోదములందు మునిగిన పిదప నాత్మబలముతో నది తిరుగ నుదయించెను. కాని, ప్రాణముకంటె నధిక ప్రియమగు భార్య యొకవంకను, విశ్వముకంటె నధిక మూల్యమగు తపస్సింకొకవంకను తమ తమ ధర్మములను శాసింప, వెన్నవంటి వాసిష్ఠుని మనస్సు రెండింటికిని కఱగుచు దేనినీ దూరమొనర్పజాలని స్థితియందు కొన్నాళ్లలలాడెను. ఒకదానితో నొకటి విరోధించు నీ దారాసమాదర, తపశ్చరణ ధర్మములు రెండును నిర్భయముగా హృదయమున విహరించుచు నిర్దయతో బాధింపుచుండ నేది యప్పటికి బలముగా నుండునో దానికి వశమగుచు గణపతి కొద్ది దినములు గడపుసరి కొక ప్రేరణము నిమిత్తమై తపశ్చరణమునకే జయము సంభవించెను.

ఆ ప్రేరణ మిట్లు తటస్థించెను. ఒకనాటి యుదయమున నిశ్చల మనస్సుతో గణపతి ధ్యాననిమగ్నుడై యుండగా తన ముందర తెల్లని శరీరము, వ్రేలాడుచున్న పెద్ద గడ్డముగల ఒక పురుషుడు ప్రాదుర్భవించి "ఓయీ! నేను నీకు జన్మాంతర బాంధవుడను, తపస్సఖుడను అగు భద్రకుడను. నీవు గణకుడవని యెఱిగి తపస్సాచరింపుము. లెమ్ము" అని ద్రవిడమున బల్కి యంతర్థానమయ్యెను. గణపతి కప్పటికి ద్రావిడ భాష రాకున్నను, ఏకసంథాగ్రాహి యైనందున భద్రకుడు పల్కుల నెట్లుచ్చరించెనో అట్లే గ్రహించి తండ్రి కెఱిగింపగా నతడా భాషను తన యాత్రలందు బాగుగా నేర్చినవాడగుటచే పుత్రున కా పల్కుల యర్థమును చెప్పి, తపస్సమయము సమీపించుచుండెనని హెచ్చరించెను. ఇంతలో వార్షిక ధనము దెచ్చుటకై నంది గ్రామము వెడలిన శివరామశాస్త్రి యొద్ద నుండి యొక లేఖ వచ్చెను. ఆ లేఖయందు తెల్లని యేనుగు నెక్కి యొక శ్వేతవర్ణ పురుషునితో

గూడ గణపతి తపస్సుకొఱ కెక్కడికో పోవుచున్నట్లు స్వప్నము వచ్చినదని యతడు వ్రాసెను. గణపతి దర్శనమున కీ స్వప్నవృత్తాంతము సరిపోయి యున్నందున నరసింహశాస్త్రి తన వరప్రసాదునకు రెండు నిబంధనములతో గూడిన యనుమతినిచ్చి తపస్సున కంపెను.

ఆ నిబంధనము లెట్లనిన, వాసిష్ఠుడు తపశ్చరణ మందున్నంత కాలము విశాలాక్షమ్మ తన పుట్టింటనుండుటొకటి, తండ్రి కోరినంతనే తపస్సు నెట్టి సమయమందైన విడచివచ్చుట యింకొకటి. ఈ రెండింటికిని వాసిష్ఠుడంగీకరించి నను, హృదయమందు మాత్రము శివసాక్షాత్కారమును పొందకుండ విల్లు చేరరాదని నిశ్చయించెను. తొలి నిబంధనము చొప్పున విశాలాక్షి పుట్టింటికి పంపబడెను. పిమ్మట శివరాముడు తెచ్చిన వార్షిక ధనముతో గణపతి తన యిరువదియవ జన్మదినమునకు మఱునాడు (18-11-1897) తండ్రి యాశీర్వచనమును బొంది ప్రయాగ యాత్రాభిముఖుడై వెడలెను.

ప్రయాగ చేరిన వెంటనే వైద్యనాథశాస్త్రియను నొక విద్వాంసుని పరిచయము గణపతికయ్యెను. అతనితో తపఃస్థలమును గుఱించి ముచ్చ టించుచుండగా నొక సాముద్రికుడు వాసిష్ఠుని హస్తమును బరీక్షించి, యందు శంఖచక్రరేఖలున్నవని చూపి, అవి సూచించు మంగళములను కొనియాడి వెళ్లిపోయెను. అటుపిదప వాసిష్ఠుడు వైద్యనాథశాస్త్రితో దినమంతయు గడపి, రాత్రియగుపరి కర్దరూపాయి యటుకులను కొని, మూటగట్టి, గంగ కావలి యొడ్డున నున్న శంఖమాధవాలయము ప్రవేశించెను. అక్కడ క్రోశదూరము వఱకంతటను నిర్జనమై యుండుటకు సంతసించి, యొక మూల సుఖాసనాసీనుడై గణపతి తెల్లవారువఱకు శివపంచాక్షరీ జపమున మునిగెను.

తెల్లవారుసరికి తన కంబళి, గుడ్డలమూట, ఆ మూటయందు దాచుకొనిన ధనము మాయమై, యొక చెంబు, గావంచా, కట్టుబట్టయు తప్ప మఱి యేమియు గణపతికి మిగులలేదు. ఇది దొంగతనమునుకొనుట కా ప్రాంతమదివఱకే నిర్జనమైయుండెను. కనుక గణపతి బుద్ధికిది యీశ్వరపరీక్షవలె దోచెను. అందువలన మిగుల చలిదినములైనను శైత్య బాధాదులకు లెక్కసేయక, మఱింత తీవ్రతతో నతడు జపమాచరింపదొడగెను. పగళ్లుపవాసమూని, రాత్రులందు నానబెట్టిన యటుకులను మాత్రము భుజింపుచు, దశరాత్రము లధిక శ్రద్ధతో నిద్రనుగూడ దూరమొనర్చి జపధ్యానమున గడపినను శివదర్శనము కానందున వాసిష్ఠుని మనస్సు వ్యాకులపడెను. ఆ వ్యాకులత వలన జపమును వీడి యున్మత్తుని వలె నదీతీరమందు పగలంతయు తిరుగాడెను. తపోరహస్యము నెఱిగిన మహానుభావులు గంగాతీరమందుండవచ్చుననియు, నట్టి పురుషుడెవడైన గాన్పించినచో వాని యనుగ్రహమైన పొందవచ్చుననియు నాశదోప, గణపతి బహుదూరమువఱకు

పోయెను. సూర్యుడింతలో క్రుంగెను. కాని, తన యాత్ర క్రుంగనందున పాదము లలయు వఱకు తిరిగి, తుదకర్ధరాత్రమగు సరికొక యాశ్రమమును గాంచి, యందున్న జటాధారికడ వాసిష్ఠు డాసీనుడయ్యెను. ఆ జటాధారి బాలుడలసి యుండెనని గ్రహించి, రెండు రొట్టెలను, పాలను గణపతికీయగా నతడవి గైకొని యారగించెను. పిదప సాధువుతో కొంత సంభాషించుసరి కతడును తనవంటివాడే యని తట్టినందున గణపతి యక్కడ తెల్లవారువఱకు విశ్రమించెను.

నిద్రవలన వాసిష్ఠుని శరీరబడలిక తీరెనుగాని హృదయతాప ముపశమింప లేదు. కనుక తెల్లవారిన పిదప నతడు వెనుకకు మఱలెను. మార్గమం దదృష్టవశమున నొక బ్రహ్మచారి విద్యార్థి యగుపడి తపస్సున కనువైన స్థలమునకు గణపతిని గొంపోయెను. అది హంసతీర్థము. అక్కడ నయోధ్యామహారాజుచే స్థాపింపబడిన విద్యామందిర మొకటి గలదు. అందొక వ్యాకరణ పండితుడు గణపతితో సంభాషించిన పిదప తపస్థలమును గణపతికి కల్పించి పరిచర్యలు చేయబూనెను. అతడొక శాలువను, వస్త్రమును గూడ గణపతి కిచ్చెను. అక్కడగూడ పదిదినములగుసరి కొక భంగముచే గణపతి తన తపస్సు నాపుచేయవలసివచ్చెను. ఎందువల్లననగా, పుష్యమాసములో (22-1-1898) నొక సూర్యగ్రహణము కాశీప్రాంతమందే గోచరించునని పంచాంగమందు వ్రాయబడినందున, నప్పటికొక మాసమునకు పైగా గడువున్నను, ఆశ్రమవాసులందరు కాశికి పయనమయిరి. వారితోడనే గణపతియు నొక్కై బయనమయ్యెను. కాని, మార్గమందు వింధ్యాచలమున నందాభగవతీ క్షేత్రముండుట విని, గణపతి యక్కడ తపమొనర్చు నుద్దేశముతో దిగెను.

క్షేత్రాలయము నతడు దర్శించుసరికి చీకటి పడెను. దేవియైన కరుణించునేమో యను నాశతో జపమందు లగ్నుడయ్యెను. అర్ధరాత్రి యగుసరికి శరీరము విశ్రాంతి కోరగా కొంచె మచ్చటనే చేరగిలి వాసిష్ఠుడిట్లు తలపోయ సాగెను: "నాకు కలుగుచున్న స్వల్పానుభవమువలన నాకిడిన 'గణపతి' నామ ధేయము సార్థకమని తోచుచున్నను, తండ్రియగు· నీశ్వరుడేలకో నా తత్త్వమును నాకు మఱుగు పఱచుచున్నారు. నాకీ జన్మ నిచ్చుటేల? నా స్మృతి మఱుగు పఱచుటేల? పోనిమ్ము, నేనీ జన్మయందు చేయవలసిన కార్యమైన దెలియజేయరాదా!" ఈ విధముగా గణపతి తర్కించుకొనుచుండగా నొకానొక సూక్ష్మశక్తి హఠాత్తుగా తనయందు ప్రవేశించి, తన శరీరమును పది పదునై దడుగులవఱకు పైకెత్తి, మఱల దించి నట్లయ్యెను. ఈ విపరీతమునకు వాసిష్ఠుడు భీతిజెందకపోలేదుగాని యది స్వల్పమైయుండెను. ఆ స్వల్పభయము గూడ తొలగుట కతడు భగవతి నీదిగువ శ్లోకముచే నాశువున స్తుతించిన పిదప మిగిలిన రాత్రి భాగమంతయు క్షేమముకొఱకై మంత్రమును ధరించియుండెను.

శ్లో॥ "అవంధ్య వింధ్య భూమి భృత్తటాలయా దయావతీ।
విచార ధౌతచేతసా మియం భయం వ్యపోహతు ॥"

(అర్థము:- కోర్కెల నిచ్చుచు, వింధ్యాచల తటమును నిలయముగా జేసికొని, దయావతియైయున్న దేవి మనస్సులను విమర్శచే నిర్మల మొనర్చుకొను వారికి భయమును తొలగించుగాక!)

ఈ స్థలము భూతచేష్టలతో నిండియుండెనని గణపతి నిశ్చయించి, తెల్లవారిన పిదప చెంతనున్న నారాయణపురము చేరి, యచ్చటనుండి చదునైన బాట యుండుటవలన, కాలినడకను తొమ్మిది గంటలు నడచి, వ్యాసకాశి యనబడు రామనగరము చేరెను. అక్కడ తన వస్త్రమును రెండణాలకమ్మి, వాసిష్ఠుడొక యణా వెచ్చించి యరటిపండ్లను తిని, మిగిలిన యణాతో నౌకపై కాశి చేరెను.

కాశియందు నరసింహశాస్త్రి మేనమామ యొకడుండెను. అతని పేరు అర్యసోమయాజుల భవానీశంకరము. వాని యింటికి బోయి గణపతి స్వేచ్ఛగా గడపజొచ్చెను. క్షేత్రమందున్న యాలయములను తొలుత దర్శించి, యటు తర్వాత నతడా నగరమును వేడుకతో జూచుచుండ నొకచో విద్వజ్జనుల కోలాహలమును గాంచి, కారణమరయగా, మిక్కిలి ప్రసిద్ధిగాంచిన ఆంధ్రదేశ పండితుడైన బాలశాస్త్రికి శిష్యుడై, విదేహ రాష్ట్రములోని దర్భాంగ సంస్థాన పాఠశాలయందు ప్రధానోపాధ్యాయుడై యున్న కాశీవాస్తవ్యుడగు శివకుమార పండితుడు డిసెంబర్ సెలవుల కింటికి విచ్చేసెనని తెలిసెను. విద్వచ్ఛేఖరుడగు గణపతికి గూడ శివకుమారుని జూడ కుతూహలము జనించెను. వెంటనే యతడు శివకుమారుని గృహము జొచ్చి, యచ్చట జరుగుచున్న విద్వద్గోష్ఠియందు జొరబడి, క్రమముగా తన పాండితీవైభవమును, ఆశుకవితాధారను చవిజూపుసరికి శివకుమారు డంతటి పండితుడుగూడ సమ్మోహితుడై వాసిష్ఠపరిచయమును జేసికొనెను. అంతటితో నూరకుండక శివకుమారుడు వాసిష్ఠుని నవద్వీప విద్వత్పరీక్షకు వెళ్లుడని ప్రోత్సహించి, దానిలో ప్రవేశలాభము సులభముగా ప్రాప్తించుటకా వర్గ కార్యదర్శి కొక ప్రశంసాపత్రమునుగూడ వ్రాసి గణపతికిచ్చెను. దానినత డందుకొని సమయము వచ్చినప్పుడు వినియోగించుకొనుటకు తనయొద్ద నుంచుకొనెను.

శివకుమారుడు తిరుగ దర్భాంగ వెళ్లువఱకు గణపతికి కాశియందుత్సవ దినములయ్యెను. అటుపిదప కాశిలో గొప్ప తపస్సు సల్పవలెనని కాంక్ష తిరుగ వేధించగా నతడు వివిక్త స్థలముకొఱకు తిరిగి తిరిగి వేసారెను. నిరంతరము వచ్చుపోవు యాత్రికులచే నిండి నిత్యకోలాహలముతో భైరవ నాదమును సల్పు కాశియందు నిశ్శబ్దము, ఏకాంతస్థలము రెండును దుర్లభములే యైనందున వాసిష్ఠుడు తన బసయందే జపస్థలమును కల్పించుకొని యుపవిష్టుడై తన నిజస్ఫూర్తిని మథించు నుపాయముకొఱకు తొలుత నాలోచించుచుండెను. ఇంతలో

నొక నల్లని బలిష్ఠుడైన బ్రాహ్మణుడక్కడకు "గణపతీ, గణపతీ" యని పిలుచుచు వచ్చి, గణపతిని, యతని దీక్షా స్థలమును చూచి నివ్వెరపోయిన వానివలె నటించి యిట్లు గొణుగుకొనెను: "భవానీశంకరుడిప్పుడే నీవు వచ్చినట్లు చెప్పగా విని, నిన్ను జూచుట కింతదూరము కాళ్ళీడ్చుకొని వచ్చితిని. చిరకాలమునకు మఱల నిన్ను కలియుచుంటినను నానందముతో వచ్చితిని. కాని, నీ తీరు చూడగా నీ వేదో దీక్షయందున్నట్లుంటివి. కానిమ్ము. నీవు లేచువఱకు నెక్కడెక్కడైన కూర్చుండెదను." ఆ పల్కులాలకించి, యితడెవడై యుండునాయని చూచుటకు గణపతి కన్నులను తెఱచెను. సాధువేషముననున్న యా పురుషుడు మందహాసముచే పలుకరించెను. గణపతి విస్మయముతో "మీరెవ్వరో నా స్మృతికి వచ్చుట లేదు. క్షమించి, మన పరిచయమును చెప్పగోరెద"నని పల్కుచు లేచి, యతని నొక యాసనమున గూర్చుండబెట్టెను. అతడుపవిష్టుడగుచు "ఔను నాయనా, నీ స్మృతియే నీకు తప్పినది. నేను స్మృతియందుందునా?" అని పరిహాస వచనములను కొలుత బల్కి యటుపిమ్మట "నేను రామనగర దుర్గా మందిర యోగి"నని చెప్పుకొనెను. అంతట, వారిట్లు సంభాషించుకొనిరి:

గణ :- మీ పూర్వాశ్రమ నామమేమి ?

యోగి :- సోమయాజుల సూర్యనారాయణ. కాని, యింత కింకను పూర్వాశ్రమ నామములే మన కధిక పరిచితములు.

గణ :- అవి యెట్టివి ?

యోగి :- సరిసరి, భద్రకునివలె నేనును నీకు జ్ఞప్తి చేయవలెను గాబోలు!

గణ :- ఏమీ ! భద్రకుని మీరెఱుగుదురా ?

యోగి :- ఎఱుగకేమి ? మన మొక్క కూటములోని వారమే గదా! లోక కార్యము కొఱకిప్పుడు పదునాల్గురము జన్మించి యొక్కొక్కర మొక్కొక్క కార్యమందు ప్రీతి జెందియున్నాము. అందు నేను మకేతుడను. రామనగర దుర్గామందిరమును నేను నివాసముగా నేర్పఱచుకొనినందున నన్నక్కడ వారు 'దుర్గామందిరయోగి' యని పిలుతురు.

గణ :- నా వంతు కార్యమెట్టిది ?

యోగి :- నీ కది 'స్థూలశిరస్సు' వలన తెలియగలదు. అంతవఱకు నీవాతుర పడవలదు. మఱియు, తపస్సు కొఱకు గూడ నీ వనవసరముగా శరీరమును కష్టబెట్టుకొనకుము. తపస్సు నీకు సహజమైయున్నది. అది సమయము ననుసరించి యెంత, యే రూపమున ప్రకాశించవలెనో, ఆ రూపమున నంతయే ప్రకాశించును. కనుక నీవు శాంతచిత్తుడవై

యుండుము. గణకుడవు గనుక అవరోధములను నీవు తొలగింపుము. మిగిలిన కార్యము సాగగలదు.

గణ :- భద్రకుడు నన్ను తపస్సునకు ప్రేరేపించెను. గదా, అది ఎందునిమిత్తము ? లోకముకొఱకా ? నాకొఱకా ?

యోగి :- లోకహితముకొఱకు. అందు విఘ్నునివారణ మొక నిమిత్తము. ప్రస్తుతము లోకమందెట్టి మంచికార్య మెవరు చేయబూనినను, దానికి విఘ్నములను కల్పించు శక్తు లధికమై యున్నవిగదా !

తరువాత యోగినడిగి గణపతి పెక్కు సందేహముల నింకను తొలగించు కొనెను. అటుపిమ్మట నతడు ప్రయాణోన్ముఖుడగుట చూచి గణపతి యిట్లడిగెను: "నన్నుగురించి తెలియుటకు నాకంటె నధిక కుతూహలపడుచున్న మా తండ్రికి మీ దర్శనవృత్తాంతము, మీరు చెప్పిన విషయముల సారము నెఱిగించుటకొక లేఖ నిప్పుడే వ్రాసెదను. అందు మీరుగూడ కొంచెమేదైన వ్రాసి యతనికి సంతోషమును గలిగింప వేడెదను." యోగి యంగీకరించెను. వాసిష్ఠుడు లేఖను వ్రాసి యోగికీయగా నతడా లేఖ దిగువ భాగమున "మీ కుమారుడు తపస్సు చేయుగాక ! గృహవాస నిర్బంధమతనికి మీరు నిర్మింపకుందురుగాక !" అని వ్రాసి "సామయాజుల సూర్యనారాయణ"యని సంతకము చేసెను. పిమ్మట పత్రముఖమును గణపతి యంటించగా విలాసము నింగ్లీషులో యోగి వ్రాసెను. అటుపిమ్మట యోగి వెళ్లిపోవుచు, గణపతి నా మఱునాడు దుర్గా మందిరమునకు రమ్మని యాహ్వానించి, గణపతి చేత నున్న పత్రమును తీసికొని తాబోవు దారిలో తపాలపెట్టెలో వేయుటకు తనతో గైకొనిపోయెను. అప్పుడొక విచిత్రము జరిగెను. అది మున్ముందు విశదమగును గనుక మనము ప్రస్తుత కథ ననుసరింతము.

నరసింహశాస్త్రి కీ లేఖ చేరెను. వెంటనే యతడు తన సంతోషమును తెలియజేయుచు తంతివార్త నంపెను. ఇది వచ్చులోపున గణపతి రామనగరము వెళ్లి యక్కడ దుర్గామందిరమందు యోగి లేకుండుట కాశ్చర్యపోయెను. అక్కడివా రట్టి యోగి నా ప్రాంతమం దెన్నడును చూడలేదనిరి. గణపతి యింటికి మఱలి భవానీశంకరుని నడుగగా, నతడు విస్మయపడి, "బాబూ, నీవదృష్టవంతుడవు. నీ కగపడి నీతో సంభాషించిన యోగి మానవుడుగా దోచుట లేదు సుమా ! దుర్గామందిర యోగినని యతడు చెప్పుకొనుటనుబట్టి యీశ్వరుడనియు, అతని పేరు సామయాజుల సూర్యనారాయణయని చెప్పుకొనుటనుబట్టి మీ తల్లితండ్రుల యిష్టదైవమనియు నాకు దోచుచున్నది. భద్రక, సుకేతాదివర్గము జన్మించి యుండు గాక ! వారి వేషములలో నగపడి వారిప్పుడు పొందియున్న రూపములను రెండింటిని ముఖ్యముగా పరిచయమొనర్చుట కట్లు చేసెనుగాని, నిజమున కతడు మీ యిష్టదైవమని నేను ధ్రువముగా చెప్పగలను, వర్గములో మిగిలినవారి

వేషములనుగూడ నీ కతడిట్లే పరిచయమునిచ్చును గనుక, నీవిటుపైని శ్రద్ధబూనియుండుము'' అని చెప్పెను. వయస్సుచే ననుభవము నార్జించిన భవానీతాత యభిప్రాయము సరియైనదని వాసిష్ఠుని హృదయమునకు తట్టెను. తాత చెప్పినట్లా రాత్రియే గణపతికి స్వప్నమం దింకొక మూర్తి బ్రాహ్మణ వేషమున యాత్రికునివలె గాన్పించి ''ఓయీ గణకా! నీ వీ యూరిలో కాలము నేల వ్యర్థము చేయుదువు? నాకు సుకేతుడగపడి మీకు జరిగిన సంభాషణమును సాంతముగా నెఱిగించెను. బ్రహ్మగిరికి ద్వారమై యొప్పు 'నాసిక' నీవు చూడదగినది. నీ కక్కడ తపస్సగు''నని చెప్పెను.

ఈ స్వప్న వార్త భవానీతాత కెఱిగించగా నతడదియు దైవప్రేరణమేయని నిశ్చయించెను. ఇంతవఱకు గణపతికి ప్రేరణములేగాని తపశ్చర్య సాగుటలేదు. ఈ ప్రేరణములుగూడ విచిత్రములై, తపశ్చర్యలచే పొందబడు దర్శనానుభవములకు తుల్యములైయున్నను, గణపతికవి శాంతిని గూర్పజాలకుండెను. అందువలన గణపతి తన తండ్రికీ తుదిస్వప్నమును గూర్చి వ్రాయగా నతడుగూడ భవానీతాత వలెనే నాసికకు వెళ్లుమనియు, నీశ్వరప్రేరణమును మన్నింపుమనియు పుత్రునాదేశించెను.

ఓం

రెండవ ప్రకరణము

# నాసికా సంస్కారము – ఈశ్వర దర్శనము

(ద్వితీయ తపోయాత్ర)

'నాసిక' యను క్షేత్రము బొంబాయి నగరమునకు సమీపమున నుండును. దీనికీ పేరు వచ్చుట కొక కారణమును జెప్పుదురు. సీతారామలక్ష్మణులు అరణ్యమున పంచవటమును జేరియుండగా లక్ష్మణునిచే కోయబడిన శూర్పణఖ యొక్క నాసిక యీ స్థలమందు పడిన కారణమున దీనికి 'నాసిక' యను పేరు గల్గెననియు, లక్ష్మణుని యాగ్రహమిప్పటికి గూడ 'నాసిక'పై ప్రసరించుచు దాని కప్పుడప్పుడు ధ్వంసకారణమగుచుండుననియు చెప్పుదురు. అందుకు నిదర్శనముగా నీ యూరి వెలుపల లక్ష్మణున కొక యాలయము నిర్మింపబడి యున్నది. ఆలోచించగా రామకార్యమున కుపోద్ఘాతమును కల్పించిన శూర్పణఖ యొక్క నాసికా సంహారమువంటి సంస్కారకథ దేశాభ్యుదయమునకు పూర్వ మీ క్షేత్రమందు సంభవించవలెనని యెంచి, దానిని సంభవింపజేయు కీలకము లక్ష్మణాలయమందు మన పూర్వులచే ప్రతిష్ఠింపబడియుండునని తోచును. ఇది నిజమగుచో దైవమే యట్టి కథకు నెపముగా గణపతియందు నాసికా యాత్రను ప్రబోధించెననుటకు సందేహముండదు.

నాసిక చేరినంతనే గణపతి యితర ప్రయాణికులతో బాటూరిమొగ యందు నిర్మింపబడిన మారీజ్వర పరీక్షామంటపమం దరి కట్టబడెను. అప్పుడు నాసిక కీ రోగము వ్యాపింపకుండుట కధికార్లు నాసికకు వచ్చువారి నిట్లు పరీక్ష ముగియువఱకు నిర్బంధించుచుండిరి. పగలంతయు వాసిష్ఠుడు మంటప మందు గడపి, రాత్రిపడిన తరువాత తత్కాల బలాత్కార నియమమువలన గలిగిన బాధను మఱచుటకై మంటపమున కీవలకు వచ్చి సత్కవితా ధ్యానగానము లచే వెళ్ల బుచ్చదలచెను. ఆకసమున నిర్మలమై, మనోహరముగా ప్రకాశించు చంద్రుని జూచుసరికి కాళిదాసుచే రచింపబడిన రఘువంశములోని శ్లోకము వాసిష్ఠునికి జ్ఞప్తికి వచ్చి, దాని నతడు పాడసాగెను. గాంభీర్యవీర్యములచే పరసమై, యౌవన మదాతిశయముచే ధృతమై, ప్రకృతి తన్మయత్వముచే మనోహరమై యా కంఠనాద మొకవంక ప్రయాణికుల బడలికను హరింపుచు, నింకొకవంక రసికచిత్తముల నాకర్షించెను. ఈ విధముగా నాకర్షింపబడినవారిలో ధామాధి కారి యొకడు. ఇతడు సంస్కృతము నెఱింగినవాడై, గణపతిని పరీక్షించు నుద్దేశముతో శ్లోక వ్యాఖ్యానమును గోరెను. ఆ శ్లోక మిది :-

శ్లో॥ "నిద్రావశేన భవతాఽప్య నవేక్షమాణా
పర్యుత్సుకత్వ మబలా నిశి ఖండితేవ ।
లక్ష్మీ ర్వినోదయతి యేన దిగంతలంబీ
సోఽపిత్వ దానన రుచిం విజహాతి చంద్రః ॥"

(రఘుపుత్రుడగు అజమహారాజు స్వయంవరమునకు వెళ్లుచు, మార్గమందు రాత్రిపడుటంజేసి గుడారమందు నిద్రించెను. ఉదయమున నతనిని లేపుటకు వందిమాగధులీ శ్లోకమును జదివిరి.

(అర్థము:- ఓ రాజా! నిద్రాపరవశుడవై నీవుండగా నీ యనురాగమును వీడిన లక్ష్మి యే చంద్రునితో ఖండిత నాయికవలె వినోదించెనో, ఆ చంద్రుడిప్పుడు నీ ముఖసాదృశ్యమును గోల్పోయి యస్తమించెను. పద్మము, రాజ ముఖము, చంద్రుడు లక్ష్మికి నివాసస్థానములని ప్రసిద్ధము).

గణపతి చేసిన సరస వ్యాఖ్యానమునకు ధామాధికారి సంతసించిన పిదప కొంచె మాక్షేపణరూపముగా "అజమహారాజు పరపురుషునితో బోయిన లక్ష్మి నెట్లు స్వీకరించె"నని ప్రశ్నించెను. "అమృతసాగరమునుండి పుట్టిన లక్ష్మికి చంద్రుడు పరపురుషు డెట్లగు"నని వాసిష్ఠుడు ప్రతిప్రశ్న గావించి "తనకు విరహము దోచినప్పుడు తన సోదరునింట నుండుట దోషముగాజాల" దని విశదపరచెను. ధామాధికారి సంతోషించి, నిర్బంధమునుండి వాసిష్ఠుని విడుదల కాజ్ఞ నిచ్చెను. కాని, యా రాత్రి కక్కడనే యెట్లో గడపి తెల్లవారినంతనే పురము లోని కతడు పోయెను.

పురమంతయు తిరిగి, గణపతి తుదకది తపస్సున కయోగ్యముగా నున్నట్లెంచెను. ప్రజలుగూడ చపలత్వాది దోషములకు వశులై, ఆస్తికబుద్ధిని విడనాడిన ట్లగపడిరి. అందువలన గణపతి శ్రమయని యెంచక, తొమ్మిది క్రోశముల దూరముననున్న 'త్ర్యంబక' మను క్షేత్రమునకు నడచిపోయి, యక్కడ స్వల్పరూపముతో మందముగా పాఱు గోదావరీ పుణ్యనదియందు స్నాన మాచరించి, క్షేత్రాలయమందు కొంత తడవు ధ్యానించెను. పిదప 'కుశావర్త' మను గొప్ప తటాకముగల క్షేత్రము నా సాయంత్రమునకు చేరుకొనెను. త్ర్యంబకమునకు సమీపముననే బ్రహ్మగిరి నుండి గోదావరి జనించుచున్నట్లున్నను, ఇది ద్యులోకము నుండి గౌతమునిచే రావింపబడిన గంగయనియు, ఉత్తర భారతమునకు భాగీరథి యెట్లో దక్షిణ భారతదేశమునకు 'గౌతమి' యను నామాంతరము గల గోదావరీనది అట్టి పుణ్యస్రవంతి యనియు ప్రసిద్ధిబొందెను. ఇక్కడ బ్రహ్మగిరి బ్రహ్మరంధ్రము తోడను, కుశావర్తము సహస్రారము తోడను, త్ర్యంబకము త్రిపుటీస్థలము తోడను పోల్చబడుచున్నందున నీ స్థలమంతయు నాధ్యాత్మికార్థ గంభీరమై యొప్పును.

కుశావర్త మందొక పేదబ్రాహ్మణుడు గణపతి కారాత్రి యాతిథ్యమిచ్చి, మఱునా డొక సమృద్ధ గృహము జూపెను. అదియొక వైద్యునిది. అతడు కావ్యాలంకారములను జదివినవాఁడై, పండితులను శ్రద్ధతో సత్కరించువాడు. అతడు వాసిష్ఠునకు నీలాంబికాలయమందు తపస్థ్సలమును జూపి, స్నానమునకు వేడినీటిని, జపాంతమందు రుచికరమగు రసాన్నము నిచ్చువాడు. సదుపాయము లిట్లమరినందున గణపతి గాఢ జపధ్యానమున మునిగెను. పదునాల్గు దినము లవిరళముగా జపము సాగుసరి కొక కారణమున నిక్కడ తపస్సంతమ్మై వాసిష్ఠునకు తిరుగ నాసికాప్రయాణము సంభవించెను.

ఆ కారణమెట్లనిన, రాత్రులందు చేయు సంభాషణల వలన వాసిష్ఠుని పాండిత్యమును వైద్యుడు గుర్తించి తన మిత్రులకు జెప్పుచుండెను. వా రనుదినము వైద్యుని యింట మూగుచుండిరి. ఒకనాడు నాసికనుండి వైద్యుని స్నేహితుడొకడు వచ్చెను. ఇతని పేరు రామభావు. ఇతడు పండిత రసికుడేగాక ధనికుడు. ఇతని యనురోధమువలన వాసిష్ఠుడు నీరసించియున్నను తన యష్టావధాన ప్రజ్ఞను ప్రదర్శించుట కియ్యకొనెను. వెంటనే సభ గావింపబడెను. సభయందష్టావధానమును సల్పుట వాసిష్ఠున కిదియే తొలిసారియైనను, దాని నత్యంత ప్రతిభతో ప్రదర్శించుసరికి రామభావు గణపతియందు గౌరవాదరణలను బ్రకటించి, నాసికయందు చక్కని తపస్థ్సలమున్నదని నచ్చజెప్పి గణపతిని తనతో నాసికకు తీసికొనిపోయెను. వెళ్లునప్పుడు వాసిష్ఠునకు వైద్యుడును, అతని మిత్రులును గలసి కొంత ధనమిచ్చి, వారి పరిచయము స్మరింపబడుటకొక ఛాయాపటమును (ఫొటో) గూడ తీయించి యిచ్చిరి.

నాసిక చేరిన పిదప తపస్థ్సలమును జూపుటకు బదులు రసజ్ఞులగు పండితులను రావించుచు రామభావు గణపతికి శాస్త్రగోష్ఠిని, కవితా వినోదములను గల్పింపజొచ్చెను. విలువైన కాలము నీ విధముగా వెళ్లబుచ్చుటకు వాసిష్ఠుని మనస్సు బాధపడినను, అతడిదిగో, అదిగో అనుచు కాలవిలంబనము జేయుచుండెను. పండిత సల్లాపములను వినుటయందున్న ప్రీతిచేతను, తనయందు గలిగిన చనువుచేతను అత డట్లు చేయుచుండెనని గ్రహించి వాసిష్ఠు డొకనాడు తనంతట తానే తపస్థ్సలమును వెదకికొనుటకు పురము దాటి వెళ్ళి, యచ్చట నున్న రమ్యమైన లక్ష్మణాలయముచే నాకర్షింపబడెను. వెంటనే యతడాలయము కడకు బోయి, దాని కట్టడపు సొంపును తిలకించుచు గోపురద్వారము దాటెను. అతడు ద్వారము దాటినంతనే ద్వారము చెంత దాగియున్న కోవెల పూజారి యొకడు వెనుకనుండి హఠాత్తుగా గణపతిపై గలియబడి, జుత్తు పట్టుకొని, నిర్దయతో పీడింపజొచ్చెను. అంతటితో నూరకుండక గణపతి నతడు గ్రామాధికారి యెదుట బెట్టుట కీవల కీడ్చుకొనివచ్చి, లాగుకొనిపోవుచు, నోటికిరాని తిట్లను తిట్టుచుండెను. వాసిష్ఠుని మొఱ యరణ్యరోదనమై వాని కర్ణకుహరములజొచ్చుటలేదు. ఆ రాక్షసుడిట్లు

కొంతదూర మీడ్చుకొనిపోవుసరికి రామభావుని యింట వాసిష్ఠు ననుదినము జూచుచున్న సాధుపురుషుడొకడెదురై, వాసిష్ఠుని యవస్థ కాశ్చర్యచకితుడై, యతని నా పూజారి చెఱనుండి విడిపించి, కారణమరయగా పూజారి యిట్లు చెప్పెను: "దేవాలయ సామగ్రిని తేమవలెనని నేను బయటికిదెచ్చి జలము కొఱకు నూతికడకు బోయితిని. నేను వచ్చులోపున కొంత సామగ్రి తస్కరింపబడెను. మిగిలినదాని కా తస్కరుడు తిరుగవచ్చును గదాయని వానిని బట్టుకొనుటకు నేను ద్వారము వెనుక దాగియుంటిని. నే నూహించినట్లే యీ తస్కరు డిటునటు చూచుకొనుచు ప్రవేశించెను. ఇతడు దొంగిలించిన సామగ్రినిచ్చువఱకు నేను వీనిని విడువను." సాధుపురుషుడు పూజారిని చీవాట్లుపెట్టి, గణపతిని గుఱించి చెప్పినను వాడు వినిపించుకొలేదు. మంచిచెడ్డల నరయని యీ దుర్మార్గుని కార్యమునకు అంతకు పూర్వమే వాసిష్ఠుని యందొక దేహవేదనతో బాటు పరాభవ సంబంధమగు నంతర్వేదన జనించినను, దానికతడు దోషకారణము తేటపడువఱకు బహిర్గతమగుట కవకాశమీయలేదు. ఇప్పుడీ పూజారి మూర్ఖత్వమున కింక సహింపజాలక దానిని వాసిష్ఠుడు విడచుసరికది క్రోధాగ్ని రూపమున భగ్గుమని, వాసిష్ఠుని కంఠమునుండి యీ దిగువ శాపవాక్కును గ్రక్కించెను.

శ్లో॥ "ధ్వస్త ప్రధ్వస్త మనుజాక్షత విక్షత విగ్రహా ।
కీర్ణ ప్రకీర్ణ పర్యన్తా నాసికే యం భవిష్యతి ॥"

(అర్థము :- మిక్కిలి ధ్వంసము గావింపబడిన మనుజులతోడను, పగుల గొట్టబడిన విగ్రహములతోడను, బహువిధ వినాశము నొందిన బాటల తోడను నాసిక యుండుగాక !)

ఈ శాపవాక్కునకు పూజారి భీతిజెందెను. తాను గణపతిని జూచి దొంగయని భావించుట పొరపాటయ్యెనని గుర్తించెను. ఈ పరివర్తన కలిగినంతనే యతడు వాసిష్ఠుని క్షమింప వేడెను. కాని, వాసిష్ఠుడేమియు పలుకలేదు. శాపవాక్కు పూజారి యొక్కనిపైగాక నాసికయంతటిపై వెడలుట కతనికే యాశ్చర్యమయ్యెను. సత్పురుషులకు క్రోధమయుక్తమైనను, అసత్పురుషులందువలె నది యిప్పుడు చండాలమై, యీ పూజారి వలన నాసికకే నష్టము తలపెట్టెనని వాసిష్ఠుడు తొలుత విచారించెను. కాని, వెంటనే వెనుకటి విషయములన్నియు త్రుటిలో విమర్శకు వచ్చి, యిట్లగుట ఈశ్వర ప్రేరణమని బుద్ధియందు దోచెను. అట్లుగానిచో కాశినుండి నాసికకు తానేల రావలెను ? నాసిక తపస్సున కయుక్తమని తొలుత తెలిసికొనియు తిరుగ రామభావు వెంట నాసికకు తానేల వచ్చెను ? నిత్యము యాత్రికులచే నిండియుండు లక్ష్మణాలయము తావెళ్లిన సమయమున కేల నిర్జనమైయుండెను ? అదే సమయమున సామగ్రి యేల మాయమయ్యెను ? ఇవన్నియు నీశ్వర కల్పితములైనప్పుడు, పూజారియందు తొందరపాటు, రాక్షసకృత్యముమాత్ర మీశ్వర

కల్పితములేల గారాదు ? చౌర్యాపరాధ మెవమున నకారణముగా మాండవ్యముని శిక్ష బొందినట్లు తానిక్కడ శిక్షబొందవలసి వచ్చెనని వాసిష్ఠుడు భావించి, యదియు నీశ్వర కల్పితమేయనియు, శాపవాక్కును గ్రక్కించుటకే నాసికకు రావించి యీశ్వరుడిట్లు గావించెననియు నిశ్చయాత్మకుడయ్యెను. ఈ నిశ్చయము కలిగినతోడనే వాసిష్ఠుని హృదయావేదన శాంతించెను. తనకు గలిగిన బాధావమానములు రెండును నే యీశ్వరునిచే కల్పింపబడెనో, ఆ యీశ్వరునిచే నవి శాపవాగ్రూపమున తొలగింపబడెనని యెంచి, వాని కొఱకింక చింతించుట మాని, తనకు సన్నిహితమైయున్న ఈశ్వరునెఱుంగుట కంతకంటె గొప్ప తరుణము రాజాలదని గణపతి తలచి, తనను పూజారి చెఱనుండి విడిపించిన సాధుపురుషునితో "ఈ శాపము నుపసంహరించుటకు నేనశక్తుడను. నేనిదే తపస్సునకు బోవుచుంటినని రామభావుకు చెప్పగోరెదను. ఈ పురబాహ్యమందే నా తపస్థలమును నిర్మించుకొందు"నని పల్కి వాసిష్ఠుడా లక్ష్మణాలయ పరిసరమందు 'నవచూతీం' అను స్థలమున నశ్రద్ధచే పాడుబడి యున్న దేవాలయములు రెండుండుట గాంచి, వానిలో నొక దానియం దుపవిష్టుడయ్యెను.

రామభా వా సాయంత్రమే గణపతిని గలసి తన యపరాధమే యింత కథకు కారణమైనదని దుఃఖించెను. అటుపిదప నతడు రాత్రులందు పాలను స్వయముగా తెచ్చి యిచ్చుచుండగా గణపతి వాని నారగించుచు, మిగిలిన రోజంతయు నుపవాస దీక్షతోడను, మౌనవ్రతము తోడను నీశ్వరధ్యానమున గడపుచు డెబ్బది దినములు ఘోరతపస్సును సల్పెను. డెబ్బదియవ నా డీశ్వర దర్శనమైనందున వాసిష్ఠుడు తపస్సును విరమించెను. మహాదేవు డానాడు దిగంబరరూపమున స్వప్నమందగపడి "కార్యమున్నది, నీ వింటికిపొ"మ్మని యాంధ్రవాణితో మూడు పర్యాయములు చెప్పెను. ఈ దర్శన విషయమును మిత్రుడైన రామభావుతో మౌనదీక్షను విడిచిన పిదప గణపతి చెప్పగా నతడు, "తండ్రీ! మీరు మహానుభావులు. మీ శాప మమోఘమై, నాసికయందున్న పాపపంకిలమును ధ్వంసమొనర్చెను. మీ శాపమునకు మఱునాడే పూజారి యింట మారీజ్వర మారంభమై, వాయువేగముతో పురమంతయు వ్యాపించెను. పూజారియు, నతని వంశమువారును తొలుత బలియైరి. అటుపిమ్మట నగరవాసులలో పాపమునకు వెఱవని జనులెందరో తుడిచివేయబడిరి. ఒక రాత్రి వీచిన తుపానుకు పెద్ద పెద్ద చెట్లన్నియు నిర్మూలమై, వాని యొత్తిడికి రెండు గోపురములు, సుమా రిరువది ముప్పది యిండ్లు కూలిపోయెను. విచిత్ర మేమనగా, తుపా నీ యూరి పరిసరముల కించుకైన లేక, నగరమందే కేవలము సుడివలె తాండవమాడెను. మా తాతల కాలమం దిట్లొకసారి సంభవించెనట. అప్పుడొక మహానుభావునకు లక్ష్మణస్వామి ప్రత్యక్షమై, రాబోవు విపత్తు నెఱింగించి, పురమును విడిచి పొమ్మని చెప్పెనట. అతడప్పుడు లక్ష్మణుని యాగ్రహమును తన మిత్రులకు దెలియజేసి వారిని పురము దాటించి రక్షించెనట."

గణపతి లక్ష్మణాలయమును దర్శించి, యటనుండి రామభావుని యింటికి చేరెను. వెంటనే యతడు తండ్రి కొక లేఖను వ్రాసి, యందు శివరామునితోగూడి తండ్రిని సికిందరాబాదు వచ్చి తన్ను కలియుటకు కోరెను. ఆటుపిదప రామభావొసంగిన ధనసహాయముతో నతడు నాసికనుండి సికందరాబాదు ప్రయాణమయ్యెను. సికందరాబాదులో తండ్రిని గలసికొని నాసికలో జరిగిన విషయములను గణపతి యెఱింగించిన పిదప భద్రాచల యాత్రకు తండ్రితోగూడ ప్రయాణము కాదలచెను. కాని, తండ్రి యందుల కిష్టపడక ''కార్యావసరమున్నది. నీ వింటికి వచ్చుట మంచి''దనెను. గణపతి తన జీవితము తపస్సుకొఱకే గాని యింటికడ కూర్చుండి స్త్రీల నారాధించుటకు గాదని బదులిడెను. అంతట నరసింహశాస్త్రి గణపతి నుద్దేశించి యిట్లు పల్కెను: ''బాబూ! నీవు స్త్రీల నారాధింప నవసరము లేదు. కాని, నిన్నారాధించుట కొక స్త్రీ యున్నది. ఆమె నీ కొఱకెదురు జూచుచుండును. నీ విల్లు విడిచి యాఱు మాసములు గాబోవుచున్నది. నిన్నింటికి వెళ్లుమని యీశ్వరుడే చెప్పెను గదా! నీయం దతడొక పుత్రుడు కలుగుటకై తేజస్సు నుంచినట్లు నాకు దోచుచున్నది. కనుక నీ వింటికి వచ్చి, ఆ యీశ్వర సంకల్పమునే నెఱవేర్చుము.'' ఈ మాటలకు గణపతి మారుబల్కజాలక తండ్రివెంట నింటికి బోయెను. ఆఱు మాసములు మించకుండ గణపతి యిల్లు చేరె తన వాగ్దానమును నిలుపుకొనెను. ఈశ్వరదర్శనము గానిది యిల్లు చేరరాదనుకొనిన తన సంకల్పమునుగూడ నెఱవేర్చుకొనెను.

గణపతి యిల్లు చేరిన పిదప ప్రసంగవశమున రామనగర దుర్గా మందిర యోగిని గుఱించి చెప్పుచుండగా, కాశి నుండి వ్రాయబడిన లేఖను నరసింహశాస్త్రి పైకి దీసి, ''బాబూ! యీ బొమ్మ నెవరు వ్రాసి''రని యడిగెను. ఏమి యద్భుతము! అది వాసిష్ఠునియొక్క చిత్రపటమై, ఊర్ధ్వభాగము మాత్రము చిత్రింపబడియున్నది. పత్రము యొక్క ఉపరి భాగమున నిది చిత్రింపబడి, పత్రాంశములన్నియు క్రిందకు జరుపబడెను. ఇది యెట్లు సాధ్యమయ్యెను? ఎవరు చేసియుందురు? పత్రము వ్రాయబడినప్పుడా కాగితము పీతవర్ణము గలిగియున్నట్లు వాసిష్ఠుడు బాగుగా నెఱుగును. ఇప్పు డది ధవళవర్ణమై యున్నది. యోగి యీ లేఖను తపాలపెట్టెలో నుంచుటకు తీసికొనివెళ్లెనుగదా; అప్పుడతడు పత్రమును మార్చి, చిత్రమును వ్రాసెనేమో యనుకొనినచో, వాసిష్ఠుని దస్తూరియందుగాని, సిరారంగు నందుగాని యెట్టి మార్పును లేదాయె. ఊహించుటకైనను నలవిగాని యీ విషయములకు తండ్రీకొడుకు లుభయులు నివ్వెఱబోయి, ఆ యోగీశ్వరుని యపూర్వ పరిచయమునకు, అటుపిదప నతని మహిమచే నాసికయందు సంభవించిన సంఘటనలకు పరిపోయి యీ లేఖ యున్నదని చెప్పుకొనిరి. కాశిలో భవానీతాత తలచినట్లే నరసింహశాస్త్రిగూడ తమ యిష్టదైవమే యిన్ని రూపముల గణపతికి గాన్పించి ప్రబోధించెనని విశ్వసించెను.

ఓం

మూడవ ప్రకరణము

# తృతీయ తపోయాత్ర - భువనేశ్వరీ మధుకటాక్షము

వాసిష్ఠు డింటికడ నాలుగైదు మాసము లుండెను. గర్భవతియైన విశాలాక్షి కైదవ మాసము ప్రవేశించినందున నామె పుట్టింటికి బోవలసివచ్చెను. కనుక గణపతి కాఱు మాసము లింటికడ నుండ నవసరము లేకపోయెను. ఈసారి తపస్సునకు దూరముగా బోవలదని భార్య బ్రతిమాలినందున గణపతి యుత్కళ రాష్ట్రమందు బ్రసిద్ధికెక్కిన భువనేశ్వర క్షేత్రమునకు పయనమయ్యెను.

ఇద్దరు తపస్సుఖులుగూడ వాసిష్ఠుని వెంటబడిరి. వారిలో నొకడు భీమశాస్త్రి బావమఱదియగు రామశాస్త్రి, ఇంకొకడు కాశిలోని భవానీతాత కొడుకగు లక్ష్మీనారాయణశాస్త్రి. వీరిద్దరు గణపతికడ మంత్రదీక్షను గైకొనినవారై, గురువువలెనే తపస్సు జేయదలచిరి. కాని, యుపవాస నియమమునకు భీతిజెంది రామశాస్త్రి తొలినాడే యింటికి మఱలెను; నిరంతరము పొగచుట్టను త్రాగు రెండవవాడా చుట్టకొఱకు నిట్టూర్పులు పడజాలక మఱునాడు వెడలెను. పులిని జూచి నక్క వాతబెట్టుకొనిన సామెత గణపతి బంధువుల కీవిధముగా సార్థకము గావచ్చెను. వారు వెళ్లిన పిదప గణపతి స్వేచ్ఛాపరుడై, భువనేశ్వరీ మందిరము యొక్క వెనుక భాగమున నేకాంతమగు స్థలమును నిర్మించుకొని తపస్సున మునిగెను.

పగలంతయు మంత్రజప మాచరించుచు, రాత్రులందు దేవి సన్నిధి యందు లలితాసహస్రమును తొమ్మిదిసార్లు ప్రతిదినము పఠించుటకు గణపతి నియమమును బూనెను. ఈ రీతిగా నవవాసరములు గతించుసరికి దేవి సంప్రీతురాలైనది కాబోలు భువనమోహన రూపమున నా తొమ్మిదవ వారములో తుది రాత్రి దర్శనమిచ్చి, పుత్రుని జేరదీయు తల్లివలె గణపతిని తనకడకు జేరదీసికొని, యొక బంగారు గిన్నెనుండి మధువును ద్రావబెట్టెను. త్రాగునంత సేపు అతనియం దామె మందహాస శీకరములను వెదజల్లుచు తన యనుగ్రహమును రెట్టింపుజేసెను. అప్పుడు వాసిష్ఠు డొక ఱాతిపై వెన్నెల సుఖము ననుభవించుటకు గూర్చుండియుండెను. అందువలన నిది స్వప్నదర్శనము కాజాలదు. దేవి యంతర్ధానమైన పిదప బాహ్యస్మృతికి వచ్చి వాసిష్ఠుడు పెదవి తడుముకొని చూడగా మధువింకను పెదవుల నంటియుండెను. మఱియు తన పద్యగద్యములం దానాటినుండి తనకే విస్మయమును గొల్పునట్టి

మాధుర్యము, బుద్ధియం దొకానొక సూక్ష్మత్వము గోచరింపజొచ్చెను. ఆ మందహాస తత్త్వమును తనివిదీర గ్రోలిన గణపతి కది నిత్యస్మరణీయమై తన గ్రంథము లన్నింటియందు స్తుతిభూతమై వెలసినది.

ఆ రాత్రియే గ్రామమం దింకొక విచిత్రము సంభవించి, యదియును వాసిష్ఠునకే జెందియుండెను. డెబ్బది సంవత్సరముల వయస్సుగల యొక ముదుసలి కారాత్రి స్వప్నమందు చిరకాలముక్రింద మరణించిన 'లంబోదరదా'సను పేరుగల తన భర్త నిజనరాకృతితో నొకసారి, విఘ్నేశ్వరాకృతితో నింకొకసారి యిట్లు రూపములను మార్చుచు నగపడి 'నే నిప్పుడు వాసుదేవాలయమునకు వెనుక నుంటి'నని చెప్పి మాయమయ్యెను. మఱునా డుదయమున నామె పుత్రుడైన భాస్కరదాసునకు తన స్వప్నము నెఱిగించి, వాసుదేవాలయపు వెనుక భాగమం దేదైన గణపతి విగ్రహము వెలసెనేమో చూచి రమ్మని పంపెను. అతడు వెంటనే యా ప్రాంతమునకు వచ్చి, గణపతిని జూచి, పేరడిగి తెలిసికొని, యింటికి బోయి తల్లి కెఱిగించగా నామె త్రుటిలో స్వప్నార్థమును గ్రహించి పుత్రున కిట్లాజ్ఞాపించెను : "నీ తండ్రి గణపతి భక్తుడు. చిరకాలమునుండి మన కిలవేల్పు గణపతియై యుండెను. నీవు విద్వాంసుడవైనను మన వంశాచారమును పాటింపకుంటివి. నీవు వెంటనే బోయి యా మహానుభావుని శరణుపొంది, యతనికడ గణపతి మంత్రదీక్షను బొంది, యతనికి శుశ్రూష లొనర్పుము, నీకు మేలగును."

భాస్కరదాసు తన తల్లి యాజ్ఞచొప్పున గణపతి నాశ్రయించి, మంత్ర దీక్షను బొందెను. భక్తిచే నతడొనర్చు నుపచారములవలన గణపతి సుఖియై, నిరంతర జపధ్యానములతో మఱి నాల్గు మాసము లా క్షేత్రమందు గడపెను. ఇంతలో 14-2-1899 తేదీనాడు విశాలాక్షమ్మ ప్రసవించి, పుత్రుని బడసిన ట్లుత్తరము వచ్చెను. ఆమె ప్రసవించిన పూర్వరాత్రి యందు గణపతి తన స్వప్నమందొక ధేనువు వత్స నీనినట్లు జూచి, పురుటివార్త వచ్చునని గ్రహించి, మంత్రధ్యానము నాపుచేసెను. పురుడు వచ్చినప్పుడు రక్తసంబంధీకులకు శాస్త్రమందాశౌచము విధింపబడినందున మంత్రదీక్ష నాపుచేయవలసివచ్చెను. అశుచికాలము ముగియుసరి కింటికి చేరవలెనని గణపతి భువనేశ్వరమునుండి ప్రయాణమయ్యెను. కాని వైతరణీనదిని దాటినంతనే బుద్ధి మారిపోయి, విరజాపుర మందు తపస్సు చేయుట కక్కడ విరజాంబికానాథుడైన సిద్ధేశ్వరాలయమును ప్రవేశించెను. రెండు మాసములు తపము సల్పినను వాసిష్ఠున కచ్చట నెట్టి దివ్యానుభవము గలుగనందున నతడు స్వగ్రామమునకు బోయెను.

నాసికయందు దర్శనమైన మహాదేవుని యనుగ్రహ ఫలముగా నీ పుత్రు డుదయించినట్లు తలపబడినందున వానికి 'మహాదేవు'డను నామకరణము నరసింహశాస్త్రి యొత్తిడిచే జేయబడెను. కాని, నాసిక యందా మహాదేవుడు గణపతి

నెట్టి బాధలకు పురము జేరినప్పటినుండి గురిజేసెనో, అట్టి బాధల కించుమించుగా నీ బాలమహాదేవుడు పుట్టిననాటి నుండి యింటికడ గురిజేయజొచ్చెను. ఎట్లనగా, పుత్రపోషణ మొక బాధ్యతయై గణపతినప్పుడే కలవరపెట్టజొచ్చెను. పుత్రున కది యిదియని యలంకారము జేయగోరుచు నట్టి విషయములలో తల్లి యెప్పుడును స్వాతంత్ర్యము నపేక్షించి తనదిగా వాడుకొనుటకు కొంత ధనము గోరుచుండును. ఇట్టి కోర్కె స్త్రీల కందఱకు సహజమైనప్పుడు విశాలాక్షమ్మకు మాత్ర మేల యుండదు ? తప్పక యుండెను. అంతేకాక, ఆమె యవసరమునకు భర్త తన తండ్రిని చీటికిమాటికి యడిగి తెచ్చుకొనుట కామెకు సిగ్గయ్యెను. కనుక 'కఱ్ఱ విఱుగకుండ పాము చావకుండ'నను సామెత చొప్పున నామె దీని కుపాయము నాలోచించి యొకనా డిట్లు భర్తతో ముచ్చటించెను: ''సంవత్సరమం దాఱు మాసములు సంసారమందుండుటకు మీరంగీకరించిరి. కనుక నాయాఱు మాసములు మీరేదైన నుద్యోగమును జేయుటకు సమ్మతించినచో మీకది దుస్సాధ్యమగునా? ఎన్నటికిని కాజాలదు. మీరట్లు చేసినచో మీ తండ్రికి మన భారము తగ్గును, మనకు స్వేచ్ఛ యుండును. ఆ యాదాయములో నేనెట్లో కొంత మిగుల్చుకొనుచు మిగిలిన యాఱు మాసములు మీరు తపస్సున కేగినప్పుడు నా యవసరములు నేను గడుపుకొందును. దీనివలన నాకు గూడ క్రమముగా తపస్సున కవకాశము, స్వేచ్ఛయు లభించవచ్చును. ఇది నా యభిప్రాయము.''

ఆమె యభిప్రాయము గణపతికి సమంజసమనియే తోచెను. కనుక నుద్యోగ ప్రయత్నమునకు బూనుకొనెను గంజాం జిల్లాలోని క్రొత్తగ్రహార సంస్కృత పాఠశాలయందొక పండితుడు కావలెనను వార్త విని గణపతి క్రొత్తగ్రహారము వెళ్లి యధికార్లను జూచెను. వారు యథాధోరణిలో ''మీ యొద్ద శాస్త్రపరీక్షయం దుత్తీర్ణులైనట్లేదైన సర్టిఫికెట్టులున్నవా ?''యని ప్రశ్నించిరి. సర్వశాస్త్రములు కరతలామలకమైయున్నను, సర్టిఫికెట్టు లేని లోపమునకు సిగ్గుజెంది తన ప్రయత్నము నప్పటికి వాసిష్ఠుడు విరమించుకొనెను. పిమ్మట నింటికి చేరక, తిన్నగా గోదావరీతీరమందున్న ధవళేశ్వరము బోయి, యక్కడకు సమీపమున విజనమైయున్న యొక లంకలో తపస్సును జేయబూనెను. వెళ్లునప్పుడు కొన్ని యరటిపండ్లను కొని తీసికొనివెళ్లెను. ఒక వారము దినములా పండ్లు వచ్చెను. అటుపిమ్మట ప్రతిదినము ప్రోగుజేసిన తొక్కలనే భుజించుచు నింకొక వారము గడపుకొనెను. ఇంతలో అరటిపండ్ల తొక్కలను తినిన ఫలము రక్తగ్రహణి రూపమున గోచరించెను. ఇంక చేయునది లేక చెంతనున్న కేశనకొఱ్ఱు అగ్రహారము బోయి, యక్కడ నొక గొప్ప తర్క వేదాంతశాస్త్ర పండితుడుండుట విని, గణపతి వాని యింట బసచేసి, యొకవంక నారోగ్యమును చేకూర్చుకొనుచు, నింకొకవంక తర్కవేదాంతము లందు తాను చదువవలసిన అధిక భాగముల నా పండితుని కడ పాఠము

మొదలిడెను. ఈ సాహసమున కక్కడివారు నివ్వెఱబోయిరి. మఱియు రెండు మాసములలో రెండు సంవత్సరములకుగాని సాధారణుల కలవిగాని పాఠమును గణపతి పూర్తిగావించుటకు గురువే విభ్రాంతుడై, గణపతిని దివ్యాంశ సంభూతునిగా గుర్తించి, యతనిని స్వయముగా కలువతాయి దిగబెట్టెను.

అటుపిమ్మట గణపతి పట్టుదలతో మూడు నాల్గు మాసములు ప్రాచీన గ్రంథములను, నీతిశాస్త్రమును, పాణినీయ వ్యాకరణమును పరిశీలించి, యితరుల సహాయము లేకనే పాతంజలి భాష్యమునుగూడ సవిమర్శగా చదివి ముగించెను. ఈ యత్నమంతయు పండితుల నోడించుటకై చేసి, 1900 సం॥ ములో తెనుగు సంవత్సరాదినాటికి మందసా సంస్థానాధిపతిని దర్శించెను.

మందసా సంస్థాన మాంధ్రోత్కళ మధ్యప్రదేశమందున్నది. ఇచ్చటి రాజు బహుళ సంపన్నుడుగాకున్నను, రసికజనులను తగురీతిని బోషించుటయందు శ్రద్ధగలవాడు. సంవత్సరాదినాడతడు పండితులను సత్కరించుటకు సభ గావించువాడు. అట్టి సభయందు వాసిష్ఠునకొక యష్టావధానము కల్పింపబడెను. రాజీ యవధానమును సావధానముగా జూచి, గణపతి యాశుకవితాధార కబ్బురపడి, యతనిని తన యాస్థానమందుంచివేసికొనుట కుద్దేశించెను. కాని, గణపతి యాశయము వేఱని యూరకుండెను. ఈ సభయందేదైన పండిత సంవాదము తటస్థించునని గణపతి తలచెను. రాజపుత్రునకిది తెలిసి తండ్రితో చెప్పగా నత డట్టి యవకాశమును కల్పించుటకు గణపతి నుంచివేసి, తన ప్రియబాంధవుని వలె నాదరింపజొచ్చెను.

రాజపుత్రు డొకనాడు గణపతి నాశ్రయించి శివపంచాక్షరీ మంత్రము నుపదేశింప వేడెను. గణపతి యుపదేశించుట కంగీకరించి, తొలుత రాజాజ్ఞను పొందుమని యతనికి జెప్పెను. రాజందులకు సమ్మతించినను, ప్రాచీనాచారము చొప్పున రాజగురువు నడుగ బంపెను. ఈ రాజగురువొక వైష్ణవ పండితుడు, మంత్రవేత్త. ఇతడు రాజులకు శివమంత్రము అమంగళకరమని పల్కి, యూరకుండక గణపతి కీమాత్రము తెలియలేదాయని పరిహసించెను. రాజయువరాజుల హృదయములు గణపతి కంకితమై పోవుచుండెనను నీర్ష్య యతని నిట్టి పరిహాసమునకు పురిగొల్పెను. రాజతనిని మందలింప జూచెను గాని యతడు తన కులగురు పదమును స్థిరబఱచుకొనుటకు మఱింత బిగిసెను. తారతమ్యము నెఱుగక గణపతిని దూయుచున్న నితనికి తగురీతిని పాఠము చెప్పదలచి, రాజొకనాడు పండితసభ గావించి, యతనికిని, వాసిష్ఠునకును మతవాదమును కల్పించెను. కొంతవాద మగుసరికి గణపతి యుక్తుల కతడు తొట్రుపడుచు, నోటమి జెందుటకు సహించలేక, గణపతిపై వాగ్బంధ మంత్రమును బ్రయోగించెను. మంత్రమూర్తియైన గణపతి యీ ప్రయోగమును త్రుటిలో గ్రహించి, దానిని వశమొనర్చుకొని, వైష్ణవపండితు

నుద్దేశించుచు నిట్లు పల్కెను; ''ఓయీ ! వాక్కునందు పసలేని నీకు వాగ్బంధ మంత్రమందెట్లు పసగల్గును ! ఇట్టి యత్నములపై నాధారపడి చెడిపోకుము. వాదము నింక చేయజాలనిచో నా పాదమును ధరింపుము, నిన్ను విడిచెదను.'' ఈ పల్కులవలన కులగురుని దుష్కార్య మందఱకు విశదమయ్యెను. కులగురువు సిగ్గుపడి రాజును శరణుగోరెను. రాజంతట సభను చాలించి, గణపతిని కౌగిలించుకొని, తన పుత్రున కతనిచే శివదీక్ష నిప్పించెను.

ఈ సభయందు గెల్చిన వాదమునకు, నంతకు పూర్వము గణపతిచే ప్రదర్శింపబడిన యష్టావధానమునకు గలిపి రాజెంత కట్నమునిచ్చునో యని పండితులందరు కుతూహలపడజొచ్చిరి. మంత్రికిని యీ కుతూహలమే జనించి, యొక్కనాడు రాజాభిప్రాయమును వినగోరి యడిగెను. వెంటనే రాజు ''గణపతి శాస్త్రిగారికి నా పుత్రునే కట్నముగా నిచ్చితినిగదా''యనెను. ఈ వాక్యమునకు మంత్రి మాఱుపలుకజాలకపోయెను. గణపతి చెవినిది సోకినప్పు డతడు రాజ్యలక్ష్మిని పొందినంతటి సంతోషమును బొందెను. ఈ రీతిగా సోదరభావమును రాజు ప్రదర్శించుచుండ, పితృభావమును యువరాజు ప్రదర్శించుచుండ, నుభయుల గౌరవాదరములు నుప్పొంగిన హృదయముతో గణపతి గైకొనుచు నించుమించుగా రెండున్నర మాసములు మందసాయందుండిపోయెను.

ఆ సమయమందు జరిగిన ఇంకొక విచిత్ర మిక్కడ చెప్పదగియున్నది. ఒకనాడు 'నిష్ఫల రామదాసు' అను పేరుగల బ్రాహ్మణు డా యూరు వచ్చెను. అతడొక గొప్ప యోగివలె నటనజేయుచు నొకని యింట బసచేసి, రాజు నెట్లయిన నాకర్షించుటకు యత్నించుచుండెను. అతని శిష్యుడొకడు తన గురు ప్రభావము నప్పుడే చాలమందికి జూపి వ్యాప్తము చేసెను. ఆ ప్రభావ మెట్టిదనిన, యోగిపుంగవు డభ్యాసకాలమున భూమినుండి గాలిలోనికి లేచినట్లు చెప్పబడెను. క్రమముగా రాజువఱ కీ వార్త వ్యాపించగా, రాజొకనా డా యోగి నాహ్వానించెను. యోగిని జూపి రాజు గణపతి పండితుని యభిప్రాయమును రహస్యముగా నడిగెను. అప్పుడు గణపతి ''ఓ రాజా ! నాకు వీనియందు యోగలక్షణములు గానరాకున్నవి. ఇప్పటి కితనిని పంపివేయు''డని బదులిడెను. రాజట్లే చేసెను. మఱునా డుదయమున గణపతి రాజుకడకు బోయి, ''మన మొకసారి యోగి వద్దకు వెళ్లి వాని ప్రభావమును జూచివత్తమనెను. రాజంగీకరించెను. వెంటనే యిరువురును యోగియున్న బసకు వెళ్లిరి. అక్కడ జనులు మూగియుండిరి. కిటికీనుండి యోగి యొక చీకటి గదిలో గాలియం దెగసి కూర్చుండి ధ్యాన మగ్నుడై యున్నట్లగపడెను. అది చూచి గణపతి యిట్లు రాజుతో చెప్పెను ''రాజా ! చూడుడీ ! యోగి గాలిలేని గదిలో కప్పుకొని కూర్చుండెను. శబ్దము వలన యోగ భంగము గాకుండుట కితడు వీధివైపు కిటికీని మూయుట మాని దానినే తెరచి, పెరటి వైపున నున్న

తలుపును, కిటికీనికూడ బంధించెను. ఇందేదో నిశ్చయముగా మోసమున్నది. తలుపులు పగులగొట్టింపుడు, మోసము బయల్పడును.'' శిష్యుఁడట్టి కార్యము పాపకరమని బెదరించెను. రాజు వినుపించుకొనక తలుపు పగులగొట్టుట కాజ్ఞనిచ్చెను. అది విని యోగి లాభము లేదని తలచి తానే తలుపు దీసెను. ఆహా! పొట్ట కొఱకెట్టి మోసము చేయబడెను! తూనిక తూచుకొను పెద్ద కాటా యొకటి దూలమునకు వ్రేలాడుచున్నది. ఒకప్రక్క హెచ్చుబరువు వుంచబడెను. రెండవప్రక్క యోగి కూర్చుండి మీదకు లేవగల్గెను. త్రాళ్లగపడకుండ నల్లరంగు పూయబడెను; తక్కెడ యగపడకుండుటకు యోగి కప్పుకొనెను. వానిప్పుడా యోగిని 'కాటా యోగి'యని పిలిచెను అతడు సిగ్గుచే తలవంచుకొనెను. జాలిచే రాజు వానికి కొంచెము ధనమిచ్చి వెంటనే యూరినుండి పంపివేసెను. గణపతి బుద్ధికుశలత కందఱు మెచ్చుకొనిరి.

మఱికొద్ది దినములలో నవద్వీపమందు పండిత పరీక్షలు కాబోవుచున్న ట్లొకనాడు వార్త దెలిసి గణపతి నుద్దేశించి రాజిట్లుడివెను: ''మీరు నవద్వీపము వెళ్లి, పండిత పరీక్షయందు బాల్గొని, విజయవంతులై రావలెనని నా యాశయము. ఆంధ్రపండిత ధ్వజ మొకప్పు డన్ని రాష్ట్రములందును ప్రకాశించెను. దానికి మీవలన పునర్జీవితము రాగలదని నేను గాఢముగా నమ్ముచుంటిని. మీరు 'సరే'యనినచో నేనొక్క క్షణములో సన్నాహము జేసెదను.'' గణపతి యొక్క క్షణమాలోచించెను. ఈ రాజువంటి మిత్రుడు తనకు దుర్లభుడనిపించి ''సరే, నేను వెళ్లెదను. అదృష్ట వశమున కాశిలో శివకుమారు డిచ్చిన లేఖ నాయొద్దనున్న సంచిలోనే యున్నది. మీ ప్రబోధము జయప్రదమగుగాక!'' యని గణపతి యుత్సాహముతో పల్కుసరికి రాజు ముఖము వికసించెను. వెంటనే ప్రయాణమున కేర్పాట్లు గావింపబడెను. నవద్వీపములో గణపతికి వంట చేసిపెట్టుటకు వేంకటరాయుడను నొక బ్రాహ్మణుని, కాశీనాథుడను నింకొక బ్రాహ్మణుని ఇతర సేవ లొనర్చుటకును సన్నద్ధపరచి, గణపతితో రాజిట్లనెను: ''వీరు నియమములందారితేరినవారు, సుశిక్షిత తపోవ్రతము గలవారు, నిర్మలచిత్తులు. వీ రీయూరివారే. కాశీయాత్ర చేయుటకు నన్ను సహాయము వేడుచున్నారు. మీ కీ ప్రయాణములో తోడుగానుండి మీకు తగు పరిచర్యలొనర్చిన పిదప కాశికి పొమ్మని పంపుచుంటిని. గనుక మీవెంట రానిండు.'' గణపతి సంతసించి పయనమయ్యెను. వెళ్లురోజున సత్యనారాయణయను నింకొక యాత్రికుడు తోడయ్యెను. ఇతడు కలకత్తావఱకు వెళ్లి, యటునిమ్మట తన దారిని బోయెను. మిగిలిన యిద్దరి తోడను గణపతి సుఖముగా నవద్వీపము చేరెను.

* * * *

## నాల్గవ ప్రకరణము

# నవద్వీప విజయము

అమరావతి, నలందా, ఉజ్జయిని, నవద్వీపము అను నాలుగు పట్టణములు మన దేశమందు చాలకాలము సకల శాస్త్రములకు, ఖగోళాది పరిశోధనలకు నిలయములై, విశ్వవిద్యాలయ కేంద్రములై విలసిల్లి బహుళఖ్యాతి బడసియున్నవి. వానిలో మొదటి మూడును మన కథాకాలము నాటికి క్షీణించిన కారణమున నవద్వీపమొక్కటి మన దేశమునకంతకు ప్రాచీన విద్యాబోధకేమి, నానాశాస్త్ర విద్వత్పరీక్షలకేమి యాధారకేంద్రమై యొప్పుచుండెను. ఇక్కడ పాఠశాలలతో పాటు 'హరిసభ' యను నత్యంత విశాలమంటప మొకటి కలదు. దీనియందు సంవత్సరమున కొకపరి నానా రాష్ట్రములనుండి వచ్చు పండితులను పరీక్షించి, వారి వారి పాండితీ జ్ఞానమున కుచితములగు బిరుదముల నిచ్చుటకు సభ గావింపబడును. ఈ పరీక్షలను తగురీతిని నడపుట కొక వర్గమున్నది. మన కథాసమయమున నా వర్గ కార్యదర్శి 'శితికంఠ వాచస్పతి'యను పండితుడై యుండెను. పరీక్షలలో ప్రవేశలాభము నిచ్చుట కొక యుపసంఘ సహాయమున నితడే నిర్ణయించువాడు. ఈ ప్రవేశలాభమే సాధారణ పండితులకు దుర్లభమై యుండెడిది. ఒకవేళ ప్రవేశలాభము ప్రాప్తించినను, వర్గమువారిని పరీక్షలందు మెప్పించుట కడు దుస్తరమని చెప్పవచ్చును. కనుకనే నవద్వీప పరిషత్ప్రశంసా పత్రములకు, నిక్కడి బిరుదములకు నాసేతుహిమాచల పర్యంతము గౌరవ ముండెడిది. అట్టి పత్ర సంపాదనమే లక్ష్యమై వాసిష్ఠు నక్కడకు గొంపోయెను. అతనియందు వివిధ శాస్త్ర కవిత్వాది పాటవము లదివఱకే పాకమై, భువనేశ్వరీ మధుకటాక్షమువలన వన్నెకెక్కియున్నను, వాని వన్నెను పడికట్టు నికష మక్కడనేగదా యున్నది.

కాశిలో శివకుమార పండితు డొసగిన లేఖను శితికంఠ వాచస్పతికి జూపి పరీక్షలో ప్రవేశలాభమును వాసిష్ఠుడు పొందగోరి, నవద్వీపము చేరినంతనే వాచస్పతి యుండు వ్యాకరణ పాఠశాల కొఱ కన్వేషించెను. కాని, దినమంతయు తిరిగినను తన కా పాఠశాల తెలిసినది కాదు. పరీక్షా దివసములు సమీపించినందున పురమంతయు కోలాహలమై వందలాది పండితులతోడను, సభను జూచుటకు వచ్చిన వేలకొలది ప్రేక్షకులతోడను నిండియుండెను. వ్యాకరణ పాఠశాలకు దారి నడుగగా కొందఱు ముందువారి నడుగుమనిరి; మఱికొందఱు మాటయే మాణిక్యమనివట్లూరకుండిరి. ఇంకను కొందఱు గణపతి దాక్షిణాత్యుడని తెలిసి ముఖము ద్రిప్పుకొనిరి. మచ్చునకైన నొక్క దక్షిణ దేశస్థుడు గణపతి కగపడలేదు; ఉత్తర దేశస్థులకు దాక్షిణాత్యులపై సామాన్యముగా నుండు అసహన మనుభవగోచర

మయ్యెను. ఇట్లుండ, మరుమధ్యమందు పచ్చగడ్డి లభించునట్లు సాయంత్ర మగుసరికొక మిథిల దేశ పండితుడు లభించెను. అతడు వాసిష్ఠుని ప్రశ్నల కుత్తరువులనిచ్చి, యాపూట కింక వాచస్పతి దర్శనమగుట కష్టమని చెప్పి, తన కేర్పాటుగావింపబడిన బసయందా రాత్రికి గణపతికిని, అతని వెంటనున్న అనుచరుల కిద్దరికిని అతిథ్యమిచ్చి యాదరించెను.

ఈ మిథిల దేశ పండితుని పేరు కులాభిజ్ఞుడు. ఇతడు రాత్రి కొంతతడవు గణపతితో వ్యాకరణాలంకార చర్చలను సల్పిన పిదప పరీక్షలకు గణపతి యర్హుడని నిర్ణయించెను. అంతేకాక మఱునాడతడు తన యభిప్రాయమును వాచస్పతి కెఱిగించి, యతనిని తొలుత సుముఖునిగా జేసిన పిమ్మట గణపతి నతని కడకు గైకొనిపోయెను. వాసిష్ఠుడిచ్చిన శివకుమార పండితుని లేఖ నతడు తెరచినంతనే లేఖోపరిభాగమందు, "దేవాసుర సమీకేషు బహుశోఽదృష్ట విక్రమః!" అని వ్రాయబడిన శ్లోకభాగమును జదువుసరికే గణపతి పాండిత్య విషయమై వాచస్పతికి సర్వసందేహములు తొలగెను. (ఈ శ్లోకము రామాయణములోనిదై, హనుమంతుని యుద్ధపరాక్రమము దేవతా ప్రశంసనీయమని కీర్తించుచున్నది.) అటుపిమ్మట వాచస్పతి గణపతికి ప్రత్యేక పరీక్ష చేకూరున ట్లేర్పాటుగావించి, తనయొద్దనే యతనిని పరీక్ష ముగియువఱకు నుంచుకొనెను.

పరీక్షాదివసములు ప్రారంభమయ్యెను. శాస్త్రసాహిత్యమందును. ఆశుకవిత్వ మందునుగూడ నుత్తర భారతదేశమునకు మేటియని కీర్తిగాంచిన 'అంబికాదత్తు' పరీక్షా వర్గమున కాయే దధ్యక్షుడై, సభనప్పుడే యలంకరించి యుండెను. వాచస్పతి గణపతిని వెంటనిడికొని సభ ప్రవేశించుచుండ, బాలపండితుడెవడా యని సభ్యులాశ్చర్య విభ్రమములతో జూడదొడగిరి. చిన్నవయస్సైనను, సాహిత్య సంపదయం దీడుజోడు లేనివాడై, గణపతి భువనములనే తృణీకరించు దృష్టితో నడచుచుండ, మనుష్య రూపమున వచ్చిన గణపతివలెనే ప్రకాశింపజొచ్చెను,

ఈ విధముగా చెన్నంటి వాసిష్ఠుడు వెంబడింప, వాచస్పతి తన యాసనమును జేరుట కధ్యక్షపీఠము ముందుండి పోదొడగెను. సభ నధ్యక్షుడు ప్రారంభించులోపున నతనికి గణపతి నొకసారి పరిచయ మొనర్చుటకు వాచస్పతి యట్లు పోవలసివచ్చెను. అంతలో నధ్యక్షపీఠము నలంకరించిన గంభీరాకృతిని వాసిష్ఠుడు జూచి, యతడే పరీక్షకుడని యెఱుగక, "కోసౌ మహాశయః" అని బాల్యచాపల్యముచే వాచస్పతి నడిగెను. అంత సమీపమునకు వచ్చి, యతనికి వినబడునట్లడుగుటకు వాచస్పతి యొక్క క్షణము తెల్లబోయెను. సరసుడైన అంబికాదత్తు డదిగాంచి, యభయ మిచ్చినట్లు మందహాసమొనర్చి, తన దేశ-నామ- సామర్థ్యములను వాచస్పతి చెప్పులోపున తానే పద్యరూపమున పరిచయ మొనర్చుకొని గణపతివైపు జూచెను :

శ్లో॥ "సత్వర కవితా సవితా గౌడోఽహం కశ్చి దంబికాదత్తః॥"

ఒక్క సగమందే అంబికాదత్తు తన విషయము నిమిడ్చి, రెండవ సగమును చమత్కారముగా విడిచి పుచ్చెను. ఇతడే పరీక్షకుడైన అంబికాదత్తనియు చమత్కారము నెపమున నప్పుడే పరీక్షకు దీకొనుచుండెననియు గణపతి త్రుటిలో గ్రహించెను. గ్రహించినంతనే తన్నెతిగించుకొను వాక్యము హృదయసమావర్జన పటుతరమై బాలకోకిల కాకలీధ్వనులతో గణపతికవి ముఖమునుండి వెడలి, శ్లోకమును పూరించి, సభాసదుల దృష్టి నాకర్షించెను. ఆ వాక్యమిట్లున్నది:

శ్లో॥ "గణపతి రితి కవికులపతి రతి
దక్షో దాక్షిణాత్యోఽహమ్॥"

ఈ విధముగా గణపతియు తన దేశ-నామ-సామర్థ్యముల నొక్క పాదమందే యిమిడ్చి, యధ్యక్షునికంటె తానధికుడగునట్లు 'కవికులపతి' యని చెప్పకొని యూరకుండక, "భవాన్దత్తః, అహంత్వౌరసః" అను వచనముచే అంబికాదత్తుని పరిహాసముగూడ చేసెను. (అనగా, నీవంబికకు దత్తుడవగుదువు, నేనౌరసపుత్రుడను సుమాయని భావము). ఈ సాహసమునకు సభ్యులందఱు నివ్వెఱబోయిరి. అంబికాదత్తు కవిసింహమని యెఱుగక, మీసములుబట్టి పరిహసించు బాలుడేమగునో యని భయముజెంది వాచస్పతి తానున్నకడనే స్తంభించిపోయి, తన యాసనమును చేఱుట మఱచెను. అంబికాదత్తు దొక్కడే చలించనివాడు. అతడు బాలుని పస నెఱిగికొని, వెంటనే యథావిధిని పరీక్షింపదలచి, వేదికపైకి రమ్మని సంజ్ఞచేసి, యొకదాని వెనుక నొకటిగా నాల్గు సమస్యలను పూరించుటకిచ్చెను. ఇచ్చుటయే తడవుగా బాలకవి యొక్కొక్క దానినే పూరించి తన కవితాపటుత్వమును ప్రదర్శించెను. పూరింపబడిన శ్లోకము లీ దిగువ విధమున నున్నవి. వానిలో సమస్యాభాగముల దిగువను గీత గీయబడెను.

శ్లో॥ "హిడింబా భీమదయితా నిదాఘే ఘర్మపీడితా।
స్తనవస్త్రం పరిత్యజ్య వధూః శ్వశుర మిచ్ఛతి॥" 1

(కింత్యనవద్యచరితా)

(అనగా భీముని భార్యయగు హిడింబ ఉక్కకోర్వలేక, తన మామ గారైన గాలి నిచ్ఛగించి, స్తనవస్త్రమును విడచెను.)

(ఈ సమస్యను హిడింబ పరముగా పూరించుటకు గణపతి తన కారణముల నిట్లు సభయందు వివరించెను: "భీమసేనుడు వాయుపుత్రుడని భారతమందు ప్రసిద్ధిగలదు. అతని భార్యగా ద్రౌపదిని పేర్కొనవలెనని పరీక్షకు డూహించి యుండవచ్చును. కాని నాచే హిడింబ పేర్కొనబడెను. ఎందువల్లననగా, హిడింబ ప్రత్యేకముగా భీముని భార్య కాగా, ద్రౌపది పాండవులైదుగురకు భార్యయగుచున్నది. మఱియు, రాజపుత్ర స్త్రీయైన ద్రౌపది గాలి కొఱకు తన స్తనవస్త్రమును దీసెనుట

ఉచితముగాదు. హిడింబ యరణ్యప్రాకృత స్త్రీ యగుటచే నామె కది చెల్లును. రాజపుత్ర స్త్రీలకు లోనివస్త్రముగాక పైని ఉత్తరీయముండును గనుక ద్రౌపది నుద్దేశించినచో సమస్యయందు 'ఉత్తరీయం పరిత్యజ్య' అని యిచ్చియున్నచో పరీక్షకుని యుద్దేశము నిరాక్షేపణమై యుండెడిది.)

శ్లో॥ "చతుర్థ్యాం భాద్ర శుక్లస్య చంద్రదర్శన శంకయా:।
వత్సరస్యైకదా గౌరీపతివక్త్రంన పశ్యతి॥" 2

(అనగా, భాద్రపద శుద్ధ చవితినాడు చంద్రదర్శనమగునను శంకచే సంవత్సరమున కొకసారి గౌరీదేవి తన భర్త ముఖమును చూడదు-శివుని శిరస్సున చంద్రుడున్నందున.)

శ్లో॥ "రాహుస్త్రికోణే చ గురుస్తృతీయే।
కళత్ర భావే చ ధరా తనూజః॥
లగ్నేచ కోష్ఠే యది బాలకః స్యాత్।
సూర్యః శశాంకేన సమం వినష్టః॥" 3 (న త్వమావాస్యా)

(అనగా, పంచమ - నవమ స్థానములలో నొకదానియందు రాహువు, తృతీయమందు గురువు, కళత్ర స్థానమందు కుజుడు ఉండగా పుట్టిన బాలునకు లగ్నమందు సూర్యచంద్రులున్నను అరిష్టముండును.)

శ్లో॥ "సతీ వియోగేన విషణ్ణ చేతసః।
ప్రభోః శయానస్య హిమాలయే గిరౌ॥
శివస్య చూడాకలితం సుధాశయా।
పిపీలికా చుంబతి చంద్రమండలమ్॥" 4

(అనగా, దక్షయజ్ఞమందు సతీదేవిని గోల్పోయి, విషణ్ణచేతస్కుడై, శివుడు హిమవన్నగముపై బండుకొనియుండగా అతని శిరోభూషణమగు చంద్రుడు భూమి కంటియుండెను. అదే సమయమని యెంచి, చంద్రునియందు సుధ యున్నందున, పిపీలికములు చంద్రమండలమును చుంబించెను.)

కవిత్వము నిట్లు పరీక్షించిన పిమ్మట వ్యాఖ్యాన పటిమను పరీక్షించుట కంబికాదత్తుచే రెండు శ్లోకములీయబడెను. అందొకటి రఘువంశమను గ్రంథములోనిది, రెండవది కావ్యప్రకాశ గ్రంథములోనిది. అవి యిట్లున్నవి:

శ్లో॥ "న మృగయాభి రతి ర్న దురోదరం
న చ శశి ప్రతిమాభరణం మధు।
త ముదయాయ నవా నవయౌవనా
ప్రియతమాయత మాన మపాహరత్॥" 1

శ్లో॥ "స్తుమః కం వామాక్షి క్షణమపి వినా యం నరమసే।
విలేభే కః ప్రాణాన్ రణమఖముఖే యమ్మృగయసే॥
సులగ్నే కో జాతః శశిముఖి యమాలింగసి బలాత్।
తపః శ్రీః కస్యైషా మదన నగరిధ్యాయసితుయమ్॥" 2

మొదటి శ్లోకములోని ప్రసక్తి భావాద్యలంకార మాధుర్యములను విపులముగా నుపన్యసించిన పిదప, రసాభాసాలంకార వ్యాఖ్యానమునకై కొనబడిన రెండవ శ్లోకమును గణపతి యందుకొని తన వాగశ్వమును విడిచిపుచ్చి, వివిధ గమకములను ప్రదర్శింపజొచ్చెను. ఈ శ్లోకములోని నాల్గు పాదముల చేతను భర్తను రమించుట, వెతకుట, ఆలింగనము గావించుట, ధ్యానించుట అను వివిధ కామము లొక్క స్త్రీ యందు వర్ణింపబడుచున్నను, 'యం' అని పెక్కుసార్లు వాడుటంబట్టి వివిధ కాముకులందా స్త్రీకుండు నభిలాష లూహింపబడినట్లగుచు, శృంగారరస మాభాసమయ్యెను. ఈ విషయములను విమర్శించునప్పుడు వాసిష్ఠుని వాణి నాలుక యనెడి రంగస్థలమున నృత్య మొనర్చెను. అట్లు చాలసేపు నృత్యము సల్పిన వాణి కొంచె మలసి గాబోలు నొక స్థలమున 'సర్వాసాం' అనుటకు బదులు 'సర్వేషాం' అని తొట్రుపడి, తన తొట్రుబాటును సరుదుకొనుట కాగెను. తప్పు దొరకునాయని నిరీక్షించుచున్న అంబికాదత్తు వెంటనే గణపతి సరుదుకొను లోపున 'విరమతావత్' అని విరమించుట కాజ్ఞనిచ్చి, యీ దిగువ శ్లోకముచే నాక్షేపించెను.

శ్లో॥ "అనవద్యే నను పద్యే గద్యే హృద్యేపి తే స్ఖలతివాణీ।
తత్కిం త్రిభువన సారా తారా నారాధితా భవతా॥"

(అర్థము :- నిర్దుష్టమగు పద్యములో మనోహరమగు వచనమందు నీ వాణి స్ఖలించెను. నీవు త్రిభువనశ్రేష్ఠురాలగు సరస్వతి నారాధించలేదా?)

సుమారొక గంట నుండి గంగా ప్రవాహమువలె బోవుచు, రసికజనుల హృదయములను రసపూరిత మొనర్చుచున్న వాణి యింతసేపు నిర్దోషమై యున్నందులకు గణపతి నభినందించుటకు బదు లతని ప్రవాహమును త్రుంపి, యుత్సాహము నరికట్టి, యతని స్వల్పదోషమున కింతగా నధ్యక్షు డాక్షేపించదలచి నప్పు డత డొక్క వాక్యమును కూర్చి 'సారస్తారా' అని చెప్పుటకు బదులు 'సారాతారా' అని ప్రాసకొఱకు చేసిన అసాధు ప్రయోగమున కెంత నిందార్హుడగునో గదా! అది యత డూహించక గణపతి మనస్సును మాత్రము చివుక్కుమనిపించెను. గణపతి దానిని భరింపజాలక, అంబికాదత్తుయొక్క శ్లోకములోని దోషమును ప్రదర్శించి, యతనిపై ప్రత్యభియోగముగా నీ దిగువ శ్లోకము చెప్పెను.

శ్లో॥ "సుధాం హసంతీ మధు చాక్షిపంతీ
యశోహరంతీ దయితా ఽ ధరస్య।
న తేలమాస్యం కవితా కరోతి
నోపాస్యతే కిం దయితార్ధ దేహః॥"

(అర్థము:- అమృతమును పరిహసించునట్టి, మధువు నాక్షేపించునట్టి, ప్రియురాలి యధరోష్ఠ కీర్తిని హరించునట్టి కవిత్వము నీ ముఖము నలంకరించలే దెందువలన ? నీవు కాంతార్ధ విగ్రహుడగు నీశ్వరు నుపాసించలేదా ?)

దీనితో అంబికాదత్తు పరాభవమును సహించలేని వానివలె పౌరుష వంతుడై, కవిసింహమైనందులకు, గణపతియను కవికుంజరముపై గర్జించుసరికి వ్యక్తిగత సంవాదమారంభమై యొకరినొకరు నిందించుకొనదొడగిరి. ఆ సంవాద మిట్లు జరిగినది:

అంబి:- శ్లో॥ "జ్యోతిరింగణ న కిం ను మన్యసే
యత్త్వమేవ తిమిరేషు లక్ష్యసే।"

(అర్థము:- ఓ మెరుగుడు పురుగా! నీవు చీకటిలోనే కాని వెలుతురులో ప్రకాశించవు - అనగా దోషప్రదర్శనమందే ప్రకాశించుచుంటివని చెప్పుట).

గణపతి :- (రెండవ సగముచే శ్లోకమును పూరించుచు)

శ్లో॥ "కిం ను దీప భవనే విభాససే
వాయునా బహిరహో విధూయసే॥"

(అర్థము:- ఓ దీపమా! నీవు గృహము లోపలనే ప్రకాశింతువు. వెలుపలకు వచ్చినచో గాలిచే కదల్పబడుదువు. అనగా సభలలో నీ పాండిత్యము నిలువ జాలదని చెప్పుట.)

అంబి:- శ్లో॥ "ఉచ్చైఃకుంజరమాకార్షీః బృంహితాని మదోద్ధతః।
కుంభికుంభామిషాహారీ శేతే సంప్రతి కేసరీ॥"

(అర్థము:- ఓ కుంజరమా! మదముచే గర్వించి బృంహిత ధ్వనులను చేయుచుంటివి. ఏనుగుల కుంభస్థలములందుండు మాంసమును హరించు సింహమిచ్చటనే కలదుసుమా !)

గణ:- తిరుగ దోషమే! కర్మధారయ సమాసముపై 'హారి' యను మత్వర్థీయము చెల్లదు. కుంభికుంభామిషాహారః అని బహుబ్రీహి సమాసమును మాని ప్రాసకొఱకే చూచుకొనుచు దోషప్రదర్శనము జేసికొనుచుంటివి.

శ్లో॥ "సమాసీనో రసాలే చేత్ మౌనమావహ మాకలే।
లోకః కరోతు సత్కారం మత్వా త్వా మపి కోకిలం॥"

(అర్థము:- ఓ కాకమా! నీవు మామిడిచెట్టు నెక్కి కూర్చుండదలచితివేని మౌనముగా నుండుట మంచిది. లోకులు నిన్నుగూడ కోకిలయనుకొని సత్కరింతురు.)

పై శ్లోకమును జెప్పి యూరకుండక గణపతికవి యింకొక శ్లోకమునుగూడ చెప్పెను. అనుప్రాసాలంకారములతో గూడిన రసవంతమగు కవిత్వమం దిచ్ఛగలిగిన అంబికాదత్తు ప్రాసపదములు విపత్తున బడుటయు, వికసించవలసిన రసము వికసించకుండుటచే సంకటావస్థను బడుటయు నెత్తిజూపుట కీ శ్లోకమును గణపతికవి చెప్పినను, 'సరోజినీ' యను పద మంబికాదత్తునకు తన ప్రథమ కళత్ర పరముగా స్ఫురించెను. ఆ శ్లోకమిట్లుండెను:

శ్లో॥ ''అపుష్పా చూత లతికా విపన్నా సా సరోజినీ।
హేమంతే హంత! రోలంబ నిరాలంబః క్వమోదసే॥''

(అర్థము:- మామిడి గున్న పుష్పించలేదు - శిశిర ఋతుకాలము రానందున తామరపుష్పము నశించెను. - హేమంతఋతువైనందున. అక్కటా, తుమ్మెదా! హేమంత కాలమంతయు నాశ్రయము లేనిదానవై నీ వెక్కడ సంతోషింపగల్గుదువు ?)

అంబికాదత్తు తన తొలి భార్యయైన 'సరోజిని' చనిపోగా నింకొక భార్యను వివాహమాడి, యామె యింకను పుష్పవతి కానందువలన సంసారమందు సంకటపడుచుండెను. అందువలన తన సొంతవిషయ మతని కేవబారి, తన రహస్యము నుదాహరించిన గణపతి సిద్ధకవియై యుండునని తలచి, వాదము నింక మాని, గణపతి కవిని స్వయముగా నొక యాసనమున గూర్చుండబనిచెను. అంబికాదత్తుని విషాదమును శితికంఠ వాచస్పతి గుర్తించినవారై, సంవాదమట్లు విషాదాంతము గాకుండుటకు ''మీరు సంసార విషయములను, వ్యక్తిగత నిందను మాని, పరిహాసములను జేసికొనినను మీరు గౌడ దాక్షిణాత్యులగుటచే పరస్పరాంతర్జాతి పరముగా జేసికొనుచు సాహిత్య వృత్తాంతములచే వాదము నుపసంహరింపగోరుదు''నని పల్కెను. అప్పుడు-

అంబి:- శ్లో॥ ''భట్టో ఽఖిలో ఽటోపరివారవధ్వా నిపీయ
మధ్వారభతే విహారం॥

(అర్థము:- భట్టులందరు - అనగా దాక్షిణాత్యులు - మేడలపై వేశ్యలతో గూడి మద్యపానముచేసి విహరింతురు.)

గణ :- (స్ఫురించిన బుద్ధితో శ్లోకము పూర్తిజేయుచు)

''అసువ్యయో వాస్తు వసువ్యయో వాఽస్య మీన మీన వ్యసనం త్యజంతి''

(అర్థము:- ప్రాణము పోయిననుసరే, డబ్బు పోయిననుసరే మీరు మీ మీనవ్యసనమును మాత్రము విడువరు.)

గణపతి యిట్లు శ్లోకపూర్తిని గావించనంతనే అంబికాదత్తు లేచి, గణపతి నాలింగనము జేసికొని, యతని కవిత్వ పటుత్వమునకు, నిరర్గళ కవితాధారకు సంతోషమును వెలిబుచ్చెను. గణపతికవియు సవినయముగా తాను వాదధోరణి యందు జూపిన దూషణాపరాధమును మన్నింపవేడెను. అంతట రసికాగ్రగణ్యుడైన అంబికాదత్తు "నీ 'మీన' ద్వయమే నీ యపరాధములను తుడిచిపుచ్చె"నని పల్కెను. (మీనద్వయమనగా "అ+మీన మీన" యని రెండు మీనములను బహూకరించుట. నిజమున కీ పదవిభాగము "అమీ+న+మీన..." అని యుండును.)

అప్పుడు పరీక్షావర్గమువారు గణపతి నింకను బరీక్షింపగోరి, భారతములోని పదునెనిమిది పర్వముల సారమును పర్వమున కొక్కొక్క శ్లోకము చొప్పున 18 శ్లోకములచే 'అపి', 'హి', 'తు', 'చ' అను పదములను ప్రయోగించకుండ చెప్పగోరిరి. వెంటనే గణపతికవి తన కంఠమును విప్పగా, కంఠము నుండి కావ్యములు వెడలునట్లు 18 శ్లోకము లొకదాని వెంబడి యొకటిగా వెడలి భారతేతిహాస పర్వములలోని సారము నత్యంత మనోహరముగా ప్రదర్శించెను. దానితో నధ్యక్షుడు పరీక్షను చాలించుట కాజ్ఞనిచ్చి, సభాసదుల వైపు తిరిగి గణపతికవిని గురించి మిగుల ప్రశంసించిన పిదప 'కావ్యకంఠ' బిరుద మతని కొసంగినట్లు తన యభిప్రాయమును వెల్లడి చేసెను. పరీక్షావర్గమువారిందుల కేకగ్రీవముగా నామోదింప, సభ్యులు కరతాళధ్వనులచే తమ హర్షమును ప్రకటించిరి. పిదప నధ్యక్షుడొసగిన బిరుదము ననుసరించి పరీక్షావర్గము వారొక ప్రశంసాపత్రము నీయగా గణపతి దాని నందుకొని, మందసా రాజున కంపి, దానిని తన తండ్రి కందజేయుడని కోరెను. ఆ ప్రశంసాపత్ర మిట్లుండెను:

## కావ్యకంఠోపహార ప్రశంసాపత్రము

శ్రీమద్గణపతి శాస్త్రిన్ ! క్రీ. శ. 1900 సం॥

సంసారే ఖల్వస్మిన్ కవిత్వమి త్యసముద్ర సముత్థ మమృతం, సుదర్లభంచ తత్. లోకాధిక సాభాగ్యవశాత్ సుప్రసన్న దైవానుకంపయా వా యః కశ్చి దిహ సమధి కురుతే, సచభూస్థోపి స్వర్గీయ ఇతిసస్పృహ మాలోక్యమానో గుణపక్షపాతిభి ర్విద్వద్భి ర్నితరా మాద్రియ తే.

అతోయదద్య శ్రీమద్భిరసాధారణ కవిత్వమిహ ప్రకటయ్య, సుధియః సర్వేసంతోషమాపాదితాః, తేనైవ చరితార్థా నవద్వీపవాసినః కోవిదా వయమ శేష గుణైక ధామ్నే విశాఖపట్టణ ప్రదేశాంతర్గత కలువరాయి గ్రామవసతయే శ్రీమద్గణపతిశాస్త్రిణే తుభ్య మాశీర్వాదపూర్వక మిమం శ్లోక ముపహరామః.



నాసికలో గణపతిముని

'KAVYA KANTHA' CERTIFICATE
from NAVADWIP, Bengal

শ্রীশ্রীদুর্গা—

সহায়

প্র শং সা প ত্র কে তং

# শ্রীমদ গণপতি শাস্ত্রিন্।

সংসারেঽস্মিন্ কবিত্ব বিদ্যাসমুদ্রসমুদ্ভবঃ। সুদুর্লভঃ ক০
লোকাতিগসৌভাগ্যবশাৎ সুপ্রসন্নদেবানুকম্পয়া যা বা কশ্চিৎ সর্বং
কুরুতে স চ ভুবেঽপি স্বর্গীয় ইতি সম্পূহ্যালোক্যমানো গুণপক্ষপাতিভিঃ
ভিরিভবামাশ্রিয়তে।

অতো যদদ্য শ্রীমদ্ভিঃ ব্যাখ্যাকবিভিঃ ... সর্বৈঃ
সন্তোষ মাপাদিতাঃ তেনৈব চরিতার্থা নবদ্বীপনিবাসিনঃ কোবিদা ...
... বিদ্যাবলম্বন ... কলবরাই গ্রাম ... গণপতি-
শাস্ত্রিণে ভুত্য আশীর্বাদপূর্বক মিদং শ্লোকমুপহরাম।

প্রাচীনৈস্তৈঃ কবিকুলবরৈঃ কালিদাসাদিভির্যা
লব্ধা কীর্তিস্তদনুগতয়া যৈন ...
সম্প্রীতো যদিহ কবিভিঃ "কাব্যকণ্ঠো" পহারঃ
তেন শ্রীমানিহ ভুবি ভবানুত্তমশ্চাপি ভূয়াৎ।



కావ్యకంఠ ప్రశంసా పత్రము

శ్లో॥ ''ప్రాచీనై స్తైః కవికులవరైః కాళిదాసాదిభిర్యా।
లబ్ధా కీర్తి ర్భవ దను గతా సైన భూయ దిదానీం।
సద్భిర్దత్తో య ఇహ రుచిరః 'కావ్యకంఠో' పహారః॥
తేన శ్రీమానిహ భువి భవానుజ్జ్వల శ్చాపి భూయాత్॥

శ్రీయుత రాజకృష్ణ తర్క పంచాననః

| | |
|---|---|
| 1823 శకాబ్దీయ, సౌర జ్యేష్ఠస్యాష్టమ దివసే | (మఱి పదముగ్గురు వర్గ సభ్యుల సంతకములు). |

(తెనుగు అనువాదము)

కావ్యకంఠోపహార ప్రశంసాపత్రము

శ్రీమద్గణపతి శాస్త్రిగారూ, క్రీ. శ. 20-6-1900

ఈ భూ సంసారమందు కవిత్వము సముద్రమందు పుట్టని యమృతము, మిగుల దుర్లభమగు దాని నెవరు లోకము కంటె నుత్కృష్టమగు సౌభాగ్యవశము వలన, సుప్రసన్న దైవానుకంపమువలన బొందునో, అట్టి పురుషుడీభూమియందున్నను దేవతాపురుషునివలె గణింపబడి, గుణపక్షపాతులగు బుధులచే మిగుల ప్రీతితో జూడబడి యాదరింపబడును.

శ్రీమంతుడవైన నీ విప్పు డసాధారణ కవిత్వము నిచ్చట ప్రకటించి, సర్వపండిత సమూహమును సంతోషపరచుటవలన నవద్వీపవాసులమగు మేము చరితార్థులమై విశాఖపట్టణ ప్రదేశాంతర్గత కలువరాయి గ్రామనివాసివై, సకల గుణముల కాస్పదుడవై, శ్రీమద్గణపతిశాస్త్రి నామధేయుడవైన నీకు ఆశీర్వాద పూర్వకమగు నీ శ్లోకమును కానుకగా నిచ్చుచున్నాము.

-: శ్లోకార్థము :-

ప్రాచీనులగు కాళిదాసాది కవివర్యు లెట్టి కీర్తిని పొందిరో, వారి ననుసరించిన నీచే నట్టి కీర్తి యిప్పుడు పొందబడెను. ఇక్కడ సత్పురుషులచే మనోహరమగు 'కావ్యకంఠ' బిరుదమేది యొసగబడెనో, ఆ బిరుదమువలన నీ వీ భూలోకమందు శ్రీమంతుడవై ప్రకాశింతువుగాక!

ఓం

అయిదవ ప్రకరణము

# తారామంత్రసిద్ధి

(చతుర్థ తపోయాత్ర)

నవద్వీపములో పరిషత్సభలు పూర్తియైన పిదప మిత్రుడైన శితికంఠ వాచస్పతికడ సెలవుగైకొని, గణపతి తన కాయూర తొలుత నుపకారమొనర్చిన కులాభిజ్ఞుని యనురోధమువలన నతని వెంట మూర్షిదాబాదు వెళ్లుచు, తన యాత్రాసఖులను కాశి పంపివేసెను. మూర్షిదాబాదు రాజుకడ కులాభిజ్ఞు డాస్థాన పండితుడగుటవలన వాసిష్ఠున కుపకార మొనర్పదలచి, యతనికి వెంటనే రాజదర్శనము గావించెను. అంబికాదత్తువంటి మహాపండితునితో వాసిష్ఠుడొనర్చిన నవద్వీప సంవాద కథను రాజు కడు వేడుకతో విని, వాసిష్ఠుని తగురీతిని సమ్మానించుట కొక సభ గావించెను. సభలో వాసిష్ఠుడు మూడు గంటలు కావ్యమును గుఱించి యుపన్యసించి, రాజకడ నేబది రూప్యములను బహుమతి బడసెను.

కావ్యకంఠుని కులాభిజ్ఞు డింకను ఆపదలచెను. కాని, యతడెట్లో విడిపించుకొని యక్కడకు దవ్వుననున్న వైద్యనాథ క్షేత్రమున తపము సల్పుటకు వెళ్లిపోయెను. సుమారొక సంవత్సరమునుండి పుస్తకపఠనమందో, పండితగోష్ఠులందో, రాజదర్శనములందో కాలమును వెళ్లబుచ్చినందుల కతడు దైవమునకు దూరమైపోయినట్లు బాధపడజొచ్చెను. దీనికి తోడు నవద్వీపమం దంబికాదత్తు 'తార నారాధించలేదా?' యని యెత్తి పొడిచిన వాక్యము వాసిష్ఠుని హృదయమందొక గాయమై, యెంత మఱచినను, తా నింతవఱకు తారామంత్రోపదేశమును పొందని సిగ్గును హెచ్చించుచుండెను. తండ్రి నరసింహశాస్త్రి కీమంత్రము తెలియకయే యుపదేశించలేదు. అంతేకాక, ఆంధ్రరాష్ట్రమం దీ మంత్రము నెవ్వరు నభ్యసించినట్లుగూడ వాసిష్ఠుడు వినియుండలేదు. అందువలన దీని నుపాసించు మంత్రవేత్త నా యుత్తర ప్రాంతములందే యెక్కడైన వెతకి యాశ్రయించుట కతడు నిశ్చయించుకొని, తత్సంఘటనమును ప్రాప్తింప జేయుటకు తండ్రియైన ఈశ్వరునే శరణుజొచ్చి శివపంచాక్షరీధ్యానమున నచంచలుడై వైద్యనాథమందు క్షేత్రాలయమున నుపవిష్ఠుడయ్యెను.

వాసిష్ఠున కిక్కడ నింకొకసారి యీశ్వరపరీక్షయైనది. నిందుధ్యానమున నతడు గూర్చుండియుండగా పట్టపగలే తన మూట నెవడో విప్పి, యందున్న విచ్చురూపాయలను తస్కరించి, చిల్లరడబ్బులను, గుడ్డలనుమాత్ర మక్కడ దిగవిడిచి పోయెను. సాయంత్రమైన పిదప గణపతి దీనిని చూచుకొని, లేశమాత్రమైన క్లేశమున

కవకాశమీయక, మఱింత గాఢముగా నీశ్వరపాదమును ధరింపఁజొచ్చెను. ఆలయమునకు వచ్చువారిలో 'సురేశమిత్రు'డను పండితుడొకడు గణపతి యేకాగ్ర ధ్యానమున కాకర్షింపబడి, యతని పరిచయమును జేసికొను నుద్దేశముతో నా తొలి రాత్రియందే చాలసేపటివఱకు వేచియుండెను. సుమారు పదిగంటల రాత్రి యగుసరికి గణపతి కొంచె మాయాసముచే కదలెను. అది చూచి సురేశమిత్రుడు గణపతిని సమీపించి, తన పరిచయమును తొలుత జేసికొని, యటుపిమ్మట గణపతి పరిచయమును గావించుకొనుసరి కుభయుల హృదయము లతుకు కొనెను. అటుపిమ్మట సురేశుని కోర్కె చొప్పున రాత్రు లతని యింట గడపుట కియ్యకొని వాసిష్ఠు డతనివెంట బోయెను.

సురేశమిత్రుడు మహోపాసకుడు, మంత్రవేత్తయని తెలిసినంతనే వాసిష్ఠు డతనితో మఱునాటి రాత్రి కొంత ముచ్చటించిన పిదప తారామంత్రమును గుఱించి ప్రసంగించెను. అతడు మంత్రశాస్త్రములోని తారామంత్ర మంత పటుతరమైనది గాదని పల్కి. కాళిదాసాది పూర్వకవులకు ప్రసన్నమై విద్యాసిద్ధి నొసంగిన తారామంత్రము మంత్రశాస్త్రములో లేకున్నను, పారంపర్యముగా వచ్చుచు, గుప్తమై యున్నదని చెప్పెను. మఱియు నతడా గుప్తమంత్రము తనకు వచ్చునని యెఱిగించుసరికి గణపతి హృదయముప్పొంగి, యీశ్వరానుగ్రహము నప్పుడే పొందినట్లు సంతసించెను. వెంటనే యతడు తనకు గలిగిన సంతాపమును, నవద్వీప చరిత్రమును, భువనేశ్వరీ మధుకటాక్షమైన నాటినుండి తన కాంతర్యమందు వృద్ధి జెందిన అనుభవ విలాసములను సవిస్తరముగా సురేశమిత్రున కెఱుకపఱచి, యతని నా గుప్తమంత్ర మర్థించెను. గణపతి చరిత్రమున కత డబ్బురపడి, యొక సుముహూర్త మున నొక స్త్రీని మధ్యనిడికొని, యామెద్వారా గణపతి కా మంత్రము నుపదేశించిన పిదప నిట్లు హితవు పల్కెను: ''ఈ మంత్రము నీవంటి తపశ్శాలి కచిరకాలములో సిద్ధినొసగును. దీనికి స్త్రీయేకాని పురుషు డెన్నడును గురువు కాఁజాలడు. పురుషు డుపదేశింపవలసినప్పు డొక పవిత్ర స్త్రీని నడుమ నుంచుకొని నేను చేసిన ట్లుపదేశించవలెను. వింధ్యాద్దక్షిణ భాగమందీ మంత్రమును వెలరబెట్టువాడవు బహుశః నీవే కావచ్చును.''

ఈ పవిత్ర మంత్రమును బొంది గణపతి ధన్యుడైనట్లు భావించెను. వెంటనే దానిని మహాదీక్షతో పదిదినములు జపించుసరి కొకానొక యపూర్వానుభవముతో గూడిన సిద్ధి తన మంత్రసాధన విధానమం దీశ్వరకృపచే ప్రాప్తించెను. ఎట్లు ప్రాప్తించెననగా, పదియవనాటి రాత్రి స్వప్నమం దీశ్వరుడగుపడి, నిరుపాధిక విమర్శ యోగమనియు, నిర్విషయ ధ్యానమనియు పిలువబడు స్మృతిమార్గమును జూపి, వాసిష్ఠునిపై విభూతిని జల్లి మాయమయ్యెను. శివదర్శనమగుట గణపతి కిది రెండవసారి. ఇదియును స్వప్నదర్శనమే యైనను, నాటి నుండి యే మంత్రధ్యాన

మతనిచే ధరింపబడినను, లెక్కించుట కలవిగాని త్వరితగతి నది స్మృతిపథమందు సాగిపోవుచు, దానిని గమనించు బుద్ధి దానినుండి ప్రత్యేకమగుట గణపతికి సహజమైపోయెను. ఇది యీశ్వరానుగ్రహముగాక ఇంకేమి కాదగును ?

ఉత్తమ స్తోత్రములకంటె నుచ్చజపము, ఉచ్చజపము కంటె నుపాంశుజపము, ఉపాంశుజపముకంటె మానసిక జపము లేదా చింతనము క్రమముగా నుత్తమములగు చుండ, చింతనముకంటెను మనోవిషయములను గ్రహించు బుద్ధి యొక్క మథనము శ్రేష్ఠతరమని చెప్పక తప్పదు. ఈ విజ్ఞాన మథనమునకు మనోవృత్తి యవసరమైనను, అది సాధ్యవస్తువును సాధింపజేయుట కుపకరణము మాత్రమైయుండి సాధ్య వస్తువు స్థిరమైన పిదప జారిపోవును. కనుకనే యీ సాధన మమృతమథనము వంటిదై, దీనివలన మనోవృత్తి రూపము, దానిని ధరించు ప్రాణము నొక దానినుండి యొకటి వేఱగుచు, రెండింటిని బంధించు అభిమానము విషయ సంబంధమగు రూపము నుండి విడుదలయై, రూపమునకు, ప్రాణమునకు నడుమనుండు భాగమందు పాకమగుచుండును. మృతస్వభావమగు రూపమునుండి విడినను, ప్రాణమునుండి గూడ విడివడు వఱకు అభిమాన మా సంధిభాగమందు కేవలత్వమును పొందదు. ప్రాణము నుండి విడివడుట యనగా చలనము - లేదా గతి - నుండి విడివడుట. తన ప్రాణమునుండి ప్రత్యేకమైన అభిమానముచే ప్రాణి యితరమైన దానిని పొందక తనకు తానే పొందుచుండును. అదియే ముక్తి, యదియే సహజస్థితి యనబడును గనుక నీ స్థితిని పొందుటకు పూర్వమభిమానము మృతస్థితికి దూరమైన అమృత స్థితిని పొందుచున్నదని స్పష్టమగును. విషము పుట్టిన వెనుకగదా అమృత నిష్పత్తి. అది విషమనుటకు హేతువేమి? అభిమానయుతమైన బుద్ధి 'యహమ్మహ'మ్మని స్ఫురించుచు, ప్రాణము యొక్క చలనమనెడి స్పందమును పొందినప్పుడా స్పందమునకు వ్యక్త ప్రకాశము నిచ్చుచు, దానితోగూడియు, గూడకయు కూడ నుండును. స్పందాకృతితోగూడి యహంకార మగుచు, కూడక అహమ్మతి యనబడుచున్నది. అహంకార మితరాకారముల నుండి విడునప్పుడు వానియందున్న మమకారమున నది ఘోషచేసి గర్జించును. ఈ ఘోషయే సాధకునియందు విషప్రాయమై యుండును. ఎప్పుడీ ఘోష చల్లారునో అప్పు డభిమానము అకారము వీడినదై 'యహం'మతి రూపమున మిగిలి, యొకానొక తేజస్స్వ దశచే సూక్ష్మమై, సుఖదాయమగును. అటుపిమ్మట బుద్ధినుండియునది నివృత్తిని బొంది మూలమైన ఆత్మను పొందును. కనుక అభిమాన నివృత్తియందు ప్రాప్తించు ననుభవములను సూచించు కథ అమృత మథన కథయగును. నివృత్తి ప్రారంభమైన గణపతియందీకథ ప్రారంభమైనట్లే మన మెంచవచ్చును. అట్టి ప్రారంభమే యాధ్యాత్మ ప్రపంచమందు సిద్ధించవలసిన తొలిమెట్టి, యటనుండి బుద్ధి తనంతట తాను యంతర్గతులను పొందుచు, తద్గతులందు వివిధ మహిమా

ప్రకాశముల ననుభవమునకు దెచ్చుచుండును. కనుక తారామంత్ర మెట్టి యర్హతను గణపతియందు కల్పించెనో విశదమగును.

ఈ విధమగు ధ్యానస్థాయిని చేకూర్చినది తారామంత్రమైనను, ఆ మంత్రమును. ఫలమునుగూడ ననుగ్రహించినవాడు కాంతార్థ విగ్రహుడైన ఈశ్వరుడు గావున, సకల దేవతాగణయుతుడై యతడు వెలసియున్న కాశికాపుర మింకొకసారి బోయి గణపతి యతని కృపకింకను పాత్రుడు గాదలచెను. కాని, చేత తగినంత ధనము లేక యేమిచేయుటా యని యాలోచించెను. వెంటనే బుద్ధియందా ప్రాంతమున నున్న నొక విచిత్ర సంస్థానాధిపతి స్ఫురించగా, గణపతి సురేశమిత్రుని కడ సెలవుగైకొని, 'గద్వాల'యను పురము జేరి యా సంస్థానాధిపతిని దర్శించెను. ఇతడు చతురంగవేత్తలను ప్రీతితో సత్కరించుచు, నితర పండితులకు గవ్వయైన నిచ్చువాడుగాడు. అష్టదిగ్గజములవలె నెనమండుగురు చతురంగపండితు లతని సభ నలంకరించువారు. కనుక రాజుకడకు వాసిష్ఠుడొక చతురంగ పండితునివలె బోయి, "రాజా! స్వల్పధనార్థినై నేనిక్కడకు వచ్చితిని. నాతో చతురంగమాడు పండితు లెవరైన నీ కడ నున్నచో రావింపుము. వారి నవలీలగా నే నోడించితినేని నాకు పదిరూపాయ లిమ్ము. ఒక్కనిచే నే నోటువడినను నా పందెమును నేను వదలుకొందురు. ఒక్కొక్కరితో నొక్కొక్క యాట చొప్పున అది గెల్చుకొందు"నని పల్కెను. రాజంగీకరించి తన యష్టదిగ్గజములవైపు చూచెను. వా రొకరి వెంట నొకరు గణపతితో నాడి యిట్టి కట్టువడుటకు రాజాశ్చర్యచకితుడై పోయెను. మఱియు నెనమండ్రతోడ నెనిమిది తెఱగుల తన బలములను నడిపించి తనకా క్రీడయందున్న ప్రజ్ఞను వాసిష్ఠుడు ప్రదర్శించుట రాజు గాంచి, యొక పళ్లెరము నిండ రూపాయిలను బోసి గణపతి ముంగిటనుంచి నమస్కరించెను. కాని, యందుండి వాసిష్ఠుడు పదిరూపాయిలను మాత్రము గైకొని "రాజా! నే నిట్లు చేయుచుంటినని కించపడకుము. పవిత్రమనస్కుల కత్యాశ పుణ్యదూషణము వంటి"దని చెప్పి యతనికడ సెలవుదీసికొని కాశి బోయెను.

పుట్టిదాశతో వెళ్లినను కాశిలో నీమాఱుగూడ గణపతికి తపస్సు జరుగలేదు. మందసానుండి తనతో వచ్చిన యాత్రాసఖులును గాన్పించలేదు. అందువలన నతడయోధ్యకు పయనమయ్యెను. వెళ్లునప్పు డతని వెంట భవానీతాతకూడ బయలుదేరి, అయోధ్య చేరినంతనే విరేచనముల బాధకు వశుడై, ప్రాణభీతిని జెంది, మాటిమాటికి 'కాశ్యాంతు మరణాన్ముక్తి' అని పలువరింపజొచ్చెను. అది జూచి గణపతి వానినెట్లో కాశికి చేర్చిన పిదప తాను కాన్పూరు పోయెను.

కాన్పూరులో గణపతి కేకాంత స్థలము ప్రాప్తించగా, తన కనుగ్రహింప బడిన స్మృతిమార్గము నవలంబించి, మూడు మాసములు మంచి సుఖస్థాయిని, జపధ్యానమును సల్పెను. ఇంతలో తండ్రికడనుండి యొక లేఖయు, కొంత ధనము

వచ్చెను. అతఁడా లేఖలో తనకు దృష్టిబలము తగ్గిపోయినదని వ్రాసి, పుత్రుని వెంటనే యింటికి రమ్మని కోరెను. కనుక గణపతి తన తపస్సును విడిచి మందసా చేరి, యక్కడ రాజుతో నొక్కదినము గడపిన పిదప కలువరాయి చేరెను. నవద్వీప ప్రశంసాపత్రము నందుకొనినప్పుడు మందసా రాజు కడు సంతోషించి, గణపతి నతడు కనిష్ఠ సోదరునివలె నెంచుటబట్టి సత్కరించుటకు వీలుండదని యెంచి, యతడు చేయదలచిన సత్కార్యమును నరసింహశాస్త్రికి జేసి చూపెనని విని గణపతి రాజానురాగమున కెంతయో ఆనందించెను. కాన్పూరులో నున్నప్పుడొక విచిత్ర వ్యక్తి పరిచయము గణపతికైనది. ఆ వ్యక్తి పేరు లక్ష్మణశాస్త్రి. అతడు మంచి జ్ఞానియైనను, లోకముచే బాధింపబడకుండుటకు పిచ్చివానివాలె నటించువాడు. ఇతడు గణపతి కనేక యోగరహస్యములను చెప్పెను. తుదిరోజున నతడు తన పరిచయము జ్ఞాపకముండుటకు "యద్యత్పశ్యసి నేత్రాభ్యాంత త్తద్బ్రహ్మేతి భావయ" అను వాక్యమును గణపతి కుపదేశించెను.

బాల్యమునుండి గణపతిచే నొకదాని కొకటి మెఱుగిడినట్లు శాస్త్ర-జప-కవిత్వములు సాధింపబడెను. భువనేశ్వరీ కృపచే శాస్త్ర కవిత్వములు నవద్వీపమందు విజయమును పొందగా, నీశ్వరకృపచే వైద్యనాథమందు జపము విజయమును పొందెను. ఈ రెండు విజయములను సమకూర్చిన ఉత్తరదేశ యాత్ర లంతమైనందున మన మీ ఖండము నింతతో ముగించి, దక్షిణయాత్రల నింకొక ఖండమందు ముచ్చటింతము.

# III. వృత్తి ఖండము

-: అధ్యాయములు:-


1. దైవకల్పితమైన దక్షిణదేశ యాత్ర - అరుణాచల శక్తి.
2. అరుణాచల వాసము. 'స్థూల శిర' స్సునాత దగపడుట.
3. పూర్వజన్మ మిత్రలాభము, చెన్నపురమం దవధాన కీర్తిలాభము.
4. కార్యాంకురములు.
5. వేలూరు వాసము.
6. విచిత్ర ప్రేరణము, ఉద్యోగ విరమణము.

ఓం

మొదటి ప్రకరణము

# దైవకల్పితమైన దక్షిణదేశ యాత్ర

# అరుణాచల శక్తి

క్రీ.శ. 1900 సంవత్సరాంతమునకు కావ్యకంఠుడు 'కాన్పూరు' నందొనర్చిన తపస్సుతో నుత్తరదేశ యాత్రలను ముగించుకొని తండ్రి యాజ్ఞ చొప్పున నింటికి చేరెను. అప్పటి కతని కిరువది మూడవయేడు వయస్సున బ్రవేశించెను. అంత చిన్న వయస్సునందే కీర్తికాంత చేబట్టుటకా మూర్తి విశేషమెట్టిదని చూడవేడుకతో నిరుగు పొరుగు గ్రామములనుండి వచ్చుపోవు స్త్రీ పురుషులవలన కొన్నాళ్ళ వఱకు కలువరాయి కుత్సవదినము లయ్యెను. కన్నతండ్రికి, కట్టుకొనిన భార్యకు గర్వించుట కింతకంటె నేమి కావలెను ? పాపము ! నరసమాంబయే జీవించియున్నచో తన నోము ఫలముగా నొకానొక కాంచనాంగిచే ననుగ్రహింపబడిన యీ పుత్రుని యశస్సునకెంత మురిసియుండునో కదా !

ఈ సందడి తగ్గుసరికి మందసా రాజు యువరాజుల యొద్ద నుండి యాహ్వానము వచ్చెను. విశాలాక్షి గణపతు లుభయులకు మందసాలో స్థిరనివాసము కల్పించి గౌరవించు నుద్దేశముతో వారీ యాహ్వానము నంపిరి. కాని, నేత్రరోగముచే బాధపడుచున్న తండ్రిని విడిచి యెక్కడకు బోవుటకును కావ్యకంఠు డిష్టపడక, పితృసేవయందే నిమగ్నుడై పదునైదు మాసము లింటికడ నుండిపోయెను. తన శైశవమందైదేండ్లు శ్రమయని యెంచక తల్లిదండ్రు లే విధమున కష్టపడిరో వానిప్పుడు మరువలేదు. తల్లి ఋణము దీర్చుకొను నవకాశ మీజన్మకింక లేకపోయినను తండ్రి ఋణమైన దీర్చుకొనవలదాయని యత డాయుర్వేద శాస్త్రమును మథించి, రోగనిదాన చికిత్సావిధానములను గ్రహించి, స్వయముగా తండ్రికి చికిత్స సల్పి, రాదనుకొనిన నేత్రదృష్టిని తుదకు రప్పించి తండ్రిని మెప్పించెను. అప్పుడు తండ్రి పుత్రుని చేరబిలిచి "బాబూ ! మందసా రాజు యువరాజులు, బహుళ భూస్వామియగు కృష్ణమనాయుడు నీవలన నాకు సన్నిహితులై, నావలనే నీ సాన్నిధ్యము నపేక్షించుచు, నా రోగోపశమనమును నిరీక్షించుచున్నారు. మన బొబ్బిలి మహారాజు జూపకున్నను, వారైన మనయందిట్టి శ్రద్ధజూపుట మన యదృష్టమనుకొనక తప్పదు. మన శ్రేయస్సు నింతగా గోరుచు, నీ యందింత భక్తిగలిగియున్న యీ ప్రభువుల నింక తృప్తిపరచుటకు నీ వేగనియెడల నేను నిందాస్పదుడనగుదును. కనుక విశాలాక్షీ సహితుడవై తొలుత నందిగ్రామము వెళ్ళి, యొక వారము దినము

లక్కడ కృష్ణమనాయుని ప్రీతికొఱకు గడపితివేని పంవత్సరాది పండుగలు సమీపించును. అక్కడనుండి యీ పండుగ సమయమునకు నీవు మందసా చేరినచో, మీవలన రాజకుటుంబమునకు పండుగ పెద్ద గావచ్చు''నని హితవు పల్కెను. ఈ హితవు ననుసరించి వాసిష్ఠుడు భార్యాసహితుడై 1902 సం॥ మార్చి నెలలో నంది గ్రామముమీదుగా మందసా చేరెను.

విశాలాక్షమ్మకిదియే తొలిసారి దూరప్రయాణము. రాణివాస పరిచయమునకుగూడ నిదియే తొలిసారి. అట్లయినను, జంకుకొంకులేని ధైర్యశాలిని, యాడంబరములేని సహజగాంభీర్యవదన, విశాలనేత్రములచే నిత్యాలంకృతయై యొప్పు సౌందర్యవతియైనందున రాణుల గౌరవాదరముల నీమె త్రుటిలో జూరగొనెను. పైగా గురుపత్నియు, మంత్రదీక్షాపరురాలును అయినందున వారికి పూజ్యురాలై, యనుదిన సత్కారలాంఛనములను వారివలన బడయజొచ్చెను. ఆమె వలదను చున్నను రాణు లామెకు సమకూర్చిన భోగముల వలన, విందులవలన నామె శరీర మచిర కాలములో స్వస్థత దప్పెను. ఆ కారణమువలన నామె మందసాలో కాపురముండుట కిచ్ఛగించక ననారోగ్యము నెపమున తన పుట్టింటికి బోయెను. ఆమె వెళ్లిన తోడనే కావ్యకంఠుడు స్వగ్రామమునుండి సోదరుడైన శివరామశాస్త్రిని రప్పించుకొని భువనేశ్వరము వెళ్లిపోయెను. ఈ రీతిగా సుశిక్షిత తపోవృత్తి గలవారిని విందులతో గౌరవించుట తుదకు తమకే యాశాభంగమయ్యెనని మందసా రాజకుటుంబమంతయు గుర్తించుకొని తమ పొరపాటునకు నొచ్చుకొనిరి.

భువనేశ్వరమందు వాసిష్ఠుడు ప్రత్యేక తపోదీక్షను బూనకున్నను, సుమారు మూడు మాసములు మందసాలో గుడిచిన విందుల దోషమును తొలగించుకొనుట కాహారనియమమును బూని జపస్తుతులచే దేవి నొకమాస మారాధించెను. ఇంతలో నక్కడకు దవ్వుననున్న 'దంతవాణి' సంస్థానాధిపతినుండి వాసిష్ఠున కొక యాహ్వానము వచ్చెను. ఈ సంస్థానాధిపతి మందసారాజున కత్యంత స్నేహితుడు. వాసిష్ఠుడు మందసా రాజుకడ సత్కారములను బడసి భువనేశ్వరక్షేత్రమందు నిష్ఠగడపుచుండెనని యీ రాజు విని, తనకు విద్యాగంధము లేకున్నను. సాటిరాజునకు పండితాదరణలో తీసిపోరాదని యెంచి వాసిష్ఠు నాహ్వానించెను. అది తెలిసి వాసిష్ఠుడు తనలో తాను నవ్వుకొని దంతవాణి పయనమయ్యెను. దంతవాణి యనుగ్రామము 'ధన్మండల్' రైలుస్టేషనునుండి రెండు క్రోసుల దూరమున నున్నది. రాజేర్పాటుచేసిన యెద్లబండిపై స్టేషనునుండి వాసిష్ఠ శివరాములు గ్రామము చేరి, వండుకొని భుజించిన పిదప రాజదర్శనము జేసికొనిరి. అక్కడ విశేషమూలష్యము లేకుండ వాసిష్ఠున కేబది రూప్యములను, అన్నదమ్ముల కిరువురకు రెండు శాలువలను రాజిచ్చి సత్కరించెను. వెంటనే తిరుగు ప్రయాణమునకు బండి సిద్ధమయ్యెను. అప్పటికి సాయంత్రమైదు. గంటలైనది. ఆకసమంతయు కారుమేఘములతో గప్పియుండెను. అనా దాదివార

మైనందున వర్జనీయమగు రాహుకాలము కోరబడెననిగాని, యంతకంటెను వర్జనీయమగు వర్జ సమయమనిగాని లెక్కసేయక సోదరులుభయులు బండి నెక్కి, దంతవాణి నుండి తిరుగుముఖము పట్టిరి.

కాలమును నిర్లక్ష్యమొనర్చిన ఫలము కుంభవృష్టి రూపమున వారికి సగము దూరము పోవుసరికే యెదురయ్యెను మేఘము లింకను భయంకరముగా గ్రమ్ముకొనుచు, నలుదిక్కుల గ్రమ్ముచున్న చీకటిని మఱింత హెచ్చించి, యిది భూమి, యిది నీరు అను విభేదమును గుర్తించుట కలవిగాని విషమస్థితిలో బండి దోలువానిని, యెద్లనుగూడ ముంచి, యడుగడుగునను విపత్తున బడద్రోయు చుండెను. రెప్పలు మూసినను తెరచినను వ్యత్యాసముదోపని యీ స్థితిలో భగవంతుడైన యింద్రుడొకసారి తన మెరుపుకాంతిని బరపి గోతిలో బండి పడకుండ రక్షించెను. దానితో కావ్యకంఠుని భక్తి స్రవించగా నతడాశువున నింద్రుని స్తుతించుచు శరణు వేడకొచ్చెను. (ఈ స్తుతియే కొంచెము సవరింపబడి 'ఇంద్రగీత'మను పేరుతో పిదప 'గీతమాల'యను గ్రంథమందచ్చొత్తించబడెను.) ఈ స్తుతి యెంత పటుతరమై వెడలెనోకాని భగవంతుడు దానికి మెచ్చి, బండిలోనివారి నింకొక ఘోర ప్రమాదమునుండికూడ రక్షించి యనుగ్రహించెను. ఎట్లనగా, స్టేషను సమీపించు సమయములో నొక గేటు దాటవలసివచ్చెను. అక్కడనే గూడ్సురైలొకటి షంటింగు చేయుచున్నను, వర్షభారముచే గేటును మూయుటకెవరును స్టేషనునుండి రాజాలక పోయిరి. గేటు తెరచి యున్నందున యెడ్లినుపదారి దాటుటకు సిద్ధమయ్యెను. అదేసమయమున మృత్యుశకటమువలె రైలుబండి వెనుకకు కదలుచు గేటును సమీపించెను. దాని శబ్దము వర్షశబ్దములో బండివానికి వినబడలేదు. దాని యింజను బహుదూరమున నున్నందున చీకటిలో వెనుకనున్న పెట్టెలజాడ తెలియలేదు. ఇంకొక్క క్షణములో నెడ్లబండి యినుప దారినెక్కి, నాశనమైపోవుననగా విపత్తును, తమోవ్యాప్తినిగూడ జూపుట కింద్రుడొక మెరుపును బంపి ప్రాణములను రక్షించెను. ఇట్లు సోదరులుభయులు దారి పొడవునను తడిసి ముద్దయినను, ప్రాణములతో స్టేషను ప్రవేశించి, వర్జ్యకాల ఫలమునెట్లో దాటినట్లు సంతసించిరి. కాని, యది పిశాచరూపమున నింకను తమ్మావరించి, సమయముకొఱకు వేచియుండెనని వారు గుర్తించలేదు.

ఇట్లుండగా టిక్కెట్ల నిచ్చుటకు కిటికీ తెరువబడెను. అప్పుడు కలకత్తా పోవు రైలు వచ్చుచున్నట్లు తెలిసికొని వాసిష్ఠుడు టిక్కెట్లను కొనుట కాతురపడక కూర్చుండెను. ఇంతలో శివరాము డున్నపాటున శివమెత్తినవానివలె దంతవాణిలో లభించిన ధనముపై తనకుగూడ హక్కున్నదని గర్జించి, యా ధనముతో ప్రయాగ యాత్ర తనకు జేయించవలెనని యన్నను బలవంతము చేయదొడగెను. వాసిష్ఠుడు తెల్లబోయి, వాని నూరడింప యత్నించెను. కాని, యూరడించుకొలది యతడు

బిళ్ళబిగిసినందున వాసిష్ఠుడు జాలిచెంది, కలకత్తావఱకు రెండు టిక్కెట్లను కొనెను. ఈ విధముగా దంతవాణీ పిశాచము కలకత్తా వెళ్లువఱకు శివరాముని బట్టుకొని, యక్కడకు వెళ్లిన పిదప వానిని విడచి వాసిష్ఠు నావేశించి, యతనియందు సతీవాంఛను రేకెత్తించెను. ప్రవాసమం దిదివఱ కెన్నడు లేని యీ బాధను జూచి యీ మాఱు శివరామునకు జాలిదోప, ప్రయాగ ప్రయాణమునకు బదులన్నగారిని తిరుగురైలెక్కించి, స్వగ్రామము వంకకు తీసికొని వచ్చెను.

ఆ రోజులలో కలకత్తావైపునుండి వచ్చువారు కలువఱాయి వెళ్లుటకు శ్రీకాకుళము స్టేషనులో దిగుచుండెడివారు. అదేవిధముగా శివరాముడన్నగారి నక్కడ దింపెను. ఏమి యద్భుతమోగాని దారిపోడవునను వేధించిన సతీవాంఛ వాసిష్ఠుడు రైలునుండి దిగిన మఱుక్షణమందే లేశమాత్రమైన లేకుండ మాయమై, దాని స్థలమం దంతకంటె నధిక బలయుక్తమైన యొకానొక తపోవాంఛ యుద్భవించి, విడిచిన రైలునే యెక్కువఱకు వాసిష్ఠున కేమియు దోచనిచ్చినది కాదు. రైలెక్కిన పిదప వాసిష్ఠుడు తనకడనున్న ధనమంతయు తమ్ముని దోసిలిలో పోసి, దానితో నెంతదూరము ప్రయాణము సాగించవచ్చునో అంత దూరమువఱకు రెండు టిక్కెట్లను కొని చప్పున వచ్చుట కాజ్ఞాపించెను. శివరాముడు శరవేగమున బోయి విజయవాడవఱకు రెండు టిక్కెట్లను కొనితెచ్చి, సోదరుని కలిసికొనెను. రైలింతలో కదలెను. సోదరు లొకరి మొగమొకరు చూచి నవ్వుకొనిరి. దంతవాణినుండి జరిగిన విషయముల కుభయులు సిగ్గుపడిరి. కాని, యిరువురయందును మానవాతీతములై సంభవించిన యుద్రేకములను తగువిధమున విమర్శించుకొని చూడగా ప్రయాగయాత్రా నెపమున నుత్తరదిక్కున కీడ్చిన శక్తియు, సతీవాంఛను కల్పించి దక్షిణమునకు మరల్చి యెక్కడికో తపస్సుకొఱకు గొంపోవుచున్న శక్తియుగూడ గంగాపార్వతుల వలె దివ్యములైనను, సవతులవలె పోరాడినట్లు వాసిష్ఠునకు గన్పట్టెను. నిజమే ! ఇరువురు తల్లులకు ముద్దుబిడ్డడైన గణపతిని మాటిమాటికి గంగాదేవి తన యంకమునకే చేర్చుకొనుట సాదియా ? ఆమె తనవంటి విద్యాప్రవాహమును, చిత్తనైర్మల్యమును వృద్ధిబరచుచు పుత్రు నింతకాలము ననుగ్రహించిన మాట వాస్తవమేయైనను, సర్వైశ్వర్యములకు మూలమగు తపోదృష్టి నతనియందు వృద్ధిబరచకున్న యెడల లోక గురుపద మతనికెట్లు సిద్ధించును ? లోకకల్యాణమును గూర్చు కార్యముల కత డెట్లు సమర్థుడగును ? ఇట్టి వైభవముల ననుగ్రహించు శక్తి పార్వతి హస్తమందున్నందున, సవతితో నామె పోరాడినను పుత్రుని శ్రేయస్సుకొఱకే గదా ! ఆహా ! అదృష్టమనిన గణపతిదే యదృష్టము. అది కుమారస్వామి వెలయువఱకే సాగినను, అట్టి యదృష్ట మింకొకనికి పట్టలేదు కదా !

ఇట్లు పార్వతీకటాక్ష ప్రసాదభరితుడైన గణపతి రైలు కదలిన పిదప మీదబల్లపై కెక్కి నిద్రించుచున్నవాని పగిది కన్ను మూసి పరుండి, విజయవాడ

స్టేషను సమీపించు వఱకు పంచాక్షరీ ధ్యానమందు మునిగెను. సోదరులు విజయవాడలో దిగుసరి కర్ధరాత్రమైనది. ఆ కారణముచేత తెల్లవారువఱకు స్టేషనులోనే పండుకొనిరి. కాని, దినమంతయు శుష్కోపవాసముండి, దినాంతమందైన తినుటకేమియు లేనందున వారికి నిద్రగూడ పట్టినదికాదు. తెల్లవారిన పిదప కృష్ణానదీస్నానముచే వారు కొంత బడలికను తగ్గించుకొని, కనకదుర్గను దర్శించుకొని, పురములోనికి వచ్చుచుండగా మార్గమందొక మఠము వారి కగపడెను. అది మహిశూర్ పురవాస్తవ్యులచే నెలకొల్పబడిన 'శివగంగా' మఠము. వెంటనే గణపతి మఠములోనికి బోయి, ధనార్థియై, మఠాధిపతిని దర్శించెను. అతడు కావ్యకంఠునితో కొంత సంభాషించిన పిదప సోదరులకు పెందలకడనే భోజనమమర్చి సత్కరించెను. అటుపిమ్మట వారికి కాంచీపురము వెళ్లుటకు సరిపోవు రైలుచార్జీని లెక్కించియిచ్చి, యాదరపూర్వకముగా వారి నతడు సాగనంపెను. ఆ ధనము గైకొని వారు తొలుత "శ్రీకాళహస్తి" క్షేత్రమును దర్శించుకొనుటకు మార్గమందు దిగిరి. అట్లు దిగుటవలన భోజనము కొఱకు ప్రయాణధనమునుండి కొంత ఖర్చుచేయ వలసి వచ్చెను. దానిని మఱల సరిబుచ్చుకొనుటకు కాళహస్తి నుండి "రేణిగుంట" వఱకుగల పదునైదు మైళ్ల దూరము వారు కథలు చెప్పుకొనుచు కాలినడకను ప్రయాణమొనర్చి యటుపిమ్మట రైలుపై కాంచీపురము జేరిరి. ఈ విధముగా ధనలోపము వలన క్షుద్బాధాది కష్టములకు లోనగుచున్నను, వారు తమ యుత్సాహమును వీడక ప్రయాణము నంతవఱకు సాగించిరి.

కాంచీపురములో తిరుగుచుండగా వాసిష్ఠున కొక జ్యోతిషాలయ మగపడెను. దానిని నారాయణ జ్యోతిష్కుడను బ్రాహ్మణుడు నడుపుచుండెను. అతనిని వాసిష్ఠుడు కలిసి, కొంతసేపు ప్రసంగించిన పిదప వానికే జోస్యము చెప్పుసరి కతడు విస్మయపడి, వాసిష్ఠ సాంగత్యము నపేక్షించి తన యింట సోదరు లుభయులు నతిథులై యుండుట కర్థించెను. అతని కోర్కెను వాసిష్ఠుడు గ్రహించి, రాత్రులం దతనికి జ్యోతిశ్శాస్త్రములోని యపురూపపు రహస్యములను కొన్నింటిని బోధించుట కంగీకరించెను. మఱియు సదుపాయము లిట్లమరుట కతడు సంతసించి, తన చిత్తమం దనివార్యమగుచున్న భక్తికి నిశ్చల ధ్యానావకాశము పగటి పూటలందైన కల్పించుకొనుటకై క్షీరవతీ వేగవతీ నదుల మధ్య నశ్రద్ధ జేయబడియున్న హనుమదాలయమందు జపస్థలమును నిర్మించుకొనెను. ఈ స్థలమం దతడు పగళ్లుప వాసముచే శివపంచాక్షరీమంత్రము నచంచలముగా పూర్వము వైద్యనాథక్షేత్రమం దీశ్వరుడు స్వయముగా బోధించిన ధ్యానపద్ధతిని జపించుచు, రాత్రిపడిన పిదప జ్యోతిష్కుని యింట నారాయణు డిచ్చు రుచికరమగు రసాన్నముచే నుపవాసము నంతమొందించుకొనుచుండెను. ఒక మాస మిట్లు సుఖముగా గడచుసరికి శివరాముడు వ్రాసిన లేఖకు సమాధానముగా తండ్రి కొంత ధనము పంపి, పుత్రుల

నుభయులను స్వగ్రామము రమ్మని కోరెను. గణపతి చిత్తము నావరించిన శక్తి యింకను దక్షిణయాత్రల కెక్కడికో లాగుచున్నట్లనిపించినందున అతడింటికి మఱలుట కిష్టపడలేదు. అతడు రానిచో శివరాముడుగూడ పోననెను. వీని వలన నారాయణజ్యోతిష్కునకు భారమగుట తప్ప వేఱు ప్రయోజన మగపడలేదు. ఇంటి కతడు పోయినచో తండ్రికైన కొంత ఆసరా కావచ్చునని వాసిష్ఠుడు తలచెను. కాని, యతడు భక్తిమంతునివలె తనవెంట నెక్కడికి బోయిన నక్కడికి రావలెనని పట్టుపట్టుచుండెను. పిల్లిని చంకన బెట్టుకొని వెళ్ళినట్లు వీనినెక్కడికి తీసికొని వెళ్ళినను వీనికొఱకు రెండుపూటలందు భోజన మర్థించుట వాసిష్ఠున కొక విధి లేని బాధ్యత యగుచున్నది. పైగా, మధ్యమధ్యను పండో ఫలమో కొనియిచ్చుటకు తండ్రిని ధనముకొఱకు పీడించవలెను. కనుక, తపస్సు నావృజేసి వీని నింటియొద్ద దిగవిడిచి వచ్చుట తప్ప వేఱు గత్యంతరము లేదని వాసిష్ఠుడు నిశ్చయించి, తన నిశ్చయమును శిష్యుడైన నారాయణ జ్యోతిష్కున కెఱుకపరచెను.

పాపము, నారాయణుడు గురుని విషమ స్థితికి జాలిచెందెను. కాంచీ పురములో గురుడున్నంతకాలము శివరాముని భారము గురునకు లేకుండ తా జేయగలడుగాని యాత్రలన్నింటియందు తానెట్లు తోడ్పడగలడు? పోనిమ్ము, గురునివలన తన వ్యాపారము వృద్ధిజెందుచున్నదని గురునక్కడనే స్వలాభముకొఱ కుంచుకొని, పుణ్యకరమగు గురుని యాత్రాపేక్షకు భంగము కలిగించుట అతనికి దోషమనిపించెను. అందువలన నతడు గురునకొక సలహా నిట్లు బల్కెను: ''పంచలింగములలో పృథ్వీ, వాయులింగములను మీరు శ్రీకాళహస్తి, కాంచీపురము లందు దర్శించుకొనిరి. ఇక్కడనుండి విల్లుపురము వెళ్ళినచో, విల్లుపురమునకు చెరియొక దిక్కున చిదంబరమనెడి యాకాశలింగ క్షేత్రము, అరుణాచలమనెడి తేజోలింగక్షేత్రము లున్నవి. అరుణాచలముమీదుగా మీరు 'గూడూరు' వెళ్ళి, మీ స్వగ్రామము వంక బోవు రైలు నెక్కవచ్చును. అాలింగ క్షేత్ర మింకొకప్పుడు దర్శించవచ్చును గనుక మీరీ రెండు క్షేత్రములను దర్శింపుడు. లేదా యరుణాచల క్షేత్రమైన మీరు దర్శించి తీరవలెనని నేను కోరుదును. మీ కిందువలన నధికమగు ఖర్చంతగా నుండదు.'' ఇట్లు పల్కి యతడు గురు కట్నముగా నిరువదియైదు రూపాయల నర్పించుకొనెను.

దోర్ఘమనస్సుగల నారాయణుని హితవాక్యునకు వాసిష్ఠు డెంతయో సంతసించెను. మఱియు నరుణాచల నామము విన్నప్పుడొక వింత గొల్పు భక్తిస్పందము చిత్తమున మెఱయుట వాసిష్ఠుడు గుర్తించుకొని యీ నామమే పుణ్యదాయకమై యున్నట్లు గ్రహించి, కాంచీపురమునుండి యరుణాచల క్షేత్రమునకే తిన్నగా పయనమయ్యెను.

అప్పుడు శివక్షేత్రము లన్నియు గణపతి నవరాత్రి యుత్సవముల కోలాహలములతో నిండియున్నవి. భాద్రపద శుద్ధ చవితినుండి యీ యుత్సవములు ప్రారంభించి, ఏకాదశి నాటి రాత్రితో నంతమగుచుండును. ఆ యేకాదశినాటి సాయంకాలమునకే సరిగా వాసిష్ఠ గణపతి తన సోదరునితో సహా అరుణాచల దివ్యక్షేత్రమును చేరుట సంభవించెను. ఇది కాకతాళీయమో, దైవనిర్ణయమో తెలియదుగాని, యా నా డతడు స్నానధ్యానములు చేసికొని క్షేత్రాలయములో దేవియగు 'అపీతకుచాంబ' సన్నిధికి వెళ్ళిన సమయమునకు సరిగా దేవి విగ్రహమునుండి పుష్పములు జలజల రాలి, యామెయొక్క ప్రియమును సూచించెను. అది గాంచినతోడనే గణపతి చిత్త ముప్పొంగి, నేత్రములానందాశ్రువులను రాల్చెను. సాధారణముగా నీశ్వరదర్శన మొనర్చుకొనిన తరువాత దేవిని దర్శింతురు. గణపతి కానాడేమి తోచెనోకాని, తొలుత దేవి యనుజ్ఞను బొందుటకు బుద్ధి ప్రేరేపించెను. అక్కడ గాంచిన శుభ సూచనలనుబట్టి యామె యనుజ్ఞ నొసగిన ట్లతడు భావించి, మెల్లమెల్లగా నరుణాచలేశ్వరుని సమక్షమునకు పంచాక్షరీమంత్రమును స్మరించుకొనుచు బోయెను. భయవినయములతో దరిజేరుచున్న పుత్రుని జూచి కరుణాసముద్రుడైన యరుణాచలు డెట్టి యను గ్రహవీక్షణమును బరపెనోగాని, గణపతి గద్గదకంఠుడై, భయమునకు బదులు భక్త్యుత్సాహములచే నూగిసలాడి; కొంతతడవు మైమరచినవానివలె నీశ్వరలింగమున కెదురుగా స్తంభించిపోయెను. ఇట్టి యనుభవము నతడదివఱకే క్షేత్రమందును బొందలేదు. మఱియు చిరకాల వియోగమైన పిదప తలిదండ్రులను గలిసిన పుత్రుని యానందము వంటి దిక్కడనే యతనికి దోచినందున, కోవెలనుండి యీవలకు వచ్చినతోడనే "శక్తీశ్వరులు ప్రస్తుత మీ క్షేత్రమందే పూర్ణానుగ్రహ స్వరూపులై యున్నారు. తప్పక నా తపస్సిక్కడనే సిద్ధిబొందును. నీ వున్నను మానినను సరే, నేనుమాత్ర మీ క్షేత్రము నిప్పటిలో వదలను సుమా" యని మెల్లదిగా సోదరునకు తెలియజెప్పెను.

ఈ మాటలు చెవిని సోకినంతనే శివరామున కింటికిపో నక్కరలేదను ధైర్యము కలిగి, యుత్సాహ ముప్పొంగెను. దానితో నంతవఱకు నణగియున్న యాకలి పొడజూపగా, అన్నముకొఱ కతడు తొందర చేయదొడగెను. ఒక్క ఘడియ తట్టుకొమ్మని చెప్పి, వాసిష్ఠుడు దుర్గదర్శనమును గూడ ముగించుకొనుటకై దుర్గాలయము వైపునకు చప్పు చప్పున నడచెను. తొందర నడకవలన శివరామున కాకలితోబాటు నీరసముగూడ దోచెను. వాని కొక డబ్బిచ్చి యరటిపండ్లను కొనుక్కొమ్మని చెప్పి, యతడవి తినులోపున వాసిష్ఠుడు దుర్గాదేవి దర్శనమును ముగించుకొని వచ్చి, యన్న ధర్మశాలకు దారితీసెను. అక్కడకే ధర్మశాల సమీపముననే యున్నను శివరాము డింకొక డబ్బుకొఱకు పీడించి, వాసిష్ఠుడు నిరాకరించిన కారణమున

విచక్షణను మీరి నడివీధిలో తగవులాడెను. వాసిష్ఠుడు లొంగక, ముందునకు బోయి, యన్నసత్రముజేరి యన్నమడుగగా, అనాదేకాదశి యగుటవలన సత్రము మూయబడెనని యక్కడివారు చెప్పిరి. అప్పుడతడు జాలిచెంది, తమ్మున కింకొక డబ్బుతో అరటిపండ్లను కొనియిచ్చెను. ఎనిమిది పళ్ల నీవిధముగా భుజించియు నతడు సమాధానపడలేదు. అప్పుడు వాసిష్ఠుడు "నీవీ పళ్ల నింక తిని యారోగ్యమును పోగొట్టుకొనుటకు నే నొప్పను. నీకొఱ కన్నమునే యర్థింతు"నని నయము బల్కి, బ్రాహ్మణులు నివసించు వీధి ప్రవేశించెను.

అప్పటి కించుమించుగా తొమ్మిది గంటల రాత్రియయ్యెను. నవరాత్రుల తుదినాటి పూజలు చూచి యప్పుడే గృహస్థులిళ్లకు మరలిరి. కొన్ని యిళ్లలో తలుపులు మూయబడెను. కొన్నింట నింకను తెరువబడియుండెను. తెరువబడియున్న యిళ్లలో వాసిష్ఠుడు బాలునికొఱ కన్నమడుగగా లేదనుచుండిరి. ఏకాదశియైనను, పిల్లలకుకూడ వంట మానిరాయని వాసిష్ఠునకు సందేహమయ్యెను. లేక, మెతుకైన మిగులకుండునట్లు వండి బ్రాహ్మణాచారమును మంటగల్పిరాయని యొక్కొకసారి తర్కించుకొనెను. చద్దియన్నమడిగినను లేదనుటబట్టి యక్కడి జనుల త్యాగబుద్ధి నతడు శంకించుకొనవలసివచ్చెను. ఏదెట్లున్నను, తత్కాల దురవస్థను తలపోసికొను చుండగా దానిని సరిపోల్చు శ్లోకమొకటి స్ఫురణకు వచ్చెను. స్ఫురించిన శ్లోకమును పైకి చదువుచు వాసిష్ఠుడొక మూసియున్న యింటిముందునుండి పోవుచుండెను. ఆ యింటి యరుగుపై పండుకొనియున్న బ్రాహ్మణు డది విని తటాలున లేచి, గణపతిని చేరబిలిచి, శ్లోకకారణమునరసి, కొండనందుకొనినంత సంతోషమును వెలిబుచ్చి, సోదరులుభయులను తన యింట నాతిథ్యము గైకొమ్మని బ్రతిమాలెను. అతడి ట్లింకను చెప్పెను. "మా యిల్లాలొక వ్రతము సల్పి యిప్పుడిప్పుడే ముగించుకొనెను. ఈనాడు పగలుపవాసముండి, రాత్రి వ్రతాంతమం దిఱువురు బ్రాహ్మణుల కాపోశనమిచ్చి భుజించవలెనని సంకల్పించెను. కాని, యేకాదశి నెపమున నొక్క బ్రాహ్మణుడైన మాకు లభించలేదు. యాత్రికులైనను నాకు జతపడలేదు. తిరిగి తిరిగి యిప్పుడే వచ్చి నిరాశజెంది యిక్కడ పరుంటిని. మా పుణ్యము పుచ్చి మీ రిటకే వచ్చితిరి. మేముకూడ ఆంధ్రులము. మాయం దభిమానముంచి వ్రతమును నిర్విఘ్నము జేయుడు."

గణపతి కేకాదశి నియమమున్నను, ఆ ఇల్లాలి వ్రతమును దక్కించుట విధియని తోచి, తానుగూడ నతిథియగుట కంగీకరించెను. వెంటనే పాద ప్రక్షాళనమునకు గృహస్థు నీరిచ్చెను. సోదరులు గావంచాలను తడిపి కట్టుకొని లోనికి బ్రవేశించుసరి కిల్లాలు మడిబట్టలనిచ్చి వర్ధించెను. వాకిట నున్న తులసి కోట వత్తిదీపములచేతను, ముగ్గులతోడను రమ్యముగా నలంకరింపబడిన తీరు జూచుసరికే వాసిష్ఠున కిల్లాలియొక్క సౌశీల్యము, పవిత్రత విశదమయ్యెను. ఇంక

భోజన సమయమం దామె బ్రతిమాలి బ్రతిమాలి తానెన్నడు తినజాలనంత యాహారమును, పిండివంటలను తినిపించి, యామెయందున్న యపురూప మహి మాన్వితమైన ప్రేమ ప్రవృత్తిని జూపినప్పుడు మాతృవాత్సల్యము యొక్కయవధి ననుభవించి గణపతి మైమఱచెను. భోజనమైన పిదప దక్షిణయుక్తములగు తాంబూలముల నందుకొని సోదరులు మడిబట్టలను విడిచి, యాయాసమును దీర్చుకొనుటకు తమ మూటలను తలక్రింద బెట్టుకొని వీధి యరుగుపై సాగోరిరి. వెంటనే యిరువురకు నిద్రబట్టెను. తిరుగ నిరువుర కించుమించుగా నొక్కసారి తెలివి వచ్చి కన్నులు తెరచిరి. కన్నులు విచ్చుసరికి తెల్లవారెను. వెంటనే యిరువురును లేచి, పూర్వరాత్రి తా మక్కడ జూచిన గృహమును గాంచక తెల్లబోయిరి. 'అయ్యంకుళ' వీధికి దక్షిణముగా నుండవలసిన ఆ గృహమునకు బదులచ్చట నొక గణపతి దేవాలయముండుటకు వారు విభ్రాంతులైరి. ఒకరికొకరు పూర్వ రాత్రి యనుభవమును పొల్చుకొనగా నిరువుర కొకే విధమగు స్మృతియుండెను. పైగా తాము గైకొనిన తాంబూలము లక్కడనే పడియుండి, తమకు గలిగిన యనుభవము స్వప్నసంబంధముగాదని ఋజువు చేయుచుండెను. అట్టి గృహ మా ప్రాంతమం దెక్కడైన నున్నదేమోయని మధ్యాహ్నమగువఱకు వెతకినను వారికి గోచరించలేదు.

ఈ యద్భుతమును గుఱించి యోచింపగా, కాంచీపురమం దొనర్చిన జపముతో పంచకోటి పూర్తియైన శివపంచాక్షరీ మంత్రముయొక్క ఫల మీ క్షేత్రమందు భగవంతు డీ రూపముగా జూపి యనుగ్రహించినట్లు, బాల్యమునుండి తా జేసిన తపమిక్కడ సిద్ధించినట్లు వాసిష్ఠునకు స్ఫురించెను. మఱియు కాశిలో దుర్గామందిర యోగి చూపిన యద్భుతానుగ్రహమున కిది సాటియై, యది యొక జీవితకాంత కుపోద్ఘాతమైనట్లే యిది యింకొక జీవితకాంత కుపోద్ఘాతముగా కల్పింపబడి యుండవచ్చునని బుద్ధియందు తట్టెను. ఇట్టి కటాక్షము నీ క్షేత్రమందు జూపుట కపీతకుచాంబయే నిశ్చయముగా కలకత్తానుండి తనను విచిత్ర విధమున వెనుకకు లాగి, యంతకంటెను విచిత్రమగు ప్రబోధముచే శ్రీకాకుళమునుండి కాంచీపురమునకు, అక్కడనుండి యిక్కడకు క్రమముగా చేరదీసికొనినట్లు వాసిష్ఠునకు విశదమై, యంబయొక్క యంకమును బొందిన గణపతి బాలునివలె భావించుకొని యతఃానందపరవశుడయ్యెను. అంబయొక్క ప్రసాదములను శివరాముడు గూడ పొందుట యతని యదృష్టమనక తప్పదు.

ఆలోచించగా నీ క్షేత్రమం దరుణాచలమను పర్వత రూపమున శక్తీశ్వరులు వెలిసి, భూమికంతకు నాధారకేంద్రమై యున్నారు. అట్టి యీ పర్వతతత్త్వ మనేక భూముల కాధారకేంద్రమగు సూర్యతత్త్వమును బోలి, తేజోలింగ తత్త్వమనబడు చున్నది. అయినా, సూర్యునియందా తత్త్వము బాహ్యదృష్టికి గోచరమగుచుండగా,

నిక్కడ అంతర్దృష్టి గలవారికి మాత్రమే గోచరమగును. అట్టి తత్త్వముచే ప్రకాశించు నీ పర్వతములో దిగువ భాగము నవకోణములు గలిగి శ్రీచక్రాకారమున నుండి శక్తిభాగమగుచున్నది. మీది భాగమగు శిఖరము లింగాకృతియై యీశ్వరభాగమగు చున్నది. దీనిని బోలిన పర్వత మింకొకటి యెక్కడను లేదని ప్రకృతిశాస్త్రజ్ఞులు సైతము సిద్ధాంతపరచిరి. మన యార్యఋషులు దీని యపురూపపు టాకృతినేగాక, దీనియందున్న దివ్యతత్త్వమునుగూడ గ్రహించి పూజించిరి. అయినా, పుష్పాదులచే పూజించువారి కిది యలవిగాని రూపమైనందున, నభిషేకాద్యర్చనలకు వీలగునట్లు కొండదిగువ నాలయమం దరుణాచల లింగమును, అపీతకుచాంబ విగ్రహమును ప్రతిష్ఠించిరి. ఈ పర్వతరూపమునకు ప్రదక్షిణము సల్పుట కొక బాట కొండ చుట్టును నిర్మింపబడెను. దాని పొడవుగూడ నవసంఖ్యాయుతమై తొమ్మిది మైళ్లు ఉండును. అన్ని విధముల పంచదశీ మహావిద్య నక్షరముల నిరూపించుచున్న క్షేత్రతత్త్వమును పండితులవలన గణపతి తెలిసికొని ప్రదక్షిణాది విధులచే పర్వత రూపుడైన యర్ధనారీశ్వరుని మఱునా డుదయమున నింకొకసారి సేవించుకొని సంతుష్టాంతరంగుడయ్యెను.

ఓం

రెండవ ప్రకరణము

# అరుణాచలవాసము, 'స్థూలశిర'స్సను నాత డగపడుట

అన్న ధర్మశాలలో గణపతి శివరాములు మూడు దినములు భుజించిరి. అక్కడ నిబంధనల ననుసరించి మఱి యన్న మక్కడ పెట్టబడలేదు. ఈ లోపున వారభోజనముల నమర్చుకొనుటకు వారు బ్రాహ్మణ గృహములన్నియు తిరిగినను, నాలుగైదు రోజులు మాత్ర మమరెను. అదియును పగటిపూటలందే లభించి, రాత్రులు కఱవయ్యెను. ఇట్లాంటి పూట భోజనములతో కొన్నాళ్లు, ఉపవాసములతో కొన్నాళ్లు గడపవలసివచ్చినందున శివరామునకు కష్టమయ్యెను. ప్రతిదినము పండో ఫలమో కొనుక్కొని యన్నను ధనముకొఱకు పీడించుట కతనికి లజ్జయయ్యెను. ఉన్న ధనముతో టిక్కెట్టు కొనుక్కొని వాని నింటికి పొమ్మని గణపతి చెప్పెను. కాని, యన్నను విడచిపోవుట కిష్టములేకయో, తొలినాటి యద్భుతమువంటిది మఱల సంభవించి యాకలి బాధను తొలగించునను నాశచేతనో అత డెంత చెప్పినను వినక అరుణాచలము వీడలేదు. దైవముపై తనకున్న భక్తియం దతని కంత విశ్వాసము లేకున్నను, అన్నగారి భక్తిపై మిగుల విశ్వాసము కలవాడు.

గణపతి సహనము వహించి పురుషప్రయత్న మెంత చేసినను బాలునికైన నాహార సదుపాయ మధికము ప్రాప్తించలేదు. అంత దివ్యక్షేత్రమైనను, క్షేత్రవాసులు దైవసంపత్తికుండవలసిన దయ లేనివారగుట గణపతికి వింత యయ్యెను. ఈ యత్నములవలన గణపతికి మంత్రధ్యానము సల్పు నవకాశము గూడ లేకుండెను. ఎన్నాళ్లిట్లు దైవచింతనము మాని, దాని కభ్యంతరముగూర్చు నాకలిబాధను పురుషయత్నముచే నెదుర్కొనుట ? సుమా రొక నెల యిట్లు గడచుసరికి తమ్ముడు చిక్కి బక్కయయ్యెను. వాని స్థితి జూచుకొలది గణపతికి దుర్భరమయ్యెను. మానసమును జంపుకొని తోడిమానవులను యాచించుటకంటె, మానసముతోనైనను అన్నస్వరూపుడైన భగవంతుని యాచించుట మేలని తోచి, యత డరుణాచలేశ్వరునే శరణుబొంది, సహస్ర శ్లోకములచే 'హరస్తుతి' నన్నముకొఱకు చేయ సమకట్టెను.

అశ్వయుజ మాసములో దేవీనవరాత్రములైన వెంటనే గణపతి యీ గ్రంథరచనను బ్రారంభించి, కార్తిక మాసములో వచ్చు కృత్తికోత్సవ ప్రారంభమున కొకటి రెండు రోజులు ముందే ముగించెను. ఏ రోజు వ్రాసిన శ్లోకముల నారోజు సాయంత్రము దేవాలయములో నందిముందర నిలుచుండి

మహాసన్నిధిని జదువుచు, గణపతి తన బాధను విన్నవించుకొనుచుండెను. ఈ కూర్పులకు సంతసించి పండితులు, పామరులు, ఉద్యోగులు, ధనికవర్తకులు పఠన సమయమునకు దినదిన ప్రవర్ధమానోత్సాహముతో మూగుచు, దైవ మెట్లను గ్రహించునో చూచుటకు వినోదించుచుండిరేకాని, యొక్కడైన వారిలో జాలిచెంది, ముందునకువచ్చి, గణపతి శివరాముల కన్నబాధ తీర్చెదనని పల్కుటకు సాహసించలేదు. తుదిదినమున గ్రంథమంతయు తిరుగ చదువబడునని విని పురములోని యాబాలవృద్ధము వచ్చి నిశ్శబ్దముగా నిలబడి వినిరి. సంస్కృతము బోధపడకున్నను, పెక్కుమంది వచ్చి యంత శ్రద్ధగా వినుటబట్టి స్తుతిలోని శబ్దస్పందములు హృదయాకర్షణ పటుతరములై యున్నట్లు విశదమగును. క్షుద్బాధ హేతువైనను, అగాధ భక్తి కదలగా హృదయాంతరాళమునుండి వెడలిన యీ స్తుతిని చదువుచున్నప్పుడు గణపతి చెక్కిళ్ళనుండి కంటిధార లెట్లు స్రవించుచుండెనో, అట్లే వినువారి చెక్కిళ్ళను గూడ నా తరంగములు చెమ్మగిల జేసెను. అరుణాచలమందు వసించు బ్రాహ్మణస్వామియను నొక మహా మౌనియు, శేషాద్రిస్వామియను నొక యోగియుగూడ నా దిన మాకర్షింపబడి, వందల కొలది ప్రేక్షకులను తన్మయమొనర్చి వారి హృదయవీణ లన్నిటియందొకే నాదమును మీటుచున్న గణపతి వాఙ్మహిమకు విస్మయపడిరి. అట్టి స్తుతివాక్కు హృదయరూపుడని ప్రసిద్ధిగాంచిన యరుణాచలేశ్వరుని తాకిన ట్లించబడదా ? అది నిశ్చయముగా స్పృశించి, యతని దివ్యకృప యందరి హృదయములనుండి గణపతిపై ప్రతిఫలించునట్లు చేసెను. కనుకనే కావ్యకంఠునియం దదివఱ కనాదరణమును జూపిన పండితులు, సంపన్న గృహస్థులు స్తుతిపఠనాంతమం దతని చుట్టును జేరి తమ యనాదరణమునకు క్షమింప వేడిరి. మఱియు, సిద్ధకవియు, మహాభక్తుడునగు గణపతిని బ్రాహ్మణస్వామి వలెను, శేషాద్రిస్వామివలెను తమ యూరివానిగా జేసికొనుటకు వా రుపాయము నాలోచించి, వెంటనే సంస్కృత పాఠశాలయం దధ్యాపకత్వమును కల్పించి, యది స్వీకరింపబడువఱ కతనిని బ్రతిమాలిరి. వారభోజనములను సమృద్ధిగా చేకూర్చుటతోపా టుద్యోగమునుగూడ నిచ్చి తన క్షేత్రమందుంచుకొనిన యరుణగిరీశుని యనుగ్రహమునకు గణపతి సంతసించెను. తొలినాటి రాత్రి యపీతకుచాంబానుగ్రహమునకు వలెనే యీ నా డీశ్వరుడు జూపిన యనుగ్రహమునకు గూడ తన క్షుద్బాధ కారణభూత మైనందులకు శివరాము డతిశయించెను.

ఇట్లు మాటిమాటికి తన భక్తి దృఢమగుటకు కారణభూతుడైన శివరాముని యందు వాసిష్ఠునకు వాత్సల్యమధికమై, వానిని తనయొద్దనే యుంచుకొనగోరి యతడు తండ్రి యనుమతికి వ్రాసెను. తండ్రి యనుమతించెనుగాని శివరాముడే

యీమా రింటికి బోవుటకు పట్టుపట్టెను. వాని యభీష్టమున కడ్డుచెప్పక వాసిష్ఠుడు ధనమీయగా నతడది గైకొని 'పాపనాశన'మను క్షేత్రము దర్శించి, యందుండి స్వగ్రామము బోయెను.

అధ్యాపకవృత్తిని స్వీకరించినప్పటినుండి వాసిష్ఠుడు బసకూడ పాఠశాల యందే పెట్టుకొనెను. ఈ వృత్తికి ద్రవిడ భాష రావలెనను నిబంధనయున్నను, పదునైదు దినములలో వాసిష్ఠుడా భాషను మాట్లాడుట, వ్రాయుట, చదువుటగూడ నేర్చెదనని యొప్పించి వృత్తిలో బ్రవేశించి, యీ మూడింటిని పది దినములు ముగియకుండ కైవసము జేసికొని, విద్యార్థులకు సుఖముగా నా భాషలో పాఠములను బోధపరచుటకు ప్రధానోపాధ్యాయు డాశ్చర్యచకితుడయ్యెను. ఇట్లు దేనినైన నవలీలగా కబళించు బుద్ధివిక్రమము, ననర్గళ కవితాధార వాసిష్ఠునియందు ప్రకటితమైన పిదప నతనికి శాస్త్రములందుగూడ నసమాన పాండిత్యమున్నదని క్రమముగా వ్యాప్తమయ్యెను. ఇన్ని వైభవములున్నను, అతనికి సాధారణ పండితులవలె లౌకికవృత్తియందు ప్రకాశించవలెనను కాంక్ష లేకుండుటయు, దృష్టి హెచ్చుగా తపోవృత్తిపై లగ్నమగుచుండుటయు గమనించి పండితబృందమంతయు నతనిని తగు గౌరవముతోడను, భక్తితోడను సేవింపదొడగిరి. కేతకీపుష్ప పరిమళ మెంత దాచదలచినను దాగియుండునా ? అది వ్యాప్తమగుకొలది కీటకరాసులు పరివేష్టించునట్లు పురజను లతనిని పాఠశాలవేళలందు తక్క యితర వేళలందు రాత్రియనక, పగలనక పరివేష్టించుచు, తుదకు రాత్రులందైన జపము చేసికొనుట కతని కవకాశము లేకుండ చేయదొడగిరి. ఒక నా డీ పరిస్థితినే తలపోయుచు నొంటరియై కూర్చుండియుండగా, పురమందు బ్రాహ్మణస్వామియొక్క యచంచల తపోనిష్ఠను గురించి వినుచున్న కథలు తలపునకు వచ్చి, భగవంతు డతని కనామయపదము ననుగ్రహించి యుండునని తట్టెను. వెంటనే యట్టి పదము తా నింత కాలము నుండి తపస్సు జేయుచున్నను బొందలేక పోయినందుకు నిస్పృహకు లోనయ్యెను. ఆ సమయమం దతని ముఖమునుండి యొక శ్లోకమిట్లు వెడలెను:

శ్లో॥ "వృత్తిదాన విముఖేనకిం
త్వయా దీయతే నిజమనామయం పదమ్?।
కిం దదాతి హర! సర్వ మాపణం
విట్టికాశకల దానదుర్మనా:?॥"

(అర్థము:- ఓ హరా! వృత్తినిచ్చుటకే విముఖుడవైన నీచే ననామయ పద మీయబడునా? పసుపుకొమ్ము ముక్క (నిశాశకల) నిచ్చుటకు లోభియైన వైశ్యుడు (విట్) యంగడిము నడిగినచో నిచ్చునా?)

ఆ మఱునాడే గణపతికి బ్రాహ్మణస్వామిని దర్శించవలెనని సంకల్పము

కలిగి, విశ్వనాథయ్యరను నొక పరిచితుని సహాయమున కొండపైకి వెళ్లెను. అదివఱ కతని పటమును మాత్రము చూచెను. హరసహస్రము తుదిరోజున మహా సన్నిధిని పఠించినప్పు డత డొక మూలను కూర్చుండి వినుట గణపతి యానాటి యవస్థలో గమనించలేకపోవుట సహజమే గదా! కాని, యితనిని గుఱించి పురవాసులకు తెలిసినంతవఱకు వినిన కథ గణపతి నాకర్షించెను. అది యిట్లున్నది:

ఈ బ్రాహ్మణస్వామి మధురకు సమీపమందున్న తిరుచ్చుళి యను గ్రామమున ప్రమాది సంవత్సర మార్గశిర బహుళ విదియ, సోమవారమునాటి రాత్రి సూర్యాస్తమయాది 9-30 ఘడియలకు పునర్వసు నక్షత్రమందు (30-12-1879) జన్మించినందున వాశిష్ఠగణపతికంటె 11 మాసములు వెనుక బుట్టినట్లయ్యెను. ఆ దినము శైవులకు పుణ్యప్రదమగు ఆర్ద్రా దర్శనదినమై, క్షేత్రదైవమగు భూనాథేశ్వరునకు, దేవియగు సహాయాంబకు నుత్సవదినముట. రాత్రి యూరేగింపునుండి యాలయమునకు మఱలుచు రథము గోపురమునం దల్పకాల మాగియున్న సమయమందు బ్రాహ్మణస్వామి జన్మించెనట. పుట్టినప్పుడు బిడ్డడొక దివ్యజ్యోతిచే నావరింపబడియుండుట చెంతనున్న నొక గ్రుడ్డియామె చూడగల్గెనట. ఇతని తండ్రి పేరు సుందరమయ్యరు. తల్లి పేరు అళఘమ్మ. వీరి కులదైవము వేంకటేశ్వరుడైనను, అళఘమ్మ శివపంచాక్షరీ భక్తురాలట. బాలునకు వేంకటరామన్ అని కులదైవనామ మొంచబడెను. ఇతడు గణపతివలెనే ముగ్గురు సోదరులలో మధ్యముడు. చిన్నతనమందే గణపతి తన తల్లిని గోల్పోయిన ట్లితడు తన తండ్రిని గోల్పోయెను. ఆ లోటు దీరుటకు గణపతి కుపాస్య దైవము శక్తియైనట్లే యితని కీశ్వరుడయ్యెను. కాని, గణపతి వలె గాక నితడింటి సంప్రదాయము ననుసరించి యాంగ్ల విద్య నభ్యసించి, మెట్రిక్యులేషను తరగతి చదువుచుండగా నింటినుండి పలాయనమై యరుణాచల క్షేత్రమును 1-9-1896వ తేదీనాడు చేరెను.

ఇల్లు 29-8-1896వ తేదీనాడే విడిచెనట. విడుచునప్పుడితడు తన యన్నగారితో బడికి పోవుచున్నట్లు చెప్పగా, అన్నగారు తన కాలేజీ జీతమును దారిలో కట్టిపొమ్మని యితని కాజ్ఞాపించి, యా జీతము పైకమును తన పెట్టెనుండి తీసికొమ్మనెను. పలాయనమునకు ధనము చిక్కెనని యెంచి, పెట్టెలో నైదు రూపాయిలున్నను మూడింటినే తీసికొని యొక జాబు వ్రాసి యా పెట్టెయం దగపడునట్లుంచెను. ఆ జాబిట్లుండెనట:

"నేను నా తండ్రిని వెదకుచు, నా తండ్రి యాజ్ఞానుసారము ఇక్కడ నుండి బయలుదేరితిని. ఇది సత్కార్యమునకే బయలుదేఱుచున్నది. కాన, నెవరును

ఈ విషయమును గూర్చి చింతింపనక్కఱలేదు. దీనిని వెదకుటకు ఏమాత్రమును ద్రవ్యమును వ్యయింప నక్కఱలేదు.

నీ కాలేజ జీతము కట్టబడలేదు. రెండు రూపాయలిందున్నవి.

ఇట్లు,

........................"

చిన్నతనమందు బ్రాహ్మణస్వామి యాటలయందు, కుస్తీలయందు నధిక శ్రద్ధ జూపుచుండినను, పలాయనమున కొక సంవత్సరము పూర్వమునుండియు సమయము దొరికినపుడెల్ల ధ్యానమున మునుగుచుండెడివారట. దీనినిబట్టి యప్పటికే 'నే'ననునది శరీరమునకు భిన్నమై, యవినాశమగు వస్తువను వివేకానుభవము ప్రాప్తించియుండును. అట్లుగానిచో పై లేఖయందు 'ఇది' యని శరీరమును పేర్కొని యుండడు. మఱియు లేఖారంభమున 'నేను' అను పదము నలవాటుచొప్పున నతడు వాడినను, సంతకము వచ్చుసరికి తన నిజతత్త్వ వివేకస్ఫూర్తి కర్తవలె వ్యవహరించుట కియ్యకొనినట్లు లేదు. ఇంక యరుణాచలమును గుఱించి యదివఱకు విని, యీ అచలరూపమే భగవంతుడైన తండ్రియని భావించి, యతని దివ్యానుగ్రహము నింటికడనే పొంది, యతడుండు క్షేత్రముమాత్ర మెక్కడ నున్నదో తెలియక వెదకుటకై బయలుదేరినట్లు స్పష్టముగా లేఖ సూచించుచున్నది. కనుకనే క్షేత్రమును కనుగొని, పొందిన నాటినుండి యీ యనుగ్రహ ఫలముగా బడసిన 'అహం' మూలజ్ఞాన నిష్ఠయం దచంచలుడై యుండిపోయెను. బాలుని యీ నిష్ఠకు కొంటెపిల్లవాండ్రు కొందఱు పరిహసించి హింసింపగా, వారి యాగడములకు తట్టుకొనలేక ఆలయమునుండి 'పవళకున్ను' అను కొండపైకి, యందుండి కోవెలలోని వెయ్యికాళ్ల మండపమునకు మార్చి, తుదకా మండపము ప్రక్కనున్న పాతాళలింగముండు గోతిలో నిర్వికల్ప సమాధిగ్రస్తుడై మూడుమాసము లించుమించుగా నుండిపోయెనట. అటుపిమ్మట జ్ఞానవిజయమును బొంది, కొన్నాళ్లక తోటలోను, కొన్నాళ్లు గురుమూర్తమందు, కొన్నాళ్లితర స్థలములందు నిట్లు పరిచర్యలు సల్పుట కొక్కొక్కరే యమరగా నిశ్చలధ్యానమున గడిపి, తుదకు గిరి నధిరోహించెను. గిరియందు పెక్కు గుహలున్నవి. వానిలో కొన్ని గుహలు స్పష్టగోచరములు, కొన్ని కంటి కగపడనివి. అదృశ్యములగు గుహలందు సిద్ధపురుషులిప్పటికిని యున్నట్లు చెప్పుదురు. మిగిలినవాటిలో విరూపాక్షగుహ ప్రధానమైనదని యెంచి బాబోలు స్వామి గిరినధిష్ఠించినప్పుడీ గుహలో తొలుదొల్త ప్రవేశించెను.

స్వామి గిరి నెక్కుసరికి ధనార్జనపరులై, కపటవేషములను ధరించిన సాధువులు పలువురు కొండనంటియుండెడివారు. స్వామి కొండనెక్కిన నాటినుండి యీ మోసగాండ్రకడ కెవ్వరును పోవుట మాని, సాక్షాద్భగవంతుని వలె గన్పట్టు

స్వామినే దర్శించుచుండుటవలన కపటసాధువుల ఫణితి పడిపోయెను. ఆ కారణమున నట్టి సాధువులు కొందఱు తమంతట తామే యితర క్షేత్రములకు బోయిరి. కొందఱు స్వామిని బెదరించి తుదకు వారే బెదరి పాఱిపోయిరి. స్వామి యెవ్వరిని రమ్మనడు, పొమ్మనడు. ఉలకడు, పలకడు. నిరంతర నిష్ఠయందుండు నలవాటుచే మౌన మభ్యసింపబడకున్నను సహజమైపోయెను. కొన్నాళ్లకు కంఠనాళములు స్రవించుటయు మాని, మాట్లాడదలచినను మాటలు స్పష్టముగా వచ్చినవి కావు. ఒకటి రెండుసార్లేదో గ్రంథార్థమును గుఱించి తనకు సేవలొనర్చు ఫలనిస్వామితో తగుమాత్రము వాక్కుల నతి కష్టముపై పల్కెనట. కాని, యుపదేశవాణి మాత్ర మెవ్వరికిని యతనినుండి చిల్కబడలేదు. అది యెంతకాల మణగియుండునో, యెవరి కొఱకది యణచబడియుండెనో తెలియకుండెను.

ఈ కపటసాధువులలో పద్మనాభస్వామి యను జటాధారి యొకడింకను బ్రాహ్మణస్వామి దర్శనము కొఱకు వాసిష్ఠుడు వెళ్లుసరికి మిగిలియుండెను. అతడు విరూపాక్ష గుహకు తగుదూరములో నొక యాశ్రమమున నుండెను. ఇతడు ''బ్రాహ్మణస్వామి యింకను బాలుడు, అతని కనుభవమింకను జాల'' దని చెప్పుచు, కొందఱి నింకను ఆకర్షించుచుండెను. ఇతని దాంబిక వచనములు తఱచు విని, మోసపోయినవారిలో వాసిష్ఠునకు సహాయముగా వెళ్లిన విశ్వనాథయ్యా రొకడు. వాసిష్ఠుడింకను క్రొత్తవాడగుటవలన అయ్యరు వెనువెంట నతడు చెప్పునది కాదనజాలక పోవుచుండెను. వీరు విరూపాక్షగుహకు వెళ్లుసరికి బ్రాహ్మణస్వామి యక్కడ లేడు. అయ్యరుకది పండుగయై ''పోనిండు. బ్రాహ్మణస్వామికంటె నధికుడైన సాధుపురుషు డొక్కడీ ప్రక్కనే చిరకాల తపస్సువలన శిరస్సు జడలు గట్టియున్నాడు. చూపెదనురం'' దని వాసిష్ఠుని పద్మనాభాశ్రమమునకు మఱల్చెను. కాని, వీ రా యాశ్రమము దరి జేరుసరి కక్కడ వెలుపల నున్న ఒక ఱాతిపై గూర్చుండి బ్రాహ్మణస్వామి యున్నందున వాసిష్ఠుని కోర్కె వ్యర్థముకాలేదు. అతని చిత్రపటము నదివఱకు జూచిన కారణమున వాసిష్ఠు డతనిని త్రుటిలో గుర్తించి, యతని యోజస్సున కబ్బురపడెను. అతడుగూడ కన్నెత్తి వాసిష్ఠుని తిలకించెను. ఉభయుల దృష్టులు కలసెను. ఆ కలయికయందే యొకరినొకరు గుర్తించుకొనినట్లు మందస్మితములచే నభినందించుకొనిరి. మహిమచే జ్వలించుచు, విశ్వముకంటె నతీతుడై గన్పట్టుచు, పెద్ద శిరస్సు గలిగి కాశిలో దుర్గామందిర మోగిచే పేర్కొనబడిన 'స్థూలశిరస్సు'ను నామమున కితడు తగియున్నట్లు దోచినందున వాసిష్ఠుడితనికి చేతులు జోడించి నమస్కరించెను. అది గాంచినంతనే అయ్యరు కలవరపడి వాసిష్ఠుని దృష్టి నాత్రమ ముఖముకడ వ్యాఘ్రాసనాసీనుడైయున్న పద్మనాభుని వంకకు మఱల్చి, యతనిని వాసిష్ఠునకు, వాని నతనికి పరిచయము గావించెను.

సూర్యునిముందు దివ్వెవలెనున్న పద్మనాభుని జూచినప్పుడు వాసిష్ఠుడు నమస్కరించలేదు సరికదా, అతని యాజ్ఞనైన గైకొనక చతికిలబడెను. ఈ పరాభవమును గ్రహించిన జటాధారి పరాభవింపదలచి, గర్వమును సవరించుకొనుచు "ఏమండీ శాస్త్రిగారూ! మీరు గణపతి నామధేయులు, పండితులు గదా. గణపతి స్తుతియైన 'శుక్లాంబరధరం....' శ్లోకమునకు విష్ణుపరమగు నర్థమును జెప్పగలరా" యని ప్రశ్నించుటకు సాహసించెను. శూద్రున కింత సాహసమా యని గణపతి కొంచెము రెచ్చి, శ్లోకమునకు విష్ణుపరమగు నర్థమునేగాక బ్రహ్మపరమగు నర్థమునుగూడ చెప్పి, యంతటితో నూరకుండక "చూడు మీ బ్రాహ్మణస్వామిపరముగా గూడ నన్వయించెద"నని పల్కుచు, నిట్లు వ్యాఖ్యానించెను: "బ్రాహ్మణస్వామి తెల్లని కౌపీనమును ధరించెను గనుక శుక్లాంబరధరుడు, సర్వవ్యాపకుడగుటచేత విష్ణువు, చంద్రునివలె శోభించు శరీరముగలవా డైనందున శశివర్ణుడు, మనోబుద్ధ్యహంకార చిత్తముల నాల్గింటిని భుజించినవాడు గావున చతుర్భుజుడు, చూచువారికి ప్రసన్నవదనుడు. ధ్యానించువారికి సర్వవిఘ్నముల నుపశాంతింపజేయును."

ఈ చమత్కార వ్యాఖ్యానమునకు సంతసించినట్లు బ్రాహ్మణస్వామి చిఱునవ్వుతో కావ్యకంఠు నభినందించెను. పద్మనాభస్వామికి మఱింత సిగ్గుచేటయ్యెను. అయ్యరు నిర్విణ్ణుడై, తన స్వామి పరాభవమునకు తానే కారకుడైనట్లు భయపడెను. ఈ రీతిగా బ్రాహ్మణస్వామికి వాసిష్ఠగణపతి తన తొలి పరిచయమందే వ్యాఖ్యాత యైన చోద్యమును పాఠకులు గుర్తింతురు గాక! ఏ బ్రాహ్మణస్వామియందు కార్తికేయావతరణము మున్ముందు విదితమగునో; ఎవడు 'అహం' తత్త్వమును ప్రతిపాదించి, తన్మూలమున ననాహత చక్రమునకు దక్షిణముగా నుండు సూక్ష్మహృదయమును నిర్వచించి, పాతంజల యోగ సూత్రములకు మించిన సత్యమును జూపెనో; ఎవడు అభిమానమనబడు లక్షణము దేహపరమైనప్పు డహంకృతికి హేతువగుచున్నను, ఆత్మపరమో, దైవపరమో అయినప్పు డది యహంవస్తువు నందు సహజ లక్షణమువలె ప్రకాశించునని సూచించి, తన్మూలమున జగజ్జీవేశ్వరుల కీ యభిమాన లక్షణము సంబంధసూత్రమై, దాని ప్రసారముఖ వ్యత్యాసముచే మూడింటిని బ్రాప్తింపజేయుచున్న ట్లెఱిగించి మాయావాదమును సంస్కరించెనో; ఎవని యుపదేశవాణి గణపతి కొఱ కరికట్టబడి మున్ముం దతనిని బొందినప్పు డతని నుండియే లోకముకొఱకు వ్యాఖ్యాతయయ్యెనో; అట్టి లోకబాంధవుడైన సూర్యునివలె నవతరించిన బ్రాహ్మణస్వామి యను జ్యోతిర్మూర్తికి ప్రభవలె ప్రకటిత వ్యాఖ్యాత యగుట కవతరించిన గణపతి యీ "శుక్లాంబరధర" శ్లోక వ్యాఖ్యానముచే నకస్మాత్తుగా బ్రాహ్మణస్వామికిని, గణపతి యంశను బొందిన తనకును గల సారూప్యము నుదాహరించుకొనిన విషయమునుగూడ పాఠకులు గుర్తించుకొందురుగాక,

ఈ విధముగా తన కీ జన్మయందు నేతగావలసిన 'స్థూలశిర'స్సనబడు లక్షణ నామాంకితుడే బ్రాహ్మణస్వామియని గణపతికి స్ఫురించినను, నేకాంతముగా నతనితో ముచ్చటించుట కానాటి సన్నివేశ మవకాశమీయలేదు. అతని కర్పించుకొనుట కంతకంటె గణపతి బుద్ధి నీశ్వరుడు పోనీయలేదు. స్వామి తెల్లని కౌపీనము ధరించి బ్రహ్మచర్యమును దోపజేయుచున్నను, బ్రాహ్మణ బ్రహ్మచారి కుండవలసిన యజ్ఞోపవీతమును విసర్జించెను. అది యొక లోపమై యాచార నియమముల నతి శ్రద్ధగా పాటించు గణపతికి దోచి, యతని బుద్ధిని మాయవలె గప్పెను. ఎంతెంత స్వల్ప విషయములైన నొకప్పుడు కార్యవిలంబనమున కెట్లు కారణములగునో కదా! ఈశ్వర నిర్ణీత సమయము రానప్పుడిట్లే పండితులకుగూడ విచక్షణ యొక శంకచే నడ్డగింపబడుచు, వారికే పిదప చోద్యమగుచుండును. ఆ మార్గశిర మాసములోనే శివరాముని సహాయముతో విశాలాక్షమ్మ వచ్చి, యరుణాచల క్షేత్రమున కాపురము స్థాపించెను. ఆమెకును, అయిదేళ్ల వయస్సుగల పుత్రునకును బ్రాహ్మణస్వామి దర్శనము చేయించవలెనని మాత్రము గణపతికి ముఖ్యమై తోచెను. వారి కతని దర్శనము చేయించినప్పుడైన నతని కర్పించుకొనవలెనను తీవ్రత గణపతియందు జనించకుండున ట్లీశ్వరుడే యణచెను.

ఇట్లరుణాచలవాసమును, తద్వారమున స్థూలశిరస్సు పరిచయమును బ్రాప్తించజేసినది 'హర'స్తుతియే యైనను, హరుని దర్శనము నది బ్రాప్తింపజేయ లేకపోయెనని గణపతికి కిన్కజనించి, దానిపై ననాదరణము తోచెను. అందువలన దాని నతడు చించి పారవేసి, తన స్మృతినుండియు దానిని తొలగించెను. కల్పట్ రామస్వామియను శిష్యుడు దీనికొక ప్రతి వ్రాసికొనెను. కాని, దానినింటికి గొంపోయి హఠాత్తుగా చనిపోయెను. పిదప వాని యింట గ్రంథముకూడ మాయమయ్యెను. దానిలో నైదు శ్లోకములు మాత్రము లభ్యమై, యిట్లుండెను:

1. అరుణాచలరూపేణ పరిణామ ముపాగతమ్।
   జ్యోతిర్మయం పరం బ్రహ్మ జ్ఞానాయ మమ కల్పతామ్॥
2. అరుణాచల రూపో వః కరుణా వరుణాలయః।
   భువనాధిపతిః కశ్చి దవనాయ ప్రకల్పతామ్॥
3. ఇహాలంకార మాధుర్య ధ్వనయః సంతి వా నవా।
   ఏకో నామధ్వనిః శంభో రస్వాదాతుం విదాం మనః॥
4. అలంక్రియన్తాం చిత్రార్థైః ప్రాచాం వాచో విపశ్చితామ్।
   యశ ఏవ మహేశస్య భాషాయా మను భూషణమ్॥

5. అస్తి ప్రేమ మహేశ్వర త్వయి
మహ ద్ధ్యాతుం చ వాంఛామి తే।
పాదాంభోజ యుగం తదాఽపి
చలతాం చేతో న మే ముంచతి।
కామాః సన్తి సహస్రశః
పశుపతే! పశ్చాద్బ్రవీ మ్యగ్రతః।
చిత్తస్య స్థిరతాం ప్రదేహి
కరుణా యద్యస్తి తే వస్తుతః।

ఓం

మూడవ ప్రకరణము

# పూర్వజన్మ మిత్రలాభము, చెన్నపురమం దవధానకీర్తి లాభము

అరుణాచలక్షేత్రమం దధ్యాపకవృత్తి లభించి యక్కడ స్థిరనివాసము సమకూడినప్పటినుండి వాసిష్ఠునకు వేదమును స్వరయుక్తముగా నేర్చి, దాని భాష్యమును స్వాధీనము గావించుకొనవలెనను ప్రేరణము బుద్ధియందు గాఢమై తోచెను. కావ్యశాస్త్రేతిహాసములందు సమగ్ర జ్ఞానము గల్గినను, మన మతమున కాధారమై, విజ్ఞానకోశమై యొప్పు వేదమును స్వాధీనమొనర్చుకొనువఱకు తనయందు పండితలక్షణము సార్థకము కాజాలదు గావున వాసిష్ఠు డింతకాలము తనచే నశ్రద్ధజేయబడిన లోటును దీర్చుకొనుటకు బూని, వేదపాఠశాలలోని యొక వేదపండితునికడ పాఠము మొదలిడెను. మొదలిడిననాటినుండి యెల్లరకు నాశ్చర్యము గొల్పునంతటి పాఠభాగము నతని బుద్ధి కబళింపజొచ్చెను. అంతేగాక, గ్రహించిన నా బుద్ధి యెన్నాళ్లయిన ధరించు వైభవమునుగూడ పొందియున్నందున నలసట యను మాట లేనట్లొక్క సంవత్సరము ముగియు లోపున 'అగ్నిమీళే' మొదలుకొని 'సుసహాసతి' పర్యంతము గల వేదమునంతను స్వరయుక్తముగా వశమొనర్చుకొనెను. అటుపిమ్మట వాసిష్ఠు డొరుల సహాయము లేకనే సాయణాచార్యుని వేదభాష్యము నామూలాగ్రము పఠించి, తనకు వేదము చెప్పిన గురునకు గురువై వేదార్థ మతనికి బోధించెను.

ఈ వైభవమును జూచిన పిదప వాసిష్ఠు నన్నివేళలందును పండితులో, కవులో, మిత్రజనులో పరివేష్టింపజొచ్చిరి. శాస్త్రవేత్తలు తమకు శాస్త్రములందు గలుగు సందేహముల దీర్చుకొనుటకు, ఋత్విజులు తమకు యజ్ఞయాగాది క్రతువులందు వచ్చు శంకల బరిష్కరించుకొనుటకు, కవులు తమ కృతులను దిద్దించి మెఱుగు బెట్టించుకొనుటకు, సాధారణ సంసారులు తమ్మెదుర్కొను నరిష్టములను దాటుట కుపాయముల నర్థించుటకు - నిట్లన్ని విధముల గణపతిని బరివేష్టించు జనులవలన గణపతి బసచేసియున్న యిల్లొక విధముగా భక్తులచే దర్శింపబడు గణపతి దేవాలయమును స్మరింపజేయ దొడగెను.

ఇట్లుండ మిత్రులు కొంద ఱొకనా డొక నూత్న వ్యక్తిని దీసికొనివచ్చి వాసిష్ఠపరిచయ మతనికి గావించిరి. అతని పేరు శాతంజేరి రామస్వామి అయ్యరు. అయ్యరని పిలువబడుచున్నను అతడు తెనుగువాడై బి. యే. ప్యాసయి చెన్నపురములో

హైకోర్టు గుమాస్తాపదవియందుండి తన సుగుణ సంపదలచేతను, పేరుప్రతిష్ఠలను బొందిన పెద్దకుటుంబమునకు జెందియుండుటచేతను చెన్నపుర మందున్న పెద్ద వకీళ్లకును, హైకోర్టునకు జెందిన ఉన్నతోద్యోగులకును హితుడై యుండెను. స్వస్థలము కాంచీపురమైనను నుద్యోగవశమున చెన్నపుర మితనికి నివాసస్థలమయ్యెను. ఇత డేదో కార్యావసరమున తిరువణ్ణామలై వచ్చి వాసిష్ఠుని వైభవముల నాలకించుట తడవుగా నొక దివ్యప్రేరణము బొందినవాని వలె వాసిష్ఠ దర్శన మపేక్షించి వచ్చెను. వచ్చి వాసిష్ఠుని ముఖవర్చస్సును తిలకించినంతనే యపూర్వానందోద్వేగమునకు గుఱియై వాసిష్ఠపాదములను సోకి 'నన్ను మీ వానిగా గ్రహించవలె'నని విన్నవించు కొనుటకు మిత్రులందరు నిశ్చేష్టులయిరి. అతని స్పర్శకు వాసిష్ఠు డంతర్వాణీ ప్రబోధమును బొంది 'నీవు నాకు చిరకాల సన్నిహితుడవు సుమా'యని పల్కుచు వాని నాదరపూర్వకముగా గ్రుచ్చియెత్తెను. ఆ పల్కుల కతని చిత్తము శాంతించిన కారణమున నంతవఱకు తనయందు బలీయమై స్ఫురించిన భావమును విశ్వసించి, యానాటినుండి యతడు తన ప్రపితామహుడైన * 'ఉపనిషద్బ్రహ్మ' నామధేయుడే వాసిష్ఠ గణపతియై యవతరించెనని గాఢముగా నమ్మజొచ్చెను.

---

* ఇతడు కాంచీపురమున శాతంతేరివారి కుటుంబమున నుద్భవించెను. తల్లికొకనాడు తన యిష్టదేవత దర్శనమిచ్చి పాయసమీయగా, దానిని త్రాగి యామె గర్భవతియై యితనిని కనినట్లు చెప్పబడును. మఱియు బాలుడు నాలుగేండ్ల వయస్సున నుండగా నా యిష్టదేవత బాలుని కగపడి యతని నాలుకను తన చీరతో తుడిచిన పిదప దానిపై నేవో బీజాక్షరములను వ్రాసి యనుగ్రహించినట్లును, తత్ఫలముగా నతడు బాల్యము దాటకపూర్వమే పండితుడు, భక్తుడు, కవి కాగల్గెననియు చెప్పబడును. ఇతడు చిన్ననాటినుండి రామభక్తుడై, సంగీత పితామహుడైన త్యాగరాజుతండ్రికి ప్రియసఖుడు, నాదర్శమిత్రుడునై యుండెనట. ఇతడు వివాహమాడి యొక పుత్రుని బడసిన పిదప సంసారమునం దంటీయంటకుండునట్లు మసలుచు కాంచీపురమున ప్రసిద్ధమైయొప్పు సర్వతీర్థమను తటాకముకడ ధ్యానముచే గడపుచుండగా నతనికా యూరి వెలుపల నొక యాశ్రమమును నిర్మించి, యతని పోషణభారమును వహించ వలసినదిగా కావేటినగర రాజును భగవంతుడు స్వప్నమం దాదేశించెను. వెంటనే రాజా కార్యమును నిర్వహించినందున నితని తపస్సున కనుకూలస్థల మేర్పడెను. కాని, దానియందు ప్రవేశించిన కొలదికాలమునకే తన యిష్టదైవము వ్యాఘ్రరూపమున ప్రత్యక్షమై యితనితో సంవాదమొనర్చి, యితనిని సన్న్యాస స్వీకారమునకై యొప్పించిన పిదప యథారూపమున దర్శనమిచ్చి యనుగ్రహించి యుపనిషత్తుల సామరస్యమును గ్రంథరూపమున వ్రాయ ప్రేరేపించెనట. మఱియు నితడు తన జన్మబంధము నుండి విముక్తి నర్థించగా 'నీ వయోనిజుడవు. నీకు జన్మబంధ మెక్కడి'దని యా భగవంతుడు శ్లోకరూపమున బల్కి యంతర్ధానమయ్యెనట. నాటినుండి యితడు సన్న్యాసమును భగవత్ప్రసాదముగా స్వీకరించి, భగవంతు డాజ్ఞాపించిన గ్రంథమును రచించి 'ఉపనిషద్బ్రహ్మ'మను నామముచే కీర్తింపబడెను. ఇతనికి పెక్కుమంది శిష్యులుండిరి.

అంతేగాక, వాసిష్ఠునికడ నతడా మఱునాడు మంత్రదీక్ష గైకొని వాసిష్ఠ శిష్యుడయ్యెను. అతడు చెన్నపురము వెళ్లుచు గురుని తన యింటి కాహ్వానించగా 'నింకొక సమయమందు వచ్చెద'నని యాచార్యుడు పల్కి, వానిని సాదరవచనము లతో సాగనంపెను. వెళ్లునప్పు డతడు గురునియందు తనకు గలిగిన ప్రపితామహస్ఫూర్తిని విన్నవించుకొని, యా ప్రపితామహుని నుండి వృద్ధిజెందిన తన వంశస్థుల * పట్టికను వ్రాసియిచ్చి, వారందరిపై గురుని యాశీర్వాద మర్థించెను.

ఈ రామస్వామి అయ్యరు నెల కొకసారియైన వాసిష్ఠ దర్శనార్థమై వచ్చుచు, నొకనాడు వాసిష్ఠుని పాదముచే తన యిల్లు పవిత్రముగుటకై యొత్తిడి చేసి చెన్నపురము తీసికొని వెళ్లెను. అక్కడకు వెళ్లినతోడనే నేత్రదృష్టి లేని రామస్వామి అయ్యరు తల్లి వాసిష్ఠ పాదములను తాకిన పిదప తా నదివఱ కట్టి పాదముల నెప్పుడో తాకిన స్మృతి కలిగినట్లుడివి వాసిష్ఠున కాశ్చర్యము బుట్టించి, రామస్వామి నమ్మికను మఱింత దృఢపరచెను. అతని మాతృసేవాపరాయణతకు వాసిష్ఠుడు చాల సంతసించెను. దూరస్థలములం దతనికి పెద్ద యుద్యోగములు ప్రాప్తించినను తల్లిని కష్టపెట్టుట కిష్టములేక, వాటిని వదలుకొనిన విషయము వినినప్పుడు వాసిష్ఠున కతని యుదారత విశదమయ్యెను. అతనితోగూడి చెన్నపురమంతయు వెళ్లిననాడే వాసిష్ఠుడు కలయజూచి యా మఱునాడు తిరువణ్ణామలై పయనము కాదలచెను. కాని, శిష్యుని యనురోధమువలన నింకొక దిన మాగిపోయెను.

ఆనాడు రామస్వామి అయ్యరువలన విని వాసిష్ఠుని జూడ వేడుకతో పంచాబకేశశాస్త్రి యను పేరుగల హైకోర్టు వకీలు తన వెంట ప్రసిద్ధ పురుషుల నిరువురను తీసికొని వచ్చెను. వారిలో నొకరు వేదం వేంకటరాయ శాస్త్రిగారు. రెండవవారు [1]తండలం సుబ్రహ్మణ్య అయ్యరుగారు. వీరందరు వాసిష్ఠునితో కొంత ప్రసంగించిన పిదప వేంకటరాయశాస్త్రిగారు ప్రత్యేకముగా 'నన్నొక శంక బాధించు చున్నది. తీర్చెదరా'' యని ప్రశ్నించెను. వెంటనే వాసిష్ఠుని ముఖము నుండి సమాధాన మొక శ్లోకరూపమున వెడలి, యది తన యపార సామర్థ్యమును ప్రకటించునది యగుటకు వారందరు త్రుళ్లిపడిరి. ఆ శ్లోక మిట్లుండెను:-

---

* ఇతడు నూఱు సంవత్సరములు వయస్సున నిండిన పిదప తన సమాధి స్థలమును నిర్మించుటకు శిష్యుల నాదేశించి, యా స్థలమం దాసీనుడైనంతనే శిర శ్కపాలమును భిన్నము గావించుకొని యితని ప్రాణతేజ మేడు నక్షత్ర గోళకములవలె ప్రకాశించి వెడలిపోవుట శిష్యులందరు గాంచి, యితనిని వారిలో కొందఱు సూర్యాంశావతార పురుషునిగను, మఱికొందఱు సప్తర్షులయొక్క తేజోంశలను బొంది యవతరించిన మహనీయునిగను కీర్తించిరి. ఇతనిచే రచింపబడిన గ్రంథమితని మునిమనుమడైన కవ్యపేశ్వరశాస్త్రిచే దివ్యజ్ఞాన సమాజమువారి కీయబడి యచ్చొత్తింపబడెను. ఉపనిషద్బ్రహ్మము యొక్క వంశములో మన కథ కవసర మైన వ్యక్తుల సంబంధమును సూచించు పట్టికమాత్రము దిగువ నీయబడెను.

1. బెస్టు అండ్ కంపెనీలో దుబాష్

శ్లో॥ "స్వతు సర్వజ్ఞ శిరోమణి
'దీధితి' దోషప్రదర్శనేపి పటుః।
భవతాం శంకాః శంకర
హరిణ దృశో హాస నవశాస్త్రీ॥"

(అర్థము:- 'సర్వజ్ఞ శిరోమణి'యైన భట్టాచార్యుని యొక్క 'దీధితి'యను న్యాయశాస్త్రమందును దోషముల జూపుటకు పటుత్వము గలిగి, పార్వతీదేవి యొక్క నూత్న మందహాసమే స్వరూపమై వెలసిన యీ గణపతిశాస్త్రి మీ శంకలను నివారింపగలడు.

ఇంకొక యర్థము:- ఈశ్వర శిరోభూషణమగు చంద్రుని (దీధితి) యొక్క కాంతియందు సైతము దోషము నెంచగల పార్వతీ నూత్న మందస్మిత మేది గలదో, (అనగా నట్టి చంద్రకాంతి నపహసించు పార్వతీహాసమేది గలదో), దానిచే రూపొందిన యీ గణపతిశాస్త్రి మీ శంకలను తుడిచివేయగలడు.)

ఇట్లు పృచ్ఛకునియందున్న గౌరవాతిశయమున నావేశభరితుడై గణపతి శ్లోకరూపమున పై విధముగా బదులిడినను, వినయపూర్వకముగా మఱుక్షణమందే

---

★ శాతంజేరి కుటుంబములోని



శంక నడిగి వేంకటరాయ పండితునకు దృప్తియగు విధమున సమాధాన మిచ్చెను. మిగిలిన యిద్దఱు మిత్రులు గణపతి ముఖమునుండి మాట్లాడుచున్నప్పుడు కూడ ఛందోబద్ధమై వెడలు వాణీ వైభవమును గుర్తించి, యతని కీయబడిన 'కావ్యకంఠ' బిరుదము సమంజసమై యున్నట్లు మెచ్చుకొనిరి. మఱియు ద్వంద్వార్థమునిచ్చు వాక్యము లప్రయత్నముగా కావ్యకంఠుని ముఖమునుండి వెడలుటకు తండలం సుబ్రహ్మణ్య అయ్యరు ఆకర్షింపబడి కావ్యకంఠు నొక్క శ్లోకముచే స్కంద-గణపతి-పార్వతీ-పరమేశ్వరుల కర్థమగునట్లు విచిత్ర కూర్పును చెప్ప వేడెను. తడుముకొనకుండ నుత్తరక్షణమందే దిగువ శ్లోకమును కావ్యకంఠుడు చెప్పెను:

శ్లో॥ "జగతీధర జామాతా
భవతాం భవ్యాయ భూయసే భవతు।
కంచి దకించ న మపి
యద్వీక్షా విదధాతి శక్ర సమం॥"

(అర్థము:- జగతీధర+జామాతా=కొండ కల్లుడైన వాడెవడో-ఈశ్వరుడు; జగతీధరజా+మాతా=కొండకు పుట్టి తల్లియైన దెవరో-పార్వతి; కొండకు బుట్టిన దెవరి తల్లియో-స్కందగణపతులు; వాని (యామె) యనుగ్రహ దృష్టి యేది దరిద్రులను సైత మింద్రతుల్యులుగా జేయునో, అది మీ కధిక మంగళముల కొఱకగుగాక.)

సిద్ధకవియైన గణపతి ముఖమునుండి వెడలిన యీ శ్లోకముచే ననుగ్రహ ప్రసాదము బొందినవారివలె మిత్రులు ముగ్గురును భావించి "మీ కొకసభ నేర్పరచి మిమ్ములను సత్కరింపజేయుటకు మా కవకాశమీయ గోరుదుము. వెళ్లిపోవుటకు మీరు తొందరపడుచున్నారని వింటిమి. మఱి రెండుమూడు దినము లాగజాలరా" యని ప్రశ్నించగా, వారి సౌహార్దమునకు కావ్యకంఠుడు సంతోషమును దెల్పిన పిదప "మా పాఠశాల కీ నెల ముగిసి డిసెంబర్ ప్రవేశించిన తోడనే యొకటిన్నర మాసములు సెలవీయబడును. కనుక నేనప్పుడు మఱల వచ్చి మీ మధ్య సావకాశముగా గడిపెదను. ఇప్పటికి మాత్రము నన్ను క్షమింపవేడెద" నని వారి కుత్సాహమగునట్లు పల్కెను. పిమ్మట వారు సంతసించి వాసిష్ఠ వాక్కునందు విశ్వాసముంచి వెళ్లిపోయిరి.

వారు వెళ్లిన యొక గంటకు రామస్వామి అయ్యరుకు మిత్రుడైన 'యస్. రంగయ్యనాయు'డను నొక తెనుగు పండితుడు వాసిష్ఠ దర్శనముకొఱకు వచ్చెను. ఇతడు క్రిస్టియన్ కళాశాలలో తెనుగు ప్రొఫెసరుగా నుండి, కళాశాలలోని విద్యార్థులకు తెనుగు పరీక్షాధికారియై, పలుకుబడి గలిగియుండెను. ఇతడు తన వెంట నొక వైద్య మిత్రుని గైకొని వచ్చెను. ఆ వైద్యుని పేరుకూడ

రంగయ్యనాయుడే. రంగయ్య వైద్యుడు తాటాకులందు వ్రాయబడిన పురాతన వైద్యగ్రంథమును తనతో తెచ్చెను. పండితులైన వారికత డీ గ్రంథము జూపి, దానిలోని యర్థమును గోరుచు, చెప్పలేనివారిని చమత్కారముగా పరిహసించుచుండును. పండితులకు వైద్యపదముల నిఘంటువు తెలియక, నిఘంటువు తెలిసిన వైద్యులకా గ్రంథములో నతి క్లిష్టముగా వ్రాయబడిన శ్లోకార్థములు తెలియక పరిహాసమునకు గురియగు చుండిరి. ఈ వికటపురుషుని ముందిడుకొని యస్. రంగయ్య నాయుడు లౌక్యముగా వాసిష్ఠుని సమీపించి నమస్కరించిన తోడనే వాచాలుడైన తన మిత్రు డత్యంత వినయముతో సంభాషణమును బ్రారంభించెను. ఆ సంభాషణమం దతడు వాసిష్ఠు నెఱిగినవానివలె స్తుతించెను పిదప "నేను పండితుల సహాయమున నాయుర్వేదమందు కొన్ని వైద్యగ్రంథములను చదివితిని. నే నాంగ్లవైద్యమును చేయుచున్నను. ఆయుర్వేదమం దభిమానిని. మా పూర్వులలో ప్రసిద్ధికెక్కిన ఆయుర్వేద వైద్యులుండిరి. వారి గ్రంథములలో కెల్ల యీ తాటాకులగ్రంథ మపురూపమగు రహస్యములతో నిండి యున్నట్లు విని, దీని యర్థముకొఱ కెందరినో యాశ్రయించితిని. కాని, యీ గ్రంథము పండితులకుగూడ కష్టముగా నుండుట నాకు వింతయగుచున్నది. మహానుభావులైన మీరు దీనిని పరిశీలించి, యిందలి రహస్యములను చెప్పినచో నేను కృతార్థుడనగుదు" నని పల్కెను.

వాసిష్ఠు డా గ్రంథము నందుకొని యతి త్వరితగతిని పుటలు తిరుగ వేయుచు నొక్క గంటసేపటిలో దానిని ముగించి రంగయ్య వైద్యున కిచ్చివేసెను. అటుపిమ్మట దానియం దతడు తెలియగోరిన విషయములను కావ్యకంఠు డడుగగా రంగయ్య కొన్ని చికిత్సావిధానముల వివరములనడిగి, గ్రంథము జూచి చెప్పగోరెను. గ్రంథము చూడనక్కఱలేదని కావ్యకంఠు డా వివరములను జెప్పబోవుచుండగా "ఇది యేమి స్వామీ! గ్రంథము చూడనక్కరలేదందురు. ఒక్కసారి యేదో తొందర తొందరగా తిరుగవేసితిరిగదా! అంతమాత్రమున దానిలో నున్నట్లు వివరముల నెట్లు చెప్పగలరు" అని ప్రశ్నించెను. వెంటనే వాసిష్ఠు డదియే తన ప్రజ్ఞగా బల్కి, "నీవడిగిన వివరముల కాగ్రంథములోని శ్లోకముల నప్పగించి తాత్పర్యములను చెప్పెదను చూడు" మనుచు నాని ప్రశ్నలకు సమా ధానముల నిచ్చెను. దానితో నతడు నిరుత్తరుడై 'మీవంటి ప్రజ్ఞగల పండితుని చూడబోము. నిజముగా మీ రతీంద్రియులు, అత్యద్భుత మేధాసంపన్నులు, దివ్యవైభవోపేతులు. పూజ్యమగు మీ పాదము మా చిత్తమందుండుగాక' యని నిష్కల్మషముగా వాసిష్ఠుని స్తుతించి సెలవుగైకొనిపోయెను. నిజముగా నతడు నాటినుండి వాసిష్ఠునియం దపార భక్తి గౌరవములను గలిగియుండెను. అతనితో గూడి పండిత రంగయ్య నాయుడు పోక, కొంతసేపు వాసిష్ఠునితో ప్రత్యేకముగా సంభాషించిన తరువాత వెళ్ళిపోయెను.

వెళ్లినప్పుడు తన సంతోషము నాపుకొనలేక రామస్వామి అయ్యరును కౌగిలించుకొని ''నేడు నా జన్మలో సుదినము. నీవు నా కిటుపైని యాత్మబంధువవు. ఎందువల్లననగా, నాకు నీవు మహద్దర్శనభాగ్య మును గలిగించితి''వని యావేశమున వచించెను.

ఈ విధముగా వాసిష్ఠుని కీర్తిబీజములు చెన్నపురమందు నాటుకొని, యవి తమ కార్యరూపమును ధరించుచుండగా నతడు తిరువణ్ణామలై చేరి కూపస్థ మండూకమువలె తన పాఠశాల వృత్తియందు సెలవులిచ్చువఱకు మఱల నిమగ్నుడయ్యెను. ఇంతలో తండ్రి నరసింహశాస్త్రికి నేత్రరోగము తిరుగ బొడజూపగా పుత్రునకతడు తెలుపకుండ చెన్నపురము వచ్చి, యక్కడ వైద్యసహాయము బొందిన పిదప తిరువణ్ణామలై వచ్చి పుత్రుని జేరెను. ఇతనికి సహాయార్థ మితనితో కలువఱాయినుండి చెన్నపురమువఱకు బాంధవుడు, కవియునైన అర్యసోమయాజుల లక్ష్మీనారాయణశాస్త్రి (భవానీతాత కొడుకు. ఇతడే యొకప్పుడు వాసిష్ఠునివెంట తపస్సు చేయుటకు వెడలి నిరంతరము త్రాగు చుట్టవ్యసనమును విడువజాలక వెనుకకు మఱలెను) వచ్చియు నగర సౌఖ్యము నాస్వాదించుట కతడు చెన్నపురమం దుండిపోయెనని వాసిష్ఠుడు విని వానికొఱకు జాలిచెందెను.

నరసింహశాస్త్రి రహస్యముగా చెన్నపురము వచ్చినట్లే తిరువణ్ణామలై చేరిన పిదప బ్రాహ్మణస్వామి దర్శనము కూడ పుత్రునకు దెలుపకుండ చేసికొనెను. అది విని వాసిష్ఠుడు మొదటిదానికి బాధపడినట్లే రెండవదానికిని బాధపడి యూరకుండెను. పిదప పాఠశాలకు సెలవులిచ్చిన వెంటనే నరసింహశాస్త్రి పుత్రుని సహాయమున చెన్నపురము చేరి, యక్కడనుండి లక్ష్మీనారాయణశాస్త్రిని పిలువకుండగనే యొంటరియై వెంటనే రైలెక్కి కలువఱాయి పోయి చేరెను. లక్ష్మీనారాయణశాస్త్రి చెన్నపురమందు స్త్రీలోలుడై తిరుగుచున్న ట్లత డనుమానించి, వాని విలాసమైన (చిరునామా) నతడు వాసిష్ఠునకు చెప్పలేదు.

వాసిష్ఠుడిట్లు చెన్నపురము చేరి తండ్రిని సాగనంపిన పిదప శాతంజేరి రామస్వామి అయ్యరింటికి (90, రామస్వామి వీధి, జార్జిటౌన్) దారితీసెను. రామస్వామి అయ్యరు గురుని రాకకు సంతసించి, యా రాక కెదురుచూచుచున్న పండితులకు, పెద్దమనిషులకు తెలియజేసెను. వెంటనే పెక్కుమంది వాసిష్ఠ దర్శనార్థులై రాదొడగిరి. పాండిత్యమం దభిరుచిగల కాలేజి విద్యార్థులుకూడ దర్శనార్థులై వచ్చుచు బోవుచు, రామస్వామి అయ్యరింటి స్థలము బహు సంకుచితమై యుండుట గమనించి, యా ప్రక్కను (నం. 89) విశాలమై యున్న యస్. దొరస్వామి యను విద్యార్థి యింటిలో సదుపాయమమర్చగా వాసిష్ఠుడు భోజనమునకు మాత్రము రామస్వామి అయ్యరింటికి వచ్చుచు మిగిలిన కార్యములను దొరస్వామి యింట నిర్వర్తించుకొనజొచ్చెను. సదుపాయమిట్లమరుటవలన నెల్లవేళలందును జనులు వాసిష్ఠుని బరివేష్టించుచు తమ ప్రశ్నలచే నతనికి విశ్రాంతినీయక శిష్యావధానముల

వింటికడనే కల్పింపజొచ్చిరి. అట్లయినను బుద్ధియం దలసట జెందక అత డందరి నన్ని విధముల దృప్తిబరచుట జూచి దొరస్వామి కాశ్చర్యమయ్యెను. మఱియు దీర్ఘ శ్లోకములనుగూడ వినినంతమాత్రమున వాసిష్ఠుని స్మృతినంటి యవి యెప్పటికిని జారకుండుట గమనించినప్పు డతనికి మఱింత యాశ్చర్యమయ్యెను.

ఒకనాడీ దొరస్వామి తోడివిద్యార్థులతో గూడి వాసిష్ఠుని జ్ఞాపకశక్తి చిలుకవంటిదో లేక సహజమైనదో చూడగోరి విచిత్ర విధమున పరీక్షింపదలచెను. ఆ విద్యార్థి మిత్రులలో సంస్కృత మెరిగినవారు కొందరుండిరి. వారు వాసిష్ఠుని భావప్రకటన శిలభ్య మాంగ్లకవియగు షేక్స్పియరుయొక్క పాటనముతో నెంత వఱకు సరిపోవునో పరీక్షింపగోరిరి. వీరందరు పాశ్చాత్యవిద్యలచే సంస్కరింపబడిన బుద్ధిగలవారై యాంగ్లభాషను నేర్వని పండితు లనుదిన ప్రవృద్ధితో విజృంభించు చున్న విజ్ఞానము నాశ్రయించరనియు, మాటిమాటికి గత యుగ నాగరకతయందే రక్షణము బొందుచు నవీనుల యొక్కగాని, యితర దేశస్థులయొక్కగాని భావౌన్నత్యములను గ్రహించు సామర్థ్యములేక నిరసించుచుందురనియు విశ్వసించు వారే, వీరు వచ్చి వాసిష్ఠుని గదిలో కూర్చుండినంతనే యొక పళ్లెముతో తాంబూల సామగ్రి తెచ్చి దొరస్వామి వారి ముందర బెట్టి తానుగూడ వారి మధ్య నాసీనుడయ్యెను. వారు సవినయముగా నాచార్యుని తాంబూలము సేవింపుమనిరి. తన కది యలవాటులేదని యాచార్యుడు చెప్పగా వారూరకుండక దాని సేవనమందున్న మంచిచెడ్డల నొక శ్లోకరూపమున చెప్పగోరిరి. వెంటనే వాసిష్ఠుడీ దిగువ శ్లోకమును జెప్పి, దాని యర్థమును తమిళమున బోధపరచెను:

శ్లో॥ సుధాధిక్యం స్పృహే చ్ఛత్రుః
ఫలాధిక్యం స్పృహే ద్భిషక్ ।
పత్రాధిక్యం స్పృహే జ్జాయా
మాతా తు త్రితయం స్పృహేత్॥

(అర్థము:- శత్రువు సున్నమెక్కువ వాడవలెనని (మన నోరు పొక్కుటకు) కోరును. వైద్యుడు మనము చెక్కల నధికముగా వాడవలెనని (మనకు రక్తము విరుగుటకు) కోరును. భార్య మనము పత్రము లెక్కువగా సేవించవలెనని (కామోద్దీపనమగుటకు) కోరును. తల్లి మనకు తాంబూలమువలన దుర్గుణములు రాకుండుటకై మూడింటిని మనము యుక్తముగా సేవించవలెనని కోరును.)

శ్లోకములోని భావపుష్టిని విద్యార్థులు మెచ్చుకొనిన పిదప నాంగ్లకవులకును, మన దేశపు కవులకును భావప్రదర్శనమందు గల భేదముల నాచార్యు నుపన్యసింప గోరిరి. "నాకాంగ్లభాషయం దక్షరజ్ఞానమైనను లేదు. నా కాంగ్లకవులను గుఱించి యెట్లు తెలియును? మీరేదైన నొక కవి భావమును జెప్పినచో దాని మాధుర్యమును

గ్రహించుటకు బ్రయత్నింతు'' నని యాచార్యుడు పల్కగా నాంగ్లకవుల యొక్క భావౌచిత్యమునే గాక, నాటకరచనమందు వారు జూపిన పాత్రౌచిత్యమునుగూడ మచ్చుజూపుటకు దొరస్వామి ప్రేరితుడై, మహాకవియైన షేక్స్పియరుచే రచింపబడిన 'మాక్బెత్' అను నాటక కథను విపులముగా వాసిష్ఠునకు జెప్పిన పిదప దానిలో కవి ప్రయోగించిన మధుర పదభావములను వివరించెను. అటుపిమ్మట నొక్కుమ్మడిని విద్యార్థులందరు వాసిష్ఠు నా కథను శ్లోకరూపమున జెప్పగోరి యందలి పాత్రౌచిత్యములను, భావమాధుర్యములను షేక్స్పియరువలె బోషించి చూప వేడిరి. వారడిగిన వెంటనే కావ్యకంఠుడు ''డంకన్నామ మహీపతి స్సమభవత్స్కాట్లాండు దేశే పురే'' యని మొదలిడి ప్రవాహవేగమున కథ జెప్పుచు నత్యంత సరళమగు భాషచే క్లిష్టభావములను సైతము సులభగ్రాహ్యమగునట్లు కూర్చి ముగించెను. విద్యార్థులా వాణీ ప్రవాహమునకు, పదసౌష్ఠవమునకు ముగ్ధులై సంస్కృతమును గుఱించియు, మన కవులను గుఱించియు తమకున్న యసంగతాభిప్రాయములకు సిగ్గుజెంది, సంస్కృతభాష కాంగ్ల మేమాత్రము సాటి కాజాలదని యొప్పుకొనిరి.

అటుపిమ్మట భాషల ప్రస్తావమును విరమించుకొని వారు ''ఆచార్యా! మీ జ్ఞాపకశక్తి నొకసారి చూడవలెనని యున్నది. మీకు రాని యింగ్లీషు భాషలో మేము కొన్ని వాక్యముల జదివినచో మీ రొప్పగించగలరా'' యని యడిగిరి. చిఱునవ్వు నవ్వుకొనుచు ''ప్రయత్నించెద''నని యాచార్యుడు బదులు పల్కగా వారొక వార్తాపత్రిక నుండి పది పండ్రెండు వాక్యములను నెమ్మది నెమ్మదిగా జదివి వినిపించిరి. చదువుట వారు ముగించినతోడనే చదువబడిన వాక్యములలోని మాటల మొత్తపు సంఖ్యను కావ్యకంఠుడు తెలిపి, యటుపిమ్మట వాగ్యంత్రము వలె వా రుచ్చరించిన విధమున మాటల నుచ్చరించుచు చివరనుండి ముందున కన్నింటి నొప్పగించి, తన శ్రుతధర ప్రజ్ఞను, ఏకసంథాగ్రాహ్య ప్రజ్ఞను నొకేసారి ప్రదర్శించి వారికి విస్మయము గొల్పెను. విద్యార్థులు గర్వభంగమును జెందినవారివలె నొక్క క్షణ మొకరి మొగ మొకరు చూచుకొని తెల్లబోయి స్తంభించి యుండగా శాతంజేరి రామస్వామి అయ్యరు ''ఏదైన సభయం దీనాటి యవధానమైయున్నచో పండిత ప్రముఖు లాచార్యునకు బ్రహ్మరథము బట్టియుందు'' రని పల్కి విద్యార్థులు చైతన్యవంతులగున ట్లొనర్చెను. అప్పుడు వారు వాసిష్ఠునకు సాష్టాంగ ప్రణామము లర్పించి వెడలిపోయిరి. మిత్రుల నావలకు సాగనంపిన పిదప దొరస్వామి యాచార్యుని సమీపించి ''మీ బుద్ధి కుశలతను తొలుత శంకించిన వారిలో నేనొకడను. నా యీ దోషమును మన్నింపవేడెద''నని పశ్చాత్తాపపూర్వకముగా బల్కుచు వాసిష్ఠ పాదములపై శిరస్సు మోపెను. పూర్వము రామస్వామి అయ్యరు తన పాదములను సోకినప్పు డెట్లయ్యెనో, అట్లే యంతర్వాణి యప్పుడు ప్రబోధించగా వాసిష్ఠుడా దొరస్వామిని గూడ పూర్వజన్మ కింకరునిగా గుర్తించి, 'ఆహా! సుధన్వా! నీ

నిక్కడనే యుంటివా' యనుచు గ్రుచ్చెత్తి వాని దుఃఖము నానందముగా మార్చెను. నాటినుండి యతనికి 'సుధన్వ' నామ మాధ్యాత్మిక నామమై ప్రకాశించెను.

వాసిష్ఠ బుద్ధివైభవము నానాడు తెలిసికొనిన పిదప విద్యార్థు లొక్క క్షణమైన విశ్రాంతి గొనక చెన్నపురమందు సంచలనము కలిగించుచు వాసిష్ఠుని సన్మానించుట కప్పటి వఱకు జేయబడిన పెద్దల ప్రయత్నములయందు తోడ్పడిరి. వారి తోడ్పాటువలన విలంబనము నివారింపబడెను; సన్మానధనము చప్పచప్పున సేకరింపబడెను. కాని, యా ధనమునకింతలో భాగస్వామియగుట కదే సమయమున తమిళ నాడునుండి నారాయణ సుదర్శనుడను పేరుగల సుప్రసిద్ధ పండితుడొకడు చెన్నపురము వచ్చెను. అతడును గణపతివలెనే కావ్యశాస్త్రేతిహాసములను బాల్యము దాటక పూర్వమే ముగించి, కవితనుగూడ వశమొనర్చుకొని, యొకటి రెండు ప్రబంధములను పదునేడేండ్ల వయస్సు నందే రచించి 'బాలసరస్వతి', 'భట్టశ్రీ' యను బిరుదములను బొందెను. విద్యార్థులతని యందును పూజాభావముగలవారైనను, వాసిష్ఠునికొఱకు సేకరింపబడిన ధనము విభాగింపబడుట కియ్యకొనక పెనుగాలిని బుట్టించిరి. అప్పుడింక విధి లేక సమ్మానసభవా రా ధనముతో నొక బంగారు తోడాను చేయించి, భట్టశ్రీ వాసిష్ఠు లుభయులకు కవిత్వమందు పరీక్ష సల్పుటకును, నెగ్గినవాని కా తోడాను బహూకరించుటకును నిశ్చయించిరి.

ఈలోపున తిరువళ్ళిక్కేణి హైస్కూలు మండపమందు వాసిష్ఠున కొక సభ యేర్పాటుగావింపబడెను. అది సమస్యాపూరణముకొఱకు నిర్ణయింపబడినందున విశ్రుత పాండిత్యముగల హాలాస్యనాథశాస్త్రి, నీలమేఘశాస్త్రి, వేదం వేంకటరాయశాస్త్రి ప్రభృతులు పరీక్షకులై సభనలంకరించియుండగా, మహాశయుడైన శ్రీనివాసశాస్త్రి యధ్యక్షత వహించెను. ప్రౌఢకవులైన యీ పరీక్షకులు కుప్పలకొలది సమస్యలను వర్షమువలె కురిపించుచుండ నడిగినదాని నుత్తర క్షణము వారూహించినదానికంటె పటుతరముగా కావ్యకంఠుడు పూరించుచు విజృంభించెను. సుమా రేబది సమస్య లిట్లు పూరింపబడుసరికి పరీక్షకులకే యడుగుటకు చక్కని సమస్యలు స్ఫురించినవికావు. అప్పుడు వేదం వేంకటరాయశాస్త్రి 'మాకు సమస్య లేకుండ మీరు చేయగలిగితి'రని కావ్యకంఠు నభినందించెను. పిదప సభను ముగించి యధ్యక్షుడు సభవారొసగిన స్వల్పకట్నమును వాసిష్ఠహస్తమం దుంచునప్పుడు. "ఇది స్కూలు పండితులు సమకూర్చుకొనిన పేద లాంఛనధనము. ఇది స్వల్పమైనను, దీనియందు మాబోంట్ల హృదయపూర్వకాభివందనములు సహస్రములుగా మిళితమైయున్న"వని సరసముగా వచించెను. అత్యంత సంతోషముతో కావ్యకంఠుడు దానిని స్వీకరించి సభ్యుల కరతాళధ్వనులను గూడ బొందెను.

పిదప భట్టశ్రీ కావ్యకంఠులకు నిర్ణయింపబడిన సభ 'మైలాపూర్' ప్రాంతమందు జరుపబడెను. గొప్ప విద్వాంసుడు, సరసకవిత్వమం దభిరుచిగల

వాడు, నిష్పక్షపాతియైన వి. కృష్ణస్వామి అయ్యరు దాని కధ్యక్షుడైయుండ చెన్నపురమందలి ప్రముఖ గణములతోడను, నుత్సాహపూరితులైన విద్యార్థుల తోడను సభామండపము క్రిక్కిరిసి యుండెను. మహాకవియని పేరుబడసిన భట్టశ్రీకంఠగా నాశుకవనము జెప్ప నలవాటు లేదను నెపమున కవిత్వ పరీక్ష వ్రాతమూలకముగా జరుపబడుటకు సభవారిచే నిర్ణయింపబడెను. అధ్యక్షు డా నిర్ణయమును చిఱునవ్వుతో నంగీకరించి భట్టశ్రీ కావ్యకంఠు లుభయులకు వ్రాతసామగ్రి నిచ్చి, 'నలో'పాఖ్యానమును శత శ్లోకములలో వ్రాయుట కాజ్ఞాపించి, యరగంట ముగియుసరి కెవరు హెచ్చు శ్లోకములను వ్రాయుదురో వారు గెల్చినవారిగా పరిగణింపబడుదురని తెలియజేసెను. అందులకు సమ్మతించి వారు రచన నారంభించిరి. వారి రచనావేగమును గనిపెట్టుచున్న యధ్యక్షు డాఱునిముసము లగుసరికి వాసిష్ఠు డిఱువదియైదు శ్లోకములను రచించగా, భట్టశ్రీ యాఱింటిని మాత్రమే ముగించుట జూచి, 'అగు'డని వారి నాజ్ఞాపించెను. అరగంట ముగియులోపున నాపుట ధర్మముగాదని భట్టశ్రీ వాదించి వ్రాతను విరమింప నిరాకరించెను. అధ్యక్షుడొక్క గర్జనచేసి తిరుగ నాజ్ఞాపించి విరమింపజేసెను. పిమ్మట వాసిష్ఠుడుత్తీర్ణుడైనట్లు సభయందు ప్రకటించి, బంగారుతోడా నతడు వాసిష్ఠునకు స్వయముగా తొడిగెను. సభలో కొందఱు హర్షధ్వానములను సల్పిరి. మఱికొంద ఱీర్ష్యాపూరితులై యధ్యక్షు డొనర్చినది ధర్మవిరుద్ధమని పల్కుచు సభనుండి వెడలిరి.

ఎవరికిది యధర్మమని తోచెనో వారికి వాసిష్ఠునెట్లయిన కించపుచ్చవలెనని తోచినందున నింకొక సభకు త్వరితగతిసే యేర్పాట్లు గావించిరి. దానిలో వాసిష్ఠున కవధానము కల్పించి భట్టశ్రీని పరీక్షకునిగా నిర్ణయించుటకు నిశ్చయింపబడెను. అసూయవలన భట్టశ్రీవంటి పండితుడు పీ రవలంబింపబూనిన కుటిలపద్ధతుల కంగీకరించెను.

ఈ సభ డాక్టర్ యమ్. డి. కృష్ణస్వామి యింట జరుపబడి యథాగౌరవముగా వాసిష్ఠు డాహ్వానింపబడెను. కపట మెఱుగని కావ్యకంఠు డవధానము సల్పుట కియ్యకొనెను. పెక్కుమంది ప్రసిద్ధ పండితులు, నితర ప్రముఖులుగూడ వాసిష్ఠుని కావ్యామృతధార నింకొకసారి విను కుతూహలముచే విచ్చేసిరి. నిర్ణయింపబడిన వేళ యగుసరికి డాక్టర్ కృష్ణస్వామి లేచి భట్టశ్రీ బిరుదాంకితుడైన నారాయణసుదర్శను నధ్యక్షునిగా నెంచుకొని యతని మెడలో పూలదండ వైచెను. అప్పుడా సుదర్శనుడు స్వాభిమాన ముప్పతిల్లినట్లా యధ్యక్ష స్థానము నలంకరించిన పిదప వాసిష్ఠునిపై నాకలిగొనిన సింగమువలె దృష్టి సారించి, యతనిని వేదికపైకి రమ్మనెను. ప్రకటితమైన యీ చిన్న అసభ్యతకు పెక్కుమంది గగుర్పాటుచే నివ్వెఱ బోయియుండ, వారికి ధైర్యముగొల్పునట్లు వాసిష్ఠుడు సింగములను వేటాడు రారాజు మాడ్కి గంభీరవదనుడై వేదికనెక్కెను.

ఘంటాశతశ్లోక పరీక్షతో సభ ప్రారంభమై రుక్మిణీ కల్యాణమును గుఱించి యధ్యక్షుడు చెప్పగోరెను. చెప్పబడిన శ్లోకములను వ్రాయుటకొక్కడే లేఖకుడు నియమింపబడుట జూచి వానియందు కావ్యకంఠుడు జాలిచెంది నెమ్మదిగా ప్రారంభించెను. కాని, లేఖకుడు మించిన వేగముతో వ్రాయువానివాలె 'తరువాత, తరువాత, యని తొందర జేయజొచ్చెను. అది విని కావ్యకంఠుడు తన పద్యగతిని కొంచెము హెచ్చించెను. అప్పటికిని లేఖకుడు తొందరజేసెను. కావ్యకంఠుడింకను హెచ్చించెను. ఇట్లున్నతిక్రమమున నిముస నిముసమునకు కావ్యకంఠుడు పద్యవేగమును హెచ్చించుచున్నను తన వాగశ్వము తరుమబడుటవలన లేఖకునియందు జాలి విడిచి యతడు విజృంభించి, శరవేగమున తన వాక్కులను బోనిచ్చి యతని ప్రజ్ఞనంతను జూపెను. ద్యులోకమునుండి భూమిపైకురుకు గంగాప్రవాహమువలె శ్రోతలకా వాణీప్రవాహము శ్రవణేంద్రియ ప్రజ్ఞకు మించినట్లున్నను, లేఖకుడు యథాధోరణిని 'తరువాత'యనుట యెల్లరకు నాశ్చర్యకరమై, యేదేని మోసమున కా లేఖకుడు తలపడెనాయను ననుమానము దోప వానిపై పండితు తమ దృష్టులను సారించిరి. కష్టపదపంక్తులను జడివానవలె నొకవంక గురిపించుచు వాసిష్ఠుడుకూడ సంశయించి, లేఖకు నొకకంటితో గనిపెట్టగా మోసము బయల్పడెను. లేఖకుడు వ్రాయుచున్న వానివలె కలము నాడించుచున్నను, అతని కల మెల్లప్పుడొకే స్థలమందాడుచు, పంక్తులకై కదలక పోవుటగాంచి, యా మోసమును బైటపెట్టుటకు వాసిష్ఠుడా లేఖకు నుద్దేశించి ''నీవు నిజముగా నే చెప్పిన దేమైన వ్రాసియుంటివేని, వ్రాయబడినది వినిపింప గోరెద''నని యడిగెను. అడిగిన తడవుగా లేఖకుడు తన యెదుటనున్న కాగితము లోని శ్లోకములను జదువజొచ్చెను. ఆశ్చర్యము! ఆ శ్లోకములదివఱకే యతడు వ్రాసికొని వచ్చినవై, వాసిష్ఠుని శ్లోకవృత్తములకుగాని, పదమాధుర్యమునకుగాని పోలిక లేకయుండెను. ప్రథమ శ్రేణులలో గూర్చుండిన కొందఱు పండితులది వెంటనే గుర్తించి, 'యేల నీవిట్టి పరిహాసమునకు బూనుకొంటి'వని లేఖకుని ప్రశ్నించగా, 'అవధానము సేయువాడింటికడ కంఠస్థ మొనర్చుకొనిన శ్లోకములను సభలయందు వల్లించుచు, ఘంటాశతమొనర్చిన కీర్తిని బడయుట కష్టముకాదని నిరూపించుటకు నేనిట్లు చేసితి'నని యతడు నిర్భయముగా బ్రత్యుత్తరమిచ్చెను.

వాని సాహసవచనములు వాసిష్ఠునకు మిగుల బాధ కలిగించెను. ఆంధ్ర, ఉత్కళ, మగధ, వంగ, మహారాష్ట్రములందు విద్వజ్జనులు సభల నలంకరించి యుండగా వాసిష్ఠుడు తన యాశుకవితా ప్రజ్ఞను బ్రదర్శించినను నిట్టి యవమానమున కెన్నడును గుఱికాలేదు. కాని, లేఖకుడు చదివిన శ్లోకము లన్నియు భట్టశ్రీ యొక్క కూర్పులుగా వాసిష్ఠుడు త్రుటిలో గ్రహించుకొనినందున లేఖకుని యిట్లు ప్రేరేపించిన భట్టశ్రీ యసూయచే నెంత నీచత్వమునకు కడంగెనో గదా యని

యొక్కక్షణ మాలోచించుకొనుచుండగా సభ్యులు కొందఱు వాసిష్ఠునివలెనే గుర్తించి 'యీ శ్లోకములన్నియు నారాయణ సుదర్శనుని కూర్పు' లని కేకలిడిరి. మఱికొందఱు లేఖకుని 'మెడబట్టి గెంటివేయవలె'ననియు, నింకను కొందఱు వాని 'పళ్ల నూడగొట్టవలె'ననియు నినాదములు జేయజొచ్చిరి. అధ్యక్షుని ముఖమప్పుడు తెల్లబోయెను. అతని నేత్రములు డాక్టర్ కృష్ణస్వామిని శరణుజొచ్చెను. కృష్ణస్వామి వెంటనే లేచి, లేఖకు నావలకు దీసికొనిపోయి, పిదప వానియందు నేరమంతయు మోపి, సభ్యులను, వాసిష్ఠునిగూడ తన్ను క్షమింప వేడెను.

సుదర్శను డీ విధముగా రక్షింపబడినవాడై తరువాత కార్యక్రమమందైనను సరసత జూపలేదు. 'వ్యస్తాక్షర' పరీక్ష యటుతరువాత జేయవలసియున్నది. దాని కొఱ కధ్యక్షు డనుప్రాస చిత్రములతో గూడిన శ్లోకము నెంచెను. దానియం దక్షరములన్నియు వేర్వేఱుగా కత్తిరింపబడి, వాటియందు క్రమసంఖ్య లిఖింప బడిన పిదప నధ్యక్షు డా యక్షరఖండములన్నింటిని తిరుగబోసి, యొక్కసారిగా వాసిష్ఠుని హస్తమందుంచుచు నిట్లుడివెను:''ఇంకొక యవధానమధ్యమందు మీదృష్టిని జెదరగొట్టుట కీ యక్షరముల నొక్కొక్కటిగా మీకీయవలసియున్నను, మీకింకొక యవధానమిప్పుడు లేని కారణమున ముక్కల నొక్కసారి యిచ్చి మీకు సులభము చేయుచుంటిని. వీని నొక్కొక్కదానినే చూచుట ముగించిన వెంటనే మీ రా శ్లోకమును కాగితముపై వ్రాసి చదువుగోరుదును.'' ఈ విధముగా నతడు తియ్యని మాటలచే తన వక్రమార్గమును గప్పిపుచ్చుకొని, యక్షర క్రమమును బుద్ధియందు చేర్చుకొనుటకైన వాసిష్ఠున కవకాశము లేకుండ జేసెను. ఎదుటి పండితులిది గ్రహించి తమ యసమ్మతిని దెల్పిరి. కాని, వాసిష్ఠుడు తన ప్రజ్ఞ జూపుట కంగీకరించి, యక్షరఖండముల నతి త్వరితగతిని జూచి యిచ్చి వేసెను. పిదప కాగితము నందుకొని శ్లోకమును వెనుకనుండి వ్రాసి యధ్యక్షుని చేతనుంచగా నతడు చదువలేక 'యేమిటిట్లు వ్రాసితి'రని ప్రశ్నించెను. 'అది వక్రపద్ధతి'యని వాసిష్ఠుడు ప్రత్యుత్తరమిచ్చి, సభ్యులవైపు తిరిగి యా శ్లోకమును సక్రమముగా చదివి వినిపించెను. ఆ శ్లోకమిది:-

శ్లో॥ ''అస్పాం ద్రప్పా మలిప్పాం చిరతర
మచరం క్షీరమద్రాక్ష మిక్షుం।
ద్రాక్షాం సాక్షాదజక్షం మధురస
మథయం ద్రాగవిందం మరందం।
మోదా మాదామమన్యే మధురిమ
గరిమా శంకరాచార్యవాదా॥
అదాన్తే హంత కింతైరలమపి చ
సుధా సారసీ సారసీమ్నా॥'

అటుపిమ్మట ముగింపదలచి, సాధారణముగా నంత్యమందు జేయబడు పరీక్షకు నధ్యక్షుడు పూనుకొనెను. ఈ యంతిమఘట్టమం దలంకార విమర్శకొఱ కేదేని సరళమగు శ్లోక మీయబడి, విమర్శాపాటవముతో బాటు ప్రవచన సామర్థ్యము పరీక్షింపబడుచుండును. మఱియు నిది సభ్యుల మనస్సుల నుల్లాసపఱచుటకొఱ కుద్దేశింపబడి, యవధానమం దదివఱకు సంభవించిన అభిప్రాయభేదములచే జనించిన క్లేశమును నివారించునదిగా నుండును. కాని, సభాచారముల నాదినుండి యతిక్రమించి, కావ్యకంఠునకు క్లేశము గలిగించుటయే ముఖ్య లక్ష్యముగా నెంచిన యధ్యక్షు డీ తుదిఘట్టమందైన కౌటిల్యమును విడనాడి తన యసూయను చంపుకొనలేకపోయెను. అందువలన నదివఱకు గాయపడియున్న కావ్యకంఠుని హృదయమును మఱింత గాయపరచుట కదివఱకు వ్యస్తాక్షర పరీక్షకీయబడిన శ్లోకమునే యధ్యక్షుడు వ్యాఖ్యానింప గోరెను. అది యవకాశముగా గొని కావ్యకంఠు డా శ్లోకములోని ఒక్కొక్క పదమును విమర్శించుచు, దాని యందు కవియొక్క అసాధుప్రయోగములవల్లను, వ్యాకరణాలంకార దోషముల వల్లను నతని లక్ష్యము నతడే పరిహాసము గావించుకొనిన విధమును బ్రదర్శించి, దానితో నధ్యక్షు డా నాడు పూనిన విధమునకుగల పోలికను స్ఫురింపజేసి, తద్ద్వారమున కవిని నిశితముగా విమర్శించు నెపముచే నారాయణ సుదర్శనుని వక్రతను చమత్కారముగా నెగతాళిచేసి తన సంతాపమును నివారించుకొనెను.

ఈ శ్లోకము 'శంకరవిజయ' మను భట్టశ్రీ విరచిత గ్రంథములోనిదై, శంకరాచార్యుని వాఙ్మాధుర్యమును ధ్వనింపజేయుటకు రచింపబడెను. ఆ మాధుర్యము భువన ప్రసిద్ధములగు రసములన్నింటిని తిరస్కరించునది యని పేర్కొను నుద్దేశముతో కవి ద్రప్సాదిక్రియల నర్థావృత్తిచే బ్రయోగించుచు, తత్కర్మభూతములైన మీగడ, పాలు, చెఱకురసము, ద్రాక్ష, తేనె, మకరందము, కదళీఫలము, అమృతము లనబడు మధురవస్తువుల బేర్కొనెను. కాని, వీని నాస్వాదించు క్రియల నతడు వాడునప్పు డయుక్తముగా వాడి, కర్మభూతములకు గల ప్రసిద్ధి నపహసించి, తన్మూలమున శంకర వాఙ్మాధుర్యమునకు గల కీర్తిని పరిహాసము పాలుజేసెను. ''మీగడను త్రాగితిని, పాలను భక్షించితిని, చెఱకును జూచితిని (రసమును చవిజూచుటకాదు), ద్రాక్షలను సాక్షాత్తుగా భుజించితిని (భుజించుట యప్రత్యక్షము కూడ నుండునట్లు), తేనెకు బదులు తేనెయొక్క రుచిని పానముజేసితిని, మకరందమును శీఘ్రముగా తెలిసితిని (మందముగా తెలియుటయు నున్నట్లు), అరటిపళ్ళ నాచమనమొనర్చితిని'' అని యొక వస్తువునకు వాడవలసిన క్రియ నింకొక వస్తువునకు వాడియో, క్రియల కసాధారణత్వమును గల్పించియో రసభంగము గావించి, ప్రతి వాక్యమందును కవి వాక్యార్థమును విడిచి లక్ష్యార్థమందు శరణుజొచ్చెను. ఇంక 'ద్రప్సం' అను పదము నపుంసకలింగమై

యుండగా, దీర్ఘముచే 'ద్రప్సాం' అని స్త్రీ లింగముగా వాడుట వింతయై దోచును, అట్లే 'సారస్య'మనుటకు బదులు 'సారసీ' అని ప్రయోగించి వ్యాకరణసూత్రముల బాటించక శాస్త్రమును దూలనాడెను.

శ్లోకములోని దోషపుష్కలత నీ విధముగా కావ్యకంఠుడు ప్రదర్శించిన పిదప కాలము నతిక్రమించకుండుటకై తన విమర్శావాక్యములను ప్రవాహ వేగముగ జెప్పి సభవారి మనస్సుల నోలలాడించెను. ఆ ప్రవచనసార మిట్లుండెను: "ఇతర కవులయొక్క దోషముల నెంచుట యుక్తముగాకున్నను, శంకరాచార్యుని వాఙ్మాధుర్యమును గ్రహింపజేయునప్పుడీ కవి శాస్త్రాచారము లొప్పనిధమున క్రియలను బ్రయోగించి యీనాడు సభాధ్యక్షునివలె తన యతిశయముచే తానొక యపకీర్తిని గల్పించుకొనెనని జూపుటకు మాత్రము నేనీ శ్లోకరచనమందలి దోషములను బేర్కొంటిని. ప్రసన్నా ప్రసన్న తారతమ్యము నెఱుగక నిబంధనలకు గట్టువడని పండితులిట్లే గొప్ప కార్యములకు తలపడి తమ లక్ష్యమును పాడుజేసికొందురు. అంతమాత్రముచే శంకర వాఙ్మాధుర్యమునకు కళంకము రాలేదు. ఆ విషయము మీరు ముఖ్యముగా గ్రహించుకొనవలెను. మఱియొక విషయమేమనగా, నిట్టి కవులు తమ కళావిహీన చర్యచే కావ్యగుణదోషముల నెంచు పండితుల కొకవిధముగా నుపకారము చేయుచుందురు. ఎట్లనగా, గుణదోషము లెట్లుండునో తమ యనుచరులకీ పండితులు బోధించవలసి వచ్చినప్పు డుదాహరణములుగా పెక్కు శ్లోకములకొఱకు శ్రమపడక యీ శ్లోకరచన మొక్కటి యుదాహరించినచో, దీనియందు నానావిధములగు నపచారములు ధ్వనించగలవు.

ఈ విధముగా కావ్యకంఠుడు తన విమర్శాపాటవము చేత నొకవంక, యుక్తియుక్తమగు ప్రసంగముచే నింకొక వంక సభ్యుల సుమనస్సుల నాకర్షించి, వాటిని తన వాణీపీయూషమందు ముంచియెత్తగా, 'భట్టశ్రీ'యం దధికముగ పక్షపాతమును వహించినవారుకూడ కావ్యకంఠు నభినందించిరి. మఱియు నధ్యక్షుడైన భట్టశ్రీయు పరివర్తనము జెందినవారై పశ్చాత్తాపపూర్వకముగా కావ్యకంఠు నాలింగన మొనర్చుకొని సఖ్యత నపేక్షించెను. అంతేగాక, నతడు కావ్యకంఠుని సకృత శ్రుతగ్రహణమును, అసాధారణ తూర్ణ కవితా నిర్మాణమును, నిశిత విమర్శాది సంపదలను సభాంతమందు బొగడి, సభ్యుల హర్షధ్వానములతో సభను చాలించెను. అప్పుడు డాక్టర్ యమ్. డి. కృష్ణస్వామి తన యుదారతను జూపుటకు కావ్యకంఠ భట్టశ్రీ లుభయులకు చెరియొక శాలువనిచ్చి, కావ్యకంఠునకు ప్రత్యేకముగా నూటపదహార్ల కట్నము నర్పించెను.

ఈ యవధానమైన తరువాత వాసిష్ఠు నభినందించుటకు పండితులు, పురప్రముఖులు సుధన్వు నింటి కొక వారము దినములవఱకు దెరపిలేక వచ్చి తమ స్తుతులచే వాసిష్ఠున కొకవిధమగు విసుగు బుట్టించిరి. వారిని దప్పించు

కొనుట కతడు నాలుగైదు దినములు వకీలైన పంచాబకేశ శాస్త్రి యను మిత్రుని యింట శరణు బొందవలసివచ్చెను. అక్కడనుండి మఱల సుధన్వుని యింటికి జేరిననాడే రామస్వామి అయ్యరు మేనల్లుడైన శంకరశాస్త్రి యను వ్యక్తి వాసిష్ఠునియందు పాండిత్యముతోబాటు సహజమై విలసిల్లు దివ్యశక్తిప్రభావముల నాలకించిన పిదప వాసిష్ఠపాదము నాశ్రయించి మంత్రదీక్ష నర్థించెను. ఇతని ముఖము జూచినంతనే యితడు తన కీ జన్మకు పూర్వము భక్తకింకరుడని వాసిష్ఠుడు తన దివ్యదృష్టి ప్రభావముచే గుర్తించి, వాని నత్యంతాదరాభిమానములతో జేరదీసెను.

ఓం

నాలుగవ ప్రకరణము

# కార్యాంకురములు

సుధన్వునకు శంకరశాస్త్రి తోడైనప్పటినుండి కావ్యకంఠునియందు వాణీవైభవముతోబాటు మూర్తీభవించియున్న యితర వైభవములను గుఱించి విద్యార్థికూటములం దధిక ప్రచారము కాఁజొచ్చెను. నిర్వీర్యులై పెక్కు సంవత్సరముల నుండి తమస్సున మునిగి, తమ పూర్వవైభవములను విస్మరించియున్న భారతీయుల నుద్బోధించుటకును, తిరుగ తమ మహోన్నతిని జెందుట కుపాయములచే వారి బుద్ధి నుద్ధరించుటకును జన్మించిన వ్యక్తి వాసిష్ఠుడను మాట శంకరశాస్త్రివలన వినుకొలది కొందఱు కాలేజివిద్యార్థు లుద్రేక పూరితులు కాఁజొచ్చిరి. వీరు వాసిష్ఠునితో రహస్యముగా సంప్రతించుట కతని ననుదినము సముద్రతీరమునకు దీసికొనిపోయి యచ్చట ముచ్చటించుచుండిరి. వారియందున్న పవిత్రాశయములను గ్రహించినప్పుడు మున్ముందు తాచేయ దలచిన కార్యమునకు వారుపకరించవచ్చునను నాశ వాసిష్ఠునకు దోచి, వారి లేతమనస్సులందు వేదకాలపు టాదర్శములను కల్పింపఁజొచ్చెను. ఈ కార్యోత్సాహమున తిరువణ్ణామలై వెళ్లుట మఱచినవానివలె నించుమించుగా డిసెంబర్ నెల ముగియువఱకు చెన్నపురమం దతడుండిపోయెను.

తిరువణ్ణామలైలో వేదపాఠమును ముగించి భాష్యమును పవిమర్శగా జదివినప్పటినుండి యార్యుల మహోన్నత దశ, పరశమధురములు, ప్రేమ మయములునగువారి సంఘజీవితము, నానాత్వభావములు లేనివారి మతము, పవిత్రములై యాదర్శప్రాయములు కాదగువారి యాశయములు, వారి నాగరికత వాసిష్ఠుని మనోనేత్రమునకు స్పష్టగోచరములై, యట్టి యున్నతస్థితినుండి మన భారతజాతి యే కారణములవలన పతనమై ప్రస్తుత దాస్యభావములకు గురియయ్యెనను చింతన మాంతర్యమందు ప్రారంభమయ్యెను. వేదకాలమునందు సాధింపబడిన ఆర్థిక పారమార్థిక భావసమ్మేళన మొక ముఖ్య విషయముగా వారెంచి తమ సాంఘిక సుఖజీవనమును, నధ్యాత్మసంపదనుగూడ నొకదాని కొకటి విరుద్ధముగాకుండున ట్లనుభవింపగల్గిరనియు, మన జాతి యేనాడట్టి భావసమ్మేళనము నశ్రద్ధజేసెనో ఆనాటి నుండి యార్థిక పారమార్థికములలో నొకటి క్షీణించినపుడెల్ల రెండవది క్షీణించుచుండెననియు వాసిష్ఠుని చిత్తమందు స్ఫురించెను. అందులకు వైదికఋషి దర్శనములే ప్రబల సాక్ష్యములై గన్పట్టెను. ఏకాగ్రాలోచనచే ప్రస్తుత శ్వేతజాతులు పదార్థవిజ్ఞానమం దెట్టి దర్శనములను

బొంది, యైహికజీవితమును దభివృద్ధిగాంచగల్గిరో, అట్లే తపస్సనెడి యేకాగ్రాలోచనచే వైదికఋషు లధ్యాత్మ పరిశోధన నొకవంక, భౌతికశాస్త్ర పరిశోధనల నింకొకవంక సాగించి యుభయపక్షము లందును గల రహస్యములను లెక్కింటిని దర్శనము గావించుకొనిరి. అట్టి దర్శనములతో నిండిన వేదవాఙ్మయము నెంత కాలము జనులు తగువిధమున పఠించి, దానియందు మంత్ర రూపములుగా పొందుపఱచబడిన దర్శనార్థములను విమర్శచే గ్రహించి వాడుకచేసిరో, అంత కాలము క్షామ రిపు రోగములకు వారు గుఱికాక, యంత్రనిర్మాణములందైన నితరులపై నాధారపడక సుఖించిరని వాసిష్ఠుడు నిశ్చయించుకొనెను. అట్లుగాక పారాయణమే పుణ్యమని యెంచి, వేదవిమర్శచే గలుగు ఫలము పుణ్య సంబంధము గాదనునట్లు నెప్పుడు అశ్రద్ధజేసిరో, అప్పుడు మనవారు తమ యసంగతాభిప్రాయములవలన, తమ వేదార్థనిర్లక్ష్యమువలన తామే చెడిరనియు నతనికి విశదమయ్యెను.

కనుక వాసిష్ఠుడు తన విశిష్టభావములచే విద్యార్థి యనుచరులయందు వేదరహస్యములయొక్క యుత్కృష్టతను గుఱించి, సకలార్థదాయకములైన మంత్ర దర్శనములను తపస్సుచే సాధించిన మన పూర్వఋషులను గుఱించి, వారి నన్నివిధముల ననుసరించక పారమార్థికము మాత్రమే మతమనుకొని మన మార్థిక, వైజ్ఞానిక భాగములలో బానిసలమైన విధమును గుఱించి యుచితాభిప్రాయములను కల్పించిన పిదప వారికొక హితవు నిట్లు పల్కెను: "బాహ్యాడంబరమునకు విరక్తిని బ్రదర్శించు సన్న్యాసివేషములు బుద్ధుని కాలము నుండి మన కొంప ముంచినవి. కాషాయముండనములందున్న మన గౌరవమును జూచి మన కన్ని విధముల క్షౌరమొనర్చుట కితర దేశస్థులు పరంపరలుగా మన దేశమును కొల్లగొట్టిరి. శుష్కవైరాగ్యము నాశ్రయించిన యీ వేషధారులు మన సంఘమధ్యమందే నిర్వ్యాపారులై విహరించుచు తమ కుక్షికొఱకు మన కుక్షులను హరించుచున్నారు. వీరియం దనాదరణము జూపియైన వీరిని గార్హస్థ్యమునకు మరల్పుట మన జాతి కవసరమగు ప్రథమ సంస్కారము. రెండవది గోచి గావంచా సంప్రదాయములె ట్లితర దేశస్థులచే మనయందు పరిహసింపబడుచున్నవో గుర్తించి, మనలను నవ్వులపాలు చేయని విధముగ సంప్రదాయములను సంస్కరించుకొనుట. అట్లే మన కాదర్శప్రాయులైన ఋషులను నీచపరచు విధమున నల్లబడిన దుష్టకథలను పురాణములనుండి, కావ్య ప్రబంధ నాటకాది గ్రంథములనుండి తొలగించి, యట్టి ధోరణిని కవులందు నిరసించుట మూడవది. మన జాతియందు వీర్య బల తేజములు తిరుగ వర్ధిల్లుటకై స్త్రీపురుష విచక్షణలు గాని, వర్ణభేదములుగాని మంత్రధ్యానముకొఱకు లేకుండునట్లుజేసి, గృహము లన్నియు మంత్రస్పందనములచే ప్రతిధ్వనించున ట్లొనర్చుట నాల్గవది. ఈ నాలుగింటి నేకకాలమందే సాధించవలెను.

అప్పుడు మన దేశము, మన జాతికూడ సర్వారిష్టములనుండి విముక్తిబొందుట తథ్యము.''

నవీనులను మించు సంస్కారభావములు గలిగి, దివ్యశక్తి నాంతర్యము లందు ప్రబోధించిన వాసిష్ఠ వాక్కులకు విద్యార్థి యనుచరులెల్లరు సంప్రీతులైరి. ఇట్టి వాక్కుల నింకను వినుటకై వారు రాత్రులం దింటియొద్దను వాసిష్ఠు నాశ్రయించుచుండిరి. యస్. రంగయ్య నాయుడొక డనుదినము వాసిష్ఠ సాంగత్యము నపేక్షించి వచ్చువాడు. ఈ సాంగత్యమే యొకానొక విద్యవంటిదని యితడు విద్యార్థులకు మాటిమాటికి జెప్పుచు, వాసిష్ఠభావములచే భావపటిష్ఠతను బొందుటకు వారిని హెచ్చరించుచుండెను. ఒకనా డతని సందేహమును దీర్చుటకు వాసిష్ఠుడు యిట్లుపన్యసించెను: ''రాతియుగము, కంచుయుగము అను విభాగము లూహాగానములు. బృహత్తరమైన మన దేశమం దిప్పటికిని వెండి బంగారములతోపా టితర లోహములను, ఱాళ్లను పాత్రలుగా వాడుకచేయుచున్నాము. మట్టితో చేయబడిన కుండలను వాడుచుంటిమి. ఏయే కార్యముల కేవేవి శ్రేష్ఠమో యుగయుగముల క్రిందటనే మనము తెలిసికొంటిమి. తెలియని వారును మన మధ్య నున్నారు. అట్టి వారిని జూచి వారు మన తొలి నాగరికతకు జెందినవారనుట సమంజసముకాదు. వారికి మన వస్తువుల నిచ్చినను, వారి యాచారముల ననుసరించియో లేక వాటి భద్రతకొఱకు బాధ్యతలను వహించలేకనో వారు వాటిని తిరస్కరింతురు. నాగరికత యనునది దీనినిబట్టి మనము వాడుకచేయు పాత్రలపై యాధారపడదని విశదమగును. అట్లే శిథిలములైన దేవాలయ ప్రాంతము లందూ త్రవ్వగా దొరకిన ఱాతికత్తులు మొదలగునవి విగ్రహముల కమర్చబడినవని యూహించక, వాటితో పూర్వము యుద్ధము చేసియుందురని చెప్పు పండితులకే విజ్ఞానము కొఱతపడి యున్నదని తట్టక మానదు. ఇట్టి ధోరణి చొప్పున మన మతమునకు గూడ చరిత్ర వ్రాసినవారున్నారు. వీరి దృష్టిలో వేదకాలమం దార్యులు పశువుల మందల నడుమలందు మేపుకొనుచు, పశుసంపదకొఱకే ప్రార్థించువారనియు, కొండలను, నదులను దైవములుగా భావించి నిర్గుణ దేవతాతత్త్వమును గ్రహింప లేకుండిరనియు దోచినందున వేదకాలమునందు మతభావములు సంకుచితములై, క్రమాభివృద్ధిచే విశాలములగుచు, జైన-బౌద్ధ-మహమదీయ-క్రైస్తవప్రవక్తల ప్రబోధములను గ్రహించి పూర్ణత జెందినట్లెంచువారు లేరా ? మన పాలక వర్గమువా రితర దేశస్థులైనపుడెల్ల మన మతమును గుఱించి, మన పూర్వఋషుల గుఱించి నీచపఱచు నుద్దేశముతో మన పండితులచేతనే యధికారబలముకొలది, లేదా ధనము నిచ్చి పెక్కు గ్రంథములను వ్రాయించిరి. భావదాస్యముచే ప్రభువులు వ్రాయించినవన్నియు సత్యములని జనులు గ్రహించుచుండిరి. మన పురాణములను

రచించిన కవులు మనవారైనను, తమకున్న మహత్తర కవితాప్రజ్ఞ నిట్లే నీచకథలను పరివ్యాప్త మొనర్చుట కియ్యకొనినట్లు నాకు దోచుచున్నది. అంతేకాక, వైదిక ఋషికవనములకును, వీరి కవనములకును గల భేదము భాషయందు, గణములందు, దేవతాతత్త్వ విభాగమందు నజగజాంతరమై యున్నందున వీరు తమ నామములను కృతులందు బేర్కొనక, వ్యాస వాల్మీకాది ఋషినామములతో రచించుటయు మోసము కొఱకే గావచ్చును. ఈ కవుల రచితము లొకవంక భాషకును, భక్తిభావములకు నుపకరించినను, మఱియొక వంక వైదికఋషి మతమును, వా రారాధించిన దైవమును కించపఱచి, ఋష్యాదర్శములనుండి మనలను దూరమొనర్చినట్లు నేను భావింతును. ఒకదాని నొకటి పోలని యీ పురాణములకు ప్రామాణ్యములనిచ్చి మన పండితులుసైత మందలి కల్పిత కథలను విమర్శింపకుండుట శోచనీయమై యున్నది. అట్టి కథల నందుండి తొలగించినచో మనకవి యన్ని విధముల పూజాగ్రంథములు కాగల్గునని నా నమ్మిక.''

పండితుడైన రంగయ్యనాయు డీ సమాధానమును వినిన పిదప వాసిష్ఠునియం దలౌకికమై, యగాధములకు బోవు దృష్టిపాటవమునకు, మతసంస్కార కాంక్షకు విస్మయము జెందెను. అత డుపక్రమించిన సంభాషణమునకు నిశితత్వమును జెంది యుద్రేకపూరితమైన వాసిష్ఠబుద్ధి యా రాత్రియంతయు నేదో యాంతర్యమున దర్శించుకొనుచు నిద్ర నపహరించెను. మఱునాడుకూడ వాసిష్ఠు డంతర్ముఖుడై మాటిమాటికి మౌనముద్రితుడగుట రంగయ్యనాయుడు గమనించి, దేనిని గుఱించి యంతగా ధ్యానించుచుండిరో తెలిసికొను కుతూహలముచే నాచార్యునా పాయంత్రము సముద్రతీరమునకు వెంబడించెను. అక్కడ సముద్రతరంగములవైపు వాసిష్ఠుడు చూచుచున్నను వాటి నిరంతర చలన స్పందములకుగాని, యవి యొనర్చు ఘోషకుగాని కట్టువడని పగిది కూర్చుండెను. అప్పుడు రంగయ్యనాయు డాచార్యుని సంబోధించి ''దేనిని గుఱించి మీరంత దీర్ఘముగా మాటిమాటికి ధ్యానించుచుండి''రని యడిగెను. వెంటనే ''దశాం దేశస్యైతాం ప్రతిపద మయం ధ్యాయతి జనః'' అని ఛందోబద్ధమై ప్రత్యుత్తరము వచ్చుట కతడు త్రుళ్ళిపడెను. మఱుక్షణమందు వాసిష్ఠుడు తన ముఖమునుండి వెడలిన వాక్యముచే వ్యాసస్ఫూర్తిని బొందినట్లు రంగయ్య పండితునివైపు తిరిగి రెండు శ్లోకములచే తన భావగతిని వివరించి, యందొక శ్లోకముచే నప్రయత్నముగా వెడలిన వాక్యమును బూరించెను. ఆ శ్లోకము లిట్లుండెను:-

శ్లో॥ ''కులీనః క్షుద్రాయ ప్రవర ఇతి దత్తే నిజసుతాం
మనార్యాన్ విజ్ఞాశ్చ ప్రభవ ఇతి గాయన్తి శతశః।

బలం బాహ్వోర్లుప్తం హృతమపిచ వాగ్వీర్యమరిభిః।
ర్దశాం దేశస్యైతాం ప్రతిపదమయం ధ్యాయతి జనః॥'' 1
శ్లో॥ ''అరిభిరదయైః క్రాంతాయై తే ముహుర్ముహురుద్ధతైః।
కరమ వికలం దాతుం ధీరో న కోపి విలోక్యతే।
క్వ తవ దయితాస్తేతే పూర్వేధరే భరతాదయో।
యదజిత భుజా దుర్గస్థాయాస్తవాంబ న భీ రభూత్॥'' 2

(అర్థములు:- (1) సత్కులముతో బుట్టిన యొకడు తన కుమార్తెను 'వీడు మంచి వరు'డని చెప్పి యొక క్షుద్రున కిచ్చుచున్నాడు. అనార్యులను ప్రభువులని యింకొకడు స్తుతించుచున్నాడు. వాని భుజబలము లోపించుచున్నది. వాగ్వీర్యము శత్రువులచే నపహరింపబడుచున్నది. దేశమునకు గలిగిన యీ దశనే మాటిమాటికి నీ జనుడు తలపోయుచున్నాడు.

(2) ఓ భూదేవీ! నిర్దయులై మాటిమాటికి గర్వించుచున్న శత్రువులచే నాక్రమింపబడిన నిన్ను రక్షించుట కభయహస్తమిచ్చు ధీరుడొక్కడైనను గానరాడు. ఎవరి భుజములను నీవు దుర్గముగాగొని నిర్భయముగా పూర్వముంటివో, అట్టి భరతాదులిప్పు డెచ్చట నున్నారోగదా.)

ఈ విధముగా వాసిష్ఠుడు భారతజాత్యుద్ధరణము కొఱకెంత లోలోపల పరితపించుచుండెనో, అట్టి మహత్తర కార్యముచే నూత్నకాల నిర్మాణము నెట్లు తలపెట్టుచుండెనో, దానికొఱ కవసరమగు నీశ్వరానుగ్రహమునకై తన తపః ఫలమునంతను ధారవోయుట కెట్లు సంసిద్ధుడైయుండెనో చెన్నపురమం దనుచరులతో చేసిన ప్రసంగములందు సూచించుటబట్టి యతని జీవితలక్ష్యమును వారు గ్రహింప గల్గిరి. అంతేగాక, వారీ పవిత్రలక్ష్యమం దాచార్యు ననుకరించుటకు తీవ్రప్రేరణమును బొంది, వాసిష్ఠు నన్ని విధముల తమ గురువుగా నెంచుకొని తమ హృదయముల నతని కర్పించుకొనిరి. వాసిష్ఠుడును తనకిట్టి శిష్యులనిచ్చి, కార్యాంకురములను కల్పించుటకే యీశ్వరు డీ చెన్నపుర ప్రయాణమును సమకూర్చెనని యెంచి సంతోషముతో తిరువణ్ణామలై పోయి చేరెను.

సుందరయ్య గ్రంథాలయ
హైదరాబాద్-500 044.

ఓం

అయిదవ ప్రకరణము

# వేలూరు వాసము

వాసిష్ఠుడు చెన్నపురము వీడిన రెండుమూడు రోజులకు రాయవేలూరు పురములోని 'యూరిస్' కళాశాలాధికారియైన డబ్లియు. ఐ. చాంబర్లీను దొర నుండి రంగయ్య పండితున కొక లేఖ వచ్చెను. ఆ లేఖలో జనవరి నెలనుండి కళాశాలకు తెనుగు చెప్పు పండితుడొక డవసరమని తెలియజేయుచు. మంచి విద్వాంసు నెవరినైన రంగయ్య పండితు నెంచగోరెను. ఇది స్నేహపూర్వకముగా నొక క్రిస్టియన్ కళాశాలవారిచే నింకొక క్రిస్టియన్ కళాశాలోద్యోగికి వ్రాయబడిన లేఖ. దీని నందుకొనినంతనే వాసిష్ఠుడీ పదవి నంగీకరించినచో బాగుండునని రంగయ్యనాయుడనుకొని, మిత్రుడైన శాతంజేరి రామస్వామి అయ్యరుయొక్క సలహా నడిగెను. వేతన మిఱువది నాలుగు రూపాయలగుటచే వాసిష్ఠున కిది తిరువణ్ణామలై వేదపాఠశాలోద్యోగముకంటె మిగుల లాభకరమనియు, వేలూరు లోని రంగస్థల మన్ని విధముల వాసిష్ఠున కుత్సాహము నీయగలదనియు వా రుభయులు తలచిరి. అందువలన నిఱువురును గూడి వెంటనే తిరువణ్ణామలై వెళ్ళి గురుదంపతు లుభయులకు హితవు బల్కిరి.

వాసిష్ఠు డెంతమాత్ర మరుణాచలక్షేత్రము వీడుట కిచ్ఛగించకున్నను, భర్త కున్నతోద్యోగము ప్రాప్తించుచున్నదను వేడుకచే విశాలాక్షమ్మ పట్టుపట్టెను. ఆమెకొఱకే తాను తపోవృత్తిని విడచి కొన్నాళ్లు విధివిలసితమువలె నధ్యాపక వృత్తిని స్వీకరించవలసివచ్చినందున వాసిష్ఠుడామె కోర్కెకు కళాశాలవృత్తి నంగీకరించెను. వెంటనే రంగయ్య నాయుడు వేలూరు వెళ్లి, దొరగారికి వాసిష్ఠుని గుఱించి చెప్పవలసినదానికంటె నుత్సాహవశమున నధికముగానే చెప్పి, ఆర్డరు వేయించుటయే గాక వాసిష్ఠున కక్కడ యథాపూర్వగౌరవమునకు లోపము రాకుండున ట్లేర్పాటు గావించెను. మఱియు నచ్చట కళాశాలలో పండితుడైయున్న శ్రీనివాసయ్యంగారున్న యింటి యందతని సహాయమున రంగయ్య నాయు డద్దెకు వాసిష్ఠుని బసయు కుదిర్చెను.

ఈ రీతిగా 1904 సం॥ జనవరి నెలలో పండుగలకు పిదప కళాశాల తెరువబడినప్పటినుండి వాసిష్ఠుడు వేలూరు వాసియయ్యెను. కళాశాలలో ప్రవేశించిననాడే 'యఫ్.ఏ.' క్లాసులో తన విద్యార్థి శిష్యులను పేర్లవరుసను దిలకించుచు 'కె. జి. సుబ్రహ్మణ్యశాస్త్రి' యను పేరు వచ్చినతోడనే యతడు శాతంజేరి రామస్వామి అయ్యరుయొక్క మేనత్త మనుమడని వాసిష్ఠుడు జ్ఞప్తి దెచ్చుకొని 'నీవేనా అప్పుశాస్త్రి'వని ప్రశ్నించెను. 'ఔను, నాకది వాడుక నామ'మని యతడనగా

వాసిష్ఠు డొక్కక్షణ మంతర్లోచనుడైన పిదప వానితో నిట్లనెను: ''జన్మఋణము నది సూచించుచున్నది. నిజముగా నీవు నీ యప్పు దీర్చుకొందువుగాక'' ఈ పల్కులకత డుప్పొంగెను. మిగిలిన బాలురు తెల్లబోయిరి.

వాసిష్ఠుడు తొలినాడే తన క్లాసులోని విద్యార్థులను, కళాశాలలోని యితర ఉపాధ్యాయులను నిజతేజస్సుచే నాకర్షించెను. ప్రిన్సిపాలైన చాంబర్లీను దొరకు వాసిష్ఠుని జూచినతోడనే బైబిలులో పేర్కొనబడిన 'డేవిడ్' అను ప్రవక్త స్ఫురించెనని యతడు తన సన్నిహిత మిత్రులతో చెప్పగా వారందరు వాసిష్ఠుని వేడుకతో జూడవచ్చిరి. హైస్కూలు తరగతులకు ప్రధానోపాధ్యాయుడైన 'థామస్ హారిస్' అను దొర హిందూమతాచారము ననుసరించి వాసిష్ఠునకు చేతులు జోడించియు నమస్కరించెను. ఆ కళాశాల చరిత్రలో భారతీయుడొక డింతగా గౌరవింపబడుట కదియే తొలిసారియని పెక్కుమంది చెప్పుకొనదొడగిరి.

భర్తవలన విశాలాక్షమ్మకుగూడ గౌరవ మధికమయ్యెను. ఆమె కింటికత సహాయముగా నుండుట కామె యమ్మమ్మకు చెల్లెలైన విచ్చప్పపాటిని తీసికొని విశాలాక్షమ్మ మేనమామ స్వగ్రామమునుండి వచ్చెను. వీరి రాకవలన వాసిష్ఠుడు విశాలమైన యింటికొఱకు ప్రయత్నించవలసి వచ్చెను. మిట్టానందరావు వీథిలో కొన్నాళ్లు, అప్పశాస్త్రికి మేనమామయైన సదాశివదీక్షితు లనెడి వకీలింట కొన్నాళ్లు సదుపాయముకొలది బసను మార్చుచు, తుదకు 'ఉమామహేశ్వరు'డను నొక వకీలు ప్రోత్సాహమున నతని యింటికి సమీపముగా నొక విశాల గృహమందు వాసిష్ఠుడు స్థిరపడెను. ఖర్చు సరిబుచ్చుకొనుట కొకరిద్దరు విద్యార్థులకు ప్రైవేటు చెప్పుటకు గూడ వాసిష్ఠుడు పూనుకొని, కొద్ది నెలలైన పిదప మిత్రుడైన యుమామహేశ్వరుడు నెలకు పది రూపాయలిచ్చుచు కావ్యశాస్త్రములను జెప్పగోరినందున నితర ప్రైవేట్లను విరమించుకొనెను. శాతంజేరి రామస్వామి అయ్యరు మేనకోడలైన 'సుందరి' యను సుగుణవతికి భర్తయైన యీ ఉమామహేశ్వరయ్యరు వాసిష్ఠునియం దమిత భక్తి జూపుచు నెన్నో విధముల సహాయభూతుడై యుండెను. పాప మితనికొక గయ్యాళి చెల్లెలుండెడిది. ఆమె కుమార్తె నితడిష్టము లేకున్నను తన కుమారుడైన కచ్ఛపేశ్వరునకు వివాహము జేసికొని లోలోపల పరితపించువాడు.

అప్పశాస్త్రికి వాసిష్ఠునియందు తొలిపరిచయమునాటి నుండి గురుభావము కుదిరి, యతని సాంగత్య మనుదినము చేసికొనుచున్నను గురుసేవ జేయువఱకు తృప్తి లేక యుండెను. మిట్టానందరావు వీథిలోని కెప్పుడు వాసిష్ఠుడు బస మార్చెనో, అప్పటినుండి యిత డదే వీథియందు చేరువలో నున్న కారణమున గురుసేవ కవకాశము లభించెను. ఇతని సేవాతత్పరతకు గురుదంపతు లుభయులు నితనియందు పుత్రవాత్సల్యము జూపజొచ్చిరి. ఇతనికి 'కల్యాణరాము'డను పేరుగల తమ్ముడొకడుండెను. ఈ తమ్ముడుకూడ తన యన్న ననుసరించి వాసిష్ఠదంపతుల

కల్పించుకొని వారి సేవయం దన్నకు కుడిభుజమువలె నుండువాడు. ఇత డప్పటి కింకను హైస్కూలు తరగతులలో చదువుచుండెను. ఇతడు చదువుచున్న స్కూలు 'మహంతు' హైస్కూలగుటవలన బడికి పోవుటయం దన్నదమ్ములకు చెరియొక త్రోవ, చెరియొక వేళ యయ్యెడిది. ఈ యుభయులను వాసిష్ఠుడు తన పూర్వజన్మ సంబద్ధులుగను, కింకరులుగను గుర్తించి, వారికి మంగళప్రదమగు మంత్రము నుపదేశించి, వారిని తనవారిగా జేసికొనెను. అప్పశాస్త్రి కప్పటికి పందొమ్మిదేళ్లు నిండెను. కళ్యాణరామునకు పదునేడేండ్లు నిండెను. (వీరి జన్మ సంవత్సరములు 1885, 1887). వీరికి 'కావేరి'యను పేరుగల సోదరి యుండెను. ఆమెయు వాసిష్ఠునికడ మంత్రదీక్ష గైకొనెను. తలిదండ్రులు లేనివారై వీరు ముగ్గురు నొకరి నొక రెడబాయక యుండువారు.

ఇట్లీ ముగ్గురు తమ కుపదేశింపబడిన మంత్రములను శ్రద్ధతో జపించుచుండ, నొకనా డప్పశాస్త్రికి స్వప్నమందు తన ప్రపితామహుడైన 'ఉపనిషద్బ్రహ్మ' మగపడి, మంత్రదీక్ష నతడు వాసిష్ఠునికడ గైకొనినందులకు సంతోషము జూపి, గురున కింకను ప్రీతిపాత్రుడవు కమ్మని హెచ్చరించెను. ఇంకొకనాడు దూర్వాసమహర్షి స్వప్నమం దగపడి యప్పశాస్త్రి నాతిథ్యమడుగగా నేమిచేయుటకును దోచక నిజగురుని సలహా పొంది దూర్వాసున కొక పాత్రనిండ పాలుపోసి త్రాగబెట్టెను. అప్పుడా మహర్షి శాంతించి 'యెవరి సహాయమువలన శాపమునుండి నీవు రక్షింపబడితివో, ఆ గురుని నీవు పుత్రుడువలె సేవింపు'మని హితవు బల్కెను. ఈ స్వప్నములను గురించి యతడు తన గురున కెఱింగించెను. కాని, తా జేయవలసిన దేమియు చెప్పబడక శిష్యుడు చేయవలసినది మాత్రమే చెప్పబడెనని పల్కి, గురుడప్పటి కూరకుండెను.

ఇట్లుండ వాసిష్ఠుడు మఱికొద్ది రోజులలో నుబుసుపోకకై పండిత మిత్రులను జూచివచ్చుట కొకనా డరుణాచల క్షేత్రమునకు పయనము గాదలచి రైలుస్టేషనుకు వెళ్ళగా, రైలప్పటికి కొంచెము పూర్వమే వెళ్లిపోయినట్లక్కడివారు చెప్పిరి. మఱియు రైలాదినమున రావలసిన వేళకు ముందే వచ్చినదనిరి. అది వింతయై తోచ వాసిష్ఠుడింటికి మఱలెను. ఇల్లు చేరినతోడనే విశాలాక్షమ్మ పరిస్థితి మఱియు వింతయై యుండెను. వాసిష్ఠుడు గడప దాటిన పదినిముసముల కామెకు వాంతులు, విరేచనములు ప్రారంభించి, ప్రాణమును బహు నీరసపరచెను. మేనమామయైన మృత్యుంజయుడేదో ఆయుర్వేదము మందిచ్చెను. కాని, యది గుణమీయలేదు. వాసిష్ఠుడామె చేతి నాడి చూచి నిస్త్రాణ తప్ప దోషమింకొకటి లేదనెను. మఱియొక పావుగంట కామెయందు హఠాత్తుగా మృత్యులక్షణములు దోచి, శ్వాస నిలిచి, శరీరము కొయ్యవారెను. విచ్చుప్పాటి యను ముదుసలి గుండె బాదుకొని మొఱ్ఱోయనెను. జాతకరీత్యా యామె కాయుఃప్రమాణ మింకను గలదని

విశ్వసించుచున్న వాసిష్ఠున కంత యకాల మృత్యు వామె కెట్లు సంభవించెనో బోధపడక నిశ్చేష్టుడయ్యెను. కొద్దినిముసము లిట్లందరు శోకించుచుండగా పొరుగింటినుండి యేడ్పులు వినబడెను. అది యేమని వీరనుకొనుచుండగా విశాలాక్షమ్మ సచేతనురాలై, కన్నులు విచ్చి, చిఱునవ్వు నవ్వుచు "పొరుగింటి ముసలియామె ప్రాణములను గైకొనిపోవుటకు బదులెవరో దూతలు పొరపాటున నా ప్రాణములను హరించి గొంపోయినందుకు వారి ప్రభువుచే చీవాట్లు తిని, తిరుగ నా బొందెలో నా ప్రాణముల నిప్పుడే చేర్చిరి. బొందెను వదలిన ప్రాణమున కెంత చైతన్యమున్నదో గదా!" యని ప్రాణచైతన్యమును స్పష్టముగా తెలిసికొనినదానివలె పల్కెను. వాసిష్ఠుని ముఖము వికసించెను. ఏ సాధనయు లేకనే ప్రాణస్వరూపము నామె చూచి, యోగులకుగూడ నలవికాని యనుభవము నామె పొంది, యామె పూర్వజన్మ పరిపాక స్థితిని సూచించెనని యతడు సంతసించెను. పిమ్మట విచారించగా పొరుగింట నొక ముదుసలి కలరావ్యాధి సోకి చనిపోయినట్లు తెలిసెను. అటుపిమ్మట విశాలాక్షమ్మయం దగపడిన వ్యాధి లక్షణము లొక్కసారిగా మాయమై, శరీరము నావరించిన సుఖవశముననో లేక ప్రాణచైతన్య స్వరూపస్ఫూర్తి యా స్వరూపానుభవ సుఖమును గ్రోలుట కంతర్ముఖ మగుచుండుట వల్లనో మాటిమాటికి యామె కన్ను మూయుచు చెంతనున్న వారిని కొంతతడవు మఱల కలవరబెట్టెను.

ఇట్లొకసారి కన్ను మూసినప్పుడు శ్వాసలు మఱల సన్నగిల్లుట జూచి వాసిష్ఠుడు నాడి పరీక్షించెను. నాడియందెట్టి నీరసము దోచలేదు. రెండుమూడు నిముసముల కామె కన్ను దెరచుటయేగాక స్వయముగా లేచి కూర్చుండి, అప్పశాస్త్రికి కబురు పెట్టగోరెను. అర్ధరాత్రియైనను, మృత్యుంజయుడు పోయి వానిని లేపి తీసికొనివచ్చెను. అతడు వచ్చినతోడనే 'అప్ప' అని యాదరమొప్ప బిలిచి, "నీ తలిదండ్రులను, ఉపనిషద్ద్రష్టమువఱకుగల మీ పూర్వీకు లందఱిని నేను చూడగల్గితిని. నీ తల్లి నాతో సంభాషించి, నిన్ను నా జ్యేష్ఠ పుత్రునిగా జూచుకొమ్మని బ్రతిమాలి నాయొద్ద వాగ్దానమును గైకొనెను. కనుక నీవు నా కిటుపైన దత్తపుత్రుడ"వని యామె పల్కి, వాని శిరస్సును పుత్రవాత్సల్యముతో చుంబించెను. అత డానందపరవశుడై గురుదంపతు లుభయుల పాదములకు మ్రొక్కి 'మీరే నాకిటుపైని తలిదండ్రులు. నేను జన్మవలన శ్రీవత్సగోత్రుడనైనను, నా సంధ్యావందనమం దిటుపైని కౌండిన్యగోత్ర ప్రవరము జెప్పుకొందు'నని ప్రమాణము చేసెను. నాటినుండి యతనిని వాసిష్ఠుడుకూడ జ్యేష్ఠపుత్రునిగా పరిగణించుచు, శునహోత్రపుత్రుడైన శునశ్శేపుడు గాధిజుడైన విధమున నతడు ద్విగోత్రుడైన ట్లెంచెను. అదిమొదల లప్పశాస్త్రి వేలుకాపురమును మాని విశాలాక్షీ గణపతుల యాజ్ఞచొప్పున తన కుటుంబముతో సహా వారి కుటుంబమును వచ్చి చేరెను.

ఈ వార్తను విని యిరుకుటుంబములవంకవారును గుసగుసలాడిరి. కాని, వాటిని విశాలాక్షి గణపతులు, అప్పుసోదరులుకూడ లక్ష్యపెట్టలేదు. మఱికొద్ది రోజుల కప్పుశాస్త్రి భార్యయైన కామాక్షమ్మ పుష్పవతియైన వార్త విని యామె పునస్సంధానమున కప్పుశాస్త్రిని తీసికొని విశాలాక్షమ్మ వెళ్లి, పునస్సంధానోత్సవము ముగిసిన వెంటనే కోడలిని వెంట నిడికొనివచ్చి తన గృహమున జేర్చుకొనుటకా కోడలు తరపు వారెంతయో సంతసించిరి. ఈ కోడలు ఖ్యాతి వహించిన సర్ సి.పి. రామస్వామి అయ్యరుకు తల్లి వంక చుట్టమై సోదరియగును. ఈమెయు కాపురమునకు వచ్చినతోడనే మామగారియొద్ద మంత్రదీక్షబొంది, యత్తమామలను దైవసమానులుగా సేవింపజొచ్చెను. కందకు లేని దురద బచ్చలికనినట్లు విచ్చుపాటికి దత్తపుత్ర బెదద యంతయు వెగటై, మాటిమాటికి విశాలాక్షమ్మను దెప్పజొచ్చెను. ఆమె యెత్తిపొడుపులు భరించలేక అప్పుశాస్త్రి కుటుంబమును పూర్వపుబసలోని కామె మార్చి, యక్కడ కామాక్షి వండిన వంట నుండి తనకును, తన భర్తయైన వాసిష్ఠునకును భోజనమును రెండుపూటలందును తెచ్చుకొన ప్రారంభించెను. దీనితో విచ్చుపాటి మఱింత యుడుకుకొనెను. కాని, యెంతకైనను మఱల యేక కుటుంబమగుట కామె యొప్పక బింకము వహించినందున విశాలాక్షమ్మయు తన బింకమును జూపెను. పదిమాసము లిట్లు గడచిన పిదప ముదుసలియైన విచ్చుపాటికి కాలధర్మమున మృత్యువాసన్నమై, చనిపోవునప్పు డామె తన తప్పిదము నొప్పుకొని, రెండు కుటుంబముల నేకముచేసి, వారి పొత్తు వృద్ధియగుట కాశీర్వదించిన పిదప ప్రాణములను వీడెను. మృత్యుంజయుడప్పుడు స్వగ్రామము పోయి విశాలాక్షమ్మ పట్టుదల గుఱించి, యామె కప్పుశాస్త్రి కుటుంబమునందున్న యభిమానము గుఱించి చెప్పగా విని వాసిష్ఠుని వంకవారుకూడ త్రుళ్లిపడి, యామెకు కోపము దెప్పింపరాదని గ్రహించిరి.

అప్పటికే వాసిష్ఠునియొద్ద మంత్రదీక్షలను గైకొనినవారు పెక్కుమంది స్త్రీపురుషులుండిరి. పురుషులలో విద్యార్థిదశయందున్న వా రధికముగా నున్నను, వారియం దధ్యాత్మలక్ష్యమంతగా లేక బాల్యచాపల్యమువ స్వల్పకామ్యములనే సాధారణ స్త్రీలవలె కమనీయ లక్ష్యములుగా నెంచుకొనువారు. కనుక వారికి వాసిష్ఠు దధ్యాత్మ బోధ దఱచు చేయుచుండెను. ఒక్కొక్కప్పుడీ బోధలకు పెద్దలు కూడ వచ్చువారు. పెద్దలలో వకీలైన ఉమామహేశ్వరయ్యరువలెనే కాలేజియందు హిస్టరీ ప్రొఫెసరుగా నుండిన శివసుబ్రహ్మణ్యము, దిగువ తరగతుల కుపాధ్యాయుడై యున్న సర్వేపల్లి వరసింహము (ఇతడు సర్ సర్వేపల్లి రాధాకృష్ణకు పినతండ్రి. కొంత వయస్సు మళ్లిన పిదప సన్న్యసించి ప్రణవానందమను పేరు పెట్టుకొనెను) యెన్నికైనవారు. వీరి భార్యలుకూడ వాసిష్ఠ శిష్యులయిరి. ఈ పెద్దల యనురోధమువలన వాసిష్ఠుడు రెండు మూడు బహిరంగ సభలయం దుపన్యసించి

వైదికమత విశిష్టతను గుఱించి ప్రధానముగా బోధించెను. ఆ యుపన్యాసముల సారమిట్లుండెను: ''శరీరోపాధులనుబట్టి మానవ, పశు, పక్ష్యాది జాతులను మనము పేర్కొనుచుంటిమి. ఈ యుపాధులు బుద్ధిజాతి కనుగుణమై యున్నందున నుత్తమమగు మానవజన్మ పొందిన వారందరు తమ బుద్ధివికాసమువల్లనే పొందగల్గిరని చెప్పక తప్పదు. అట్లుత్తమ జన్మ బొందిన పిదప శరీరమందభిమానముగొను బుద్ధికిని, శరీరమునుండి యాత్మవంక కభిమానమును మఱల్చుకొనిన బుద్ధికినిగల తారతమ్యమును గ్రహించవలెను. శరీరము వృద్ధిక్షయములకు, సుఖదుఃఖములకు లోనగునట్టిది కావున దానియందభిమానమువలన దానిని ద్వంద్వములకు వశముగాకుండగనో, రిపు రోగాది బాధలకు గురికాకుండగనో రక్షించుటయందు బుద్ధిని వినియోగించి విఫలులమగుచుందుము. శరీరరక్షణ మవసరమైనను, శారీరకవాంఛలం దెల్లప్పుడు బుద్ధిని వినియోగించుట పశుత్వమైన కావచ్చును లేదా క్రూరమృగతుల్యమగు రాక్షసత్వమైన కావచ్చును. అట్లుగాక శారీరక వాంఛలను తగ్గించుకొనువారికి స్వార్థమందభిలాష తగ్గును. అది తగ్గుకొలది త్యాగము, సహనము, కారుణ్యము మొదలుగాగల సుగుణములు వృద్ధియై బుద్ధియందు విశాలదృష్టియు, హృదయమందవ్యాజమగు ప్రేమయు ప్రాప్తించును. స్వార్థమందభిలాషను తగ్గించుట యొకటి, పరార్థమందభిలాషను బొందుట వేఱొకటియని మీరు గుర్తించవలెను. మొదటిదానిని సాధించినంతమాత్రమున రెండవది సిద్ధించదు. రెండవదానికి చేయు సాధనయందు మొదటి దిమిడియున్నందున దీని సిద్ధిచే సర్వము సిద్ధించినట్లగును. అట్టి యీ పరమార్థసాధనమును గుఱించి చెప్పునది మతమనబడును. కనుక చెప్పబడిన సాధనోత్కృష్టతనుబట్టి మతోత్కృష్టతను నిర్ణయించక తప్పదు. ప్రపంచమం దెన్ని మతములు పుట్టి, యెన్ని నశించెనో చెప్పజాలము. మనకు తెలిసినంతవఱకు చూడగా నొక్క మహానుభావుని సాధనానుభవములపై మొలకెత్తిన మతము సర్వజనుల కుపయోగకరమగుటలేదని స్పష్టమగుచున్నది. నానావిధ సాధనానుభవములను మనకందిచ్చు మతమొక విజ్ఞాన కోశమువలె మానవజాతి కంతకు నుపయోగించును. అట్టి మతమే 'వేదమత' మనబడును. కావున సంకుచితబుద్ధిని, యీర్ష్యను మాని మానవులందఱు వేదమతమును స్వీకరించి, చిల్లరదబ్బులవంటి మతముల కాశించక పెన్నిధినిబొంది, యధిక తేజోవంతులు కావలెనని నే నభిలషింతును. వేద మార్య ఋషులయొక్క దర్శనానుభవకోశమైనందున వేదమతమే ఆర్యుల మతమగును. ఆర్యులన్ని దేశములకు వ్యాపించి తమ విజ్ఞానబీజములను నాటిరి. కాని, భారతదేశమందు వా రధిక కృషిసల్పి, హెచ్చుగా వ్యాపించి, తమ మతమును చిరస్థాయిగా చేసిరి. కనుక వారు నాటిన బీజము లితర దేశములందు నశించినను,

భారతదేశమం దింకను మిగిలియున్నది. పెద్దపామును మ్రింగుటకు వానపాములు సాహసించినట్లెన్నో మతము లన్య దేశములనుండి వచ్చి యిక్కడ మిగిలియున్న వేదమతమును కబళింపబూని తమకు తామే నశించెను. అదియే వేదమతోత్కృష్టతకు ప్రబలమగు నిదర్శనము.''

క్రీస్తుమతమును స్వీకరించిన కొంద ఱుపాధ్యాయులు ప్రత్యేకాహ్వానము పైని ఈ యుపన్యాసములకు వచ్చి, ఏమియు నీర్ష్యజెందక వెడలిరి. వారిలో అదిశేషయ్యయను పేరుగలాతడు మాత్రము వాసిష్ఠునకు క్రీస్తుబోధల ప్రాశస్త్యము తెలియదని భ్రమించి, మఱునా డాచార్యునకు బైబిలులోని మంచి వాక్యములను వినిపింపసాగెను. వాని భ్రమను తొలగించుట కాచార్యుడందలి వాక్యములను పుస్తకము చూడకుండగనే పెక్కింటిని వల్లించి, వాటిని మించు మహాకవుల వాక్యములనుగూడ చదివి వ్యత్యాసము జూపెను. అటుపిమ్మట వానికిట్లు హితవుబల్కెను: ''నీవు చదువ బూనిన వాక్యము లన్నియు మతమునకు జెందినవికావు. మతసంబంధములగు మంచి వాక్యములు బైబిలులో నుండుగాక. కాని, యందులో చెప్పబడక యితర మతగ్రంథములలో చెప్పబడిన మంచి వాక్యములను నీవేల వినవొల్లవు? నీ మతమునకు విజ్ఞానము ప్రాధాన్యమైనచో నింత స్వల్పమునకే తృప్తిజెందవు. నగల పెట్టెలోనికి చేయిపెట్టిన దొంగ యొక కంఠహారమును దీసి, చేతిని మఱి బోనీయక యూరకుండునా? నీవు క్రీస్తు మతమును స్వీకరించినను, వేదమతోత్కృష్టతను కాదనజాలవుగదా. అట్లే ప్రతి క్రైస్తవుడు, ప్రతి మహమ్మదీయుడు, ప్రతి యన్యమతస్థుడు గుర్తించి, వేద మతమును తమ మతప్రచారము కొఱకు నిరసించకుందురుగాక. ఇది నే బల్కు హితవు.''

ఇట్టి ప్రసంగములచే హైందవమతమును పరిహసించుటే గొప్పగా సంకల్పించుకొనిన క్రైస్తవుల వ్యసనమును వేలూరు కళాశాలలో వాసిష్ఠు డచిరకాలములో రూపుమాపెను. అంతేగాక, క్రైస్తవమతమును, తురకమతమును స్వీకరించిన భారతీయులయందు తమ జన్మదేశముకూడ మతముతో మారిన ట్లెంచు పామరత్వముండుట నిరసించెను. అట్లే చదువుకొఱ కా కళాశాలయందు జేరిన హైందవ విద్యార్థులు తమ యుపాధ్యాయులయందున్న గౌరవమునకు నిదర్శనముగా మతమునకు బానిసలు కానక్కరలేదనియు, స్వతంత్రశీలురైన దొర లితరులయందును స్వతంత్రశీలమునే మెచ్చుకొందురనియు వాసిష్ఠుడు తన ప్రవర్తనచే నాదర్శము జూప విద్యార్థులు పెక్కుమంది ధైర్యవంతులైరి.

క్రమముగా విద్యార్థులు వాసిష్ఠునియందు ప్రకటితమగుచున్న యార్య మతాభిమానముతోబాటు మాతృదేశాభిమానమునుగూడ చూరగొనిరి. కాని, వీరియందు మాతృదేశాభిమానము వెఱ్ఱితలలు వేయుటజూచి పలుసార్లు వారి నాచార్యుడు మందలించెను. అప్పుడు వంగ, పంజాబు రాష్ట్రములందు

విప్లవోద్యమమొకటి ప్రభుత్వమును కూలద్రోయుట కారంభింపబడుట వార్తాపత్రికల నుండి విద్యార్థులు, చదివి తాముకూడ తోడ్పడుట కుద్రేకపూరితులగుచు నుద్యమకర్తలతో కార్యవిధానము కొఱ కుత్తర ప్రత్యుత్తరములను రహస్యముగా నడుపజొచ్చిరి. ఈ యుద్యమమందు పాల్గొనుటకు విద్యార్థుల నూతగొనుట కార్యకర్తల సంకల్పమైనందున పలుచోట్ల తమకు ప్రాధాన్యము వచ్చిన గర్వముతో విద్యార్థులు తమ అయువుల నర్పించుటకు ప్రమాణము చేయదొడగిరి. చెన్నపురమందు సుధన్వుని నాయకత్వమున వాసిష్ఠశిష్యులైన విద్యార్థులు కొందరప్పుడే ప్రమాణములను గైకొనినట్లు వేలూరు విద్యార్థులకు దెలిసి, యతనినే నాయకునిగా నెంచుకొనుటకు మంతనము లారంభించిరి. వాసిష్ఠుని యాశీర్వచనము బొందుట కొకనా డీ సందర్భమున సుధన్వుడు వేలూరు వచ్చి 'విప్లవము నారంభించుట కప్పుడే తేదీలతోసహా కార్యక్రమము నిర్ణయింపబడె' నని చెప్పగా వానిని వాసిష్ఠుడు చీవాట్లుపెట్టి ''మనలను పాలించు బ్రిటిషువారు కుంకలని నీవు తలచుచుంటివి కాబోలు. ఊరూర వారికి రక్షకదళ మున్నది. మీ యుద్యమ విషయములను సేకరించు రహస్యాధికారులుగూడ వారికున్నారు. కనుక మీ కంటెను ముందే మిమ్ముల నుద్యమారంభ సమయమునకు కాల్చి చంపుటకుగూడ సంసిద్ధులై యుందురని విశ్వసింపుము. చేతులార ప్రాణముల నిట్లు వ్యర్థముగా నర్పించుకొనువారి కితరులు సానుభూతియైన జూపరు. నేనిట్టి మూర్ఖచిత్తుల నాశీర్వదింపజాలను, పొ''మ్మని కసరెను. సుధన్వుడు గురువ కయిష్ట విధమున దా ప్రవర్తించినందులకు పశ్చాత్తాపము జెంది, యుద్యమమునుండి విరమించు కొందునని ప్రమాణమొనర్చెను. కాని, వాసిష్ఠు డంతతో నూరకుండక సుధన్వుని రాక కలజడిచెందియున్న విద్యార్థులకుకూడ హితవు బల్కుటకై ఆ సాయంత్రమే తిరుపతి దేవస్థాన మహంతు హైస్కూలులో హెడ్మాస్టరైన పి.యస్. రాఘవాచారి యధ్యక్షత నొక యుపన్యాసము నిచ్చెను.

గంభీరమైన యీ ఉపన్యాసములో విద్యార్థుల విధుల గురించి వాసిష్ఠుడు తొలుదొల్త చెప్పి, విద్యవలన తమ కర్తవ్యములను బాగుగా పరిశీలించు బుద్ధివికాసమును బొందనివారు పెరిగి పెద్దలైనను చీడపురుగులవలె సంఘమందు పరిగణింపబడుదురనియు, వారితరులకే కార్యమందును నేతలు కాజాలరనియు నొక్కి వచించెను. పిమ్మట మన దేశమందట్టి వారివలన నడపతడప సంభవించుచున్న ముప్పులను పేర్కొని, యుత్తరాది భారతీయులే యెల్లప్పుడట్టి ముప్పులకు కారణభూతులైన విషయమును ప్రతిపాదించెను. అటుపిదప వాసిష్ఠుడు తన ప్రవచన ధోరణిలో నందుకొనిన ట్లానాటి విప్లవపిచికలను బేర్కొని యిట్లు విమర్శించెను: ''నిత్యకల్లోలమే జీవితధర్మమై యొప్పు యుత్తరాదివారితో దక్షిణ భారతీయుల

కెందును పొత్తు కుదరదు. ఒకరిది పశుబల, మింకొకరిది బుద్ధి బలము. వారిలో నేయొక్కడైన బుద్ధిశాలియగుట యరుదు గావున నట్టివానికి మేళతాళములతో ప్రచారము సల్పుకొనుచుందురు. ఆ యట్టహాసములను పత్రికలందు చదివి మీరు వారి గొప్పతనమును భ్రమించరాదు. ధనము పుష్కలముగా నున్నందున వారితర దేశములకు తరచు పోయివచ్చుచు, నక్కడ నేర్చిన కూతల నిక్కడ కూసియు భ్రమింపజేయుదురు. వీరి కూతల వలన కొన్ని విప్లవవీచిక లీమధ్యను దక్షిణ దిక్కునకు వీవజొచ్చెను. అవి మలయ మారుతములని భ్రమించి యాస్వాదించవలదు. పెద్దలు వెనుకకు తగ్గి, పసిపిల్లలను హోమగుండమున కర్పించు ప్రబోధములివి. దీనినిబట్టి యీ విప్లవకర్త లెంత పిరికిపందలో, యెంత మోసగాండ్రో, యెంత దయావిహీనులో విదితమగును. ఈ విషయమంతయు స్వాతంత్ర్యము పేరుతో దాక్షిణాత్యుల బుద్ధిని పాడుచేయుటకని గుర్తింపుడు.''

వాసిష్ఠుని యీ ప్రవచనమున కెల్లరు మెచ్చుకొనిరి. వేలూరు విద్యార్థులకిది కనువిప్పయ్యెను. వారిలో కొందఱింకను వాసిష్ఠశిష్యులై, తమ బుద్ధివికాసమునకు మంత్రదీక్షలను గైకొనిరి. మఱికొందఱు మంత్రములందు నమ్మకము లేనివారై, మంత్రప్రభావములను గుఱించి చర్చించుట కొకనాడు వాసిష్ఠుని కడకు వచ్చిరి అప్పుడు జపభారముచే డస్సియున్న వాసిష్ఠుడు వారి రాకకు కారణమడిగిన పిదప వారియొద్దనే నడుము వాల్చుచు 'ఒక్క క్షణము విశ్రాంతి గైకొననిండు. పిదప మాట్లాడుకొంద'మని పల్కి, తన జపమాలను చాపపై పెట్టి, కన్నులు మూసికొని పరుండెను. అట్లు జపమాలను దించిన మఱుక్షణ మందు వాసిష్ఠుడు విలిపిన మంత్రము నా విద్యార్థులం దొకడు వాసిష్ఠుని కంఠస్వరముతో నతి త్వరితగతి నలవాటుపడినవానివలె కన్నులు మూసికొని జపించుట చూచి మిగిలినవా రాశ్చర్యచకితులైరి. ఒకటి రెండు నిముసములైన పిదప కన్నులు విచ్చి, చిఱునవ్వు నవ్వుకొనుచు తన జపమాల నందుకొనెను. ఆ వెంటనే యార్పివేయబడిన దీపమువలె విద్యార్థి జపము, ఆవేశముకూడ అంతరించి, యతడు కన్నులు విచ్చి యిటునటు విభ్రాంతి జెందినవానివలె జూచెను. అతని కేమియు జపించిన జ్ఞప్తి లేదు. మిగిలినవారత డుచ్చరించిన దానిని పట్టలేకపోయిరి. కాని, ప్రభావము ప్రత్యక్షముగా చూడబడి నందున వారు తమ శంకలను విడిచి, వాసిష్ఠుడు సిద్ధపురుషుడని యతని శరణుజొచ్చిరి.

ఈ వార్త రెక్కలు గట్టుకొని వ్యాప్తమై, వాసిష్ఠ కీర్తిని వ్యాపింపజేసెను. ఇంకొకనాడు హెడ్మాష్టరు రాఘవాచారి చోళింగపురములోని ఘటికాచల నరసింహ క్షేత్రమును దర్శించుకొనివచ్చి, యా క్షేత్రము వాసిష్ఠుడు చూడలేదని దానిని వర్ణించుచుండగా, వాసిష్ఠుని ముఖమునుండి కొన్ని శ్లోకము లావేశగతి నీ దిగువ విధముగా వెడలెను.:-

నృసింహమూర్తిని గురించి :

1. ఘటికాచల మాలయ మావధతా
శరణాగత రక్షణ మాచరతా।
కరుణా కలితేన జగత్పతినా
న వినా మమ యాతి ముదం హృదయం॥

2. వసతిం కురుషే ఘటికాద్రివరం
హృదయంచ మదీయ మద స్సదయ।
నరసింహ విహాయ విభో కపటం
వద కుత్ర మనో భవతో రమతే॥

3. ఘటికాచల వాసిన మీశ మజం
సతతం స్మరతాం క్వ సతా మశుభం।
యది కోపి భవే దశుభస్య లవో
రుచిరాశి రుదేష్యతి పాశిదిశి॥

4. బహవోఽవతరా విలసంతు మధుం
ద్విషతో నిజవిగ్రహతో వ్యధికం।
ఘటికాగిరిరా డ్వసతో నృహరౌ
కరుణావతిమే రమతే హృదయం॥

5. చరణాగతా న్వరమ స్వాతికా న్వృషీ
న్కరుణావలోక నిక రేణలాలయన్।
ఘటికాద్రిసీమని నృసింహ విగ్రహో
జగతాంపతి ర్వసతి వాసవార్చితః॥

అమృతాంబను గురించి :-

1. భాగ్యేన భూమి భాజా
మమృతాంబానామ బిభ్రతీ వసతి।
ఘటికాచలస్య శిఖరే
దయితే దైత్యేయ దళనస్య॥

2. సుతరాం కరుణాకలితం
విదధ న్నరసింహమానసం చలితం।
ఘటికాచలేతి లలితం
కిమపి పరందైవతం జయతి॥

3. అమృతం మునీంద్ర మనసా
మమృతం నరసింహనయన యుగళస్య।
అమృతం కవిరసనానాం
ఘటికాద్రౌ ధామ పర మస్తి॥

4. సేవితు మతీవ యోగ్యం
నిగమాగమ వాక్యసంచయై ర్మృగ్యం।
తను బద్ధ మతి భాగ్యం
నృహరే ర్ఘటికాచలే జయతి॥

5. నివస త్యమరేంద్ర సుందరీ
కబరీ లాలిత పాదుధూలికా।
నర కేసరి చిత్తడోలికా
ఘటికాద్రౌ జలరాశి బాలికా॥

**హనుమంతుని గురించి :**

1. నరసింహ పదాంభోజ
భ్రమరాయిత మానసం।
యోగయుక్తం హనూమంతం
ఘటికాద్రిగతం భజే॥

2. విషహత్యా పిశాచానాం
కోటేర్వీరవరః పురా।
అధునా దృశ్యతే యోగీ
నరసింహ పదాంతికే॥

3. సత్యంవద మహావీర
కుత్రతే రమతే మనః।
నృవేషే వా హరౌ కింస్విత్
నృసింహతనుధారిణి॥

4. విచింతయ స్నివాఽభేదం
శ్రీరామ నరసింహయోః।
యోగయుక్తో మరుత్సూను
ర్ఘటికాద్రౌ ప్రదృశ్యతే॥

5. యస్మిన్మనః పథం యాతే
న జనస్య విపత్పునః।
తం భజే మరుతః పుత్రం
యోగినం వీరకుంజరం॥

పై శ్లోకములందు నృసింహస్వామి, దేవియగు అమృతాంబమాత్రమే గాక వారి సమక్షమం దవురూపముగా ప్రతిష్ఠింపబడిన హనుమంతుడుగూడ కన్నులతో చూచుచున్నట్లు స్తుతింపబడెను. ఈ హనుమత్ప్రతిష్ఠను గుఱించి వినకుండగనే పేర్కొనుటనుబట్టి వాసిష్ఠుడు దివ్యదృష్టిసంపన్నుడని రాఘవాచారి గ్రహించెను. ఈ వార్తకు వాసిష్ఠశిష్యులు మఱింత సంతసించిరి.

ఇట్టి వార్తలను విని చిత్తూరులోని విద్యార్థులు కొందఱు వాసిష్ఠుని దర్శించుట కొకనాడు వచ్చి 'వందేమాతరం' విప్లవమువంటి దొకటి మంత్రశక్తి నాధారముజేసికొని దేశక్షేమము కొఱకు వాసిష్ఠ నేతృత్వమున నెలకొల్ప వేడిరి. వారింకను నిట్లు చెప్పిరి: 'దేశస్వాతంత్ర్యముకొఱ కితరులు స్థాపించుచున్న ఉద్యమములకు మానవబలమో, ఆయుధబలమో ఆధారముగా నున్నది. మనలను పాలించు విదేశీయులీ రెండింటియందును మనకు మించిన బలము గల్గియున్నారు. కనుక నీ యుద్యమముల కపజయము తప్పదు. దొరలది దేవతా బలము కాదుగదా. మంత్రశక్తిచే దేవతానుగ్రహమును బొందిన వారిముందీ దొరల బలము నిల్వజాలదని మా విశ్వాసము. కనుక మీరొక సంఘమును స్థాపించి, దానియందు చేరదలచినవారి కట్టి దేవతానుగ్రహమునిచ్చు మంత్ర మొకటి యుపదేశించినచో నొక దేవసేన వంటి దేర్పడి. దేవతాప్రబోధము ననుసరించి దేశసేవ చేయవచ్చునను నాశతో మీ సన్నిధికి వచ్చితిమి. మీరు మంత్రమూర్తులు, వరప్రసాదులు కనుక మీయందిట్టి సేనను నిర్మించు శక్తి యుండును. అది చాలనిచో మీయందీ కార్యమునకు వలయు శక్త్యవతరణమగుటకు మా ప్రార్థనలన్నియు మీకు దోడ్పడుచుండునుగదా''

అత్యంత రమ్యముగా వచింపబడిన యీ పల్కులు తన భావములకు సరిపోయినందున వాసిష్ఠునకు హితకరము లయ్యెను. పైగా, యీశ్వరాంశ యవతరించుట యావశ్యకమని పూర్వమే నమ్మియుండెను. మఱియు నానట్టి యవతరణము తనయందుగాకున్న వేఱొకనియందైన వచ్చుటకే తపస్సు సల్పు చుండెను. దివ్యజ్ఞాన సామాజికులుగూడ దివ్యపురుషావతారమును సాధింపబూని నట్లు వాసిష్ఠుడు వినుచుండెను. పెక్కుమందికట్టి యూహలు పుట్టుచున్నప్పు డిది యసంగత మెట్లగును ? నిశ్చయముగా రాబోవు నవతారముయొక్క ప్రబోధములే యివి కావలెను. పూర్వము వసిష్ఠాదులు భగవదవతరణమును సాధించుటకేగదా ముందు బుట్టిరి. వారి తపఃఫలముగా భార్గవరాముడు పుట్టి యిచ్చిన అస్త్రమంత్రమే రఘురామునకు దుష్టసంహారశక్తి నిచ్చియుండును. దీనినే పౌరాణిక భాషలో నింకొక విధముగా వచించియుందురు. ఇట్లు వాసిష్ఠుడు తర్కించుకొనిన పిదప ''మీరు చెప్పిన దాలోచించి చూచెదను. వారము దినములలో మఱల వచ్చి యగుపుడు'' డని సమాధానమిచ్చి చిత్తూరు విద్యార్థులను బంపివేసెను.

ఈ వారము దినములలో చిత్తూరు విద్యార్థుల విజ్ఞప్తి వేలూరు, చెన్నపుర విద్యార్థి శిష్యులందరికి దెలిసి, వారియందుత్సాహము బుట్టించెను. అది గమనించి వాసిష్ఠుడిట్లు నిశ్చయించుకొనెను: "వీరి యుత్సాహమున కీ ప్రాంతమున సహజమై యున్న విప్లవాత్మకబుద్ధి కారణము. వీరినిప్పు డణచినచో ప్రమాదకరమగు విప్లవోద్యమముల జొరబడి హాని జెందుదురు. కావున వీరి నొక త్రాటను నడపినచో నాకును, వారికినిగూడ క్షేమమగును. వీరడుగుచున్న మంత్రము వీరి యాశయము లకు సరిపోవునట్లు సమకూర్చెదగాక. ఈ సంఘము కేవల బ్రాహ్మణ *సంఘమై విలసిల్లి, వైదికఋషి మతోద్ధరణకు బునాదియగుగాక." ఈ రీతిగా నిశ్చయించు కొని క్రీ.శ. 1905వ సంవత్సరములో వాసిష్ఠుడు సంఘ స్థాపనమొనర్చి, బ్రాహ్మణ విద్యార్థి శిష్యులనుమాత్ర మందు చేర్చుకొనెను. వారికి "ఉమాం వందే మాతర"మ్మని మంత్రము కల్పించి యుపదేశించెను.

సంఘము బ్రాహ్మణవిద్యార్థులకు పరిమితమైయున్నందునను, బ్రాహ్మణ కుటుంబములా జిల్లాలయం దల్పసంఖ్యాకులై యుండుటచేతను దానియందు చేరినవారి సంఖ్య నలుబది మందికి లోవుగానుండెను వారిలో చిత్తూరుపురమున నివసించువారు పదిమందికి తక్కువయైనను, బహు హుషారు గలిగి వందమందికి మించిన క్రియాబలశూరులై యుండువారు. వారి యాశయము లతీతములు, స్వప్నములు విపరీతములు. పట్టుదలయున్నను మూర్ఖచిత్తులు. కార్యమందు చిలవలకు పలవలుదీసి, తమతో నితరు లేకీభవించనియెడల ప్రత్యేకమగుటకు బెదరించుచు తన్మూలమున స్వతంత్రబుద్ధిని చాటించుకొనగోరువారు. ఇట్టి మనస్తత్వ ప్రభావముచే చిత్తూరు శిష్యవర్గములో ముగ్గురు నలుగురు విద్యార్థులు యువకజనాకర్షణముకొఱకు సంఘములో చేరిన యొకటి రెండు మాసములకే తమ చదువులకు స్వస్తిజెప్పి, బృహత్కార్యము తమ నెత్తిపైనున్నట్లు మసలుచు, వాసిష్ఠునొద్దకు మాటిమాటికి వచ్చి, 'మన సంఘము ప్రబలుటకు పూర్వమొక కార్యవర్గమును మీరు నిర్ణయించుట మంచి'దనియో, 'శత్రువుల మరఫిరంగులు మనపై వ్యర్థమగుటకు దేవత యెట్లనుగ్రహించునో విన కుతూహలపడుచుంటి' మనియో వేధింపజొచ్చిరి.

ఒకటి రెండుసార్లు వాసిష్ఠుడు వారి ప్రశ్నలను వినీవిననట్లూరకున్నను చెప్పక తప్పినది కాదు. అప్పుడు మూర్ఖచిత్తుల నుప్పొంగించుటయే శ్రేష్ఠమని వాసిష్ఠుడెంచి 'వీడు మన కార్యమందు సైన్యాధిపతి, వాడు కోశాధిపతి...' అని పేరు పేర్లతో కార్యవర్గమును నిర్మించి, యటు పిదప వారి చిత్తవృత్తుల ననుసరించి దాని నప్పుడప్పుడు సవరించుచు, వారి మనోరజ్జువులను వశమొనర్చుకొనెను. మఱియు వారితో "దేవి యొక అమృతభాండము నీయనున్నది. ఆ యమృతమును గ్రోలి

* ఇంద్రసంఘమనియు పిలువబడెను.

మన సైన్యము దేవసేనవలె సెట్టి యాయుధమువల్లనైన చావులేక యుండు''రని రహస్యము జెప్పుచు, వారి నాకాశసౌధముల ద్రిప్పుచొచ్చెను. చిత్తూరు వారితోపాటు వేలూరు వర్గమువారుకూడ వీటిని కొన్నింటిని విశ్వసించి నోరూర్చుకొనిరి. ఈ రహస్యము లెట్లో పెద్దల చెవులకు బ్రాకుచు వారిని దిగ్భ్రాంతియందు ముంచెను. కాని, హెడ్మాస్టరు రాఘవాచారి, హిస్టరీ ప్రొఫెసరు శివసుబ్రహ్మణ్యము, సర్వేపల్లి నరసింహము మొదలగు ప్రముఖులు బాలుర తల్లితండ్రులకు వాసిష్ఠ తత్త్వమును బోధపరచి, వారి బెంగ చల్లార్చిరి. కాని, చిత్తూరులో చదువు మానిన శ్రీనివాసశాస్త్రి, వేంకటరామశాస్త్రి, కృష్ణశాస్త్రియను ముగ్గురి విషయములో వారు దర్యాప్తుచేయగా, వీ ముగ్గురు వందేమాతర విప్లవోద్యమమునగూడ చేరి, యట్లు చేరిన మఱునాడే తమ విద్యలకు స్వస్తిజెప్పి, తమ తల్లితండ్రుల కా సంగతి తెలియకుండు విధమున మసలుచున్నట్లు విదితమయ్యెను. ఈ ముగ్గురిలో మొదటి యిద్దరు 'ఆర్ని' కాపురస్థుడైన సుందరపాండ్యుడను పెద్ద కంట్రాక్టరు కొడుకులు, మూడవవాడు సుందర పాండ్యుని యన్న కొడుకు.

వీరు విద్య మానినట్లు సుందరపాండ్యునకు క్రమముగా తెలిసి వారిని మరల బడికి పంపుటకు యత్నించగా, తన పుత్రులిరువురు పలాయనమయిరి. అన్నగారి కొడుకు వైరాగ్యము నటించి, 'అహం బ్రహ్మాస్మి', 'సర్వం ఖల్విదం బ్రహ'మను మహావాక్యముల నుచ్చరించుచు నడివీధిలో వాసనబద్ధుడయ్యెను. అది చూచి సుందరపాండ్యుడు ''నీవు బడికి పోనక్కరలేదు. లోనికి ర'మ్మని బ్రతిమాలగా నతడా వేషమును మాని యింటిలోనికి పోయెను. ఆ మఱునాడు మిగిలిన యిద్దరుకూడ యిల్లు చేరిరి. అటుపిమ్మటనే వారు వాసిష్ఠుని వేధించి, కార్యవర్గసభ్యులై, ప్రమాదకరమగు విప్లవమునుండి విరమించుకొనిరి. వీరు సాహసోపేతులు, విప్లవమును చిచ్చుబెట్టి చిత్తూరు వేలూరులను రెండింటిని దగ్ధముచేయగల సమర్థులని గ్రహించియే వాసిష్ఠు డుపాయముచే వీరిని వశపర్చుకొని రక్షించెను. అది గ్రహించక వాసిష్ఠుడు వీరి నింకను పాడుచేయుచుండెనని సుందరపాండ్యుడెంచి, వాసిష్ఠుడు తన వృత్తి నశ్రద్ధజేసి బాలురను చెరచుచున్నట్లతనిపై ఫిర్యాదుచేసెను. వేలూరు కళాశాలవంటి మిషనరీ కళాశాలలు కొన్నింటి కధికారియైన మిషనరీ దొరను చెన్నపురమం దితడు కలిసికొని ఫిర్యాదుచేయగా, దొర వీని మాటలు నమ్మి వేలూరు వచ్చి, వాసిష్ఠుని క్లాసులోనికి ప్రిన్సిపాలును వెంటనిడుకొని తనిఖీచేయుటకు వెళ్లెను. కాని, తెనుగిసుమంతయు తెలియనివాడై దొర వాసిష్ఠునితో నింగ్లీషున మాట్లాడుచు విద్యార్థుల కప్పుడు బోధించుచున్న పాఠముపై కొన్ని ప్రశ్నల నడుగుమనెను. తెనుగు రానివారి పద్ధతికి నెందులకు బూనెనో వాసిష్ఠుడు త్రుటిలో గ్రహించి, బాలురవైపు తిరిగి 'నే నడిగిన ప్రశ్న కొక్కొక్కదానికి తడుముకొనకుండ జవాబు చెప్పుచుండు'డని తొలుత హెచ్చరించిన

పిదప 'నీకు పప్పిష్టమా, పాలిష్టమా?', 'మీయింట నీదిన మేమి వంట' యను ప్రశ్నల నొక్కొక్కరిపై కురిపించెను. నవ్వుకొనకుండ బాలు రుత్తరక్షణమున జవాబులిచ్చుట చూచి దొరగారు వాసిష్ఠుని మెచ్చుకొని, సుందరపాండ్యుని ఫిర్యాదబద్ధమని వ్రాసి, తన వెంట నున్న ప్రిన్సిపాలుకిచ్చి వెళ్ళిపోయెను. అతడు వెళ్ళిన తరువాత ప్రిన్సిపాలు కడుపు చెక్కలగునట్లు నవ్వెను.

సుందరపాండ్యు డిది విని మఱింత కుపితుడయ్యెను. అతనికి తెలిసిన పెద్ద యింజనీరు దొర సహాయమున వెంటనే గవర్నరును దర్శించి, వాసిష్ఠుడు విద్యార్థుల సహాయమున పితూరీచేయ సిద్ధముగా నుండెనని ఫిర్యాదు చేసెను. అది విని గవర్నరు నవ్వుకొని 'రేపు నే నుదకమండలము వెళ్ళనున్నాను. నా స్థల మిక్కడ ఖాళీయగును కనుక కలము, పెన్సిలు అను నాయుధములుగల విద్యార్థి సేనతో వచ్చి నా స్థలము నాక్రమించుకొమ్మని నీవు పోయి వాసిష్ఠునితో చెప్పు'మని పరిహసించి వానిని బంపివేసెను. ఈ సంభాషణ మెట్లో వెల్లడియై, చెన్నపురమందును, వేలూరులోను కొన్నాళ్లవఱకు దొరల విచక్షణ కుదాహరణముగా చెప్పుకొనబడెను. చెన్నపురములోని రంగయ్యనాయుడను వైద్యుడీ సంభాషణము నింకొక విధముగా వ్యాఖ్యానమొనర్చి శాతంజేరి రామస్వామి అయ్యరుతో నిట్లు ముచ్చటించెను: "చూచితిరా! గవర్నరు వాసిష్ఠు నెట్లు పరిహసించెనో! బ్రాహ్మణులే రాజ్యము చేయవలెననెడి వాసిష్ఠుని పిచ్చి యాశయమునకు, మంత్రశక్తిపై భ్రమపెట్టుకొని కొద్దిమంది తుంటరి పిల్లకాయలతో పెద్ద కార్యములను సాధించుట కెగబడు వాసిష్ఠ యత్నమునకు గూడ గవర్నరు జవాబిచ్చినట్లయ్యెనుగదా ! వాసిష్ఠు డిట్టి యూహలలో జిక్కుకొని చెడిపోవుచున్నట్లు నాకు తోచుచున్నది. అయినా, ఈ భావములు నిజముగా వాసిష్ఠునివా లేక కల్పింపబడినవా యను సందేహమును నివారించుకొందము వచ్చెదరా?"

పై ప్రశ్నకు రామస్వామి అయ్యరు "మనము పోనక్కరలేదు. మా అప్పశాస్త్రి వేలూరునుండి నిన్ననే వచ్చెను. వాని నడిగి సందేహము తీర్చుకొనవచ్చు"నని చెప్పి, అప్పశాస్త్రిని పిలిచెను. అతడు బయటికి వచ్చి రంగయ్య వైద్యుని సందేహముల కిట్లు చమత్కారముగా బదులిచ్చెను: "పూర్వము రావణరాజ్యమును బడగొట్టుటకు రాముడు వానరులనే కదా సమకూర్చెను. ఇప్పుడు వాసిష్ఠుడు వానరులవంటి నరులను సమకూర్చెను. నీ వాస్తిక బుద్ధి గలవాడ వైతివేని దైవాంశము గలవారి కిట్టి కార్యము లసాధ్యములు కావని నమ్మగలవు. అల్పులను వారు గొప్పవారిగా చేయగలరు. క్రీస్తు ఏమి చేసెనో చూడుము. చేపలు పట్టు జాలరులనే కదా ముఖ్యశిష్యులుగా గైకొని యతడు మహత్తర కార్యము చేసి చూపెను. ఇప్పుడా జాలరులు నీ దృష్టిలో గొప్పవారు కాలేదా? పై దేశస్థుల మహిమను మీ రొప్పుకొందురు. కాని, మన దేశస్థుల విషయము వచ్చినప్పుడు మీ యాస్తికబుద్ధి

నశించి సందేహముల దోపజేయును. ఇదియు వింతయే. దీనికేమి కారణము ? బహుశః మన స్త్రీ లేనాడో చెడిన కారణముగా మన ఆర్యజాతిలో కొందఱు సంకరులు పుట్టి, సిసలైన ఆర్యఋషి ప్రజ్ఞలను శంకించుచుందురనుట పొరపాటు కాదేమో !'' రంగయ్యవైద్యుడు మాఱుపల్కజాలక వెళ్లిపోయెను. అప్పుశాస్త్రి బాలుడైనను గురునకు సరియగు వ్యాఖ్యాత యయ్యెనని రామస్వామి అయ్యరు సంతసించెను.

ఈ విధముగా కళాశాలవృత్తిని స్వీకరించి వాసిష్ఠుడు వేలూరులో నున్నంత కాలమేదో యొక యపవాదమునకు మాటిమాటికి గురియగుచు మనఃక్లేశమును బొందుచున్నను, నత డధైర్యముజెందక, తన యంతశ్శక్తి యొకవంక అభివృద్ధి జెందుచున్నందుకు సంతసింపజొచ్చెను. మఱియు రఘురామున కరణ్యవాసమువలెను, పాండవవీరుల కజ్ఞాతవాసమువలెను తన కీ వేలూరు వాసమును భగవంతు డొక లోకహిత కార్యమున కుపోద్ఘాతముగా కల్పించిన ట్లత డెంచి, తనయందు కల్కి పురుషావిష్కరణమునకు కారణమగు తపోవీర్యము నా భగవంతుడు వృద్ధిపఱచుచున్నట్లు పల్కుచుండువాడు. ఆ పల్కుల నాలకించి విద్యార్థి శిష్యులు తమ తమ భావవృత్తుల కనుగుణముగా వ్యాఖ్యానించు కొనువారు. కొందఱు వాసిష్ఠునియం దావేశరూపమున కల్కిపురుషు డవతరించుననియు, మఱికొందఱతని వీర్యమునుండి కల్కిపురుషుడు పుత్రుడుగా బుట్టుననియు భావింపజొచ్చిరి.

ఓం

ఆఱవ ప్రకరణము

# విచిత్ర ప్రేరణము, ఉద్యోగ విరమణము

క్రీ.శ. 1907వ సంవత్సరము ప్రారంభమైనప్పటి నుండి వాసిష్ఠున కుద్యోగముపై విసుగుపుట్ట నారంభించెను. మూడేళ్లనుండి యీ వృత్తి నిర్వర్తింప బడుచున్నను, ఆర్థికముగా వీసమెత్తైన కుటుంబమందు వృద్ధిలేదు సరికదా వృత్తికి పూర్వము లేని యలవాట్లు కొన్ని క్రొత్తవి సంక్రమించి క్లుప్తజీవనమును రూపుమాపెను. ఈ యలవాట్లు ముదిరినకొలది ధనార్జన మనివార్యముగాదోచి తపోవృత్తిపై కాంక్ష సడలుట తథ్యమనిపించెను. పైగా లోకహితకార్యమునకు ద్వారము గావచ్చుననుకొనిన ఈ వృత్తివలన అహిత, శత్రుత్వము లితరులకు తనయందు బుట్టుట తప్ప వేఱు ఫలము గోచరించలేదు. దైవకార్యమున కుపకరించుననుకొనిన సంఘమైన వృద్ధియగుట కా ప్రాంతమందు బ్రాహ్మణ్యము గొడ్డుపోయియుండెను. అట్టితరి విశాలాక్షమ్మ తృప్తికొఱకు, నిజజనకుని తృప్తికొఱకుమాత్ర మీ దాస్య వృత్తి కంకితముగావలెనని స్పష్టమై తన జీవితాశయ తృప్తి నింకొక జన్మకు విడువవలసిన గతి యేర్పడుచుండెను.

ఈ యభిప్రాయములను వాసిష్ఠుడు తన భార్య కెప్పటికప్పుడు చెప్పి వానప్రస్థజీవనమున కామెను ప్రోత్సహించుచుండెను. వేలూరు జీవిత మనారోగ్యము నకు కారణమై యామె కజీర్ణ లక్షణములు తరచు గోచరించుటబట్టి యక్కడి నివాసమున కామెయు విసుగుజెందియున్నను, తన గర్భమందు మహదంశగల పుత్రుడొకడు లోకకల్యాణముకొఱకు జన్మించునను నాశతో వానప్రస్థమున కింకను తొందరపడవలదని భర్తను బ్రతిమాలెను.

ఇట్లుండ 17-2-1907వ తేదీ నాటి రాత్రి మూడవజాము దాటిన పిదప వచ్చిన ఒక స్వప్నముచే వాసిష్ఠుని బుద్ధియందు సంఘసంబంధమగు వాంఛ తిరుగ చిగురుదొడగి యతని వేలూరుబంధమును పొడిగించెను.

ఉక్కకు తట్టుకొనలేక వాసిష్ఠుడా నా డింటి వెలుపల పరుండియుండెను. చెరియొకవైపున ఎ.ఆర్. దొరస్వామి, అప్పశాస్త్రులు పండుకొనిరి. స్వప్నమందు వాసిష్ఠుని పూర్వజన్మ తపస్సఖుడైన భద్రకు డగపడి వాసిష్ఠుని సంబోధించుచు నిట్లు మూడు వాక్యములను బల్కి మాయమయ్యెను: ''ఓయీ ! నా దేహయాత్ర ముగిసినది. నీవు స్వయముగా జాగరూకుడవై యుండుము. ఇటుపైని నీ తపస్సుతోగూడ సంఘము తీవ్రమై చలించును.''

స్వప్నమైన వెంటనే వాసిష్ఠుడు గగుర్పాటుతో తెలివి గాంచి, భద్రకుడింత కాలము సశరీరుడై సంఘమధ్యమందున్నట్లొక్కసారియైన యేల చెప్పలేదని కొంతతడవు విస్మయముజెంది, యతని వియోగమునకు దుఃఖించెను. పిదప చెంత పరుండిన శిష్యులిరువురను లేపి, వారికి వాసిష్ఠుడీ దుఃఖవార్తను, భద్రక సందేశమును దెల్పెను. అటుపిమ్మట తెల్లవారినతోడనే వాసిష్ఠుడు స్నానమాచరించి, చనిపోయిన బంధువుల కిచ్చునట్లు భద్రకునకు తర్పణము లిచ్చెను. మఱికొంతసేపటికి దొరస్వామి వార్తాపత్రికను చదువుచు వచ్చి, దివ్యజ్ఞాన సమాజాధ్యక్షుడైన 'కల్నల్ ఆల్కాట్* దొర పూర్వరాత్రి పరమపదించినట్లు తెలిపి, యతని బొమ్మను పత్రికనుండి చూపెను. ఆశ్చర్యము! 'అతడే భద్రకు'డని వాసిష్ఠుడా పత్రికనందుకొని, యందు క్లుప్తముగా వ్రాయబడిన ఆల్కాటుదొర చరిత్రమును చదివిన పిదప "చెన్నపురమందు నేనీ చిత్రపటము నెవరి యింటనైన చూచినచో తప్పక 'అడయారు' వెళ్లి నే నితనిని కలుసుకొని పెక్కు విషయములు, భవిష్యత్తులో నే జేయవలసిన కార్యమును గుఱించి, కాశిలో నా కగపడిన 'సుకేతు'డను దుర్గామందిరయోగిని గుఱించి చర్చించియుందును. ఇంతకు పూర్వజన్మ తపస్సఖులమై యుండియు మేమీ జన్మలో నొకరి నొకరు తెలియనట్లును, మా యుద్యమముల లక్ష్యములు వేఱైనట్లును మసలుట యీశ్వర నిర్ణయమై యుండవచ్చును. కల్కి పురుషావతరణము గుఱించి యతడేమి చెప్పియుండునో కదా! దానికొఱకు దివ్యజ్ఞాన సమాజము వారుకూడ సాధించదలచినట్లు వింటిని. అది నిజమైనచో భద్రకుడా యవతరణమునకు పూర్వమే తన శరీరము నేల విడిచెనో కదా!" అని తనలో తర్కించుకొనెను.

పిమ్మట శిష్యులచే నడుగబడి వాసిష్ఠుడొకనా డాల్కాటు వివేకానందులను గుఱించి యిట్లు సమీక్షించెను: "మన దేశమందు క్రియాద్వైతము పెరిగి భావమం దాంతర్యమున నుండవలసిన నద్వైత మతదృష్టిని పరిహాసముపాలు చేసెను. పశ్చిమ దేశమున క్రీస్తు బోధించిన ప్రేమతత్త్వమట్లే సోదరమానవుల కన్యోన్య ముండవలసిన ప్రవృత్తికి జెందినను, కాలవశమున కామ్యపరమై స్త్రీ పురుషులను మృగతుల్యులుగా జేసెను. స్వీయ మత ధర్మమును శ్రద్ధగా పాటింపగోరిన మహ్మదు వాక్యము

---

*ఈ యాల్కాటుదొర 1832 సం॥లో అమెరికా దేశమందు జన్మించి, సూక్ష్మశరీరులగు దివ్యపురుషులతో సంప్రతించు మానసిక శక్తుల నలవరచుకొని, యట్టి యొకానొక దివ్యపురుష ప్రేరణమును బొంది, 1878సం॥లో తన మిత్రురాలైన 'బ్లావట్స్కీ' దొరసానితో కలసి భారతదేశము వచ్చి, చెన్నపుర ప్రాంతముననున్న అడయారును కేంద్రముగా జేసి దివ్యజ్ఞాన సమాజమును స్థాపించి, దాని కధ్యక్షుడయ్యెను. ఈ సమాజముద్వారా మానవదృష్టిని బాహ్యకామ్యముల నుండి తొలగించి యంతర్ముఖ మొనర్చుటకు కడు పాటుపడెను. క్రైస్తవ మహమ్మదీయులలో కర్మ - జన్మ సూత్రమును క్రొత్తగా బోధించి, వారికి హైందవ మతోత్కృష్టతను పరిచయముచేసెను.

రాను రాను తురకలం దన్యమత ద్వేషమునకు దారితీసెను. వివేకానందుడు సంఘీభావమును పెంపొందించుకొనిన అమెరికా దేశస్థుల కాధ్యాత్మప్రబోధము గలిగించుట కిక్కడ నుండి వెళ్లగా, సంఘీభావము శూన్యమైన మన దేశమందా భావమును నెలకొల్పుట కమెరికానుండి అల్కాటు వేషధారియైన భద్రకు డిక్కడకు వచ్చెను. ఇంక మధ్యనున్న తురకల మతద్వేషమును నశింపజేయుట కొకడు పుట్టవలెను. అనేక యుద్ధములకు దారితీసిన యీ మధ్యప్రాచ్యమదము ప్రపంచము నంతను సంకరముచేసెను. కనుక ప్రపంచమందు పరివ్యాప్తమైన యీ యుద్ధమదము తన జన్మస్థలమైన మధ్యప్రాచ్యమం దంతరించువఱకు ప్రపంచమునకు క్షేమముండదు. దాని నక్కడకు బోనీకుండ దుష్టశక్తులు పనిచేసి యితర దేశములందు చిచ్చు ముట్టించి చల్లారకుండ యత్నించవచ్చును. ఆ చిచ్చును మధ్యప్రాచ్యమునకు నెట్టుటకు మానవాతీతమైన దివ్యాస్త్రశక్తిని బొందిన మహాపురుషునకే సాధ్యమగునని నా నమ్మిక. అట్టి పురుషుడే కల్కిపురుషుడుగా కీర్తింపబడును గనుక ప్రస్తుత మవతరించియున్న మహాపురుషులలో నెవనియం దీశ్వరు డీ దివ్యాస్త్రశక్తి ప్రబోధమునిచ్చునో వానియందు కల్కిపురుషాంశ యవతరించిన ట్లెంచదగును. ఇది యొక్కనియందు రావచ్చును లేదా పెక్కుమందియందు రావచ్చును. 'కలి' యనగా కలహము కనుక కల్కి కార్యమైనతోడనే ప్రపంచమందు శాంతిని వెదజల్లు భద్రాంశయు నవతరించక తప్పదు. ఈ రెండింటిని కల్పించుటకు సమర్థుడైన యీశ్వరు డందువలన లోకసంస్కార కార్యదృష్ట్యా వీరభద్రుడనబడుచున్నాడు. కనుక మన కతని యనుగ్రహము ముఖ్యకర్తవ్యమని యెఱుగుడు. కుమార గణపతు లతని యంశాద్వయముకదా! కాని, గణపతికి యింకను సోదరుడు కానవచ్చుట లేదు.''

ఆవేశపూరితములగు నిట్టి వాక్యములు వాసిష్ఠ గణపతి ముఖమునుండి వెడలినపుడు శిష్యుల వీనుల కుత్సవమగుచు వారి నుద్రేకపఱచుచుండెడివి. అప్పుడు శివరామశాస్త్రి భార్యాసహితుడై వేలూరు వచ్చియుండెను. ఇతడు తండ్రి నరసింహశాస్త్రి ముదముకొఱకై వార్తలను లేఖలమూలమున నందజేయుచుండెను. నరసింహశాస్త్రి వాటి నందుకొని పుత్రునియం దభివృద్ధియగుచున్న తేజస్సును చూడగోరి వాసిష్ఠు నొకమరి కలువఱాయి రమ్మని వ్రాయదొడగెను. అతడు నేత్రరోగముచే మఱల బాధపడుచున్నట్లును విని వాసిష్ఠుడు తండ్రిని జూచివచ్చుట కేప్రిల్ నెలలో శివరామదంపతుల నింటియొద్ద విడచి భార్యాసహితుడై పయనమయ్యెను. కొడుకును, కోడలిని చూచి నరసింహశాస్త్రి మిగుల సంతోషించి, పుత్రుని తేజస్సున కచ్చెరువొందెను. అప్పుడతనికి పుత్రునితోగూడి కాశీప్రయాగలు దర్శించవలెనని బుద్ధిపుట్టగా, తండ్రి కోర్కె చెల్లించుట కతనిని తీసికొని వాసిష్ఠుడు తొలుత ప్రయాగ వెళ్లి, యక్కడ తండ్రికి శుద్ధగంగలో తృప్తిదీర స్నానము చేయించుసరి కతని నేత్రరోగ

మాశ్చర్యకరముగా నుపశమించెను. అది పుత్రుని మహిమగా నరసింహశాస్త్రి భావించి మిగిలిన యాత్రను సుఖముగా ముగించుకొని స్వగ్రామము చేరెను. వారు స్వగ్రామము చేరిన మఱునాడే వేలూరులో మహాదేవునకు మశూచి శోకినట్లుత్తరము రాగా విశాలాక్షి గణపతులు నరసింహశాస్త్రికడ సెలవుగైకొని వెంటనే వేలూరు వచ్చి చేరిరి.

తలిదండ్రులను జూచి మహాదేవము కంటికి ధారపెట్టగా వాసిష్ఠుని హృదయము వాని దీనావస్థకు ద్రవించెను. ద్రవించిన ఆ హృదయమునుండి బాలుని బాధను తుడిచివేయు శ్లోకములు కొన్ని యుగ్రమారీచి నాహ్వానించు నవియై వెడలగా, వాని పటుతరమునకు వాసిష్ఠుడే యాశ్చర్యమున మునిగెను. అంతేగాక, దేవత యా శ్లోకములకు మెచ్చి యనుగ్రహించినట్లు మఱునాటి కొక్క కుండయైన మహాదేవుని శరీరముపై మిగులకుండ మాయమయ్యెను. అత్యంత ప్రభావవంతములైన యీ శ్లోకములను వాసిష్ఠుడొక కాగితముపై వ్రాసియుంచెను. కాని, దురదృష్టవశమున కొన్నాళ్ల కా కాగిత మెచ్చటనో జారిపోయెను.

అటుపిమ్మట భాద్రపద మాసము ప్రవేశించుసరికి విశాలాక్షమ్మకు నెల తప్పినట్లయ్యెను. ఆ కారణముచేత గణపతి నవరాత్రముల నామె శ్రద్ధతో చేసి, యామె కోర్కె సిద్ధించుట కాశ్వయుజ మాసములో వచ్చు దేవీపూజలనుగూడ శ్రద్ధగా చేయవలెనని సంకల్పించియుండగా నామె కొక యోచన గాఢమయ్యెను. ఆ దేవీపూజాదినములలో వేలూరుకు సమీపముననున్న పడైవీడను రేణుకాక్షేత్రములో గొప్ప యుత్సవములు జరుపబడి, పెక్కుమందిచే దర్శింపబడుట జ్ఞప్తికి వచ్చి యామె భర్త నిట్లడిగెను: ''మన మింతకాలము వేలూరులో నుంటిమికాని పడైవీడు దర్శించలేదు. ఈసారి యుత్సవ దినములలో మనమొక్కసారి వెళ్లి రేణుకను దర్శించి రావలెనని నాకు గాఢముగానున్నది. ఆమె ప్రసిద్ధమైన దేవతయందురు. కనుక మనమామె యనుగ్రహమును బొందక తప్పదు.''

విశాలాక్షమ్మ కోర్కెచొప్పున దసరా యుత్సవములలో వాసిష్ఠ కుటుంబ మంతయు రేణుకను దర్శించుకొని వచ్చెను. నాటినుండి వాసిష్ఠునకు తపస్సుపై నిచ్ఛ మఱల గాఢము కాజొచ్చెను. ఒకనాడు కళాశాలలో 'థామస్ హారిస్' అను హెడ్మాస్టరుతో వాసిష్ఠునకు చిన్న సంవాదము తటస్థించెను. సంవాదధోరణిలో ''సంసారమును విడిచి తపస్సు చేయువారు పూర్వముండిరేమోకాని యిప్పుడు బికారి సన్న్యాసులుగాక వానప్రస్థమును బూని శ్రద్ధతో తపము సల్పువారులే'రని హారిసదొర యనుసరికి 'నేను చేసి చూపెద'నని వాసిష్ఠుడు బదులుపల్కి, వెంటనే తపస్సు కొఱకై తన యుద్యోగమునకు రాజీనామా పత్రము నిచ్చెను.

హారిసదొర విభ్రాంతపోయి వాసిష్ఠునా పత్ర ముపసంహరించుకొనుటకు బ్రతిమాలెను. కాని, వాసిష్ఠుడు తన మాటకు తిరుగులేదని పల్కి 'మన సంవాద

మీ దినమున కాకతాళీయమైనను, నాయందీ సంకల్పము చాలకాలము నుండి యున్నది. కనుక నీవలన నా సంసారమునకు ముప్పు వచ్చినట్లు నీవు బాధపడకు' మని యతనిని శాంతింపజేసెను. ఏదవ ప్రిన్సిపాలు చెప్పినను వాసిష్ఠుడు మెత్తబడక తనకు రావలసిన జీతము నానాడే తీసికొని మిత్రుల యభినందనలతో గృహమునకు మఱలి, యా మఱునాటి రాత్రియే వేలూరు విడచి తిరువణ్ణామలై చేరెను. ఆనా డాశ్వయుజ బహుళ త్రయోదశి, ఆదివారము, 3-11-1907 తేదీయై యుండెను.

# IV. తపస్స్వరూప తత్త్వావతార ఖండము

-:అధ్యాయములు:-

1. శ్యామలాంబ కృపచే దివ్యార్థతను బొందుట
2. ఈశ్వరుని పిలుపు
3. ఈశ్వర రథము కదలి వాసిష్ఠ మనోరథము నీడేర్చుట
4. సిద్ధోపదేశము, ప్రసిద్ధ నామకరణములు
5. ఉమాసహస్రస్తుతి రచనము
6. ఉమాస్తుతి ఫలముగా కార్తికేయావతారము

ఓం

మొదటి ప్రకరణము

# శ్యామలాంబ కృపచే దివ్యార్హతను బొందుట

వాసిష్ఠుడు 3-11-1907వతేదీ ఆదివారమునాటి రాత్రి వేలూరు విడిచి, తెల్లవారకపూర్వమే తిరువణ్ణామలై చేరెను. వెంటనే వాసుదేవశాస్త్రియను నొక పూర్వశిష్యుని యింటికి వెళ్ళి స్నానాద్యనుష్ఠానములను దీర్చుకొనిన పిదప క్షేత్రాలయములోనికి బోయి శక్తీశ్వరులను దర్శించుకొని, విన్నవించుకొనవలసినది విన్నవించుకొనెను. ఈశ్వరుని యెదుట నిలబడి యతని కృప నర్థించునప్పుడు "తండ్రీ! నాయందు హఠాత్తుగా ప్రేరణము కల్పించి, తపఃప్రబోధమునిచ్చి, కృత్తికోత్సవములు సమీపించు సమయమునకు నన్నిటకు రావించితివి. కనుక నాకీ యుత్సవములు సార్థకమగున ట్లనుగ్రహింప వేడెద"నని ప్రార్థించెను. అయిదేళ్లకు పూర్వమిట్లే వాసిష్ఠుడు కృత్తికోత్సవ సమయమున కధ్యాపకవృత్తిచే క్షేత్రమం దావాసము బొంది యనుగ్రహింపబడిన విషయము పాఠకులు స్మరింతురుగాక.

అటుపిదప వాసుదేవశాస్త్రికి తా నుద్యోగము వీడి తపోవృత్తి బూనుటకు వచ్చినట్లు వాసిష్ఠుడు తెలియజెప్పి, వాని నేదైన తపస్థలము వెంటనే చూపగోరెను. ఈ వాసుదేవశాస్త్రి యక్కడి సంస్కృత పాఠశాలలో చదివి యక్కడనే యధ్యాపకుడై యుండెను. అత డాచార్యుని పూనిక కాశ్చర్యపడి, యానాడు నరకచతుర్దశి పండుగ దినమైనందున గురు నా పూట కాపి పిండివంటలతో నాతిథ్యమీయబోయెను. కాని, గురుడట్టి వేడుకలను త్రోసిపుచ్చి, తపస్థలమునకు తొందర చేయగా నతడు కొంచెమునే పాలోచించి, యతనికి స్ఫురించిన మరకత శ్యామాంబికాలయమును బేర్కొని, యీశాన్య దిక్కునగల యీ కోవెలకు గురుని తీసికొనివెళ్లెను. అక్కడ వాసిష్ఠు డా దేవిని దర్శించుకొనిన పిమ్మట నొక శుచియగు స్థలము నిర్మించుకొని, వాసుదేవశాస్త్రి కిట్లు చెప్పెను: "నేను వచ్చి యిక్కడ నున్నట్లు వెల్లడిచేసి నా తపస్సునకు భంగము కలిగింపకుము. నీ వొక్కడవు నీ యవకాశముకొలది ప్రాతస్సాయంసమయములందు వచ్చి నా యవసరము లరయుచుండుము. నేను పగళ్లుపవాసముండి, సాయంకాలములందు పాలను మాత్రము గైకొనదలచితిని. నా కవి నీతో తెచ్చిపెట్టగోరుదును." వాసుదేవశాస్త్రి 'సరే' యని పల్కి గురునికడ సెలవు గైకొని పోయెను.

మరకతమనగా 'పచ్చ' యనబడు విలువైన రాయి. ఇది శ్యామలవర్ణమునకు బ్రసిద్ధి. త్రిభువనరాణియై ధవళచ్ఛాయ గలిగిన లలితాదేవికి మంత్రిణియను దేవతను శ్యామలవర్ణము గలదిగా పండితులు స్తుతించిరి; కనుక 'మరకతశ్యామల'

యని సంస్కృతమందును, 'పచ్చైయమ్మన్' యని తమిళమందును పేరుగాంచి పురబాహ్యమందున్న యీ కోవెల నధిష్ఠించిన దేవతాశక్తి క్షేత్రాధిష్ఠానదేవికి మంత్రిణియగుటకు వాసిష్ఠు డెంతయు సంతసించి, యీమె కృప లేనిదే క్షేత్రదేవత ప్రసన్నురాలగుట కష్టమని తలచెను. మఱియు 'లలితాసహస్ర'మను స్తోత్రమందు 'మంత్రిణ్యంబా విరచిత విషంగవధ తోషితా' యని యీమె యనుగ్రహతత్త్వము వర్ణింపబడినందున వాసిష్ఠుడు తనకిన్నాళ్ళ నుండి సంసారమందు సంక్రమించిన దోషముల నిక్కర నివారించుకొని పవిత్రుడగుట తొలి కర్తవ్యముగా నెంచి, యట్టి యనుగ్రహముకొఱకు దినమంతయు నామెను ధ్యానించెను. సాయంత్రము శిష్యుడు తెచ్చిన పాల నారగించిన పిదప మఱల ధ్యాననిష్ఠుడై యుండగా రాత్రి పదిగంటల వేళకు వింతగొల్పు ననుభవ మొకటి జాగ్రదవస్థయందే సంభవించి, యతనికి దైవప్రసాదార్హతను చేకూర్చెను.

అది యెట్లు సంభవించెననగా, గర్భాలయమునుండి మధురతమమగు నృత్యశబ్దమొకటి తొలుత వినవచ్చెను. పవ్వళింపుసేవ కీశ్వరుడు క్షేత్రాలయమందేగువేళ యది. అందువలన ప్రభు వినోదము కొఱకిక్కర శ్యామలాంబ నృత్యము సల్పుచున్నట్లు వాసిష్ఠుడెంచి, యా నృత్యశబ్దమునందే దృష్టినుంచి, ప్రణవనాదమును వినినట్లు సంతసించెను. కొద్ది క్షణముల కా శబ్దమంతర్భాగము నుండి యీవలకు వచ్చుచున్నట్లయ్యెను. అప్పుడు దేవి తన్ననుగ్రహించుటకు వచ్చుచున్నదని వాసిష్ఠుడు భావించి కోవెల ముఖద్వారముపైపు దృష్టి సారించెను. ఇంతలో నక్కర వందలకొలది శివగణము లీనినట్లు వెలసి యున్మత్తులవలెను, కల్లుత్రాగిన వారివలెను వికటాట్టహాసములతో నృత్యము సల్పజొచ్చిరి. వారు తమ వికృతరూపములకు తగినట్లు వికృత శబ్దముల నధికముగా కల్పించి యనిష్టమును గూర్చిరి. మఱికొద్ది క్షణములలో వారు తమ హస్తములందున్న నానావిధ వాద్యములతో రణగొణధ్వనులను సల్పుచు ముట్టడించుటకనినట్లు వాసిష్ఠుని పరివేష్టింప సాహసించిరి. గణపతియైనను, నరవేషమున నున్నందున వారిట్టి సాహసమునకు బూనియుందురు. వారు సమీపించుకొలది వాసిష్ఠుని చిత్తము తీవ్రమై, దుర్గయం దావేశోద్రేకమును బొందజొచ్చెను. క్షమింప నలవిగాని స్థితిని వారు కల్పించుసరికి వాసిష్ఠు డొక శ్లోకముచే దుర్గ నాహ్వానించి శరణువేడగా గణములన్నియు నుత్తరక్షణమున పటాపంచలై మాయమయ్యెను ఆ శ్లోక మిట్లుండెను:-

శ్లో॥ ''ఉక్షరాజ వాహనస్య జీవితా ధ్గరియసీ!
పక్షిరాజ వాహనాది వర్ణ్యమానవైభవా!
కేకిలోక చక్రవర్తి వాహనేన పుత్రిణీ!
వారణారి సార్వభౌమ వాహనా గతిర్మమ॥'

(అర్థము:- వృషభములలోకెల్ల మేటివృషభమును వాహనముగా గొనిన యీశ్వరునకు ప్రాణముకంటె ప్రియతరమైన దే శక్తియో, పక్షిరాజైన గరుడుని వాహనముగా గొనిన విష్ణువుచేతను, తదితర దేవతలచేతను స్తుతింపబడు వైభవముగల దే శక్తియో, నెమళ్లలో చక్రవర్తి నెమలిని వాహనముగా గొనిన కుమారస్వామి నే దేవతాశక్తి పుత్రునిగా బడసెనో, యేనుగులకు శత్రువులైన సింహములలో సార్వభౌమ సింహమును స్వయముగా వాహనము జేసికొనిన దే శక్తియో అట్టి దుర్గయను దేవతాశక్తి నాకు గతియగుగాక.) వృషభ మజ్ఞానమునకు, గరుడుడు ఆకాశమున కెగయు మనస్సునకు, నెమలి మేఘమనెడి తపస్సుకొఱకు నాట్యమాడు మోహబుద్ధికి, సింహము శీర్ష మదమును హరించు ప్రాణమునకు సాంకేతికములు కావచ్చును.

దేవియొక్క శీఘ్రానుగ్రహమునకు వాసిష్ఠు డామెకు చిత్తమందే నమస్కృతు లర్పించెను. అటుపిమ్మట జన్మతో సహా సహజ తపోవైభవమువలె వచ్చి, దేవతాహృదయముల నిట్టె తాకగల్గు వాక్సంబంధమగు మహిమ తన్ను రక్షించి, తన కష్టమైన విధమును దలపోసికొని యత డిట్లాలోచించెను: ''ఈనాడు నా కగపడినవి శివగణములనుకొంటిని. కాని, యవి దేవియొక్క మధుర నాట్యస్ఫూర్తిని కప్పి లోకమం దిష్టా దనిష్టదాయకములై యున్న దుష్టశక్తి గణములుగా దోచుచున్నవి. వాటిని సమయింపజేయు శక్త్యవతరణము నాహ్వానించు కార్యము భగవంతుడు నాకీ జీవితమం దొసగినట్లు సూచించి నాకు సలహా పల్కుట కీ నాటి దృశ్యము శ్యామలాంబచే కల్పింపబడియుండవచ్చును. అది నిజమైనచో నీమొవలె నేనును మంత్రిపాత్ర వహించి రాబోవు అవతారపురుషునకు తోడ్పడెదను. రామునందు వసిష్ఠునివలెను, కుమారస్వామి యాధిపత్యమున నడచు దేవసేవలకు గురువువలెను, లోకమందు జరుగవలసిన మంగళ కార్యములకు పూర్వము విఘ్నములను నివారించు గణపతి వలెను నే నుండి వాసిష్ఠ గణపతి నామమును, ఆచార్య బిరుదమును సార్థకమొనర్చుకొనుటకు నా చిత్తము ప్రేరేపించుచున్నది. రానున్నవి కృత్తికోత్సవములు. కనుక కార్తికేయావతరణము నీశ్వరు డనుగ్రహించుట సమయానుకూలమగును. అప్పుడు లోకహిత కార్య మతడే చేయును. అతనివలన నే నాశించు తపోవిధాన స్వరూపమును, అస్త్రవిద్యనుగూడ బడసి నేనవి లోకమున కుపదేశించి నా లోక గురుపదమును నిలబెట్టుకొందును. అంతేగాక, కార్యభారము నతడు వహించినప్పుడు నే నభిలషించు వేదోద్ధరణమునకు గూడ నా కవకాశము దక్కును.''

ఇట్లనుకొనుచుండగా వాసిష్ఠుని చిత్తము సంతోషమున నుప్పొంగి, గర్భాలయమందు శ్యామలాంబ సల్పిన నృత్యమాధుర్యము స్ఫురణకు వచ్చెను. దానిని పరిపోల్చి తన చిత్తస్థితిని, తత్త్వమును పరికించుకొనుటకు బుద్ధియందు వెంటనే ప్రేరణమయ్యెను. త్రివిధములగు నాకాశతత్త్వముతో నిర్మింపబడిన మానవశరీరమందు సుషుమ్నా నాడికి వెనుక భాగమున బ్రహ్మరంధ్రమునుండి

మూలాధార పర్యంతము వ్యాపించిన యాకాశము కేవలమై, సుషుమ్నకు ముందు భాగమున త్రైవిధ్యమగుచున్న అకాశభాగమున కాశ్రయమై యొప్పుచున్నందున రెండు భాగములకు సంధిసంధానమగునది సుషుమ్నాంతర్గత కృత్తికాశక్త్యంశ యనియు, నామెవలన కేవలాకాశరూపమునుండి సూక్ష్మాణుభూతములుగా విభాగమై పుట్టిన 'తైజస-అప్-అన్న' మను త్రివిధాకాశరూపములను పూర్వకవు లీశ్వరపుత్రులుగా పరిగణించి వారి వారి తత్త్వముల నెఱిగించు కథలను లాక్షణిక భాషలో కూర్చి, వారి వారి వాహనములనుకూడ నట్లే పేర్కొనియుందురనియు వాసిష్ఠుని బుద్ధికి తట్టెను. అణుమయమైన అకాశభాగములో అణువు లన్నియు నాకాశముయొక్క సూక్ష్మ రజస్సంబంధములై పరిణామము ననుసరించి యెడ మగుచు, సాంద్రతయందు వ్యత్యాసమునొంది వ్యాపించినట్లు భావింపబడును. అందువలన స్థూల, సూక్ష్మ కారణ శరీరములవలె నొకదానియం దింకొకటి వ్యాపించి, విశ్వకార్యమందు పరస్పర సంబంధములుగల కోశత్రయమై కేవలాకాశరూప బ్రహ్మకు సగుణశరీరముగా నొప్పుచున్నవి. విజ్ఞానమయకోశము వలె నున్న అకాశ మణుమయమైనను, అణువిభాగ మలవిగాకున్నందున భేదదృష్టి యెట్లు పొరముటలేదో, అట్లే దానియందు ఘర్షణతాపమున కవకాశ మిచ్చు నణుజననముకూడ తోచదు. అందువలన వ్యాపకత్వముచే వృద్ధి, సంకుచితత్వముచే క్షయము-రెండును లేని యీ అకాశ రూపమును నిత్యకౌమారము గల్గిన కుమారస్వామిగా పేర్కొనియుందురని వాసిష్ఠుడు నిర్ణయించుకొనెను. ఇది యవ్యణు సంబంధమైన చిత్తమునుండి నివృత్తిపరముగా చెప్పబడిన చిత్తగుహాకాశము. దీనిచే పొందబడిన ప్రాణరస సంబంధమైన చిత్త మణుభూతమును, దానిచే శిరస్సున ప్రవృత్తిమార్గముచే పొందబడు మనస్సంబంధమైన అన్నమణుభూతమును పూర్వకవు లూహించినప్పుడా ప్రవృద్ధమందు చిత్తమునకు గల్గు జీవలక్షణమును, తిరుగ నివృత్తమందు ప్రాప్తించు దేవతాలక్షణము నూహించిరని వాసిష్ఠ డటుపిదప నిశ్చయించి, తత్సంబంధమగు గణపతి కథ నన్వయించుకొనెను. ఈ యన్వయమందు జీవలక్షణమును బొందిన చిత్తము నరరూపతనువై వ్యష్టి దేహమును బొందినట్లును, దేవతాలక్షణమును బొందిన చిత్తము దేవతాతనువై సమష్టిని సూచించు మహాకాయమును బొందినట్లును గణపతి కథ యర్థమయ్యెను. తదనుగుణముగా నన్నమాణుభూతమగు విషయగత శిరస్సు జగత్పరమైనదగును. అందుండి నివృత్తిచే నిర్విషయమై సహస్రారమందు పొందబడు చంద్రకళా శిరస్సు తిరుగబడిన 'జగ' పదముచే నేర్పడు 'గజ' శిరస్సగును. సహస్రారమునుండి చిత్తగుహ వింకను దీర్ఘ నివృత్తిచే పొందు బుద్ధిరశ్మియే తుండమని వాసిష్ఠుడు సరిపోల్చెను.

అటుపిమ్మట వాసిష్ఠుడు గణపతి కథ కించుమించుగా సరిపోయిన దక్షకథను కూడ స్మరించుకొని యన్వయించుచుండగా భాష్యకర్తల

కన్వయముగాని శ్రుతివాక్య మొకటి స్ఫురణకు వచ్చెను. "అదితే ర్దక్షో జాతః దక్షాద్వదితిః జాతేతి" అను నీ శ్రుతివాక్యము దక్షుడదితివలన, నదితి దక్షునివలన పుట్టినట్లు వచించుచున్నందున లక్షణార్థమీ వాక్యమం దాభాసయైనట్లు భాష్యకర్త లెంచిరి. వాసిష్ఠుడీ వాక్యము నాలోచించుచుండగా దివ్యప్రబోధమును బొందినట్లు బుద్ధి తీక్ష్ణత జెందెను. అప్పుడత డా వాక్యమునిట్లు సమన్వయించి లక్షణార్థమును కాపాడెను. "అదితి యనగా పరమాకాశమువలె ఖండీభూతముగాని శక్తి. ఆకాశము కంటె సూక్ష్మమైన యీ శక్తివలననే ఆకాశలక్షణ మీశ్వర సచ్చిదానంద స్వరూపమునుండి యుద్గారమైనందున ఆకాశ లక్షణమగు దక్షునకామె తల్లియగును. దక్షాఖ్య ఆకాశమంతటను వ్యాపించి తన రజస్సును జగత్సృష్టికొఱకు చిమ్మ నుంకించుటయే యతడు తలపెట్టిన యాగము. ఈ యాగమందతడా రజస్సు నీశ్వరుని వంకకు పంచిపెట్టకుండుట హవిస్సు నీశ్వరునకీయని దోషము. దక్షుని ముఖము జగత్పరమగుట యీశ్వరుని విస్మరించుటయే గదా! ఆ ముఖమే ప్రవృద్ధ గతిచే అణుత్వమగుటకు వ్యాపించిన భాగము. అది ఖండింపబడి, పుట్టుకలేని 'అజ' ముఖ మతని కొసగబడుటవలన నతడు బ్రహ్మయై కేవలాకాశరూపుడయ్యెను. ఆ యాకాశమున కంతర్గతమున నఖండ శక్తియైయున్న సచ్చిదానంద స్వరూపిణిని బొందు ముఖమే అజుని ముఖము. ఆకాశగర్భమందున్న యీ శక్తి బాహ్యదృష్టి గలవారి కగపడక యంతర్దృష్టిచే నామె యనుగ్రహమును బొందినవారికి మాత్రమే గోచరించును. అట్టివారి కాకాశగర్భమునుండి యుత్పన్నమైన దానివలె గోచరించుట బట్టి యామె యాకాశ సుతగా పరగణింపబడెను. ఈ విధముగా దక్షుని తల్లియైన యదితియే దక్షుని కుమార్తెయగుట భావించినచో శ్రుతి వాక్యములోని లక్షణార్థ మబాధిత మగును.

అప్పటికి రాత్రిభాగము చాల యతిక్రమించుట వాసిష్ఠుడు గుర్తించి విశ్రమింపగోరి, తన బుద్ధియం దానాడు శక్త్యనుగ్రహ ప్రసాదముగా బొందిన దివ్యస్ఫూర్తులను జ్ఞప్తియందుంచుకొని, యవిద్యాది తమస్సుల నండపిండములందు భేదించి యాత్మసంధానముచే నూత్నజన్మలను బ్రసాదించు కృత్తికాతత్త్వమానాడు విశదమైనందుల కతడామెకు హృదయపూర్వక నమస్కృతుల నర్పించుచు గిరివైపు తిరిగి సాష్టాంగపడెను. ఆమెయే యక్కడ పర్వతరూపిణియై యున్నందున కార్తికేయ జననమును శీఘ్రముగా లోకసంస్కారముకొఱ కనుగ్రహింప వేడెను. ఆ యవతరణ మెవరి యందైనదో తెలియ కష్టము లేకుండ వాసిష్ఠుడదియు నామెనే స్ఫురింపజేయ ప్రార్థించిన పిదప నతడు శయనించెను.

మఱునా డుదయమున వాసిష్ఠుడు లేచి స్నానమాచరించుచుండగా గత రాత్రి వికృతములను కల్పించిన దేవి యొక్క నృత్యనాదము వికృతనాదముల

మధ్య వినబడకున్నను, వాటి కదియే నాదాత్మకమై యున్నట్లు జ్ఞప్తి వచ్చెను. దీని నాదర్శముగా గొని యతడు తన తపస్సాధనమును సవరించుకొనదలచి లక్ష్యభేదముచే మంత్రజపాక్షర శబ్దముల కాంతర్యమున శ్రుతియైయొప్పు ప్రణవ నాదమును సాధింప సమకట్టెను. ప్రకృతి, పరదేవత యగు ప్రణవ స్వరూపిణియొక్క యనుగ్రహమే గణపతి నామధేయుడైన తనకు సర్వార్థసిద్ధి యగునని నిశ్చయించెను. ఇట్టి సాధనకు నిశ్శబ్ద వాతావరణ మవసరము. కాని, మరకతాంబ కోవెల యొద్ద పసులకాపరులు పగలంతయు చేసిన యాగడములను తలచుకొనినప్పుడు తన తపస్స్థలమును కొండకింకొక దిక్కున నున్న నైరృతి లింగస్థలమునకు మార్చుట యుక్తమని నిశ్చయించుకొనెను. అందువలన తన యీ నిశ్చయమును మరకతాంబకు నివేదించుకొని యామె సాన్నిధ్యమును వీడుటకు మన్నింప వేడెను. అటుపిదప వాసుదేవశాస్త్రి వచ్చిన తోడనే యతని సహాయమున వాసిష్ఠుడు నూత్నస్థలము నధిష్ఠించి గాఢమగు సాధనచే దినములను నిముసములవలె వెళ్లబుచ్చదొడగెను.

ఓం

## రెండవ ప్రకరణము

# ఈశ్వరుని పిలుపు

మరకత శ్యామలాంబయొక్క కృపచే దివ్యప్రసాదమును బడయుటకు పరీక్షబొంది, యర్హత గడించినవానివలె వాసిష్ఠుడెంచి నైర్భతి లింగస్థానము నధిష్ఠించి గాఢధ్యానమున మునిగిన ట్లిదివఱకు చెప్పబడెను. లోకమం దీశ్వరాంశావతరణము నపేక్షించుచు, తత్సాధనార్థ మతడు బూనిన కృషి విచిత్రమై, తన యంతర్గుహయందు ప్రజ్ఞావతరణమే బాహ్యమందు దివ్యపురుషావేశావతరణమును సూచించునను విశ్వాసముతో గూడి యుండెను. వారము దినము లిట్టి సాధనమున గడపుసరికి క్షేత్రాలయమందు కృత్తికోత్సవ దినములు ప్రారంభమైన సూచనలను ధ్వజారోహణ కోలాహలధ్వనులచే వాసిష్ఠుడు గ్రహించెను. ఆనాడు కార్తిక శుద్ధ సప్తమి. 11-11-1907వ తేదీ.

ఈ యుత్సవములు బ్రహ్మోత్సవములనియు పిలువబడుచున్నందున లోక సృష్టియైన పిదప సగుణ విశ్వావతరణము కొఱకు లోకనామకమైన ఆకాశశరీరమును సగుణ లక్షణముచే బ్రహ్మ పొందిన విషయమును స్మరింపజేయుట కీ యుత్సవము లుద్దేశింపబడినట్లగును. విశ్వరూపమున కాకాశమే తల్లియు, తండ్రియు నగుచున్నది. అందువలన నవమాసములు గర్భస్థపిండము మోయబడి పదియవ మాసమున జననము వ్యక్తమగు నాచారము ననుసరించి యీ యుత్సవములు పది దినములు జరుపబడును. ప్రతి సంవత్సరము కార్తిక మాసములో కృత్తికా నక్షత్ర మేనాడు వచ్చునో, ఆనాడు పదియవ దినమగునట్లీ యుత్సవములు ప్రారంభింపబడి, పదియవనాడు కొండమీద కల్పింపబడు బ్రహ్మాండజ్యోతిరావిష్కరణముతో జ్యోతిస్స్వరూపుడైన అరుణాచలేశ్వరుని యవతారఘట్టము పూర్తిచేయబడును. జ్యోతిర్లింగమని ప్రసిద్ధమైన యరుణాచల రూప మందువలన సగుణబ్రహ్మ తత్త్వమునేగాక కార్తికేయుడనబడు కుమారస్వామి తత్త్వమునుగూడ సూచించు చున్నది. ఇతడు తల్లి పాలను గుడువకుండగనే వర్ధిల్లిన మహదంశగలవాడని సూచించుటకు గాబోలు క్షేత్రాలయమందు వెలసిన యితని తల్లి యగు పార్వతి 'అపీతకుచాంబ' యను పేరు వచ్చెను. ఈ యాలయమునకు జెంది దేశమందెక్కడను లేనంత పెద్ద రథ ముండెడిది. పదునాలుగంతస్తులతోగూడి చతుర్దశ భువనసాంకేతికమైయొప్పు నీ రథముపై శక్తీశ్వరుల యుత్సవ విగ్రహములనుంచి యుత్సవములలో ప్రతి రాత్రియం దూరేగించునప్పుడు భగవంతుడు పదునాల్గు భువనముల నధిష్ఠించి నడుపుచున్నట్లుండెడిది. ఈ వైభవము ననుదినము కన్నులార

గాంచి, పదియవనాటి దీపోద్భవదర్శనముచే పవిత్రజన్ములగుటకు వేలకొలది యాత్రికు లుత్సవదినముల ప్రారంభమునకే బహుదూరముల నుండి వచ్చి క్షేత్రమును నింపుదురు.

ఇట్లందర న్ని దిక్కులనుండి దైవసన్నిధికి రాగా, దైవసన్నిధికి వచ్చిన వాసిష్ఠు డుత్సవ సమయమున నొక దిక్కున దీక్షాబద్ధుడై, సన్నిధినిజేర్చు భగవదనుగ్రహముకొఱకు నిరీక్షించుచుండెను. అఱు దినము లుత్సవములు గతించి యేడవ నాటి యుత్సవముగూడ ముగియనుండగా నొక యద్భుతము జరిగెను. ఆనాటి రాత్రి క్షేత్రరథ మూరేగి కోవెలకు మళ్లిపోవుచున్న సమయమున వేదపాఠశాలకును, అన్నధర్మశాలకును నడుమ పలకఱాళ్లచే పాదుపబడిన చదునైన బాటయందది హఠాత్తుగా స్తంభించి, యెంత లాగినను వెనుకకుగాని, ముందుకుగాని తలవెంట్రుక వాసియైన కదలక భగవంతుని యచల దీక్షాతత్త్వమును నిరూపించుట కెల్లరు నాశ్చర్యచకితులైరి. సుమారు పదిగంటల రాత్రినుండి యర్ధరాత్రి వఱకు పెనగులాడిన ప్రజ లలసటజెంది, యింక చేయుట కేమియు తోచనివారై, రథము నక్కడ దిగవిడచి, పదిమందిని కాపుంచి, మిగిలినవారందరు, పూజార్లును, వాద్యగాండ్ర సహితముగా తమ తమ యిండ్లకు బోయిరి. ప్రొద్దుట మఱల ప్రయత్నించవచ్చునని వారట్లు చేసిరి.

వారిండ్లకు వెళ్లిపోయిన సమయమున కించుమించుగా పురము వెలుపల నైర్ఋతి లింగస్థలమున నర్ధరాత్రివఱకు ధ్యానించిన పిదప నిద్రాపరవశుడై పండుకొనిన వాసిష్ఠున కొక విచిత్రస్వప్నముచే హఠాత్తుగా తెలివివచ్చెను. ఆ స్వప్నమెట్టిదనిన, క్షేత్రాలయములోని పెద్దపూజారియైన రామలింగశివార్చకు డగపడి 'ఆచార్యా' యని సంబోధించిన పిదప రథమాగిపోయిన విషయ మెఱిగించి, "మీరు వచ్చినగాని కదలనని భగవంతుడు చెప్పుచున్నాడు. కనుక మీరు రావలె" నని యీశ్వర సందేశమును దెల్పి మాయమయ్యెను. వెంటనే వాసిష్ఠు డుత్సాహపూరితుడై మేల్కాంచెను. మేల్కాంచిన పిదప తా గాంచినది స్వప్నమని తెలిసికొని, స్వప్నమందు వినిన ఈశ్వర సందేశమును మన్నించి తన దీక్షను విడచుటయా మానుటయాయని తర్కించుకొనజొచ్చెను. వెంటనే 'యీశ్వరుడు నిన్ను పిలుచుచున్నా' డను నశరీర వాక్కొకటి రెండుచెవుల యందును స్పష్టముగా వినబడెను. అది వినబడిన తక్షణము వాసిష్ఠుడు లేచి, యుత్తరీయమును కప్పుకొనుటకు మఱచి, తన కన్నుల ద్వారమునైన మూయక, వెలుపలకు వచ్చి, యీశ్వర సన్నిధిని చప్పున బొందు నుత్సాహముతో పురము జేరెను. చేరినంతనే యెక్కడ తనకు పూర్వము వేదపఠన ప్రబోధము నిచ్చిన పాఠశాలయు, దేవియొక్క విందును కల్పించి యటుపిదప క్షున్నివారణ కొఱకు హరస్తుతికి కారణమును కల్పించిన అన్నధర్మశాలయు గలవో, ఆ రెండింటికిని నడుమ స్తంభించిన రథమును గాంచి, యక్కడ రథమును

లాగువారెవరును లేకుండుట జూచి, వాసిష్ఠు డేమి చేయుటకును దోచనివాడై భ్రమాకులుడయ్యెను.

అప్పుడా రథముకడ గాపున్నవారివలన ప్రజలొనర్చిన ప్రయత్నమంతయు వాసిష్ఠుడు వినిన పిదప రథము నధిష్ఠించిన భగవంతుని కెదురుగా నిలిచి, ''తండ్రీ! నేనిప్పుడు భ్రమాకులుడనై యుంటిని. ఉదయమందరు చేరిన వెనుక వచ్చి మరల దర్శింతును. ఇప్పుడు నేను నా తపస్స్థలమును చేరుట కనుజ్ఞని'' మ్మని విన్నవించుకొని, యనుజ్ఞబడసిన వానివలె వెనుకకు మఱలిపోయెను.

ఓం

మూడవ ప్రకరణము

# ఈశ్వర రథము కదలి వాసిష్ఠ మనోరథము నీడేర్చుట

మఱునా డుదయమునుండి యాత్రికులు, పురజనులు గూడి రథము నెట్లయిన కదుపుట కన్ని యత్నములను విఫలులగుచున్నను చేయుచుండిరి. రథము కదలి కోవెలలోనికి వెళ్లువఱకు నెనిమిదవనాటి యుత్సవము ప్రారంభము కాదు. మధ్యాహ్నము పండ్రెండు గంటలకు లోపున కదలని యెడల ప్రాయశ్చిత్త ములుగూడ చేయవలసి యుండునని పూజార్లు, ఆలయాధికార్లు భయపడ జొచ్చిరి. వాసిష్ఠు డానాడు ప్రొద్దెక్కువఱకు తెలివిగాంచక, తన స్నానాద్యనుష్ఠాన ముల నప్పుడు ప్రారంభించి, యాలస్యాపరాధమున కీశ్వరు డేమిచేయునో యని నైఋతిలింగ స్థలమున నతడు భయపడ జొచ్చెను. ఇట్లు దైవనిర్ణయ మెవ్వరికిని తెలియక అంద రన్ని విధముల భీతి చెందియుండగా పదిగంటల ప్రొద్దెక్కెను. ఆచార్యుడప్పటి కనుష్ఠానములను ముగించుకొని, తన గుడ్డల మూటను చేత ధరించి పురమునకు దారితీసెను. రథమింకను కదలక స్తంభించిన స్థలమందే యున్నట్లతడు పురము జొచ్చినంతనే గ్రహించి, తన రాకకొఱకే యీశ్వరుడు నిజముగా వేచియున్నట్లు భావించెను.

ఈ భావమునకు గగుర్పాటుదోప తన గుడ్డలమూటను పాఠశాలయం దొప్పగించి వాసిష్ఠుడు చప్పుచప్పున రథము సమీపించి, మ్రోకులు లాగువారి నొక్క క్షణమాగుమనెను. వారు వాసిష్ఠుని రాక కాశగొనినవారై, యతని యాజ్ఞను మన్నించి, యతనికి దారిచేసిరి. అప్పుడతడు రథముపైనున్న దేవుని కెదురుగా సాష్టాంగప్రణామము సల్పి లేచిన పిదప "తండ్రీ! నీ యాజ్ఞ చొప్పున వచ్చితిని. ఇంక నీ రథము కదలున ట్లనుగ్రహింతువుగాక" యని విన్నవించుకొని యీవలకు వచ్చెను. ఆ వాక్యములను విని యక్కడి వారు మ్రోకులను మఱల లాగుటకు చేతబట్టిరో లేదో రథ మున్నపాటున నన్నిచక్రములతోడను బెత్తెడెత్తునకు గెంతి, వాసిష్ఠుని రాకకు సంతోషమును బ్రకటించిన ట్లందరి హృదయములందు తట్టెను. పిదప ప్రజ లనాయాసముగా దానిని కోవెల జేర్చిరి. ఆటుపిదప వారు తమ కృతజ్ఞత దెల్పుటకు వాసిష్ఠునికై వెతకిరి. కాని, యతడు వారి పొగడ్తలను దప్పించుకొనుట కంతకుముందే యచ్చోటు వీడి ప్రక్కసందునబడి బ్రాహ్మణ వీధివైపునకు బోయెను.

విశ్వనాథయ్యరను పేరుగల పూర్వపరిచితు డొక డాచార్యుడు వెళ్ళిపోవుట గమనించి వెంబడించెను. అతడాబ్రాహ్మణవీధియందే నివసించుచున్నందున తన యింటి కాచార్యుని తీసికొనివెళ్ళి, వీధికొట్టు తెరచి, యందు గూర్చుండబెట్టిన పిదప 'నా కీ నాడు సుదినము. మీరు మా యింట నాతిథ్యము గైకొనవేడెద'నని పల్కెను. వాసిష్ఠుడు భుజించుట కిష్టపడలేదు. కాని, దప్పియున్నందున వాని యింట పండుగదినమని చేయబడిన పాయసమును మాత్రము కొంచెము త్రాగి యుపవాసమును దీర్చుకొని, విశ్వనాథయ్యరును భుజించి వచ్చుటకు పొమ్మనెను. అతడు భుజించి వచ్చులోపున తనకానాడు రథము నెపమున భగవంతుడైన యీశ్వరుడు జూపిన యద్భుతవిషయ మేమై యుండునని యాలోచించుకొనుటకు వాసిష్ఠు డాసనబద్ధుడయ్యెను.

దైవమందు శ్రద్ధాభరితమైన యతని బుద్ధి యానాటి యద్భుత దర్శనమునకు మఱింత దృఢమై, భగవంతుని పరోక్షప్రబోధమునకు గల రహస్యమును గ్రహించుటకు మఱింత సూక్ష్మమై పటిష్ఠమయ్యెను. భువన సాంకేతికమగు రథము స్తంభించి భువనమం దిప్పుడు దుష్టబుద్ధి నెదుర్కొనుట కెట్టి యుపాయము దోచక స్తంభించియున్న దుష్టుల బుద్ధిని సూచించెను. బాహ్యాంతరములవలె రెండు పక్షములందును మానవబుద్ధి నాక్రమించు నానావిధములగు తమస్తాపముల నెదుర్కొను సూక్ష్మోపాయములను మన పూర్వఋషులు వేదకోశమం దిమిడ్చి యుండిరి. కాని, వారూహించిన అర్థములందలి పదములకు భాష్యరచన కాలము నాటికే చాలవఱ కవగతము కాకయుండెను. దాస్యప్రియులై పండితులు స్త్రీ వ్యసనాది మోహితులైన ప్రభువులకు ప్రియముగూర్చుటకై భాషాపదముల నెన్నియో చమత్కారములుగా వాడుకచేసి రసిక కవిత్వములచేతను, నందిని పందిగాజేయు భాగవత కథాకల్పనలచేతను, సమయానుకూలమగు నీతికూర్పుల చేతను, కువాదములను పోషించు తర్కయుక్తులచేతను, చౌకబారు వేదాంత సూక్తులతోడను తమ భాషను నింపి, పదములకు గల వేదకాలార్థములను బుద్ధికి స్ఫురించనంతటి దూరము గావించి తారుమారొనర్చిరి. అటుపిమ్మట రసిక కవనములచే వశముగాని దొరలు పాలకులైనప్పటినుండి పండితులు తమ నోటిలో బెల్లపడినదని గ్రహించి తమ బిడ్డల నింగ్లీషువిద్యకు వశముచేసి దాస్యభావమునే పెంపొందించిరి. ఇట్లొకవంక తమకు తామే భాషను విపులము గావించు నెపముతో సంస్కరింపబూనిన మధ్యకాలపు కవులు, పండితులు దాస్యలోలురై సాంకర్యబీజములను నాటిన ఫలముగా మానవబుద్ధి యాధ్యాత్మికముగా నొకవంక దుర్బలత్వమును జెంది, యింకొకవంక నిహసాధనమం దుత్తీర్ణులై పరమును కాలదన్నుచున్న పాశ్చాత్యబుద్ధి నెదుర్కొనజాలని దుఃస్థితి బొంది, దైవానుగ్రహము నర్థించు విధముగూడ తోచని స్తబ్ధత్వముచే స్తంభించెను. అట్లు స్తంభించిన మానవబుద్ధియందు తిరుగ వీర్యబలతేజము

లలుముకొను నుపాయ మాలోచించి భగవంతుడు నూత్నసంచలనము ననుగ్రహించినట్లు రథచలనము నిరూపించెను. కోవెలముఖమైన రథముచే భగవంతుడు స్వయముగా గెంతుటనుబట్టి యధ్యాత్మ విద్యోపాయమునే ప్రస్తుతము తలపెట్టి తన పాదద్వయమును నిరూపించునంత నెవరియందో చొరబెట్టిన ట్లవగతమయ్యెను.

ఇట్లానాటి యద్భుత దృశ్యమును వాసిష్ఠు డన్వయించుకొనిన పిదప భగవదంశ యెవరియం దవతరించియుండునో తెలియగోరి యీశ్వరునే స్మరించెను. వెంటనే బుద్ధియందు 'స్థూలశిరస్సువలన నీవంతయు తెలియగల'వని పూర్వము కాశిలో దుర్గామందిర యోగి చెప్పిన మాట జ్ఞప్తికి వచ్చెను. బ్రాహ్మణస్వామియే స్థూలశిరస్సని యదివఱకు వాసిష్ఠుడు గుర్తించినందున బ్రాహ్మణస్వామి తలపునకు వచ్చెను. ఆ వెంటనే యతని నేత్రమం దదివఱకు చూడబడిన యద్భుత తేజస్సు, ఆ తేజస్సున కతని పరముగా 'శుక్లాంబరధర' శ్లోకమును తా నన్వయించిన విషయము ఒకదాని వెంబడి నింకొకటిగా స్ఫురింప వాసిష్ఠు డిట్లు నిశ్చయించుకొనెను: "ఈ బ్రాహ్మణస్వామి పుట్టుకవలననే కుమారస్వామి యంశమై యుండును. కావుననే తెల్లని కౌపీనమును వీడక తన నిత్యబ్రహ్మచర్యము ప్రదర్శించుచుండెను. బ్రహ్మచర్యాశ్రమము కౌమారస్థితికి జెందినదను తలంపుతో పండితులతనికి 'కుమారస్వామి' యను పేరు కల్పించియుందురు. ఈ యాశ్రమ ధర్మములకు కల్పింపబడిన బాహ్యవేషములకు నా బుద్ధియు భ్రమించుట బట్టియే కదా నేనితని నిదివఱ కాశ్రయించక కాలమును వ్యర్థము జేసికొంటిని. ఈశ్వర నిర్ణయ మట్లుండుటవలన గాబోలు సర్వజ్ఞుడైన యీ బ్రాహ్మణస్వామియు నా విషయములో నన్ను చూచిన సంతోషమునకు మించి ప్రకటించలేదు. లేదా ప్రకటించదలచినను భగవంతుడతని వాక్కు నడ్డగించి యుండవచ్చును. హా! తెలిసినది. నన్నొక దిక్కున బుట్టించి, యతని నింకొక దిక్కున బుట్టించి, యిరువుర నీ యరుణాచల కేంద్రమున కాకర్షించియు నా గార్హస్థ్య ధర్మము తీరువఱకు నా బుద్ధి నణచినట్లే యీశ్వరుడతని వాక్కు నణచియుంచి, యీనాడు రథచలనమునకు వలెనే యతని వాగ్రథ చలనమునకు నన్ను నియమించి, నా వలన నాతని వాక్కునుండి లోకము నుద్ధరించు దివ్యోపదేశము వెడలవలెనని సంకల్పించియుండనోపు! నే నిప్పుడే పోయి తపస్స్వరూపమును గుఱించి యుపదేశమును లోకహితముకొఱ కర్థింతునుగాక."

బుద్ధియందిట్లు నిశ్చయించుకొనినంతనే వాసిష్ఠుడు తన చోటును వీడి, బ్రాహ్మణస్వామి నివసించు విరూపాక్షగుహకు చప్పచప్పున పోయెను. ఆ సమయమందు విశ్వమే మరుపైయున్న వాసిష్ఠునకు విశ్వనాథశాస్త్రి మరుపగుటలో వింతలేదు. వాసిష్ఠుడు ధ్యానమందున్నట్లు తలచి యతడు తా భుజించిన పిదప లోపలి గదిలో కూర్చుండెను. వెళ్లునప్పుడు వాసిష్ఠుడు వీధికొట్టు తలుపైన చేరవేయలేదు. దివ్యావేశము బొందినవానివలె నతడు మిట్టమధ్యాహ్నపు టెండకైన లెక్కసేయక

వీధులు దాటి, పురప్రాంతముననే కొండపైన కొంచెమెగువలోనున్న విరూపాక్షగుహను సమీపించునప్పుడు దారి పొడవునను భగవదనుకూలతనే యర్థింపజొచ్చెను.

అతడర్థించినట్లు భగవంతు డనుకూలత నేర్పరచెను. ఉత్సవదినములలో బ్రాహ్మణస్వామిని దూరమునుండియైన చూచుట కెడతెరపిలేక వచ్చు జనులంద ఆనాడు రథము కదలిన చోద్యముచే దాని వింత స్మరించుకొనుచు, బ్రాహ్మణస్వామిని మఱచి కోవెలయందో, తమ తమ బసలయందో ఉండిపోవుట వలన విరూపాక్షగుహ విజనమైయుండుట యొక అనుకూలత. వాసిష్ఠుడు వెళ్లు సమయమునకు బ్రాహ్మణస్వామియొద్ద పరిచర్యల కమరియున్న పళని సాధువుకూడ దేహబాధ తీర్చుకొనుట కావలకు దూరముగాపోవుట రెండవ యనుకూలత గుహచుట్టును కనుచూపుమేర జనులెక్కడను లేరని యెంచి, గుహకు వెలుపల వేయబడిన యావరణ తలుపు తెరచియున్నను భయములేదని పళని సాధువు తలచి తానావలకు పోవునప్పుడు తాళము బిగింపకుండుట మూడవ యనుకూలత. యథేచ్ఛావిహారియైన బ్రాహ్మణస్వామి యా సమయమునకు విరూపాక్షగుహ కీవలను, దడిక లోపలను నీడగానున్న యొక తిన్నెపై కూర్చుండి, వాసిష్ఠునకు వెళ్ళినతోడనే దర్శనమగుట నాల్గవ యనుకూలత.

ఒక్కడైయుండి ప్రసన్నవదనముతో కూర్చుండిన బ్రాహ్మణస్వామిని చూచినంతనే భగవంతు డనుకూల పరిస్థితి నేర్పరచి యనుగ్రహించుచుండెనని యెంచి, వాసిష్ఠుడెన్నడు లేని యుద్వేగమును బొందినవాడై బ్రాహ్మణస్వామికడ సాష్టాంగపడి, యతని దక్షిణ పాదమును తన దక్షిణ హస్తముతోడను, వామ పాదమును వామ హస్తముతోడను నమస్కారపూర్వకముగా పట్టుకొని భక్తి వెల్లువచే కంటిధారలను కార్చుచు, కొద్దినిముసములవఱకు నోట మాటలేక యుండెను. పిదప తన యుద్వేగము నణచుకొని లేచి "ఓ విశ్లేంద్రా! నిగమాగమ శాస్త్రములను తపస్సాధనోపాయముల కొఱకు, దేవతాతత్త్వ రహస్యములకొఱకు తరచి, నాకుగలమైన శ్రేష్ఠవిధానమును బూని వ్రతతతులచే మంత్రధ్యానము నాచరించుచు, నుత్తములైన పెక్కు మంత్రములచే తపస్సును పుష్కలముగా చేసితిని. కాని నా యందింకను నా తపస్స్వరూపముగా దైవము ప్రసన్నుడు కాలేదు. నేను పండితుడనైనను నా సాధనలోపమును దెలియజాలక, తపస్సాధన స్వరూపముకొఱ కర్థించుచు మిమ్ములను శరణువేడుచున్నాను. ఈ జనుడు మీచే ననుగ్రహింపబడుగాక."

ఈ పల్కు లాలకించియు, వాక్కు ద్రవించక, కంఠనాళములు శుష్కించినవాడై బ్రాహ్మణస్వామి బదులు పల్కజాలక, వాక్కునకు బదులుగా చల్లని కాంతిపుంజములు గల తన కరుణార్ద్రదృష్టిని మాత్రము వాసిష్ఠునిపై బరపుచు నతనిని స్మృతికి దెచ్చుకొన యత్నించెను. అతడేదో బదులు పల్కువఱకు విడువరాదని వాసిష్ఠుడు నిశ్చయించి, యతని ముఖమునుండి వెడలు మాటకై

నిరీక్షించుచు దండలు కట్టుకొని నిలబడియుండెను. ఒకరినొక రిట్లు చూచుకొను చుండగా వాసిష్ఠు నదివఱకు చూచిన స్మృతి స్వామియొక్క జ్ఞప్తిపథమునకు వచ్చెను. అతడే 'హరసహస్ర'మును రచించి మహాసన్నిధి నొకప్పుడు చదివి, భక్తిస్పందములచే నాబాలవృద్ధము నూగిసలాడించుటయేగాక హరుడైన అరుణాచలేశ్వరుని హృదయము నార్ద్రము చేసిన మహాభక్త కవియని తెలుత జ్ఞప్తికి వచ్చెను. మఱికొద్ది నిముసములలో 'శుక్లాంబరధర' శ్లోకమునకు చమత్కార వ్యాఖ్యానమును జెప్పిన కావ్యకంఠ గణపతిశాస్త్రియను పండితు డతడే యనియు స్మృతికి వచ్చెను. ఈ స్మృతి కల్గిన వెంటనే కంఠనాళములు ద్రవించుట స్వామి గుర్తించుకొనెను. మఱియొక్క క్షణమునకు నాళములందు రసప్రవాహమును కల్పించిన యీశ్వరశక్తి యతనిని ముక్తకంఠుని గావించి, యుపదేశవాణీ రూపమున మితాక్షరములతో మెల్లమెల్లగా వెడలి, వాసిష్ఠుని తప్తహృదయమం దమృత సేచనము చేసెను. వాసిష్ఠు డడిగినప్పుడు తమిళ భాషలో నడిగెను. స్వామి ముఖము నుండి యుపదేశవాణియు తమిళ భాషతోడనే వెడలెను. ఆ యుపదేశ వాక్యములకు తెనుగు అనువాద మీదిగువ నీయబడుచున్నది:

1. " 'నేను, నే'ననునది యెచ్చటనుండి వచ్చుచున్నదో విచారించినయెడల, అది యుదయించు స్థలమందే లీనమగును. అదియే తపస్సు.

2. జపము చేయునప్పుడు మంత్రనాద మెచ్చటనుండి యుదయించు చున్నదని పరికించినచో, అది యుద్భవించు స్థలమందు పరికించు మనస్సు లీనమగును. అదియే తపము."

****

ఓం

నాలుగవ ప్రకరణము

# సిద్ధోపదేశము, ప్రసిద్ధ నామకరణములు

ఈశ్వర ప్రేరణమున బ్రాహ్మణస్వామి యను సిద్ధపురుషుని దివ్యవాణి యుపదేశ రూపమున వెడలిన పవిత్ర దినము బ్రహ్మోత్సవములం దష్టమ దినమై, చాంద్రమానమున కార్తిక శుద్ధ చతుర్దశి - యశ్వినీ నక్షత్రయుక్త సోమవార మయ్యెను. ఇంగ్లీషు లెక్కలో 18-11-1907వ తేదియై యుండెను. అట్టి సిద్ధపురుషుని నుండి దివ్యవిధమున వెడలిన యీ ఉపదేశము సిద్ధోపదేశముగుటలో వింతలేదు. తమిళ భాషలో వెడలినను వాసిష్ఠుడు దానిని వెంటనే దేవభాషలోనికి దిగువ విధమున మార్పుచేసి జ్ఞప్తియందుంచుకొనెను:

" 'అహమహ'మితి కుత ఆయాతీతి విచారయన్హృదయ
స్థలే లీయతే; త దేవ తపః.
జప్యమానస్య మంత్రస్యనాదః కుత ఉ దేతీతి విచారితే,
ఉదయస్థానే లీనం భవేన్మనః, త దేవ తపః." *

మొదటి వాక్యముచే కర్తస్ఫూర్తి యెచ్చటనుండి పుట్టుచున్నదో తెలియుట, రెండవ వాక్యముచే నాదస్ఫూర్తి యెచ్చటనుండి వ్యక్తమగుచున్నదో తెలియుట చెప్పబడెను. రెండింటిని మేళవించి చూచినచో 'అహ'మ్మను జ్ఞానస్ఫూర్తి యవ్యక్త శబ్దరూపమున నుండి వ్యక్తమైనప్పు డితర ప్రాణమనోవృత్తులకు కారణమగుచున్నదని విదితమగును.

ఈ యుపదేశ వాక్యములు చెవికి సోకినంతనే వాసిష్ఠుని హృదయమం దమృతసేచనమైనట్లు వెనుకటి యధ్యాయములో చెప్పబడెను. అప్పుడతడు బ్రాహ్మణస్వామి యెదుట నట్లే యొక యరగడియవఱకు నిలిచి, యుపదేశార్థ మును తర్కించుకొనెను. అతని మనస్సా సమయమందు నూత్న వీర్యతేజములను

---

* వాసిష్ఠుడీ యుపదేశమును తన గ్రంథములలో శ్లోకరూపమున బహువిధములుగా కూర్చెను. ఉమాసహస్రము నుండి మచ్చునకు,

శ్లో॥ "అహమితి స్ఫురతిః క్వను విభాసతే।
ఇదమను స్మరన్నపది లీయతే" ... (శ.6,స్త.3,శ్లో.22)

శ్లో॥ "క్రియామూల ముత జ్ఞానమూలం కిమితి చింతయన్।
ఆత్మశక్తిమితో విద్వానమృతత్వాయ కల్పతే" .... (శ.10.స్త.1,శ్లో.24)

బొందిన దానివలె వేదాంతాగమశాస్త్రములను, ఉపనిషత్తులను, భాష్యములను, మహాపురుషుల యనుభవ వాక్యముల నన్నింటిని సమవలోకనము జేయగా, బయస్కోపు నందలి చిత్రములవలె నవి యత్యంత త్వరితగతిని తమ తమ యుక్తులను ప్రదర్శింపుచు వాసిష్ఠుని దృష్టియందు పరుగిడెను. కొద్దిక్షణములలో వాటినిట్లు సమవలోకనము చేసిచూడగా వేదకాలానంతరము రచింపబడిన గ్రంథము లేవియు తపోనిర్వచనము నింత స్పష్టముగా జేసి యుండలేదనియు, ఇట్టి యుపదేశము నెవరు ననుగ్రహించియుండలేదనియు వాసిష్ఠుడు తెలిసికొనెను. సంపూర్ణ మోక్షమును బొందగల్గిన, వైదిక ఋషుల యనంతరము వారు జూపిన మార్గమునే విస్మరించి పండితులు గతితప్పి, యితరుల నంధకారమున ముంచిరని యతడు గ్రహించెను. ఈ పతనాంధకార కాలములో జన్మించిన మహాపురుషులు సైతము తపస్సాధనము నిట్లు బోధించకుండుట యాశ్చర్యమైదోచెను. ఇది యొక్కటియే మోక్షమునకు పథమైయుండ, వారు దీనిని బోధింపకుండుట కాల మపక్వమనియో, లేక నిజమగు మోక్షమును స్వయముగా చూడకయోయని యతడు శంకించుకొనెను. ఏదెట్లున్నను, బ్రాహ్మణస్వామి యట్టి మహాపథమును స్వయముగా చూచి, దానిని పొందుట కొసగిన యీ ఉపదేశమువలన నిగమాగమ శాస్త్రోపనిషత్తులన్నియు పునరుద్ధరింపబడగలవనియు, జిజ్ఞాసువులు తరింప గలరనియు నతనికి దోచి, సంతృప్త హృదయుడై స్వామికి కృతజ్ఞతాపూర్వకముగా నింకొకసారి సాష్టాంగప్రణామము నత డర్పించెను.

అటుపిమ్మట స్వామి నత డిట్లడిగెను: "నూత్నముగా లబ్ధమైన మీ పాద సన్నిధిని నాకీ నుపదేశముచే కొంత తడవు తపస్సాధన సల్పుట కనుజ్ఞనిండు." వెంటనే స్వామి 'మంచి'దని పల్కి, గుహాంతర్భాగమున నతనిని కూర్చుండుమనెను. ఆదివఱకు వాసిష్ఠుడెన్నడు తపస్సుకొఱకు గుహ ప్రవేశించలేదు. అందువలన తనకా సుదినమందు గురుకటాక్షముచే గుహప్రవేశముకూడ ప్రాప్తించినందులకు తనలో తానే సంతోషించుకొనుచు విరూపాక్ష గుహాంతర్భాగమున నాసీనుడై, 'అహమ్మహ'మ్మను భావ మెచ్చటనుండి పుట్టుచున్నదను విచారణమార్గము నవలంబించెను. ఈ మార్గమందు విచారించుట కుపకరణము మనస్సేయగును. లక్ష్యము గూడ దాని సంబంధమేయగు భావస్ఫూర్తి యగుచున్నది. అందువలన 'అహ'మ్మను భావస్ఫూర్తియే యావన్మనస్సున కర్థమగుచున్నది. మఱియు మనస్సు దాని మూలము నది స్వయముగా పొంది, సుషుప్తియందువలె స్వస్థమై యుండుట యీ సాధనక్రమము. ఎట్టి యాలోచనను రానీయక, యాలోచన ముబికినపుడెల్ల దాని యుద్భవస్థలమున గనిపెట్టి, దానినచ్చట యణచియుంచుట యీ సాధనమందున్న విధి. గ్రహించు జ్ఞానము మనస్సునందున్నది. దానియందు కర్తృత్వాభిమానము వృత్తిరూపమున స్ఫురించుటయు నున్నది. మొదటిది

చిత్సంబంధము, రెండవది జడసంబంధము. మొదటిదానిచే రెండవదాని మూలమును శోధించినప్పు డా మూలమందు వృత్తి నశించగా వృత్తిజ్ఞానముగూడ నశించును. అప్పుడా రెండు వేర్వేఱుగా నుండుటకు కారణమగు సంధిభాగము నశించి, దానిని బొందియుండు నభిమాన చైతన్యము - అనగా 'అహమ్మహ'మ్మను కర్త లక్షణము - తిరుగబడినదై, యాత్మగతమగును. ఈ విధముగా 'అహ'మ్మను భావవృత్తి నశించినప్పుడు వృత్తితోబాటు వృత్తి జ్ఞానము, కర్తలక్షణముగూడ - అనగా త్రిపుటి యావత్తు - నశించి, మూలమగు ఆత్మస్వరూపము మిగులును. అప్పుడభిమాన మాత్మాభిముఖమై యుండును గనుక క్రియావృత్తులు, తత్ఫలములు గూడ నాత్మగతమై, మృతత్వము నుండి తొలగినవగును. ఈ యుపదేశ తత్త్వము దక్షకథనుండి వాసిష్ఠున కదివఱకు విదితమైన తత్త్వమును బోలినందున నతనికి సులభగ్రాహ్యమైనది. పైగా, అప్పుడు తెలియబడని సాధనక్రమమిప్పు డీ యుపదేశమునుండి తెలిసెను.

ఈ విధముగా తత్త్వార్థమును వశమొనర్చుకొనిన బుద్ధిచే వాసిష్ఠు డీ సాధనమును బూని, తన మనస్సు నవలీలగా నగాధములకు జొనిపి, మూలస్థితిని బొందలేకపోయినను తత్సమీపమగు సుఖస్థితిచే షుమారొకగంట ధ్యాన సమాధి యందు మునిగెను. పిమ్మట ఉపదేశమార్గము ననుభవించి, మాధుర్యమును జవిచూచినవానివలె ధ్యానమునుండి మేల్కాంచి యిట్లు నిశ్చయించుకొనెను: "నిజముగా చిరకాలమునుండి మభ్యపడియున్న తపోవిధానమును బ్రాహ్మణ స్వామి యిప్పుడు లోకమందు పునరుద్ధరింపజేయుటకు పుట్టి, యీ నూత్న మార్గముచే నూత్నయుగమును స్థాపింపజేసినవా డగుచున్నాడు. ద్వాపరయుగ మార్భునం దింద్రపుత్రుడైన నరునకు నారాయణు డుపదేశించిన ట్లీశ్వరపుత్రుడనైన నాకీ యోగీశ్వరేశ్వరుడు నవ్యోపదేశమును జేసెను. రాబోవు యుగము ననుసరించి యప్పుడు రణభూమి యుపదేశస్థలమైనచో నిప్పుడు పవిత్రజ్యోతిర్నిలయమగు నరుణగిరి స్థలమయ్యెను. అప్పుడు జీవేశ్వర సంబంధముమాత్ర ముపదేశమైనచో నిప్పుడు జగజ్జీవేశ్వర సంబంధ మంతయు నుపదేశమయ్యెను. ప్రారంభించిన రథసామ్య ముభయ పక్షములందు కారణభూతమై, తచ్చలనముచే చలించిన యుగకాల మప్పుడు రణముఖమై కలిని సూచించగా, యిప్పుడు దేవాలయముఖమై సత్యమును సూచించుచున్నది. ఆహా! కాశిలో దుర్గామందిరయోగి చెప్పినవా క్కిప్పటికి ఫలించెను. ఈ స్వామియందు 'భగవాన్' శబ్దమన్వయమై, మహర్షి బిరుదము రూఢమగుచున్నది. ఇతని లౌకికనామము నడిగి తెలిసికొని, దానిని తారక జపనామముగా కూర్చి, నాకున్న ఆగమాధికారమును బ్రదర్శించుచు, గురున కా నామమును గురుకల్పముగా నర్పించుకొందునుగాక."

ఇట్లు నిశ్చయించుకొని వాసిష్ఠుడు కన్నులు విచ్చగా నక్కడొక నూత్న వ్యక్తి

స్వామికథ తప్పాదుట గాంచి, యతడొక పరిచారకుడని త్రుటిలో గ్రహించెను. వాసిష్ఠుడతనిని చేరబిలిచి, యతని పేరు 'ఫలని'యని తెలిసికొనిన పిమ్మట 'ఫలనీ! నీకి స్వామియొక్క పూర్వాశ్రమ నామము తెలియునా' యని యడిగెను. 'వేంకట్రామన్' అని యతడు బదులు పల్కెను. అప్పుడు 'వేంకట'యను విశేషణమును విడచి, 'రామన్' అను వికృతమును 'రమణ'యను రమ్యనామముగా వాసిష్ఠుడు మార్చి చూచుకొనగా నది చక్కని తారకజపనామమై యొప్పుటకత డమితానందభరితుడయ్యెను. అటుపిమ్మట బిరుదుల నిటునటు జేర్చి, స్వామికి 'భగవాన్ శ్రీ రమణమహర్షి' యను పూర్ణనామమును సమకూర్చి. యీ నామము ధ్రువమగునట్లయిదు శ్లోకరత్నములను గురుకట్నముగా కూర్చదలచి, ఫలని సాధువును వ్రాతసామగ్రి నడిగి పుచ్చుకొనెను.

'శ్రీ రమణపంచక' మను పేరుతో గూర్చబడిన రత్నమాల సిద్ధమైనతోడనే వాసిష్ఠుడు గురుని సమీపించి, యా శ్లోకములను జదివి వాని యర్థములను తమిళమున స్వామికి విన్నవించిన పిదప సాష్టాంగప్రణామపూర్వకముగా "మీరిది స్వీకరించి నన్నాశీర్వదింతురుగాక" యని పల్కి, యా రత్నమాలను రమణుని హస్తమందుంచెను. 'సరే, నాయనా'యని రమణు డంగీకారపూర్వకముగా బల్కుచు దానిని స్వీకరించి, ఫలని సాధువునకు భద్రపరచుట కందిచ్చెను

అది ఫలని సాధు వందుకొనెను. కాని, స్వామి మాట్లాడుట యతడప్పుడే వినినవాడై సంతోషమున మిన్నందుకొనుచు వశము దప్పినవాడయ్యెను. ఆ సంతోషపారవశ్యమున నతడొక చెంగున గుహకీవలకు వచ్చి, పరుగున పురము లోనికి పోయి, నలుమూలల బ్రాహ్మణస్వామి మౌనమును విసర్జించిన వార్తను చాటెను. 'ఎవరివలన ?' యని ప్రశ్నించువారికి 'యెవరో నాయన వలన' యని బదులు చెప్పుచు గ్రామమంతయు కోవెల సహితముగా నతడు చుట్టివచ్చెను.

ఈ యద్భుతవార్త నాకర్ణింపబడనివారు లేరు. స్వామియందందరికి భక్తిగౌరవము లవ్యాజములై యున్నవి. అందువలన రథము కదలిన యద్భుత మునకానాడెట్లు వింత సంతోషమును బొందిరో, స్వామియొక్క వాగ్రథముగూడ కదలుట కంత సంభ్రమాశ్చర్యములను బొంది, ప్రత్యక్షముగా స్వామివాక్కును విను కుతూహలముచే ప్రజలు గుంపులు గుంపులుగా విరూపాక్షగుహ కెగబడిరి. తన యాహ్వానముచే వచ్చిన మూకలకు స్వామిదర్శనము నిరాటంకమగుటకై ఫలనిసాధు వావేశమున గుహచుట్టునున్న దడిని పీకివేసెను. పిశాచగణముల కుద్రేకము గల్గినప్పుడు మంచియు, చెడ్డయుగూడ హద్దుమీరి యుండునని ప్రజలు గ్రహించి, యానాడు ఫలని చేసిన మంచి కందఱు హద్దుతొలగినవారై సంతసించిరి.

అప్పుడొక పండితుడా మూకనుండి ముందునకు బోయి స్వామికి నమస్కరించి "స్వామీ, మీరీదిన మెవరో 'నాయన' యను పేరుగల వ్యక్తితో మాట్లాడు నెపముచే మౌనమును వీడిరట. మీ దీక్ష ముగియుటకు కారణభూతుడైన ఆ సత్పురుషుడెవడు, ఎక్కడ నున్నా"డని యడుగగా, స్వామి వాసిష్ఠ గణపతిని జూపి 'యిదుగో నాయన' యని బదులు పల్కెను. అతడే నాయనయై, యా పుణ్యదినమున జూడబడిన రెండవ యద్భుతమునకుగూడ కారణభూతుడగుటకు వారందరు సంతోషమును బ్రకటించిరి. దాక్షిణాత్యులు గణపతి దైవమును 'నాయన' యని పిలుతురు. గణపతి పేరుతో బరగు మానవరూపులను మాత్ర మట్లు బిలువరు. కాని, స్వామి యట్లు స్వయముగా పిలుచుటబట్టి తమ కిన్నాళ్లు పండితమాత్రుడుగా దోచిన వాసిష్ఠ గణపతి మానవవేషధారియైన గణపతి దైవాంశయని వారు గుర్తించుకొని స్వామికిని, నాయనకుగూడ తమ తమ స్థలములనుండియే శిరస్సులను వంచి నమస్కరించిరి. రమణుని పరసతను వాసిష్ఠుడు గ్రహించి, 'నాయన' యను పేరు తనకు గురుదత్త నామమై పురజనులలో నిట్టె వ్యాపించి వారి జిహ్వాలం దప్పుడే తాండవమాడుట జూచి వారి నుద్దేశించి యిట్లు పల్కెను: "మీ కందఱికి నే నొక రహస్యమును జెప్పెదను. సావధానులై వినుడు. ఈ స్వామి లోకగురువుగా నవతరించిన దివ్య మూర్తి యని చిరకాలమునుండి ముఖ్యమైన జ్ఞానము నుపదేశించుటబట్టి నేను గుర్తించి, యితనికి 'భగవాన్ శ్రీ రమణమహర్షి' యను పేరుంచితిని. కనుక మీ రిటుపైని బ్రాహ్మణస్వామి యనికాక 'భగవాన్' అని సంబోధించుట యలవరచుకొనవలెను." పిదప రమణు డుపదేశించిన మార్గము లోకముకొఱ కనినట్లు దాని సారమును వారికి చెప్పి యిట్లనెను: " 'రమణ' నామ మితనికి బాల్యమం దుంచబడిన నామసంక్షిప్తమై, స్మరణయోగ్యముగా నున్నది. జ్ఞానసాధనము సులభముగా దోచినను మనస్సు వశముగానివారి కది కష్టమగును. మనస్సులోని యితర భావములు తొలగువఱకు 'అహ'మ్మను భావము వశము కాదు. అప్పుడుకాని దాని మూల మరయుటకు వీలుండదు. కనుక మహర్షి యుపదేశించిన రెండవ వాక్యమును మీ సాధనమం దుపయోగించి రమణ నామస్మరణచే ధన్యులు కండు. ఈ లోక గురు వేక్షేత్రమందు జన్మించెనో, ఆ క్షేత్రదేవతయైన సహాయ వల్లియొక్క సహాయమును గూడ మన మొక శ్లోకముచే స్మరించెదముగాక" అని పల్కి, యాశువున నీ దిగువ శ్లోకమును నాయన చెప్పెను:

శ్లో॥ "భవార్థితానాం భవతా త్సహాయః॥
సహాయవల్లీ కరుణా కటాక్షః॥
యత్రాత పూతో రమణో మహర్షిః॥
పరం లులోకే భగవాన్గురుర్నః॥"

వాసిష్ఠున కానాటినుండి 'నాయన' యను క్లుప్తనామము బ్రాహ్మణస్వామి కుంచబడిన 'రమణ' నామమువలెనే సిద్ధమై సర్వవ్యాపకమయ్యెను. ఆ నాటి రాత్రి వాసిష్ఠుడు పురములోనికి భుజించుటకు వచ్చినప్పుడు తండ్రికొక లేఖ, భార్యకొక లేఖ తనకు బ్రాహ్మణస్వామి గురువైన వార్త నెఱిగించుటకు వ్రాసి, రెండిటి యందును 'నాయన'యని గురుదత్తనామమున సంతకము చేసెను. భార్యకు వ్రాసిన లేఖలో బ్రాహ్మణస్వామి నెట్లు పిలువవలెనో శాసించెను. మఱియు శిష్యసహితముగా వచ్చి రమణున దర్శించుకొమ్మని యామె నాజ్ఞాపించెను. ఆ లేఖ నందుకొని సుమారు ముప్పది శిష్యులతో గూడి యామె 20వ తేది నాటి దీపోత్సవమును గూడ జూచుట కానాటి సాయంత్రమునకు వచ్చి, తిన్నగా విరూపాక్షగుహకు వెడలెను. ఆమెను చూచినంతనే రమణుడు గుహ లోపల నున్న నాయనను పిలిచి 'అమ్మ' వచ్చెనని చెప్పెను. అది విని యామెను నాయనయు 'అమ్మా' యని సంబోధించగా, నామెయు భర్తను 'నాయన' యని పిలువజొచ్చెను. రమణుడు వారి యొండొరుల పిలుపులకు సంతసించెను. ఆ సంతోషము క్రమ క్రమముగా వృద్ధిజెంది కొంతసేపటికి దుఃఖరూపమున పరిణమించి రమణుని ముఖము చూడ శక్యముగాక పోయెను. అది చల్లారి యథాపూర్వ రమణుడైన పిదప శిష్యులతో సహా యామె రమణున దర్శించుకొనెను. సంతోషమధికమైనప్పుడది దుఃఖముగా పరిణమించునను సత్య మానాడు చూడబడెను.

ఓం

అయిదవ ప్రకరణము

# ఉమాసహస్రస్తుతి రచనము

శ్రీ రమణ గణపతులవలెనే విశాలాక్షమ్మయు క్లుప్తనామమును బొంది 'అమ్మ' యని ప్రసిద్ధురాలగుటకు వాసిష్ఠుడు సంతసించి, యా పేరు సార్థక మగుట కామెను గుహ లోపలకు పిలిచి, తానదివఱకు వైద్యనాథ క్షేత్రములో గైకొనిన ప్రసిద్ధ 'తారా'మంత్రము నది యిచ్చిన సురేశమిత్రుని కోర్కె చొప్పున నొక స్త్రీ ద్వారా దక్షిణ భారతదేశమందు వ్యాప్తమొనర్చుట కది మంచి సమయ మని యెంచి, దాని నామె కుపదేశించి, దానిని వ్యాపింపజేయు నధికారము నామె కిచ్చెను. శ్రీ రమణుడు నాయనయొక్క లోకహితకార్య స్ఫురితబుద్ధికి సంతసించెను. ఉపదేశమైన కొద్ది నిముసములకు పర్వత శిఖరముపై జ్యోతి రావిష్కరణమయ్యెను. ఆ జ్యోతికందఱు ప్రణమిల్లిన పిదప ప్రత్యక్ష జ్యోతిర్మూర్తియైన శ్రీ రమణ భగవంతునకు నమస్కృతు లర్పించిరి. అటుపిమ్మట రమణుని సెలవు గైకొని యమ్మ నాయనలు శిష్యసహితులై కొండ దిగి పురములోనికి బోయిరి. నాటినుండి యమ్మ నాయన లుభయులు తమకు వానప్రస్థాశ్రమ మనుగ్రహింప బడినట్లు నిశ్చయించుకొనిరి.

ఆ రాత్రి తుదినాటి యుత్సవమును జూచి, యా మఱునాటి యుదయమున శిష్యులతోగూడి యమ్మ వెళ్ళిపోగా, నాయన విరూపాక్ష గుహకేగి ఫలనిసాధువు నిట్లడిగెను: "నాకీ విరూపాక్షగుహకు సమీపముగా ప్రత్యేకమైన మంచి తప్పులమేదైన చూపగలవా?" ఆ ప్రశ్నను విని శ్రీ రమణుడు "మంచి చల్లదనమునిచ్చు 'ఆమ్రగుహ* యిక్కడనే కొండపాదమందున్నది. రండు నే జూపెద"నని పల్కి, ఫలనిసాధువు నది తెరచి శుభ్రపరచుటకై ముందు పోవుట కాజ్ఞాపించెను. అతడది శుభ్రపరచినతోడనే నాయనను స్వయముగా చేయిపట్టుకొని రమణు డందు ప్రవేశపెట్టిన పిదప మధ్యాహ్నమువఱ కక్కడనే నాయనతో సంభాషించుచు కూర్చుండెను.

అక్కడ వారట్లు ముచ్చటించుచుండగా 'ఎచ్చెమ్మాళ్' అను నొక భక్తురా లనుదినము మహర్షి కన్నము పట్టుకొని వచ్చినట్లే వచ్చి కొండ నెక్కబోవుచు, ఫలనిస్వామి నామ్రగుహ ప్రాంతమున జూచి 'యేమిటి విశేష'మని యడిగెను. అతనివలన నాయనయు ప్రత్యేక గుహావాసియగుట వినినతోడనే నాయనకుగూడ

---

*ఇది మామిడిచెట్టు నీడచే చల్లనైయుండును. దీనిని మాతగుహ యనియు పిలుతురు.

తానన్న మనుదినము తెచ్చి పుణ్యము గట్టుకొనవలెనని యామెకు గాఢముగా తోచెను. వెంటనే తనచేతనున్న పాత్రల నా చెట్టుక్రింద బెట్టి, ఫలనిసాధువును కాపుంచి, యామె పురములోనికి చప్పచప్పన బోయి యొక్క యరగంటలో నాయనకుగూడ భోజనము తెచ్చి, రమణ గణపతు లుభయులు సోదరులవలె ప్రక్క ప్రక్కను కూర్చుండి భుజించుట కెంతయు సంతసించెను. ఆమె భక్తికి, సాధుసజ్జనసేవకు గురుశిష్యన్యాయము కంటె సోదరన్యాయమును తమయందు చూపిన చమత్కారమునకు నాయన మెచ్చుకొని, యిది రమణు డామెయందు కల్పించిన ప్రేరణమని యాంతర్యమున నిశ్చయించుకొనెను. ఆ దినమునుండి యామె రెండు గుహలందును భోజనమిచ్చుటవలన నాయనకు పురములోనికి బోనవసరము లేకపోయెను.

పుణ్యప్రదమైన యీ మాతగుహ తనకు లభించిన సంతోషమును నాయన యొక శ్లోకముచే నిట్లు ప్రకటించెను:

శ్లో॥ "పుణ్యా మాతగుహా సేయం రమణేన మహర్షిణా।
అధిష్ఠితా సేవకానాం పాపహన్త్రీ విరాజతే॥"

ఈశ్వరానుగ్రహ మన్ని విధముల నిట్లు ప్రసరించుటకు నాయన కృతజ్ఞుడై యొక స్తుతి సమర్పింపదలచెను. పూర్వము 'హరసహస్ర' మీశ్వరపరముగా చెప్పబడియుండెను. అందువలన నీ మారు దేవీపరముగా సహస్ర శ్లోకములను రచించి స్తుతించుట యుక్తమని నిర్ణయించుకొని నాయన తద్ద్వారమున శ్రీ రమణోపదేశ మే విధముగా నిగమాగమ శాస్త్రోపనిషత్తులను సామరస్యమొనర్చు కీలకమై వానికి హృదయమగుచున్నదో, ఆ విధమును బ్రదర్శించి గ్రంథమున కుపనిషద్రూపమునుగూడ కల్పింపదలచెను. అంతేగాక, రసికపండితుల ప్రియము కొఱ కలంకార మాధుర్యములతో గూడిన కావ్యశైలి నాశ్రయించి తనయం దను గ్రహింపబడిన వాణీవిలాసమునంతను బ్రదర్శింప నుత్సాహపడెను. ఈ విధముగా స్తుతికావ్యోపనిషత్క్రమములను మూడింటిని సంకల్పించి యిట్టి విచిత్రపు మేళవింపుచే కవులకు క్రొత్త యాదర్శగ్రంథమును కల్పించుటకును, పారాయణము సల్పువారి కా గ్రంథము శీఘ్రఫలమునిచ్చు పవిత్ర గ్రంథమగు విధమున దానిని బీజాక్షరములతో నింపి, మంత్రబద్ధమొనర్చి, తన కబ్బిన మంత్రశాస్త్రాధికారమును సైతము చవిజూపుటకును నాయన నిశ్చయించెను.

ఇటుపిమ్మట నాయన గ్రంథమందు స్తుత్యమానమగు దేవతానామమును గుఱించి, తా బూనవలసిన దీక్షను గుఱించి యిట్లు నిశ్చయించెను: "ఉపనిషత్ప్రసిద్ధమగు దేవత ఉమ. ఈ గ్రంథ ముపనిషత్క్రమమును బొందుచున్నందున 'ఉమా' సహస్రమని దీనికి పేరిడి, యామె పరముగా స్తుతి చేసెదనుగాక! ఇఱువది దినములలో ముగించుటకు దీక్షబూని, పగళ్లు భుజించుచు, రాత్రు

లందు పాలను మాత్రము గైకొనెదను. ఇఱువదియవనాటి యర్ధరాత్రిలోపున రచనము పూర్తికాని యెడల దేవత కిది తృప్తి కాలేదని తలచి దీనినంతను చించిపాఱవేసెదను.''

ఇట్లంతయు నిశ్చయించుకొనిన పిదప నాయన విరూపాక్షగుహకు బోయి స్వగురునకంతయు విన్నవించుకొని యతని యనుమతిని బడసి వచ్చెను. ఆటుతరువాత పురము నుండి శిష్యులద్వారా వ్రాతసామగ్రి తెప్పించుకొని, కార్తిక బహుళ షష్ఠి - మంగళవారము - 26-11-1907వ తేదీ నుండి నాయన స్తవబంధదీక్ష బూని, యామ్రగుహ కంకితుడయ్యెను.

ఆ సమయమందు చెంతనున్న మహర్షి ప్రతి సాయంత్రము వ్రాత ముగియు సమయమున కామ్రగుహకు వచ్చి, వ్రాయబడిన ఘట్టమును వినిన పిదప కొంతతడ వక్కడ కూర్చుండి, తన సాన్నిధ్యబలముచే నాయన యాంతర్యమందు భక్త్యావేశమువలన గలుగు మదభారమును తొలగించుచుండెను. పురమునుండి నారాయణ ఘనపాఠి, వాసుదేవశాస్త్రి మొదలుగాగల సంస్కృతమెరిగిన శిష్యులు కూడ పఠనము వినుటకు వచ్చి, శ్రీరమణుడు నాయనయొక్క స్తవకార్యభారము నిర్విఘ్నమగుట కాదినుండి యనుగ్రహించుట జూచి సంతసించుచుండిరి. ఒక నాడు రమణుడు చూతగుహనుండి తన విరూపాక్షగుహకు పోయిన పిదప వారి విషయమును నాయనతో ముచ్చటించగా, నాయన వారి కిట్లు చెప్పెను: ''ముక్త కంఠుడై నందుల కతడు, ముక్తకంఠమునుండి వెడలబుచ్చిన దివ్యోపదేశమునకు నేను రెంటిని సమకూర్చిన దేవతకు కృతజ్ఞులమే గావున మా యిరువురి కృతజ్ఞత నుద్దేశించి నే నీ కార్యమును సంకల్పించితిని. ఇందులో నా దొక పాలైనచో, అతని దింకొకపాలు. వాక్కులకూర్పు నాదైనచో, నా బుద్ధి గుహ యందు ప్రేరణము నా గురువుది. అత డందరియందును గుహావాసియనియే నా విశ్వాసము. ఆ తత్త్వము సిద్ధము, పూర్ణము, వ్యక్తము అగుటకే నే నీ స్తోత్రకర్మఫలము నర్థింతును.''

స్తోత్రకర్మఫలముగా నాయన వాంఛించినది రమణుని యందు కార్తికేయావతరణమని స్పష్టమగుచున్నది. అప్పటివఱకు రమణునియందా తత్త్వ మున్నను, అది కార్యాచరణమును బొందక మాటిమాటికి బుద్ధియం దంతర్ముఖమై పోవుచున్నది. అందువలన లోకమం దిప్పుడు కాదగిన కార్యము కొఱకు ప్రేరే పించుటకై నాయన యుమాదేవత నర్థింపదలచెను.

అట్టి యుత్కృష్ట ఫలాపేక్షతో గూడిన యీ రచనము సాగుచుండగా నొకనా డుదయమున నొక యద్భుతము జరిగెను. భారతదేశమందప్పుడు వ్యాపించి

యున్న అన్నార్తిని తలచుకొని దాని నివారణోపాయము నొక శ్లోకమం దర్థింప గోరి నాయన "ఛిన్నాం భిన్నాం సుతరాం సన్నామన్నా భావా దభితః ఖిన్నాం!"* అని యొక పాదమును రచించుసరికి దేశములోని యాకలి యావత్తు తన పొట్టయందే దోచి యొకానొక ఆర్తిని కలిగించెను. అపు డేడుగంటల వేళయయ్యెను. ప్రాతనాపి దేవతను స్మరించుచు నాయన కూర్చుండెను. ఇంతలో 'ఎచ్చెమ్మాళ్' యింటియొద్ద నొక విచిత్రమయ్యెను. ఆమె పప్పు, బియ్యము వేర్వేఱు గిన్నెలలో పోసి, పొయ్యిపై నునిచి కూర్చుండినంతలో నామె యెదుట నొక స్త్రీ ప్రాదుర్భవించి "ఓ భక్తురాలా! గుహలో స్తవబంధదీక్షాపరు డాకలిచే బాధపడుచు నన్నముకొఱ కెదురుచూచుచుండెను. అన్నము దించి వెంటనే పంపుము. 'ఈ దినమేమిటి విశేష'మని యన్నము తీసికొని వెళ్లువాని నడుగమను"మని చెప్పి యంతర్ధాన మయ్యెను.

ఈ దృశ్యము మాయమైనతోడనే ఎచ్చెమ్మాళ్ పొయ్యివైపు చూచి, యన్నము, పప్పుకూడ ఉడికి సిద్ధమై యుండుట కాంచి యాశ్చర్యపోయెను. వెంటనే యొక విద్యార్థి బాలుని ద్వారా నాయనకు భోజనమంపి, వాని నడుగవలసిన ప్రశ్న చెప్పెను. బాలుడు వెళ్లి వడ్డించిన అన్నమును జూచినంతనే నాయన యాకలి మాయమయ్యెను. కాని, వడ్డింపబడినది వ్యర్థము గాకుండుట కెట్లో కొంచెము తిని బాలుని బంపివేసెను. అత డడిగిన ప్రశ్నకు నాయన నవ్వుకొని 'క్షుత్తే విశేష'మని బదులు చెప్పెను. కాని, దేశమందు శత్రువులచే కల్పింపబడిన క్షుద్బాధను నివారించుటకు దేవత సంసిద్ధురాలై యున్నదను రహస్యమును మఱియొక గంట కెచ్చెమ్మ చెప్పిన కథనుండి నాయన యన్వయించుకొని సంతుష్టాంతరంగుడయ్యెను.

ఇట్టి యద్భుతమే యింకొకటి రచన దీక్షాకాలమంతమగు సమయమునకు సంభవించెను. నాలుగైదు దినములకు దీక్ష ముగియుననగా నాయన కుడిచేతి బొటనవ్రేలిపై గోరుచుట్టు వంటి వ్రణమేర్పడి వ్రాతను మందగింప జేసెను. పందొమ్మిదవ దినము ప్రవేశించుసరికి వ్రణఫలముగా నాల్గవ వంతు గ్రంథము వ్రాయుటకు మిగిలియుండెను. ఆనాడు వ్రణబాధ తీవ్రమై యసలే కలము పట్టనీయలేదు. సాయంత్రము పురమునుండి వచ్చువారందరు గ్రంథ మేమగునాయని దిగులుపడజొచ్చిరి. రమణుడేమియు పల్కలేదు. ఇట్లుండగా పురమం దానాటి రాత్రి 'పుణ్యకోటి' యను పేరుగల యొక వైద్యునకు స్వప్న మందొక బ్రాహ్మణు డగపడి 'ఓయీ పుణ్యకోటీ! నీ పేరు సార్థకము గావించుకొన దలచితివేని గిరిపై నున్న సాధుపురుషుని వ్రేలి వ్రణమునకు శస్త్రచికిత్స చేసి శీఘ్రముగా బాధ నివారింపు'మని యాదేశించెను. స్వప్నమునుండి యతడు లేచుసరికి తెల్లవారు చుండెను. అందువలన నతడు కాలకృత్యములను దీర్చుకొని తెల్లవారిన వెంటనే

* ఈ శ్లోక ముమాసహస్రమునుండి తొలగింపబడి యింద్రాణీ సప్తశతియందు పిదప చొఱపెట్టబడెను.

తన శస్త్రపరికరములతో సహా కొండపైనున్న విరూపాక్ష గుహకు వెళ్లి, మహర్షికి నమస్కరించిన పిదప మహర్షియొక్క చేతులవైపు, కాళ్లవైపు వింతగా చూడదొడగెను. 'ఏమట్లు చూచుచుంటి'వని మహర్షి ప్రశ్నించగా పుణ్యకోటి తన స్వప్నము నెఱింగించెను. అప్పుడు మహర్షి "యోహో! నీవు వైద్యుడవా! వ్రణము నాకుగాదు నాయనకి. రమ్ము, చూపెద" నని వాని నామ్రగుహకు తీసికొని వెళ్లెను. నాయన వ్రణము పక్వమైయున్నందున శస్త్రచికిత్స వెంటనే చేసి, కట్టుకట్టి యతడింటికి పోయెను. బాధ యీ విధముగా తొలగినను కట్టు యడ్డము వచ్చుటచేత నాయన యా తుదిదినమునగూడ కలము పట్టలేదు.

ఆ సాయంత్రము శిష్యులు వచ్చి యిట్లు వేడుకొనిరి: "నాయనా! వేదాంతాగమ రహస్యములతో నిండి యత్యద్భుతముగా రచింపబడుచున్న యీ పవిత్రగ్రంథము వ్రణము నెపమున పూర్తిగాక చింపివేయబడుట బాగుండదు. ఇది యేదేని కోవెలలో మొత్తముగా చదువబడునని యెంచి గంభీరం శేషయ్యరు మొదలగువారు పెక్కుమంది యితర గ్రామస్థుల కాహ్వానముల నంపిరి. ఇంతమంది కాశాభంగము కలిగించు తత్త్వము మీయందులేదు. మీ రాశువున పూరించి యీ గ్రంథము నష్టముగాకుండునట్లు కాపాడ గోరుదుము."

వారి తుదివాక్యమును వినుసరికి నాయన కొక యాలోచన తట్టెను. "బాల్యమునుండి నాయందు నానావిధ బుద్ధి వైభములు దేవతానుగ్రహమువల్లనే వికసించి వృద్ధిగాంచెను. వానికన్నింటికి మూలమందున్న యామె స్వరూపము నెఱుంగు తపస్సాధన విధాన మామె యనుగ్రహమువల్లనే విదితమయ్యెను. తపస్స్వరూపిణియై యున్న యీమె తపస్తత్త్వమే యనుగ్రహతత్త్వమై, వృత్తి రూపముచే త్రైవిధ్యమగుచు, వ్యష్టియందు బుద్ధి-ప్రాణ-మనస్సులనియు, సమష్టి భూతములందు తేజోఽబన్నములనియు వ్యవహరింపబడు వికృతికి సారభూతమును కల్పించి పరదేవతారూపమైన ప్రకృతిపర మొనర్చుచున్నది. అందువలన నేనీ గ్రంథసారమును నాయందున్న సమస్త వైభవములచే ప్రదర్శించి, యా వైభవములను పరదేవత కర్పింప సమకట్టితిని. కాని, నాయం దన్ని వైభవములకంటె మించి, భువనేశ్వరీ మధుకటాక్షమును, తద్ద్వారమున కావ్యకంఠ బిరుదమును బ్రాప్తింప జేసిన యాశుకవితా ప్రజ్ఞను నే నీకార్యమందు కైంకర్యమొనర్చని లోటు దీర్చుటకే గాబోలు గ్రంథమం దామె లోటును కల్పించి, యీ శిష్యులద్వారా హెచ్చరించు చుండెను. నిజమే, ఆమె యనుగ్రహ ప్రసాదమైన నా యీ అసాధారణ వాగ్ధార యామె కత్యంత ప్రీతిదాయకముగుటలో సందేహము లేదు. కనుక నేనీ గ్రంథమందు మిగిలియున్న భాగము నాశువున బూరించెదగాక. గురుకటాక్షము నాకందు తోడ్పడుగాక!"

ఇట్లాలోచించుకొని రాత్రి యెనిమిది గంటలగుసరి కైదుగురు లేఖకులను వ్రాతసామగ్రితో సహా తీసికొనిరండని శిష్యులతో నాయన చెప్పగా

'సరే'యని సంతోషించి వారు వెళ్ళిరి. వారు వెళ్ళినతోడనే దేవతచే విచిత్రముగా కల్పింపబడిన ఆకలి, వ్రణబాధల రెండింటి నివారణయందు నేర్పైన గమనింప దగిన దేవతాతత్త్వమున్నదాయని నాయన బుద్ధి పరికించుకొనుసరి కనుగ్రహ సంభరితమై యున్న ఆ బుద్ధియం దిట్లు స్ఫురించెను: "ఆకాశమునుండి విషయగతమై వ్యాపించిన సూక్ష్మరజస్సే దక్షునిచే చిమ్మబడిన అన్నము. ఇది నిర్విషయమైనప్పు డమృతమగుచున్నది. మొదటిది విషయగతులైన నరులకు పోషణభూతము కాగా, రెండవది నిర్విషయులైన దేవతలకు పోషణభూత మగు చున్నది. తాపార్తికి కారణమైన మొదటిదానిని చూచినప్పుడు దాని నిర్విషయ సారభూతము నా దృష్టిచే గ్రహింపబడి యుండును. తాపార్తి భేషజమని ప్రసిద్ధ మైన యీ అమృతత్త్వమహిమను నేనామె యనుగ్రహతత్త్వమందు గ్రహించుటకే యీ ఘట్టమును దేవత కల్పించియుండును. ఇంక వ్రణబాధ నాలోచించినచో లోకమందిప్పుడు సజ్జనులను బీడించు శత్రుగణముల బాధకు సరిపోయి శస్త్రాస్త్ర చికిత్సను కోరెను. కనుక దీనిని ఛేదించు అంశయు దేవతానుగ్రహతత్త్వ మందు ప్రసిద్ధమై యున్నట్లు విదితమయ్యెను. అంతర్బాహ్య తమస్సుల రెండింటిని నిగ్రహించు నుపాయము శ్రీ రమణునిద్వారా లోకము పొందినట్లే యంతర్బాహ్య తాపముల రెండింటిని ఛేదించి నివారించు నుపాయము లోకమున కందజేయుటకు పరదేవత నన్నుపాధిగా నెంచుకొనుచున్నట్లున్నది. ఇదియే విఘ్ననివారక తత్త్వముకదా ? మంగళములను సమకూర్చు నధ్యాత్మతత్త్వమొకటి, యమంగళములను దొలగించు నధ్యాత్మతత్త్వ మింకొకటి యగుచు సోదర న్యాయమునకు సరిపోయియున్నవి. రెండవది మొదటి దానిని ప్రేరేపించుచున్నట్లు బాహ్యదృష్టికి దోచుచున్నందున శ్రేష్ఠమనబడెను. కాని, మొదటిదే ప్రేరేపించునదియై గురుపదమునకు సరిపోవును. అట్టి ప్రేరణమే నే నాశించుచు, దేవిని కల్పింప వేడుచుంటినిగదా !"

రాత్రి యెనిమిది గంటలగుసరికి లేఖకు లైదుగురు వ్రాతసామగ్రితో వచ్చిరి. శ్రీ రమణుడుకూడ విచ్చేసి నాయన వెనుక కూర్చుండెను. పూర్తిగావింప వలసిన స్తబకములు పది. వాటియం దిఱువదియైదు చొప్పున మొత్తము శ్లోకములు 250, లేదా పాదముల చొప్పున లెక్కించినచో 1,000 పాదములగును. ఒక్కొక్క స్తబక మొక్కొక్క వృత్త గమకముచే రచింపబడుచుండెను. వ్రాయువా రొక్కొక్క వృత్తము ప్రత్యేకముగా వ్రాయుట సులభము గావున వారి సౌలభ్యము నెంచి నాయన యైదుగుర కైదు వేర్వేఱు వృత్తములను వ్రాయుట ప్రారంభింపుడని పల్కి, యెవరి వృత్తపాదమును వారి కాఱువున చెప్పుచు, నావృత్తులచే నొకసారి యైదు స్తబకములను ధరించి పూరింపజొచ్చెను. అది యెంత కష్టమో పాఠకులూహించుకొనవచ్చును. కష్టమైనను కావ్యకంఠుడైనందుల కనర్గళమైన ఆశుకవితాధారచే లేఖకుల కూపిరి దీసకొనుటకైన నవకాశ మీయనంతటి వేగమున

శ్లోకపాదముల నల్లుచు, రెండువందల యావృత్తులకును రెండువందల నిముసములను గైకొని యర్ధరాత్రిగాక పూర్వ మతడు గ్రంథమును ముగించెను.

గ్రంథము ముగిసిన వెంటనే యక్కడ కూర్చుండిన యొకరిద్దరు ప్రేక్షకులు, లేఖకులు కలసి సాక్షాద్గణపతి యపురూప మహిమను జూపిన నాయనను మెచ్చుకొనుచుండగా, గాఢ సమాధినుండి శ్రీ రమణుడు మేల్కాంచి, బాహ్యదృష్టిని బొందుచున్నను నిజకర్తృత్వదృష్టి నాంతర్యమందు వీడని విధమున బల్కుచు "నాచే చెప్పబడినదంతయు వ్రాసికొంటిరా" యని ప్రశ్నించి, యక్కడ మాట్లాడు కొనువారందరికి గగుర్పాటు గలిగించెను. నాయన మాత్ర మాశ్చర్యబోక, తానను కొనినట్లు, శ్రీ రమణునియందు గుహేశతత్త్వము విశదమైన సంతోషముతో "చిత్తము. నేను దానినంతను శ్రద్ధగా గ్రహించి, చెప్పి, యిప్పుడే గ్రంథమును ముగించితి"నని ప్రత్యుత్తరమిచ్చెను. అది విని 'సరి, మంచి'దని యాశీర్వాద పూర్వకముగా గురుభగవానుడు పల్కి లేచెను. భగవానునకు నాయనతో సహ యందరు సాష్టాంగనమస్కారములను సల్పి యతనిని సాగనంపిన పిదప నెవరి తావులకు వారు పోయిరి.

శ్రీ రమణుడు స్వయముగా తుదినాటి రచనాకాలమునకు వచ్చి చూపిన ప్రబోధానుగ్రహమును గుఱించి నాయన యిట్లు స్మరించి గ్రంథాంత్యమున చేర్చెను:

శ్లో॥ "యదస్య మహతః కాలే
పారం యాతోఽస్మి కర్మణః।
అనుగ్రహోఽయ మాచార్య
రమణస్య మహాత్మనః॥"

(అర్థము:- గొప్పదైన నా యీ కర్మ నియమిత కాలములో ముగింపు బొందుటకు మహాత్ముడైన శ్రీ రమణ గురుని యనుగ్రహవిశేషము కారణము.)

రచన దీక్షాకాలమును గుఱించి యిట్లు పేర్కొనబడెను:

శ్లో॥ "ప్లవంగే కార్తికే కృష్ణే షష్ఠ్యాం మంగళవాసరే।
స్తోత్ర మే త త్సమారబ్ధం తటే శోణ ధరాభృతః॥"

శ్లో॥ "ఏకాదశ్యాం శుక్లపక్షే మార్గశీర్షే రవేర్దినే।
నీతం సమాప్తిం వింశత్యా దినానాం వ్రతనా మయా॥"

(అర్థము:- 20 దినములలో పూర్తి చేయవలెనను వ్రతముతో శోణగిరి దరి యందు నాచే ప్లవంగ సంవత్సర బహుళ షష్ఠి మంగళవారమునాడు ప్రారంభింపబడి, మార్గశిర శుద్ధ ఏకాదశి రవివారమునాడు స్తోత్రరచనము ముగింప బడెను - అనగా 26-11-1907 మొదలు 15-12-1907 అంత్యమువఱకు).

అట్లే గ్రంథములోని వివిధ విషయములను గుఱించియు కవి యిట్లు పేర్కొనెను:

శ్లో॥ "దర్శితం రమణస్యర్షే ర్యావద్వాక్యై ర్మితాక్షరైః।
యావచ్చ పితృపాదానాం విజ్ఞాత ముపదేశతః॥ 1
తంత్రేభ్యోఽవగతం యావత్ప్రాచామాచారశాసినాం।
యావత్పరమ పుణ్యాసు కులగోష్ఠీషు చ శ్రుతం॥ 2
విదితం వివిధం యావదితిహాస విలోకనాత్।
యావదప్యాత్మనా దృష్టం తపతా విపులం తపః॥ 3
అధికృత్య మహామాయాం భువనానా మధీశ్వరీం।
అత్ర స్తోత్రే ప్రసంగేషు సమస్తం తత్ప్రదర్శితం॥" 4

(అర్థము:- శ్రీ రమణమహర్షియొక్క మితాక్షర వాక్యములచే నెంతవఱకు దర్శనమయ్యెనో, పూజ్యుడైన తండ్రి యుపదేశమువలన నెంతవఱకు తెలియబడినదో, ప్రాచీనుల ఆచారశాసనములనుండి, తంత్రశాస్త్రమునుండి యెంత అవగతమయ్యెనో, పుణ్యపురుషుల సభలందెంత శ్రుతమయ్యెనో, భారతేతిహాసాది గ్రంథముల విలోకనము వలన వివిధ విషయము లెంత విదితమైనవో, విపుల తపస్సు వలన నెంతవఱకు చూడబడెనో భువనముల కధీశ్వరియైన మహామాయ నుద్దేశించి నేనీ స్తోత్రప్రసంగములం దా సమస్తమును బ్రదర్శించితిని.)

వివిధములైన యీ విషయములన్నియు శ్రీ రమణోపదేశమునకు వివిధ ముఖములుగా నున్నందున వీనిచే రమణుని తపోనిర్వచనసూత్రము సమగ్రముగా వ్యాఖ్యానమైనట్లగును. ఇట్టి శాస్త్రీయ విషయము లదివఱ కే కవిచేతను కావ్యాలంకారములచే రచింపబడనందున సాహిత్యప్రపంచమం దీ గ్రంథము రమణుని నవ్యమార్గోపదేశమువలె నూత్నమార్గమును జూపెను. ఇందలి యలంకారస్తుతు లుపదేశ రహస్యములకు తేజఃప్రాణముల నిచ్చినట్లు శోభించుచున్నవి. కావ్యము కాంతాసదృశమనియు, నుపదేశార్థమనియుగదా ప్రసిద్ధి! అందువలన కావ్య లక్షణములైన ఓజస్సు, ప్రసాదము, మాధుర్యము మొదలగువానిని కవి శబ్దార్థములచే పోషించి రసికజనులను రంజింపజేసెను. అట్లే స్తోత్రసాహిత్యరసములను మందులతో నిచ్చు మధురానుపానములవలె సమకూర్చి, వేదాంతయోగ తంత్రాదికటు విషయముల నాస్వాదయోగ్యము గావించెను. ఇట్లు భక్తుల కధిక బలమును, సాధుహృదయుల కాకర్షణను, పండితులకు ముదమును, సాధకులకు సందేహ నివారణమును, పారాయణ సల్పువారికి పవిత్ర ఫలమునిచ్చు నీ గ్రంథము తపస్సునకు ముఖ్యముగా నంగభూతమనదగును. కవి తన భారతి నీ గ్రంథమం దన్ని ముఖములచే తాండవమాడించి, యామె ప్రసాదమువలన అనర్గళముగా వెడలిన యీ గుణగణాలంకారము లామె ప్రతాపములే యని యొక శ్లోకముచే నిట్లు చెప్పెను:

శ్లో॥ "అత్రాపి గుణలేశా శ్చేదాలంకారిక సమ్మతాః।
సప్రతాప సరస్వత్యా నిర్గచ్ఛంత్యా అనర్గళం॥"

ఓం

## ఆఱవ ప్రకరణము

# ఉమాస్తుతి ఫలముగా కార్తికేయావతరణము

ఉమాసహస్రస్తుతి రచనమైన పిదప శిరస్సులోని తాపమును తగ్గించుకొనుటకు నాయన యుపాయ మాలోచించుచుండగా శ్రీ రమణుడు "అరుణగిరి శిఖరమున 'సప్తఝురి' యను స్థలమున్నది. అది శీతలసుఖమునిచ్చి శిరస్సునుండి యుష్ణమును తొలగించు"నని పల్కి స్వయముగా నాయన నా స్థలమందు చేర్చి వచ్చెను. వెళ్లునప్పుడు నాయన నుమాసహస్ర పఠనమెక్కడ చేయబడునని శిష్యు లడుగగా నాయన యిట్లు బదులిడెను: "నన్ను తొలుత తపఃప్రసాదమునకు ప్రేరేపించి యనుగ్రహించిన మరకతశ్యామాంబికాలయమం దీ గ్రంథమునకు శుద్ధప్రతిలేఖన మొనర్చుచు, నేదినము ప్రతిలేఖనమైన భాగము నా దినాంతమందు చదివి బోధించుచుందును. ఇది కొన్నాళ్లు పట్టవచ్చును కనుక మీ కిష్టమైనచో పైయూరివారి కక్కడ వసతి భోజనాది సదుపాయము లమర్చుటకు పాకలు, పందిళ్లు వేయించవలెను."

సప్తఝురియందు నాయన వారము దినములు గడపి యీశ్వరుని జటాజూటమందుండు దేవతాప్రసాదమును బొందినవానివలె వృద్ధిజెందిన తపోజ్వాలతోడను, నధిక వ్యక్తమైన దూరదృష్టి, దూరశ్రవణము, మాటలందు సత్యప్రకర్ష మొదలుగాగల సిద్ధులతోడను దిగివచ్చెను. అప్పటికి పాకలు, పందిళ్లు సిద్ధమై పొరుగూళ్ల నుండి వచ్చినవారిచే నిండియుండెను. అందువలన నొక శుభముహూర్తము నెంచి నాయన శ్రీ రమణునితో సహా మరకతశ్యామాంబ సన్నిధిబొంది, శుద్ధప్రతిలేఖన కార్యము నారంభించెను. ఆనాటినుండి మరకతాంబ శుల్పవదినములైనంతటి శోభ ప్రవేశించి, యామె కోవెల పునరుద్ధరణమైనట్లు ప్రకాశించెను. అందువలన నామె సంప్రీతురాలై, శుద్ధప్రతిలేఖన మారంభింపబడిననాడు ప్రత్యేకముగా నొక స్థలమందు కూర్చుండిన రమణ గణపతుల మధ్యనాసీనురాలై, చిరకాలవియోగమైన పుత్రుల నిరువుర నొక్కచో తిరుగ కలసికొనిన సంతోషమును ప్రకటించెను. దివ్యనేత్ర మప్పటికే తెరువబడిన ఫలముగా రమణునివలెనే నాయనయు సూక్ష్మదేవతారూపమును జాగ్రద్దృష్టి యందే చూడగల్గెను.

పఠనము ప్రారంభించుటకు పూర్వము శ్రోతల కుమాస్తుతి పరిచయము



శ్రీ రమణ గణపతులు - సోదరులవలె



నాయన భగవాన్ శ్రీ రమణ మహర్షితో

గావించుటకు నాయన చిన్న యుపన్యాసము నిచ్చిన పిదప గ్రంథపఠన ఫలమును గుఱించి యిట్లు గానము చేసెను:

శ్లో॥ "యది గాయ న్నిమం గ్రంథ ముత్తరే దాపదః కృతీ।
మహిమాస మహేశ్వర్యాః శీర్షం స్యాదున్నతంనమే॥
అయ మంబా పదప్రీతే రుద్గారో వాఙ్మయాకృతిః।
అర్థః కశ్చిదనేనా పి సతాం యది మయా జితం॥

(అర్థము:- పుణ్యాత్ముడైనవా డీ గ్రంథమును పఠించినచో నాపదలను దాటగలడు. ఆ విషయము పరమేశ్వరి యొక్క మహిమయే కాని నా గొప్పతనము గాదు. ఈ వాఙ్మయాకృతి యంబయొక్క పాదములందు నాకుగల ప్రీతి సంబంధమగు నుద్గారము. కనుక సత్పురుషుల కేమైన దీని వలన నుపకార మైనచో నా కది విజయమే.)

గ్రంథము పవిత్రమైనది; పఠించువాడు పవిత్రుడు; సాన్నిధ్యబలముచే ననుకూలతను కల్పించు శ్రీ రమణుడు పవిత్రుడు; జ్యోతిస్స్వరూపమైన అరుణగిరి భూమి నెక్కడ పొందుచున్నదో ఆ సంధిభాగమును సూచించు గిరి పాద ప్రదేశము పవిత్రము; ఆ సంధిభాగమందు గిరియొక్క చక్ర పీఠాకృతిని వెలసిన యీశ్వరానుగ్రహశక్తితో సంధానము జేయు మరకతాంబాలయము పవిత్రము; ఇంక శ్రోతల పుణ్యమున కేమి కొదువ? వారిలో కొందఱి కప్పుడే దివ్య స్వప్నములు వచ్చి, వారికి ప్రాప్తించుచున్న పుణ్యమును సూచింపజొచ్చెను.

ఒకనాడిట్లే నారాయణ ఘనపాఠి తన స్వప్నమందు దేవతను దర్శించి ప్రసాదమును బడసెను. ఆ దేవత యుమాసహస్రములోని కొన్ని శ్లోకములను వినగోరి యతని జ్ఞప్తియందున్నవి చదువ నాజ్ఞాపించెను. అప్పుడతడు తన స్వప్నమందొక శ్లోకమేదో చదువుచుండగా వాని నాపి "గణపతయే స్తన ఘటయోః' అను శ్లోకమును చదువుము, వినుదును. అత్యంత సరళమైన ఆ పద్యము కోటిమూల్యము కదా. అట్టి పద్యము లనేకములుండగా పఠించవేమి" యని పల్కి, యతడా పద్యము చదువులోపున మాయమయ్యెనట. ఆ పద్యముయొక్క పూర్తి పాఠమిది:

శ్లో॥ "గణపతయే స్తనఘటయోః।
పదకమలే సప్తలోక భక్తేభ్యః॥
అధరపుటే త్రిపురజితే।
దధాసి పీయూష మంబ త్వం॥"

(అర్థము:- ఓ యంబా! గణపతికొఱకు స్తనకుంభములందును, సకలలోక భక్తులకొఱకు పదకమలములందును, భర్తకొఱ కధరపుటమందును నీ వమృతము ధరింతువు.)

ఈ విధముగు ప్రీతిని ప్రత్యక్షముగను, పరోక్షముగను మరకతశ్యామలాంబ ప్రదర్శించుటనుబట్టి నాయన తన స్తుతిఫలము ప్రాప్తించునను వాశతో నుండగా తొలుత తనయందు సిద్ధమైయున్న గణపతి దైవాంశను స్థిరపరచిన నిదర్శనములు కొన్ని సంభవించెను. ఎట్లనగా, నొక భక్తు డొకనాడు ప్రాతఃకాలమందు స్నానమాచరించుకొని కోవెలలోని గణపతి విగ్రహముకడ దాక్షిణాత్యాచారము చొప్పున తల బాదుకొనుట శ్రీ రమణుడు చూచి ప్రక్కనున్న వారితో నిట్లు నుడివెను: ''చూచితిరా, దానియం దిప్పుడు గణపతి లేకున్నను వాడు దానికే మ్రొక్కును గదా! మానవ విగ్రహమును బొందియున్న దైవాంశ నింకొక మానవుడిట్లే గుర్తించుటకు శంకించును. రామకృష్ణాదుల యవతారముల నా కాలములోనున్న మానవ సంఘము సైతమిట్లే పోల్చుకొనలేక కొందఱు, పోల్చుకొనినవారు చెప్పినది విశ్వసించక కొందఱు సమీపమై యున్న దైవానుగ్రహమును బొందజాలక పోయిరి.'' శ్రీ రమణుని యీ వాక్యములను శిష్యుల ముఖమునుండి వినినప్పుడు నాయన ముఖము వికసించెను.

ఇంకొకనాడు గ్రంథము పఠింపబడు వేళకు నాయన దివ్యదృష్టియం దొక నాత్మపురుషుని సమాగమము గోచరించెను. అది ప్రక్కనున్నవారితో జెప్పి నాయన వాని రాకకు వేచియున్నట్లు కూర్చుండియుండగా నపరిచితుడైన వ్యక్తి యొకడు 'బ్రాహ్మణస్వామి యెక్కడ' యని ప్రశ్నించుచు వచ్చి, బ్రాహ్మణస్వామి దర్శనము గావించుకొని నమస్కరించిన పిమ్మట వచ్చిన విధముననే వెళ్లిపోవుట కాతురపడెను. అప్పుడు వెళ్ళిపోవుటకు వెనుదిరిగియున్న ఆ నాత్మ పురుషు నుద్దేశించి నాయన 'ఓయీ ! నీవు గణపతి యుపాసకుడవేనా? నీ గురువు వేదాచలుడేనా' యని ప్రశ్నించగా తన రహస్యమును దెలిసిన మహానుభావుని జూచుట కతడు దృష్టి బరపెను. ఆశ్చర్యము ! నాయన ముఖమును తిలకించినంతనే యతడు భక్త్యుద్రేక పూరితుడై 'తండ్రీ! నీ విక్కడనే యుంటివా !' యని పల్కుచు నాయన పాదములపై వ్రాలెను. అతని పల్కుల కందఱు నాశ్చర్యపడి యుండగా నత డుద్రేకవశమున తన కథ నిట్లు నాయనకు విన్నవించుకొనెను: ''తండ్రీ ! నా పేరు 'చిరుపాకం కొండయ్య'. మీరనినట్లు నేను గణపతి నుపాసించుచు, నాజ్యహోమ పురస్సరముగా నిత్యము మంత్రజపము సల్పుటకు బూనితిని. వేదాచలునే నేను గురువుగను, దైవముగను భావించి యుపాసించుచుంటిని. గత వార మొక విచిత్రమయ్యెను. ఆజ్యహోమముచే ప్రజ్వరిల్లిన జ్వాలయం దొక దివ్యాకృతి నాకు స్పష్టముగా గోచరించి నా హృదయము నత్తుకొనెను. మఱియు నా యుపాసనదైవమా యాకృతితో వెలసి యిప్పుడెక్కడైన నుండియుండునని బుద్ధియందు గాఢముగా దోచి, యెంత దూరమైన తిరిగి యతనిని దర్శించుటకు ప్రేరణమయ్యెను. ఇక్కడ బ్రాహ్మణ స్వామి దివ్యపురుషుడని యదివఱ కాలకించియు దర్శించుకొనని లోప

మప్పుడు లేచి, నా కగపడిన దివ్యాకృతి యతడే గావచ్చునని నే నాదియం దీ క్షేత్రమునకు వచ్చిన ఫలముగా మీయందా యాకృతిని గాంచి ధన్యుడనైతిని.''

అతడటుపిదప తాజూచిన యాకృతిగల పురుషుడు గణపతి నామ ధేయుడైనందులకు సంతసించెను. పిమ్మట తన దివ్య పురుషునకు బ్రాహ్మణ స్వామి గురువైన వార్త విని స్వామియైన శ్రీ రమణునకు మిగుల భక్తిపూర్వకముగా నమస్కరించెను. తరువాత చమత్కారముగా నతడు నాయన వైపు దిరిగి 'మీరు వ్యక్తజ్వాల యైనచో శ్రీ రమణుడా జ్వాలవలన వ్యక్తమగు నగ్నితత్త్వమై యుండ నోపు నని యెల్లరకు సంతోషమును గూర్చెను. నాటి నుండి యతడు రమణ గణపతులకు గాఢభక్తుడై, యరుణాచలమనెడి యవ్యక్త తేజోరూపము వ్యక్తమైనప్పు డగ్ని, జ్వాలయని రెండుగా దోచుచు, తిరుపతి వేంకటాచలము, వేదాచలము అని రెండచలములుగా వెలసెననియు, వాని యంశలు రమణ గణపతులుగా మూర్తీభవించెననియు విశ్వసించి, యతని విశ్వాసముచే నితరుల మైకమును తొలగించుటకు యత్నించువాడు.

ఈ కొంతయ్య యాగమనాది విషయములను ముందుగా తెలిసికొనినట్లే నాయన యింకొకనాడు వేలూరు శిష్యవర్గములోని 'అధాము' అని ముద్దుపేరుగల కలమూరు వేంకటరామయ్య యొక రహస్యము నెఱిగించుటకు తనకడకు వచ్చుచుండగా, వాని రాకను ముందుగనే దివ్యదృష్టిని జూచి, యతడు చెప్పబోవు రహస్యమును గూడ ముందుగా తెలిసికొనినవానివలె నాయన చెప్పి వాని నాశ్చర్యమున ముంచి పంపివేసెను.

ఉమాసహస్రకృతి ఫలమిట్లు దాని ప్రతిలేఖన పఠన కాలమున నాయన యొక్క దివ్యాంశానుభవము విచ్చుటకు తొలుత వ్యక్తమై, యటుపిదప నొకనాటి వేకువజామున శ్రీ రమణుని దివ్యాంశానుభవము నద్భుత విధమున నెల్లరకు వ్యక్తముగావించెను. ఆ వేకువజామున భక్తులందరు నాయన చెప్పు ప్రార్థన నమకరించుటకు శ్రీ రమణ సన్నిధిని కూర్చుండి యుండిరి. ప్రార్థన ముపక్ర మింపబడు సమయమునకు హఠాత్తుగా దారుతరమైన జ్యోతియొకటి రమణుని చుట్టునున్న యాకాశమునుండి యోజస్సువలె వ్యక్తమై, దానిచే రమణుడు దివ్యసుందరమూర్తివలె భాసించెను. ఇంకొక్క క్షణమునకా కాంతినుండి యాఱు నక్షత్రరూపములవంటి తేజోగోళము లావిర్భవించి, మహర్షి ఫాలమును చుంబించున ట్లా యాఱును తాకిన పిదప కొంచెము దూరమై మిగుల తాకుచు నిట్లాఱుసార్లు చేసి, యా తేజస్సునందు లీనమయ్యెను. తరువాత తేజస్సాకసమందుగాక మహర్షియం దంతర్థానమయ్యెను.

ఈ యసాధారణ దర్శనమున కందరు నాశ్చర్యచకితులై యుండగా, నాయన తన దివ్యదృష్టిచే కార్తికేయాంశము సంపూర్ణవ్యక్తమై యవతరించినట్లు గ్రహించి,

తన నోములన్నియు ఫలించినట్లు సంతోషించి, షణ్ముఖ తత్త్వార్థమును బ్రదర్శింపుచు నవతరించిన తేజస్సుచే భగవన్నామసార్థకుడైన ఆ రమణగురు దైవమునకు సాష్టాంగ ప్రణామములు సల్పెను. ఎమ్మట దివ్యావేశమును బొందిన ట్లాశువున గంభీరార్థములతో గూడిన * శ్లోకాష్టకముచే నాయన శ్రీ రమణుని స్తుతించి, వెంటనే దాని నొక కాగితముపై వ్రాసి, రమణుని హస్తమందుంచి నమస్కరించెను. అటుతరువాత నాయన చిఱునవ్వుముఖముతో మహర్షిని సమీపించి "ఉమాస్తుతి ఫలించినది. నేను ధన్యుడనైతిని. నాచే గుర్తింపబడినది సత్యమేనా" యని ప్రశ్నించెను. శ్రీ రమణు డేమియు బదులిడక సమాధిగ్రస్తు డయ్యెను. మౌన మర్ధాంగీకారముగదా ! అందువలన కార్తికేయతత్త్వమేది తనయందు వ్యక్తమయ్యెనో, దానిచే తన దైవాంశావతరణమును రమణు డొప్పుకొని నట్లయ్యెను. కాని, స్వభావసిద్ధములై యతనియందు జూడదగు మౌనము, గుప్తత్వము మొదలగు లక్షణములనుబట్టి యతడితరులను లోకకార్యమందు ప్రేరేపించుట కవతరించిన వ్యక్తియని వాసిష్ఠుడు గ్రహించెను. మఱియు తన యందు మాటిమాటికి చిరకాలమునుండి వేధించిన రెండు కోర్కెలలో తపస్సును గుఱించిన కోర్కెను రమణు డుపదేశ నెపమున దీర్చినట్లే అస్త్రవిద్యకు జెందిన కోర్కెనుగూడ తీర్చి లోకము నుద్ధరించునని వాసిష్ఠుడు విశ్వసించెను.

శ్రీ రమణు డొసగిన తత్త్వోపదేశమునకు కవచమై, బాహ్యాంతర తమస్సులను, తాపములనుగూడ ఛేదించుటయం 'దహం' మూలజ్ఞానమువలెనే పటుతరమై, తత్త్వమును సాధింపజాలని సాధారణ మానవకోటికి సాధనభూతమగు నస్త్ర మంత్రమును వాసిష్ఠుడు వాంఛించెను. ఎట్టి యస్త్రవిద్యను లోకమందు ప్రతి పాదించుటకు పూర్వము పరశురామ రూపమున కార్తికేయతత్త్వ మవతరించెనో, ఏది ఋషికులములకు గుప్తవిద్యయై మంగళములను చేకూర్చు మంత్రములలో కెల్ల మేటి మంత్రమై ప్రకాశించెనో, దేని నిప్పటి పండితలోకము తెలియక దుర్గతిని బొందిరో అట్టి కవచమంత్రమును లోకమున కర్పించవలెనని వాసిష్ఠుని వాంఛ

శ్రీ రమణునియం దుమాస్తుతి ఫలముగా నభివ్యక్తమైన కార్తికేయాంశ తన వాంఛను దీర్చుట కస్త్రవిద్యా దర్శనము గావించునని వాసిష్ఠుడు నమ్మి యున్నను, దాని కొఱకు ప్రత్యేక తపోదీక్ష బూనవలసి యుండునని భావించి, యా దీక్షయందు మంత్రజప స్తోత్రారాధన మార్గమును బూనవలెనా లేక లోకసంబంధమగు నిట్టి వాంఛయు సిద్ధించుటకు శ్రీ రమణు డుపదేశించిన 'అహం' మూలాన్వేషణమే చాలునా యను సందేహమును రమణభగవంతు నడిగి

---

* "యానాయాత్రన, కేకినాం కులపతిః ..." అని ప్రారంభించి రమణగీతయందు ముద్రితమైన శ్లోకాష్టక మిదియే.

వాసిష్ఠ దానాడే తీర్చుకొనదలచియు గ్రంథపఠనము ముగియు లోపున క్రొత్త ప్రేరణము లేవైన సంభవించునేమోయని వేచి యూరకుండెను.

ఇట్లుండ కార్తికేయాంశ శ్రీ రమణునియం దభివ్యక్తమైన నాటి రాత్రియే వేలూరునుండి కల్యాణరాముడు వ్రాసిన యొక లేఖ చేరి, దానియం దతడు తనకు గలిగిన నొక యద్భుతానుభవమును పేర్కొని నాయనయందు క్రొత్త స్ఫూర్తులను గలిగించగా, అతనిని వెంటనే నాయన వేలూరు నుండి రప్పించెను. రమణ గణపతు లిద్దరు వినుచుండగా అతడు తన యనుభవము నిట్లు వర్ణించెను: " 'అర్ని' గ్రామములో మా యత్తగారి యప్ప చనిపోయిన వార్త విని నేను పదియవ రోజున కా యూరు వెళ్లితిని. ప్రొద్దుట తిలోదకముల యర్పణ ముగిసిన పిదప నాకొక యోచన తట్టెను. భోజనము లపరాహ్ణమందగునని యెంచి, యాలోపున పడైవీడు క్షేత్రము బోయి, రేణుకను దర్శించి రావలెనని నిశ్చయించుకొని చప్పచప్పన కాలినడకను గంటన్నరలో వెళ్లితిని. కాని, నే వెళ్లిన సమయమునకు కోవెల మూసియుండెను. అందువలన నే నాశాభంగముతో వెనుకకు మఱలితిని. కాని, పెద్ద చెరువుగట్టు నొద్దకు వచ్చుసరికి నాకా గట్టున నున్న యొక పొదలో నద్భుత తేజస్సుతో గూడిన శిరస్సుగపడి నన్నాకర్షించెను. మొండెము లేని యా శిరస్సు 'అనీ బొసెంటు' శిరస్సును బోలియున్నను, నాకా తేజోజ్వాలతో గూడిన కృత్తశిరస్సు సాక్షాత్తుగా రేణుకా శిరస్సని వెంటనే స్ఫురించెను. కోవెలలో దర్శనము గాకున్నను. నేనామె నిజరూపదర్శనమును బొందిన సంతోషముతో సాష్టాంగనమస్కార మర్పించుకొంటిని. సుమారైదు నిముసములవఱకు నా కా దృశ్యమట్లే యగపడిన పిదప నదృశ్యమయ్యెను. నేనా దృశ్యమును గుఱించి అర్నిగ్రామము చేరిన పిదప పెద్దలతో చెప్పగా వారెగతాళి చేసిరి. కాని, నా దేహమందా దర్శనమైనప్పటినుండి రేణుక గుప్తమైయున్నట్లనుభవమగుచున్నది."

ఈ కథ విని శ్రీ రమణుడు చాల సంతోషమును జూపెను. అంతేగాక, రేణుకాతత్త్వము మంత్రశాస్త్రమందెట్లు చెప్పబడెనో విన కుతూహలము జూపి నాయన చెప్పిన దాలకించుచు, నాయన బుద్ధి నా తత్త్వవిమర్శయందు చాలసేపు కొనుపుటకు నాయనయే యాశ్చర్యపడెను. అప్పుడు నాయన కా దేవతవలన తా నపేక్షించు స్తోత్రకర్మఫలము సంపూర్ణము గావచ్చునని స్ఫురించెను. కాని, రమణోపదేశ మా యనుగ్రహము నీయగలదా లేదా, ఉమాస్తుతిలోని నిర్ణయముల కపవాదము తప్పునా లేదాయను బాధ మిగిలిపోయెను. కనుకనే మఱియొక వారములో గ్రంథపఠనము ముగిసినతోడనే యెక్కడివా రక్కడకు వెళ్లిపోవుచు, రమణుడుకూడ విరూపాక్ష గుహాభిముఖుడై యుండగా నాయన శ్రీ రమణుని సమీపించి యిట్లడిగెను: "నా కెక్కడికైన యాత్రపై బోయి, తపస్సు సల్పవలెనని బుద్ధి పుట్టుచున్నది. ఉత్తమమగు స్వస్వరూపప్రాప్తి 'కోహం' మూలాన్వేషణ మొక్కటియే నిస్సందేహమగు

మార్గమని రూఢియయ్యెను. కాని, నాయందు గాఢమైయున్న లోకహిత లక్ష్యసాధనకిది యుపకరించునా లేక మంత్రధ్యానమునట్టి లక్ష్యము కొఱ కాచరించవలెనా ? నా యీ సందేహమును నివారింప వేడెదను. ఇంతకు నా లక్ష్యము మంచిదగునో కాదో, ఓ భగవాన్! మీరే చెప్పవలెను.''

అప్పుడు శ్రీ రమణుడు కొంచెమునే పంతర్దృష్టితో నాయన వేసిన ప్రశ్నల నాలోచించి, సందేహనివారణమగునట్లుపన్యసించెను. 'అహం' మూలా న్వేషణము సకలార్థ సాధకమగు నుపాయమని నొక్కి చెప్పి, దానినే యెల్లప్పుడు లక్ష్యముగాగొని యాచరించుట కతడు నాయనను ప్రేరేపించెను. దానిని సిద్ధింపజేయు భగవంతు డితర కార్యములను సిద్ధింపజేయుటయందును సమర్థుడే యనియు, నతడు భూత భవిష్యత్తులను నడిపించు ప్రభువై, శక్తిమంతుడగుట వలన కుశలకారణము లను సమయము ననుసరించి నిస్సందేహముగా కల్పించుననియు నచ్చజెప్పి తద్భారమతని శక్తిపై విడువగోరెను. మఱియు, హృదయనిష్ఠ వలన మంగళమగునని హెచ్చరించి కార్య మీశ్వరున కర్పించిన బుద్ధితో తన్నిష్ఠ నాచరించి చూడ నాజ్ఞాపించెను. పిమ్మట నాయన తపోయాత్ర కనుజ్ఞనిచ్చుచు, వాసుదేవశాస్త్రిని వెంటనిడుకొని పొమ్మనెను. ఒకరిని తోడు తీసికొని వెళ్లుటకు నాయన తలపెట్టకున్నను, గుర్వాజ్ఞ ననుసరించి వాసుదేవశాస్త్రి తోడున తిరువణ్ణామలై విడిచి, యన్ని దిక్కులకు త్రోవ రైలుమార్గ కూడలియైన చెన్నపురము తొలుత చేరెను.

శ్రీ రమణుని ప్రత్యుత్తరము ఉమాసహస్రమను గ్రంథమున శాస్త్రచర్చచే స్థిరపరుపబడిన రమణోపదేశ సార్థకమున కనుబంధము గావచ్చునను తలపుతో నాయన వాటికి సంగ్రహముగా శ్లోకరూపమునిచ్చి వాసుదేవశాస్త్రి యొద్ద దాచెను. ఆ శ్లోకము లిట్లుండెను.:

శ్లో॥ ''న్యస్యతాం భరః సకలజిత్వరే।
కార్యసత్కరే జగదధీశ్వరే॥ 1
నిత్యయాధియా విహితయా స్వయం।
స్థీయతాం త్వయా హృది పరాత్పరే॥ 2
భావినిర్ణయ ప్రభు రసౌ పుమాన్।
కార్యసాధనే భవతి శక్తిమాన్॥ 3
భూతభవ్యకృ ద్భువన భూపతిః।
కారయే దయం కుశలకారిణః॥ 4
సాధ్య ముత్తమం సమయత శ్చరేత్।
మాస్తు సంశయ స్తవ విదాంవరే॥ 5
హార్దనిష్ఠయా తవ తు శం భవేత్।
కార్య మర్పితం భవతు శంభవే॥'' 6

(అర్థము :- సకల లోకములను జయించి, సత్కార్యములను జేయు జగదీశ్వరిపై భారముంచుము. హృదయమందు నిశ్చలుడవై, పరమేశ్వరునియం దుంచిన బుద్ధితో నీవు స్థిరముగా నుండుము. భావినిర్ణయమును జేయసమర్థుడైన అతడు కార్యసాధనమందును శక్తిమంతుడే. భూతభవిష్యత్తులను నడపించు భువనభూపతి కుశలకారణములను గూడ కల్పించును. సాధ్యమైన ఉత్తమ కార్యమును సమయమునను సరించి జరిపించును. ఓ విద్వన్మణీ! నీ సంశయము వీడుము. హృదయనిష్ఠవలన నీకు మంగళమగును. కార్యమీశ్వరున కర్పింపుము.)

ఈ ప్రశ్నోత్తరములకు పూర్వాపరసంబంధ మెఱుగని కొందఱు నూత్న మార్గమున నుపదేశింపబడిన నాయన కా మార్గావలంబనమందు తన మొదటి సంకల్పము లద్దువచ్చెననియు మఱికొందరు నాయన యిహకామ్యములకు, జపకాంక్షకు మందలింపబడెననియు భావించిరి. వీరి భావము లసందర్భములయ్యు ప్రచారము బొందెను. కాని, యుమాసహస్రస్తుతి నాయనయం దింకను కల్పించిన యసాధారణ ఫలములు మున్ముందు చరిత్రనుండి విదితమైనప్పుడీ ప్రచారకుల యభిప్రాయము లసంగతములని పాఠకులకు తెలియగలదు. ఇహసంబంధమగు కోర్కె యేదేని ఫలించుటకు మంత్రసాధనమువలె 'అహం' మూలాన్వేషణము మార్గము కాగలదా ? లేక దాని నాత్మనిష్ఠకొఱకు మాత్రమే వినియోగంచవలెనా అనునది నాయన సందేహము. అది సకలార్థములకు సాధకమని రమణుడు చెప్పి, నాయనయొక్క కామ్య ముత్కృష్టమైనదని గ్రహించినందున దాని నీశ్వరుడు సమయము ననుసరించి సిద్ధింపజేయుననియు, హృదయనిష్ఠవలన మంగళమగు ననియు హెచ్చరించెనుగాని నిరసించలేదు.

ఇట్టి మహోన్నతాశయసిద్ధికొఱకు రచింపబడిన ఉమాసహస్రమను స్తుతియొక్క శుద్ధప్రతిలేఖన పఠములు జనవరి (1908) లో ప్రారంభింపబడి మార్చిలో నంతమయ్యెను. అటుపిమ్మట గుర్వనుగ్రహమున నాయన పొందిన అస్త్రవిద్యాప్రసాదము నింకొక ఖండములో ముచ్చటింతము.

# V. రేణుకానుగ్రహ ఖండము


—:అధ్యాయములు:—

1. గురువి హస్తదీక్ష
2. తిమిరములను ఖండించి, యుమాస్తుతిని రేణుక స్వయముగా స్వీకరించుట
3. రేణుకయొక్క నిజకథాస్ఫూర్తి
4. రేణుక దర్శనమిచ్చి, యన్త్రవిద్యాదర్శన మిచ్చుట
5. పాప పరిహారము
6. సంహారము, ఉమాస్తుతి పునరుద్భవము
7. వేలూరువానముంటమ్మై, ప్రచారక జీవితమున కుపోద్ఘాతము ప్రాప్తించుట

ఓం

మొదటి ప్రకరణము

# గురుని హస్తదీక్ష

స్వగురుని యాజ్ఞచొప్పున వాసిష్ఠుడు వాసుదేవశాస్త్రిని వెంటనిడికొని యరుణాచలమునుండి యాత్రార్థమై బయలుదేరి చెన్నపట్టణమువఱకు వచ్చిన పిదప నేదిక్కునకు బోవుటయో వాసుదేవశాస్త్రి నెంచుమనెను. కారణము వానికి చెప్పకున్నను, వానియందు రమణుడొక ప్రబోధము నుంచెనని వాసిష్ఠుడు న్మ్మెను. ఆచార్యుడు తనయందంత యభిమానముంచి యెంచుమనినందుల కతడు పొంగిపోయి, యొక్కక్షణ మాలోచించి యిట్లుడివెను: "నా బుద్ధియందు 'తిరువొత్తియూ'రను క్షేత్రము మన మాదియందు దర్శించుట మంచిదనిపించును. మీకది తపస్సున కనుకూలముగానిచో నింకొక క్షేత్రమును తరువాత నాలోచించు కొందము. దీని 'కాదిపుర'మనియు పేరున్నందున దక్షిణయాత్రల కిది ప్రారంభమును సూచించునట్లున్నది. చెన్నపురమున కిది యాఱు మైళ్లదూరమున నుండి యాంధ్రులకు, తమిళులకు సంధిని గూర్చుదానివలె నుండును."

ఆదిపురమదివఱకు వాసిష్ఠుడు చూడనందున వాసుదేవశాస్త్రి నిర్ణయమునకు బద్ధుడై యతని వెంట వెళ్లెను. అతని కా యూరు పరిచయమగుటవలన వేదపాఠశాలయం దాచార్యునకు బస కల్పించిన పిదప పురము జూపుటకు దారి తీసెను. అప్పుడు మధ్యాహ్నము మూడు గంటలవేళ దాటి యున్నను, చైత్రమాసపు టెండ వాసిష్ఠునకు తీవ్రముగా దోచి, దక్షిణ వీధిలో కొంతమేర నడచిన పిమ్మట నతడు విశ్రాంతిగోరెను. వా రించుమించుగా వీధికొసకు చేరియుండిరి. అప్పు డాచార్యు నక్కడకు సమీపముననున్న యొక తోటలోనికి తీసికొనివెళ్లగా, చల్లని చెట్లనీడను సాయంత్ర మాఱు గంటలవఱకు విశ్రమించిన పిదప వాసిష్ఠు డక్కడనే స్నానము జేసి, చల్లబడి, క్షేత్రాలయమును దర్శించుటకు శిష్యుని వెంట చనెను. తోటనుండి వచ్చునప్పుడా దక్షిణ వీధికి చేరి, యశ్రద్ధచేయబడియున్న వినాయ కాలయ మొకటి యుండుట గమనించి, దానిని తపస్థలముగా నిర్మించుకొనినచో చల్లదనము, ప్రశాంతియుగూడ దక్కవచ్చునని తలచెను.

పిదప వారు క్షేత్రాలయము ప్రవేశించిరి. అది త్రిపురసుందరీ యాలయము. వాసిష్ఠుడు దేవికి నమస్కరించిన పిదప ఉమాసహస్రములోని యొక శ్లోకముతో నామెను స్తుతించెను. ఆ స్తుతి బిగ్గరగా చేయబడినందున, చెంతను జపమాల త్రిప్పుచున్న యొక విద్యార్థి చెవిని బడెను. అతని పేరు కపాలిశాస్త్రి. అతడు పంచకావ్యములను ముగించి, యింగ్లీషును బడికి పోకుండ స్వయముగా నభ్యసించుచున్న పండితుడు, మేధాసంపన్నుడేగాక మంత్రదీక్షా పరుడు. వాసిష్ఠుని శ్లోకమాధుర్యమును కత డాకర్షింపబడి "తమ రెవరైయుండు"

రని ప్రశ్నించెను. అప్పుడు వాసుదేవశాస్త్రి యిచ్చిన ప్రత్యుత్తరమును వినినతోడనే కపాలిశాస్త్రి జపమాలను దించి, 'తమరేనా కావ్యకంఠ వాసిష్ఠ శ్రీ గణపతిమునులు. ఏమి నా యదృష్ట' మనుచు సాష్టాంగ ప్రణామము లర్పించి లేచి వాసిష్ఠుని వెంటబడెను. అతడు క్షేత్రపురాణము నెఱిగించుచు, పూర్వమిది కాళికాక్షేత్రమై యుండెనని చెప్పి, యామె కోపవతియై ప్రవేశించిన కూపమును జూపుటకు చెంతనున్న యొక యాలయములోనికి తీసికొనివెళ్లెను. అక్కడ గాఢాంధకారముచే గప్పబడిన యొక చిన్న గదిలో కాళిని దర్శించినంతనే వాసిష్ఠుని ముఖమునుండి యీ దిగువ శ్లోకము వెడలెను:

శ్లో॥ "కూపే విభాసి కిల కోపవతి త్రియామా।
చారిణ్య శేష జగదీశ్వరి కాళి భద్రే।
విభ్రాజదాది పురవాసిని దాస మాప।
త్కూపా దుదంచయ పదాంబుజ భక్తమేతమ్॥"

(అర్థము:- ఓ కోపవతీ, త్రియామాచారిణీ, అశేష జగదీశ్వరీ, కాళీ, భద్రా, విభ్రాజదాది పురవాసినీ! నీవు కూపములో ప్రకాశించుచుంటివట! నీ పాదభక్తుడైన యీ దాసుని యాపత్కూపమునుండి బయటికి తీయుము.)

ఆ రాత్రియే నారాయణ ఘనపాఠి, అధాములు వాసిష్ఠుడు తిరువొత్తియూరు చేరిన వార్త నెట్లో తెలిసికొని వచ్చి యాచార్యుని చేరిరి. ఉమాసహస్రము నాచార్యు డాధాము చేతికిచ్చి, భద్రముగా నుంచుటకై వేలూరు పంపివేసెను. ఆదిపురములో పూనదలచిన దీక్షను గుఱించి కూడ వానిద్వారా విశాలాక్షమ్మకు కబురంపెను. ఘనపాఠిమాత్ర మాదిపురమం దుండిపోయెను. వాసిష్ఠ శిష్యులలో నొకడుగా గణింపబడిన కపాలిశాస్త్రిచే వాసిష్ఠుని రాక నలుమూలల వ్యాప్తమైన కారణమున చెన్నపుర, ఆదిపుర పండితవర్గములు, పూర్వ మష్టావధాన సమయమం దేర్పడిన స్నేహితులు, శిష్యులు మొదలగువారందరు వాసిష్ఠుని చుట్టుముట్టిరి. వాసిష్ఠునియం దధికమైన ఓజస్సును జూచి వారందరు సంతోషించిరి. వానప్రస్థుడై, మునియైన వాసిష్ఠుని యష్టావధానములు చేయుమనుట దోసమని వారెఱిగి, పూర్వము చేయబడిన యవధాన ప్రసంగములతోడనో, వేదాంత ప్రసంగముల తోడనో కాలక్షేపము చేయుచుండగా అవధానము నెన్నడు చూడని కపాలి కొక్క సమస్యాపూరణమైన చూడవలెనను కోర్కె జనించి నాయన నడిగెను. అట్టి క్రీడను వాసిష్ఠుడు నాలుగేళ్ల నుండి విడచినను, శిష్యునియందున్న వాత్సల్యముచే 'సరే, చూపెదనులే' యనెను. ఆ మాట యనుట తడవుగా పరిచితుడైన ఆంధ్ర విద్వాంసుడొకడు ముందునకు వచ్చి 'మీరు చూపెదననిన వ్యస్తాక్షరి విద్య చేసి యిప్పుడే చూపవలె'నని పల్కి, పాఠశాలనుండి యొక పలకను, బలపమును తెచ్చి, పలకపై యేబదియారు గళ్లను వాళ్లు వరుసలుగా గీచి, వాటిలో వరుస సంఖ్యలను వేసెను. పిదప ఆ పలక నత డాచార్యుని చేత నుంచి 'కవిత్వము నుద్దేశించి వసంతతిలకావృత్తము

కూర్చవలె'నని కోరెను. ఆ మరుక్షణమునుండి యతడు నిర్దేశించిన గడిలో వాసిష్ఠు డక్షరములను పూరించుచు, నతడెంత త్వరితముగా జూపిన నంత త్వరితముగను నింపి గళ్లన్నియు పూరించెను. ఆలోచించుకొనుట కీయబడిన క్షణము వ్యవధిలో వాసిష్ఠుడు శ్లోకమును మనస్సులో కూర్చుకొనుటయేగాక, అక్షరసంఖ్యనుగూడ పేర్చుకొనిన ప్రజ్ఞకు కపాలిశాస్త్రి యాశ్చర్యచకితుడయ్యెను. ఇతరులుగూడ నింత తూర్ణ కవిత్వము నెచ్చటను కని విని యెఱుగమనిరి. పై శ్లోక పూరణములో 'నూత్న' అను పదము వచ్చినచోట మాత్ర మొక్క యరక్షణము వాసిష్ఠుడాగి పూరించెను. ఈ పదమే శ్లోకము కంతకు శోభ తెచ్చెను. పూరించిన శ్లోక మిట్లున్నది:

శ్లో॥ ''ప్రీతిం దదాతి విపులాం శ్రియ మాతనోతి।
నిర్మాతి నూత్న సమయం దురితం ధునోతి।
ఆర్ద్రీకరోతి హృదయాన్యపి దేవతానాం।
కస్మై శుభాయ న భవేత్కవితా విదోషా॥''

(అర్థము:- దోషము లేని కవిత్వము ప్రీతిని గలిగించును, విపుల సంపదల నిచ్చును, నూత్న కాలమును నిర్మించును, పాపములను తొలగించును, దేవతాహృదయములను గూడ కరగించును. ఏ మంగళముల నీయజాలదు ?)

యశస్సుకొఱకు, పురుషార్థముకొఱకు కవిత్వ ప్రయోజనము చెప్పబడును. కాని, యుమాసహస్ర నిర్మాణకర్త దాని ప్రయోజనము నూత్నకాల నిర్మాణము కొఱకని దృఢముగా చెప్పుచుండెను. 'రాజా కాలస్య కారణ'మ్మను నార్యోక్తి యున్నది. కాని, రాజులు లేని యీ కాలమందు 'కవిః కాలస్య కారణ'మ్మని వాసిష్ఠుని యభిమతము. అభిమతమే కాదు, తన స్తుతి కావ్యరచనచే వాసిష్ఠుడు స్పష్టముగా నిరూపించి చూపెనని చెప్పవచ్చును. 'ఆర్ద్రీకరోతి హృదయాన్యపి దేవతానాం' అను విషయముగూడ నతిశయోక్తిగాదని యతడు మఱియొక గడియకే నిరూపించెను.

ఎట్లనగా, ఈ శ్లోకపూరణము ముగిసిన కొద్ది నిముసములకు వేంకటరాయ శాస్త్రి మొదలగు విశ్రుత పండితులు వాసిష్ఠ దర్శనమునకై వచ్చి, కొన్ని సంశయముల నడుగదలచి యుండగా, వారడుగకుండగనే వారి సంశయములను వాసిష్ఠుడు తీర్చి, తనయందు వృద్ధియైన చిత్తవేదిత్వ ప్రజ్ఞను జూపుపరికి వారు వెలవెలపోయిరి. పిమ్మట సాయంత్రమగువఱకు విద్వద్గోష్ఠిని ప్రసంగించుకొనిన తరువాత పండితు లందరు కూడబల్కుకొని వాసిష్ఠు నిట్లు కోరిరి: ''మీ రిక్కడ తపోదీక్ష పూనుదురని వింటిమి. దీక్షాకాలములో మేము వచ్చి ప్రసంగించుట మీ దీక్షకు భంగమగును. కనుక మీ వాగమృతము నీనాడే క్రోలదలచి, బాలా మంత్ర తత్త్వమును గుఱించి మిమ్ముల నుపన్యసింప వేడుదుము. ప్రముఖ పండితులందరు తలవని తలంపుగా నిప్పుడిక్కడ సమావేశమై మీ విజ్ఞానవాక్కులను విన కుతూహలముతో నున్నారు.'' వాసిష్ఠు డంగీకారమును సూచించినంతనే చిన్న వేదిక నిర్మింపబడెను.

వాసిష్ఠుడు వేదికనెక్కి బాలాదేవికిగల మూడు మంత్రబీజములను గుఱించి సంస్కృతమున నుపన్యసించుచు, కొంతతడవైన పిదప భక్త్యావేశమున బీజార్థప్రభావమును ఛందోబద్ధముగా స్తుతింపదొడగెను. గంభీరార్థములతో గూడిన శ్లోకములచే కొంతతడవు స్తుతించిన పిమ్మట హఠాత్తుగా కూర్చుండి, నిమీలితలోచనుడై ధ్యానమున కొద్ది నిముసములు గడపెను. భక్తిస్పందములతో నిండిన సభ్యుల హృదయములందు వాసిష్ఠుడు చిత్రించిన బాలాదేవి రూప మింతవఱకు హత్తుకొని యున్నందున వారి కర్ణములం దింకను వాసిష్ఠుడు స్తుతించుచున్నట్లు నాదమగుచు, నేత్రములందు కూర్చుండిన వాసిష్ఠుడే బాలాదేవి యనినట్లును దృశ్యమగుట యెల్లరు నొకే విధమున ననుభవించి, యది నిజమో లేక భ్రాంతియో గూడ చెప్ప శక్యముగాని స్థితిలో వాసిష్ఠుడు కన్నులు విచ్చువఱకు మునిగియుండిరి. ఇట్టి మహిమ నానాడు చవిచూచిన పండితు లెవరును వాసిష్ఠుని తపఃప్రభావమును శంకించలేదు సరికదా, వారతనిని ప్రత్యక్ష గణపతిగా భావించి సేవించిరి. అట్లయినను, ఈశ్వరు డతనియందు నిజస్వరూప స్మృతి నర్పి, జిజ్ఞాస గల జీవుడాస్మృతి కొఱకెన్ని యంతరముల నెట్లు దాటవలెనో జూపుట కతని నాదర్శపాత్రగా సంకల్పించెను. ఆ కారణముచేత నాటి రాత్రి తొలగిన తెర మఱల మూతబడుటయు, మఱల నతడు మఱునాటినుండి తపస్సాధన తాపత్రయమందు జిక్కుకొని తపస్సులాన్వేషణకు తిరుగుటయు సంభవించెను.

తొలినాడు దక్షిణ వీధిలో నూరికి చివరి భాగమం దశ్రద్ధ చేయబడియున్న విఘ్నేశ్వరాలయ మొక్కటియే యుపవనముతో గూడి తపస్సులయిన కనుకూలమై యొప్పినట్లు దోచినందున వాసిష్ఠుడందు ప్రవేశించి, ద్రవాహారమును రెండుపూట లందు గైకొనుచు పదునెనిమిది దినముల దీక్షను బూన నిశ్చయించెను. 'అహం' మూలాన్వేషణమే యప్పు డవలంబించిన సాధనము. పగళ్లు మాత్రము సాధన సల్పుచు, రాత్రివేళల విశ్రమించుచుండెను.

'అహం' మూలాన్వేషణ మత్యంత సులభమని రమణుడు ప్రసంగించు నట్లే శుష్కవేదాంతులుగూడ ప్రసంగించుట కద్దు. వారి పల్కులుమాత్ర మనుభవముతో చెప్పబడినవికావు. ఇట్టివా రాత్మవిద్య నతి చౌకచేసి, దాని గౌరవప్రతిష్ఠ లను పాడుచేసిరి. ఉపాసన ముఖ్యముగాదనియు, నిర్వచనములను వల్లించుటయే విచారమార్గమనియు, తామా నిర్వచనముల నాచరింపకున్నను నితరులకు బోధించుటయే జ్ఞానమనియు ప్రచారములు సల్పుచు సంఘమందు వీరు చీడపురుగులై యున్నారు. మనస్సు తొలుత తేజోవంతము గానివారికి మహర్షి యుపదేశము నభ్యసించుటకు బలముండదని పెక్కుమందికి తెలియదు. మనస్సు తేజోవంతమగుటకు మంత్రముగాని, నామముగాని ధ్యానించుట నిరపాయమగు సాధన. దానిని సగుణముగా నిరసించి, నిర్గుణమున కెగబడుట 'ఉట్టి కెగుర లేనమ్మ స్వర్గము కెగురు' నట్లుండును. మనస్సు తేజమునుబొంది, దేవతాప్రసాద భరితుడైన గణపతిమునివంటి వానికే యొకదినముకంటె నింకొకదిన మేకాగ్రత

నధికముచేయుచున్నను, ఆత్మ తన దర్శనమీయక వింకను నేకాగ్రతను గోరుచున్నప్పు డాత్మవిద్య యెంత కష్టమైనదో తెలియగలదు. కనుకనే యాత్మ యెవరి ననుగ్రహించునో వారికే యగపడునని పండితులు పల్కుదురు.

వాసిష్ఠు డెక్కువ పట్టుదలతో బుద్ధిని బంధించి, పదునేడు దినములు సాధన సల్పినను ఫలము దక్కలేదు. పదునెనిమిదవనాడింక తన పూనికనంతను గూడదీసికొని యతడు ధ్యాననిమగ్నుడయ్యెను. ఆ సాయంత్రమునకు దీక్ష ముగియును కనుక సాయంత్రములోపున అట్లో, ముక్కయో తేలవలెనని యతడు భీష్మించుకొని యుండెను.

ఇట్లుండగా మధ్యాహ్నము రెండుగంట లగుసరి కొక విచిత్రము సంభవించెను. అంతవఱకులేని నీరసమొకటి వెన్నునబుట్టి, యున్నపాటున నత్యంత తీవ్రమై, వాసిష్ఠుని గూర్చుండనిచ్చినదికాదు. విధిలేక శవాసనమున నతడు పండుకొని, నీరసము తగ్గుటకు కన్నులను మూసికొని, 'యహం' స్ఫూర్తిని విడువకుండగనే "మహర్షి యిప్పుడిక్కడ నున్నచో నెంత బాగుండు"నని తలచెను. తలచిన మఱుక్షణమందే మహర్షి వచ్చి, తన శిరస్సు నొక చేతితోడను, గుండెల నొక చేతితోను అదిమిపట్టి ప్రక్కను కూర్చుండినట్లయ్యెను. వెంటనే శరీరమందు ప్రవహించిన దివ్యశక్తి లహరి వలన వాసిష్ఠుని కన్నులు విచ్చనవికావు. ఆ వైపున కొదిగి మహర్షి పాదములను స్పృశించుటకుగూడ వక్షము నొక్కబడుటవలన వీలిచ్చినదికాదు. కొద్దిక్షణముల పిదప శక్తిలహరి సరుదుకొనెను. అప్పుడు వాసిష్ఠుడు కన్నులు విచ్చి చూడగా మహర్షి మాయ* మయ్యెను. ఆత్మాన్వేషణ చేయు మనస్సునందు పుట్టిన తలం పుత్తర క్షణమున సిద్ధించుట వాసిష్ఠుడు చూచినప్పు డీ యుపాయము తన లక్ష్యసిద్ధిని గూర్చుటయందును శ్రేష్ఠతరమైనదని గ్రహించెను. మఱియు రమణు డానాడు రక్షించు నెపమున వచ్చి, దేవతానుగ్రహముచే లక్ష్యఫలము నిశ్చయముగా ప్రాప్తించునని శపథము చేయుటకే హస్తదీక్ష నిచ్చినట్లు వాసిష్ఠుడు తలచెను.

* (ఆనా డదే సమయమునకు హృదయమునుండి శిరఃకమలమును బొందిన యొక రశ్మివలన తన శరీరము హఠాత్తుగా పైకెగసి, తిరువొత్తియూరను శబ్దముచే నొక గ్రామములోని దక్షిణ వీధిలో దిగి, యొక వినాయకాలయములో ప్రవేశించి యేమేమో చేసినట్లనుభవమయ్యెనని రమణుడుకూడ చెప్పెను. ఆ యూ రత డదివఱ కెఱుగడు. హృదయము నుండి రశ్మి శిరస్సును బొందునప్పుడు కారణమరయలేదట. కాని, సిద్ధపురుషు లిట్లే అదృశ్యులై తిరుగ క్షణములో నెప్పటియట్ల యుండగల్గుదురని తట్టినదట.)

ఓం

రెండవ ప్రకరణము

# తిమిరములను ఖండించి, యుమాస్తుతిని రేణుక స్వయముగా స్వీకరించుట

తిరువొత్తియూరులో నాయన తన దీక్షాంతమం దుపవనములో విశ్రాంతి గైకొనుట కందున్న యొక పర్ణశాల ప్రవేశించెను. ఉపవనాధికారి నాయనయందు గౌరవబుద్ధి గలవాడై సదుపాయము లమర్చెను. అతడు నాయన పాదములకడ కూర్చుండి ''మీవంటి మహానుభావుల సేవ మాబోట్లకు దుర్లభము. పూర్వమీ యూర 'పట్టంపిళ్లె'యను నొరల వర్తకుడొకడు ధనికుడై యుండువాడు. అతడు ధనార్జనమందు నిమగ్నుడై, యెంత ధనము లభించినను చాలనట్లింకను హెచ్చుకొనుటకు తాపత్రయపడుచుండగా నొకనాడత డింటలేని సమయమందొక పురుషుడు వచ్చి, తాటాకుపై నొక హితవాక్యా వర్తకు నుద్దేశించి వ్రాసి, యతని భార్యకిచ్చి వెళ్ళిపోయెను. భర్త యింటికి వచ్చి, ధనము తన వెంబడి రాదను హితవాక్యము జదివిన మఱుక్షణమే యిల్లు విడిచి, విరాగియై, తన వెంట వచ్చు భక్తి జ్ఞానములకొఱకు సతత మీశ్వర స్మరణయందు నిమగ్నుడయ్యెను. అతనికి పిచ్చిపట్టెనని తలచి యూరివా రనాదరణము జూపజొచ్చిరి. ఒకనాడతని మెడలోనికి దేవత యొక్క యాభరణము వచ్చెనట. అది చూచి దానినతడు దొంగిలించెనని యెంచి ఖైదుచేసిరట. అతని గొప్పతనమతని నిర్యాణమునకు పిదపగాని గుర్తింపబడలేదు. తన సమాధిని తానే సముద్రపు టొడ్డున త్రవ్వుకొని దానిలో కూర్చుండి, యక్కడనున్న జాలరి బాలురచే కప్పించుకొనెను. పెద్దలది విని బాలురను చీవాట్లుపెట్టి, యిసుకను తోడగా, వారికా సమాధియందు పట్టంపిళ్ళెకు బదులొక లింగ మగుపడెను. దానిని వారిప్పటికిని పూజింతురు'' అని కథ చెప్పగా విని నాయన వాని సహాయమున మఱునా డుదయమున బోయి లింగమును జూచి వచ్చెను. వచ్చిన కొద్ది నిముసములకే వేలూరునుండి యొక తంతి వచ్చెను.

తంతినిచ్చిన వా రప్పశాస్త్రి. అతని తమ్ముడైన కళ్యాణరామునిపై గొప్ప రేణుకావేశము వచ్చినట్లా తంతి తెల్పుచు, నాయన నా దేవత రమ్మని కోరుచున్నట్లుండెను. వెంటనే నాయన వాసుదేవశాస్త్రిని, నారాయణ ఘనపాఠిని

వెంటనిడుకొని వేలూరు వెళ్ళెను. తిరువొత్తియూరులో నాయన యెప్పుడు దీక్ష నారంభించెనో, ఆదే సమయమునకు సరిగా నావేశము ప్రారంభమయ్యెను. ఆవేశ మైనప్పటినుండి కళ్యాణరాముడు పాము పడగవలె తన శిరస్సు నాడించుచు, బుసలుకొట్టుచు, మధ్యమధ్య పెద్దకేకలు పెట్టువాడు. నాయనకు దీక్షాభంగ మగునని వెంటనే కబురు చేయబడలేదు. నాయన దీక్ష ముగిసిన వేళకు సరిగా దేవి తన యావేశమును తగ్గించి, ''నా బిడ్డ నా క్షేత్రములో తపస్సు చేసినచో నేను వాని కోర్కె నెరవేర్తు''నని పల్కి వెంటనే నాయనకా వార్త నంపుట కాజ్ఞాపించినందున తంతిమూలమున తెలియజేయబడెను. తరువాతకూడ ఆవేశము కొంత యుండి, మొత్తము నలుబది దినములైన పిదప పూర్తిగా వీడెను.

నాయన వేలూరు చేరి విషయములను గ్రహించిన వెంటనే వాసుదేవశాస్త్రిని తిరువణ్ణామలై పంపివేసి, యతనిద్వారా శ్రీ రమణునకు రేణుకావేశ వార్త పంపెను. పిమ్మట కళ్యాణరాముని దీసికొని నాయన యొక బండిపై పడైవీడు క్షేత్ర మా మఱునాడే బయలుదేరగా కుటుంబముతోడను, నిఱువది ముప్పదిమంది శిష్యులతోడను విశాలాక్షమ్మకూడ బళ్లను కట్టించి యట్టహాసముగా బయలు దేరెను. రేణుకను దర్శించిన పిదప నారాయణ ఘనపాఠి, ఎ. ఆర్. దొరస్వామి యను నిద్దరు శిష్యులతోడను నాయన పడైవీడునం దుండిపోయి, మిగిలినవారి నందరిని వేలూరు పంపివేసెను. వారిని పంపివేయునపుడు 'కళ్యాణరామునియం దావేశ మింక తగ్గును. భయపడవలదని' నాయన వారికి ధైర్యము పల్కెను.

ఆ సమయమందు నాయన నీరసించియున్నందున తపోదీక్ష పూనలేదు. కాని, వేలూరునుండి తనతో గైకొనివెళ్ళిన 'ఉమాసహస్ర'మును పఠించుటకు పూనుకొని, యక్కడక్కడ సంస్కరించుటకుగూడ సమకట్టెను. అదియే తపస్సు వలె నెంచి యప్పటికి పూనిన కార్యము. ఆ సమయమందనేకమగు ఆపదలు నాయనను చుట్టబెట్టెను. కొన్ని లేనిపోని యపవాదములై నాయనయందు పెద్ద పెద్ద యుద్యోగుల గౌరవమును సన్నగిలచేసెను. కొన్ని దైవావతరణ సంబంధములై యప్రతిష్ఠకు కారణమయ్యెను; మఱికొన్ని రాజకీయాపవాదములై శిక్షకు గురిచేయజొచ్చెను. తపోరహస్య బీజమునుబొందిన జీవున కాంతర్యమం దెదుర్కొనవలసిన తమస్సుల వంటిని బాహ్యమందును నావరించి ప్రతిబంధము లగునను దృష్టాంతము నాయన జీవితమునుండి ప్రదర్శితమగుట కివి ఈశ్వర కల్పితములవలె నొక్కసారిగా చెలరేగెను. తపస్స్వరూపమును గురించి శ్రీ రమణోపదేశమునకు పూర్వము మరకతశ్యామాంబాలయమందు సూక్ష్మాను భవమునకు జెందిన సంభవించిన యగ్నిపరీక్షవంటి దిప్పుడు స్థూలానుభవమునకు జెంది ప్రారంభించి, యొకటి తపస్స్వరూపజ్ఞానమున కుపోద్ఘాతమైనచో నింకొకటి తపోస్త్రజ్ఞానమున కుపోద్ఘాతము కానున్న ట్లుద్భవించెను. కనుకనే లోకమందిప్పుడు

ప్రబలి, యింకను ఘోర పరిణామ భయమును దోపజేయుచున్న పైశాచిక రాక్షసత్వముల రెండింటి నెదుర్కొనుటకు రెండు విధములైన తపస్తత్త్వ బీజము లవసరమని నాయన గుర్తించి, మొదటిది ప్రాప్తించినప్పటి నుండి రెండవదాని ప్రాప్తి కెంతైన యాతురపడుచుండెను. దీని నిచ్చెదనని రేణుకాదేవి తన యావేశాంతమున చెప్పిన మాట నాయన కాశాజనకమయ్యెను. కాని, తపస్సునకు పూర్వమే బాహ్యమున తన యొక్కనికి జెంది తలలెత్తుచున్న యీ యాపదలను రేణుక నివారించినచో సమష్టిగా లోకమందు వ్యాపించు నాపన్నివారణమున కామె సమర్థురాలని నిర్ణయించుట సులభము గావున నాయన యామె కంకపీఠమై యొప్పు పడైవీడు క్షేత్రస్థలము నాశ్రయించెను.

ఇంక నాయనపై మోపబడిన యపవాద వివరములను స్థాలీపులాక న్యాయముగా పరిశీలించి చూతము. మొదట నాయనయం దమిత భక్తిగల సుందరీ మహేశ్వరుల యింటియం దిది యొక అపోహతో ప్రారంభించెను. వారి యేకైక పుత్రుడైన కచ్ఛపేశ్వరునకు తన భార్యయం దనుమానము జనించి వానియం దిట్టి మతిభ్రమను గలిగించెను. అతడు తన యనుమానమును తల్లితండ్రులకైన చెప్పక పిచ్చి చేష్టలను జేయుట జూచి బంధువులందరు గుమిగూడి, వాని పిచ్చికి మంత్రోపదేశమే కారణమని నిశ్చయించి, బాలునకు మంత్రదీక్ష నిచ్చిన వాసిష్ఠు నసహ్యించుకొనిరి. ఆ బంధువులు పెద్ద యుద్యోగులు. కచ్ఛపేశ్వరుని మామయు నట్టివాడే. అతని ప్రేరణమున పిల్లల నిట్లు మంత్రదీక్షచే వశమొనర్చుకొని రాజకీయోద్యమమును వాసిష్ఠుడు తలపెట్టినను భావము బంధువులలో వ్యాప్తము కాగా, వేలూరులో పబ్లిక్ ప్రాసిక్యూటరుగా నున్న వైద్యనాథరావను వకీలు బంధువు, చిత్తూరులో పోలీసు ఉద్యోగమున నున్న చిన్నస్వామి యను ఇన్స్పెక్టరు బంధువు కలసి నాయన పైన విచారణ సల్పి, నాయనను నడివీధిబెట్ట సంకల్పించిరి. ఇదంతయు జూచి కచ్ఛపేశ్వరుని తల్లితండ్రులు భయపడి వారిని నివారింపజూచిరి. కాని, వారు మఱింత బిఱ్ఱబిగిసిరి. వారు తొలుదొల్త అప్పశాస్త్రిని పరీక్షించుటతో తమ విచారణ ప్రారంభించిరి. అప్పశాస్త్రి జంకుగొంకు లేక వారి యపవాదము నిట్లు ఖండించెను. "నాయన కున్న విద్యార్థి శిష్యులు ముప్పది నలుబదిమంది కంటె హెచ్చు లేరు. వేలకొలది విద్యార్థులతో గూడిన వందేమాతరోద్యమమే ప్రభుత్వముచే త్రొక్కబడి చిందర వందర చేయబడినప్పుడు నాయన యీ కొలదిమందితో రాజకీయోద్యమము సంకల్పించెననుట వివేకముతోగూడిన మాటగాదు. పైగా, రాజకీయములనుండి విద్యార్థుల మనస్సులను మరలించుటకు నాయన యిచ్చిన యుపన్యాసముల కుపాధ్యాయులతోపాటెంతమంది తల్లితండ్రు లిప్పటికిని కృతజ్ఞులై యుండిరో మీరు మొదట తెలిసికొనుట మంచిది. ఇంక మంత్రదీక్షయందు మీకున్న

యభిప్రాయములు సంకుచితములనియు, మన మతమునకు విరుద్ధములనియు నేను మీకు ధైర్యముగా చెప్పగలను. నీచబుద్ధితో నాయన విద్యార్థులకు మంత్రదీక్ష నిచ్చెనంటిరి. నాయనకడ మంత్రదీక్ష గైకొనినవారిలో బాలుర సంఖ్యకంటె పెద్దల సంఖ్యయే హెచ్చు. కచ్ఛపేశ్వరుని తల్లితండ్రులే మొదట శిష్యులై, తరువాత పుత్రున కుపదేశమిప్పించిరి. దోషమెవరిదో చెప్పరు?''

విచారణ సల్పినవారు కిక్కురుమనక తమ విచారణ విరమించుకొని వెళ్లిపోయిరి. సుందరీమహేశ్వరు లప్పశాస్త్రిని మెచ్చుకొనిరి. అతని సలహా చొప్పున వారు నాయన కటాక్షమును బొందుటకు తమ పుత్రుని వెంటనిడికొని పడైవీడు వెళ్లిరి. అక్కడ నాయన దివ్యదృష్టితో పరికించి కచ్ఛపేశ్వరుని యనుమాన కారణ మెఱిగించగా, కచ్ఛపేశ్వరుడు 'ఔ'నని ధ్రువపరచెను. అప్పుడు వానికి ధైర్యము, వాని తల్లితండ్రుల కుపాయమును జెప్పి వారిని నాయన పంపివేసెను. నాటినుండి కచ్ఛపేశ్వరుని పిచ్చి మాయమై బంధువులకు పునరుత్సాహమునేగాక వాసిష్ఠుని యందు పునర్గౌరవమును కలిగించెను.

అతనికి పిచ్చియెత్తిన సమయమందే చెన్నపురమందు వేంకటాచలమయ్యరను పేరుగల భక్తుడు నాయనతో నవతార విషయములను గుఱించి నాయన తిరువొత్తియూరులో నుపన్యసించిన పిదప ప్రసంగించి, యవతారమునకు జెందిన మూలాంశ శ్రీ రమణునియందు వ్యక్తమయ్యెనని విని 'కార్యాంశ యెవరియందు వచ్చు'నని యడిగెను. ''జన్మాదపి యున్న రమణుని యంశ యిప్పుడు వ్యక్త మైనది. నాయందట్లే జన్మతో సహా వచ్చిన యంశయు వ్యక్తమైనదో నది నీ వూహించినదగును. నిశ్చయ''మని నాయన ప్రత్యుత్తరమిచ్చెను. వెంటనే యతడు కల్క్యవతార మారంభమైనట్లు కరపత్రముల నచ్చొత్తించి, ప్రజలను ధర్మబుద్ధియందు హెచ్చరించుటకు పంచిపెట్టెను. ఎవరియం దది వచ్చెనని యడిగినవారి కతడు కార్యాంశయే కల్క్యంశమని విశ్వసించి 'నాయన'యం దది యారంభమైనట్లు చెప్పజొచ్చెను. ఈ కరపత్ర మొకటి పిచ్చియెత్తిన కచ్ఛపేశ్వరుడు చూచి, తన ధోరణి ననుసరించి విశాలాక్షమ్మ గర్భమం దీ యవతార మారంభమైనట్లు వ్యాఖ్యానించుకొని తన స్నేహితుల కుత్తరములు వ్రాసెను. 'బాబా'యను నొక మిత్రునకు వ్రాయబడిన యిట్టి లేఖ క్రమముగా వాసిష్ఠ వైరియైన సుందర పాండ్యుని హస్తమున బడెను. దాని నతడు పోలీసువారి కొప్పగించి యూరకుండక, వాసిష్ఠునిపై బలమగు నేరము మోపుటకు 'మద్రాసు మెయిల్' అను దినపత్రిక యందు మునుస్వామి యను సబ్‌యెడిటరుచే వ్యాసము వ్రాయించెను. తరువాత పోలీసు రహస్య శాఖవారు దర్యాప్తుచేయుట కతడు గవర్నరుగారి యుత్తరువును గూడ బడసెను. దినపత్రికలో వెలువడిన వ్యాసమం దపవాద మిట్లు కల్పింప బడెను. (ఇంగ్లీషులో ప్రచురణమైన వాక్యముల కాంధ్రానువాద మిది.)

"రాష్ట్ర విప్లవసంఘ మొకటి స్థాపించి, పెక్కుమంది యువక విద్యార్థులతో గూడి, మూడు వంతుల ముప్పాతిక కపటవృత్తి పూని, గ్రామగ్రామములు తిరుగుచున్న కావ్యకంఠ గణపతిశాస్త్రి యను పేరుగల వ్యక్తి తపస్సు నెపమున వివిక్త స్థలముల నాశ్రయించుచు, నిప్పుడు పడైవీడను రేణుకాక్షేత్రమును బొంది యున్నారు. ఈ విప్లవము తుపాకిగుండువలె ప్రేలనున్నది. కనుక నిందు విషయమై యధికా ర్లత్యంత శ్రద్ధ గైకొనవలెను."

ఈ యపవాదమును తీవ్రముగా ఖండించుచు వేలూరు కళాశాలోపాధ్యాయుడైన సి. సుబ్రహ్మణ్య మొక వ్యాసము వ్రాసి 'హిందూ'పత్రికలో ప్రచురించెను. కాని, గవర్నరు తొలియుత్తరువు చొప్పున నిఱువురు రహస్య శాఖాధికారులు పరిశోధించుట కాజ్ఞాపింపబడిరి. ఆ యుత్తరువులో సుందరపాండ్యు డొనర్చిన ఫిర్యాదు ననుసరించి 'ఉమాసహస్ర'ములో ప్రభుత్వమును శపించు శ్లోకములుగాని, ప్రజలను విప్లవముఖమొనర్చు నాక్షేపణీయ శ్లోకములుగాని యున్నచో గ్రంథసహితముగా వాసిష్ఠుని బట్టుకొనుట కాజ్ఞయున్నది. ఆ యిఱువు రధికార్లలో వేలూరు సర్కిల్ యిన్స్పెక్టరైన దొరస్వామి ముదలియారుకు పెత్తనమీయబడి, యతని సహాయకారిగా ఆర్నిలోని పోలీసు సబ్‌ఇన్స్పెక్టరు పంపబడెను. వీరి కిట్టి యుత్తరువు లొసగబడినట్లు చెన్నపురమందు విద్యార్థియై యున్న పొన్నుస్వామికి తెలిసి యతనిద్వారా అప్పశాస్త్రికి తెలిసెను. వెంటనే యతడు తన పినతండ్రిని నాయనయొద్దకు పంపెను. నాయన తన సామర్థ్యము తానెఱిగికొనిన వాడగుటచే నించుకయు భీతిచెందక రేణుకా మహిమయందు ధైర్యము చెందియుండెను.

ఈ రేణుక వైదికఋషులచేతను, తాంత్రికులచేతను గూడ కొలువబడిన ప్రసిద్ధ శక్త్యవతారమును బొందిన జమదగ్నిముని పత్ని, ఈమెయం దింద్రాణీ శక్తి యవతరించి, యీమె భర్తయం దా శక్తికి మూలమైన నింద్రుడను నగ్నితత్త్వ మవతరించి యిఱువురియందును గుప్తమైయుండగా, కార్తవీర్యార్జును డొనర్చిన దుష్కార్యము నెపమున పరశురాముని యం దా యింద్ర యింద్రాణీ తత్త్వములు రెండును కార్యరూపమును జెంది షష్ఠావతార కథనమునకు కారణమైన ట్లేదివఱకే వాసిష్ఠుడు గ్రహించినందున నీ రేణుక లోకహిత కార్యములను కల్పించి, యాపదలను దాటించుటలో పటుతరమైన దేవతాశక్తియని విశ్వసించి యుండెను. మంత్రశాస్త్రమం దీమె షష్ఠమహా విద్యాస్వరూపిణిగా కీర్తింపబడి ఛిన్నమస్త, చండి, ప్రచండచండి, వజ్రవతి యను ప్రసిద్ధ నామములను బొంది, ప్రతి మానవుని యందు గల యాజ్ఞాచక్రము నధిష్ఠించి తదంతరమున మృతామృతత్వములను కల్పించు రుద్రగ్రంథిని శాసించుననియు కీర్తింపబడెను. (చూడుడు లలితా సహస్రములోని 'ఆజ్ఞా చక్రాంత రాళస్థా రుద్రగ్రంథి విభేదినీ' యను ప్రసిద్ధ

వాక్యము.) ఈమె యధిష్ఠించిన క్షేత్రస్థల మొక పీఠభూమియై, వలయాకృతియైన కొండచే చుట్టబడి కపాలమును బోలియుండును. ఎక్కడ పీఠభూమిని ప్రవేశించుటకు కొండయొక్క ముఖద్వారముండునో, అక్కడ ముఖద్వార మాజ్ఞాచక్రమును సూచించుచు దేవి వెలసిన స్థలమై యున్నది. పీఠభూమిలో వెనుక భాగమున నొకచోట కుప్పలుకుప్పలుగా బడియున్న విభూతి నేల చిదగ్ని విభూతిని జిమ్ము సహస్రార స్థలమును స్మరింపజేయును. ఇందులకు సార్థకముగా సహస్రదళముల వలె నిచ్చట జలమూరుచుండును. ఆ స్థలమంతయు జమదగ్ని యొక్క యాగస్థలమనియు, నందలి జలోద్భవ భాగమతని దివ్యకుండలీ కమండలమనియు ప్రసిద్ధము. అచ్చట నుండి జలమొక నాడివలె సన్నని నదీరూపమున నాజ్ఞాచక్ర ముఖద్వారమునుండి వెడల్పధికమగుచు బాహ్యమును బొంది, యాజ్ఞాచక్రమునుండి శరీరగతమగు క్రియానాడీ సముదయమైన కుండలినీ శక్తిని స్మరింపజేయును. ఆ కారణముచేత పండితులీ నదిని కుండలినీ నదియనియు, కమండలు నదియనియు కీర్తించిరి. బాహ్యమును జెంది కొంతమేర ప్రవహించిన పిదప నొకచోట నదికర్ధముగా కొంచెమెత్తున రాళ్లర్ధము రాగా పడగ నెత్తి పఱుగిడు సర్పమువలె రాళ్లను దూకి దాటుచున్న కుండలిని యగపడును. ఆ స్థల మందువలన 'పాంబడిచ్చాన పారై' (పాముచే కొట్టబడు రాయి) యని ప్రసిద్ధిజెందెను. అది స్థూలమును బొందు మూలాధార చక్రమును, నందలి సర్పాకృతి శక్తిని నిరూపించు స్థలముగా నెంచబడును.

ఇట్టి యధ్యాత్మ తత్త్వమును బ్రదర్శించు రేణుకా క్షేత్రము విజనమై పడైవీడను గ్రామమునకు జెందియున్నను గ్రామమునుండి నాలుగు మైళ్ల దూరమున నుండును. ఆర్ని నుండి వచ్చువారి గ్రామము చేరనవసరము లేకుండ క్షేత్రస్థలమునకు వచ్చుటకు వేఱైన చక్కని బాట యున్నది. ఈ బాటనుండి రహస్యాధికారు లిఱువురు యాత్రికుల వేషములు ధరించి సైకిళ్లపై వచ్చుచుండగా వారి యాగమనము, వారి మూర్తులు నాయన దివ్యదృష్టికి బహుదూరము నుండియే గోచరించెను. ఆ దినము దేవతకు ప్రీతికరమగు శుక్రవారము, వేళ సాయంత్రము నాల్గు గంటల సమయము. వారి యాగమనమును జూచినంతనే నాయన కోవెల ప్రాకారము ప్రవేశించి, చిన్నదైన యా కోవెలచుట్టు ప్రదక్షిణములు సల్పుచు, నొక్కొక్క ప్రదక్షిణముతో నంతముగునట్లొక్కొక్క శ్లోక మాశువున గూర్చుచు, మొత్తమొక నక్షత్రమాలయగు గీతమాలచే దేవిని స్తుతించిన పిదప తిరుగ సత్రము జేరి కూర్చుండెను. ఇంతలో రహస్యాధికారులు వచ్చి చేరిరి. వారు వచ్చుసరికా గీతమాలను నాయన యొక కాగితముపై వ్రాయుచుండెను. నాయనకు నమస్కరించి నాయనప్రక్కనే వారును గూర్చుండిరి. ఎదుటనే ఉమాసహస్రముండెను. దాని యట్టపై పెద్ద యక్షరములతో వ్రాయబడిన పేరెట్టివారికైన దృష్టిగోచరమగు చుండెను.

కాని, రహస్యాధికారులకా పుస్తకమే గోచరించలేదు. ఒక్క క్షణము పిమ్మట నాయన యనుచరుడైన దొరస్వామి యచ్చటికి రాగా వానికి పుస్తకము నావలకు తీసికొనిపొమ్మని నాయన కనుసంజ్ఞ చేసెను. అతడు దానిని తీసికొని వెళ్లునప్పుడైనను పుస్తకము పోలీసు వారికి గోచరము కాలేదు. ఆ పుస్తకమును దొరస్వామి 'పాంబడిచ్చాన్ పారై' స్థలమువద్ద పొడియిసుకలో దాచి, గుర్తుపెట్టుకొని వచ్చెను.

అటుపిమ్మట నాయన వారిలో పెద్ద యధికారి నుద్దేశించి 'మీరు వేలూరు పుర మెప్పుడు వీడి'రని ప్రశ్నించెను. అతడు తడబడి యబద్ధము చెప్పబోవు చుండగా నాయన యతనిని వారించి 'మీరు మాఱువేషములు ధరించినను మీరెవరో, యెందుకు వచ్చిరో నాకు తెలియును. ఉమాసహస్రమిప్పుడు నాయొద్ద లేకున్నను, దాని సారము మీకు వివరించి చెప్పెదను. విను'డని యొక యరగంటసేపు వివరించెను. అటుపిదప తన చరిత్రను, ఆదర్శములను గుఱించి వారడుగకుండగనే చెప్పి, తనయందు దావరికము, కపటము మొదలగు నీచబుద్ధులు లేవని వారి బుద్ధికి తోచునట్లు జేసెను. పిమ్మట వారికి బుద్ధిగరపినట్లు నాయన యిట్లు ప్రశ్నించెను: "దేవతాస్తుతిని రచించువారు దేవతను లోకపీడల నివారణ కొఱకు, మానవులయందు సద్బుద్ధిని, శక్తిని వృద్ధిపరచుటకు ననుగ్రహింప వేడుట దోషముకాదు గదా! అందు దోషములు ధ్వనించినచో నేనా గ్రంథమును తిరువణ్ణామలైలో బహిరంగముగా చదివినప్పుడు వినుటకై వచ్చిన పెద్దమనుష్యు లలో నెవ్వరైన నన్నాక్షేపించరా? కపటము నుద్దేశించి నేను వ్రాసినచో నేనట్లు చదివియుండువాడనా? ఆలోచింపుడు.

వారా ప్రశ్నలకు కన్ను తెఱచి, సుందరపాండ్యు డొనర్చిన ఫిర్యాదు, వాసిష్ఠుని గ్రంథమందు మోపబడిన నేరములు నిరాధారములను నిశ్చయబుద్ధికి వచ్చిరి. అటుపిమ్మట వారు 'మీరిప్పుడు వ్రాయుచున్న దేమి'యని ప్రశ్నించగా, వారి బుద్ధిని మార్చి తన యాపదను దాటించిన రేణుకపై వెడలిన ఆ 'వరగిర' మాలను వాసిష్ఠుడు చదివెను. "సురశిరశ్చరచ్చరణ రేణుకా! జగదధీశ్వరీ జయతి రేణుకా" యను దివ్యమకుటముతో నొప్పు రేణుకాగీతము వాలకించినంతనే భక్తిస్పందముల నుద్భవింపజేయు వాసిష్ఠుడు మహానుభావుడు, భక్తుడు, పవిత్ర వాక్కుగలిగిన మహాకవి యని వారి బుద్ధియందు స్థిరమయ్యెను. వెంటనే వారు వెళ్లి పోవుటకు సెలవుగైకొని లేచిరి. వెళ్లునప్పుడు వారిలో నాయకుడైన ముదలియారొక హితవాక్కు నిట్లు చెప్పెను: "మీపై మోపబడిన నేరములన్నియు దుర్బుద్ధితో చేయబడినవని మా యధికార్లకు తెల్పెదను. కాని యీ మంచలమందిప్పుడు సత్పురుషుల కనిష్టము కలిగించుటయే వ్రతమని యెంచి, హింసయం దుత్సాహపూరితులగు వారులు బహుళముగా నున్నారు. రాజోద్యోగ బలగర్వముచే వారు విచక్షణకుమీరి ప్రవర్తించి దుష్కార్యములకు వెనుదీయరు గావున వారికి

దూరముగా నుండుట కైదాఱు మాసములైన మీరింకొక మండలమున తపస్సుచే గడపుట క్షేమము. తరువాత మీ యిష్టము.''

ఇట్లు పల్కి రాత్రి తొమ్మిది గంటలకు వారు వెళ్లిపోయిరి. అటుపిదప గ్రంథ మిసుకలో నదీగర్భమున పాతిపెట్టబడిన విషయమును నాయన విని యొక వంక శిష్యుని యుపాయబుద్ధికి మెచ్చుకొనియు, నింకొకవంక వాని పిరికితనమునకు వగచెను. దేవత తన మహిమ నత్యంత శీఘ్రముగా బరపి గ్రంథమును పోలీసువారి దృష్టినుండి కప్పుటజూచియు, శిష్యు డధైర్యపడి నందులకు విచారించెను. కాని, కనుసంజ్ఞ చేసిన పొరపాటు తనదేయని తలపోసి, దీనికంతకు దేవతా ప్రేరణ మేదో బలీయమై, యెందులకో గ్రంథమును పోలీసు పరిశోధన నెపమున నదీగర్భమున చేర్చెనని వాసిష్ఠుడు గ్రహించి యూరకుండెను. ఇన్ని విధముల కాపాడగల్గిన రేణుక యింకొక మహిమచే విశాలాక్షమ్మ గర్భము నుండి యాడపిల్లను బుట్టించి, కల్కి పురుషాపవాదమును గూడ తొలగించినచో బాగుండునని భావించి వాసిష్ఠుడు నిద్రించెను. గ్రంథము నిసుకనుండి తెల్లవారిన తోడనే తేవచ్చునని తలచి శిష్యులుకూడ నిద్రించిరి.

కన్ను మూసినంతనే మాయగప్పినట్లందరిపై గాఢ నిద్ర యావేశించి తెల్లవారువఱకు మెలకువ దెచ్చినదికాదు. వారట్లు నిద్రించియుండగా రాత్రి యే సమయమందో గొప్ప వర్షము కురిసి, కుండలినీ నది పొంగి, యుమాస్తోత్ర గ్రంథమును శాశ్వతముగా తన గర్భమం దుంచుకొనెను.

ఉదయమున నీరు తగ్గిన పిదప శిష్యులు బహుదూరము వెతకి, యొక్క పుటయైనను గాంచజాలక ఖిన్నులై గురుని యొద్దకు వచ్చి, కుండలినీ నది యొనర్చిన యపకృతిని పేర్కొనిరి. వారిని గురువు మందలించి, కుండలినీ రూపమున విజృంభించి దేవి స్వయముగా గ్రంథమును స్వీకరించిన విషయమును వారికి బోధించెను. మఱియు శ్రీ రమణున కీ శుభవార్త దెల్పుటకు నారాయణ ఘనపాఠిని వెంటనే వాసిష్ఠుడు పయనము గట్టి, వానికిట్లు చెప్పెను: ''ఏ మహాశక్తి నుద్దేశించి నే నీ గ్రంథమును రచించితినో, ఆ మహాశక్తియే రేణుక యని నేను గ్రహించినట్లు మహర్షికి జెప్పుము. కుండలినీ రూపమున సర్వలోక స్మృతులను గాపాడుచున్న దేవత యామెయే గనుక నామె యనుగ్రహవశమున నీ గ్రంథస్మృతి యంతయు నాయందు దాగియున్నదని ధైర్యము బల్కుము.'' పిమ్మట పోలీసువారు కల్పించిన భయమును లెక్కసేయక వాసిష్ఠు డా క్షేత్రమును వీడలేదు.

* * * *

ఓం

మూడవ ప్రకరణము

# రేణుకయొక్క నిజకథాస్ఫూర్తి

విశాలాక్షమ్మకు పురిటిరోజులు సన్నిహితమయ్యెను. ఆమెకు పురుడువచ్చి, యాపద దాటువఱకు నాయన తపోదీక్ష పూనినచో నడుమ నాశౌచమువలనగాని, యితర కారణముల వలనగాని భంగమాపాదించవచ్చునని యెంచి దీక్ష పూనకున్నను, రేణుకపాదమును మాత్రము విడచుట కిచ్చగించక క్షేత్రపురాణము నకు చెందిన కథాగ్రంథములను పూజారి సహాయమున దేవస్థానము గ్రంథా లయమునుండి గైకొని సవిమర్శముగా పఠింపజొచ్చెను. పురాణములలో పరశు రామునియం దవతార మావేశమైనట్లు చెప్పబడెను. అవతారకారణముమాత్ర మన్నింటియం దన్ని విధములుగా చెప్పబడి, యొక్కటియు హేతువును సమంజసముగా బోషింపకుండెను. దశావతారములలో మొదటి యైదు నమానుషములై, లాక్షణిక భాషలో చెప్పబడిన జ్ఞానసాధన మార్గప్రకాశములని యేనాడో నాయన గ్రహించెను. షష్ఠావతారమునుండి యవతారపురుషుడు చరిత్రాత్మకుడై, తన చరిత్రనుండియే ఆత్మతత్త్వమును బ్రదర్శించి యుద్ధరించిన యాదర్శ పురుషుడు కావలెను కనుక నాయన నట్టి విమర్శ యట్టి దృష్టితో గూడి యుండెను.

గ్రంథములందున్న జమదగ్ని కుటుంబ కథల నిట్లు నాయన పరీక్షించు చుండగా పూజారి యొకనాడొక హిందీ రామాయణ ప్రచురమును దెచ్చి తనకు హిందీ కొంత కొంత వచ్చిన కారణమున రేణుక కథాఘట్టములను జదివి, నాయన కర్థము చెప్పెను. ఆ గ్రంథము బొంబాయిలో క్రీ.శ. 1900 సం॥లో ప్రచురితమై, మిగిలిన రామాయణ ప్రచురణములలో లేని రహస్య విషయములను కొన్నింటిని పేర్కొని, నాయన బుద్ధియందు సత్యవిమర్శ కెంతో తోడ్పడెను. అందలి కథాంశముల కాధారము లే పూర్వగ్రంథమందుండి గ్రహింపబడెనో తెలియలేదు. సాధారణముగా వాల్మీకి రామాయణ మాధార గ్రంథమని పెక్కుమంది విశ్వసించుచు, తమ విశ్వాసమునకు కారణముగా రామచరిత్ర కాలమునాటి వాల్మీకి ఋషియే దానిని స్వయముగా వ్రాసెనని పల్కుదురు. వాల్మీకి ఋషినాటి భాష యెక్కడ, రామాయణ రచన భాష యెక్కడ? అజగజాంతరమైన భేదమున్నను పండితులు సైతము భ్రమకు లోనై, యీ వాల్మీకి పేరున వెలసిన గ్రంథమే ప్రమాణముగాక దానికింకను బ్రమాణము వేఱొకచో నుండవలెనని తలపెట్టరు. నాయన యిట్టి

తెగలోని పండితుడు కానందున సత్యప్రేరణమిచ్చు కథను ప్రమాణవచనముగా నెంచి, మిగిలిన గ్రంథములలోని కథలను కల్పితములుగా నిర్ణయించెను.

లభ్యమైన హిందీ ప్రచురణమునుండి తెలిసిన కథాంశములతో చేర్చి రేణుకాక్షేత్ర మాహాత్మ్యమును నాయన శోధించుకొనగా షష్ఠావతార కారణములు రఘుకులరాముని కథగా కొన్ని మార్పులతో కూర్చి దిద్దబడిన ట్లవగతమయ్యెను. బ్రాహ్మణుడు, ఋషిపుత్రుడు నగు భార్గవరాముని కథను నీచపరచి, క్షత్రియకులమందొక రాముని సృష్టించుట కీ కవులు రామాయణమును రచించియుందురని నాయన బుద్ధికి తట్టి, యానాటి ఋషి చరిత్రములను విమర్శించుకొనెను. జమదగ్ని, వసిష్ఠ, విశ్వామిత్రులు సమకాలికులై, యప్పటి దేశక్షేమమున కవతారమును సాధించినారని తోచెను. వారిలో జమదగ్ని పుత్రుడైన పరశురామునియం దావేశరూపమున నవతరించిన దైవాంశనుండి విదితమైన జ్ఞానవిద్యాభాగమును వసిష్ఠుడు వివరించి లోకమున కుపదేశించగా, విశ్వామిత్రు డస్త్రవిద్యా భాగమును గ్రహించి యుపదేశించినట్లు స్ఫురించెను. ఈ యుభయుల వలన నుపదేశింపబడి, బాహ్యాంతర తమస్తాపములను జయించి, లోకయాత్రను నిరాఘాటముగా నడపిన రఘురాముడు పూర్ణజీవసాంకేతికుడై, యధ్యాత్మ విషయములను లౌకికిక భాషలో బోధించిన రామాయణ కథకు నాయకుడై యుండుననియు స్ఫురించెను. పరశురామునివలన స్వయముగా గాకున్నను, అతని తత్త్వమును ప్రసాదించు దివ్యాస్త్రస్పర్శచే శ్రీరామునియందు ప్రారంభమైన యాత్మశక్త్యవతరణమును సూచించు కథను శ్రీ రామాయణమందందులకే విడువ జాలక పోయిరనియు, నదియే విశ్వామిత్రుని యస్త్రబోధఫలమై రాముని యోగకార్యసాధన కుపకరించి, తుదకు వసిష్ఠుడు బోధించిన జ్ఞానమార్గమున నతని చేర్చెననియు నాయన యీ కల్పిత కథల యందు చెప్పబడిన సూక్ష్మ సారముగా గ్రహించెను.

బుద్ధియందిట్టి దివ్యప్రబోధమును బొందిన పిదప రేణుకా చరితము నిట్లు నాయన సమకూర్చుకొనెను. కార్తవీర్యార్జును డన్య దేశమునుండి వచ్చిన హైహయులకు ప్రభువు. హైహయులు యదుకులమునకు చెందినవారై, భారత దేశమం దాక్రమింపబడిన పశ్చిమ దిగ్భాగములలో ప్రస్తుత మహారాష్ట్ర, కేరళ, కన్నడ రాష్ట్రములున్న భూఖండమున ప్రబలి యుండిరి. వీరి రాజ్యమునకు మాహిష్మతీ పురము ముఖ్యపట్టణమై యుండెను. భర్తలను మార్చుకొనుట స్త్రీలకు దోషముగాదను నెపముచే వీరు స్త్రీల నపహరించుచు జనకంటకులైరి. వీరి ప్రభువైన కార్తవీర్యార్జునుడిట్లే తన సామంతరాజులను స్త్రీలకొఱకు పీడించుచుండ, వారు తమ కుమార్తెల నతనికి భార్యలు గావించి తమ కులగౌరవములను గోల్పోయిరి. ప్రసేనజిత్తను సామంతరా జీ విధముగా తన కుమార్తెలలో 'సత్య'యను దానిని

కార్తవీర్యున కిచ్చి వివాహముచేసి దుఃఖించెను. అతని కింకొక కుమార్తెయే రేణుక. ఈమె సౌందర్యవతియేకాక, దివ్యలక్షణములుగల యువతి. ఈమె కార్తవీర్యుని బారి పడకుండుటకై వాని రాజ్యమున కావలనున్న జమదగ్నికీమెను తండ్రి వివాహము గావించెను.

రేణుకా జమదగ్నులు పుత్రులను బడసి, బహుళ తపస్సంపన్నులై యుండగా వారి గర్భమున దివ్యతేజస్సంపన్నుడైన భార్గవరాముడు లోకకల్యాణము కొఱ కుదయించి, మునుల యాశీర్వచనము పొందెను. ఇతడు యుక్తవయస్సును బొందుసరికి కార్తవీర్యునియొక్క, వాని యనుచరుల యొక్క పాపము పండి యుండెను. వాని నెదుర్కొను నుపాయము తోచక ఆర్యకులము లడవిబట్టి, తపోరహితులై పతనము కానున్న సమయమున భార్గవరామునియందు దైవాంశావతరణమయ్యెను. ఈ యవతరణమునకు కారణములను కల్పించు శక్తీశ్వరు లదివఱకే రేణుకా జమదగ్నులను బొందియుండిరి.

ఒకనాడు సోదరియగు సత్య యాహ్వానమున నామెను జూచివచ్చుటకు రేణుక మాహిష్మతీపురము వెళ్లి, మఱలి వచ్చునప్పు డామెను తన యాశ్రమమున కాహ్వానించెను. 'నేను వచ్చినచో పరివారసహితముగా రావలసియుండును గదా. మా కాతిథ్యమీయగలవా' యని యామె ప్రశ్నింప, 'మాకున్నదానితో మేమిచ్చి తృప్తిపరతు'మని రేణుక బదులిడి వచ్చెను. మఱికొద్ది దినములకు కార్తవీర్యుడు రాణులతోడను, రక్షక సేనలతోడను గూడి వేటకై బహుదూరమేగెను. వేట వినోదమందు హద్దు తెలియక యతడు తన మండలము దాటి జమదగ్న్యాశ్రమమునకు చెంతనున్న యడవిలో చిక్కుకొనెను. అప్పు డాహారపదార్థములు తమ వెంటనున్నవి క్షీణించిన కారణమున సేనలు కలవరపడిరి. దారులవలన జమదగ్న్యాశ్రమము చెంతనే యున్నదని విని రాణియగు సత్య ధైర్యముచెంది, రేణుకను జూడనేగెను. వారి యాపదనెఱిగి రేణుక తన భర్తయొక్క కమండలోదకమును జల్లి యన్నరాసులను కల్పించి సత్యను సంతోషపరచెను. కాని, యీ మహిమా ప్రదర్శనమువలన నామె కార్తవీర్యునియందు మోహాతిశయమునుగూడ కల్పించిన దయ్యెను. దుష్టబుద్ధి ప్రకోపింపగా నతడట్టి మహిమాన్విత స్త్రీని రాణిగా పడయగోరి, జమదగ్నిని శిరఃఘాతముచే మూర్ఛపుచ్చి, రేణుక నపహరించి, సేనలతో పలాయనమయ్యెను. కాని, రేణుకను ముట్టుటకుమాత్ర మతడు జంకి, యామెను స్త్రీ పరివారములచే బంధింపజేసెను. ఆమె యిట్లపహరింపబడిన సమయమునకు పుత్రు లడవికిపోయి యుండిరి. కారణము లిట్లు కల్పించి, మానవశరీరమం దహంకృతిచే నపహరింపబడు మూలప్రజ్ఞవలె రేణుక యపహృతయైనను పవిత్రతను గోల్పోకయుండెను.

జమదగ్ని మూర్ఛనుండి మేల్కాంచుసరికి పుత్రు లడవినుండి విచ్చేసిరి.

మిగిలిన సోదరులవలె కర్మభీరువుకాక, రాముడు ధీరుడై తల్లిని విడిపించి తెచ్చుట కుద్యుక్తుడై యుండగా, శరీరగత ప్రాణములను నాడులనుండి మథనమొనర్చు ప్రదీప తపోగ్నివలె మేల్కాంచిన జమదగ్ని యొక్క తపోగ్ని ప్రియపుత్రుడైన రాముని బొంది, శత్రు మథనమునకు తొలుత పటుతరాస్త్రశక్తిని కల్పించెను. ఆ యస్త్రశక్తివలన బలమైన కార్తవీర్యుని సేనాసహితముగా చంపి భార్గవరాముడు తన తల్లి నింటికి తెచ్చెను. బాహ్య శత్రువులను కృత్తశిరస్కులను గావించిన యీ శక్తి కృత్తికాశక్తి యగుటలో నాశ్చర్యములేదు. దానిని పొంది, దానిని పుత్రికగా భావించిన దక్షునివలెగాక, తల్లిగా భావించిన భార్గవరాముడు నిజమునకు కార్తికేయతత్త్వము గలవాడయ్యెను. ఇంటికి వచ్చిన పిదప మానవుల యంతశ్శత్రు నాశనమునకుగల మార్గమును సూచించు కథయే సంభవించెను. భార్గవరాముడు రుద్రగ్రంథి భేదమును సాధించి, నిజస్వరూపము నెఱిగించు తపోన్ముఖుడైనట్లు గ్రహించవచ్చును. అది సిద్ధింపజేసినదియు తొల్లి యస్త్రమే. ఎట్లనగా, నహంకార మనబడు శరీరగతవృత్తిని సూచించినవాడు (అనగా గ్రంథి బంధ కారణమగు తమోరూపుడు) కార్తవీర్యుడైనచో, వానియం దహంవృత్తిని స్ఫురింపజేసిన శక్తి అహమ్మాత రేణుక యగునుగదా! వృత్తిగతమై వృత్తిని స్ఫురింపజేయు బుద్ధివలెనున్న యామె నిజగృహమును 'జొచ్చుటకు పూర్వము ప్రవృద్ధగతి ముఖమును గోల్పోయి నివృత్తగతి ముఖము బొందవలెను. ఆమెకు విధింపబడిన శిరచ్ఛేదమదియే. ఛేదింపబడిన శిరస్సు నామెయే స్వయముగా పట్టుకొనెను. చిద్రూపిణియైన యామె స్వయముగా ధరించిన శిరస్సుచే చిన్ముఖియయ్యెనని భావము. అట్టి మూలదృష్టి యీశ్వరాజ్ఞవలనగాని ప్రాప్తించదు. కనుకనే తండ్రి యాజ్ఞ బొంది రాము డా యాజ్ఞ సంబంధమైన అస్త్రము తోడనే ఛేదించెను. అప్పుడా యస్త్రము జ్ఞానప్రాప్తినిచ్చు రమణాస్త్రమువలె (మూలాన్వేషణ మార్గము) నొప్పినట్లయ్యెను.

ఈ విధముగా సంస్కరింపబడిన రేణుకాకథ నాయన కుల్లాసమునిచ్చెను. కాని, పరశురాముని తల్లి యిఱువదిసార్లు తన గుండె బాదుకొనుటకుగాని, పరశురాముడా లెక్క ననుసరించి యిఱువదిసార్లు తన యస్త్రముచే భూమిని జయించుటకు గాని గల యంతరార్థము విదితముగాక నాయన దాని విమర్శనంతతో విడిచెను. ఇంతలో విశాలాక్షమ్మకు 12-5-1908వ తేదీని పురుడు వచ్చి యాడపిల్ల పుట్టిన వార్త తెలిసి, యాపదలను గట్టెక్కిన సంతోషముతో నాయన వేలూరు వెళ్లెను.

ఓం

నాలుగవ ప్రకరణము

# రేణుక దర్శనమిచ్చి, యస్త్రవిద్యా దర్శనమిచ్చుట

నాయన పడైవీడునుండి వేలూరు బయలుదేరదలచి యుండగా శ్రీ రమణుని కడకు వెళ్లిన నారాయణ ఘనపాఠి మరలివచ్చెను. దేవి స్వయముగా స్తోత్రమును స్వీకరించిన వార్తకు రమణుడు హర్షమును వెలిబుచ్చెనని యతడు చెప్పిన పిదప శ్రీ రమణుని సందేశము నిట్లెరిగించెను: "భగవాన్! రమణుడీ గ్రంథమును మీరు త్వరగా పునరుద్ధరింప జేయవలెనని కోరెను. స్వయముగా దేవి స్వీకరించినప్పుడు ఫలమామె స్వయముగా నియ్యకుండునా" యనెను. స్వగురుని యీ వాక్యముల నాశీర్వాదమువలె నాయన యెంచి యిరువురు శిష్యులతోడను వేలూరు వెళ్లి, పుణ్యాహవాచనోత్సవము ముగిసిన వెంటనే వారిని తమ యిళ్లకు పంపివేసెను. అప్పటివరకు కళ్యాణరామునిపైనున్న స్వల్పదేవతావేశ మానాటిక సందేశము నిట్లు నాయనకొరకు పల్కి విరమించుకొనెను: "నలుబది దినములు నీవు దీక్షవూనుము. నన్ను నీవు చూచెదవు. నా యనుగ్రహమును బొందుదువు." ఇట్టి యనుగ్రహతత్త్వముగల రేణుకయొక్క కృపచే స్త్రీ శిశువై జన్మించి, యాపదలను దాటించిన యీ బిడ్డకు రేణుకా నామములలో నొకటగు 'వజ్రేశ్వరి' యను పేరుంచబడెను.

పిమ్మట నాయన యొంటరియై తపస్సునకు వెడలి, గురుని దర్శించుకొనిన తరువాత రేణుకాక్షేత్రము చేరెను. అక్కడ పూజారియే నాయనకు సేవచేయుచుండగా నాయన తపోదీక్షవూని 'యహం' మూలాన్వేషణమే సాధనగా గొనెను. పగళ్లుమాత్రమే దీక్షాబద్ధుడై కోవెలలో గూర్చుండి, రాత్రులందు సత్రములో విశ్రమించుచుండెను. పగళ్లుపవాసముండి, సాయంత్రములందు పాలను త్రాగుచుండెను. దుష్టులకు భయంకరమై, శిష్టులకు శివంకరమై యొప్పు రేణుకయొక్క యనుగ్రహమందు నాయన సంపూర్ణ విశ్వాసముంచి, యచంచల బుద్ధిచే తపస్సాచరించుచుండ, నచ్చటి పవిత్ర ప్రశాంత వాతావరణ మెంతయో సహాయభూతమయ్యెను.

ఆలోచించగా స్పందములు కరడుగట్టు హిమవన్నగ ప్రాంతములకంటె స్పందములను శాంతింపజేయు మలయ పర్వత ప్రాంతము లధికానుకూలములు. ఇవి శరీర మనస్సుల రెండింటికి విశ్రాంతినిచ్చును. ఈనాటి

ప్రజల దృష్టిలో రేడియో ప్రసార కల్లోలములచే మనస్సును మొద్దుపరచి, దిమ్మపుట్టించు తలనొప్పి కేంద్రములు విశ్రాంతికి తావులుగా నెన్నబడుచున్నవి. ఒక కష్టమును మఱపించుట కంతకంటె పెద్ద కష్టమును కల్పించుటయు, గొంతుకకు వ్యాధి వచ్చినదని యది వ్యాపించకుండుటకు గొంతుక కోయుటయు నేటి చికిత్సోపాయములు. కావున రేణుకా క్షేత్రమువంటి నిశ్శబ్ద స్థలము లిప్పటివారికి నిర్జీవ స్థావరములుగా తోచవచ్చు. కాని, తపస్సాధకులకది యత్యంత సుఖవంతమనుట యతిశయోక్తికాదు.

నలుబది దినముల దీక్ష యిట్లె గడిచెను. దేవతాదర్శన మింకను కాలేదు. అందువలన తుదినాటి సాయంత్రము పాల నారగించిన పిదప మఱల స్నానమాచరించి, యర్ధరాత్రి వఱకు నాయన దీక్షాబద్ధుడై కోవెల ప్రాకారములోని దేవస్థానపు ఆఫీసుకడ కూర్చుండెను. అక్కడనే గోడకొక గడియారముండెను. దాని ప్రకార మర్ధరాత్రి సమీపించెను. ఇంతలో వెన్నెముకయందు విచిత్రమగు వీరసము తోచెను. అది పుట్టుటయే తడవుగా తిరువొత్తియూరులో సంభవించినట్లే దుర్భరమయ్యెను. అప్పటివలె మహర్షి సాన్నిధ్య మపేక్షింపకున్నను, వాసిష్ఠుడు కూర్చుండజాలక శవాసనమున పరుండి, కన్నులు మాత్రము తెరచియే యుంచి, ధ్యానమును విడువకుండ చూచుచుండగా శరీరము తాళవృక్ష ప్రమాణమై పెరిగెను. అప్పుడు కన్నులు తెరచియున్నను, శరీరముపై స్మారక మతనికి దప్పెను. ఆ సమయమందొక విచిత్రము సంభవించెను.

శరచ్చంద్రుని మించిన వర్చస్సుగలిగి, నేత్రములకు చూడ వేడుకయై యొప్పు నొకానొక దేవత వాసిష్ఠుని యెదుట ప్రాదుర్భవించగా, నామెయొక్క భూషణాలంకారములనుబట్టి, శరీరమందున్న గొప్పదగు తేజస్సునుబట్టి, చుట్టు నావరించియున్న పరిజనవేషమునుబట్టి యామె నిశ్చయముగా రేణుకయని యతడు త్రుటిలో నిర్ణయించుకొనెను. కాని, కూర్చుండుటకు నడుమునందు, నిలబడుటకు పాదములందు శక్తి లేక వాసిష్ఠుడుండగా దేవి యతని పిక్కలకడ కూర్చుండి, యతని యెడమ తొడపై గోటితో వ్రణమగునట్లు గీసెను. వెంటనే దివ్యశక్తి శరీరమందు ప్రవహించి, వీరసమును జారద్రోలినందున వాసిష్ఠుడు కూర్చుండి రెండువందల చేటికలతో గూడియున్న దేవిని స్పష్టముగా దర్శించెను. పిమ్మట నిలబడుట కతడు ప్రయత్నించుచుండగా, 'నన్ను నీ వనుసరింపు'మని యామె యాజ్ఞాపించెను. చేటికలు మాయమయిరి.

ఆ యాజ్ఞ చొప్పున వాసిష్ఠు డామె ననుసరించుచుండగా నామె యాలయమునకు పశ్చిమ భాగములోనున్న మారేడు చెట్టువఱకు వెళ్లి, యా చెట్టు చుట్టును కట్టబడిన వేదికపై కూర్చుండెను. అంతట వాసిష్ఠు డామె కెదురుగా ప్రాంజలిబద్ధుడై నిలబడి 'నే నెవడ'నని ప్రశ్నించెను. ఆమె

మందస్మితవదనయై, బదులు పలుకక, వేదికనుండి లేచి, కోవెలకు ప్రదక్షిణ పూర్వకముగా బోయి, వాసిష్ఠునిచే ననుసరింపబడుచు నేకముఖ కుమారస్వామి యాలయము కొచ్చెను. పిమ్మట కుమారస్వామి హస్తమందున్న శక్త్యాయుధమును దీసి యామె వాసిష్ఠుని చేతికిచ్చెను. అతఁడది యందుకొని భుజమున ధరించిన తోడనే యామె కోవెల కప్రదక్షిణముగా బోయి, వాసిష్ఠునిచే వెంబడింపబడుచు, విజగర్వాలయము దరికి వెళ్లి యంతర్ధానమయ్యెను. వాసిష్ఠునకు పూర్వస్మారకము వచ్చి చూచుకొనగా తానదివఱకు పండుకొనిన స్థితియందే యుండెను.

కొద్ది క్షణములలో మఱల శరీరము తాళవృక్ష ప్రమాణముగా పెరుగుట వాసిష్ఠుడు గుర్తించుకొనెను. మఱల శరీరస్మారకము తప్పెను. మఱల పూర్వము వలెనే దేవి వచ్చి, యీసారి దక్షిణ తొడపై గీయగా పూర్వమువలెనే శక్తిధారో దయము, సాక్షాద్దర్శనము కలిగెను. మఱల నాజ్ఞాపింపబడి యతఁడనుసరించు చుండగా నామె పూర్వమువలెనే శక్త్యాయుధమునిచ్చి, యీసారి యాలయమున కుత్తర భాగమందున్న వేదికా మంటపమందు గూర్చుండెను. అక్కడ గోడనున్న యొక చిన్న గూటినుండి యామె యొక యౌషధమును దీసి, భుజించుటకు వాసిష్ఠుని చేతికిచ్చెను. అతఁడది గైకొనిన వెంటనే తినెను. పిమ్మట దేవి యట్లే కూర్చుండి 'ఓ వత్సా! నీ వెప్పుడు జారని మనస్సుతో నిరంతర తపస్సునం దుందువో, అప్పు డిఱువది దినములలో నీవు సిద్ధిని నిశ్చయముగా బొందుదు వని చెప్పెను. అటుపిమ్మట నామె యంతర్ధానమయ్యెను. వాసిష్ఠునకు పూర్వస్మారకము రాగా, పూర్వము పరుండియున్న స్థలమందే యుండెను. మఱి యెట్టి దర్శన మటుపిదప లేక యతఁడా రాత్రి కక్కడనే పరుండి, తెల్లవారిన పిదప తొడలు చూచుకొనగా రక్తచిహ్నితములగు రేఖలు స్వల్పవ్రణములై రెండు తొడలపై స్పష్టముగా నగపడుచు, రాత్రి పొందబడిన దర్శనానుభవము స్వప్నసంబంధముగాదని ఋజువొనర్చుచుండెను.

ఆ చిహ్నములు వాసిష్ఠునకు గగుర్పాటు కలిగించెను. వెంటనే యతఁడు స్నానాద్యనుష్ఠానములను నిర్వర్తించుకొని, దేవిని దర్శించిన పిమ్మట దేవియొక్క ఆలయము నంటియున్నట్లు వెనుక భాగములోనున్న యేకముఖ కుమారస్వామి యాలయమున కూర్చుండి గత రాత్రి దర్శనమును స్మరించుకొనెను. దేవియొక్క స్వరూపము కన్నులకు కట్టినట్లు జ్ఞప్తిపథమునకు వచ్చెను. ఆమె మందస్మిత వదనము, కటాక్షవీక్షణములను బరపు విశాల నేత్రములు, మృదుమధురములగు వాక్కులు, హంసగమనమువంటి నడక, పద్మముల వంటి పాదములు, సర్వ లోకములను శాసించి యనుగ్రహించు హస్తితుండమువంటి హస్తము, నిత్యపూర్ణ చంద్రకళామయమైన ఓజస్సు వెంటనే మనోనేత్రమున స్పష్టాకృతిని బొందెను. ఆ యాకృతినట్లే చింతించుచుండగా వజ్రదండమువలెను వెన్నెముక శక్తిమంతమై,

యందుండి నాడులను తల్లహరి పొందుచున్నట్లయ్యెను. వెంటనే యేకముఖ కుమారస్వామియొక్క శక్త్యాయుధమే ప్రతి మానవుని వజ్రదండమని తట్టి, మూలాధారము మొదలాజ్ఞాచక్రపర్యంతముగల షట్చక్రము లతనియొక్క షణ్ముఖములగుచు, ప్రతి శరీరమునందతని కార్యరూపమును బ్రకటించుననియు, ఆజ్ఞా చక్రమున కేవల షణ్ముఖములై వ్యాపించు శక్తియే శరీరము నుండి నివృత్తి దృష్టిబొంది నిర్విషయులైన వారికి దివ్య వజ్రాస్త్ర శక్తియై యాజ్ఞా చక్రమందున్న రుద్రగ్రంథిని భేదించి, యావల హృదయగతమగు నమృతనాడిచే నేకముఖతత్త్వమును బ్రదర్శించుననియు తట్టెను. రుద్రగ్రంథిని భేదించు శక్తినుండి పుట్టిన యేకముఖ రూపమే ఆత్మజ్ఞానము ననుగ్రహించు నేకముఖ కుమార రూపమనియు, అదియే శరీరాంతమువఱకు వజ్రదండమందు విద్యుద్రూపమున వ్యాపించి శరీర వ్యాపారమును కాపించుటద్వారా యనుగ్రహించునప్పుడు షణ్ముఖరూపము లేదా వజ్రాస్త్ర రూపమగుననియు నాయన బుద్ధియందు తట్టెను. అందువలన రుద్రగ్రంథి విభేదమును బొంది యమృతత్వసిద్ధి బడసిన యోగులందు వారి శరీరము లున్నంతకాలము శక్తి నిరంతరము రెండు ముఖములతోడను నిర్విషయమై, వారి శరీరములను బొందియుండునని స్పష్టమయ్యెను. ఒకటి యాత్మయే సర్వమను జ్ఞానమునిచ్చు పుత్రరూపము, మఱియొకటి శరీరము (లేదా విశ్వము) ఆత్మయొక్క ఒకానొక రూపమను ననుభవమునిచ్చు పుత్రరూపమనియు నాయన స్థిరపఱచు కొనెను. ఆ రెండింటిలో క్రమము ననుసరించి యోగులందు రెండవది యనుభవమునకు వచ్చిన పిమ్మట మొదటిది వచ్చును. కావున గణపతి స్కందు లీ విధముగా జ్యేష్ఠ కనిష్ఠులగుచుండిరనియు, వారిలో వజ్రదండమనెడి కుంత మొకని కాయుధమై, యింకొకని కమృతనాడి శక్త్యాయుధమగు శస్త్రమగుననియు వాసిష్ఠుడుత్తరక్షణమున గ్రహించెను.

ఈ విధముగా గ్రహించుకొని వాసిష్ఠుడు తనకు పూర్వరాత్రి రెండుసార్లనగబడిన శక్త్యాయుధమీ కుంతాస్త్రముల రెండింటిని అనుగ్రహించు వైద్యుత విద్యను సూచించుచున్నట్లు తెలిసికొనెను. ఆ విద్య లోకమును బొందుటకు రెండు విధములైన ప్రయోజనములను గలిగిన మంత్రమేదో కావలెననియు, నొక ప్రయోజనముచే బాహ్యతమస్తమములు సంహరింపబడి, యింకొకదానిచే నాంతర్య తమస్తమములు సంహరింపబడుటకు సువ్యక్తము గావలెననియు నూహించి, యట్టి మంత్రముచే రమణు డుపదేశించిన తత్త్వమునకు కవచమేర్పడి, రమణుని లోకహితకార్యము పూర్ణము కాగలదని యెంచెను. శ్రీ రమణుని ముఖమునుండి తత్త్వము సువ్యక్తమైనట్లే, తన ముఖమునుండి వెలిగినది సువ్యక్తము గావచ్చునని వాసిష్ఠుడు విశ్వసించి, యట్టి మంత్రదర్శనమున కెదురుచూచెను.

ఇట్లుండగా తా గూర్చుండిన ఆలయములోని కొక జటాధారిముని వెళ్లి, యేకముఖ కుమారుని శక్త్యాయుధమును గైకొని వెలుపలకు వచ్చి, నాయనవైపు జూచి యంతర్ధానమయ్యెను. అతడే రేణుకాపుత్రుడైన పరశురాముడు కావచ్చునని స్ఫురించెను. ఆ వెంటనే వేదములోని యొక సూక్తపాదము (ఋ.మం. 7 అ. 2. సూ. 32 లోనిది) హఠాత్తుగా బుద్ధికి స్ఫురించెను. ఇది యేమట్లు స్ఫురించెనని దానిని ధరించి, సూక్తమునంతను స్ఫురింపజేసికొనగా, నిఱువదియేడు పాదములుగా నున్న యీ సూక్తమందొక వింత తోచెను. తనకు విచిత్రముగా స్ఫురించిన పాదమొక్కటి 'విరాట్' ఛందస్సులో నుండి, మిగిలిన వన్నియు 'బృహతి' ఛందస్సులో నుండుటకీ యొక్క పాదమే సూక్త మంతటికి హృదయము గావచ్చునని తోచి, దాని యర్థముతో సూక్తమునంతను మథించుకొనెను. ఆశ్చర్యము! ఈ 'విరాట్' ఛందస్సుతో బద్ధమైన పాదమే దివ్యమైన అస్త్రవిద్యామంత్రమని స్ఫురించి, దాని ప్రయోగవిధమిట్టి యవగతమయ్యెను. భార్గవరామునియం దవతరించిన దివ్యతత్త్వ స్వరూపమున కిది మంత్రకవచమని వాసిష్ఠుడు నిశ్చయించుకొని, యీ మంత్రదర్శనమును ప్రయోగ విధానముతో సహా అనుగ్రహించి, తన జీవితాభిలాషను సిద్ధింపజేసిన రేణుకా పరశురాములకు హృదయపూర్వక వందనము లర్పించుకొనెను. అట్లే రేణుకకు పుత్రునివలె కార్తికేయతత్త్వముచే నవతరించి, తనకు గురువై, తత్త్వోపదేశమునకు కవచమైన మంత్రదర్శనమున కనుకూలతను గల్పించిన శ్రీ రమణునకును వందనము లర్పించుకొనెను. విరాణ్మహామంత్రమని పేరుగాంచి, వసిష్ఠఋషికి తొలుత దర్శనమై, యతని పుత్రుడైన శక్తికి పిదప దర్శనమై, యుభయుల పేర్లతో వేదమందు ప్రసిద్ధమైన యీ దివ్యాస్త్రమంత్ర మీ కాలములో తిరుగ 'వాసిష్ఠ' నామధేయునకు దర్శనమై పునరుద్ధరణము బొందుట యొక యద్భుత విశేషమనక తప్పదు. దీనివలన మన వాసిష్ఠుడు నవయుగ వేదవాసిష్ఠుడై వేదసూక్త హృదయములను భేదించుట కధికారమునుగూడ పొందిన వాడయ్యెను. ఆ యధికారము నెఱిగి యతడానాటినుండి 'ముని' బిరుదమును స్వయముగా వహించెను. దర్శనమైన యీ మహామంత్ర మిట్లున్నది :-

"రాయస్కామో వజ్రహస్తం సుదక్షిణం పుత్రోన పితరం* హువే:"

---

*మంత్రార్థము:- రాయస్=ఇహపరములు రెండింటికి జెందు సకలైశ్వర్యములు; కామో= కామించువాడనై; వజ్రహస్తం సుదక్షిణం=వజ్రాయుధము హస్తమందున్న వాడును, దక్షిణ భాగవర్తియునగు నింద్రుని- మానవుల సూక్ష్మ హృదయము కుడివైపున నుండును కనుక హృదయేశుడు దక్షిణభాగవర్తి; పుత్రోన పితరం హువే=తండ్రిని పిలుచు కొడుకువలె (ఆ యైశ్వర్యములందు హక్కున్న పుత్రుని వలె వర్తించుటకు) పిలుచుచున్నాను.



శ్రీ కావ్యకంఠ వాసిష్ఠ గణపతిముని (ఉమాసహస్రము)

## a manthra in NAYANA'S Telugu hand

విరాణ్మహావ్రతస్య వసిష్ఠ ఋషిః.
ఇంద్రో దేవతా. ద్విపదా విరాట్ ఛందః

రాయస్కామో వజ్రహస్తం
సుదక్షిణం పుత్రో న పితరం హువే।

రాయస్కామః। వజ్రహస్తం।
సుదక్షిణం। పుత్రః। న। పితరం।
హువే॥

సుదక్షిణం అన్నిశరీరములలో దక్షిణ
భాగవర్తియైన తేజః స్థానానుకూలులైన
తేజః మహాదాతయైన। వజ్రహస్తం
వజ్రధరుడైన ఇంద్రుని। రాయస్కామః
విశ్వశ్రీకాముడనై। పితరం తండ్రిని
పుత్రః+న కొడుకువలె। హువే పి
లుచుచున్నాను.॥

నాయనగారి దస్తూరితో తెలుగులో మంత్రము

ఇఱువది యక్షరములు గల యీ మంత్రవిద్య కధిష్ఠాన దేవత యింద్రాణీ దేవత. ఆమె యంశావతారమును బొందిన రేణుకయు దేవతాస్వరూపిణియే.

ఇఱువది సార్లామె గుండె బాదుకొనుట యిఱువది శబ్దాక్షరములను సూచించుటకై యలంకార భాషాప్రియులు వ్రాసియుందురు. తచ్ఛ్రవణము పరశురామునియం దస్త్రబలము నుద్బోధించెను. దానితో నత డిఱువదిసార్లు భూమిని జయించెననుటయు నన్ని యక్షరములు గల యీ మంత్రము జయసాధక విద్య యనుటకే. ఉమాసహస్ర మీ విధముగా రమణ గణపతుల యుభయుల యవతార తత్త్వములను, తదావశ్యకతను వ్యక్తపరచుటకు ఫలించెను.

❋❋❋
❋

ఓం

అయిదవ ప్రకరణము

# పాప పరిహారము

రేణుకాదర్శనమును బొందిన పిదప వాసిష్ఠుడు విశ్రాంతికై వేలూరు వచ్చెను. వచ్చి రేణుకా పరశురాముల యనుగ్రహముచే దర్శనమైన అస్త్రవిద్యామంత్రమును శిష్యులందరకు నుపదేశించెను. ఈ నవ్యోపదేశము వేదసంబంధము కనుక దీనిని బొందిన స్త్రీ పురుషులందరు 'వైదిక సంఘ'* శిష్యులుగా పరిగణింపబడిరి. వాసిష్ఠవైరుల కిదియొక క్రొత్త యలజడిగా తోచెను పూర్వము విచారణ జరిపిన ప్రముఖులలో 'చిన్నస్వామి' యను పోలీసు ఇన్స్పెక్టరు వాసిష్ఠుని పొకడల కుగ్రుడై, యేదేని నెపము కల్పించుకొని చిత్తూరునుండి వేలూరు వెళ్ళి, వాసిష్ఠుని జుత్తు పట్టుకుని తన్ని పరాభవింపదలచెను. 'చూడుడు! నే నీ వాసిష్ఠు నెట్లు తన్నెదనో' యని తరచు పల్కు ప్రతాపములను వినినవారందరు నసహ్యించుకొనుచున్నను చిన్నస్వామి తన యకారణ వైరమును, క్రోధమును హెచ్చుచేసికొనదొడగెను. ఇట్లుండగా నతనికి వేలూరు బదలీ చేసినట్లు వార్త తెలిసి యతడు పొంగిపోయి యుత్తరవుకొఱ కాతురపడజొచ్చెను.

ఒకనా డుత్తరువు వెడలినట్లు సుందరి భర్తకు తెలియగా భర్త నోటినుండి వినినతోడనే యామె నాయనను దర్శించి 'మీకీ వార్త ముందుగా చెప్పుటకు వచ్చితిని. అతడీ యూరు చేరక పూర్వము మీ రెచ్చటికైన దూరముగా పోవలె'నని బ్రతిమాలెను. 'భయములే'దని నాయన పల్కినను విశాలాక్షమ్మ, తదితర కుటుంబస్థులుకూడ భయాందోళనములచే కంట తడి పెట్టిరి. అది చూచినంతనే వారి దుఃఖకారణమును నివారించుటకు వాసిష్ఠవాణి కదలెను. కదలిన యా వాణి యుమాసహస్రములోని యొక శ్లోకముచే దుర్గ నాహ్వానించెను. ఆ శ్లోకమిది:

శ్లో॥ "వైరిగణ నిర్దళన ఖడ్గవర పాణే।
వాసని పదోర్దళన వాసనిచ శోణే।
నేత్రమిష పావక విశోషిత లలాటే।
పాప మఖిలం జహి మృగాధిపది ఘోటే॥"

పాప పరిహారమును దుర్గ నిశ్చయముగా చేయునని విశ్వసించి యెల్లరును ధైర్యము వహించిరి.

---

*దీనికే 'ఇంద్రసంఘ'మనియు నింకొక పేరుండెను.

కాని, కొద్దినిముసములకు నాయన చిత్తము శాంతించి ఇట్లు తర్కించుకొనెను: "ఏల నా వాణి యిట్లు తొందరపడెను? నేను కొన్నాళ్లు దూరముగా పోవుట మంచిదని నా కిదివఱకే పోలీసువారు హితవుపల్కిరి. అప్పటికి రేణుకా క్షేత్రమున దీక్ష పట్టవలసి యున్నందున నే నా హితవాక్కును మన్నింపకున్నను, సుందరి చెప్పినప్పుడైన దానిని స్మరించి యుండవలసినది. ఇప్పుడైన నేనా యుపాయమును స్వీకరింపనియెడల వారులవలన నపాయము సిద్ధింపవచ్చును. కనుక నే నీ రాత్రియే మాఱువేషమున వేలూరు వీడెదగాక;"

వాసిష్ఠ డీ నిశ్చయము నితరులకు దెలియకుండు విధమున విశాలాక్షికి, నప్పుశాస్త్రికి చెప్పి, యా రాత్రి యప్పుశాస్త్రి సహాయమున విద్యార్థివేషము వేసికొని, టోపీ ధరించి, రైలెక్కి రేణిగుంట వచ్చి, యక్కడనుండి హంపీ విరూపాక్ష క్షేత్రమునకు పయనమయ్యెను. తెల్లవారిన పిదప పూర్వవేషమును తిరుగ ధరించి, షరాయి, టోపీలను మూటలో గ్రుక్కెను.

'హంపి' వెళ్లుటకు వాసిష్ఠుడు 'గుంతకల్లు' స్టేషనులో తిరుగు రైలు మారవలసివచ్చెను. అట్లు మారినప్పుడొక ఖాళీగానున్న పెట్టెలో వాసిష్ఠుడు కూర్చుండెను. కాని, రైలు కదలు సమయమున కందులోనికి సాధువేషధారియైన పురుషుడెక్కి, వాసిష్ఠునితో సంభాషణ మొదలుపెట్టెను. వాసిష్ఠుడు తన వృత్తి తపస్సని చెప్పినను, కాషాయములు లేకుండుటకు వాసిష్ఠ నా పురుషు డనుమానించెను. అతడొక పెద్ద నేరస్థుడు, కపటజవి యగుటచే నిట్లనుమానించి, వాసిష్ఠుని మోసగించుటకు సాహసించెను. "మీరు 'హొస్పేట' స్టేషనులో దిగి, స్టేషనుకు సమీపములోనున్న సత్రమునందీ రాత్రికి బసచేసి, యుదయమున నొక జట్కాబండిపై 'హంపీ' చేరుట మంచి"దని యతడు వాసిష్ఠునకు హితవు పల్కి, తానుగూడ హొస్పేట స్టేషనువఱకు బోవలసినవాడైనను దానికివల స్టేషనులో దిగి మాయమయ్యెను. రైలు హొస్పేట చేరి వాసిష్ఠుడు దిగబోవుచుండగా నొక పోలీసుజవాను వచ్చి "మీతో ప్రయాణము సల్పిన సాధువెక్కడ" యని ప్రశ్నించగా వాసిష్ఠుడు తనకు తెలియదని పల్కి, సత్రమునకు బోయి యక్కడ రెండరటిపళ్లతో నాపూటకు క్షున్నివారణము చేసికొనిన పిదప తనలో తా నేదో యాలోచించుకొనుచు నర్ధరాత్రివఱకు కూర్చుండి యుండెను. వాసిష్ఠుని ప్రశ్నించిన జవానింకొకనిని సహాయముగా తెచ్చుకొని వాసిష్ఠుడున్న సత్రమందే రహస్యముగా దాగియుండెను. సాధువేషధారియైన దొంగకొఱకు వాసిష్ఠుడు నిరీక్షించుచున్నట్లు వారు తలచి, వాని రాకకు వేచియుండిరి. ఇంతలో నర్ధరాత్రియగుసరికి దొంగ వచ్చి, వాసిష్ఠుని గుర్తించి, యేదో మాట్లాడ నారంభించుచుండగా పోలీసుజవాన్లు వానిపై పడి పట్టుకొనిరి. వానితో పాటు వాసిష్ఠునికూడ పోలీసు ఠాణాకు వారు గొంపోయి, యిద్దరిని చెరియొక గదిలో రాత్రికి ఖైదుచేసిరి. అప్పుడు వాసిష్ఠుడు

తనలోతా నిట్లనుకొనెను - "అపవాదుకు జంకి నేను వేలూరు మండలమును విడినను నన్నా యపవాదములు విడుటలేదు. నన్నింతకాల మాపదలనుండి రక్షించిన రేణుక యందు ధైర్యమునుంచక వచ్చినందుకిది ఫలమై యుండవచ్చును."

మఱునా డుదయమున పోలీసు ఇన్స్పెక్టరు సమక్షమున వాసిష్ఠు డుంచబడెను. అతడు వాసిష్ఠుని పూర్తిపేరు విని తెల్లబోయి, సాధువేషధారి సాంగత్య మెంతవఱకుండెనో తెలిసికొనిన పిదప జవాన్లను చీవాట్లుపెట్టి, వాసిష్ఠుని విడుదల చేసెను. పిదప నతడు "నేను బ్రాహ్మణుడను, బొబ్బిలి కాపురస్థుడను. మీ దివ్యచరిత్ర వినుట తప్ప మిమ్ము జూచు భాగ్యము నా కింతకాలమును లేకుండెను. అది యీ తీరున ప్రాప్తించుటయు మేలే. ఈ దొంగవెనుక నింకొకడు దూరముగా నుండును. మిమ్ములను మా జవాన్లు తీసికొనిరాని పక్షమందా రెండవ దొంగవలన మీకు గొప్ప యాపద సంభవించియుండు"నని పల్కి వాసిష్ఠుని తన యింటి కాహ్వానించి తీసికొనివెళ్లి సత్కరించెను. అతడు వాసిష్ఠునికడ మంత్రదీక్షను బొంది శిష్యుడయ్యెను. ప్రభుత్వ రక్షక శాఖవారి వైరము తొలగి యీ విధముగా మైత్రి యేర్పడుట వాసిష్ఠునకు శుభసూచకముగా తోచి, దానిని కల్పించిన రేణుకను స్మరించుకొనుచు పది దినము లా శిష్యునింట సుఖముగా గడిపెను.

ఈ శిష్యుడు ప్రాప్తించిన విధ మెఱిగించుచు వాసిష్ఠునిచే వ్రాయబడిన యొక లేఖకు సుందరి భర్తవద్దనుండి జవాబు వచ్చెను. దానిలో నత డిట్లు వ్రాసెను: "మీచే నాహ్వానింపబడిన దుర్గ, చిన్నస్వామియందు హఠాత్తుగా కడుపులో ప్రమాదకరమగు బాధను గలిగించి వాని ప్రాణములను హరించెను. మీరు పాప పరిహారమునకు దుర్గ నాహ్వానించుట యెల్లరకు తెలిసెను. ఈ ఫలము మీ శత్రువులకు పిడుగుపాటయ్యెను. కిట్టనివారి మాటలు విని మీ పై నధికారగర్వము చూపి చచ్చుటకంటె మీ శరణుబొందుట యిహపరక్షేమమని పోలీసువారు తలచుచున్నారు. చిన్నస్వామి మృత్యువునకు జాలిపడవలదు. అది యట్లు జరుగుట మేలై మీపై నున్న యపవాదముల నన్నింటిని తుడిచిపుచ్చెను."

ఓం

ఆఱవ ప్రకరణము

# సంచారము, ఉమాస్తుతి పునరుద్భవము

సుందరియొక్క భర్త వ్రాసిన యుత్తరము నందుకొని నాయన తన జీవితమం దద్భుతానుభవములకు, శిష్యవర్గ లాభమునకు, తపస్సునందు విచిత్రాంశములను సాధించుటయందిచ్చిన ప్రేరణములకు కారణభూతమైన వేలూరివాసమును, దానిని కల్పించిన యీశ్వరకృపను చాలసేపు స్మరించుకొనెను. ఈ విషయములో నీశ్వరకృపకు తోడ్పడిన రేణుక యను దేవతాశక్తిని, యామె పటుతరమహిమను గూడ స్మరించుకొనుచు "అరుణగిరిరూపమున నీశ్వరున కభిన్నయై యర్థాంగివలె వెలసిన వైదిక దేవతాశక్తి లోకోద్ధరణముకొఱకు రేణుకా క్షేత్రమందే కదా మాతృత్వము వహించి యఖిల జగన్మాతయై, లోకకార్య నిర్వాహకులగు పుత్రుల నిఱువురను బడసి, కార్యదక్షతను వారియందు సమయానుకూలముగా కల్పించి జగన్నాటకము నాడించుచు, వారిద్వారా యీ సంసారకథను నిర్వర్తించుచుండెను! కానిచో, నాయందు రమణునివలె స్థైర్యము నీయక, నా కిష్టములేని చలనకారణములను కల్పించి నన్ను దారి తెన్ను తెలియని జీవునివలె త్రిప్పనేల? మఱియు సిద్ధులను నా యందు సాధింపకుండగనే కల్పించియు, రాబోవు విషయములను గుఱించిన జ్ఞానమును నాయందు మూతబఱచి, నా తపశ్శక్తి పాండిత్యముల కపవాదమనియైన నెంచక నన్ననవరత జిజ్ఞాసువువలె నుంచనేల? కానిమ్ము. నన్నామె యాడించిన నాటకము నజ్ఞాని వలెనే యాడుచు, నామె కృపకై మొఱబెట్టు భక్తుడనై యుందును గాక" అని తలపోసికొనెను.

ఇట్లు నిశ్చయించుకొని వాసిష్ఠుడు తన యపవాద ఘట్ట మంతమొందిన నందులకు సంతసించెను. పిమ్మట పోలీసు శిష్యుని సహాయము బడసి యతడు హంపీ విరూపాక్షాలయమును దర్శించుకొని, యా ప్రాంతమున శిథిలములైనను నొకప్పుడు మహావైభవముతో వెలుగొందిన విజయనగరపు కట్టడములను, తత్పరిసర పంపానదీ పంపాసరోవరములను తిలకించి వచ్చెను. ఏ కారణముననోగాని నాయన కక్కడ తపస్సు చేయవలెనను నుత్సాహము కలుగలేదు. ప్రేరణోత్సాహము లెక్కడ గల్గిన నక్కడే తపోదీక్ష పూనుటకు సంసిద్ధుడై యతడా ప్రాంతమందు ప్రసిద్ధములైన క్షేత్రములను దర్శించుచు, తుదకు 'మావులి' యను క్షేత్రమందు మౌనదీక్షపూని తపస్సున నుపవిష్టుడయ్యెను.

'అహం' మూలాన్వేషణమే తపస్సాధనము. కరతలభిక్ష చేసి సాయంత్రము లందు బ్రాహ్మణవీధిని పట్టెడన్నము గైకొని తిని, పగలంతయు

నుపవాసముండుట. ఒక నెల యిట్లు చేయుసరి కతని యచంచల ధ్యానమునకు పురజను లత్యంతాదరణ మనస్కులై, యతడున్న చోటున కన్నమును వండుచొప్పున దెచ్చి యీయదొడగిరి. అది గమనించి వాసిష్ఠుడు సంజ్ఞ చేసి యన్నమునకు బదులు పాలనర్థించగా నవి యమరెను. అప్పుడతడు రేణుకాదేశమును మన్నించి రాత్రులందుగూడ నంతర్దృష్టి సాధనమును విడువక ఘోరదీక్షపూని యుండుటకు నిశ్చయించుకొనెను. కాని, పదునెనిమిదవ నాటి రాత్రి వశము దప్పి నిద్రించిన కారణమున దీక్షాభంగమై, రేణుకచే చెప్పబడిన గడువు పూర్తిగాక, యస్త్రవిద్య యందు సిద్ధిని బొందజాలకపోయెను. అటుపిమ్మట శరీరారోగ్యరక్షణకొఱకు కొంతసేపు నిద్రించుచున్నను సాధనను విడువక మఱియొక పక్షము దీక్ష గడుపుసరికి క్షేత్రదేవత మూడేళ్ల బాలికవలె నొకనాటి సాయంసంధ్యాసమయమందు వచ్చి, తనకెదురుగా కూర్చుండి, చిన్న చిన్న ముద్దుపల్కులతో వాసిష్ఠదృష్టి నాకర్షించుచు, నట్టి పల్కులతోడనే భవిష్యద్రహస్యములను జెప్పి, యస్త్రవిద్యాసిద్ధికి లోకమం దింకను కాలము పక్వము కాలేదని విశదపరచిన పిమ్మట మాయమయ్యెను. ఈ యద్భుత దర్శనముచే వాసిష్ఠుని శంకలన్నియు నివారింపబడెను. బాహ్యాస్త్ర మగుటకు గాకున్నను నధిక మంగళములను, అంతర్యశక్తి పాకములను అపాయము లేని విధమున నొడగూర్చుటకు, విరాణ్మహామంత్రమును సంఘమందు వ్యాపింపజేయుటకు వాసిష్ఠు డామె యాజ్ఞ బడసెను. మఱియు దేశమందు పరిశిష్టమైయున్న వేదసూక్తహృదయ పరిశోధనకార్యము నింక జీవితలక్ష్యముగా నుంచుకొనుట కాజ్ఞాపింపబడెను. బీజప్రదానము మాత్రమే ప్రస్తుతము తనకు విధింపబడిన కార్యమనియు, కాలము ననుసరించి యా బీజములను వృక్షములుగా వృద్ధిబొందించు బాధ్యతలుగూడ క్రమవశమున విధింపబడుననియు నామె చెప్పి వాసిష్ఠుని సంతుష్టుని గావించెను.

అటుపిమ్మట దీక్ష చాలించి యతడు హొస్పేటమీదుగా వేలూరు చేరెను. 'మావుళి' ప్రాంతమువారు వాసిష్ఠుని యూరుగాని, పేరుగాని తెలియక యతనిని 'ద్రావిడ రాజయోగి' యని పిలుచుచుండెడివారు. కాని, క్రమముగా హొస్పేట పోలీసు ఇన్స్పెక్టరువలన వాసిష్ఠ చరితమును విని నప్పు డతనియం దింకను గౌరవమును బొంది యతనిని దర్శించివచ్చుటకు పెక్కుమంది వేలూరు వెళ్ళి, యక్కడ నుండి యరుణాచలక్షేత్ర మతని యాదేశము చొప్పున వెళ్ళి శ్రీ రమణ భగవానుని దర్శనమున కృతార్థులైరి.

వేలూరు చేరిన తోడనే నాయన స్వగురుని దర్శించి, భగవతి చెప్పిన దంతయు గురునితో చెప్పిన పిదప కొన్నాళ్లు విశ్రాంతి గైకొనుటకు వేలూరు మరలివచ్చెను. తిరువణ్ణామలైలోని శిష్యులు సుమారొక సంవత్సరమునుండి నాయన దర్శనమున కెదురుచూచుచున్నవారివలె పరివేష్టించి, చూతగుహ నధిష్ఠింప గోరిరి. "ఉమాసహస్రమును పునరుద్ధవింపజేసిన పిదపగాని యధిష్ఠించ"నని

నాయన శపథపూర్వకముగా పల్కి, వారిని నిరుత్తరులను గావించెను. ఆ గ్రంథమునకు, చూతగుహకు గల సంబంధమేదో యున్నట్లు వారనుకొనినను, వారి కది దురూహ్యమయెను.

పిమ్మట వేలూరులో నాయన రెండుమాసము లించుమించుగా నుండి విశ్రాంతివలన శరీరాయాసమును కోల్పోయెను. అప్పుడు కలువరాయినుండి శివరామశాస్త్రిని రావించుకొని, వాని సహాయముతో నాయన దక్షిణయాత్రలకు వెడలెను. మొట్టమొదట భారతభూమికి దక్షిణాగ్రమున సాగరత్రయమును శాసించు 'కన్యాకుమారి' క్షేత్రమును వారు దర్శించిరి. దక్షుడను నాకాశగర్భ మందు తిరోధానతత్త్వముచే నదృశ్యయై, నష్టమైనట్లెంచబడిన సతీదేవి యెప్పు డాపోభూతమును చిమ్ము బాల్యక్రీడచే వ్యక్తమయ్యెనో. అప్పుడామె వ్యక్తిసృష్టి ననుగ్రహించుటకై పునరుద్భవించినట్లు చెప్పబడుచున్నది. ఈ పునరుద్భవ మం'దుమ' యని పేరుబడసిన అనుగ్రహ దేవతాతత్త్వమువలన నన్యోన్య వృద్ధిక్షయములచే ప్రకాశించిన ధరయందు ముప్పదిరెండు చంద్రకళలా వృద్ధిక్షయములను శాసించుచున్నందున నామె నిత్య పూర్ణచంద్రకళామయియైనను, భూమిని పొంది నపుడు ముప్పదిరెండు కళాస్థానములను క్షేత్రములందు వేర్వేరుగా బొంది వెలసి నట్లును, అట్లయినను తన యావదనుగ్రహతత్త్వ మీ స్థానములను నిరూపించు క్షేత్రములం దిమిడియున్నట్లును తాంత్రికులు వచింతురు. కనుక వీనిలో నేయొక్క క్షేత్రకళ నారాధించినను భగవతి తన పూర్ణకళాతత్త్వముచే ననుగ్రహించునను మాట మఱువరాదు.

అందువలన బాలయైనను, సద్రూపుడైన యీశ్వరుని పొందు తిరుగగోరిన తపోకన్యగా వెలసిన దాదిమక్షేత్రమై, కన్యాకుమారి క్షేత్రమైనట్లెంచబడుచు, సతీదేవి వలెనే జిజ్ఞాసాయుత మానవబుద్ధి కన్య యీ క్షేత్రదర్శనమువలన తపఃప్రేరణము పొంది యనుగ్రహింపబడునని విశ్వసింపబడుచున్నది. తాంత్రికుల ప్రతిష్ఠలకును, వేదమత దృష్టిని విడువక యింద్రవరముగా చేయబడిన దేవతాప్రతిష్ఠలకును కొంత భేదమున్నది. శాక్తేయ మొకప్పుడు వేదమతముచే సంస్కరింపబడినను, మానవబుద్ధి నది తిరుగ నాకర్షించి వైదిక మతమును విస్మరింపజేయగల్గెను. అందువలన కొన్ని యింద్ర క్షేత్రము లీశ్వరక్షేత్రములుగనో, విష్ణుక్షేత్రములుగనో మార్చబడెను. బ్రహ్మయే యింద్రుడుగా కొలువబడి, బ్రాహ్మణ కులములచే బహుకాల మారాధింపబడినను బ్రాహ్మణుల వణగద్రొక్కిన యితర కులములు బ్రహ్మకు ప్రతిష్ఠ కూడదనియు శాసించి, యింద్రక్షేత్రములను వశమొనర్చుకొని కొద్దియో గొప్పయో మార్పుచేసిరనుట సత్యదూరము కాదు. నిష్పక్షపాత బుద్ధి తోడను, యుక్తమగు విమర్శతోడను మన దేశ మతచరిత్రములను పరిశీలించువారికీ మతఘర్షణ మంతయు ద్రవిడులకు, నార్యులకు గల దృగ్భేదఫలమని విదితమగును. తుదకు ద్రవిడుల వర్ణభేదమునకు, నార్యుల సమత్వబుద్ధికి గూడ

సంఘర్షణలు మన దేశమం దార్య పండిత (వీరే బ్రాహ్మణులైరి.) కులములు ప్రవేశించినప్పటినుండి సంభవించుచున్నవి. అర్యులు రాక పూర్వమే యీ దేశమందు ద్రవిడ సంప్రదాయమై యున్న వర్ణవిభాగ మనాది యనబడుట కదియే హేతువు. అంతేకాక, భగవంతుడు మానవజాతినంతను గుణకర్మ విభాగముల ననుసరించి చతుర్వర్ణములుగా విభజించెనను వాక్య మార్యసంప్రదాయమును సూచించదు. కావున ద్రవిడ ప్రచారకమని స్పష్టమగును.

ఇట్టి విభాగము లార్యులు వచ్చుసరికెట్టి యనర్థములను కల్పించి యుండెనో వాని తాండవము ననుభవించు నిప్పటి కాలమువారి కవగతమగును. ఇప్పటికాలమందు కులవర్ణములవలన జీవుని యదృష్టము తారతమ్యమును జెందుచున్నది గాని పూర్వకర్మ సుకృతమువలనగాదని యెల్లరకు ధ్రువమగు చున్నది. అందువలన కులమును మార్చుకొని క్షణములో పెక్కుమంది యదృష్ట వంతులై, కులభేదమునకు గుణకర్మ లాధారములుకావని ఋజువొనర్చిరి. దీని వలన నానాడెట్లో, యీనాడట్లే కులవర్ణములు కొన్ని ప్రచారబలముచేతనో, సంపదవ్యామోహము నిచ్చుటచేతనో సంఖ్యలచే వృద్ధిబొందినను, సంకరములై, యంతఃకలహములకు దారితీసెను. వైదికమతము తన ఘనతచే విద్యనిచ్చి యెల్లరను బ్రాహ్మణుల నొనర్చు సంస్కరణమును కోరబెట్టి, యభివృద్ధిని జూపి, చాలకాలమువఱకు సంఘమందు సుఖమును నెలకొల్పెను. వైదికమతము దుర్బల మెప్పుడు గావింపబడెనో, అప్పు డనర్థములన్నియు తలలెత్తి మానవ జీవితమును దుర్భర మొనర్చెను. అప్పుడు బౌద్ధమత ముద్భవించి, కులవర్ణముల నభివృద్ధిమార్గముచే సంస్కరించి మార్పుతెచ్చుటకు బదులు వాటినన్నింటిని కాలదన్ని యొక మార్పు నిట్టి చూపెను. నాటి నుండి సంస్కారమునకు క్రొత్త యుపాయమొకటి యన్ని రంగములందు వ్యాపించి, పాతవానిని సంస్కరించుటకు బదులు క్రొత్తదానిని నిర్మించుట సులభమేకాక శ్రేష్ఠమై తోచెను.

అయినా, క్రొత్తదైన యీ బౌద్ధమతములో వేదప్రసక్తిని కోరనీయనందున వైదిక ఋషులు మతముతో పా టితర రంగములందు పరిశోధనచే సాధించిన లాభములకుగూడ బౌద్ధమతస్థులు దూరముగావలసిన పరిస్థితి యేర్పడెను. మత మవైదికమైనను బౌద్ధశాస్త్రగ్రంథము లా పరిస్థితిని సాధించుటకు వైదిక పరిశోధనలను స్వీకరించి తమ మతమునందున్న ప్రత్యేకతను రూపుమాపుకొన్నవి. ఆ కారణముచేత నితర దేశములందు బౌద్ధ మతము నిలువగల్గినను, ఆర్యావర్తమందది వేదమతమున కెదురుగా ప్రత్యేకత నిలుపుకొనలేక క్షీణించెను.

ఈ బౌద్ధమత ముదయించినప్పుడు పైన చెప్పబడిన యుపాయమునుండి శాఖవలె నింకొక యుపాయము జనించి బహుళవ్యాప్తమై మానవబుద్ధిని భ్రష్ట మొనర్చెను. ఎట్లనగా, హెచ్చుతగ్గులుగా నున్న రెండింటిలో (అవి వర్ణములు కావిండు, మఱి యితరములు కావిండు) తక్కువదానిని హెచ్చించి

సమముకూర్చుటకు బదులు హెచ్చైనదానిని తగ్గించుట సులభ మార్గమై యగపడెను. నాశనమొక సంస్కార మార్గమైనప్పు డీ రెండవది పరిణమించి, నేటివఱకు మేటి నీతియై మానవజాతి నల్లకల్లోలము గావించుచున్నది. ఆర్థిక, రాజకీయములటుండ మతవిషయమందును మహమ్మదీయ, క్రైస్తవు లవలంబించినదీ మేటినీతియే. తుదకు మన దేశస్థులలో కొందరు హరిజనాభివృద్ధి కీ సూత్రమునే శరణుజొచ్చిరి. స్త్రీ - భూసంపదలు సైతము సంస్కారము పొందుట కీ సూత్రము నెదురు జూచినచో మనము వింతపడ నక్కరలేదు.

కావున వేదపద్ధతి నాశ్రయించి, కాలమును సంస్కరింపదలచిన వాసిష్ఠు డానాడు యాత్రనెపమున కన్యాకుమారీ క్షేత్రమును దర్శించి, యా ప్రక్కన సమీపములోనున్న యింద్రక్షేత్రమును (ఇది సుచీంద్రమని పిలువబడుచున్నను, శచీంద్రమనబడుట యుక్తముగావచ్చును) దర్శించుకొనినప్పుడు మన యార్య మతము నెంతమంది భ్రష్టము చేయజూచినను, అది తన సత్యసౌహార్దాది లక్షణములచే మిగిలియున్న విదర్శనము రేణుకాక్షేత్రమందెట్లో అట్లే యీ రెండు క్షేత్రములందు స్ఫురించెను. వానిలో దక్షాఖ్య ఆకాశ గర్భమందు గుప్త రూపిణియై, మంత్రవిద్యాధికారమున్న వారికిగాని తెలియబడని దాక్షాయణీ తత్త్వము కన్యాకుమారీ క్షేత్రమందును, ఆకాశమునుండి చిమ్మబడిన ఆపోభూత క్రియాఫల రజస్సు ప్రతిఫలించి కార్యరూప విశ్వమైనప్పుడు, దాని నాత్మరూపము వలె ననుగ్రహించుట కధిష్ఠించిన సూర్యమండలమం దింద్రునితో గూడిన యింద్రాణీ రూపము శచీంద్రమందును నూహింపదగును. అట్లయినను, తనకు స్ఫురించిన వైదికదేవతా తత్త్వములను వాసిష్ఠుడప్పటికి ప్రకటించక, నా ప్రాంత మందున్న పండిత గణములతో నొక వారము దినములు గడపిన పిదప రామేశ్వర మనబడు ప్రసిద్ధ క్షేత్రము దర్శించెను.

వాసిష్ఠుని మంత్రశాస్త్రాధికారమునకు, తపఃప్రాభవమునకు కన్యాకుమారీ క్షేత్ర ప్రాంతమున ఖ్యాతివడసిన మలయాళీ పండితులందరు ముగ్ధులైరి. వారిలో కొందఱు నాయన సహవాసము నింకను గోరి, రామేశ్వరమునకు నాయనతో గూడి వచ్చిరి. వారి రాకవలన నక్కడి పండితుల పరిచయము సులభమై, తన్మూలమున క్షేత్రవిధి నిర్వహణము నాయనకు సుఖముగా ముగిసెను. అక్కడ రామాస్త్ర ప్రభావమువలన నేటికిని అలలచే తలయెత్తక నమ్రుడై యున్న సముద్రుని జూచినప్పుడు రేణుకయొక్క దివ్యానుగ్రహమున తనకు దర్శనమైన ఆ యస్త్రము సిద్ధించినప్పుడది యెంతటి శక్తిమంతమగునో నాయన గ్రహించెను. అది సహస్రబాహువులను కార్తవీర్యార్జునునియందు, సహస్ర శిరస్సులను సముద్రునియందు సమయింపజేసిన విషయ మొకటి యిరువుర రాములకును గల పోలికను ధ్రువపరచినట్లనిపించెను. పదిదినములు తృప్తిదీర నాయన రామచరితాద్భుతములను సాంతముగా తిలకించిన పిదప మదుర, పాపనాశనము,

భక్తప్రియ, శ్రీరంగము, జంబుకేశ్వరములను దర్శించుకొనుచు, నాయా స్థలదేవతల యొక్క ప్రత్యేక మహిమల ననుభవముచే గ్రహించి, తుదకు జంబుకేశ్వరమందు కొన్నాళ్లుండ నిశ్చయించెను. ఇంతలో ప్రియశిష్యులు కొందఱక్కడ నెదురైరి. వారి సహాయము లభ్యమైనందున శివరామశాస్త్రి నింటికి పంపివేసి, యాలయోపవనమున నాయన యాసనము కల్పించుకొని, క్షేత్రదేవతయగు నఖిలాంత నాయికను స్మరించుకొని ధ్యానముద్రితుడయ్యెను.

పది దినములు గొప్ప ధ్యానమును సల్పిన పిదప నాయన 'ఉమా'స్తుతి పునర్నిర్మాణకార్యమును తలపెట్టెను. రామకృష్ణుడను శిష్యుడు వ్రాతసామగ్రినిచ్చి, పరిచర్యలు సల్పుట కుపవనమందుండిపోయెను. స్మృతినెంత మథించినను నాయన కేడువందల శ్లోకములకంటె హెచ్చు జ్ఞప్తికి రాలేదు. విచిత్రమేమనగా, మామిడిగుహయందీ గ్రంథము రచింపబడినప్పుడు రమణానుగ్రహమున తుదినా పాలుపున వెడలిన శ్లోకములన్నియు జ్ఞప్తికివచ్చెను. కాని, శ్రద్ధతో నెమ్మది నెమ్మదిగా వ్రాయబడిన భాగములోనివే మఱపయ్యెను. మఱపైన యీ శ్లోకములు తొలిరచనమందు విదేశ ప్రభుత్వ నాశనముకొఱకు కూర్చబడిన మాట వాస్తవము. కాని గ్రంథ ప్రతిలేఖన సమయమందీ శ్లోకములలోని శాప శబ్దములను తొలగించి, యాక్షేపణముండని రూపము వానికిచ్చి నాయన సంస్కరించెను. ఇప్పుడవి స్మృతినుండియే జారి, పూర్తిగా తొలగిపోయినందున శత్రువులకు గూడ పఠనీయమైనట్లు యేడు వందల శ్లోకములు మిగిలెనని నాయన యెంచి, యప్పటికా గ్రంథము 'నుమాసప్తశతి' యని పేర్కొని, మున్ముందు తన తపోభివృద్ధికొలది గ్రహింపబడు నూత్నాను భవములను జొప్పించుట కా కొఱతను వినియోగించుకొన నిశ్చయించెను.

ఈ విధముగా నూత్నరూపమును బొంది, సహస్రము పోయి సప్తశతిగా వెలసిన 'ఉమా'స్తుతిని నాయన వెంటనే రామకృష్ణుడను శిష్యునిద్వారా శ్రీ రమణ మహర్షి యొద్దకు పంపి తన మాటను నిలబెట్టుకొనెను. మిగిలిన భాగమును గుఱించి తన యభిప్రాయముగూడ నాయన వర్తమానమంపి స్వగురునకు ప్రీతిగూర్చెను.

అటుపిదప నాయన జంబుకేశ్వరము విడచి 'యాదిపుర' మనెడి తిరువొత్తియూరు వచ్చుచుండగా మార్గమందు కపాలిశాస్త్రి యగపడెను. వానితో సంభాషించుచు "నేను కొన్ని పురాతన గ్రంథముల నవలోకించవలసి యున్నది. ఆదిపుర వేదపాఠశాల గ్రంథాలయమందవి లభ్యముగావచ్చునను నుద్దేశముతో నేనక్కడ కేగుచుంటిని. అక్కడ దొరకని వాటిని నీవు 'కన్నెమరా' గ్రంథాలయము నుండి తెచ్చిపెట్టగలవా" యని నాయన యడుగగా 'తెచ్చెద'నని యతడు పల్కి, తిరువొత్తియూరు చేరిన వెంటనే గురుని సేవయందు నిమగ్నుడయ్యెను.

నాయన కోరిన గ్రంథముల నతడెట్లో తెచ్చి యిచ్చుచుండగా నాయన యొక్కొక్కదానినే యిట్టె ముగించి యిచ్చివేయుచుండెను. కపాలిశాస్త్రి కొకప్పు డీ గ్రంథములను నాయన సవిమర్శగా చదువుచుండెనా యను శంక తోచి ప్రశ్నించగా నాయన చిఱునవ్వు నవ్వుకొని చదువబడిన గ్రంథములలోని సారమును, కొన్ని విషయములలో నొక గ్రంథమునకు, నింకొకదానికి గల వ్యత్యాసములను తెలియజెప్పెను. మఱియు నట్టి విషయములలో తన నిర్ణయ వాక్యమునుగూడ చెప్పెను. అప్పుడతడు నాయన పాదములను స్పృశించి ''వివేకానందస్వామి యొకప్పుడిట్లే పుస్తకములలోని పుటల నతి త్వరితగతిని త్రిప్పుట చూచి యొకడు నావలెనే ప్రశ్నించగా నతడు మీవలెనే చదివిన విషయములను సవిస్తరముగా జెప్పెనట. అట్టి సత్వర విషయరూప గ్రహణము, బుద్ధియందు వాటిని పేర్చుకొను ప్రజ్ఞ యసంభవములుగావని నేనిప్పుడు స్పష్టముగా గ్రహించితి''నని యొప్పుకొనెను.

శాస్త్రసంబంధములగు గ్రంథములను కొన్నింటినిట్లు ముగించినపిదప పురాణములలో మొదటిదని చెప్పబడు విష్ణుపురాణము నందుకొని నాయన యతి త్వరితగతిని ముగించి ఇచ్చివేసెను. ఇది కేవలము పూర్వయుగ ప్రసిద్ధ పురుషుల చరిత్రములనేగాక, గూఢతత్త్వములను సైతము బోధించు గ్రంథము. దీనిని ముగించిన వెంటనే సాయణాచార్యుని సామవేదభాష్యము నొకపరి తిరుగవేసి నాయన గ్రంథసమీక్ష నింక నాపుజేసి, యెందైన తపస్సునకు బో నిశ్చయించెను.

ఒంటరియై నాయన చిదంబరము, పక్షితీర్థము దర్శించుకొని మఱల నాదిపురము వచ్చుసరి కక్కడ వాసుదేవశాస్త్రి యగపడెను. వానిని వెంటనిడుకొని నాయన 'తిరుత్తణి'యను శాంతగిరిక్షేత్రము దర్శించుకొని, యక్కడ శిష్యుడు తెచ్చు మధుకరాన్నములో రాత్రులందు మాత్రము కొంచె మారగించుచు, పురబాహ్యమం దొక స్థలమున తపోనిమగ్నుడయ్యెను. బహుసుఖముగా జరుగుచున్న యీ తపస్సు వేలూరునుండి వచ్చిన యొక లేఖవలన భంగమయ్యెను. ఆ లేఖలో పుత్రున కుపనయనమును శీఘ్రముగా వచ్చి చేయవలెనని నాయనను కోరుచు విశాలాక్షమ్మ వ్రాసి, యుపనయన సంస్కారము చేసిన పిదప తనకు బాధ్యత తీరి తపస్సు చేసికొనుట కవకాశము చిక్కునని యామె తెలియజేసెను. అందువలన వాసుదేవశాస్త్రి నింటికి పంపివేసి నాయన వేలూరు వెళ్లి, యుపనయన సంస్కారమునకు ముహూర్తము పెట్టి, మహర్షి యాశీర్వచనము బొందిన పిదప దానిని 1910 సం॥ ఫిబ్రవరి (మాఘ) మాసములో జయప్రదముగా నిర్వర్తించి విశాలాక్షమ్మ కోర్కె తీర్చెను.

***

ఓం

ఏడవ ప్రకరణము

# వేలూరువాస మంతమై, ప్రచారక జీవితమున కుపోద్ఘాతము ప్రాప్తించుట

క్రీ.శ. 1910వ సం॥ ఏప్రిల్ నెలలో చెన్నపురపు వకీలు శిష్యుడైన పంచాబగేశశాస్త్రి వేలూరు వచ్చి, గురుదంపతులను దర్శించిన పిదప వారిని చెన్నపురమందు కొన్నాళ్లుండుట కాహ్వానించి "మీకు ప్రత్యేకముగా విశాలమైన బస సమకూర్చెదను. మీ రెన్నాళ్లు చెన్నపురమందున్న నే నన్నాళ్లు మీ ఖర్చు భరించెద"నని చెప్పెను. నాయన సంతోషించి 'నేను వేలూరువాసము నంతము చేయుటకే యెదురుచూచుచుంటిని. ఏ రేణుక మాకీ వేలూరువాసము కల్పించి, యిక్కడనున్న యాతేళ్లలో నాలువందల జన్మలకైన ప్రాప్తించని యనుభవముల నిచ్చి, యుపాధ్యాయ పదవికి బదు లుపదేశదేశిక పదవినొసగి యనుగ్రహించెనో, ఆమెయే ప్రేరేపించి నిన్నిటకు బంపినట్లు నాకు స్ఫురించుచున్నది. మా వానప్రస్థ మిదివఱకే ప్రారంభమైనను, పుత్రుని బ్రాహ్మణ్య సంస్కారము ముగిసినప్పటి నుండి యథార్థమయ్యెను. మే మొకమాస మరుణాచలక్షేత్రమం దామ్రగుహలో గడపిన పిదప చెన్నపురము వచ్చెద'మని మాట యిచ్చి, శిష్యుని బంపెను.

అమ్మ నాయనలు శిష్యునకిచ్చిన మాటచొప్పున నరుణగిరి వాసమునకు వెడలిరి. పుత్రుడైన మహాదేవమును మాత్రము వెంటనిడుకొని, రెండేళ్ల వయస్సు గల వజ్రేశ్వరిని కామాక్షి యప్పశాస్త్రుల యొద్ద వారు దిగవిడిచిరి. అమ్రగుహ చేరిన పిదప వారుభయులు మహాదేవము తెచ్చు భిక్షాన్నము నారగించుచు ధ్యానమం దుపవిష్టులయిరి. నాయనకు తీసిపోని విధమున విశాలాక్షమ్మ నిష జూపి, 'యమ్మ' యను తన బిరుదమును సార్థకము జేసికొనెను. ఆ సమయమం దొకనాడు శ్రీ రమణుడు విరూపాక్ష గుహనుండి గిరిప్రదక్షిణకై బయలు దేరెను. పరివారమును ముందు పొమ్మని నాయనతో గూడి వచ్చుటకు రమణుడు చూతగుహ కేగెను.

అక్కడ నాయన వచ్చులోపున కొంతతడ వంతర్లోచనుడై కూర్చుండెను. పిదప నాయన వచ్చి చేరినంతనే శ్రీ రమణుడు బాహ్యదృష్టికి వచ్చినను, అంతరానుభవమును వీడనివానివలె తన యథార్థ తత్త్వము నెఱిగించు వాక్యముల నిట్లుచ్చరించెను. "నే నెవడను? యీ గోళములన్నియు నక్షత్రములతో సహా నా పదములకడ సంచరించుచున్నట్లు గాంచగల్గు నే నెవడను?" వెంటనే నాయన

"ఓ భగవాన్? నీవు స్కందుడవుగాక మఱి యెవ్వడవు? నీవే కార్తికేయుడ"వని పల్కి, యథర్వణ వేదములోని స్కంద సూక్తముచే స్తుతించెను. ఒక నెల యిట్టి యనుభవములతో గడపి యమ్మ నాయనలు తిరువణ్ణామలైనుండి చెన్నపుర మేతెంచిరి. పిదప కొద్ది రోజులు సుధన్వ నింట గడపుచుండగా 'జార్జిటౌన్' క్రొత్తవీధిలో పంచాపగేశశాస్త్రి యొక మంచి బస నద్దె కమర్చెను. ఆ కారణముచేత వారు వేలూరు వచ్చి, సామాన్లను గైకొని, యప్పాదంపతులతో కూడి చెన్నపుర మేతెంచి, క్రొత్త యావాసము స్థాపించిరి.

అప్పశాస్త్రి 'యఫ్.ఏ'కే చదువు మానివేసెను. నాయనవలె తన జీవితమును తపోవృత్తిచే గడపవలెనను నభిలాషగలది యుద్యోగము మాట తలపెట్టలేదు. కల్యాణరాముడు మాత్రము 1907వ సం॥లో మెట్రిక్యులేషన్ ప్యాసయిన పిదప తా జదివిన 'మహంతు' హైస్కూలులోనే రూ.15 వేతనముపై నుపాధ్యాయుడుగా నమరెను. అతని భార్య మంగళమ్మ వజ్రేశ్వరి పుట్టిననాడే కాపురమునకు వచ్చెను. ఒక యేడాది వయస్సుగల కుమారునితో వారిని వేలూరులో విడిచి మిగిలిన కుటుంబము కదలెను. అమ్మ నాయన లీ రీతిగా కాపురము నెత్తివేయునపుడు శిష్యులు, ఉపాధ్యాయ మిత్రులు, పురజనులు కూడ తపోజ్యోతి యనెడి పెన్నిధికి దూరమగుచున్నట్లు కంట తడి పెట్టిరి. కల్యాణరాముని యావేదన మఱియు దుర్భరమయ్యెను. మఱి పది పండ్రెండు మాసము లిట్లే గడపి తుదకు చెన్నపురమున బ్యాంకులో నుద్యోగము ప్రాప్తించగా వేలూరువాస మతడు ముగించి, యమ్మనాయనలను, సోదరుని చేరుకొనెను. రేణుకయొక్క సహజావేశ సంపన్నురైన యితనితోగాని నాయన కుటుంబమునకు స్థలము మార్పు పూర్తికాలేదు. అతడు వేలూరులోని యుద్యోగము విడుటకు పూర్వ మతని కోర్కె, దొప్పన నాయన యొకసారి వేలూరు వచ్చెను. అప్పుడొక విచిత్రము సంభవించి, రేణుకాకృపచే ప్రారంభము కానున్న నాయన జీవితమున కది యుపోద్ఘాతము వలెను, రామన్న కీర్తికి వేగుచుక్కవలెను నొప్పెను.

ఆ రోజులలో మైత్రేయ మహర్షియే వేగుచుక్క యనియు, నతడు లోకకల్యాణము కొఱ కవతరింపనున్నారనియు దివ్యజ్ఞాన సమాజమువారు నమ్మి దేశదేశాంతరముల ప్రచార ప్రబోధములను సల్పియుండిరి. ఆ సమయమున నప్పటి యధ్యక్షురాలు డాక్టర్ అనీ బిసెంట్. ఆమె శ్రీ జిడ్డు కృష్ణమూర్తి గారియందా యవతార మావేశరూపమున వచ్చునని విశ్వసించుచు 1910వ సం॥ నుండి వెల్లడి చేయుచుండెను. అందువలన నా సమాజమునకు చెంది, గూఢాత్మ విద్యాశాఖలో సభ్యులై, సూక్ష్మశరీరమున సిద్ధపురుషులతో సంభాషించుటేమి, సకల స్థలములకా శరీరముతో సంకల్పము ననుసరించి సంచరించుటేమి యోగ సాధనలచే నధికార సామర్థ్యములనుబొందిన యాంగ్లేయు డొక డీ దేశము ముందుగనే చేరి యుండు

నివసించుట కాయత్తపడి, 1911వ సం॥ జనవరిలోనే వచ్చి బొంబాయి చేరెను. అతని పేరు ఎఫ్. హెచ్. హంఫ్రీసు. ఇక్కడకు వచ్చుటకు పూర్వమే యీ దేశమం దత డుద్యోగమును సంపాదించుకొని పోలీసు అసిస్టెంట్ సూపరింటెండెంటుగా నియమితుడై, వచ్చిన పిదప తద్వృత్తియందు శిక్షణ బొందుటకు వేలూరు వెళ్ల నాజ్ఞాపింపబడెను. కాని, బొంబాయిలో దిగినతోడనే జబ్బుపడి యిత డాస్పత్రి ప్రవేశించెను. శరీరమున రుగ్మత సోకినను, చిత్తముచే నితడు వేలూరు దర్శించి, యిక్కడ తనకు దేశభాషను నేర్పగల వ్యక్తిని ముందుగనే తెలిసికొనెను. పర్వేపల్లి నరసింహమను నుపాధ్యాయుడే యీ వ్యక్తి యని యితడు వేలూరు వచ్చిన పిమ్మట పోల్చుకొని యతనిని 'మున్షీ'గా నియమించుకొనెను.

మార్చి నెలలోకాని 'హంఫ్రీసు' వేలూరు చేరలేకపోయెను. అంతవఱకు బొంబాయిలో జ్వరపీడితుడై, యొకనాడు స్వప్నమం దగపడిన నొక మహాను భావుని దర్శన మహిమచే తెల్లవారుసరికి విచిత్రముగా జ్వరరహితుడయ్యెను. ఆ మహానుభావునితోపా టింకొక మహానుభావుడు కూడ కన్నులు మూసికొని ధ్యానివలె కూర్చుండినట్లు స్వప్నమం దగపడెను. వీరి మూర్తుల నతడు బాగుగా జ్ఞప్తి యందుంచుకొని, తనకు వారి సందర్శన మెక్కడనో నిజముగా ప్రాప్తించునని విశ్వసించెను. వేలూరు వచ్చిన రెన్నాళ్లకు తన జర్వమును బోగొట్టి రక్షించిన మహానుభావుడు మఱల స్వప్నమందగపడి తన మున్షీకి గురువువలె స్ఫురించగా మఱునాటి యుదయమున మున్షీ యింటికి పోయి, యతడు చూపిన చిత్ర పటములలో రెండింటినెంచి, వారే తన కగపడిన మహానుభావులని హంఫ్రీసు చెప్పెను. వారు రమణ గణపతులగుటకు మున్షీ యాశ్చర్యపోయెను. గణపతి ముని బొమ్మ చూపి 'మీ గురువితడే యని నాకు తెలిసెను. నా జ్వరము నిట్టి హరించినవాడును నితడే. కనుక నేను గూడ నితనిని గురువుగా నెంచు కొంటిని. నా కితని దర్శనము శీఘ్రముగా నీవు సమకూర్పవలె'నని హంఫ్రీ సడిగెను. మా గురువు లిక్కడకు మొన్ననే వచ్చిరి. కాని, యీ దినము తిరువణ్ణామలై వెళ్లదలచిరి. బహుశః స్టేషనుకిపాటికి వెళ్లియుందు'రని మున్షీ బదులిడి, హంఫ్రీసును తొందర తొందరగా రైలుస్టేషనుకు తీసికొనివెళ్లెను.

స్టేషనులో గణపతిముని దర్శనమయ్యెను. హంఫ్రీసతని యొద్ద భక్తితో మోకరించి తన కథ క్లుప్తముగా చెప్పుకొనెను. పిదప తన్ను శిష్యునిగా స్వీకరింపగోరి, గణపతిముని యాశీస్సును బడసి మిగుల సంతసించెను. మహర్షి దర్శన మింకొకప్పుడు తాను స్వయముగా చేయించెదనని వానికి నాయన చెప్పి వానిని మఱింత సంతోషపరచెను.

దివ్యపురుషు డవతరించునను నుత్సాహముతో 1911వ సం॥ నవంబరులో నూరూర దివ్యజ్ఞాన సమాజమువా రుత్సవముల నేర్పరచిరి. తిరువణ్ణామలైలో

వారి కొన్నరెన్నొకటి జరిగెను. ఆ సభలకు మున్షీని వెంటబెట్టుకొని హంఫ్రీసు వెళ్లెను. ఆ సమయమందు గణపతిముని తిరువణ్ణామలైలో నున్నట్లు విని యతడు తన భాగ్యమును కొనియాడుకొనెను. అప్పుడతడు సభలనుండి యావలకు వచ్చి, తన మున్షీ సహాయమున తొలుత గణపతిమునిని కలసి, యటుపిదప గణపతి ముని వెంబడి భగవాన్ శ్రీ రమణమహర్షిని దర్శించుకొనెను. తన రెండవ స్వప్న పురుషుని యీ విధముగా దర్శించి, యతని దివ్యతేజమును తిలకించిన పిదప హంఫ్రీసు లోకోద్ధరణ సంకల్పమును గుఱించి మహర్షి నడిగి, తన్నుతా నుద్ధరించు కొనినచో లోకమున కుపకారమగునని మందలింపబడెను. తరువాత సిద్ధులయందు హంఫ్రీసుకు వ్యామోహముండుట మహర్షి గుర్తించి వానివలన నతనికి ప్రమాదము కలుగకుండుట కాత్మసిద్ధి యన్నింటి కంటె గొప్పదనియు, దానిని బొందుట కన్నిశక్తుల నుపయోగించవలెననియు హితవు పల్కెను. ఆత్మకై శ్రమించునపుడు సంకల్పాదికములన్నియు నాత్మవేయను భావముతో నాత్మయందే కర్తృత్వము నుంచుట యొక మార్గమని యుపదేశించెను.

హంఫ్రీసునకు మహర్షిపై పరమ గురుభావ మేర్పడెను. వెలుపలకు వచ్చిన పిదప "మా సమాజమువా రనుకొనిన లోకగురుపద మీ మహర్షి యందు రూఢి యగుచున్నందున దివ్యపురుషావతరణ మితనియం దిదివఱకే వచ్చినట్లు చెప్పక తప్ప"దను నభిప్రాయము నతడు వెలిబుచ్చెను.

ఈ హంఫ్రీసు మఱికొన్నాళ్ళయిన పిదప మహర్షి దర్శనమును మఱల చేసికొనెను. అప్పటికిని తృప్తిచెందక అడపాతడపా కొన్నిసార్లు వచ్చి సందేహములను దీర్చుకొని, యాత్మలబ్ధి కుపాయమును విశదము గావించుకొనెను. అటుపిమ్మట తన యుద్యోగము నతడు త్యజించి, క్రైస్తవసన్యాసియై, మహర్షి సందేశము నితర ఖండముల వ్యాపింపజేసెను. రమణగణపతు లుభయులను దివ్యావతార పురుషులుగా నితడు కొలిచెను.

వేలూరువాసమంతమైన సమయమునకు ప్రాప్తించిన ఈ హంఫ్రీసు పరిచయమువలన పశ్చిమ దేశస్థుల నొకస్థాయి కాధ్యాత్మికముగా నుద్ధరించుటకు భద్రకు డవలంబించిన విధానములు నాయనకు విదితమై, ప్రాక్సిద్ధాంతములకవి భిన్నముగా తోచినను, నాధ్యాత్మవిద్య నిప్పటి పశ్చిమవాసులలో బొరబెట్టుటకవి యుపకరించిన రీతిని స్ఫురింపజేసెను. పిదప ప్రచారక జీవితమును స్వీకరించి, హంఫ్రీసువంటి గూఢాత్మవిద్యాసంఘ సభ్యులు సాధించు మనశ్శక్తులకంటె నధికము ప్రాప్తింపజేయు వైదికసాధనములను బ్రజలకు జూపుటకును, వాటియం దాసక్తిని కల్పించుటకును నాయన ప్రేరణము పొందెను. ఇది రేణుక చేకూర్చిన వేదహృదయ జ్ఞానసంబంధమనక తప్పదు.

నాయన తిరువణ్ణామలై వెళ్లియున్న యీ సమయమందు తన ప్రచారక

జీవితమున కుపకరించిన విషయమొకటి సంభవించెను. శైవసిద్ధాంతులు కొందఱు తిరువణ్ణామలైలో సభలు జరుపుచు, నాయన నా సభలం దొక రోజున శైవమత సిద్ధాంతములను గురించి యుపన్యసింపగోరిరి. అదివఱ కా సిద్ధాంతములను గురించి వినని నాయన వాని సారమేమని మహర్షి నడిగి, మహర్షి చెప్పిన కొలది సారాంశములతో శైవసిద్ధాంతమునంతను గ్రహించినవానివలె గంభీరముగా సభయం దుపన్యసించెను. నాయన యీ సిద్ధాంతమందు జూపిన పాండిత్యమున కందరు మెచ్చుగా, తన శిష్యుని వైభవమునకు రమణుడు సంతసించెను.

# VI. ప్రచారఖండము

-: అధ్యాయములు :-

1. చెన్నపురమందు ప్రచారక జీవితము
2. కాలడి యాత్ర
3. ఉడిపియొద్ద బలరామక్షేత్రమందు తపస్సుచే అస్త్రమంత్ర సిద్ధి
4. గోకర్ణ క్షేత్ర దర్శనము, అపూర్వ నవ్యజీవిత ప్రారంభము
5. పన్నబేలా వనదుర్గ, మహాయజ్ఞము
6. సికింద్రాబాదావాసము
7. అమ్మ కుత్తరదేశయాత్రలు
8. మందసావాసము, మహేంద్రగిరియందు తపస్సుచే పరశురామ దర్శనము

ఓం

మొదటి ప్రకరణము

# చెన్నపురమందు ప్రచారక జీవితము

క్రీ.శ. 1910వ సం॥ మే నెల మొదలుకొని 1912వ సం॥ జనవరిలో భోగిపండుగ దినము లంతమగువఱకు నాయనకు చెన్నపురమందు నగరవాసమొక బంధమయ్యెను. నడుమ నప్పుడప్పుడు తిరువణ్ణామలై వెళ్ళి స్వగురునితో నైదాఱు దినములు సుఖముగా వెళ్లబుచ్చుచున్నను, నగర వాతావరణము మఱల సోకుసరికి సుఖము మాయమయ్యెడిది. పల్లెటూరి పూరిళ్ళలో గాలి, వెల్తురు చొరబడని మిద్దెగదులలో నివసించి, నిరత మగ్నిభయము, విషపురుగుల భయము, వర్షాకాలములో కొంపలు కురియు భయము మొదలగువాటితోడను, దూరమునుండి మంచినీళ్లు తెచ్చుకొను చిక్కులతోడను బాధపడుటకంటె కారని, కాలని పెంకుటిళ్లలోను, మేడలలోను నీటికుళాయిలు, మురుగునీటి కాలువలు, విద్యుద్దీపములు మొదలగు సదుపాయములున్న నగర నివాసము స్థూలదృష్టికి సుఖమే గావచ్చును. కాని, సూక్ష్మదృష్టికి నగరములలో ప్రాణపోషణమునకు ముఖ్యమైన వాయువంతయు భూమినుండి కొన్ని యడుగుల యెత్తు వఱకు ధూళిదూసరితమై, ధూమమయమై, దుర్గంధపూరితమై, విషతుల్యమైయుండుట విదితమగును. జనసంకుల స్థలములందొకరు విడిచిన వాయువు నింకొకరు పీల్చుచు, మందలలో పశువులవలె వాతావరణమును దుష్టమగు వేడిమిచే హెచ్చించు జీవితము యోగులకు, పవిత్రపురుషులకు దుర్భరము. వారెప్పుడూ నిర్మల, నిశ్చల, నిశ్శబ్ద, ప్రశాంత, శీతల వాతావరణమును కోరుచుందురు. అమ్మ నాయన లందువల్లనే నగరమందలి కృత్రిమసుఖమున కాకర్షింపబడక, పరిశుద్ధ ప్రకృతి నెంత వేగ మాశ్రయింతమా యని దినములు యుగములవలె గడుపఁజొచ్చిరి. ఆర్థిక బాధకు లొంగి, దూరముగా పోజాలక, పంచాబగేశశాస్త్రి శ్రద్ధతో సమకూర్చు సదుపాయములచే శరణుబొందిన వారివలె కాలమును వెళ్ళబుచ్చుచుండిరి.

వారు తమ నోటితో నేదియు నడుగరు. అడిగినను ధనసంపన్నులైన శిష్యులప్పటికి లేరు. భక్తిశ్రద్ధలు ప్రాధాన్యములుగా నెంచి నాయన శిష్యులను జేరదీసెను. వారిలో సుధన్వుడు వకీలైనను వృత్తియందింకను నధికుడు కాలేదు. అప్పశాస్త్రి యింకను నుద్యోగచింతన బొందలేదు. కళ్యాణరామ శంకరశాస్త్రులు బ్యాంకులో పనిచేయుచున్నను, వారి వేతనములు స్వల్పము. శాతంజేరి రామస్వామి బర్మా హైకోర్టుకు బదలీయైపోయెను. ఇతరులు స్వార్థబుద్ధిని వీడజాలక ధనసహాయ విషయములో వెనుకనుండువారు. పంచాబగేశశాస్త్రి త్యాగి, సమర్థుడు కదాయని వానిని యాత్రలకొఱకుకూడ పీడించుట యుక్తముకాదు.

కనుక తపస్సుతోబాటు ప్రచారకజీవనమును గూడ బూనదలచిన గణపతిముని రెంటింటిని గృహమందే సాధించుచుంత తన బోధలను వినగోరువారు తనకడకే రాదొడగిరి. కొందఱు పండితులుకూడ తరచు వచ్చి గణపతిమునితో నుపనిషద్విచారణ సల్పువారు.

సాధారణముగా పండితులు కర్మ-భక్తి-యోగ-జ్ఞానములను వేఱ్వేఱు మార్గములుగా ప్రసంగించుచుందురు. ఇదియొక దురభ్యాసమేగాక దేవతా సాయుజ్యమును బొందగోరు సాధకులకు భ్రాంతి గలిగించు ననర్థమై వెలసినది. ఈ భ్రాంతి యుపనిషత్తులందును, భాష్యములయందును, పురాణములందును నలముకొనుటయేకాక నాల్గు మార్గములకు వేఱ్వేఱు విధులను గూర్చు శాస్త్రములకుకూడ కారణమయ్యెను. ఇట్లే ప్రతి సాధకునియందు సాధనోపకరణమగు నంతఃకరణ మొక్కటియై యున్నను, దానిని మనో-బుద్ధి-చిత్తాహంకారములను పేర్లతో నాల్గుగా వ్యవహరించుట వాడుకయై, మనయందవి వేఱ్వే ఱుపకరణ ములుగానున్న భ్రాంతినేగాక, భ్రాంతిని పోషించు శాస్త్రములకు హేతువయ్యెను. ఏ విధముగా మనయం దంతఃకరణ వస్తువొక్కటియై, యాత్మకును, ఆత్మచే ప్రకాశింపబడు శరీరమునకును నడుమ వ్యవహరించుచు, వ్యవహరించని ఆత్మతో గాని, వ్యవహరింపజాలని జడశరీరముతోగాని పోలికదోచమి తన వ్యవహారమునకు తానే కర్తయని భావించి జీవలక్షణమును (అనగా జనన మరణములచే శాసించబడు లక్షణము) బొందుచున్నదో, ఆ విధముగా జీవలక్షణమును నివారించుకొను మార్గ మొక్కటియై యున్నది. ఈ మార్గముచే నంతఃకరణవస్తువు శ్రేష్ఠకర్మ చేసినదగును. ఆ కర్మయందాత్మభక్తి, ఆత్మ ననుసంధానము చేయు యోగము, ఆ నాత్మసంబంధమను విజ్ఞానము లేనిచో నంతఃకరణ మాకర్మ నెట్లు చేయును? ఒక్కదానిని విడచినను శ్రేష్ఠత్వముండదు. కనుక ప్రతి కర్మయందీ మూడింటిని శ్రద్ధగా వహించినప్పుడే మనము కర్మను యథావిధిగా చేసినవారమగుదుము. ఇంక కర్మను విడిచి మిగిలినవానిని సాధింపబూనువారికి సాధనమొక కర్మగాదా ?

విషయమింత సుస్పష్టముగా నున్నను, 'కర్మ' యను పదమునకు యజ్ఞకర్మ శ్రాద్ధకర్మ మొదలగు నర్థములనిచ్చి పండితు లనర్థములను కల్పించినవారైరి. వర్ణ భేదములను కల్పించిన వా రా వర్ణములకు విహితకర్మలను విధించిరి. ఆలోచించగా కరచరణాది స్థూలాంగములతో చేయబడు కర్మమాత్రమే 'కర్మ' పదమున కర్థమై పండితులందు నిలిచిన కారణముచేతనే యిన్ని విభాగములకు గుఱియైనట్లు తట్టక మానదు. లేనిచో కర్మను చేయు నంతఃకరణమునుగాని, దానికి శక్తినిచ్చు కర్తయగు నాత్మనుగాని దృష్టియందుంచుకొనినచో కర్మననుసరించి చేయబడిన వర్ణభేద మసంభవమగును. వర్ణభేదము లుండుగాక. అవి కేవల శరీరసంబంధములైన ఆహార విహార వినోదముల ననుసరించియున్నట్లు చెప్పట మంచిది. అవియు నొకవిధమగు

కర్మలే కదాయని, కర్మననుసరించి యవి చేయబడెనను మాటవలన శారీరకమైనవే కర్మలని మఱింత భ్రాంతి సంభవించుచుండును. కావున నిజముగా నుపనిషత్సారమును గ్రోలువారిజాలమున బడక కర్మస్వరూపమును విమర్శించు కొనినచో, వారియందు భక్తియోగ జ్ఞానములు సహజ లక్షణములై, కర్మతో నవినాభావ సంబంధమువలె నున్నట్లు విదితమగును. ఈ నాల్గును నంతఃకరణ వృత్తి సంబంధములే గాని బాహ్యవేషములకు, శారీరక విధులకు జెందినవి కావనియు తెలియును.

చిత్తమను సూక్ష్మవస్తువే మనయం దంతఃకరణము. మాతృగర్భకోశమందు రసములవలన పురుష వీర్యము పిండరూపమున వృద్ధియైనపుడు వీర్యవస్తువు నందున్న పురుష మహిమ, గర్భకోశ రసములందున్న మాతృకాభిమానము వస్తురూపమునుండి తమ సూక్ష్మత్వముచే నాంతర్యమునకు విడుచుచున్నవి. అవి విడుచుకొలది పిండరూపమున వస్తువు కూడ కొంతభాగ మంతస్స్రుతిచే సూక్ష్మాకాశ సంబంధమగు అణురూపమును బొంది, వస్తువునుండి విడివడిన మహిమాభి మానముల కంతఃకోశమగుచున్నది. పిండరూపమం దంతర్గుహవలె నేర్పడిన కోశరూపమే చిత్తము. ఈ కోశవస్తువుతో మహిమాభిమానములు కూడియున్నట్లు భావించవలెను. కాని, యింకను అంతర్యమును బొందినట్లెంచరాదు. అంతరాకాశ కోశము నీ విధముగా పిండమందు కల్పించు గర్భకోశ వ్యాపారముచే స్త్రీయందు మాతృలక్షణము చెప్పబడుచున్నది. అదియే తల్లియొక్క అనుగ్రహవ్యాపారము. ఎందువల్లననగా, చిత్తమనెడి యీ యంతఃకోశము జీవుని ప్రవేశమునకు గృహముగా ననుగ్రహింపబడుచున్నది. జీవుడాత్మస్వరూపుడు. కావున నతని ప్రవేశమువలన చిత్త గృహము చైతన్యవంతమై, యుపకరణమువలె పిండమును కదపును. ఈ కదలిక తెలిసినప్పుడే స్త్రీయందు మాతృలక్షణము, జీవునియందు (లేదా పిండరూప మందు) పుత్రలక్షణము ఫలించినట్లెంచి, సీమంతోత్సవము చేయబడును. అంతేగాని, ఉపాధికి కారణమైన బీజప్రవేశమే పుత్రజనన కారణము కాజాలదు. జీవప్రవేశముచే చైతన్యవంతమైన చిత్తవస్తువు సుడివలె చలించగా, తదంతరమున మహిమాభి మానములు విడివడి కేవలమై, యాకాశతేజమువలె ప్రకాశించును. దీనినే కొందరు పరమవ్యోమమందురు. మఱికొందరు హృదయమందురు. దీని కుహర కేంద్రమున చైతన్యాధారమగు దాని నాత్మయందురు. ఈ యాకాశతేజము చిత్తాంతర్గతమున నంగుష్ఠప్రమాణమై యుండగా, దాని కుహరమధ్యమున నున్న ఆత్మకే యా ప్రమాణమంటకట్టబడుట పండిత సూక్తులలో నింకొక పొరపాటు.

ఇట్టి పొరపాటు భావములచే కర్మపద నిర్వచనమందేమి, సాధనమార్గ విభాగమందేమి, జననకారణ నిరూపణమందేమి, సూక్ష్మమునుండి బుద్ధిస్థూల పరమై, మతదృష్టియందు, నాధ్యాత్మికదృష్టియందుగూడ వేదప్రమాణమును

విమర్శించి గ్రహించుటకు ప్రేరేపించక, పిదప వచ్చిన శాస్త్రోపనిషత్తులందే యావత్ప్రమాణము నుంచుకొని భ్రష్టమగుచున్నది. శాస్త్రోపనిషత్తులు మానవయుక్తి కల్పితములు. వానిలో పొరపాట్లుండవనుట పొరపాటు. అవి సత్యమును పరోక్షముగనే వచింపును. ప్రత్యక్షదర్శనములచే నిబద్ధమైన వేదమట్లు కాదు కనుక మన మతమునకు ప్రమాణమైన వేద మేమి బోధించుచున్నదో విమర్శదృష్టిచే ఋషి దర్శనములను సూక్తములనుండి మథించి గ్రహించుట పండితు లొనర్పవలసిన కార్యమని గణపతిముని హితవు పల్కువారు. అంతేగాని, వేదాంగములే వేద మనుకొనుట శరీరమే యాత్మ యనుకొనుటవంటిది. అందువలన మూలమును చదివి, తపస్సుచే మథించినవారి కంగముల తత్త్వము విశదము కాకపోదని హెచ్చరించువారు.

ఒక్కొక్కప్పుడు సృష్టికారణమును విశదముగా నెఱుగుటకు పండితు లిట్లు ప్రశ్నించువారు: "వ్యష్టియందు పురుష మహిమ సృష్టికి కారణమైనట్లే, సమష్టి యందు పరమ పురుషుని మహిమ కారణమగుచున్నది. సృష్టికి పూర్వము పరమపురుషునియందు లీనమైయున్న ఆ మహిమ మే కారణమువలన నుద్గారమగుచున్నది ? దక్షు డనబడిన ఆ మహిమాలక్షణము మూలమునుండి విభాగమై యెట్లు ప్రత్యేకముగా నుండగలిగినది ? దానికి ప్రత్యేక చైతన్యము నిచ్చుట కాత్మకూడ విభాగమైనదా ?"

గణపతిముని విరచితమైన ఉమాసహస్రమందీ విషయములు సూత్ర ప్రాయముగా ప్రసంగించబడెను. వాటిని విని, వివరణముకొఱకు పండితు లిట్లు ప్రశ్నించుచున్నారని గణపతిముని గ్రహించి, వారికి దక్షకథార్థమునుండి గ్రహింపదగు సృష్టికారణత్వము, పృథగాత్మలక్షణము, ఆ లక్షణ మూలము నెఱిగినవారికి భేదము తొలగి యాత్మయొక్క యఖండత్వము విశదమగుట మొదలగునవి వివరముగా బోధించెను. అప్పుడు వారికి గ్రాహ్యమైన విషయముల సారము పాఠకుల ముదము కొఱ కిక్కడ ముచ్చటింపబడుచున్నది. వ్యష్టి సమష్టుల యందిది యొకే విధముగా నన్వయించుకొనవలెను.

ఈ లోకములో స్త్రీలు తమ విలాసచేష్టాప్రదర్శనముచే పురుషుని మహిమోద్గారమునకు కారకులైనట్లే, చిద్రూపిణియైన సచ్ఛక్తియొక్క చిద్విలా సమును బొంది సద్రూపుడైన పరమపురుషుని మహిమ ప్రబోధమైన ట్లెంచ వచ్చును. ఆ విలాసమును పరమపురుషుడే పొంది మహిమోద్గారమున కాజ్ఞ యిచ్చినట్లును భావించవచ్చును. అప్పుడు మహిమాక్రీడ వారి విలాసమని విశదమగును. ఉద్గారమైన మహిమ పతిచే స్వయముగా పొందబడినప్పుడే దానియందు చైతన్యము, క్రీడాచలనము సంభవమగుచున్నవి. అట్లు పొందుటకు పరమపురుష లక్షణమం దామెకు గల యభిమానము కారణము. ఆమె

యథార్థముగా పరమపురుషుని సద్ధర్మస్వరూపిణియై, యెల్లప్పుడు నతనినే చిత్త తత్త్వముచే ప్రచురించు నభిమానవతి. అట్టి పరమపురుషాభిమానమే చిల్లక్షణమై మహిమను బొందినప్పుడు చిల్లక్షణముచే చైతన్యవంతమైన మహిమ మభిమాన వశమున విజృంభించుచు, తద్విజృంభణమందు పురుషునివలె కర్తగా స్ఫురించుచు, పురుషవీర్యమును చిమ్ముచున్నది. ఆ యభిమాన శిరస్సు దక్షునియందు ఖండింప బడెను. చలనగతమై, క్రియాఫలమును నిజకర్తవైపుగాక విరుద్ధముగా చిమ్మిన శిరస్సు పోయిన వెంటనే మహిమ పురుషగతమగుచున్నది. అప్పుడది యాశ్వ రాభిమాన ముఖముగల 'అజ' శిరస్సును బొందినట్లగును. తెగిన శిరస్సు క్రియాఫలభూతమును నిష్పన్నమొనర్చిన కథ నెఱిగించుచు, మహిమయం దభిమానము వలన చలన కారణము, అచలస్థితినుండి జారి తత్స్ఫూర్తి లేని విధమున ఖండింపబడుట తెలియజేయుచున్నది. ఇట్టి మహిమతో కూడి తెగినను, మూలచైతన్యమును గోల్పోవుటచే జడత్వముబొందిన క్రియాఫల భూతమును సతి ధరించినందున, నామెయం దది పూర్వ క్రీడానుభవము నీయజాలకుండెను. ఎందువలన ? కర్తృస్ఫూర్తి లేమింజేసి. కనుక కర్తృస్ఫూర్తి నిచ్చు కోశమును దాని యందు నిర్మించుట కామె తరువాత పూనుకొని, తద్ద్వారమున నీశ్వరఫల భూతము, నీశ్వరసంధానము గావించుచున్నది: కోశమందీశ్వరస్ఫూర్తినిచ్చు చైతన్యలక్షణము మాత్రము ప్రవేశించు చున్నది. అదియే 'అహమ్మహ'మ్మను స్ఫూర్తులనిచ్చుచు వ్యష్టిదేహములందు, సమష్టి విశ్వమందుగూడ బుద్ధికోశము నధిష్ఠించిన భాసమాన లక్షణము. దీనినే హృదయమనిరి. కోశమనెడి యుపాధిచే నిది ప్రతి దేహియందు వేర్వేఱుగా దోచుచున్నను, స్వయముగా నన్నిటియం దొకే విధమగు స్ఫూర్తుల నిచ్చు హృదయ ముపాధులవలన వేఱగుట లేదు. భిన్నత్వమం దేకత్వమును స్ఫురింపజేయు హృదయ మందువలన ననుగ్రహించుట కధిష్ఠించిన బ్రహ్మస్వరూప మనబడును. ఈ హృదయ కుహరమధ్యమున నచలస్వరూపుడైన బ్రహ్మ యీ హృదయరూపముచే నాత్మ (రూపమున కర్థమగుచున్నందున) యనుబడు చుండెను. ఆత్మ ఖండీభూతమగుట లేదని యిట్లు ఋజువగును. కావున 'నేను, నే'నను స్ఫూర్తుల మూలమందది తానగుటయే పరమార్థసాధనమని శ్రీ రమణుడుపదేశించెను.

ఈ విధముగా తనకడకు వచ్చిన పండితులకు, శ్రద్ధాళువులకు శ్రీ రమణోపదేశ ప్రచారమును సల్పుచు నాయన చెన్నపురమందు దినములను వెళ్లబుచ్చుచుండగా, పూర్వ మద్వైత ప్రచారముచే మతము నుద్ధరించిన శ్రీ శంకరా చార్యునియొక్క జన్మస్థలమైన 'కాలడి'యను పుణ్యక్షేత్రమును దర్శించవలెనని విశాలాక్షమ్మకు గాఢమై తోచెను. ఆమె కోర్కె నెఱిగి కొందఱు శిష్యులు ధనసహాయ మొనర్చిరి. అది యమ్మనాయనలకు నగర విబంధమగుటకు హేతువును కల్పించెను. అంతేగాక, పశ్చిమ దిక్కునగల గోకర్ణయాత్రకు, నక్కడ పరిణమించిన క్రొత్తఘట్టమునకీ కాలడియాత్ర హేతువైన విధముగూడ మున్ముందు తెలియును.

ఓం

## రెండవ ప్రకరణము

# కాలడి యాత్ర

కాలడి యాత్రను సంకల్పించిన అమ్మకు కొందఱు శిష్యులు ధన సహాయము చేయగా, మఱికొంద ఱామెకు విలువైన తమ్మెట్లజతను, విలువైన చీరను ప్రయాణసమయమునకు ముందు కట్నముగా నర్పించిరి. వారి తృప్తికొఱ కామె రెండింటిని ధరించి పయనమయ్యెను. ఆ వేషము తోడనే యామె కాలడి ప్రవేశించగా, కొందఱామె నెగదిగ జూచి యామెకును, భర్తకును వేషమందు గల వ్యత్యాసముచే నామెను శంకించిరి.

వీరు కాలడి చేరిన యొకటి రెండు రోజులకు పూర్వ మా యూరున కొక వార్త చేరి వ్యాపించెను. ఎట్లనగా, ధనవంతురాలైన నొక బ్రాహ్మణ స్త్రీ యొక కంసాలివానిని లేవదీసికొని పలాయనమై, తనవారు వెంబడించుటకు కష్టమగునట్లు క్షేత్రస్థలములకు బోవుచు యాత్రికుల మూకలతో గూడి తిరుగాడుచున్నదనియు, కన్యాకుమారీ క్షేత్రమట్లే వెళ్ళి యక్కడినుండి కాలడి దిక్కుగా వచ్చుచున్నదనియు వదంతి చేరెను. అమ్మనాయనలు పుత్రుడైన మహాదేవమును వెంటనిడుకొని యొక సత్రము చేరినంతనే యక్కడ దాస దాసీజనములు గుసగుసలాడుకొనిరి. నీలివార్తలను కల్పించుటయందు, విచక్షణను విడిచి వాటిని నమ్ముటయందు స్వభావమైయుండు నీ జను లన్యాపవాదమే వృత్తిగా గలిగి, యా నోటినుండి యా నోటికి వ్యాపించు వదంతికి చిలవలు పలవలుకూడ కూర్చుచుందురు. ఈ విధముగా చిత్రరూపమును బొందిన వార్తచే విశాలాక్షమ్మ యనుమానింపబడెను. ఇది యిట్లుండ, సత్రము చేరిన వెంటనే యమ్మనాయనలు పుత్రసహితముగా స్నానమాచరించుకొని, క్షేత్రమందు ముఖ్యమైన శంకరమఠమునకు వెడలిరి.

'కాలడి'యను గ్రామము సముద్రమున కైదాఱు మైళ్ల దూరములో 'ఆల్వాయి' యను నదీతీరమున సన్యాసిమఠములతోడను, నద్వైత దృష్టిగలిగిన మహనీయులతోడను, రేవువర్తకము సల్పు ధనికులతోడను ప్రకాశించుచుండును. కాలడికి ప్రత్యేకముగా రైలుస్టేషను లేదు. 'ఆల్వాయి' పేరుగల స్టేషనులో రైలు దిగి, సుమారు మూడుమైళ్లు రోడ్డుప్రయాణము చేసి కాలడి చేరుదురు. ఆ రోజులలో మఠములందు ప్రసాదముగా అన్నము పంచిపెట్టుట యాచారమై, యాత్రికులకు, విరాగులకు సదుపాయకరముగా నుండెడిది. రాను రాను మోసగాండ్ర కధీనమై యీ మఠముల ఖ్యాతి రూపుమాసెను.

పెద్ద మఠాధిపతితో నాయన యిట్టి పరిచయము గావించుకొని వాని సత్కారమునుగూడ బడసెను. అటుపిదప మఠమును చేరియున్న ఉపవనమందా మఠాధిపతి సహాయమున అమ్మ నాయనలు గుప్తమైన తపస్థలమును నిర్మించుకొని ధ్యానమగ్నులైరి. ఇక్కడ అమ్మ కోర్కెపైని అమ్మతోబాటు నాయనయు పంచదశీ మహామంత్రమును జపించెను.

ఆలోచింపగా 'పంచదశీ' మహామంత్రము నొకప్పుడు లోకమున బ్రవేశ పెట్టుట కవతరించిన దక్షిణామూర్తియొక్క యపరవేషమే శ్రీ రమణుడని నాయన యదివఱకే గుర్తించెను. దక్షిణ భాగవర్తియై హృదయమందు మూర్తియై (దక్షిణ+అమూర్తి=దక్షిణామూర్తి), యానా డుపదేశించిన 'పంచదశీ' మంత్ర తత్త్వమును విమర్శించినవారి కది యీనా డుపదేశించిన హృదయవిద్య లేదా తపస్స్వరూప సాధన వంటిదని తెలియును. కావుననే, యమ్మ కోర్కెపై నాయన కాలడియందీ మంత్రధ్యానము 'నహం' మూలాన్వేషణ కంటె భిన్నము గాదనునట్లు సల్పెను. మంత్రశాస్త్రమందీ మంత్రము పట్టాభిషేక మంత్రముగా నెట్లు ప్రసిద్ధికెక్కెనో, వేదమందు తనకు దర్శనమైన రేణుకామంత్ర మట్టిదని నాయన విశ్వాసము. అట్లయినను, నాయనకంటె నధికముగా తెలిసినవారివలె రమణోపదేశమున కీ మంత్రము లేవియు సాటిరావనియు, సాధనలక్ష్యము రెండింటియందు వేఱనియు, సిద్ధిలో వ్యత్యాసముండుననియు, రమణోపదేశము సాధ్యపరక నాయన మంత్రజపము తిరుగ పూసెననియు విమర్శించువారు లేకపోలేదు. అట్టివా రింకొకసారి రమణుని తపస్స్వరూప నిర్వచనమందున్న రెండు వాక్యములను నెమరువేయుట మంచిది.

నిర్గుణోపాసకు 'లహం బ్రహ్మాస్మి' యను భావమును సాధించుచు, తమ భావము నిర్గుణమని పల్కుదురు. ఈ పల్కులే పెక్కుమంది బుఱ్ఱకెక్కెను గాబోలు, నిర్గుణమును సాధించుటకు నిర్గుణ సాధన శ్రేష్ఠమనుచుందురు. సాధన; భావము మొదలగునవి యన్నియు మనస్సునకు చెందినవే. మనస్సు సగుణమేకాని నిర్గుణము కాదు. సగుణము పోగా మిగులునది నిర్గుణమే. కావున సాధన యెప్పుడూ సగుణమును మూలము పొందించుటకగును–ఇత్యాది విషయములను వారాలోచించుకొనినచో, నాయనయొక్క సాధన మార్గములను విమర్శించియుండరు. ఊసుబోక విమర్శించుదానిని, కాసుకొఱ కచ్చు వేయువా రున్నారు. కనుక పాఠకులీ చౌక విమర్శలను లెక్కచేయకుందురుగాక.

పగటిపూటలందు ధ్యానమగ్నుడైనను రాత్రులందా మఠాధిపతి యాహ్వానమున నద్వైత చర్చలందు పాల్గొని, తన యసమాన పాండిత్యముచే మఠాధిపతు లందరిని నాయన వశముచేసికొనెను. శంకరాచార్యుని జన్మచే పవిత్రమైన యీ క్షేత్రమందా గురువర్యుని మహిమ నాయన యాకృతిగా

రూపొంది క్షేత్రము ననుగ్రహించుటకు మఱల వచ్చిన ట్లక్కడివారు పలుమంది నాయనను కొనియాడిరి. నాయనవలన వారు శ్రీ రమణోపదేశమును విని ధన్యులైనట్లెంచి, భగవాన్ శ్రీ రమణమహర్షి దర్శనమునకు కుతూహలపడిరి. వారి యనురోధము వలన నాయన కొన్ని యుపన్యాసములను గూడ నిచ్చి తన వాణీపీయూషముచే వారిని ముంచెత్తెను.

ఈ కీర్తివలన తొల్లి యపవాదము సూర్యకాంతి వలన తొలగు చీకటివలె తొలగిపోయెను. పిదప స్త్రీలు పెక్కుమంది విశాలాక్షమ్మను చేరవచ్చిరి. ప్రసంగ ధోరణియం దొకనాడు వారామెను శంకించిన విధము నెఱిగించగా నామెకు మిగుల కోపము వచ్చెను. పూర్వము నాయన తన తపోయాత్రలలో నాసికయం దకారణ నిందకు గురియైనట్లే యామె యీ ప్రథమ తపోయాత్రయందు గురియైన పోలిక యామెకు వెంటనే స్ఫురించెను. అది చౌర్యాపరాధము, ఇది జారత్వాపరాధము. అంతే వ్యత్యాసము. ఇది నాయన చెవిని సోకినచో కళంకమును తుడిచివేయుట కప్పుడు శాపాగ్రూపమున నాయన వాణి నాసికపై కురికినట్లే యిప్పుడు కాలడిపైకి దుముకవచ్చునను భీతి యామెకు తోచి, వెంటనే యింకొక పవిత్రక్షేత్ర మా ప్రాంతమందు చేరుటకు నాయనను తొందరచేసెను. ఆ తొందరవలన మహాసుఖప్రదమై గడచిపోవుచున్న కాలడిత పస్సును నాయన నిలుపుకొని, యామె కోర్కెను చెల్లించుట కాప్రాంతమందున్న పవిత్ర క్షేత్రములను తలపోయుచుండగా 'గోకర్ణ'మను క్షేత్ర ప్రసిద్ధిని గుఱించి చెప్పబడిన రెండు శ్లోకవాక్యములు హఠాత్తుగా స్ఫురించెను. వానిలో నొకటి "సఘోరం తప ఆ తిష్ఠద్గోకర్ణే రఘునందన" అను రామాయణ శ్లోకపాదము (అనగా, గోకర్ణ క్షేత్రమందా రఘునందనుడు ఘోరతప మొనర్చెను). ఇంకొకటి "అథరోధసి దక్షిణోదధేః శ్రితగోకర్ణ నికేతమీశ్వరమ్" అను రఘువంశ కావ్యశ్లోకము. వెంటనే నాయన 'గోకర్ణ' క్షేత్రము వెళ్లుటకు నిశ్చయించి, యక్కడకు బోవుటకు వీలైన మార్గమును గుఱించి మిత్రులనడిగి తెలిసికొనెను.

ఈ క్షేత్రము పశ్చిమతీర గ్రామములలో నొకటియై రైలుమార్గ మప్పటికి, నిప్పటికిగూడ లేకయున్నది. మంగళపురమువఱకు రైలుపై బోయి, యక్కడనుండి యగ్నినౌకపై రెండు దినముల సముద్రప్రయాణముతో గోకర్ణము చేరవలసి యున్నది. కనుక మంగళపురము వఱకు రైలుపై బోవుటకు నాయన నిశ్చయించి యుండగా పెద్ద మఠాధిపతి నాయనకు కొంత ధనసహాయమును జేసి ప్రయాణము సుఖప్రదము గావించెను.

మంగళపురము చేరినంతనే కొందఱు సత్పురుషులు నాయనను కుటుంబ సహితముగా నాహ్వానించి, 'రామమహాశయు'డను నొక దాత యింటికి తీసికొనివెళ్లిరి. తనవలెనే వచ్చిన యతిభ్యాగంతుకులతోబా టక్కడ పూజాది

విధులతో విందుభోజనము ప్రాప్తించెను. కాని, దాత యగుపడకుండుటకు నాయన కాశ్చర్యమయ్యెను. కనుక భోజనమైన వెంటనే పరిచారకుల సహాయమున నాయన రామమహాశయుని జూచి, వానియం దుదారగుణములకు బదులు క్షుద్రోపాసకులకుండు నీచలక్షణములను గాంచి విస్తుపోయెను. ఏ దే దేవత నారాధించుచుండెనాయని నాయన యొక్క క్షణ మాలోచించునంతలో వాని దేవత వానిచే రహస్యము నిట్లు గ్రక్కించెను: "నాజన్మాంతరపుణ్యపాకము వల్లనో సద్గుర్వనుగ్రహమువల్లనో నాకీ జన్మలో మంత్రశాస్త్రజ్ఞులకు దుర్లభమగు రహస్యము లభించెను. దాని నాచరించుటకు జన్మతో సహా ప్రాప్తించిన విపుల ధనము, పుష్టియై తేలికగానుండు శరీరము నాకు సంభవించెను. అట్లయినను నా కింతవఱకు 364 మాత్రమే లభ్యమై, 636 స్త్రీ లింకను లభ్యము గావలసియుండిరి. 'సహస్ర భగద్దర్శనాన్ముక్తిః' అను రహస్యము గోప్యమైన వాటిలో గోప్యమైనదై, నా కా మిగిలిన సంఖ్య లభించినప్పుడు నిశ్శంకగా ఫలము నీయ గలదు. సర్వ మంత్ర తంత్ర కథన మంతటిని సూక్ష్మముగా నిముడ్చుకొనిన యీ సాధనరహస్యమును మీకు వశము తప్పి చెప్పితిని. క్షమింపుడు."

ఈ వాక్యములతో వాని దాతృత్వబండారమందున్న మోసము బయట పడెను. "నీవు శునకజాతి కధిష్ఠానభూతమును సేవింపుచు, తత్సాయుజ్యమునకు యత్నించుచుంటివి. తెలిసిన"దని నాయన పల్కి, గిర్రున వెనుకకు తిరిగి, వాని యిల్లు వెంటనే వీడెను. తన రహస్యము బైటపడిన ఫలముగా తన మంత్రము భగ్నమయ్యెనని దాత దుఃఖించెను.

ఓం

మూడవ ప్రకరణము

# ఉడిపియొద్ద బలరామ క్షేత్రమందు తపస్సుచే అస్త్రమంత్రసిద్ధి

రామమహాశయుని యిల్లు వెట్లు విడువ బుద్ధి పుట్టెనో, అట్లే మంగళపురమును గూడ వెంటనే విడువవలెనని నాయన బుద్ధికి తోచినందున నౌక (స్టీమ్ లాంచి) కొఱకు వేచియుండక ఎడ్లబండిపై పురమును వీడి, యొకటి రెండు మకాములతో ఉడిపి గ్రామము చేరుకొని. యక్కడ వాసుదేవశాస్త్రి బంధువర్గ ముండుట జ్ఞప్తికి రాగా, వారి యింటికి నాయన దారితీసెను. కొంచెము శ్రమపడి వారి యిల్లు తెలిసికొని నాయన యక్కడకు వెళ్లుసరి కక్కడ వాసుదేవశాస్త్రి భార్య యగపడెను. అమ్మనాయనల కామె సుస్వాగతమిచ్చి 'నేను పుఠిటికై వచ్చి రెండు వారములైన' దని చెప్పెను. వాసుదేవశాస్త్రి లేకున్నను, ఆమె యుండుట విశాలాక్షమ్మ కెంతో ముదమయ్యెను. ఆమెవలన విని బంధువు లందరు అమ్మనాయనల దర్శనభాగ్యమునకు సంతసించి, వారి నక్కడ కొన్నాళ్లుంచి వేయుటకు నిశ్చయించిరి. మఱియు వాసుదేవశాస్త్రి తనకు భార్య వ్రాసిన లేఖవలన నాయన రాక విని, యమ్మనాయనల నక్కడనుంచి భక్తిశ్రద్ధలతో సేవించవలెనని బంధువులకు శాసన పూర్వకముగా వ్రాయుచు, నాయనకు ప్రత్యేకముగా నొక లేఖ బ్రతిమాలు కొనుచు వ్రాసెను. వీటన్నింటి ఫలముగా రెండు మాసము లమ్మ యక్కడుండుటకు నిశ్చయించెను. అది నాయన యేకాంత తపోభిలాష కనుకూలమయ్యెను.

ఎట్లనగా, ఉడిపి వెళ్ళిన యొకటి రెండు రోజుల కక్కడకు సమీపముగా కొండల ప్రాంతమునమున్నను, సముద్రమునకు దగ్గరయైయున్న 'బడబాండేశ్వర' మనబడు బలరామ క్షేత్రము నమ్మనాయనలు దర్శించుకొని వచ్చిరి. ఆ క్షేత్రమును జూచి, యక్కడ కొండల ప్రశాంతతను తిలకించినప్పుడు నాయనకు రేణుకాక్షేత్రము స్ఫురణకు వచ్చి, పరశురామ బలరాముల సారూప్యము మాటిమాటికి మనస్సున తోపజొచ్చెను. అది కారణముగా సత్యదర్శనము కొఱకా కొండల ప్రాంతమున నేకాంత తపస్సు చేయవలెనని బుద్ధి ప్రేరేపించెను. అమ్మ కా రహస్యము దెలిపి, సమయానుకూలతకొఱకు వేచియుండగా వాసుదేవశాస్త్రి లేఖ వచ్చెను.

ఉడిపి ప్రాంతమున మఠములు, వేదాంతశాస్త్రకోవిదులు నున్నట్లు విని, తన రాక వారికి దెలిసినచో తా ననుకొనిన తపస్సున కవకాశమీయరని యూహించి, వాసుదేవశాస్త్రి లేఖ వచ్చువఱకు నాయన గోప్యముగా గడపి, లేఖ వచ్చిన వెంటనే నీటి పదుపాయమున్న నొక కొండప్రాంతమున వటవృక్షమును శరణుగా గొని తపస్సున నుపవిష్టుడయ్యెను. చేరువలో బలరామక్షేత్రమున్నది గదా యని తలచి తినుట కటుకులనైన తనతో తీసికొని వెళ్లలేదు. చీకటి పడుసరికి క్షేత్రమునకు వచ్చి భిక్షాన్నముతో పొట్టనింపుకొని, యే అరుగుమీదనో నిద్రించి, తెల్లవారకపూర్వమే తన తపస్థలమును జేరుచుండెను. ఒక పక్షమిట్లు గడపిన పిదప తపస్సున దృష్టి తీవ్రమై, రెండు మూడు దినముల కొకపరి మాత్రము క్షున్నివారణకొఱకు తపస్థలమును వీడుచు నీరసించెను. దానితో తన బట్ట తా నుతుకుకొనుట కోపిక తగ్గి, దానినట్లే యారబెట్టి, మురికి పట్టినను లక్ష్యముచేయుట మానెను. ఒక్కొక్కప్పుడు బట్ట నారవేయుట కూడ మఱపయ్యెడిది. మాఱుపంచ యారినది లేనప్పుడు స్నానమే మానుకొనుచు తదేక ధ్యానమం దుండిపోయి, బట్టలెట్లో శరీరమట్లే యశ్రద్ధ చేయబడుచుండెను. క్రమముగా శరీరమందు దృష్టి క్షీణించి, యది యున్నను, రాలినను నొక్కటే యను భావమేర్పడెను. అప్పుడొక సమయమున సమాధి స్థితియం దైదాఱు దినములుండి, బాహ్యస్మృతికి వచ్చుచుండగా మధ్య బ్రాహ్మణ వర్గమునకు జెందిన నొక సత్పురుషుడు భగవత్ప్రేరణము పొందినట్లా ప్రాంతమునకు వచ్చి, నాయనను జూచి, నాయన ముఖమునుండి విస్ఫులింగమువలె వెడలు తేజస్సున కాకర్షింపబడెను.

అరక, కుళ్ళి కంపుకొట్టుచు, నక్కడ పడియున్న రెండు మూడు గుడ్డలను బట్టి యతడా సమాధి పట్టి యెన్నో నాళ్లు కాలేదని తెలిసికొని, సేవానిరతుడై, నాయన కెదురుగా నిలబడి, పూర్ణబాహ్యస్మృతికొఱకు నిరీక్షింపదొడగెను. వానిని జూచి నాయన స్నానము గోరి సహాయము కొఱకు సంజ్ఞ చేసెను. అతడు వెంటనే భుజము సహాయమిచ్చి మెల్లగా నాయనను నీటియొద్దకు చేర్చి, స్నానము గావించి, కొంచెము జలము ద్రాగబెట్టెను. పిమ్మట క్షేత్రము లోనికి బోయి యొక మఠాధిపతి కీ విషయమెఱిగించగా, మఠాధిపతి పాలు, పండ్లరసమును గైకొని, తన బృందముతో వెళ్ళి నాయనకు పరిచర్యలు సల్పెను. మఱునాటికి కొంత కోలుకొని నాయన నెమ్మదిగా వారివెంట పురము చేరి యమ్మకు కబురంపెను. వెంటనే యామె మంచి దుస్తులను బట్టుకొని మిత్రపరివారముతో వెళ్ళి నాయనను చేరెను. ఈ పరివారమువలన నాయన పేరుప్రతిష్ఠలను విని మఠాధిపతి నాయన పాదములపై సాష్టాంగపడెను. పిమ్మట మఠాధిపతులందఱకు కబురు వెళ్ళగా వారును నాయనను దర్శించుకొని తమబోంట్ల పీఠాధిపతుల కధిపతిగా నాయనను స్తుతించి గౌరవించిరి.

అప్పు డమ్మనాయనలకు మఠమందే బస కల్పింపబడెను. ఇక్కడి తపోనుభవము నమ్మ రహస్యముగా నడుగగా, అస్త్రవిద్యామంత్రము యొక్క సిద్ధియైనట్లు నాయన చెప్పెను. ఆహా! యెక్కడ పరశురాము డుపదేశించెను, ఎక్కడ సిద్ధినిచ్చెను! ఆలోచించగా పరశురాముని జననము పడైవీడు రేణుకాక్షేత్రమందైనను, అతడొనర్చిన దైవకార్యము పశ్చిమ భారతదేశమందే యధికముగానుండి, దివ్యాద్భుత మహిమ నక్కడే ప్రదర్శించినట్లు నాయన మనస్సున ధ్రువమయ్యెను. పరశురామునియం దస్త్రశక్తితత్త్వము, రఘురామునియం దాత్మశక్తి తత్త్వము నిరూపితమైనట్లే బలరామకృష్ణులయం దవగతమగుట చోద్యమై తోచి, యీశ్వర పుత్రులైన గణపతి స్కందు లీ విధముగా రెండుసార్లిదివఱకు లోకకల్యాణము కొఱకవతరించిన చరిత్రములే రామాయణ మహాభారత చరిత్రములనియు నాయన యూహించుకొనెను. అప్పుడు తన యప్పటి భావములను భార్యకు సూచించిన పిదప నాయన యిట్లింకను బల్కెను: "పురాణములలో నవతారతత్త్వ కథలు చిందర వందరలు గావింపబడియున్నవి. ఆర్యఋషి ప్రభావములను మాటుబరచి, వైష్ణవమాయామతమును స్థాపించు నుద్దేశము పురాణములందు ప్రధానముగానున్నది. దీనికితోడు రచింపబడిన కాలమున నా చరిత్రముల యథార్థాంశములు కట్టుకథలై, కవిహస్తమం దేదో యొక త్రాటను గూర్చబడుటయే ప్రజలకు సంతోషమై యుండవచ్చును. నా జీవితమందీ కథలతత్త్వమును సంస్కరించు బాధ్యత భగవంతు డిచ్చుటవలన గాబోలు మాటిమాటికి నా బుద్ధియందీ విమర్శ యుదయించుచున్నది. సత్యమింకను నెంత లోతున నున్నదో తెలియకున్నను, దానిని గప్పిన పొర లానాటి కానాడు మఱికొన్ని వీడెను." ఈ వాక్యములను విని యుక్తిమంతురాలైన విశాలాక్షమ్మ భర్తనిట్లు హెచ్చరించెను: "స్కందగణపతులు ముమ్మారు జన్మనెత్తుదురను బ్రహ్మవాక్య మొకటి యున్నది కదా! భూత భవిష్యత్తుల నెఱిగిన మహానుభావుడెవడో బ్రహ్మపరముగా నీ వాక్యము జెప్పె, దానికొక శాపకథ నతికి యుండవచ్చును. ఏదైనను, మూడవ జన్మయందా స్కందగణపతులకు పూర్వజన్మ కథాస్మృతులు రాకుండునా? తన నిజరూపస్మృతియందు సిద్ధిబడసిన శ్రీ రమణునకవి స్పష్టమైయుండును. మీయందా స్మృతి గలుగుటకు భగవంతుడొక క్రమపద్ధతిని విధించి, తృష్ణగల జీవు డాత్మదర్శన సాధనమునకు స్మృతిమార్గమును బూనినప్పుడెన్ని సోపానములను దాటవలెనో నన్నింటిని బ్రదర్శించు క్రమపద్ధతియే అది కావచ్చును. 'పరశు' పదమునకు పిడుగను నర్థము సమంజసమనికదా మీరు చెప్పిరి. దానిని ధరించిన రామునియందది వైద్యుతశక్తియే యగును. ప్రతి మానవునియందు గ్రంథిత్రయ భేదనమును క్రమపద్ధతి ననుగ్రహించి, జన్మత్రయకథ కన్వయముజూపు ప్రభావము గల దిదేయని మీవలన, రమణునివలన పొందబడు అనుభవములచే ప్రకటితముకావచ్చును. మనమింక గోకర్ణము కదలుటకేమి యభ్యంతరము? పూర్వము గణపతిచే

ప్రతిష్ఠింపబడిన ఆ యీశ్వరలింగమును, పరశురామానుగ్రహముచే సముద్రము నుండి రక్షింపబడిన ఆ మునిజనసేవిత క్షేత్రమును వేగము దర్శించవలెననియు, తపస్సు చేయవలెననియు నా మనస్సుబలాటపడుచున్నది.''

ఈ హెచ్చరికను బొంది నాయన ప్రయాణమునకు తొందరపడెను. ఆది విని ముఖ్య మఠాధిపతు లెనమండుగురు కూడి నాయనను సత్కరించుటకొక గొప్ప సభ గావించిరి. సభయందు నాయన దివ్యవాణిని వినుటకు వారు సమస్యాపూరణములను, కావ్యరస ప్రసంగములను యాచించక, ద్వైతాద్వైత విశిష్టాద్వైతములందు బోధింపబడు తత్త్వములయొక్క వివరణము, స్థూలదృష్టికి వాటియందు గోచరించు భేదములు, వాటిని తర్కబుద్ధిచే సమన్వయించుకొను విధము సర్వజన ప్రయోజనముకొఱకై శ్లోకరూపమున నాశుధారగా చెప్పగోరిరి. మఱియు నూఱు శ్లోకములలో సారమంతయు నిమిడ్చి, యొక గంటలో ముగింపవేడిరి. చెప్పబడినదంతయు వ్రాసికొనుటకు పదిమంది లేఖకులను పండిత వర్గమునుండి నియమించిరి.

వారి కోర్కె ననుసరించి నాయన యొక్కొక్క పాదము నొక్కొక్క లేఖకునకు జెప్పుచు, లేఖకులను తొందర చేయకుండు విధముననే నూఱు శ్లోకములందా విషయముల నతి చక్కగా ప్రదర్శించి గంటలో ముగించెను. ఈ శ్లోకములు మధురతరములై, సారమం దేయొక్క గ్రంథమందు చెప్పబడని యపూర్వ విధమున మతత్రయ గ్రంథములన్నింటిని పిండగా వచ్చిన సారభూతములై యున్నట్లు మఠాధిపతులందరు మెచ్చుకొని, నాయనకు దుశ్శాలువలతో కలిపి రెండు నూటపదార్లను సమర్పించుకొని, నాయన యాశీర్వచనమును బొందిరి. సభ్యులలో కొంద రమ్మకు, నాయనకు గూడ క్రొత్తబట్టలను జదివించిరి. ఈ శ్లోకములు 'తత్త్వ ఘంటానుశాసన ★' మ్మనియు, 'తత్త్వఘంటా శతక'మనియు ప్రసిద్ధి జెందెను. మచ్చున క్రిందలి తొలి మంగళ శ్లోకము, తత్త్వబోధకులైన పూర్వాచార్యులను స్మరించిన కొన్ని తుది శ్లోకములు దిగువ నీయబడుచున్నవి :-

మంగళ శ్లోకము

శ్లో॥ ''సంకర్షణ స్యాంశ మనంతశక్తిం।
అనంత నామాన మముం నమామి।

★ కొన్నాళ్లయిన తరువాత నాయన స్వగురుని దర్శింపఁగా నప్పుడే క్షేత్రాను భవమును, తత్త్వఘంటా శతకమును గురించి చెప్పగా, శ్రీ రమణు లా ఘంటాశతక శ్లోకములకు ప్రీతిజెంది, వాటిని స్వహస్తమున నొక చిన్న పుస్తకములో వ్రాసికొని తనయొద్ద నుంచుకొనెను.

రామం తృతీయం రమణీయ గాత్రం।
రమా నివాసానన పుండరీకమ్॥'

(అర్థము:- సంకర్షణాంశ సంభూతుడు, అనంతశక్తుడు అనంతుడను పేరుగలవాడు, రమణీయ దేహముగలవాడు, లక్ష్మికి నివాసమైన పద్మమువంటి ముఖముగలవాడునగు బలరామునకు నా నమస్కారములు.)

ఉపసంహార శ్లోకములు:

శ్లో॥ "ఋషిభి ర్వామదేవాద్యై
ర్య ద్దృష్టం మంత్రదర్శిభిః।
తస్య శాస్త్రస్య సారోఽయం
మయా సంగృహ్య కీర్తితః॥ 1

అస్మాభిః సకలై ర్మాన్యో భగవా న్బాదరాయణః।
యేనార్థవంతి సూత్రాణి చక్రిరే తత్త్వదర్శినా॥ 2

సదాపి భగవాన్మాన్యః శంకరో విదుషాం వరః।
యేన భేదమతి ర్ధ్వస్తా జీవాత్మ పరమాత్మనోః॥ 3

మాన్యః స యతి రాజోఽపి
ప్రపత్తి ర్యేన దర్శితా।
విదార్య సకలం శాస్త్రం
భక్తానుగ్రహ కామ్యయా॥ 4

అంశావతారః పవనస్య మాన్యో
మధ్వస్సమా ధ్యాతులితోక్తి యుక్తః।
యో భేదవాదం కథయన్న రేమ
సర్వోత్తమత్వం స్వభువో బభాణ॥ 5

సదాపి వల్లభాచార్యో మాన్యో బుద్ధిమతాం వరః।
శుద్ధాద్వైత మతం యేన స్థాపితం ధరణీతలే॥ 6

శ్రీకంఠః సచ సమ్మాన్యః
సర్వాగమ విశారదః।
యేన శైవమతం భూమ్యాం
యోగి శ్లాఘ్యం ప్రవర్తితమ్॥ 7

బ్రహ్మదాస్యేన యోగేన జ్ఞానేనచ మనీషిణః।
అర్చయన్త శ్చింతయన్తః ప్రాప్ను వంతీతి మే మతిః॥
వేదాన్ సశాస్త్ర శతకాన్ సకలాన్విచార్య।
ప్రాచామృగాగమదృశాం మత మాదదానః। 8
క్షేత్రే ఫణీశ్వర కళాజనితస్య పుంసో।
ఘంటాశతం గణపతిః కవిరా డకార్షీత్॥ 9

అర్థములు :

1. మంత్రవేత్తలైన వాసుదేవాది ఋషులచే నే శాస్త్రము ప్రదర్శింపబడెనో, దాని సారమును నేను సంగ్రహముగా వచించితిని.

2. తత్త్వము దెలిసిన యే వ్యాసునిచే నర్థపుష్టియైన సూత్రములు రచింపబడెనో, మా కా వ్యాసుడు పూజ్యుడు.

3. ఏ శంకరునిచే జీవాత్మ పరమాత్మ విభేదము నిరాకరింపబడెనో, అట్టి విద్వన్మణి మాకు పూజ్యుడు.

4. ఏ మహానుభావుడు సకల శాస్త్రములను విమర్శించి, భక్తుల ననుగ్రహించుటకు ప్రపత్తిచూపెనో, యతిరాజైన ఆ రామానుజుడు మాకు పూజ్యుడు.

5. ఏ మహానుభావుడు జీవాత్మ పరమాత్మలకు భేదము చూపి, భగవంతుడైన పరమాత్మకు సర్వోత్కృష్టత చెప్పెనో, మధురవాక్కు గలిగిన వాయ్వవతారమగు మధ్వాచార్యుడు మాకు పూజ్యుడు.

6. ఏ వల్లభాచార్యునిచే భూమియందు శుద్ధాద్వైతము స్థాపింపబడెనో, బుద్ధిమంతుడైన అతడును పూజ్యుడే.

7. ఏ శ్రీకంఠునిచే యోగులచేతను కొనియాడబడు శైవమతము భూమియందు స్థాపింపబడెనో, అట్టి సర్వశాస్త్ర పారంగతుడు మాకు పూజ్యుడు.

8. దాస్యమువలన, యోగమువలన, జ్ఞానమువలన జనులర్చించుచు, చింతించుచు బ్రహ్మను బొందుచున్నారు.

9. వేదములతోకూడిన సకల శాస్త్రములను విమర్శించి, ప్రాచీనులైన ఋగ్వేద దృష్టిగల ఋషిమతము ననుసరించి, బలరామ క్షేత్రమున కవిరాజైన గణపతి యీ ఘంటాశతకమును రచించెను.

పిమ్మట నాయన ఉడిపి వచ్చి వాసుదేవశాస్త్రి బంధువులతోడను, పురమందితర సత్పురుషులతోడను, పండిత గణముతోడను పది దినములు గడపెను. ఆ సమయమం దొకనాడు రుక్మిణీ మఠాధిపతి నాయనకు గొప్ప విందు జేసి సత్కరించెను. విందునాటి సాయంత్రము శ్రీకృష్ణ సన్నిధానమున నాయన కృష్ణావతారమును గురించి యుపన్యసించి, దశావతారముల నాశువున* స్తుతించెను. గోకర్ణమునకు బయలుదేరు సమయమున నొక వింత జరిగెను. ఒక బ్రాహ్మణ పిల్లవాని కుపనయనము వయస్సు వచ్చినను ఉపనయనము గావించకుండ తండ్రి మరణించెను. మరణించినవానికి శ్రాద్ధకర్మ చేయించక తల్లి క్రైస్తవమతమున గలియుచు పుత్రుని విడిచెను. దిక్కులేక యీ బాలుడితర బ్రాహ్మణుల నాశ్రయించగా, వాడు భ్రష్టుడయ్యెనని వానిని సంఘమునుండి వారు బహిష్కరింపజూచిరి. వాడెవరివల్లనో విని గణపతిమునిని శరణుబొంది, బ్రాహ్మణ్యము దక్కింప వేడెను. దయాళుడైన నాయన వెంటనే వైదిక పండితులను బిలిచి, తమ విధి నశ్రద్ధజేసి తామే భ్రష్టులగుచున్నట్లు వారికి చూపి, పిదప బాలునకు వారిచే నుపనయనము గావించి, వానిచే తండ్రికి శ్రాద్ధకర్మను నిర్వర్తింపజేసెను. ఈ బాలుడు నాయనయందు కృతజ్ఞుడై వృద్ధిగాంచెను. ధర్మసూత్రమున కన్వయమెఱిగి పండితులు కృతజ్ఞులైరి.

---

* ఇది పిదప గీతమాలలో చేర్చబడెను.

ఓం

నాలుగవ ప్రకరణము

# గోకర్ణక్షేత్ర దర్శనము, అపూర్వ నవ్యజీవిత ప్రారంభము

క్రీ.శ. 1912వ సం॥ ఏప్రిల్ నెల సగము గతించిన పిదప నాయన 'ఉడిపి' గ్రామమును వీడి, కుటుంబసహితుడై సముద్రయానమున గోకర్ణ క్షేత్రము చేరెను. ఈ క్షేత్రము సముద్రతీరమునకు మూడుమైళ్లలోపున నుండును. ఇది పురాణప్రసిద్ధ క్షేత్రమై, యుత్తర కన్నడ జిల్లాకు చెందియున్నది. ఒకప్పుడు కన్యాకుమారీ యగ్రమునుండి పశ్చిమతీరమున వ్యాపించిన కేరళరాజ్యమున కిది యుత్తర సరిహద్దు గ్రామము. పావనచరిత్రముగల ఉత్తరసహ్యాద్రి యీ గ్రామముప్రక్కనే సముద్ర తీరమువఱకు వ్యాపించి, చక్కని యుపవనముల తోడను, నారోగ్యకరమగు పవనములతోడను నిండి, క్షేత్రదివ్యత్వమును హెచ్చించుచు, తపస్సున జీవించువారి కనుకూలత నిచ్చుచుండును. ఇక్కడ 'మహాబలు'డను పేరుతో గోకర్ణాకృతియగు లింగరూపమున నీశ్వరుడు మునుల ననుగ్రహించుటకు స్థిరపడిన కారణమున నిది గోకర్ణ క్షేత్రమైనట్లు స్థలపురాణము చెప్పును.

ఈ లింగమిక్కడ స్థిరపడుటకు విఘ్నేశ్వరుడు కారకుడైనట్లీ కథ చెప్పును. కావున నిది గణపతి హస్తముచే స్వయముగా ప్రతిష్ఠితమైనట్లెంచబడును. అది యెట్లు సంభవించెననగా, రావణు డొకప్పుడు తపస్సుచే నీశ్వరుని మెప్పించి, యీ లింగరూపమును వరముగా బడసి, తన లంకాపట్టణమున బ్రతిష్ఠించి యద్వితీయ బలసంపన్నుడగుటకు గైకొనిపోవుచుండగా, పార్వతి పనుపున విఘ్నేశ్వరు డొక యుక్తి పన్ని, యీ లింగము రాక్షసుల హస్తగతము గాకుండ రక్షించి, దాని బలము మునిజనులకు ప్రాప్తించునట్లీ క్షేత్రమందు దానిని భూమిపై స్థిరపరచెను. లింగము భూమిని తాకినచో స్థిరపడునని రావణున కీశ్వరుడు చెప్పినందున లంకానగరము చేరువఱకు భూమిని చేర్చరాదను జాగ్రత్తతో దాని నతడు కైలాసము నుండి తెచ్చుచుండెను. కాని, యీ క్షేత్రము చేరుసరి కతని యందు విఘ్నేశ్వరు డొక మాయగప్పి మూత్రవిసర్జన బాధను తీవ్రముగా కల్పించి, తానొక బాలుని రూపము బొంది యీ ప్రాంతమం దాడుకొన జొచ్చెను. మఱియెవ్వరు రావణున కక్కడ గన్పించని కారణమున నాటలాడుచున్న బాలునే పిలిచి, 'మూత్రవిసర్జనము గావించుకొనువఱకు దీనిని కొద్దిక్షణము లిట్లే పట్టుకొమ్ము. భారమైనచో పిలువుము. అంతేకాని. భూమిమీద దీని నుంచితివేని

శిరస్సు ఖండించెదను. జాగ్రత 'యని చెప్పి వాని చేతికా లింగము నిచ్చి, కొంచెము దూరముగా బోయి తన బాధను తొలగించుకొనెను. రావణుడు వచ్చుసరి కా లింగము నొక పవిత్రస్థలమందు బాలవేషమున నున్న గణపతి ప్రతిష్ఠించి మాయమైనట్లే కథ చెప్పను.

ఇట్టి దివ్యప్రతిష్ఠచే గొప్పదైన యీ క్షేత్రము మునిజనసేవితమై యుండగా, దీని నొకప్పుడు సగరపుత్రు లశ్వమును వెదకుటకై త్రవ్వి సముద్రమున గలిపిరనియు, మునులు దీనవదనులై పరశురామునితో చెప్పుకొనగా నతడు వచ్చి క్షేత్రమును బైటపెట్టుటకు సముద్రు నాజ్ఞాపించి, పెట్టనియెడల తన యస్త్రముచే సముద్రుని శిక్షించుటకు సంసిద్ధుడైయుండగా, సముద్రుడు భీతిచెంది, దూరముగా తొలగిపోయి క్షేత్రమును బైటపెట్టెననియు నింకొక కథ కలదు. ఈ కథవలన పరశురాము డీ క్షేత్రమును పునరుజ్జీవింపజేసినవాడయ్యెను.

ఈ రెండు కథలవలన సంప్రీతుడైన గణపతిముని యీ క్షేత్రమును బొంది, మహాబలుడైన యీశ్వరుని దర్శించినప్పుడా యీశ్వరకార్యమున తానీ జన్మయం దింకొకసారి పార్వతి పనుపున బంపబడిన ట్లావేశభరితుడయ్యెను. మునుల కాలవాలమై యొప్పు నీ క్షేత్రమందు పండిత గణములు, యజ్ఞ యాగాదిక్రతుసంపన్నులు నున్నను, వేదార్థ విచారణమందు, తపస్సాధనమందు సంస్కరింపబడవలసి యుండిరేమో ! అట్లయినచో, విశాలాక్షమ్మ తలచినట్లు తన జీవితాభిలాష సార్థకమగుట కిక్కడకు భగవంతు డాకర్షించినట్లు నాయన భావించి భక్తిపరవశుడయ్యెను. ఆ కారణమువలన నీశ్వరకృప యెట్లు ప్రవహించునో దాని ననుసరించి పురజనుల పరిచయము బొందవచ్చుననియు, నంతదనుక నిగూఢముగా తపస్సున ప్రవేశించవలెననియు నాయనకు తోచెను. అమ్మ యీ యభిప్రాయమును బలపరచినందున కోటితీర్థపు గట్టుపైగల కృష్ణమఠము యొక్క వెనుక భాగమున తపస్థలమును నిర్మించుకొని యమ్మనాయనలు దీక్షాబద్ధులైరి. మహాదేవముకూడ రహస్యమును గాపాడుచు, సాయంత్రములందు తల్లితండ్రులకు భిక్షాన్నము తెచ్చుచుండెను.

నిరంతరము యాత్రికులచే జనసంకులమై యుండు క్షేత్రములందు పురజనులు యాత్రికుల తోడనే హుటాహుటిగా నుందురు. మోమాటముచేతనో, ధనాపేక్షచేతనో తమ గృహములందు యాత్రికులకు బస కల్పించి, వారి సదుపాయములరయుట క్షేత్రవాసులకు రాత్రింబవళ్లొక పనియై యుండును. ఇంక పురోహితవర్గ మూరంతయు తిరుగుచున్నను, పణము రాల్చు ముఖములే వారు తిలకింతురుగాని భికారివేషమున నున్నవా రెంత మహనీయులైనను వారి దృష్టిని బడరు. కనుక గణపతిమునిని పరామర్శించినవారే లేకుండిరి, అట్లయినను, కోవెల పూజారి యమ్మనాయనల దృఢదీక్షను, నాయన ముఖమందు పండిత వర్చస్సును కనిపెట్టి సాయంత్రములందు నాయనతో కొంచెము కొంచెము పరిచయము చేసికొన

దొడగెను. వారము దినములలో వారు కొంత గుట్టు కనిపెట్టి, నాయన గొప్ప పండితుడని గ్రహించి, పురములోని పండిత గణముల కెఱుకపఱచెను. వారు నాయన పరిచయము గావించుకొని పురములోని కాహ్వానించిరి. కాని, వెంటనే నాయన తపస్సు విరమించి వెళ్లలేదు.

ఆ యూర నిజముగా పండితులు లెక్కకుమీరి యుండిరి. ఇతర వర్ణముల కంటె బ్రాహ్మణు లధిక సంఖ్యాకులై, తమ కులమతాచారములను బోషించు కొనుటలో శ్రద్ధాపరులైయున్నారు. వీరిలో పెక్కుమంది వేద వేదాంగవిదులు, యజ్ఞక్రతువులు నొనర్చినవారు. పూర్వము కదంబకులవర్ధనుడైన మయూరవర్మ మహారాజు క్షేత్రమందు పాండిత్యము క్షీణించుట గమనించి, యితర స్థలముల నుండి వేదవిద్యా పారంగతులను, శిష్టాచార సంప్రదాయవేత్తలను, వివిధ శాస్త్రము లందు వన్నెకెక్కిన పండితులను, బహుక్రతువు లొనర్చిన పుణ్యాత్ములనెంచి, సుమారైదువందల కుటుంబముల నక్కడ మడిమాన్యములిచ్చి స్థిరపరచెను. నాటినుండి యీ కుటుంబస్థులు తమ సంప్రదాయములను వీడక సారస్వత సంపదను, పవిత్ర జీవితకీర్తిని నిలబెట్టుకొనుచు, తమ పూర్వుల గౌరవప్రతిష్ఠలను గాపాడుకొనుటలో శ్రద్ధ జూపుచుండిరి. పందొమ్మిదవ శతాబ్దమున చివరికాలములో 'హోసమన్ గణేశశాస్త్రి' యను నతడీ యూరి పండితులలోకెల్ల నధికుడై, రాష్ట్రమందంతటను కీర్తి సంపాదించెను. ఇతడు మరణించులోపున గోకర్ణమందు సంస్కృత విద్యాపీఠమును నెలకొల్పి, ప్రవీణుల నందు నియమించి, విద్యాబోధ నానాశాస్త్రములందు లభించునట్లొనర్చెను. ఆ కారణమువలన నితర స్థలములందు ప్రాచీన విద్యలు నశించు కాల మేనాడో సంభవించినను, నిక్కడ దాని ప్రభావ మెప్పటికప్పు డణచబడుచు, నట్టి విద్యలకు పునరుద్భవకాల ముదయింపజేయు వారికీ క్షేత్రము నిమిత్తకారణము కాదగు లక్షణములను దోపజేయుచుండెను. అంతేకాక, యుక్తి నాశ్రయించి. రాజుల మెప్పుబొంది కీర్తిగాంచిన పండితుల కీ క్షేత్రము ప్రతివాదిభయంకరమై యొప్పెడిది.

అట్లయినను, నాయన పరిచయము పురపండితులకు గలిగి, యెప్పు డతని కీర్తి విదితమయ్యెనో, అప్పుడు కీర్తిలక్ష్మిని చేయిబట్టుకొని నాయన పురమున బ్రవేశించు నవకాశమును భగవంతు డనుగ్రహించు నుద్దేశముతో గోకర్ణ పండితులపై నురుకుటకొక పండిత బెబ్బులిని ప్రేరేపించి, పురమందాందోళన పుట్టించెను. ఈ బెబ్బులిపే రనంతశాస్త్రి. ఇతడు శాస్త్రములందు దిట్టయేగాక, మంచి వక్తయై, తన ప్రవచనమున కుత్తర ప్రవచన మిచ్చువారలను యుక్తులతో డీకొనుటయందతి నేర్పరియను ప్రసిద్ధిబడసెను. గోకర్ణ విద్యాపీఠమందు పరమేశ్వర మహిమను గుఱించి యుపన్యసించుటకు వచ్చుచున్నట్లితడు వార్తనంపి, యుత్తర ప్రవచనము కొరకేర్పాటు గావింపుమనెను. అనగా, పరమేశ్వర మహిమ గొప్పదని

యతడు యుక్తులను జూపినప్పుడా యుక్తులను ఖండించి విష్ణు మహిమనో, మతొకరి మహిమనో గొప్పదిగా పోషించువా డుత్తరప్రవక్త కావలెనని భావము. ఇతనికి వెరచి గోకర్ణ పండితులు నాయనను శరణువేడిరి. 'సరే'యని నాయన పల్కి, ప్రవచనము నాటికి తన తపస్సును నిలిపి పురము లోని విద్యాపీఠమున కేతెంచెను. అంతకుపూర్వ మనంతశాస్త్రి బొంబాయి రాష్ట్రమున విశేషముగా సంచరించుచుండుటవలన నాయన ప్రసిద్ధివినుట కతని కవకాశము లేకపోయెను. గోకర్ణము వచ్చిన పిదప తన కుత్తర ప్రవచన మిచ్చువానిని గురించి కొంత వినినను పట్టించుకొనలేదు. వాదచంచువుల నొక తిమిరమిట్లావరించుటకద్దుగదా !

మధురయుక్తులతో హాస్యములాడు విధమున అనంతశాస్త్రి ప్రవచనము ముగిసెను. సభ పండితులతో క్రిక్కిరిసి యుండెను. గోకర్ణముయొక్క కీర్తికాంత ననంతశాస్త్రి యపహరించునను భీతి నలుదెసల వ్యాపించిన కారణమున సభామంటపము నిశ్శబ్దమై, సభ్యుల దృక్కు లన్నివైపులనుండి నాయనపై పడెను. నెమ్మదిగా నాయన లేచి కంఠమును దెరచెను. దీక్షచే శరీరము నీరసించి యున్నను, తపస్సుచే నధిక ప్రభావవంతమైన యతని వాణి ద్యులోకమునుండి యురుకు గంగవలె కంఠమునుండి యత్యంత వేగముగల ప్రవాహరూపమున వెడలి, కల్పిషములను పెల్లగించి త్రోసివేయు నిర్మల పవిత్రోదకమువలె అనంత శాస్త్రియొక్క పరిహాస యుక్తులను చిందరవందరచేసి, తత్స్థానమున మీటింపనలవి గాని యుక్తులను దొంతర దొంతరలుగా పేర్చుచు వైదిక ఋషులచే కొనియాడ బడిన ఇంద్రమహిమను బ్రతిష్ఠించి, యార్యమతమున కెందినవాడది కాదనుటకు వీలులేనట్లు, పౌరాణిక మత మింద్రుని తూలనాడుటకు కల్పింపబడిన యవైదిక మతమై, యందలి కథలచే ప్రామాణ్యార్హతను బొందజాలనట్లు నిరూపించెను. ఇంద్రమతమునకు శాఖలైన ఈశ్వర, వైష్ణవ మతములు మూలముకంటె ప్రాచీనములు కాజాలవనియు, ప్రాణశబ్ద మొకదానియందు, శబ్దమునకు వ్యక్తప్రకాశము నిచ్చు బుద్ధి తేజమొక దానియందు, ప్రాధాన్యములైన యీశ్వర, వైష్ణవ మతములు రెండును నింద్రపుత్రుల వంటివై, మూలతత్త్వమును బొందించు సాధన మాత్రములనియు నాయన చెప్పి, రమణోపదేశ సాంకేతికమును, తత్ఫలముగా వేదోద్ధరణావశ్యకతను పేర్కొని ముగించెను.

గంభీరమైన యీ ఉత్తర ప్రవచనమునకు తెల్లబోయి యనంతశాస్త్రి నాయనను సాక్షాద్గణపతివలెను, గణపతి యపర వేషమున వేదవ్యాసుని వలెను స్తుతించి, నాయన పాదములను స్పృశించి, నాయనకు శిష్యుడు కాగోరెను. అప్పుడతని నాశీర్వదించి నాయన వాని ప్రవచనముగూడ మధుర రసవంతమై యుండెనని మెచ్చుకొని వానిని కౌగిలించుకొనెను. ఈశ్వర మతమునకు జవాబుగా విష్ణుమతమును ప్రతిపాదించు నలవాటు సభలయం దలముకొని, యీ రెండింటి

మధ్య చిరకాలమునుండి కల్పింపబడిన సంవాదోద్దేశము వైదిక ఋషి మతమును విస్మరింపజేయుటకయ్యెనని పండితులందరు గుర్తించి, నాయన యీ సభాచారములను క్రొత్త ధోరణిచే నరికట్టినవా రయ్యెనని స్తుతించిరి.

అటుపిమ్మట వేదశాస్త్రకోవిదులతోడను, అనవద్య సాధుగుణ సంపన్నుల తోడను నిండియున్న నాగేశ్వరవీధిలో శ్రీ వెంకటరమణ పండితుని యింట నాయనకు బస కల్పింపబడగా, విశాలాక్షి మహాదేవములను వెంటనిడికొని నాయన దానియం దీశ్వరాజ్ఞను బొంది ప్రవేశించినట్లు ప్రవేశించెను. నాటినుండి వివిధ శాస్త్రములకు చెందిన పండితశిరోమణులు కింకరులవలె నాయన పాదములకడ కూర్చుండి, తమ తమ పాండిత్యములకింకను మెరుగుగోరజొచ్చిరి. అన్నింట నసమాన పాండిత్యముగల నాయన వారి కోర్కెలను దీర్చుటకు విజృంభించి తన ప్రజ్ఞ చూపెను. జ్యోతిశ్శాస్త్రజ్ఞులు కొందఱు పరాశరసంహితయందు తమకు గలిగిన సందేహముల కుపాయముల నడుగగా, మతభేదములతో గూడి మిగుల విస్తృతమైయున్న యీ సంహితలోని విభేదములు తొలగి సామరస్యమగుటకును, శాస్త్రము సులభగ్రాహ్యమగుటకును 'లఘు సంహిత'యను పేరున కొన్ని సూత్రములను నాయన రచించి యిచ్చెను. జ్యోతిషఫలములను సరిగా చెప్పుటకిది యెంతో యుపకరించెనని గోకర్ణ పండితులు నేటికిని చెప్పుకొందురు.

ఇంక వేదపండితుల సంగతి కొంత ముచ్చటింతము. ఆ ప్రాంతమందు ప్రచారములోనున్న వేదములో నధిక భాగము లక్కడక్కడ యుండుట నాయన గుర్తించి, వాటిని పాఠము చెప్పించుకొని యొక పక్షము దినములలో కంఠస్థ మొనర్చెను. ఈ భాగములందు భాగవతములోని కృష్ణలీలా ఘట్టముల కాధారములుండుట నాయన కాశ్చర్యకరమయ్యెను. నాటినుండి శ్రీ కృష్ణచరిత్రము నంతను వేదము నుండి మథించి తెలిసికొనవలెననియు, తన్మూలమున మహాభారత వీరులను గుఱించి, వారి యస్త్రవిద్యా రహస్యములను గుఱించి విదితమైనంతవఱకు గ్రహించవలెననియు నాయనకు బుద్ధిపుట్టెను. ఒక యవసరమేదైన నిట్లు కల్పించుకొనుటవలన పెక్కు వేదసూక్తములయొక్క హృదయము మథింపబడినట్లగును గదా ! ఈ కార్యమందువలన తనకు చిరకాలము నుండి యున్న వేదవిమర్శయను తృష్ణకు తోడ్పడునని యెంచి, తన కీ సంకల్పమును గలిగించిన భగవంతుని స్మరించెను. మఱియు దానికి హేతుభూతులైన వైదికమిత్రుల కీ సంకల్పము నెఱిగించి, వారి సహాయముగూడ నాయన యపేక్షించెను. వారిలో వేదభాష్యమును జదివినవారుండిరి. భాష్యార్థములు పెక్కుస్థలములందు స్థూలములై యున్నందున నవి మథింపదగి యున్నవి. సూక్తమునంతను బుద్ధియందు ధరించి మథించినప్పుడుగాని యంతరార్థమునకు బుద్ధి పోదని వారి కుపాయములు జూపెను. ఉదాహరణమునకు, తనకదివఱకు కర్మకాండాత్మకములుగా ప్రసిద్ధములైన సూక్తము లే విధముగా మథనమువలన జ్ఞానకాండాత్మకములగుచును

విశదమయ్యెనో పేర్కొనెను. వారు నాయనకు తోడ్పడుట కుత్సాహపడి తమ తమ యిండ్లయొద్ద యత్నించిరి. ఒక పక్షము దినము లొక్కొక్క రొక్కొక్క సూక్తము నెంచుకొని యత్నించగా, కొందఱికి యావత్సూక్తమును బుద్ధిచే ధరించుట కష్టమయ్యెను. మఱికొందఱికి తలనొప్పి ఫలమయ్యెను. అప్పుడుగాని తపోజనిత మీ కార్యమునకెంత యవసరమో వారికి విదితముకాలేదు. ఈ విధముగా వేదపండితులు నాయన యొక్క యసాధారణ బుద్ధిపాటవమును, తపోవీర్యమును గుర్తించి, కేవల పాండిత్యముచే దుస్సాధ్యమగు వేదహృదయ పరిశోధనవలన నాయన యే విధముగా తన తపస్సును మఱింత వృద్ధి జేసికొనుటకు, లోకహితకార్యము సాధించుటకుగూడ సాహసించుచుండెనో తెలిసికొనగల్గిరి.

ఋగ్వేదమునకు దొరలుకూడ చులకనబుద్ధితో భాష్యములను రచించిరి. ఆ భాష్యముల సార్థకతగూడ నంతమాత్రమే యయ్యెను. కొందఱు భారతీయులే ఖగోళశాస్త్ర ప్రమాణములకొఱకు వేదమును గాలించుచు, తుదకు నక్షత్ర - గ్రహదృగ్గమనాది విషయములే ఋషి - దేవతా చరిత్రములై మన పురాతన గ్రంథములందు వెలసినట్లు భాషించుటకుగూడ వెఱవలేదు. మఱికొందఱు వేదమంతయు విహారామ్యార్థము మాత్రమేనవి ప్రకాశికలు రచించి తమ స్వల్ప బుద్ధిని జూపిరి. ఇంకను కొందఱు పూర్వాపర సంబంధములతో ప్రసక్తి లేకుండ తమకు ప్రయోజనకరమగునంతవఱకు వాక్యములను వేదమునుండి గైకొని దుష్టార్థములతో ప్రయోగించి వేదగౌరవమును, వేదాశయమును తూలనాడుచుండిరి. ఇందరియందును బుద్ధి వికృతి యెట్లున్నను, వేదమొక ప్రమాణగ్రంథమనియో, వివిధ విషయ విజ్ఞానకోశమనియో భావస్ఫూర్తి యొకటి గమనార్హమై యున్నది. ఆ విషయముల యాథార్థ్యము లవగతమైనప్పుడు వాని ప్రయోజనము లవగతమగును. అది తెలియువఱకు ప్రయోజనమిదిగావచ్చు, నదిగావచ్చునను భ్రాంతిచే బుద్ధి వికృతమగుట సహజమే. భాష్యములు జదివిన పండితు లందును వేదమంత్ర ప్రయోజనములు నిష్కర్షగా తెలియనప్పుడు మంత్రముల యొక్క యాథార్థ్యము మథించని లోపము స్పష్టముగా విదితమగుచున్నది. కావుననే నాయన యిక్కార్యమును బూని తనకు సాధ్యమైనన్ని మంత్రప్రయోజనములను లోకమున కిచ్చి లోకసేవ చేయదలచెను. ఇది సేవలన్నింటిలో మేటి సేవయని పండితులు గుర్తించిననాడు వారు తన్ననుకరించి, వేదమథనమనెడి సాధనమందే నిజతప స్స్వరూపమును గూడ కనుగొందురని తలచి, తా నీ విషయములో నాదర్శము జూపుటకు దృఢనిశ్చయుడయ్యెను. వేదమునకైనను, జీవునకైనను హృదయ మొక్కటియైనప్పుడు మహర్షి రమణు లుపదేశించిన హృదయ విద్యకిది సార్థకమేగదా!

అందువలన పురమున కాపురము బెట్టిన కొద్దిరోజులకే తపస్సుకొఱకు నిజనస్థల మాశ్రయింపగోరెను. పురమధ్యమందు నివాస మమ్మకుగూడ హితవు

లేకపోయెను. ఆమె నాయనను హెచ్చరించుట కిట్లింకను జెప్పెను: ''మనము తపస్సును వృత్తిగా నెంచుకొంటిమి. మిమ్మాశ్రయించుచున్నవారు మిమ్ములను తమ ప్రయోజనములకై కిక్కడ బంధించుచున్నారుగాని మీ లక్ష్యముల కెంత మాత్రము తోడ్పడుటలేదని నేను గ్రహించితిని. విద్యవలన విచక్షణను బొంది, గొప్పదగు లక్ష్యమును సాధించి, విద్యకు సార్థకము జూపుటకు బదులీ కోవిదులందరు స్వార్థమందే జీవితయాత్రను గడపుట మీరు చూచితిరికదా. వీరి కొఱకు మనము మన లక్ష్యము నశ్రద్ధచేయవద్దు. నేనుకూడ తపస్సు సల్పెదను. మనకు పురబాహ్యమందు భిక్షలు లభించవు. కనుక పాకాదికార్యములకు మహాదేవమున కింకొక బాలుడెవడైన తోడువచ్చునేమో అడిగి తెలిసికొనుడు.''

ఇట్లు కుటుంబసహితముగా పురబాహ్యమందు వసించుటకు వీలైన స్థలముకొఱకు తెలుగ మిత్రుల నడిగి, యుమామహేశ్వర పర్వతముపైనున్న గణపతి కోవెల నీటివసతులతోడను, ఉపవనముతోడను గూడి ప్రశాంతమై యుండునని నాయన తెలిసికొనెను. ఆటుపిమ్మట శిష్యజన భక్తగణములందరు కూర్చుండి యుండగా తనకు గావలసిన బ్రాహ్మణయువక సహాయమును గుఱించి నాయన ప్రస్తావించగా వారొకరి ముఖ మొకరు చూచుకొని యూరకుండిరి. వారి ప్రవర్తనము సహించలేక వారందరిలో వయస్సున చిన్నవాడై, విద్యార్థిదశయందున్న యువకు డొక డావేశపూరితుడై లేచి 'మిమ్మనుసరించి మీ వెంట వచ్చుటకు నేను సిద్ధముగా నుంటి'నని పల్కెను.

ఆ యువకునివైపు నాయన చూచెను. అతని ముఖ మందార గుణములతోబాటు బ్రహ్మవర్చస్సు స్ఫుటముగా నుండి పవిత్రశీలమును సూచించుటకు నాయన సంతసించి 'మీ తల్లితండ్రుల యనుమతి నీవు బొందితివేని నీ సేవ నాకు సమ్మతమే' యనెను. వెంటనే యువకుడు తన్ను శాసించుటకు గురువులు తప్ప మఱి యెవ్వరు లేరని పల్కి 'నే నీ విషయములో స్వతంత్రుడనై మీ యనుగ్రహము నిదే యర్థించుచుంటి' ననుచు నాయన పాదములపై బడుట కుత్తరీయమును నడుమునకు బిగించుకొనజొచ్చెను. వాని పల్కులు చిత్తమం దత్యంత సన్నిహిత పరిచయమును స్ఫురింపజేయుట నాయన గుర్తించుకొని, తన దృష్టి నాంతర్యమునకు త్రిప్పుకొని చూచుచుండగా యువకుడు 'విశ్వామిత్ర, దైవరాత, ఔదల త్రయార్షేయ ప్రవరాన్విత ఆత్రేయ గోత్ర నామ్నా గణేశ శర్మాఽహంభో అభివాదయే' యని తన ప్రవర చెప్పి నాయన పాదములపై పడెను. ఈ ప్రవర నాయన చెవిని బడి, వాని హస్తస్పర్శ పాదములం దెప్పుడయ్యెనో, అప్పు డంతర్దృష్టియందు వాని పూర్వజన్మస్మృతి మెఱుపువలె స్ఫురించెను. వెంటనే 'నీవా దైవరాతా ! నీవిక్కడనా యుంటి'వని నాయన మిగుల సంతోషముతో వానిని లేవనెత్తి, వాని శిరస్సు ముద్దుపెట్టుకొనెను. అంతటితో నూరకుండక నాయన వాని నమ్మకడకు తీసికొనివెళ్లి 'ఇదుగో మన సేవకు లభ్యమైనవాడు. వీడే దైవరాతుడు.

మనమెవరి కొఱకు వచ్చితిమో తెలిసినదా' యని యెత్తి పొడిచినట్లడిగెను. ఆమె చిఱునవ్వు నవ్వుచు పాదములపై వ్రాలిన దైవరాతుని లేవదీసి, వాత్సల్యానుకంపములతో పుత్రుని జేరదీసినట్లు వానిని చేరదీసెను. తన పూర్వజన్మ వృత్తాంతము నెఱిగిన సిద్ధదంపతుల సేవ తనకు ప్రాప్తించినందులకు దైవరాతుడు బ్రహ్మానందభరితుడయ్యెను. నాటి నుండి యతని పేరు 'గణేశభట్టి'నను, గురుదత్తనామ మతనికి ప్రసిద్ధమయ్యెను.

'హోసమనే' బిరుదముగల్గి, విద్యాపీఠము నాయూర నెలకొల్పి, దాని కధ్యక్షుడైన గణేశశాస్త్రికి దైవరాతుడు దౌహిత్రుడు. తాతగారి స్థలమున నితని నుంచుటకు పండితులితనికి విద్య గరపుచుండిరి. ఋగ్యజుస్సామ వేదముల నప్పటే యధ్యయనము ముగించి, ఇతడు కావ్యపాఠములను జదువుచుండెను. ఉజ్జయినీ నివాసియైన రామదాసను భక్తుడు గోకర్ణము వచ్చియుండగా, వానియొద్ద నితడు పండ్రెండవ యేటనే మంత్రదీక్ష బొందెను. 'వాసుదేవానంద సరస్వతి' యను నొక స్వాములవారికడ హఠయోగము నేర్చి, శ్రద్ధతో దానిని సాధించు చుండెను. ఇప్పుడు నాయన దివ్యమూర్తిని జూచినప్పటినుండి యాకర్షింపబడి, యనుదినమూ మూర్తిని దర్శించుట కందరితోపాటు వచ్చుచు, దైవకృపచే లబ్ధమైన అతని పాదమందు విపుల విద్యాకాంక్షతోడను తపఃకాంక్ష తోడను సేవానిరతుడై శరణు బొందెను. సాధుస్వభావము, శాంతప్రకృతి, వినయశీలము, సాధుసజ్జన సహవాసము, సదాచారములందు భక్తినియమములతోపాటు బుద్ధిపటిమగలిగి నాయన శిష్యుడగుటకు, అతని యనుగ్రహ ప్రసాదమును బొందుటకు నిత డన్ని విధముల తగియుండెనని వేఱే చెప్పనక్కరలేదు.

ఆ యనుగ్రహము పర్వతముపైగల గణపతి యాలయము ప్రవేశించినప్పటి నుండి ప్రసరింప నారంభించుటవలన దైవరాతుడు తానింకను ముగించవలసి యున్న కావ్యముల నవలీలగా నాయన కడ పాఠము చెప్పించుకొని ముగించెను. అటుపిమ్మట నాయన వాని కాత్మనిష్ఠోపాయభూతములైన ప్రాణ, వైశ్వానరా ద్యుపనిషద్విద్యల నుపదేశించి, హఠయోగముకంటె నుత్కృష్టతరమగు యోగసాధన లందు ప్రవేశింపజేసెను. వీటితోపా టతనికి తర్క వ్యాకరణ శాస్త్రములు పాఠము చెప్ప మొదలిడెను. ఈ బోధయంతయు రాత్రులందు మాత్రమే చేయబడు చున్నను, నాయన దివ్యానుగ్రహబలమువల్ల కానిచో పెద్ద పెద్ద పాఠముల నతడది వఱ కెఱుగని విధమున చెప్పించుకొని పగటి పూటలందు పాకాది శుశ్రూషలను సల్పగా మిగిలిన స్వల్పకాలమందు వల్లెవేయుచు నెట్లభివృద్ధి గాంచగలడు ? మహాదేవము మాత్రము పురములోనే యుండి యొక పాఠశాల ప్రవేశించి సంస్కృతము నభ్యసించుచుండెను.

ఇంక నాయన తపస్సు పాఠములు చెప్పవేళ, నిద్ర వేళ తప్ప మిగిలిన వేళలం దొక్కొక్క ఋషిదర్శనమునకు జెందిన మంత్రముల నన్నింటిని ఋగ్వేదము

నుండి ప్రత్యేకపరచి, సూక్ష్మవిమర్శచే పెక్కు విషయములను విడివిడిగా నంతర్బుద్ధియందు తరచుట. ఆ విషయము లెట్టివనగా: 1. మహాభారత చరిత్రకాలమునకా ఋషి ముందువాడా, సమకాలికుడా, వెనుకటివాడా ? 2. సూక్తమందా చరిత్ర పురుషులుగాని, వారి కథలుగాని స్మరింపబడెనా ? స్మరింపబడినచో వారి కవగతమైన యస్త్రవిద్యాదర్శనములను సూచించుటకా ? లేక వారు పదార్థ విజ్ఞానశాస్త్రముచే నిర్మించిన నాగరికతావిశేషములు, వారిచే కనిపెట్ట బడిన చికిత్సాది రహస్యములు సూచింపబడుటకా ? 3. చరిత్ర స్మరణ మించుకయు లేని సూక్తములలో బోధింపబడిన శాస్త్రవిషయము లెట్టివి ? దేవతాతత్త్వములకు చెందిన రహస్యములైనచో తత్త్వస్వరూప మెట్టిది ? తదనుగ్రహ ప్రాప్తికై నియమింపబడిన మంత్రము లెట్టివి ? ఇత్యాది విషయములను వెలువరచుచు ప్రతి ఋషియొక్క యభిమతమునుగూడ నరయఁజొచ్చెను. పౌరాణిక కథలం దీ విషయము లెంతవఱకు చెప్పబడెనో వాటిని తత్తత్సందర్భములందు జ్ఞప్తిదెచ్చుకొని, వాని సహాయమున వేదార్థముగాని, వేదార్థ సహాయమున వాని యథార్థముగాని నాయన విమర్శించుచుండెను. ఇది నాయన ప్రారంభించిన నూత్న తపః పద్ధతి. దీనికి దేవతాశక్తి తోడ్పడుటకై యమ్మ 'తారా' మంత్రమును తదేకముగా జపించుచుండెను.

శ్రీ రమణు 'దహం' వృత్తి పరిశోధన ముఖ్యమని గదా చెప్పెను. ఇట్టి ఘట్టములను చదివినపుడెల్ల నాయన దాని నశ్రద్ధచేసి యితర పరిశోధన వృత్తుల కవి యెంత పవిత్రములైనను గడంగుచుండెనను మీమాంస పాఠకులను బాధించును. దానికి సమాధానముగా రెండు విషయములను వారు మనస్సున నుంచుకొనవలెను. 1. సహజముగా నాయనయం 'దహం'వృత్తి యణఁగి తన మూలమునకే యెల్లప్పుడు దేవతాభక్తివల్లనో, నిజరూప విమర్శవల్లనో వంగి, శారీరక కామ్యముల కొఱకెన్నడు ప్రకోపించలేదని యింతవఱకు చదువబడిన చరిత్ర స్పష్టపరచును. ఉడిపి ప్రాంత బడబాండేశ్వరమం దే సిద్ధి పొందబడెనో, ఆ సిద్ధివలన 'నహం'కృతిరూపమైన వృత్తి పూర్తిగా నశించినందుననే గురువు కానిండు, భగవంతుడు కానిండు నాయనను లోకహితకార్యమందా వెంబడిని బ్రవేశింపజేసెను. 2. 'అహం' వృత్తి నాశనమైన పిదప చేయుట కింకేమియు నుండదను మాట చెప్పిన విమర్శింప దలచితిరేని యా మాట 'నే'నను కర్తృత్వబుద్ధికి చెప్పబడెనుగాని, యీశ్వరుడు తనద్వారా చేయించుచుండెనను బుద్ధి నిశ్చయముగలవారి నుద్దేశించి చెప్పబడిన మాట కాదని తెలియవలెను. అట్లు కానిచో నవతారపురుషులు శారీరక, మానసిక కార్యములను జేయక తాతిదిమ్మెలవలె నవతారము ముగియువఱకు కూర్చుండి యుండవలసినవా రగుదురు. కావున తన హితము పోయిన పిదప లోకహితమున కర్తులగుట పై వాక్యము సూచించునని గ్రహించి, గణపతిముని విషయమున బుట్టు శంకలను పాఠకులు ఖండించుకొనవలెను.

ఈ తపఃకాలమందు గోకర్ణ పండితుల యనురోధము వలన ప్రతి శుక్ల పాడ్యమినాడు, కృష్ణపాడ్యమినాడు నాయన పురములోనికి వెళ్లి విద్యాపీఠము నధిష్ఠించి, పండితుల సందేహములను నివారించిన పిదప తనచే సాధింపబడిన విషయముల నెఱిగించుటయు, వారి కోర్కె ననుసరించి యేదేని నుపన్యసించుటయు విధియయ్యెను. ఈ యుపన్యాసములకు, ప్రసంగములకు నాయన తన వెంట దైవరాతుని తీసికొనివెళ్లి మున్ముందతడా యధ్యక్షపీఠము నలంకరించునపు డనర్చ వలసిన విధులకు తర్ఫీదు చేయుచుండెను.

దాదాపు నాలుగు మాసము లీ విధముగా తపస్సున పురబాహ్యమం దమ్మనాయనలు గడపిరి. నవంబర్ నెల గడచుచుండగా నొక నిమిత్తమున వారు పురములోనికి రావలసివచ్చెను. నాయన తండ్రియైన నరసింహశాస్త్రికి జ్వరము వచ్చుచున్నట్లు వార్త వచ్చెను. ఏ రోజున కెట్టి వార్త యింకను వచ్చి, తన్ను రమ్మని తండ్రి కోరునోయని నాయన యెంచి పురములోనికి కుటుంబసహితముగా పూర్వపు బసలోనికే మారెను. అంతేకాక, తాను కలువరాయి వెళ్లినచో నింటి యొద్ద తోడుండుటకు కామాక్షి యప్పశాస్త్రులను వజ్రమ్మతో సహా రమ్మనుచు నాయన లేఖ వ్రాసెను.

ఈ లేఖనందుకొని యప్పదంపతులు రాబోవుచుండగా సికింద్రాబాదుద్యోగ ప్రయత్నమునకు వెళ్ళి కొన్ని సొంత కారణములవలన చెన్నపురము మరలివచ్చిన ఎ.ఆర్. దొరస్వామి యిట్లు వారికొక వార్త చెప్పెను: "కల్యాణరామున కుపాధ్యాయపదవి యిష్టము. సికింద్రాబాదు, హైదరాబాదులలో బోలె డుద్యోగము లన్ని శాఖలందు నున్నవి. మహబూబు కాలేజికి దరఖాస్తు పెట్టినచో వానికి హెచ్చు వేతనముపై వెంటనే యుపాధ్యాయపదవి లభించును." కల్యాణరాము దిక్షపడి దరఖాస్తు పెట్టెను. వానితో శంకరశాస్త్రిని కూడ పొమ్మని యప్పశాస్త్రి హెచ్చరించి, వారి యుభయుల ప్రయాణమున కేర్పాట్లుగావించి, వారు చెన్నపురము వీడు లోపుననే గుర్వాజ్ఞను మన్నించుటకు భార్యతోగూడి తొందరగా గోకర్ణము చేరెను. ఎంత తొందరపడినను డిసెంబర్ రెండవ వారమునకుగాని వారు చేరలేదు. ఈలోపున నరసింహశాస్త్రి యవసానకాలమున కెదురుచూచుచు, నాయనను చూడగోరినట్లు తంతి రాగా నాయన వెంటనే గోకర్ణము నుండి బయలుదేరి, చెన్నపురముమీదుగా కలువరాయి పయనమయ్యెను. చెన్నపురము నుండి బయలుదేరుచున్నట్లు తంతిని ముందు పంపినను, వేళకు వెళ్లుటకు మార్గమందు వర్ష భారముచే నాటంకముగలిగి నెల్లూరు ప్రాంతమం దొక దినము రైలాగిపోయెను. ఆ కారణముచేత తండ్రి మరణించిన పిదప కొన్ని గంటలకు నాయన కలువరాయి చేరి, తుదిఘడియలలో తండ్రిచెంత నుండజాలని తన దురదృష్టమునకు చాల వగచెను. ఆ తుదిఘడియలలో నాయనకొఱకే నరసింహ శాస్త్రి నిరీక్షించి, యేదో చెప్పదలచియు నితరులకు జెప్పక 'గణపతి తనంతట తా దెలియగల' దని పల్కి ప్రాణములను విడచెనట. ఈ విధముగా

తన యిష్ట దైవాంశను పుత్రునిగా బడసి, యతని దివ్యచరితమే తన పుణ్యఫలముగా నెంచి, జీవితాశయమును దృప్తిదీర గాంచి యనుభవించిన నరసింహశాస్త్రి పరీధావి సం॥ కార్తిక బహుళ ద్వాదశినా డిహమందే పరార్థసిద్ధిని బొందినవానివలె శరీరవిముక్తు డయ్యెను. (5-12-1912).

పిదప జ్యేష్ఠసోదరుడైన భీమశాస్త్రిని ముందిడుకొని నాయన యథావిధిగా పితృశ్రాద్ధమును ముగించుకొనెను. మామగారి మరణవార్త విశాలాక్షమ్మ చెవిని సోకినంతనే పిడుగు మొత్తినదానివలె నేలగూలి కడు దుఃఖించెను. అతని పుత్రిక కంటె నధికాభిమానముతోడను, దివ్యాంశతో జన్మించిన అతని పుత్రునితో సమానముగను నెన్ని దిన్నాళ్లు ప్రియమార తన్ను జూచుచుండెనో, ఆ మహానుభావుని కలువలాయియందింక జూచు భాగ్యము తనకు లేకపోయెనని యామె యేడ్చెను. అతని తుదిఘడియలకా ప్రియపుత్రు డతనిని చేరజాలనట్లే, తొలి శ్రాద్ధమునకామె చేరజాలని దూరమున నుండుటకు వగచెను. ఆమె దురదృష్టమున కిరుగు పొరుగువారలు గూడ కంట తడి పెట్టి యామె దుఃఖమును బంచుకొనిరి.

నాయన కలువలాయి వెళ్లుటకు పూర్వమే యొక గొప్ప యజ్ఞ ముద్దేశింపబడి, 'ఉప్పుందోపాధ్యాయు'డను నాతడు దానిని శ్రద్ధతో నిర్వర్తించుటకును, బృహస్పతివలె నాయన దాని నధిష్ఠించి క్రతుకాండ కంతరార్థములను జెప్పుచు తన సన్నిధిచే నందరి నన్ని విధముల ప్రవర్తింప జేయుటకును నిశ్చయింపబడి, తత్సన్నాహములకు యత్నము లారంభమయ్యెను. గోకర్ణమునకు మూడు నాలుగు మైళ్ల దూరమున సముద్రతీరమున నుత్తర సహ్యాద్రి యెక్కడ అంతమగు చున్నదో, ఆ గిరి జలధి సంధిప్రాంతమందున్న 'సన్నబేలా' గ్రామవాసి యుప్పుందోపాధ్యాయుడు. ఆ గ్రామ పరిసరమందే నాయనచే యాగస్థలము నిర్ణయింపబడెను. మూడు నాలుగు మాసము లింకను వ్యవధియున్నను, అంతకు పూర్వమే నాయన కుటుంబసహితముగా యాగము నిర్ణయింపబడిన స్థలము నధిష్ఠించినచో, సన్నాహపు సలహాల నిచ్చుటకు వీలగునని నాయనకొఱకు చిన్న బంగళా వంటి యిల్లమర్చబడెను. ఈ బంగళాను మూడు ప్రక్కల చెట్టడవి చుట్టి, వెనుక ప్రక్క పెరటిగోడను సముద్రము చుంబించుచు, రమ్యమైన ప్రకృతిశోభను వెదజల్లుచు, నాయన భావప్రకృతికి తగినట్లుండెను.

పండితులు నాయన రాక కెదురుజూచుచున్నను, నాయనకు గలిగిన కష్టమును గుర్తించిరి. 'కుర్సే నారాయణ' యను పండితు డట్లుగాక మాటిమాటికి అప్పశాస్త్రి యొద్దకు వచ్చి 'నాయన యెప్పుడు వచ్చు'నని ప్రశ్నించి విసుగు పుట్టించు వాడు. అమాయకుడైన కుర్సే నారాయణ యప్పశాస్త్రిని గూడ గొప్ప పండితునిగా భావించి యొకనాడు 'మీరెన్ని శాస్త్రములను జదివియుంటి'రని ప్రశ్నించెను. తడుముకొనకుండ అప్పశాస్త్రి 'యెనిమి'దని బదులిడి, 'అరిథమెటిక్- ఆల్జీబ్రా- జియోమెట్రీ - ఫిజిక్సు - కెమిస్ట్రీ - ట్రిగ్నొమెట్రీ - హిస్టరీ - జియోగ్రఫీ'

యని వాటి పేర్ల నేకరవుపెట్టి, వాని నాశ్చర్యమున ముంచెను. పురములోని కొందఱి కిది తెలిసి కడుపులు చెక్కలగునట్లు నవ్విరి. పిదప నాయన రాగా నారాయణు డప్పుశాస్త్రి చేసిన పరిహాసమును జెప్పుకొని నాయనకుగూడ నవ్వు తెప్పించెను.

నాయన తన తండ్రియొక్క తొలి మాసికము ముగిసిన వెంటనే బయలు దేరెను. అమ్మకప్పుడు జ్వరము సోకిన వార్త చెన్నపురము వచ్చినంతనే తెలిసి, మార్గమందు నాయన గురుదర్శనమైన గావించుకొనకుండ చప్పుచప్పున గోకర్ణము చేరి, మంత్రజలమునిచ్చి యామె టైఫాయిడ్ జ్వరము నిట్టే హరింపజేసెను. ఈ కారణము గురున కెఱిగించుచు నాయన చెన్నపురము నుండియే యొక లేఖ మూలమున క్షమాపణ వేడికొనెను.

నాయన గోకర్ణము చేరిన నాలుగైదు దినములకు స్ఫురద్రూపియై, రాజపురుష లక్షణములు గల బ్రాహ్మణ యువకుడొకడు నాయన దర్శనార్థమై వచ్చెను. వానిని చూచినతోడనే నాయన 'నీవు తిరువణ్ణామలైనుండి కాదా వచ్చుచుంటివి ? మహర్షియేకదా నిన్నిక్కడకు బంపె' నని ప్రశ్నింపగా, నతడు నాయన యద్భుతప్రజ్ఞ కాశ్చర్యపోయి 'ఔను, సత్యమే' యని పల్కుచు నాయన పాదములపై పడెను. ఇతని పేరు నారాయణ బ్రహ్మచారి. తిరువాన్కూరు సంస్థానమున 'చిరకల' యెస్టేటు జమీందారు కొడుకు. తిరువాన్కూరు మహారాజు తనకొక భార్యవలన పుట్టిన కుమార్తె నితని యన్న కిచ్చి వివాహము గావించి, యితని కింకొక భార్య వలన బుట్టిన కుమార్తె నీయదలచి యుండగా నితడు పెండ్లి, సంసారము, భోగజీవితము వలదని పల్కి యిల్లు వీడెను. మనస్సు దేశసేవకొఱకుగూడ కొట్లాడి, రాజకీయ రంగమున దూకుటకు పూర్వము శ్రీ రమణ మహర్షిని దర్శించవలెనని తిరువణ్ణామలై వెళ్లి, మహర్షిని రాజకీయ ప్రశ్నలైనను తపశ్శక్తి సాధకములుగా కొన్ని విషయములను గుఱించి యడిగెను. 'నాకు తెలియ'దని యట్టి ప్రశ్నలకిచ్చు సాధారణపు జవాబునీయక మహర్షి వీనిని నాయనకడకు పంపెను. ఇతడు నాయన యుపదేశమును బొంది, దుష్టమగు రాజకీయ రంగమునుండి రక్షింపబడెను. కొన్ని యేండ్లకు పిదప నాయనయే వీనికి సన్న్యాసమిచ్చి, 'అమృతనాథు' డను పేరుపెట్టెను.

★★★

ఓం

## అయిదవ ప్రకరణము

# సన్నబేలా వనదుర్గ, మహాయజ్ఞము

డిసెంబర్ నెల మూడవ వారములో నాయన 'సన్నబేలా' యాశ్రమమున ప్రవేశించుటకు నిశ్చయించియుండగా గోకర్ణపండితులందరు పూజ్యులైన అమ్మనాయనల వెంట వేదఘోషచేయుచు, పీఠాధిపతులవెంట వెడలునట్లాశ్రమ మున దిగబెట్టుటకు వెడలిరి. గోకర్ణము చేరినప్పుడు ప్రాప్తించిన 'దైవరాతు'డను బ్రహ్మచారి శిష్యుడును, వీడునప్పుడు లభించిన 'నారాయణు'డను బ్రహ్మచారి శిష్యుడును నాయన కంగరక్షకులవలె చెరియొక ప్రక్కను నడుచునప్పుడు ప్రకృతి యొక్క శాంతిరాజసములను రెండింటిని వశమొనర్చుకొనిన దివ్యమూర్తివలె నాయన కన్పట్టెను. వీర-భద్రుని యస్త్రసిద్ధిచే పొందబడిన మహిమావిశేషమిది గావచ్చునేమో !

నాయన యవలంబించిన వేదకోశమథనమనెడి నవ్యతపస్సునకు విధి నియమములు, వేళపాళలు లేనందున సమయము దొరికినపుడెల్ల యీ తపస్సు సాగుచునేయుండెను. యజ్ఞసంబంధమైన యేర్పాట్లన్నియు నాయన సలహాపొంది చేయబడుటవలన సమయము మధ్యమధ్యను భంగమగుట వాస్తవమే. అట్లయినను విమర్శ యెక్కడ నిలుపబడునో, అక్కడినుండి మరల ప్రారంభించి యథాగతిని కొనిచ్చుటయే నాయన యందున్న మహత్తరప్రజ్ఞ. ఆ కారణము వలన నాలోచనమం దలసత యెట్లు లేదో, అట్లే నాయన కభ్యంతరములవలన విసుగు, చీకాకు లుండెడివికావు. బుద్ధి త్రుంపబడినప్పుడు పూర్వవిషయములను స్మృతియందు ధరించలేనివారికేగదా యీ విసుగు, చీకాకులు. నాయన యందు చెప్పదగిన యింకొక విశేష మేమనగా, నాంతర్యమును విడువనక్కరలేకయే, బుద్ధి తనయొక్క భాగముచే బాహ్యమును బొందగల్గు ప్రజ్ఞ. ఇది చిన్ననా డభ్యసించిన అష్టావధాన ప్రజ్ఞావిశేషమై, పిదప తపస్సువలన మహిమాన్వితమై యుండవచ్చును.

ఈ విధముగా నాయన తపస్సు సాగుచుండగా శిష్యులు, దత్తపుత్రుడైన అప్పశాస్త్రియు నొకరిని మించున ట్లింకొకరుగా తమ తమ నెలవులందు మంత్ర ధ్యానములను సల్పుకొచ్చిరి. కామాక్షి, వజ్రేశ్వరి, మహాదేవములపై గృహ కార్యభారము విడిచి, యమ్మ యచంచల తపమున మునిగెను. మూడు వారము లీ రీతి నుగ్రధ్యానమును తన ఇచ్ఛకొలది పూనిన ఫలముగా అప్పశాస్త్రికి వేడివలననో, పైత్యించుటచేతనో పచ్చకామెర్ల రోగము సోకి కళ్లు, ఒళ్లు, మలమూత్రములు పచ్చబడి, కొద్దిగా జ్వరముకూడ తగిలెను. రెండు వారము

లించుమించుగా నెట్టి చికిత్సకు లొంగని యీ బాధనతడు సహించుకొనుచు, తపోనిరతులైన యితరుల కెట్టి నిష్ఠాభంగము కలిగించలేదు. పిదప నీరసించి, రాత్రులందమ్మకో, భార్యకో నిద్రాభంగము కలిగించుచు మాటిమాటికి వేదనపడ జొచ్చెను. అప్పుడు కామాక్షి యధైర్యము చెంది నాయనతో చెప్పుకొనగా, నాయన 'తొందరపడవద్దు; దుష్టవేడిమి పోవలెను. ఇటుపైని శాంతించు'నని యభయ మిచ్చెను. ఆనాటి రాత్రియే యొక యద్భుతము సంభవించి, నాయన యొక్క యనుగ్రహశక్తివిభూతిని బ్రకటించినదయ్యెను.

ఎట్లనగా, రాత్రి మూడవజాము గతించువేళయం దప్పుశాస్త్రికి చిన్న కునుకుపట్టి, స్వప్నము వచ్చెను. స్వప్నమందొక దేవత యగపడి తన చీరనుండి యొక పీలికను జింపి, దానితో రోగియొక్క నాలుకను తుడిచి పారవేసెను. పిదప దేవత మాయమై, స్వప్నమునుండి యప్పుశాస్త్రి మెలకువ చెందగా, శరీర మదివఱకువలెగాక చులకనబడినట్లయ్యెను. అందువలన నతడు సహాయముకొఱ కితరులను లేపకుండ నెమ్మదిగా పెరటి తలుపు తెఱచి, యల్పాచమనము గావించుకొని రాబోవుచుండగా, నక్కడ యరుగు చివర నొక ముదుసలి కూర్చుండి యుండుట గాంచి, యెవరో పుల్లలేరుకొనుటకు వచ్చియుండునని తలచి, లోనికి వచ్చి పరుండెను. పరుండినంతనే నిద్రజెంది, మఱల స్వప్నము గాంచెను. ఆ స్వప్నమందీ ముదుసలియే గోచరించి, యమ్మకొక చెట్టుఆకు చూపుచున్నట్లయ్యెను. ఆకు స్పష్టముగా నగపడెను. పిదప స్వప్నము ముగిసి కన్నులు విచ్చుసరికదే యాకు బోలెడంత ఒడిలో పోసికొని, లాంతరొక చేతితో పట్టుకొని యమ్మ గదిలోనికి ప్రవేశించెను.

ఆమెకా యాకు ఆ సమయమందెట్లు లభించెననగా, అప్పుశాస్త్రి యావలకు వెళ్లివచ్చి తలుపు బిగించునప్పుడమ్మకు తెలివి వచ్చెను. ఆమె లేచి, కామాక్షమ్మ గాబోలు పెరటిలోనికి బోయివచ్చెనని తలచి, తానుగూడ పోయివచ్చుటకు లాంతరు చేత ధరించి పెరటిలోని కేగి, ముదుసలి నక్కడ జూచి 'యెవరు నీ'వని యడిగెను. 'తెల్లవారినప్పుడు ప్రక్కనున్న అడవిలో పుల్ల లేరుకొనుటకు రాత్రియే యిక్కడ పరుంటిని. అప్పుడప్పు డిట్లు వచ్చుచుంటిని. కాని, యెవరమ్మా ? పిల్లవాడెవడో బయటికిప్పుడు వచ్చెను. జబ్బువానివలె నున్నాడేమి జ'బ్బని యా ముదుసలి ప్రతిప్రశ్న వేసి, జబ్బు వివరమును తెలిసికొనెను. 'నాతో లాంతరు పట్టుకొని రమ్ము, నీకొక యాకు జూపెదను. దాని రస మావుపెరుగులో కలిపి మూడుదినములు దినమున కొక్కొక్కసారి చొప్పున నిచ్చినచో నెట్టి కామెర్లయిన విట్టే మాయమై, నీరసమును గూడ తొలగించు'నని ముదుసలి చెప్పి, చెంతనున్న తోటలోని కమ్మను తీసికొనివెళ్లి, యాకు జూపెను. ఒడినిండ ఆకు దూసి యమ్మ గృహములోనికి వచ్చినంతనే యప్పుశాస్త్రి తెల్లబోయి, 'అమ్మా! పెరటిలోని ముదుసలి నీకీ యాకు

జూపుచున్నట్లు నాకు స్వప్నము వచ్చెను. ఇది నాకొఱకేనా' యని యడుగు చుండగా వెనుక గదినుండి నాయన చిఱునవ్వు నవ్వుచు వచ్చి 'నీ కొఱకే. ఆ ముదుసలి నెవరనుకొంటిరి ? ఆమె వనదుర్గ' యని వివరించుట కమ్మ యాశ్చర్యపోయి, వెంటనే పెరటిలోనికి వెళ్ళి వెతకెను. ముదుసలి యగపడలేదు. నిజముగా మనిషియైనచో నంత చీకటిలో నడవికెట్లు వెళ్లగలదు ? తెలిసినట్లు పల్కిన నాయన యొక్క మాటయే నిజమని యెల్లరు విశ్వసించిరి. అంతేకాక, వనములందు తపోవృత్తిచే వసియించు ఋషికుటుంబములను వన్యమృగ కీటకాది బాధలనుండి రక్షించుచున్న యీ వనదుర్గ చిరకాల ప్రసిద్ధ యనుటకే ముదుసలి వేషమున వచ్చియుండుననియు, ఆమె యొక్క శాంతికే నాయన యజ్ఞమును ప్రోత్సహించియుండుననియు వారిలో వారు గుసగుసలాడిరి.

వనదుర్గ చెప్పినట్లా పసరుతో అప్పశాస్త్రి కామెర్లు మాయమయ్యెను. మఱి మూడు రోజులకు కామాక్షమ్మ కొక గొప్ప గండము తప్పెను. ఆమె పెరటిబావిలో నీళ్లు తోడుచుండెను. బావికి గిలకయున్నను, గట్టులేదు. గిలక నందుకొనుటకు బావికడ్డముగా నేలపై రెండు కొనలు మోయునట్లొక సన్నని దూలము వేయబడెను. దానిపై నిలబడినవారికి గిలక ప్రేలాడు కఱ్ఱలు గుండెల యెత్తున నుండును. అట్లు దూలముపై నిలిచి యామె తోడుచుండగా, దూలము విరిగి యామె ముందు వైపునకు తూలి, పైనున్న కఱ్ఱలమధ్యన చిక్కుకొని, బావికి నడుమను ప్రేలాడు చుండెను. అది యప్పశాస్త్రి తన గదిలోనుండి చూచుట తటస్థించెను. బావి లోతుగా నున్నను, పెరల్పెంతో లేనందున గట్టుకొనకు వెళ్ళి, యతడామెను బట్టుకొని, యొక్క యూపుతో నామెను కఱ్ఱలమధ్యనుండి పెనగుటయేగాక గట్టుమీద పడవేసెను. అదృష్టముకొలది యామె గాయపడలేదు. కాని, యట్టి స్థితినుండి ప్రమాదము లేకుండ తొలియూపుతో లాగుటకప్పుడే జబ్బునుండి లేచిన యప్పశాస్త్రి కంత బల మెట్లు వచ్చెనని యెల్లరు నాశ్చర్యపోయి, యదియు వనదుర్గ యిచ్చిన యోషధీ మహిమయేయని నిశ్చయించుకొనిరి.

అదే సమయమం దొకనాడు మహాదేవము నొక భయంకర కాలసర్పము కాటువేయగా నాయన వనదుర్గను ప్రార్థించి పుత్రునికొఱకు తన తపస్సును ధారపోసెను. పుత్రునియందు విషమాశ్చర్యకరముగా పోయెను.

ఇట్లా దుర్గ రక్షణవలన ననుభవింపబడు వింతగొల్పు కథలతో వారక్కడ దినములను వెళ్లబుచ్చుచుండగా యజ్ఞ సమయము సమీపించెను. ఫాల్గున బహుళ పక్షములో ప్రారంభింపబడిన మహాయజ్ఞము చైత్ర శుద్ధమున నంతమై (1913, ఏప్రిల్), వేయిమందికి మించిన హవ్యకగణములతోడను, మఱి మూడువేలకు తక్కువగానట్టి యితర బ్రాహ్మణ స్త్రీ పురుషవర్గములతోడను నలంకరింపబడి, ప్రతిదినము గావింపబడిన సంతర్పణలచే బృహద్గతి నన్నశాంతి

సమకూర్చబడెను. యజ్ఞమంటపమం దపర బృహస్పతివలె నున్నతాసనమున నాయన కూర్చుండి, త్రికాలములం దాచరించబడు సవనకర్మలు ముగిసినప్పుడాయా సవనమంత్రములయొక్క గూఢార్థములను బోధించి, యాకాశమందు నిహితమైన యింద్రాగ్నినుండి సువ్యక్తమైన సూర్యసంబంధమగు సౌరజ్యోతియు, భూసంబంధమగు భౌమజ్యోతియు నె ట్లాకాశగర్భమందున్న అగ్నికి రసమును, వస్తువును వాహకులవలె సమర్పించుచుండెనో వివరించి చెప్పుచుండెను. మఱియు సూర్యునధిష్ఠించిన వరుణుడు, భూమినిబొందిన పార్థివాగ్నిరూపుడు ననుక్షణము సల్పు దేవకార్యమే యజ్ఞమై, మానవులాచరించు క్రతువులందు రూపొందిన విధమును విశద మొనర్చుచుండెను. ఆ కారణముచేత బ్రాహ్మణుల కింద్రాగ్ని వరుణులు ముఖ్య దేవతలైన విధము జూపి, యధ్యాత్మ పరముగా మనయందా దేవతాతత్త్వములచే కాదగు యజ్ఞ మెట్లుండవలెనో బోధించుచుండెను.

క్రతువునకు విచ్చేసిన పండితులలో పెక్కుమంది నిగమాగమములను శరణుకొచ్చి బహుక్రతువులను సల్పినవారేయైనను, నాయన ముఖమునుండి తత్త్వార్థములతోడను, నిత్యాచరణీయములగు నాధ్యాత్మికాన్వయములతోడను వెడలు శ్రుతిసారాంశములను క్రొత్త దృక్పథములతో చూచి, ధన్యులైన ట్లెంచువారు.

ఈ క్రతువునందు దినమున కొక్కొక్క రుపన్యసించునట్లు ప్రవచనము లేర్పరుపబడెను. మాతృభాష కన్నడ మైనందున శ్రోతలకు సులభగ్రాహ్యమగుటకు మాతృభాషలో నుపన్యసించుటకే నిర్ణయింపబడినను, మధ్యమధ్యను సంస్కృత ప్రవచనములుగూడ పండితుల ప్రీతికొఱకు కల్పింపబడెను. నాయన తనపేరుపన్యాస ప్రణాళికలో చివరను ముద్రింపగోరెను. ఆ తుదిదినమున నాయన వాక్కులు వినుటకు పెక్కు మంది వచ్చిరి. అదివఱకు కన్నడమున కొంచెము కొంచెము మాత్రము నాయన మాట్లాడుట పండితులెల్ల రెఱిగినదే. ఉపన్యాసమునకు కావలసిన భాషాపరిచయము లేదని, వారు సంస్కృతమున నాయన యుపన్యసింతురని తలచిరి. కాని, పండితులు కానివారికిగూడ తెలియునట్లు వారి మాతృభాషలో నుపన్యసించ వలెనని నాయన సంకల్పించి, తనకు ముందు మాట్లాడిన వక్తల వాక్యములను శ్రద్ధతో విని, తనవంతు వచ్చుసరి కా వక్తలను మించి కన్నడమున ప్రవాహవేగమున నుపన్యసించి, పండితులకు తన ప్రజ్ఞ చూపెను. ఇట్లు ప్రభావమే శరీరముగాగలిగిన నాయన సర్వజనస్తుత్యమానుడై తన ప్రవచనమందు యజ్ఞమున కుపసంహారము బల్కెను.

ఈ మహాయజ్ఞ వార్త విని, యజ్ఞము ప్రారంభింపబడిన కొద్దిరోజులకు వేసంగిసెలవు లీయబడిన కారణమున కల్యాణరాముడు సికింద్రాబాదునుండి యత్తవారింటికి వెళ్ళి, యక్కడ భార్యను, పుత్రుని దిగవిడిచి, తానొక్కడై సన్నబేలా వెళ్ళి, యజ్ఞమును, నాయనయొక్క యాశ్రమవైభవమును గూడ సందర్శించి

సంతుష్టాంతరంగుడయ్యెను. యజ్ఞము ముగిసిన పిమ్మట నాయన వారము దినములు మౌనదీక్షపూని, క్రతువులకు రాణియై జయము నొనగూర్చిన యింద్రాణిని జపించెను, అటుపిమ్మట తన పూర్వసాధనము బూని, మధ్య మధ్య నాశ్రమవాసుల ముచ్చటకొఱకు వేదకథా ప్రసంగములను సల్పుచు, వారియం దార్ష సంప్రదాయదృష్టిని బలపరచుచుండెను. యజ్ఞము లాధ్యాత్మ విద్యాబోధకము లనియు, ప్రదర్శన పూర్వకముగా నట్టి విద్యను బోధించి వ్యాపింపజేయుటకును, క్షామ రిపు రోగాది పీడలను పాఱద్రోలుటకును వీనిని పూర్వులుద్దేశించిరనియు నాయన చెప్పి, తత్తత్ప్రయోజనము లెట్లు యజ్ఞకర్మవలన సాధ్యము కాగలవో విశదపరచు చుండెను. ఈ బోధల నత్యంత శ్రద్ధతో వినువారు దైవరాతుడు, నారాయణుడు మాత్రమే. ఈ యజ్ఞము నాయనయొక్క వాసిష్ఠనామ సార్థకత కుపోద్ఘాతము వంటిదై, వేదకుహర ప్రవేశమునకు మంగళప్రదమగు ద్వారమయ్యెను.

పిదప జూన్ నెలలో బడులు తెరువబడుటవలన కల్యాణరాముడు పోవలసివచ్చెను. అతని వెంట అప్పా దంపతులకు కూడ వెళ్లక తప్పినదికాదు. అమ్మనాయనల కవసరమైనప్పుడు పుత్రునివలెను, కొడలువలెను వచ్చి, భక్తితో సేవించువారు వీరే యైనందున దూరముగా పోయినచో మాటిమాటికి వచ్చుటకు పరిపడదను నెపముచే వీరు సికింద్రాబాదు వెళ్లుటకు నెనుకాడిరి. అప్పుడప్పాశాస్త్రిని చేరబిలిచి నాయన యిట్లు చెప్పెను: ''నీ వెంట వజ్రమ్మతో పాటు మహాదేవమును గూడ తీసికొనివెళ్లి, నీవేదైన వృత్తిలో ప్రవేశించి, వానిని బడిలో ప్రవేశపెట్టుము. అప్పుడు నేనే మీ యొద్దకు వచ్చి, వేలూరువలెనే సికింద్రాబాదును కేంద్రముగా జేసెదను.'' ఈ మాటల కప్పా దంపతులు సంతసించిరి. వారు తమతో వజ్రమ్మనేకాక మహాదేవమును తీసికొనిపోయిరి. ధనికపుత్రుడైన నారాయణబ్రహ్మచారి దేశసంచార వినోదముచే వారి వెంట వెళ్ళి, మార్గమం దెక్కడనో మఱియొక త్రోవబట్టిపోయెను. ఈ సంచారవాంఛయే వానిని జీవితాంతమువఱకు బాధించి, తపస్సున నస్థిరుని జేసెను. వీరందరు వెళ్ళిన పిదప సన్నబేలాయం దమ్మనాయన లొకటిన్నర మాసములుండి, యప్పాశాస్త్రి తన మాట చెల్లించెనని వినిన పిమ్మట క్రొత్త కేంద్రమును స్థాపించుటకు వారు 1913వ సం॥ అగస్టు నెలలో బొంబాయి మీదుగా సికింద్రాబాదు చేరిరి.

౬౦

## అఱువ ప్రకరణము

# సికింద్రాబాదావాసము

అమ్మనాయనలు గోకర్ణము వీడునప్పుడు వారిని బొంబాయి నగరము వఱకు సాగనంపి వచ్చుటకు దైవరాతుడు, మఱికొందఱు విద్యార్థులు వెంట వెళ్ళిరి. ఈ విద్యార్థులలో 'కుమఠా' పాఠశాలలో నాంగ్లవిద్య నభ్యసించువారు కొందరున్నారు. మఱికొందఱు 'శాంతేరి' యను కామాక్షీక్షేత్రము నుండి గోకర్ణము వచ్చి ప్రాచీన విద్యల నభ్యసించువారున్నారు. మొదటివారు తమ పాఠశాలలో నాయన యుపన్యసించవలెనని పట్టుపట్టి, నాయన యొప్పుదల గైకొని, ముందుగనే యేర్పాటుగావించిరి. ఆ కారణము చొప్పున బొంబాయి వెళ్లు మార్గములో నాయన 'కుమఠా' పాఠశాలయం దుపన్యసించుట కొకపూట దిగెను. పిదప మిగిలినవారి నింకొకపూట తమ నివాసక్షేత్రములో దింపి, యమ్మనాయనలకు తృప్తిదీర కామాక్షీ దర్శనము గావించి, యొక యుపన్యాస మా మందిరమందే కల్పించిరి.

కుమఠాలోని యాంగ్లపాఠశాల బహు ప్రఖ్యాతమైనది. ఉపన్యాసము వినుటకు వచ్చినవారు వందలకొలది యుండిరి. గంభీరమైన నాయన యుపన్యాసము భారతీయుల విధులను గుఱించి యొసగబడెను. తొలుత విద్యార్థి దశయం దవలంబించవలసిన బ్రహ్మచర్యమున కర్థము బ్రహ్మవిద్య నెఱిగి, దానియందు చరియించుటయని పేర్కొనబడెను. ఇతర విద్యలను పాఠశాలయం దభ్యసించినను, నుపనయనమైనవారు 'గాయత్రి' యనబడు విద్యను నియమ నిష్ఠలతో నభ్యసించుటవలన వారి బుద్ధి నిశ్చయముగా వృద్ధియగునని నాయన హెచ్చరించెను. పెద్దలుకూడ దీని నన్ని యాశ్రమావస్థలయందును సేవించి, బుద్ధివల్లనే తాము మానవులైనట్లు రుజువు చేసికొనుట మానవ విధియని యుద్బోధించెను. మఱియు శీలము గాపాడుకొని, వీర్యమును రక్షించుకొనువారికి సాత్వికాహార మవసరమనియు, దానివలనగాని మానవునియందు మృగ లక్షణము తొలగదనియు వచించి, సాత్వికాహారసంపన్నులకు నాడులు పరిశుద్ధములై, యందున్న ప్రాణమునకు తేజస్సు నిచ్చునవియు, నట్టివారు మంత్ర చింతనచే దివ్యశక్తి సంపన్నులగుట తథ్యమనియు పల్కెను. దివ్యశక్తివలన శరీరమం దాత్మచైతన్యము రక్షింపబడినట్లే, దేశమం దార్యమత చైతన్య మన్యమతములచే విచ్ఛేదము గాకుండ రక్షింపబడగలదని నిర్భయముగా నాయన చెప్పెను. అటుపిమ్మట నేర్పదగిన రమణోపదేశమును నాయన వివరించి ముగించెను.

ఈ యుపన్యాసమునకు పిన్నలు, పెద్దలుకూడ ధన్యవాదము లర్పించిరి. బాలురయందు బ్రహ్మచైతన్య ముదయించి, వారియందు నియమనిష్ఠలతోపాటు సౌశీల్యాది సంపత్తులకు దృష్టి మఱలెను. ఈ విద్యార్థి బాలురలో 'శిరసి' నుండి వచ్చి చదువుచున్న యిద్దరు మున్ముందు నాయన శిరసి వెళ్ళినప్పుడు ముఖ్యపాత్ర వహింతురు కనుక పాఠకులీ యుపన్యాసఫలము నాయన కెట్లు సకరించెనో జ్ఞప్తియం దుంచుకొనవలెను. వారి పేర్లు 'దేవేంద్ర సుబ్రహ్మణ్య విశ్వామిత్ర, సుందరపండితులు.'

బొంబాయిలో గురుదంపతుల నింకొక రైలెక్కించిన పిదప దైవరాతుడు దీనవ దనుడై వెనుకకు మఱలెను. పిమ్మట నాయన నదివఱకు చూచిన దాక్షిణాత్యులు కొందఱు సికింద్రాబాదులో పెద్ద యుద్యోగములయందున్న కారణమున నచిర కాలములో నక్కడ నాయన పేరున్నత తరగతులలో వ్యాపించెను. మహర్షి యుపదేశ ప్రచార మధికముగా సభలందు జేయుటకుగూడ వారివలన నాయన కవకాశము కల్గెను. ఈ యుపన్యాసములకు తక్కువ జీతముల వారుగూడ నాకర్షింపబడిరి. మొత్తముమీద సికింద్రాబాదు, హైద్రాబాదులలోని యాంధ్ర, తమిళ, కర్నాటక, మహారాష్ట్రులలో బహుసంఖ్యాకులు నాయనకడ మంత్రదీక్షలను బొంది, యమ్మనాయనల నిరువురను సిద్ధదంపతులుగా చూడజొచ్చిరి. పూర్వపరిచితుల యొత్తిడివలన నాయన చిరకాలమునుండి మానుకొనినను రెండష్టావధానములను చేసి చూపెను. ఇవి నాయన పాండిత్య వైభవమును మఱింత చాటెను.

ఆ సమయములో తిరుపతి వేంకటకవులొక శతావధానమును సికింద్రాబాదులో చేసిరి. వారి యవధాన ప్రజ్ఞను జూచుటకు నాయన వెళ్లెను. కాని, గర్వాతిశయమున సభలోని పెద్దల పరిచయమైన గావించుకొనకుండ వారు వేదిక నెక్కి, యవధాన ధోరణిలో గర్వము మఱింత యతిశయించునట్లీ దిగువ దుందుడుకు పద్యమును దుడుకుతనముతోడనే చదివిరి:

అకు పద్యము:

ఉ॥ ''దోసమటం చెఱింగియును
దుందుడుకొప్పగ బెంచినారమీ
మీసలు రెండుబాసలకు
మేమె కవీంద్రులమంచు దెల్పగా
రోసము గల్గినన్ గవివరుల్మము
గెల్వుడు; గెల్తురేని యా
మీసలుదీసి మీపద సమీపములన్
దలలుంచి మ్రొక్కమే.''

(దీనినెప్పుడు కూర్చిరో తెలియదుగాని పెక్కుచోట్ల మాత్రము చదువు చుండెడివారు). నాయన బాధపడకున్నను, సభ్యులీ పద్యముచే నాయన పరిహసింపబడి నట్లెంచి, వెంటనే లేచి యా కవులను విమర్శించగా, వారు కావ్యకంఠుని పేరు వినినంతమాత్రమున తమ దోసము నెఱిగి, సిగ్గుచెంది, పశ్చాత్తాపపూర్వకముగా నాయనను క్షమాపణను వేడుకొనిరి. ''మీయందు మీకు గల ఆత్మవిశ్వాసమునకు, ధైర్యమునకు మెచ్చితి''నని నాయన వారి నుత్సాహపరచెను.

సికింద్రాబాదులో నాయన మంత్రశక్తి వైభవము రెండు దృష్టాంతముల వలన విదితమయ్యెను. యం.సి సుబ్రహ్మణ్య అయ్యరను పూర్వశిష్యుడు తన కుమార్తె లిద్దఱకు మశూచికము దట్టముగా సోకియుండగా, నాయనతో రహస్యముగా చెప్పుకొనెను. నాయన మంత్రజలమునిచ్చి వెంటనే శాంతింపజేసెను. ఇట్లే కమర్షియల్ బ్యాంకులో పని చేయుచున్న రంగస్వామి అయ్యంగారు కుమారుడు టైఫాయిడ్ జ్వరముచే చనిపోవుననుకొను పరిస్థితిలో నుండగా, నాయన మంత్రజలము నిచ్చి, మృత్యు ముఖమునుండి వానిని రక్షించెను. ఇట్టి కార్యములను చేయుటకు నాయన కిష్టము లేకున్నను, నొక్కొక్కప్పుడు చేయక తప్పెడిదికాదు. కాని, వెల్లడియైనచో నదియే పనిగా జనులు వచ్చి, తన సిద్ధులను భ్రష్టము గావింతురను భీతిచే రహస్యమును దాచగలరనువారికే సహాయ మెప్పుడైన చేసెను. ఆ రాష్ట్రములో సిద్ధులు జూపి, ప్రజల నాకర్షించు ముసల్మాన్ బాబాలు హెచ్చు. వా రచిర కాలములో శక్తులను గోల్పోయినను, తొలుత .సంపాదించిన కీర్తి నాశ్రయించుకొని బ్రతికెడివారు. వీరివలన ప్రజలలో 'సిద్ధులున్నవారు తన సిద్ధుల నడిగినవారికి దానముచేసి పరోపకారమునకు వినియోగించుటయే పరమధర్మ'మను నజ్ఞాన భావము వ్యాపించెను. వారి ధర్మపన్నములకు లొంగి నాయన యెన్నడూ మోసపోలేదు.

ఈ విధముగా ప్రచారకవృత్తి నాదియందు పూని శ్రీ రమణోపదేశమును వ్యాప్తమొనర్చిన పిదప నొక ప్రత్యేక స్థలమును నిర్మించుకొని నాయన తన తపస్సు సాగింపనెంచెను. పెక్కుమంది పెక్కు రమ్యములైన యుద్యానవనములను పుర మందు జూపిరి. నగరమధ్యమందుండుట కిష్టపడక 'కొవ్వూరు' యను గోదావరీ తీర గ్రామము నుండి 'గంటి సుబ్బన్న' యను నైష్ఠిక బ్రహ్మచారి యంపిన ఆహ్వానమును నాయన యంగీకరించెను. సుబ్బన్నగారు 'రాజా' బిరుదమును వహించిన హనుమంతశెట్టికి మంత్రదీక్షాగురువు. శెట్టి బట్టలమిల్లు స్థాపించి ధనికుడై యీ బిరుదము నక్కడి యాచారముకొలది చేర్చుకొనెనుగాని రాజ్య ముండుటవలన గాదు. శెట్టియు సుబ్బన్న గారితో వచ్చి నాయన నాహ్వానించెను. అప్పుడు తండ్రి నరసింహశాస్త్రి యొక్క సాంవత్సరికములు సమీపించినందున, వాటిని నిర్వర్తించుకొనిన పిదప కొవ్వూరు వెళ్లుటకు నాయన మాట యిచ్చి, శెట్టిని సాగనంపెను.

సికింద్రాబాదునుండి కర్నూలికి రెండు రూపాయల టిక్కెట్టు. ఇది దేవతాక్షేత్రముగాకున్నను, చల్లని వాతావరణము గలిగి, గొప్పగొప్పవారికి వేసంగిలో విశ్రాంతి కేంద్రమై యున్నది. అందువలన వేసంగికి దీనిని వినియోగించుకొనవలెనని నాయన సంకల్పించెను.

పిదప నరసింహశాస్త్రిగారి సాంవత్సరికములను నిర్వర్తించుకొనివచ్చుట కమ్మనాయనలు నవంబర్ నెలలో కలువరాయి వెళ్ళి, యవి ముగిసిన తరువాత డిసెంబర్ మూడవ వారములో గురుదర్శనము గావించుకొనుటకు చెన్నపురము మీదుగా తిరువణ్ణామలై వెళ్ళిరి. చెన్నపురమునుండి సుధన్వకపాలులుగూడ నాయనతో గూడి వెళ్ళిరి. మహర్షి దర్శనము గావించుకొనుట సుధన్వున కిదియే తొలిసారి. ఇన్నాళ్లనుండి యతడిది యశ్రద్ధజేసినందులకు నాయన చాల విచారించెను. ఎందువల్లననగా, గురుభక్తికి బలవంత మొనర్చుట నాయన యభిమతముకాదు. అది యెవరికి వారు గ్రహించుకొనవలెను. నాయనయందు సుధన్వునకు నిర్మల భక్తి యున్నప్పటది మహర్షి విషయములో నేల సందిగ్ధములచే కల్మషముగావలెనని యమ్మయు కించపడి, సుధన్వునకు బుద్ధిగరపునట్లొకమాట విసరెను. ఎట్లనగా, సుధన్వుడు తన యింటి కమ్మనాయనలు చాలకాలమునుండి వచ్చుట మానిరని యుడుకుబోతుతనము జూపబోయి యతడు నిందాస్పదముగా నిట్లు బల్కెను: "మీరు సికింద్రాబా దప్పశాస్త్రి యింటి కాహ్వానించినను, మానినను వెళ్లవచ్చునుగాని, నాయింటికొక శుభకార్యమున కాహ్వానింపబడినను రాలేదేల ? నేను మీ కప్పశాస్త్రివంటివాడను కానా ?" వెంటనే యామె "నీవు అప్పవెట్లగుదువు ? అయితివా ? కాజాలవు. ఇప్పటైన రమణ దర్శనము జేసికొమ్ము, పద"మని శూలమువలె గ్రుచ్చునట్లు మాటలనెను. సుధన్వుడు భయపడి యూరకుండెను. రమణదర్శనమైన వెంటనే సుధన్వకపాలులు మరలిరి. కాని, యమ్మనాయనలొక పక్ష మించుమించుగా శ్రీ రమణ పాదములను సేవించుకొనిన పిమ్మట సికింద్రాబాదు 1914వ సం॥ జనవరిలో చేరిరి.

ఈ సమయమందే నాయన బదబాండేశ్వరములోని తన తపానుభవమును గురించి, యక్కడ పీఠాధిపతుల కోర్కెపై చెప్పబడిన తన ఘంటాశతకము గురించి రమణునకు తెలియజేయగా, వినుటకు రమణుడెంతో ముచ్చటపడి ఘంటాశతక శ్లోకములను వ్రాసియుంచుకొనెను. గోకర్ణ, సన్నబేలాలలోని యనుభవములనుగూడ నాయన విన్నవించుకొని గురునకు సంతోషము గలిగించెను. నాయనకు తన ప్రతాపమంతయు గురునదేయను భక్తి యెట్లో నాయనయే తనకు ప్రతాపమను ననురాగము రమణునకు నట్లే కలదు. ఈ యవినాభావతత్త్వము వారికే తెలియును. దూరమువలన వారి మధ్య నది భంగమగుచున్నట్లు బాహ్యదృష్టిగల కొందరు

భావింతురు. కాని, యథార్థమేమనగా, దూరమువలన నది విస్తరించినదగుచున్నది. భక్తులపై రమణుని కృపయు నట్లే నిజభక్తులను దూరము చేయుచు విస్తరించు చుండును. అదే ఆశ్చర్యము!

గురుని సమక్షమం దుత్సాహముతో నాయన గడపిన ఆ స్వల్పకాలములో 'అరుణాచలశాస్త్రి' యను పేరుగల నొక పండితునితో నాయనకు శాస్త్రవాదము సంభవించెను. ఇతడు కొంతకాలము శంకర పీఠముకడ మసలిన పండితుడు. పీఠాధిపతి ప్రేరణవల్లనో లేక తనకు స్వయముగా తోచుటవల్లనో రమణునితో వాదించుట కితడు వచ్చెను. కాని, రమణుడు వాదమునకు దిగడు కావున నాయనతో డీకొని, ఈ పండితుడు పరాభవముబొందెను. వాదింపబడిన విషయము లారు. వానిలో శంకరపీఠ పండితుడు ప్రతిపాదించిన విట్లున్నవి: 1. బంధమునుండి తొలగుటకు సత్యాసత్య విమర్శ యొక్కటియే మార్గము. దానికి వేఱుగు సాధనము లేదు. 2. ఉపాసనమేదియు నపేక్షింపబడకయే విద్వాంసుడైనవాడు కేవల శాస్త్రచర్చవలన ముక్తిబొందగలడు. 3. ఆత్మయందు సహజస్థితిని బొందిన పూర్ణజ్ఞాని తనను తాను జ్ఞానిగా నిశ్చయించుకొనజాలడు. 4. అందువలన జ్ఞానలక్షణము తనను గురించి తాను యోచింపనిదగును. 5. యోగము జ్ఞానమునకు సాధనముగునుకాని కోరిక సిద్ధించుటకొఱ కుపకరించదు. 6. ఒకవేళ కోరికకొఱకు యోగమభ్యసింపబడినను, మధ్యకాలములో జ్ఞానము సిద్ధించినచో తొలి కోర్కె ఫలించదు.

వేదాంతపండితు లద్వైత సిద్ధాంతము నిట్లు దుర్గతి పాలుజేసిరని నాయన పరితాపముచెంది, యరుణాచలశాస్త్రి యొక్క ప్రతిపాదనల ననుభవశూన్యములుగా ఖండించి, వాటికి ప్రత్యుపపాదనల నిట్లు ప్రతిష్ఠించెను: ''శాస్త్రచర్చగాని, సత్యాసత్య విమర్శ యొక్కటిగాని ముక్తినీయజాలదు; బంధవిముక్తి కుపాసనము ముఖ్య సాధనము. తనను తాను నిశ్చయించుకొనుటయేగొప్ప యుపాసనమై సహజస్థితిని బొందించును గావున నట్టి స్థితి తన యుపాసనాఫలముగా బొందినవాడు తప్పక తనను దాను నిశ్చయించుకొనుటయేగాక, అట్టి నిశ్చయమే నిజమగు జ్ఞానమని తెలియుచున్నారు. అట్టి సర్వోత్కృష్ట ఫలమగు జ్ఞానమునకు యోగము సాధనము కాగల్గినప్పుడు, కోర్కెలకును నది సాధనమగును. అయినా, కోర్కెకొఱకు యోగ మారంభించి, మధ్యమందు జ్ఞానసిద్ధిని బొందినచో, మొదటి కోర్కెయు సిద్ధించును. కాని, దానియం దతని కపేక్ష యుండదు.''

29-12-1913వ తేదీ నా డీ వాదము జరిగెను.

ఈ వాదము మహర్షి సమక్షమందే యైనందున, మహర్షి తీర్పునిచ్చుచు 'నాయన చెప్పినవన్నియు సరిగానున్న'వనెను. ఈ వాదములో మధ్యయం దుపాసనము వినా జ్ఞానము దుర్లభమను విషయము నాయన ప్రవేశపెట్టి, తన

బోధలు, తనచే నుత్తమ లక్ష్యమున కవలంబింపబడిన సాధనములు రమణోపదేశ విరుద్ధములుగావని స్థిరపరచుకొనెను. పైగా, ఉపాసనా ప్రాముఖ్యమును నిరూపించి, రమణోపదేశమును కేవలము వర్ణించి, జ్ఞానులవలె తిరుగాడువారికి పాఠముగరపి, యట్టివారిచే శ్రీ రమణోపదేశముకూడ శంకరాచార్యుని యద్వైత సిద్ధాంతము బొందిన గతినే పొందకుండ నాయన రక్షించెను.

పిమ్మట సికింద్రాబాదు చేరి, యక్కడనుండి నాయన 'కర్కోలీ' వెళ్లి, రాజా హనుమంత శెట్టి సమకూర్చిన సదుపాయములవల్లను, సుబ్బన్న బ్రహ్మచారియొక్క పరిచర్యల వల్లను శెట్టియొక్క బంగళాయందే నాలుగు మాసములు సుఖముగా తపస్సున వెళ్లబుచ్చెను. ఇంతలో నుత్తరదేశయాత్రలు గావించవలెనని యమ్మకు గాఢముగా కోర్కెపుట్టి, నాయనకామె కబురుపెట్టెను. అప్పుడు కళ్యాణరామున కింకొక కొడుకు పుట్టెను. ఏప్రిల్‌లో వాడు పుట్టినను, నామకరణము నాయనచే చేయింపబడుటకుగాను నిలుపు చేసిరి. మే నెలలో నాయన వచ్చి, వానికి 'కేసరి' యను పేరుంచి, పిదప జూన్ నెలలో భార్యతో గూడి యాత్రలకేగెను.

ఓం

ఏడవ ప్రకరణము

# అమ్మ కుత్తరదేశ యాత్రలు

నాయన తనకు ప్రియమైన భువనేశ్వర క్షేత్రమున కమ్మను తొలుదొల్త తీసికొనివెళ్లెను. అపూర్వకటాక్షమును నాయనపై బరపిన భువనేశ్వరి యనుగ్రహముకొఱ కమ్మయు కొన్నాళ్లిక్కడ ధ్యానించదలచి, యాత్రల వాంఛ నప్పటి కణగద్రొక్కుకొని, వెంటనే దీక్షాబద్ధురాలయ్యెను. ఈ యాత్రలకాలములో నాయనయు వేదవిమర్శ నాపుచేసికొనినందున 'నహం' మూలాన్వేషణ సాధనచే నమ్మతో సహ తపోదీక్ష పూనెను. అమ్మకు శ్రీవిద్యామంత్రము ప్రీతికరము. అట్లయినను, ముఖ్యబీజాక్షరములందు దానితో భువనేశ్వరిమంత్రము తుల్యముగా నున్నందున అమ్మ భువనేశ్వరి ప్రీతికొఱ కామెయొక్క మంత్రధ్యానముచే దీక్ష పూనెను. నాలుగు మాసము లాహార నియమముతో పగళ్లు జపించుచు, జపాంతమందు పూర్వము నాయన పారాయణ మొనర్చినట్లు లలితా సహస్రము నన్నిసార్లు గాకున్నను తన సామర్థ్యము కొలది కొన్నిసార్లు పారాయణ సల్పెను. ఆమెకు అంబదర్శనము కాలేదు. ఇంతలో అశ్వయుజ శుద్ధాష్టమినాడు జరుపవలసిన అత్తగారి యాబ్దికము సమీపించెను. ఆ యూర నాంధ్ర ద్రవిడ బ్రాహ్మణులు లేనందున సమీపమున నున్న మందసాకీ కార్యముకొఱకు వారు పోవలసివచ్చెను. దీక్షను చాలించుకొని మందసా వెళ్లునప్పు డామె దీనవదనయై 'మీవలె దీక్షసల్పినను దేవత నాకు తన ప్రసాదము ననుగ్రహించలేదు. నా దురదృష్ట'మనెను. వెంటనే నాయన "యేమట్లంటివి ? దేవత నీ కగుపడునట్లు ప్రసాదము నీయలేదనియా ? ఉత్తరదేశ యాత్రలకు పూర్వమిచ్చటకు వచ్చుట, ఇచ్చట నుండి మందసా వెళ్లవలసివచ్చుట చూడగా నా బుద్ధి కామె యనుగ్రహము నీ యందును ప్రసరించినట్లు తట్టుచున్నది. నాకు వాక్కునం దామె మహత్తు నుంచినట్లే నీకు హస్తమందుంచినట్లు స్ఫురించుచున్నది. మనము వెళ్లుచున్న కార్యమే దానిని సూచించును. అది దేవతాప్రీతి సంబంధమే కదా" యని పల్కి యామెను హెచ్చరించెను. నిజమున కానాటి నుండి యామె హస్తమందు వింతగొల్పు పాకమహిమ విశదమై, యొకసారి చవిచూచిన వారింకొకసారి ఎదురుచూచు మాధుర్యమామె వంటలో వ్యక్తమయ్యెను. దానికితోడామె హస్తమున నక్షయత్వ ముంచబడినట్లెంతమంది భుజింపవచ్చిన నంతమందికిని వండిపెట్టుట కామ హస్తమునకు వస్తువులిట్టే సమకూడుచుండెడివి.

ఇట్టి యదృశ్యమగు సిద్ధి బొందినట్లామె మందసాలో శ్రాద్ధపువంట వండిన వాడు గ్రహించెను. ఆ నాడు బ్రాహ్మణులు సంప్రీతులగుటయేగాక సాయంత్రము

పితృకార్యప్రసాద మందుకొనినప్పుడు రాజులా పిండివంటల రుచిని పదేపదే చెప్పుకొనిరి. కూర కానిండు, పచ్చడి కానిండు సాధారణముగా వండినను నసాధారణ పాకమాధుర్యముతో నది చవులు పుట్టెడిది.

చిరకాలమునకు గురుదంపతులు విచ్చేసిన భాగ్యమునకు మందసా రాజ కుటుంబము సంతసించి, వారి పావన చరిత్రానుభవములను వినుచు, వారినొక సంవత్సర మించుమించుగా మందసాలో నుంచివేసిరి. పూర్వము నాయనకు శిష్యుడైన యువరాజప్పుడు రాజై, స్వతంత్రుడై యుండెను. అప్పుడు 'యూరోపు' దేశములో గొప్ప యుద్ధము చెలరేగి, ప్రపంచ సంగ్రామముగా పరిగణింపబడెను. జర్మనీ యొక్కటి యొక పక్షముండెను. రెండవ పక్షమున మహాసామ్రాజ్యములను గలిగిన బ్రిటన్, ఫ్రాన్సులు తన వలసదేశములు పంపిన సేనల సహాయమునుగూడ బొందియు నిలువజాలక తల్లడిల్లుట జూచి ప్రపంచమంతయు దిగ్భ్రాంతిలో మునిగెను.

సామ్రాజ్యవాదులు దుర్బలము జెందుట కీర్తి నంకురార్పణమైనందులకు నాయన యెంతయో సంతసించి, నూత్నకాల బీజములను నాటుట కవతరించిన కార్తికేయశక్తి మదాంధుల నాశనమునకు కలహబీజములనుగూడ కల్పించినదయ్యెనని మనస్సున నుత్సాహపడజొచ్చెను. సమయము ననుసరించి యీశ్వర కార్యమగునని శ్రీ రమణభగవానుని వాణి యొకప్పుడు పల్కెనుగదా ! ఈ యుద్ధము బీజమై మున్ముందనేక యుద్ధములకు కారణమగుననియు, తరువాత రావలసిన యుద్ధములకు గూడ సమయములు సమీపముననే యున్నవనియు నాయన గ్రహించెను. ఆ కారణముచేత నందరివలె నప్పటి సంగ్రామ జయాపజయము లందు నాయన కుతూహలపడక, బలిష్ఠములై యింకను మిగిలియున్న రాజ్యములం దెట్టి యావేశములు దాని ఫలముగా పరిణమించునో తెలియ వేడుకతో వార్తాపత్రికలను జదువుట యొక విధిగా కల్పించుకొనెను.

మందసాయం దిట్టి యోచనలతో నాయన కొక సంవత్సరమిట్టే గడిచెను. యుద్ధవ్యూహపు టాలోచనలందిట్లు మాటిమాటికి నాయన మునిగి తన తపస్సును, భార్య యొక్క యాత్రలనుగూడ విస్మరించియుండగా, రెండింటిని జ్ఞప్తిచేయుటకు భగవంతునిచే పంపబడిన దూతవలె రామనాథ బ్రహ్మచారి యనబడు రమణ భక్తుడొకడు డిసెంబర్ మొదటి వారములో మందసా వచ్చి చేరెను. ఇతడు రామనాథపుర కాపురస్థుడు. బ్రహ్మచారి యైనందున నట్లు పిలువబడినను, ఇతని పేరు యజ్ఞరామదీక్షితుడు. ఇతడు జగదీశశాస్త్రి యను పండితునకు సోదరుడై, యన్నగారివలెనే రమణభక్తుడై తిరువణ్ణామలైయందావాస మేర్పరచుకొనెను. 1915 సం॥ లో శ్రీ రమణుడు విరూపాక్ష గుహ విడిచి స్కందగుహ నధిష్ఠించి, యా సంవత్సర మాషాఢ పూర్ణిమనుండి కార్తిక పూర్ణిమవఱకు చాతుర్మాస్య దీక్ష

## నాయన - బంధుమిత్రులు



కూర్చున్నవారు : కళ్యాణరామశాస్త్రి, నాయన, అమ్మ, అప్పుశాస్త్రి
నిల్చున్నవారు : వజ్రేశ్వరి (కుమార్తె), కళ్యాణరామశాస్త్రి భార్య,
మహాదేవశాస్త్రి (కొడుకు) జి.జె. సోమయాజి, అప్పుశాస్త్రి భార్య కామాక్షి



శ్రీ గణపతిముని భార్య విశాలాక్షమ్మ

పూనియుండగా, మహర్షితోపాటు రామనాథ బ్రహ్మచారియు చాతుర్మాస్యము సల్పెను. దీక్ష యంతమైన పిదప కాశీ, ప్రయాగ యాత్రలు గావించుకొని, యాత్రలనుండి మరలి, మార్గమందు నాయనను దర్శించుకొనుట కితడు మందసాలో దిగెను.

రామనాథ బ్రహ్మచారి యొక శుభవార్త నిట్లు చెప్పెను: "మహర్షి చాతుర్మాస్య దీక్షయందుండగా, మా యన్న జగదీశశాస్త్రి యొకనాడు మహర్షి సమక్షమున గూర్చుండి యుండెను. అప్పుడతని కొక చక్కని వాక్యము స్ఫురించి, దానితో ప్రారంభించుచు నొక శ్లోకమల్లుటకు యత్నించి కాగితమును, పెన్సిలును చేపట్టెను. స్ఫురించిన వాక్యమును 'హృదయకుహరమధ్యే' యని కాగితముపై వ్రాసి, యెంత యత్నించినను హృదయతత్త్వమునకు చెందునట్లేమి వ్రాయుటయో స్ఫురించక దిక్కులు చూచుచుండగా మహర్షి జాలిచెంది, వానినడిగి యా కాగితము తీసికొని, శ్లోకము నిట్లే పూరించి యిచ్చెను. ఆ శ్లోకమిట్లుండెను:

శ్లో॥ "హృదయ కుహరమధ్యే కేవలం బ్రహ్మమాత్రం।
హ్యహ మహమితి సాక్షాదాత్మరూపేణ భాతి।
హృది విశ మనసా స్వమ్ చిన్వతా మజ్జతా వా।
పవన చలన రోధా దాత్మనిష్ఠో భవత్వమ్॥"

(అర్థము: హృదయమనెడి గుహయొక్క మధ్యమమున కేవలము బ్రహ్మమే 'నేను, నే'నని ప్రత్యక్షముగా నాత్మరూపముగా ప్రకాశించుచున్నది. ఆత్మను గురించి వెతకుచున్న లేదా మునుగుచున్న మనస్సుచే - 'అహం' స్ఫూర్తి మూలమెక్కడ అని హృదయమున బ్రవేశింపుము. లేదా ప్రాణవృత్తి నిరోధమువలన నీవాత్మయందు అనగా 'అహం' వృత్తిమూలమున వృత్తిని స్ఫురింపజేయు దానియందు - నిలకడ బొందుము).

ఈ శ్లోకమును విని, దీని చక్కదనమునకు, దీనియందు ఆత్మయొక్క స్థానము, లక్షణము, దాని నెఱుంగుటకుండు త్రివిధోపాయములను జెప్పి యావద్వేదాంత మతి సులభముగను సంగ్రహముగను చెప్పబడిన నేర్పునకు, జీవునియం 'దహం' భాసమానమనెడి యీశ్వరలక్షణము జూపి తద్ద్వారమున జీవేశ్వరుల యభేదమును ప్రతిపాదించిన ప్రజ్ఞకు నాయన విస్మయపడెను. మహాకవియైన నాయన కబ్బురము కలుగజేసిన మహత్తర సంస్కృత కవిత్వ మింతకాలము శ్రీ రమణునియం దెక్కడ దాగియుండెనో! అతడీ జన్మకు పూర్వ మెత్తబడిన రెండు జన్మలలో నొకదానియందు మూడేండ్ల వయస్సునకే సిద్ధకవియై ప్రకాశించిన జ్ఞానసంబంధమూర్తియైనట్లు, నింకొక దానియందు విచిత్ర యుక్తులచే రూపొందించిన తంత్రవార్తికమునకు కర్తయగు భట్టపాదుడైనట్లు నాయన యిదివరకే

తన దివ్యదృష్టిచే జూచి, యా కవిత్వవాసనను ప్రేరేపించుటకు శ్రీ రమణ సన్నిధిని 'ఉమాస్తుతి' మొదలగు రచనముల జేసెను. వెనుకటి సంవత్సరమందే యా సంస్కారము రమణునియందు కదలి కాబోలు నాయన ఘంటాశతక శ్లోకముల కాహ్లాదము జూపెను. ఇప్పుడట్టి యాహ్లాదమును నాయన యందు ద్విగుణీ కృతముగా కల్పించిన రమణీయరూపములో నది వెలువడి, ముక్తకంఠుడైన రమణుని ముఖమునుండి వెలువడిన యుపదేశవాణి కిది స్తుత్యమానమగు సారస్వతరూపమయ్యెను. ఇట్లాలోచించుకొని నాయన యానందభరితుడై తన సంతోషమును ప్రత్యక్షముగా రమణునకు జూపు నవకాశము లేక, లేఖమూలమున దెలుపుకొని యా లేఖను రామనాథ బ్రహ్మచారిద్వారా పంపుకొనెను. ఆ లేఖలో తనకీ శ్లోకము నొక యుపనిషత్తుగా గైకొని, దానికెంతో విపులభాష్యమును రచించవలెనని వాంఛ యున్నట్లు నాయన పేర్కొనెను. కాని, దాని కరుణాచలమందే సమయము కల్పించుకొనుట యుక్తమని పిదప నిశ్చయించుకొని, నాయన రామనాథ బ్రహ్మచారిని సాగనంపిన తోడనే విశాలాక్షమ్మ యాత్ర వాంఛ దీర్చుట కభిముఖుడయ్యెను. అప్పుడు 'అథ' మను నామాంతరముగల కలువూరు వేంకటరామశాస్త్రి యను పూర్వ శిష్యుడు నాయనను, అమ్మను దర్శించుటకు వచ్చి, వారివెంట యాత్రలకు వెళ్లెను.

ఈ ప్రయాణమునకు రాజు పుష్కలముగా ధనమునిచ్చి, వైభవోపేతముగా వారిని సాగనంపెను. వారు వెళ్లునప్పుడు రాణులుకూడ విశాలాక్షమ్మ వెంట స్టేషనువఱకు వెళ్లి "మీ మందసావాస మీ యాత్రవలన నంతము చేయరాదని మా ప్రార్థనగా మీరు నాయనతో చెప్పి యొప్పించవలె"నని వేడిరి.

విశాలాక్షమ్మ కోర్కెదీర రెండుమాసము లుత్తర దేశయాత్రలు గావింప బడెను. కాశి, గయ, ప్రయాగ, అయోధ్య మొదలగు క్షేత్రములు తృప్తిదీర సందర్శించుకొని వారు బృందావన మథుర వచ్చియుండగా, నక్కడ పండిత సభలు జరుగునని తెలిసెను. వాటిలో చిక్కుకొని యాత్రల కాటంకము గలిగించవలదని అమ్మ నాయనను బ్రతిమాలెను. కాని, తొలినాటి సభ కధ్యక్షుడైన దర్భాంగ మహారాజు వెంట తన పూర్వ పరిచితుడైన శివకుమార పండితుడు నిశ్చయముగా వచ్చునని నాయన యూహించి, యతనిని జూచుటకు కుతూహలపడెను. అందువలన సభాదినమునాడు నాయన మంటపముకడకు వెళ్లి భోగట్టా చేసెను. పైనుండి యెవరినడిగినను మాట వినుపించుకొనక గర్విష్ఠులై పండితు లెవరి దారిని వారు లోనికి బోవుచుండిరి. లోనికి వెళ్లదలచి నాయన ద్వారముకడకు వెళ్లగా, పండితుడు కానివాడు లోపలకు వెళ్లరాదని యడ్డగింపబడెను. పండిత లక్షణమెట్లు నిరూపితమగునని నాయన ప్రశ్నించెను. 'పాగాయున్నవాడు పండితు' డని సమాధానము వచ్చెను. అది నాయనకు నవ్వు పుట్టించెను. ఆ నవ్వునకు కారణము

వినగోరి లోనికిబోవు పండితులొక్క క్షణము ద్వారముకడ నిలుచుసరి కక్కడ వారి వలన మూక యేర్పడెను. అది యేమని లోనివారందరు ద్వారమువైపు జూచిరి. ఎత్తైన వేదికపై కూర్చుండిన దర్భాంగ మహారాజు వెనుక వైపునున్న శివకుమార పండితుని దృష్టియు ద్వారమువైపు పడెను. ఆ దృష్టి కక్కడ నిలిచి యున్న నాయన గోచరించెను. అతడు క్షణములో ద్వారము జేరి నాయన నాలింగనము జేసికొనుట జూచి ద్వారరక్షకుడు, మూగిన పండితులుకూడ నాందోళనపడి, యొకరి మొగమొకరు చూచుకొనిరి. శివకుమారుడట్లే నాయన నొక చేతితో పెనగు వేసికొని మహారాజు కడకు తీసికొనివెళ్లి ''యిడుగో మహామహుడైన అంబికాదత్తుతో వాదముసల్పి, 'కావ్యకంఠ' బిరుదము నార్జించిన గణపతు''లని పరిచయము గావించి, పిదప వేదికపై తన చెంతనే కూర్చుండ బెట్టుకొనెను. అంత రాజు ప్రశ్నించగా, నాయన తన నవద్వీపానంతర చరిత్రను క్లుప్తముగా నెఱుకపరచి, యతని గౌరవమును చూరగొనియుండగా సభ ప్రారంభమయ్యెను.

అప్పుడక్కడ సమావేశమైన సభ 'కన్యా' వివాహకాలమును నిర్ణయించుట కుద్దేశింపబడెను. సుమారైదువందలమంది పండితులు సభయందుండిరి. పై విషయమును గురించియుపన్యసించుటకుముప్పదిమందివఱకు నున్నందున తొలి యుపన్యాసమైన పిదప పునరుక్తులు లేకుండ మాట్లాడవలెనని యధ్యక్షు డాజ్ఞాపించి, క్రొత్త విషయములున్నచో చెప్పుట కొక్కొక్కరికి మూడునాలుగు నిముసముల కాలము చొప్పున నిచ్చుచు రెండున్నర గంటలలో సభను ముగింపునకు దెచ్చి, కావ్యకంఠునివైపు దిరిగి యిట్లనెను: 'మీరు పండితులే గాక తపస్స్వరూపులు, సత్యానుభవ సంపన్నులు. మీరీ సభకు నిర్ణయవాక్కు బల్కి, మీ వాక్కుచే మమ్ములను ధన్యులగావింప గోరుదుము.''

హఠాత్తుగా నిట్లడుగబడినను నెల్లప్పుడు బుద్ధివిమర్శచే జాగరూకుడై యుండు గణపతిముని మహారాజుయొక్క సరసతకు సంతసించి లేచి తన మధురవాణీ ప్రవాహమును వదలెను. ఇతరులు చెప్పినదానిని తొలుత పూర్వపక్షము జేసి, పిదప పండితులకు విచక్షణను జూపుటకా వాణి నిశితమై, మానవజాతి యంతటికి హక్కుగలిగిన యీ కన్యాధర్మమును తురకల పాలనము నాటి భీతిచే నవలంబింపబడిన భారతీయాచారముతో పరిష్కరించుట తగదని బుద్ధిగరపెను. ఆనాటి భీతి యీనాడు లేనందున భారతదేశమందు గూడ బాల్యదశకు, కన్యాత్వదశకుగల వ్యత్యాసము గుర్తింపబడి, 'అష్టవర్షా దృవేత్కన్యా' - ఇత్యాది కల్పిత నిర్వచనములు వెనుక చేయబడవలెనని జెప్పెను. రజోదర్శనముతో ప్రారంభించు కన్యాత్వ మాభాసగాకుండు విధమున నప్పటినుండి వివాహ కాలపరిమితిని నిర్ణయించుట యుక్తమని పల్కెను. ఆ పరిమితి మూడేళ్ల కంటె మించినచో కన్యలు తమ వ్రతము దక్షించుకొనుటకు కష్టపడుదురని సూచించి,

రజోదర్శనము మొదలుకొని మూడేండ్లవఱకు కన్యావివాహ కాలమును నిర్ణయించుట దేశ కాల భేదములు లేకుండ స్త్రీజాతికంతకు యుక్తమై, సంతోషదాయకమై యొప్పునని తన నిర్ణయాభిప్రాయముగా వచించి గణపతిముని సభ్యుల హర్షధ్వానములతో ముగించి కూర్చుండెను. ఏకగ్రీవముగా సభ్యులీ యభిప్రాయము నామోదించిరి. శివకుమారుడప్పుడు చమత్కారముగా సాగాలేని యా కావ్యకంఠ పండితుని పస గుఱించి సభ్యులకు మఱింత పరిచయమొనర్చెను. పిమ్మట మహారాజు కావ్యకంఠుని కృతజ్ఞతాపూర్వకముగా నభినందించి, సభాంశమును ముగించి వెళ్లిపోవుచు కావ్యకంఠుని హస్తమందు వందరూపాయల నోట్లను రెండింటి నుంచి వెళ్లిపోయెను.

పిమ్మట మహామహోపాధ్యాయ హరిప్రసాదశాస్త్రి యధ్యక్షత నదే స్థలమందు సాహిత్యసభ ప్రారంభము కావలసియుండెను. శాస్త్రి వచ్చియున్నను, తొందరకార్య మింకొకటి యున్నందున వెళ్లవలసి తన స్థానమందు నాయన నుంచకోరగా, సభ్యులామోదించి ప్రమోదమును జూపిరి. నాయన యీ విధముగా నింకొకసారి గౌరవింపబడి, సభ నత్యంత ప్రభావనైపుణ్యముతో నడపి, యంత్యమందు మఱియొకసారి తన వాణీపీయూషవర్షమును గుఱించి, సభ్యుల జయవాదములతో సభను ముగించి, తన ప్రియమిత్రుడైన శివకుమారునితో గూడి బండిపై బస చేరుకొనెను. పిదప మఱునాడంతయు శివకుమారునితో నాయన ముచ్చటించి, మహర్షి పరిచయమునాటినుండి తన కనుభవమైన తపోవైభవ వివరణములచే మిత్రుని కానందముగూర్చి, బృందావన మధురక్షేత్ర మొసగిన మధురతమ స్మృతులతో జగన్నాథక్షేత్రమునకు పయనమయ్యెను.

అమ్మనాయనలను జగన్నాథక్షేత్రమున జేర్చినంతనే వేంకటరామశాస్త్రి ముందుగా మందసా వచ్చి, గురుదంపతుల రాక రాజున కెఱిగించెను. వానివలన నాయనకు మధురలో ప్రాప్తించిన కీర్తిగౌరవములను విని రాజు తన గురువైభవమునకు గర్వించెను. పిదప వారు మందసా చేరుటకై రైలు దిగినతోడనే వారిని మంగళ వాద్యములతో రాజెదుర్కొని కోటలోనికి తొలుత తీసికొనివెళ్లి, యక్కడ రాణులతో గూడి గురుదంపతుల పాదములకు పూజ సల్పి, యటుపిమ్మట వారిని వారికై యలంకరించియుంచిన బసకు చేర్చెను. బస చేరిన పిదప భార్యతో 'నీపై భువనేశ్వరి యుంచిన కటాక్షమహిమ నీ కిప్పుడవగతమయ్యెనా' యని నాయన ప్రశ్నించి యామెకు గగుర్పాటు కలిగించెను.

౬౦

ఎనిమిదవ ప్రకరణము

# మందసావాసము, మహేంద్రగిరియందు తపస్సుచే పరశురామ దర్శనము

క్రీ.శ. 1916వ సం॥ మార్చి నెల సగము గడచియుండగా అమ్మనాయన లుత్తర దేశయాత్రలు ముగించుకొని మందసా చేరి, రాజకుటుంబానురోధము వలన వింకను కొన్నాళ్ళక్కడనే యావాసమేర్పరచుకొనిరి. మఱుసటి నెలలో మహాదేవము సికింద్రాబాదునుండి హఠాత్తుగా జబ్బుచేసినదను నెపముచే కలువరాయి వచ్చి చేరెను. అతడొక్కడు రాక చెల్లెలినికూడ వెంటబెట్టుకొని వచ్చిన వార్త విని నాయన మహాదేవము చెప్పిన కారణము ననుమానించెను. మఱియు, నతడు మందసా వచ్చి చేరక, కలువరాయిలో దిగి యుత్తరము వ్రాయించుట వాని దోషమును మఱింత ఋజువుచేసెను. ఏదెట్లున్నను, పిల్లలను జూచుటకు తల్లి వేడుకపడెను. విశాలాక్షమ్మ యనురోధమువలన నామెతో సహా నాయన కదలి కలువరాయి వెళ్లవలసివచ్చెను. అక్కడకు వెళ్ళి యాథార్థ్యమును విచారించగా, మహాదేవము చెప్పిన సాకు లబద్ధములనియు, అప్పశాస్త్రి నిర్బంధ మతనికి గిట్టక, స్వతంత్రతయు, స్వేచ్ఛయుగోరి, చదువునకు స్వస్తిచెప్పి వచ్చినట్లమ్మకు వజ్రేశ్వరి చెప్పి, యకారణముగా తననుగూడ వెంటబెట్టుకొని వచ్చిన విషయ మెఱిగించెను. వాని కప్పటికి పదునెనిమిదవ యేడు వచ్చినను నాలుగవ ఫారము మాత్రమే చదువుచు, దానిపైన పరీక్షలకు ముందు విడిచెను.

నాయన వాని విషయ మిసుమంతయు పట్టించుకొనక తల్లి విచక్షణకు, నభిమానమునకు వానిని విడిచిపుచ్చెను. ఇట్లుండగా, వజ్రేశ్వరికింకను ఎనిమిదవ యేడు గడుచుచున్నను నాయనయొక్క సంస్కారభావములను లెక్కసేయక బంధువులు తమ కుటుంబాచారము ననుసరించి యామెకు పెండ్లి చేయవలెనని నిర్బంధించిరి. అమ్మకే యా విషయమునుగూడ విడచి నాయన యూరకుండెను. ఆమె తన బాధ్యతను తొందరగా తగ్గించుకొను నుద్దేశముతో వివాహమొనర్చుటకు నిశ్చయించి, కలువరాయికి పంద్రెండుమైళ్ల దూరములో గొల్లాదిగ్రామమందు భూవసతి గలిగియున్న గంటి చిరంజీవి గారి కుమారుడైన సోమయాజులను పేరుగల బాలున కామె నిచ్చుటకు నిర్ణయించెను. ఈ బాలుడుగూడ వారి గ్రామమందు విద్యలేక యే మూడవ తరగతియో చదివి మానెను. కాని, వానికి విద్యయం దపేక్షయున్నందున చెప్పించుకొనవచ్చునని విశాలాక్షమ్మ నిశ్చయించెను. వల

సంవత్సర వైశాఖ శుద్ధ విదియ (5-5-1916) నాడీ వివాహము జరుపబడెను.

పిమ్మట నూత్న వధూవరులకు మహర్షి యాశీర్వచనము బడయజేయుటకు తిరువణ్ణామలై యాత్ర కల్పింపబడెను. ఈ యాత్ర కింకను వెళ్ళకపూర్వమే నెల్లూరులో బయ్యా నరసింహశర్మగారి యధ్యక్షతను జరుపబడు ఆంధ్రసభా సమ్మేళనమున కాహ్వానము వచ్చి నాయన యోచించుచుండగా సభాదివసమునకే యాత్ర సంభవించెను. అందువలన సభలో పాల్గొనుటకు మార్గమందు నాయన దిగి, కుటుంబమును చెన్నపురమువఱకు పొనిచ్చెను. ఆ సభలో స్వరాజ్యనిర్ణయ తీర్మానము ప్రవేశపెట్టబడి పెక్కుమంది యుపన్యసించిరి. నాయన నధ్యక్షుడు సంస్కృతమున నుపన్యసింపగోరెను. రాజకీయసభలం దదివఱకు పాల్గొనకున్నను నాయన నిర్భయముగా నుపన్యసించెను. అటుపిమ్మట టి. ఆర్. రామచంద్రయ్య గారి యధ్యక్షత నొక సనాతన ధర్మసభ యదే స్థలమున ప్రారంభమై, 'వేదశాస్త్ర సంప్రదాయానుసారముగా వైదిక సనాతనధర్మమును మన దేశస్థులు పాటించవలె'నను హెచ్చరికకొఱకు తీర్మానము ప్రతిపాదింపబడెను. కొంద ఱుపన్యసించిన పిదప నాయనవంతు వచ్చెను. అప్పుడు నాయన లేచి, 'వేదశాస్త్ర సంప్రదాయము'లను సమాసమును విమర్శించి విరమించెను. ఇది ద్వంద్వసమాసమైనచో వేదములు, శాస్త్రములు, సంప్రదాయములు వేఱ్వేఱు ప్రమాణములు గలవి యగును. కావున సమాసమును షష్ఠీతత్పురుషముగా నెంచగోరెను. దేశకాలములచే మార్పు నెల్లప్పుడు నొందు సంప్రదాయములకుగూడ మార్పుచెందని వేదశాస్త్ర స్థాయిని ప్రామాణ్యమిచ్చుట యసంగతమని జూపి, ప్రామాణ్యము వేదశాస్త్రములందు ప్రతిష్ఠించి, వాటి సంబంధములైన సంప్రదాయముల ననుసరింపగోరినప్పుడు సమాసమును స్పష్టముగా నుండునట్లు సవరించుకొనుట యుక్తమని హితవు పల్కెను. సంప్రదాయము లొకప్పు డతిక్రమింపబడినను లేదా కాలమున కనుగుణముగా సంస్కరింపబడినను, వేదశాస్త్రములందు ప్రామాణ్యముగల సనాతన ధర్మములకెన్నడూ భంగము వాటిల్లదు గాన సంప్రదాయముల మార్పుచే సనాతనధర్మములు చెడిపోవు చున్నవను భీతి తగదనియు, తీర్మానములో పాటింపబడవలసినదేవో సభోద్దేశమును స్పష్టముగా ప్రతిఫలింపచేసికొనుట మంచిదనికూడ వచించి నాయన కూర్చుండెను. పండితులీ విషయములను తొలుత గమనించనందుకు సిగ్గుచెందిరి. వారిలో నొక డసూయాపూరితుడై ''సభకు వచ్చినచో పండితులను విమర్శించుట, వారి భావగతిని విమర్శించుట కావ్యకంఠునకు పరిపాటయ్యెను. అది పండిత లక్షణముకా''దని గాండ్రించెను. అది విని యధ్యక్షుడు ''మీ దృష్టిలో విమర్శకు పాత్రులగుటయే పండితలక్షణమని ధ్వనించుచున్నది. కనుకనే మీరు కావ్యకంఠునివలె నాదర్శులు కాజాలకుంటిరి. మీ మాటకు నేనాక్షేపణమును జెప్పుచు, తీర్మానమును

రద్దుచేసితి''నని ప్రకటించి సభను ముగించెను. ఆ పండితుని పెక్కుమంది యసహ్యించుకొనిరి.

ఒక యాంధ్రుని మహత్తర పాండిత్యమున కితరులకంటె నధికముగా నాంధ్ర పండితులే యీర్ష్యాపూరితులై యున్నట్లీ ఘట్టము కొంత సూచించెను. వారాంధ్ర రాష్ట్రమున జరుగు పండిత సభల కందులకే కావ్యకంఠు నిదివఱ కాహ్వానించుట లేదు. నిజమునకు వారు కావ్యకంఠుని పరోక్షమున తమకు మించిన పండితు డాంధ్రదేశమున పుట్టలేదని చాటించుకొనువారై, కావ్యకంఠునకు వెఱచి, యతని పేరైన నాంధ్రలోకమున ధ్వనించకుండుట కతని నాహ్వానించుట మానిరి. మహనీయ చరిత్రగలిగిన కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిమునికేకాక, యావదాంధ్ర లోకమునకు వా రీ విధముగా హానిజేసినవారైరని నిష్కర్షగా చెప్పవచ్చును. వారిలో పేరుకెక్కిన బంధువులుండుట మఱియు శోచనీయము. ఈ విషయములింకను మున్ముందు తేటపడగలవు. కనుక మన మింతటితో నీ విమర్శను విరమించి, కథాంశముల ననుసరింతము.

నాయన కుటుంబసహితుడై శ్రీ రమణదర్శనము గావించుకొని మఱలి వచ్చెను. ఆ సమయమందు 'హృదయకుహరమధ్యే' శ్లోకముచే శ్రీ రమణుని యందు ప్రకటితమై వ్యక్తమైన కవితకు నాయన స్వయముగా తన ప్రమోదాహ్లాదములను గురునకు విన్నవించుకొనెను. అప్పుడక్కడనున్న భక్తుడొక డా శ్లోకమునకు నాయన వ్రాసెదననిన వ్యాఖ్యను గుఱించి జ్ఞప్తిచేయగా, శ్రీ రమణుడు వినునట్లు నాయన తన ప్రత్యుత్తరము నిట్లిచ్చెను: ''ఔను, దాని కింకను సమయము రాలేదు. ఈ శ్లోకమును హృదయముగాజేసి, దాని కదే వ్యాఖ్యానమగున ట్లుపనిషత్తుల్యమైన గ్రంథమును భగవద్గీతవలె రచింపదలచితిని. అప్పుడది భగవద్గీతకు, బ్రహ్మసూత్రములకు గూడ మించిన ప్రయోజనము నిచ్చినదగును.''

తన సంకల్పము నిట్లు వ్యక్తపరచి, రమణ భక్తులను సంతోషపరచిన పిదప నాయన మందసా మఱలెను. మఱి యొకటిన్నర మాసము లగుసరికి బడులు తెఱవబడెను. అల్లుడు చదువునిమిత్త మత్తమామలయొద్దకు వచ్చి, మందసా స్కూలులో నాలుగవ తరగతియందు ప్రవేశించెను. పుత్రుడు నాలుగవ ఫారము మఱల చదువుటకు మందసాకు సమీపమున నున్న పర్లాకిమిడి కళాశాలలో ప్రవేశించెను. తొందరపడి వజ్రమ్మకు వివాహముజేసిన ఫలముగా తగ్గుటకు బదు లమ్మకు సంసారభార మధికమయ్యెను. నాయన కీసారి మందసా వాసము బంధదాయకమై యొప్పినను, బంధము నతిక్రమించుటకు సమీపములో నున్న చల్లని తోటలో పగళ్లు తన తపస్సాధనచే గడుపజొచ్చెను. వేంకట్రామ శాస్త్రి గురునకు సేవలొనర్చుచుండెను.

ఇట్లుండ సెప్టెంబర్‌లోనే, అక్టోబర్ నెలలోనో పశ్చిమతీర గోకర్ణ వాసి యైన దైవరాతుడు గురుదంపతులను దర్శించుటకు మందసా వచ్చెను. మూడేళ్ల నుండి దరిదాపుగా గురుదర్శనము లేదని తప్తహృదయుడై యున్న కారణమున నితడు వచ్చి సంతృప్తుడగుటయేగాక తన రాకచే గురుదంపతులను సంతృప్తి పరచెను. మందసా దగ్గర మహేంద్రగిరి శిఖరమున నొక గోకర్ణేశ్వరాలయమున్నది. ఇది ప్రతి శివరాత్రినాడు నేడాది కొకసారి తెఱువబడును. కనుక మూడు నాలుగు మాసముల ముందునుండి కొండనెక్కు బాటను చదునుజేయుట, మార్గమందు యాత్రికుల సదుపాయము కొఱకు సత్రములు నిర్మించుట మొదలగు కార్యములను భక్తమానస సేవితుడైన మందసా రాజు శ్రద్ధతో చేయించుచుండును. ప్రాగ్గోకర్ణభక్తుడైన యీ రాజుకూడ పశ్చిమ తీర గోకర్ణ భక్తుని రాక మంచి సమయమున కయ్యెనని మిగుల సంతసించి, యతనిని సోదరునివలె సత్కరించెను. ఇక్కడ గోకర్ణేశ్వరాలయము గూడ పురాతనప్రసిద్ధమైనదని దైవరాతుడు వినిన తోడనే "ఇదియు గణపతి ప్రతిష్ఠితమేనా" యని కుతూహలముతో రాజును ప్రశ్నించెను. రాజు సమాధానమిచ్చులోపున నాయన చమత్కారముగా "కాదు, అతని సోదరుడైన కుమారస్వామియొక్క యపర వేషధారియగు భార్గవరామునిచే ప్రతిష్ఠితమయ్యె"నని ప్రత్యుత్తరమిచ్చి, యీ రహస్యముచే రాజశిష్యునకుగూడ గగుర్పాటు కలిగించెను.

ఆలోచించగా, భృగుకులభూషణుడైన పరశురాముడు కార్తవీర్యుడను తమోరూపుని తన పరశుబలమున చంపి, వానిచే నపహరింపబడిన రేణుక యనెడి మూలాగ్ని యొక్క మహద్రజమును రక్షించి, స్వ గృహమున చేర్పబోవుచుండగా ప్రణీతాగ్ని స్వరూపుడైన జమదగ్ని యాజ్ఞచొప్పున శిరస్సునకు కళంకమైయొప్పు నింకొక తమోగ్రంథిని సైత మదే పరశువుతో ఛేదించి, యామెను నిష్కళంక శిరస్కురాలు గావించి, హృదయమనబడు నిజగృహమునకు లక్ష్మియగునట్లు తమస్తాప నివారణానుగ్రహ ప్రసాద(ఫల)మును సహస్ర వదనములతో నన్నివైపుల చిమ్ము నిత్య పూర్ణచంద్రకళా ప్రసిద్ధమగు దేవతాతత్త్వము నామెకు జతయజేసి, మునుల కామెను పూజ్యురాలు గావించెను. కుమారస్వామి యంశావేశమైన పరశువా తత్త్వమును సేవించు యోగులందఱియందును సూక్ష్మరూపమున నుద్భవించి, తమస్తాపములను ఛేదించి, శరీరమం దపహృతయైన నిజస్వరూప స్మృతిని రక్షించి, నిష్కళంకమొనర్చి, స్వస్థానమున జేర్చి, బంధముక్తాతీతమగు దివ్యస్థితి నిచ్చుచున్నది. ఇది యీ పరశువుయొక్క యనుగ్రహ ప్రభావము. దానిని కొందగోరువారికి రెండుపాయములు విధింపబడెను. 'అహం' మూల విచారణమొకటి, రేణుకాతత్త్వ మంత్ర మొకటి రెండు స్థలములందు రెండు విధములుగా కార్యరూపమును ధరించిన పరశువువలెనే యీ మంత్రము మన యంతర్బాహ్య శత్రునాశనము కొఱకు

పటిష్ఠరూపమై, లోకమందు పూర్వఋషులచే ప్రవేశపెట్టబడెను. కావున దీని ప్రయోజనము విషయములో రెండు శాఖలు గలిగి, రెండు క్షేత్రముల ననుగ్రహించుచున్నదని నిరూపించుటకే ప్రాక్పశ్చిమ తీరముల రెండింటియందును రెండు గోకర్ణ క్షేత్రములు ప్రతిష్ఠింపబడియుండును లేదా మంత్రముచే నొకటి, కేవల మహస్సుచే నింకొకటి ప్రతిష్ఠింపబడి, గణపతి స్కందప్రతిష్ఠలుగా ప్రఖ్యాతమై యుండవచ్చును.

గురుసహాయమున క్షేత్రతత్త్వము నిట్లు దైవరాతు డవగతమొనర్చు కొనినప్పటినుండి మహేంద్రగిరి శిఖరారోహణముకొఱ కెదురుజూడదొడగెను. పశ్చిమమున కార్యమును సాధించి, జననియగు రేణుకను నిజగృహము చేర్చిన పిదప మహస్స్వరూపుడైన పరశురాముడీ మహేంద్రగిరియందే తపస్సున నుపవిష్టుడై, దీనినే చిరకాలము తపస్స్థలము గావించుకొనినట్లు మన పురాణములలో ప్రసిద్ధమై యున్నది. అటుపిదప రాజులను జయించుటకు మఱల వెళ్లి, యిఱువదిసార్లు భూమిని జయించిన కథ లక్షణార్థముతో గూడి, మంత్రముచే సాధించు నింకొక ప్రయోజనమును సూచించుటకొఱకని గ్రహించవలెను. ఎట్లనగా, నిఱువది యక్షరములతో గూడిన యీ మంత్రమే చిత్తభూమిని జయించుటకొఱకు దివ్యశస్త్రమయ్యెనని వచించుట కీ కథ కూర్చబడినట్లు గ్రహింపనగును.

ఇట్టి దివ్యతత్త్వ ప్రసంగములతో దైవరాతునకు నాలుగుమాసములిట్టే గడచి, శివరాత్రి సమీపించెను. అప్పుడు నాయనకొక సంకల్పము గలిగెను. పరశురాముని మహస్సు యొక్క యనుగ్రహమును బొందుటకు పూర్వము బలరామ క్షేత్రమం దస్త్ర మంత్రసిద్ధికి తపము సల్పినట్లే మహేంద్రగిరి శిఖరమున దైవరాతుని పరిచర్యల సహాయమున తపస్సు చేయవలెనని గాఢముగా తలచెను. రాజశిష్యునకీ యుద్దేశ మెఱిగించి, తపఃకాలమందు రెండు మూడు దినముల కొకసారియైన నిలువయుండు నాహారమును బంపగోరెను. కొండ శిఖరము శివరాత్రి వెళ్లిన పిదవ తిరుగ నిర్జనమై, చుట్టునున్న ఘోరాటవినుండి మృగభయమున కవకాశమగునని రాజు భీతిల్లగా, 'భయపడవల'దని నాయన రాజశిష్యుని శాంతింపచేసెను. సిద్ధగురువు చెంతనుండి నడవి మధ్యమందైన నుండుటకు తాను వెరవనని దైవరాతుడును ధైర్యముగా పల్కెను. అందువలన రాజు గురుని కోర్కె మన్నించుట కేర్పాట్లు గావించెను.

శివరాత్రి పర్వదినమున నమ్మనాయనలు, దైవరాతుడు మాత్రమే యింటి నుండి వెడలి, పిల్లల నింటికడ వేంకటరామ శాస్త్రితోసహా విడచిరి. అమ్మకొక 'డోలీ' యను వాహన మేర్పాటు గావింపబడెను. డోలీచెంత నమ్మకు సహాయముగా దైవరాతుడు నడచుటకు, రాజమంత్రితోడను, పరివారముతోడను గూడి మార్గమందు ప్రకృతిరామణీయకతను తిలకించుచు నాయనగూడ పాదచారియై పవిత్రమైన పర్వతము నెక్కుటకు నిర్ణయింపబడెను. ఆ నిర్ణయము చొప్పున

యాత్రికుల గుంపులతోపాటు వారు ప్రాతఃకాలమందే బయల్వెడలి, యుదయము పదిగంట లగుసరికి శిఖరము చేరిరి.

ఈ పర్వతము భూమినుండి సుమారైదువేల యడుగుల యెత్తుండి, దట్టమైన యడవిచే కప్పబడి యుండును. ఎక్కుట కొక బాట కొండను చుట్టుచు, క్రమోన్నతిచే శిఖరమును జేరుచున్నది. అక్కడక్కడ బాటవెంతను కొలది గుడిసెలతో గూడిన కొండపల్లెలు మూడు నాలుగున్నవి. వలయమైన యీ బాట పొడ వించుమించుగా పంద్రెండు మైళ్లు. బాటనుండి వ్యాఘ్రాది క్రూరమృగములను దూరముగావించుటకు కొండవారలు సాయుధులై, డప్పులతో బాటపొడవునను చప్పుళ్లు చేయుచుందురు. చుట్టుప్రక్కల నుండి యాత్రికులు పెక్కుమంది వత్తురు. భజనలు, శివసంకీర్తనములతో వారును కోలాహలముగా నెక్కుదురు. ఇంతయున్నను, ప్రతి సంవత్సర మొకరిద్దరైన కుక్కలవలె తిరుగాడు పులుల నోట బడుచుండుట కద్దు. అట్టి ఘోర భయంకరప్రదేశమున తపము సల్పుటకై వెడలు నాయనయొక్క సాహసమే వైదికఋషి సాహసము.

దశ మహావిద్యలలో షష్ఠవిద్యగా కీర్తింపబడిన యే రేణుకావిద్యను బొంది మునులు కపాలభిన్న సిద్ధిని బొందియు జీవించి మృత్యుంజయులయిరో; అట్టి యద్భుతమైన యింద్రాణీ తత్త్వమును బ్రకటించిన రేణుకయందు షష్ఠావతార పురుషుడై పుట్టి, వైదికఋషులచే నింద్రాంశగను, తాంత్రికులచే షణ్ముఖుని యంశగను స్తుతింపబడిన పరశురాముని గురువుగా దలచి, యతని తపస్థలమున కుండుట కతని యస్త్రమంత్రమందు సిద్ధిబడసి, బాహ్యమును జయించిన నాయనకు గాక సాహస మా స్థలమం దింకెవరికుండ శక్యమగును ?

శిఖరము చేరి, యమ్మతోడను, దైవరాతునితోడను గూడి నాయన యీశ్వరాలయము జొచ్చెను. అదివఱకీ యాలయ మెన్నడూ దర్శింపని కారణమున నాయన కుతూహలముతో లింగమును బరీక్షించెను. పశ్చిమ గోకర్ణమందు లింగము గోకర్ణాకృతినుండగా, నిక్కడ గోకర్ణమును బోలిన దహరము లింగమందుండి దహరాకృతిచే గోకర్ణేశ్వరు డగుటకు నాయన యబ్బురపడి, తానూహించిన దహర గుహాకు తత్త్వమున కిది సరిపోయి యున్నట్లు సంతసించెను. వెంటనే నాయన యాశువున నా లింగమును స్తుతించి, స్తుతియందా భగవంతుని 'దహర గోకర్ణేశ్వరు' డని పేర్కొనెను. ఆ సిద్ధవాక్కు చొప్పున నాటినుండి యా పేరు స్థిరమై ప్రాక్పశ్చిమ గోకర్ణ క్షేత్రాధిష్ఠాన దైవముల నిర్గుణ సగుణ వ్యత్యాసములను, నిరాకార, సాకార విభేదములను తెలియజేయుచుండెను.

శివాలయమును చేరి నిరావరణమైన విష్ణ్వాలయ మొకటి కలదు. ఇది పదునేడు క్షేత్రములలోవలెనే పరశురాముని యాలయమై యొకప్పుడుండి, యిప్పుడిట్లు మార్పుబడియుండును. మన యాత్రికులు దీనినిగూడ దర్శించు కొనిరి.

ఈ రెండాలయములకు నడుమ నున్న సన్నని మంటపమును నాయన తపస్థలముగా నెంచుకొని, యక్కడ రాజభటుల సహాయమున నొక నెగడు కల్పించుకొనెను. ఎందుకనగా, ఋతుధర్మముచే చలి యటుండ, మేఘములను చుంబించుచున్న యీ పర్వతశిఖరమందు జలాశయములయొద్ద నున్నట్లు నీటితుంపరలు నిత్యము చిల్కుచు, రాత్రియగుసరికి చలిబాధను హెచ్చించవచ్చునని తలచి పెట్టదనము కొఱకట్లు చేయబడెను. వారు కూర్చుండుటకు, పరుండుటకు గూడ నందే ప్రదేశము నేర్పరచుకొనిరి.

మధ్యాహ్నము రెండు గంటలకు దిగవలసిన వారందరు దిగుట ప్రారంభించి యొక్క ఘడియలో శిఖర ప్రాంతమంతయు నిర్మానుష్యము గావించిరి. పూజార్లు కోవెలలు రెండింటిని బిగించిపోయిరి. అమ్మ డోలీలో దిగిపోయెను. నాయన, దైవరాతుడు మాత్రమే మిగిలియుండిరి. వారు కొంత దిగుచున్న యాత్రికులను, చుట్టుతిరిగి రమ్యమై గన్పట్టు బాటను తిలకించుచుండగా పర్వతమంతయు ధేనురూపమున గోచరించి, వారి నాశ్చర్యమున ముంచెను. సింహాచలము సింహాకృతినున్నట్లే, యీ గోకర్ణేశ్వరుని గిరి యొక చెవి పైకి పెట్టుకొని పండుకొనిన యావువలె దోచి, పూర్వ్యోలీ పర్వత రూపములను, వాటి దివ్యతత్త్వములను గుఱించి చేసిన పరిశోధనలను వారు కొంతతడవు స్మరించి, తదావేశమున నిష్టయం దుపవిష్టులైరి.

తదేకధ్యానమున సమాధియందు మునిగినవానివలె నాయన తపస్సున చొరబడెను. గురుని జూచి శిష్యుడుకూడ శ్రద్ధాసక్తుడై ధ్యానమగ్నుడయ్యెను. పగళ్లు - రాత్రుళ్లు అని యెంచక నిద్రవచ్చినప్పుడుమాత్రము నడుము వాల్చి, మిగిలిన కాలమును వృథాగానీయక వారు ధ్యానము సల్పుచు, దినములను నిముసములవలె పోనిచ్చుచుండిరి. మూడు దినముల కొకసారి పాలు, రొట్టెలు వారికొఱకు పంపబడుచుండెను. అవి వచ్చిననాడు పాలనే యాహారముగా గైకొని, మిగిలిన రెండు రోజులకు రొట్టెలను దాచుకొనుచుండిరి. వీనిని తెచ్చు భటులు వీరి క్షేమవార్తనుగూడ రాజునకు తెలియజేయగా, విశాలాక్షమ్మకూడ విని సంతోషించు చుండెను. ఇఱువది దినము లిట్లు దినదినప్రవర్ధమానమగు నేకాగ్రతతో నాయన 'యహం' మూల పరిశోధనము జేయుసరి కిఱువదియవ నాటి రాత్రిభాగమం దొక వింత గొల్పు దర్శనముచే తన దీక్ష ఫలించెనని యెంచి తపస్సును నిలిపెను.

కేవల జాగ్రత్స్థితియందుండగా పూర్వము పదునేడువం దగపడిన జటాముని రూపమున పరశురాము డగపడి నాయన వైపు దృష్టి సారించుసరి కొక వింతగొల్పు తేజ మతనినుండి వెడలి నాయన శిరస్సున చొరబడెను. దానితో పరవశమై నాయన కన్నులు మూతబడెను. ఆ మహాద్రజము సుషుమ్నా నాడియందు పరుదుకొనినట్లు స్పష్టానుభవమయ్యెను. పిమ్మట లహరీ తగ్గి కన్నులు విచ్చుసరి కా గురుమూర్తి

యదృశ్యతయ్యెను. కాని, నాయన కీసారి ఆ మూర్తియం దతడు పరశురాముడేగాక, లోకగురువై శ్రీవిద్యకు ఋషియైన దక్షిణామూర్తియైయున్న ట్లనుభవగోచరమై, నాయన యానందమునకు పారము లేకపోయెను. తెల్లవారిన పిదప వారు నెమ్మదిగా కొండ దిగి, రాజునకు కబురంపిరి. నాయన ముఖమందు విద్యుత్స్ఫులింగములను జిమ్ము నింత తేజస్సును జూచి రాజు, దైవరాతుడు, విశాలాక్షమ్మ విస్మయపడిరి. రెండు మూడు దినములది స్పష్టగోచరమైన పిదప శిరస్సున నంతర్గతిచే క్రమముగా నదృశ్యమయ్యెను. దానిని జూచిన యుభయ గోకర్ణ భక్తులదే యదృష్టమనవచ్చును. కాని, యీ తేజస్సు ననుగ్రహించిన దివ్యపురుష సందర్శన విషయము మాత్రము చాలకాలము వఱకు నాయన బహు గుప్తముగా నుంచి భార్యకైన నెఱిగించలేదు. దీనితో నాయనయందు మునిలక్షణము సార్థకమైనట్లెంచి, యా లక్షణ పరిపాక పోషమున జీవితమందు తెరువబడిన ఘట్టము నింకొక ఖండములో మనము ముచ్చటించి, తర్వాత మెట్టి సిద్ధి నిచ్చెనో పరికింతముగాక.

# VII. ముని వైభవ ఖండము

-: అధ్యాయములు :-


1. క్షేత్రరథము మాతృరూపముగోరి పరశురామప్రీతియగుట
2. శ్రీ రమణగీతా రచనము
3. సికింద్రాబాదావాసము, తపశ్శక్తి పాక విశేషము
4. కపాలభేదనసిద్ధి, ఇంద్రాణీస్తుతి
5. ఇంద్రాణి యనుగ్రహముచే మహర్షి తల్లి మాతృభూతేశ్వరియై, యాశ్రమ నిర్మాణదేవి యగుట
6. మాతృ బాధ్యతలు, రాజకీయము
7. 'పూర్ణ' యను కథాఫలముగా గృహబాధ్యతలు నివారించుట
8. విశాలాక్షమ్మ నిర్యాణము, ఆశ్రమములో 'శ్రీ'చక్ర ప్రతిష్ఠ
9. సికింద్రాబాదు, హైదరాబాదులలో సంచారము
10. కష్టదినములు

ఓం

మొదటి యధ్యాయము

# క్షేత్రరథము నూత్నరూపము గోరి పరశురామప్రీతియగుట

మహేంద్రగిరి శిఖరమునుండి నాయన దిగివచ్చిన కొద్ది రోజులకే మహాదేవము మఱల జబ్బుచేసినదను నెపముచే పర్లాకిమిడినుండి వచ్చి, మఱునటి నెలలో పరీక్షలకైన వెళ్ళక, పర్లాకిమిడి చదువునకుగూడ స్వస్తిచెప్పెను. ఈసారి వాని వైఖరి అమ్మకు విశదమై, వాని కర్మకు వానిని విడిచిపుచ్చెను. అంతేగాక, పిల్లల చదువుకొఱకు సంసారము కల్పించుకొనిన పొరపాటామె గుర్తించుకొని, జ్యేష్ఠపుత్రు డనదగు అప్పశాస్త్రి కుత్తరము వ్రాసెను. వేసంగి సెలవులకతడు గురుపత్ని యాజ్ఞ చొప్పున వచ్చి ''నేను వజ్రేశ్వరి భర్తను నా దగ్గర బెట్టుకొని చదివింతును. వజ్రమ్మ మీ యొద్దనున్నచో, కొంచె మీడువచ్చినది కనుక పనిపాట్ల కుపకరించును. మహాదేవమును కాకినాడ కళాశాలయం దధ్యాపకుడై యున్న మన పొన్నుస్వామి యొద్ద దిగవిడిచినచో 'కేంబ్రిడ్జి మెట్రిక్యులేషను' పరీక్ష కతడు తర్ఫీదునిచ్చి వీనిని ప్రైవేటుగా కట్టించగల''డని సలహానిచ్చెను. ఆ ప్రకారమే మహాదేవము కాకినాడ పంపబడిన పిదప వజ్రమ్మ పెనిమిటి అప్పశాస్త్రి కొప్పగింపబడెను. భగవంతునిచే కల్పింపబడిన ట్లప్పశాస్త్రి రాకవలన కుటుంబ బంధములిట్లే విడి, శుభసమయము కల్పితమయ్యెను. అందువలన రాజుతో చెప్పి 1917వ సం॥ జూన్ నెలలో నాయన మందసావాసమును ముగించి, నిజగురుని వెంట నరుణగిరివాసమున కమ్మతోడను, వజ్రమ్మతోడను, దైవరాతుని తోడను వెడలెను.

మార్గమందు విజయవాడలో ఇంజనీరింగు శాఖలో పనిచేయుచున్న శంకర శాస్త్రియను పూర్వశిష్యునింట రెండు దినములు, చెన్నపురములో సుధన్వునింట రెండు దినములు వారు గడపిరి. అమ్మనాయనలింక స్థిరముగా తిరువణ్ణామలై యందు వారి కంకితమైన మాతగుహ నధిష్ఠించి, మున్యాశ్రమ జీవితమున బ్రవేశించ బోవుట కీ శిష్యులిద్దరు సంతసించి, వారి కగు ఖర్చు నిమిత్తము ప్రతి నెల సహాయము చేసెదమనిరి. ఆ సమయమందు సుధన్వుడు తన వకీలువృత్తియం దభివృద్ధినిచ్చు మంత్రమును వేడగా, సర్వవశంకరియగు 'మాతంగి' విద్య నతనికి నాయన యుపదేశించెను.

పిమ్మట వారు తిరువణ్ణామలై చేరుసరికి గ్రీష్మతాపమధికమై. చల్లదనము

నిచ్చు చూతగుహ తామనుకొనినట్లు నివాసార్హము గాకయుండెను. పెక్కు సంవత్సరములనుండి మూతబడియున్న దాని కధికమగు మరమ్మతు లవసరమయ్యెను. అరుణాచల శిష్యవర్గము బాగుచేయించుటకు పూనికొనినను, పనులు ముగియుసరికి రెండు మూడు మాసములు పట్టుననిపించెను. అంతవఱకు పురమందు ఎచ్చెమ్మాళ్ తన యింటికడ నుండుట కమ్మనాయనల నాహ్వానించి తీసికొని వెళ్లెను. ఆ సమయమందు నాయన 'హృదయకుహర' శ్లోకమున కుపనిషద్రూపమునిచ్చు గురుకార్యమును జేయదలచెను.

అది యెట్లనగా, భగవద్గీతయం దుపనిషత్తులసారము శ్రీ కృష్ణార్జున సంవాదరూపమున బోధింపబడినట్లే, ప్రశ్నోత్తరరూపమున నీ గ్రంథమును సర్వ వేదాంతసారభూతముగా నాయన రచింపదలచెను. దీనియం దుత్తరమిచ్చి యుపదేశించువారు శ్రీ రమణభగవానుడు, పృచ్ఛకులు కల్పిత పాత్రలుగాక సందేహ నివారణకై మాటిమాటికి రమణుని యథార్థముగా ప్రశ్నించు భక్తులు. వారడుగుచున్న ప్రశ్నలదివఱ కెందరిచేతనో అడుగబడినవై, రమణునకు చెప్పినదే మఱల మఱల చెప్పవలసి వచ్చుచుండెను. శాస్త్రీయవిషయములగు సందేహము లిట్లు పదేపదే తీర్చవలసిన కష్ట మీ గ్రంథము నివారించును. కావున నిది గురుకార్యమేగాక లోకహితమునుగూర్చు విజ్ఞానసేవాకార్యమనదగును. జగజ్జీవేశ్వర సంబంధము నెఱిగించునది 'అహం' లక్షణమై, యీశ్వరునియం దది కేవల భాసమానమై, జీవునియందు సూక్ష్మవృత్తిరూపమై (శబ్దము, స్ఫురితయను రెండు శాఖలుగా), జగత్తునందు జడత్వము నిచ్చు నాకృతియై (అనగా మూలచైతన్యమును గోల్పోయి స్వయముగా ప్రకాశించలేనిదై) యొప్పుచున్నట్లదివఱ కే గ్రంథమందును స్పష్టముగా బోధింపబడలేదు. అందువలన జగజ్జీవేశ్వర భేదమువలనే సాధక గ్రంథములు విభేదముచే నొకదాని నొకటి ఖండించుకొనుట తప్ప, భేదమును నివారించు నుపాయమును శ్రీ రమణునివలె భేదాభేదకారణతత్త్వ స్ఫురితమైయుండున ట్లొసగలేదు. కనుక సాధక గ్రంథముల నీ మాత్రగ్రంథము సంస్కరించినదగును. ఉమాసహస్రమందు నాయన యీ సందేహములను శాస్త్రీయధోరణిని నివారించినను, శాస్త్రము తెలియనివారుకూడ మేలుపొందుటకు ప్రశ్నోత్తర రూపమున నుపదేశ గ్రంథ మొకటి యావశ్యకమని నాయన తలచి యీ కార్యమునకు గడంగెను.

ప్రశ్నలు సర్వజనోపయోగములై, వేదాంతానుభవములకు, నుపాసనాది విధులకు చెంది, ముముక్షులోకమునకు ప్రయోజనకరములై యుండి, కర్మ- భక్తి - యోగ - జ్ఞానమార్గములందు సంభవించు సందేహములన్నింటిని పేర్కొను నట్టివై యుండవలెను. సాధారణ పృచ్ఛకు లిట్టి ప్రశ్నల నడుగరు. వారికి తట్టవు. కావున పృచ్ఛకుల నోటికి ప్రశ్నల నందించుటకు నాయనయే పూనుకొనవలసి యుండును. అట్టి తఱి విద్వాంసులగు తన శిష్యుల కీ కీర్తి నీయదలచి, వారికి కబురంపెను.

తానే యీ నాటక సూత్రధారుడైనను గురుని కడ తానుగూడ పృచ్ఛకపాత్ర నాయన కొన్ని సందర్భములందు పూనుటకు వెనుదీయలేదు. మఱియు పూర్వ మరుణాచలశాస్త్రితో జేసిన సంవాదముతో గ్రంథమును బ్రారంభింపదలచి, యా సంవాదములో శంక లరుణాచల శాస్త్రి వైనను తనవిగా పేర్కొని, ప్రత్యుత్తరములు రమణునివిగా వచించి, తద్ద్వారమున నొరుల కళంకమును తా భరించిన యుదారతతో కార్యము నారంభింపనెంచెను.

గ్రంథమునకు కావలసినవన్నియు నీ విధముగా నాయనయందే సమకూడి యున్నను, నాయన కొక ప్రత్యేక స్థలము సమకూడక, గురునకు దూరముగా పురమందు వసించుట చిక్కయ్యెను. నాయన యొక్కరుగా నున్నచో, స్కందగుహ యందైన నుందురని యెంచి విశాలాక్షమ్మ పుత్రికతో గూడి చెన్నపురము వెళ్ళి పోయెను. శిష్యులైనను పృచ్ఛకులగుటకు చేరలేదు. కార్యవిలంబనమున కిష్టపడక నాయన 7-7-1917వ తేదీనాడు పైన పేర్కొనబడిన వాదమును శ్లోకరూపమున గూర్చి, దానిని ప్రథమాధ్యాయముగా సమకూర్చెను. ఆనాడే దైవరాతుని ముఖమునుండి నాలుగు ప్రశ్న లడుగబడెను. ఆ ప్రశ్నలను, రమణభగవానుని సమాధానములను గూడ తేదీతో సహా శ్లోకములలో రచించెను. ఈ ప్రశ్నలతో మూడవ యధ్యాయమును నిర్మించి, 'హృదయకుమార' శ్లోక మొక్కదానితో రెండవ యధ్యాయమును నిర్మించెను. అంతవఱకు నాయన స్కందగుహకు పోలేదని విని విశాలాక్షమ్మ చెన్నపురము నుండి మఱలి వచ్చెను. ఎండ వేడ భరించలేక నాయన స్కందగుహకు పోలేదు. సాయంత్రములందు మాత్రము వెళ్లుచు, ఘోరమై యున్న గ్రీష్మతాపముచే కొండనెక్కుటకుగూడ కష్టపడుచుండెను. అట్లయినను, శిష్యులు రాని కారణమున 21-7-1917వ తేదీని నాయనయే కొన్ని ప్రశ్నల నడిగి, యింకొక యధ్యాయమును నిర్మించెను.

అప్పటికి శిష్యులు వచ్చుచున్నట్లు చేరిన వార్తలు నాయన కుత్సాహము కలిగించెను. గాడ్పులు కూడ చల్లబడెను. శిష్యులు వచ్చులోపున తాను విరూపాక్షగుహ నధిష్ఠించినచో, శిష్యులతో ప్రత్యేకముగా చర్చలు సల్పుటకేమి, మహర్షి సన్నిధికి బోవుచుండుటకేమి సదుపాయకరముగా నుండునని నాయన నిశ్చయించెను. అంతేకాక, అమ్మకూడ తనతో విరూపాక్ష గుహయందుండి, యక్కడ వంట ప్రారంభించినచో, పురములోనికి తాను దిగనక్కరలేదనియు, వచ్చిన శిష్యులుకూడ భోజనమున కిబ్బందిపడక తనతో భుజింతురనియు నాయన యెంచి, 23-7-1917వ తేదీని మహర్షికి తన సంకల్పమును విన్నవించుకొని, మహర్షి యనుమతి నర్థించెను. గృహస్థు లందుండరాదను నియమమున్నను, వానప్రస్థమందున్న తమకా నీమము వర్తించదని నాయన యెఱుగును. అట్లయినను. తమ వానప్రస్థ జీవిత యాథార్థ్యము ఋజువగుట యెట్లు? సత్యమెఱిగిన రమణ

భగవాను డనుమతించినప్పు డది నిశ్శంకగా లోకమునకు ఋజువైనదగును. లేనిచో నడివయస్సున నుండి, నలుబది సంవత్సరముల లోపు వయస్సునున్న అమ్మ నాయన లాధ్యాత్మికముగా నెంత యుత్తమ స్థితి బొందినను, సహవాసి జీవనమందు శారీరకవాంఛల కొకప్పుడైన వశులు గాకుండుట దుర్లభమనియే మూఢలోకము భావించుచుండును.

భగవానుడు సంతోషముతో ననుమతించి యూరకుండక, పూర్వము నాయనకొఱకు చూతగుహను శుభ్రపరచుట కేవిధముగా ఫలనిసాధువు నాజ్ఞాపించెనో, ఆ విధముగా నమ్మ వంటకొఱకు విరూపాక్షగుహను సాయంత్రములోపల శుభ్రము చేయవలసినదిగా వానికే ఆజ్ఞనొసగెను. వాడు 'సరే' యని ప్రత్యుత్తరమిచ్చియు కపటమును దలపెట్టి, మధ్యాహ్నమున పురములోనికి బోయి, సాయంత్రము భక్తులతో మహర్షి ముచ్చటించు సమయమున మహర్షి కగపడ కుండ వచ్చి, దొంగవలె స్కందగుహ లోపల గూర్చుండెను.

మహర్షి యే విధముగా వాని ననుమానించలేదో, నాయనయు వాని నా విధముగా నమ్మి, సాయంత్రము చల్లబడువేళ కమ్మతో గూడి విరూపాక్షగుహకు వెళ్లెను. ఆ రాత్రి కక్కడ వంట యేలయని తలచి, యెచ్చెమ్మాళ్ యింటి నుండియే కొంచెము పెరుగులో అన్నము కలిపి విశాలాక్షమ్మ తీసికొని వెళ్లెను. వారిని దిగబెట్టి వచ్చుటకు ఎచ్చెమ్మయు వెళ్లెను. ఎందులకనగా, వజ్రమ్మను పురములోనికి తీసికొనివచ్చి, మఱునాడు శ్రావణమాసములో ప్రథమ మంగళవార మగుటచే వజ్రమ్మకా నోము తన యింట పట్టించవలెనని యెచ్చెమ్మ సంకల్పించెను. వీరందరు విరూపాక్షగుహ చేరుసరికది మూయబడి, పెద్ద కప్పుతాళముతో బిగింపబడియుండెను. దానికితోడు గుహ వెలుపల నెప్పటి చెత్త లచ్చటనే పడియుండి, శుభ్రపరచిన చిహ్నములు కానవచ్చినవికావు. అప్పుడు నాయన ఫలనిసాధువు ననుమానించి, యమ్మ నెచ్చెమ్మల నక్కడనే యుంచి, తాను దిగమడిగి తెచ్చుకొని స్వయముగా శుభ్రపరచుకొను నుద్దేశముతో మహర్షి యొద్దకు పోయెను. నాయన రాక కెదురుచూచుచున్న భక్తులతోపాటు మహర్షియు సంతోషముతో నాయనను జూచి 'ఫలని యక్కడ చేయవలసిన పని శుభ్రముగా చేసెనా' యని కుశలమడిగిన ట్లడిగెను. ఫలని జూపిన నిరంకుశత్వము నొక్క మాటలో నాయన చెప్పగా విని లజ్జాభరితుడై రమణుడు వెంటనే ఫలనిని బిలిచి, తాళము తెచ్చి నాయన కిమ్మని యాజ్ఞాపించెను. కాని, తొలి యాజ్ఞను నిర్లక్ష్యపరచినట్లే, దీనినతడు లక్ష్యపెట్టక, యెదురుతిరిగి 'యమ్మ నాయనతో గూడి విరూపాక్షగుహలో సంసారము సల్పుటకు నే నొల్లను కనుక తాళ మీయజాల' నొనెను.

ఆ రోజులలో విరూపాక్షగుహ స్వామ్యములో చిక్కుకొని, యాధిపత్యము కొఱకు రెండు తెగలవారు బహుకాలము పోరాడి, పోరాటకాలమం దిరుపక్షముల

వారిచేతను నుపేక్షింపబడి, తుదకు రమణునకు చిరకాలవసతియై, యతని యధీనమునకు వచ్చెను. ఇప్పుడింకొక ప్రతివాదివలెనో లేక యేజంటువలెనో ప్రవర్తించిన ఫలనిసాధువు వాక్యము లసాధువులై, శ్రీ రమణుని యాజ్ఞ ధిక్కరించు నట్లేగాక విశాలాక్షీ గణపతుల పవిత్రజీవితమున కపవాదము గల్పించినట్లును, వారి నవమానపరచునట్లును వెడలెను. ఈ యపవాదము భరింపనలవిగానిదై, నాయనయందు రేణుకాపవాదమును దగ్ధమొనర్చిన పరశురామ మహస్సేది యంతకు పూర్వ ముంచబడెనో, ఆ మహస్సు భగ్నమని యతని యొక్క వాణికి దివ్యాస్త్ర ప్రభావమునిచ్చి, యపవాద కళంకమును లోకమునుండి తొలగించి భస్మీపటలముగావించు నుద్వేగముతో శాపావాక్కును గ్రక్కించెను. అది ఛందో బద్ధమై గణపతి కీర్తిచే విస్తరించియున్న భువనమందంతటను వ్యాపించుట కిట్లు వెడలెను :-

శ్లో॥ ''అద్యక్రోధం విమోక్ష్యామి ఖాండవేఽగ్ని మివార్జునః।
భువనే ప్రాణిభిః పూర్ణే పరితోపిచ విస్తృతే॥''

శ్లో॥ ''సలిలం క్షిపతశ్చాపి ధున్వతశ్చాపి పర్వతాన్।
యథేంద్రస్య తథేశస్య పుత్రస్య మమ వై మహః॥''

(అర్థము:- ఖాండవవనమం దర్జును డగ్ని నెట్లు విడిచెనో, ప్రాణికోటితో నిండి సర్వదిక్కుల విస్తరించియున్న యీ భువనమందు నేనిప్పుడు క్రోధాగ్ని నట్లు విడుచుచుంటిని. నీటిని వర్షింపజేయువాడు, పర్వతములను (మేఘములని గ్రహించుకొనవలెను. పర్వతః=ఘనః=మేఘః) చెండాడువాడును అగు నింద్రుని తేజస్సెట్లో, అట్లే యీశ్వరపుత్రుడనైన నా తేజస్సుగూడ ఫలించుగాక.)

నాయన యిట్లు క్రోధాగ్ని భువనమందు విడిచిన మఱుక్షణము కొండ దిగి, యొక చిన్న తాతితో విరూపాక్షగుహకు బిగింపబడిన కప్పుపై గొట్టెను. ఆ చిన్న దెబ్బ కంత పెద్ద తాళము పగిలి క్రిందపడుట కమ్మయు, నెచ్చెమ్మయు నాశ్చర్యపోయిరి. తాళముకొఱకేదో గొడవపడి, నాయన క్రోధమూర్తియై వచ్చి, యీ పనికి పూనుకొనినట్లు వారిరువురు గ్రహించి, క్రోధశక్తియే కప్పును చీల్చెనుగాని తాయిగాదని తెలిసికొనిరి. బిగమును విచ్ఛేదమొనర్చిన వెంటనే నాయన యొక్క మాటనైన బల్కక, గుహకు సమీపముననున్న చింతచెట్టు క్రిందకు బోయి కూర్చుండి, కొండ దిగువనున్న భూమిపైపు దృష్టి ప్రసరించెను. ఏ భూమియందు తన క్రోధాగ్ని కొరబెట్టెనో, ఆ భూమి గ్రీష్మపు వేడిమిచే తపించి, జీవవర్గము నతి కష్టముతో భరించుచున్నట్లు చూపున గన్పట్టి, వర్షలోపముచే సతమతమగుచున్న ప్రాణిమయ జగత్తునందు తానింకను గలిగించిన యుపద్రవమున కప్పుడు నాయన సిగ్గును, సంతాపమునుగూడ పొంది, భూమిని వర్షముచే శాంతింపజేయుటకు వెంటనే 'యుంజన్తి భగ్నమరుషం...' అను మాధుచ్ఛందస ఋఙ్మంత్రముచే (సూక్తము 1,

మండలము 6) మరుత్పతియైన యింద్రుని స్తుతించెను. దేవేంద్రు డున్నపాటున మేఘముల నాకసమందు సమకూర్చుట జూచి నాయన సంతుష్టవదనుడయ్యెను.

ఆ మేఘములకు గొప్ప వర్షము రావచ్చునని భయపడి వజ్రమ్మను వెంట నిడికొని యెచ్చెమ్మ పురములోనికి బోయెను. కొండమీది వారుగూడ కొందఱు దిగిరి. కొందఱింకను నాయన క్రోధవాక్యవలన భూమికి ముప్పు వాటిల్ల కుండుటకు మౌనముద్రాంకితులై, కన్నులు మూసికొని కూర్చున్న మహర్షి యెట్టి యనుగ్రహోపాయమును జేయునో చూడ వేడుకతో స్కందగుహయొద్దనే యుండిరి. ఆగ్రహించిన నాయనయే క్రోధాగ్ని ఫలించు లోపున భూమిని శాంతింపజేయు నుపాయమును జేసెనని వారికి తెలియదు. అట్టి తఱి విడువబడిన క్రోధాగ్ని నిష్ఫలమగునా ? కాజాలదు. కాని, ఫలమునిచ్చు భగవానుని శాసనము ననుసరించి ఫలరూపమును బొందుట తథ్యము. ఇట్లుండ, యలముకొనిన మేఘములు కొద్ది నిముసములలోనే ఐంద్రాస్త్రముచే చీల్చబడి, తమ గర్భములందు బంధించి యుంచుకొనిన జలమును ధారాపాతముగా గ్రక్కజొచ్చెను. వర్షమునకు స్కందగుహ యొద్ద భక్తులందఱు గుహ లోపలకు పోయిరి. మహర్షి మాత్ర ముల్లాసముతో కన్నులు విచ్చి, యురుములు మెఱుపులతో ధగద్ధగాయమానమై యింద్రప్రభను సువ్యక్తముజేయు నాకసమువంక మాటిమాటికి చూచుచు వర్షమందే నిలబడి యుండెను. ఏ భగవంతుడు నాయనయొక్క ఋఙ్మంత్ర స్తుతికి వర్షరూపమున ఫలమునిచ్చెనో, ఇంద్రుడైన ఆ భగవంతుడు వర్షముచే భూమికి మంగళము గూర్చుటకు తన యస్త్రముచే మేఘములను చెండాడుచు, సంహారము లేనిదే నిర్మాణ ముండదని నిరూపించెను. చండప్రచండమై యొకచో దోచిన అతని శక్తి మంగళప్రదమై యింకొకచోట వ్యక్తమగుట మహర్షియు గమనించి, యా భగవంతుని వైభవమందే బుద్ధి నుంచి, మనస్సున నిట్లు తలపోసెను: "భువన సంక్షయమైన కోవెల రథముపై నాయనచే విడువబడిన క్రోధాగ్ని పిడుగు రూపమునబడి, భువనము రక్షింపబడినచో బాగుండును."

వెంటనే శ్రీ రమణుని తలంపు నింద్రు డామోదించినట్లు క్షేత్రరథముపై పిడుగుపడి, దాని నార్ప శక్యముగాని విధమున క్రిందనుండి మీదవఱకు నేకజ్వాలతో దహింపజొచ్చెను. పిడుగు శబ్దము విని మహర్షి యటు జూచి 'బ్రతికితి'మని యుచ్చరించి, చప్పుచప్పున వర్షమందే కొండ దిగి, చింతచెట్టు క్రింద కూర్చుండి వర్షమునకు సంతసించుచున్న నాయనను కలసికొని, రథము దగ్ధమగుట జూపెను. అది చూచి నాయన 'యేమి యిట్లయ్యె'నని ప్రశ్నించగా, రమణుడంతయు విశదపరచి "క్రోధమిట్లే విచక్షణను గప్పును. భూమియందు మీరు విడిచిన యగ్ని భూమి కాపద గూర్చినచో, మన కాపద కాదా ? మీరు రథముకొఱకు వగవవలదు. జీర్ణమైనది నశించుట క్రొత్తదాని నిర్మాణముకొఱకే కదా !

కనుక దానికై మీరు చూడక, క్రోధమున కిటుపైని వశముగానని ప్రమాణము చేయుడు. ఎవరేమన్ననుసరే, మిమ్ములను గాదనునట్లుండ గోరుదు''నని నాయన నడిగెను. నాయన గురునకు ప్రమాణమొనర్చెను. కాని, తనవలన గురుని మనస్సు బాధచెందెనని దుఃఖించెను. అప్పుడు కరుణామయుడైన రమణుడు నాయన నోదార్చి 'యీ దినము నిమిత్తము లెట్లున్నను, జీర్ణరథము నశించుట యీశ్వరసంకల్ప' మని పల్కుచు, నాయనను విరూపాక్ష గుహలోనికి తీసికొనివెళ్లి, యమ్మ నడిగి పెరుగు అన్నమును నాయనకు స్వయముగా తినిపించెను. అప్పుడు నాయన చిత్తము శాంతించి, భక్తియుక్తమయ్యెను. మహర్షి వెంబడినే దిగివచ్చిన దైవరాతు డంతయు జూచి యిట్లు తలచెను: 'నాయన తలపెట్టిన రచనమే నాటి యద్భుతములకు మూలకారణమై, కోవెలలోని యీశ్వరుని క్రొత్తరథ వాహనమునకు హేతువైనట్లే. జగదీశ్వరు నెఱిగించు సాధనోపాయములకు క్రొత్త రూపము కల్పించు హేతువయ్యెను.'

ఓం

రెండవ ప్రకరణము

# ‘శ్రీ రమణగీతా’ రచనము

ఇళ్లు కాలిపోవునప్పుడు సాధారణముగా ‘పరశురామప్రీతి’ యగుచున్నట్లు పల్కుదురు. ఇది వెటకారముగా ధ్వనించినను, నవ్యాకృతులకొఱకు జీర్ణ రూపములు నశించుట యీ ప్రీతి కర్థమై, మానవబుద్ధి నొకప్పు డిట్లే సంస్కరించి భువనమందు నూత్నయుగ ప్రవేశముగావించిన పరశురామావతార తత్త్వమును సూక్ష్మబుద్ధిగలవారికి స్మరింపజేయుచుండును. ఈ విధముగా పరిశీలించినప్పుడు నాయన నిర్మింపదలచిన నూత్నగ్రంథమునకును, దాని నిర్మాణముకొఱకు చేయబడిన ఒకానొక ప్రయత్న సందర్భములో క్షేత్రరథము కాలిపోవుటకును గల సంబంధము స్పష్టమై, కార్యకారణములు మనకు విశదమగును.

‘రమణగీత’ యను పేరుతో నిర్మింపబడుచున్న యీ నూత్నగ్రంథమం దంతవఱకు ముగిసినవి నాలుగధ్యాయములు. వానిలో తొలి యధ్యాయము రమణగణపతుల వాదముగా కూర్చబడినను, నిజమున కది యరుణాచల శాస్త్రియను నొక శంకరమత పండితునకును, నాయనకును జరిగిన వాదమని యిదివఱ కుదహరింపబడెను. రెండవ యధ్యాయమందు హృదయమును గుఱించి శ్రీ రమణుడు స్వయముగా రచించిన శ్లోకములోని గంభీరార్థము విమర్శింపబడి, యందు సూచింపబడిన మార్గత్రయము స్మరింపబడెను. మూడవ యధ్యాయములో 1. మనుష్యుడీ సంసారమున జేయదగిన కార్యమెద్ది? 2. సంగ్రహముగా తన్ను తా తెలిసికొను సాధనమెద్ది? 3. సాధకున కెంతవఱకు నియమము లుపకరించును? 4. ఆత్మవిమర్శచే గలుగు సిద్ధి మంత్రజపముచే గలుగునా యను నాలుగు ప్రశ్నలు దైవరాతు డడుగగా, మహర్షి యొసగిన యుత్తరములు సమకూర్చబడెను. నాలుగవ యధ్యాయములో ‘అహం బ్రహ్మాస్మి’ యను భావమే జ్ఞానము కాజాలదనియు, భావవృత్తి యాత్మతో నైక్యము జెందు వఱకు నభేదము సిద్ధించదనియు నిరూపింపబడెను.

ఈ నాలుగధ్యాయములలో రమణుడు నాయన కాదియం దుపదేశించిన తపస్సాధనమే యింకొక విధముగా రెండవ యధ్యాయమందు వచింపబడి, స్వరూపతత్త్వమం ‘దహమ్మహ’మ్మను భాసమానము సహజమై యున్నదనియు, సహజమైన యీ లక్షణమును బొందుటకు మూడు మార్గములున్నవనియు చెప్పబడెను. ఈ ‘యహం’ భాసమానమే లోకములను బ్రకాశింపజేసి లోకాను

భవము నిచ్చునప్పుడా యనుభవమున కాకృతి మూలమని దోచుటయే యహంకృతి యని (అనగా నాకారమందు కర్తృత్వాభిమానము) విశదమగును. మూడవ యధ్యాయములో మొదటి మూడు ప్రశ్నలు సాధారణములైనను, నాలుగవది మంత్ర జప మార్గమును నిరసించు నసంగత జ్ఞానసాధకులకు జవాబగును. మఱియు నాయన నొకప్పుడు విమర్శించినవారి కిది కనువిప్పగును. అట్లే మహానుభావుడైన శంకరాచార్య స్థాపితాద్వైత సిద్ధాంతము నవలంబించు పండితులు జ్ఞానసాధన కుపాసన మవసరము లేదని తలచు దుస్థితిని గల్పించినట్లు ప్రథమాధ్యాయము నిరూపించుచున్నది. ఈ పండితుల పల్కులే మన దేశమందు మతాధారములై యొప్పుచున్నందున సంఘమందు వక్రములగు నాలోచనా వాసనలు బలీయములై పెడబుద్ధికి కారణములయ్యెను. మఱియు నాచరణశూన్యులైన నిష్కామయోగ ప్రవక్తలు, ప్రేమారాధకులు నధికులై 'శ్రీకృష్ణార్జున సంవాద' మనబడు శ్రీ భగవద్గీత కొక్కొక్క రొక్కొక్క భాష్యకర్తయగుచు నీ గ్రంథమున కొక విధముగా తీరని యనర్థము తెచ్చిపెట్టి, తుదకు దుష్టులు, నసత్యవాదులు, హింసాపరులు సైతము తమ నీచత్వమును సమర్థించుకొనుట కీ గ్రంథమును శరణు పొందుచుండిరి. ఈ గ్రంథములోని శ్లోకముల వరుసను సరిదిద్దినచో నిన్ని భాష్యము లనవసరములై పండితుల కేకాభిప్రాయము కుదురవచ్చును. కాని, యట్టి సంస్కారమున కొల్లరు. కారణమేమనగా, పెక్కుమంది కప్పుడు జీవితభృత్య మిప్పుడు ముట్టినట్లు ముట్టదు. కావుననే నాయన వేఱొక గీతారచనమును మొదలుపెట్టి యీ యనర్థముల నన్నింటిని తొలగింపదలచెను.

ఈ 'గీత'యు రమణభగవానుని వాణినుండి వెడలినదగుటచే భగవద్గీతయే యగును. అట్లయినను, దీని ప్రత్యేకత ధ్రువమగుటకిది 'రమణగీత' యనబడెను. దీనియం దుపదేశించువాడొక్కడైనను, పృచ్ఛకులనేకులు. పరశురాముడుంచిన తేజముచే ప్రేరేపింపబడి యీ యుత్కృష్టగ్రంథమును నాయన నిర్మింపదలచినను, నిది 'భగవద్గీత'కును, బ్రహ్మసూత్రములకును మించునను విషయములో కొందఱు పండితులు సందేహింపజొచ్చిరి. ఇట్టి సందేహములను నివారించుటకే కాబోలు, పూర్వము శ్రీ రమణుని వాణి యుపదేశ రూపమున చలించినప్పు డీశ్వరు డా యుపదేశ వాణి వలన భువనమందు సూక్ష్మ బుద్ధి చలన ముదయించెనని నిరూపించుటకే రథసామ్యమును సంకల్పించెనో, ఆ రథ సామ్యమునే యిప్పుడును సంకల్పించి రమణగీతోపదేశముల వలన జీర్ణవాసనలతో గూడిన భువనరూప నాశనమును నవ్యభావ సంసర్గమగు భువనోదయమును నిరూపించెను. అప్పుడు రథ చలనమునకు నాయన వాక్కెట్లు నిమిత్తమయ్యెనో, యిప్పుడు నట్లే నాయన వాక్కే నిమిత్తమయ్యెను. అప్పుడు వాక్కునందు మరకత శ్యామాంబిక సూక్ష్మ శక్తి నుంచగా, నిప్పుడు పరశురాముడుంచెను. అయితే, వాక్కునందు జ్వలించిన

క్రోధాగ్నికి పూర్వము నాసికలో కారకుడైన పూజారివలెనే, యిప్పుడు భగవాన్ శ్రీ రమణునియొద్ద పూజారివలెనున్న ఫలనిస్వామి కారకుడయ్యెను.

ఈ ఫలనిస్వామి పురజనుల కాదినుండియు నప్రియుడు. వీని పరుష వాక్యములకు రమణునిచెంత ప్రేమాభిమానములతో చేరిన రెండు కుక్కలుకూడ నసహ్యించుకొనెను. ఆ కుక్కల నగౌరవపరచి బాధింపరాదని రమణుని యాజ్ఞయైనను వాడు లక్ష్యపెట్టనందున నొకటి యెక్కడికో వెళ్లిపోయెను. రెండవది యాత్మహత్య గావించుకొనెను. రమణుడు సహించుకొనుకొలది వీని గర్వ మధిక మయ్యెను. కాని, క్షేత్రరథము కాలిపోయినప్పటినుండి వీనిని తిట్టనివారు లేక పోయిరి. దానితో గర్వము తగ్గెను. ఇంక నాయన వాగస్త్ర ప్రభావమును జూచిన నాటినుండి వీడు నాయన యెదుట బడుటకు గూడ భయపడుచు, స్కందాశ్ర మమున నొక దాసునివలె వినయముతో మసలజొచ్చెను. మఱికొద్ది దినములకే వీడు మృత్యువువాతబడెను. వీని సేవాఋణము దీర్చుకొనుటకు వీని యంత్య కాలమందు మహర్షి వీనికి ముక్తినీయ యత్నించెను. కాని, వీని దుష్టబుద్ధి దాని నసాధ్యము జేసెను.

విరూపాక్షగుహయందు గాలి లేక నాయన కక్కుర నుండుట మూడునాలుగు దినములకే కష్టమనిపించెను. నాయన కడకు వచ్చు పృచ్ఛకు లిక్కడి తాపమును భరించలేక, యెండలు తగ్గువఱకు రమణ గీతారచనము నాపుజేయగోరిరి. విధిలేక నాయన యొప్పుకొనెను. దాని కొప్పుకొనినప్పుడు విరూపాక్షగుహయం దుండి తాను బాధపడవలసిన పని యేల యని నాయన తలచి విశాలాక్షమ్మను, వజ్రమ్మను చెన్నపురము పంపివేసి, తాను మహర్షితోపాటు స్కందాశ్రమమున నుండుటకు వెళ్ళిపోయెను. వేసవిలో విరూపాక్షగుహవాస మనుకూలముగాదని మహర్షి కనుభవముండియు నాయన కేల చెప్ప మరచెనని కొందఱు తర్కించుకొని, రథము కాలుట కీశ్వరుడే కారణములను కల్పించెనుటకే మరపొక్కటియే ఋజువగునని నిశ్చయించుకొనిరి.

నాయన స్కందాశ్రమము చేరిన పిదప కొందఱు పండితుల కోర్కెపై యుపాసనకు తోడ్పడు దశమహావిద్యలు సులభముగా బోధపడుటకు సూత్రము లను రచింపబూనెను. నాలుగువందల డెబ్బదియైదు సూత్రములతోగూడి యత్యంత సులభగ్రాహ్యమగు నీ గ్రంథమును నాయన మూడు దినములలో ముగించి పండితులకు ప్రీతిగూర్చెను. శ్రీ రమణ గీత తొలి యధ్యాయమందు జ్ఞానప్రాప్తి కవసరమని పేర్కొనబడిన ఉపాసన మెట్లుండవలెనో శాసించు తంత్రశాస్త్ర సారమే దశమహా విద్యలైనందున నీ సూత్రగ్రంథము రమణగీత కనుబంధము కాదగును. ఇది పూర్తియగుసరి కెండల తీవ్రత తగ్గినందున రమణ భక్తులు స్కందాశ్రమమునకే సాయంత్రము నాలుగుగంటలకు వచ్చుట కంగీకరించి నాయనను రమణగీతా

రచనముకొఱకు ప్రేరేపించిరి అందువలన 9-8-1917వ తేదీనుండి యీ కార్యము తిరుగ ప్రారంభింపబడి, రమణ సన్నిధియందే ప్రశ్నలు వడియగట్టబడ జొచ్చెను. కపాలిశాస్త్రిని వెంటనిడుకొని విశాలాక్షమ్మయు చెన్నపురమునుండి వచ్చెను. ఆమె పుత్రికతో గూడి యెచ్చెమ్మాళ్ యింట బసచేసెను. 25-8-1917 తేదీనాడమృతనాథుని ప్రశ్నతో నీకార్యము ముగిసెను. కాని, యీ ప్రశ్నోత్తరముల నధ్యాయముల క్రింద విభజించు కార్యము పూర్తిజేయబడలేదు. కారణమేమనగా, నీ ప్రశ్నోత్తర కాలములో పురమందు 'రమణానంద విలయ'మను నొక సంస్థకు జరుపబడిన వార్షికోత్సవములకు నాయన యధ్యక్షత వహింపవలసి వచ్చెను. ఈ యుత్సవములు 1917 సం॥ ఆగష్టు 18,19 తేదీలలో రెండు దినములు పండితోపన్యాసములతో బహుజనాకర్షణీయముగా జరుపబడెను.

ఈ యుత్సవములకు చెన్నపురమునుండి వచ్చిన రమణభక్తులలో 'వాగ్మి' యను నుపనామమును ధరించి వచ్చిన పండితుడొకడు. ఇతడే కపాలిశాస్త్రి. ఇతడు నాయనవలె సంస్కృతమున మంచి వక్తయైనను, ఇతని ప్రవచన మదివఱకు నాయన వినలేదు. తొలినా డితడు 'ప్రాణము' గుఱించి తమిళమున నుపన్యసించగా, నాయన సంతసించి తత్సారమును సభ్యులకు గీర్వాణభాషలో నివేదించెను. అటుపిదప పెక్కుమంది యానాడు, మఱునాడు గూడ నుపన్యసించి పిదప నుపసంహార సమయమందు వాగ్మి వేడగా నాయన తపస్సును గుఱించి గంభీరముగా నుపన్యసించెను. ఈ యుపన్యాసమును తమిళమందిచ్చి, దాని సారమును వాగ్మి ముఖమునుండి సంస్కృతభాషలో నాయన వినగోరెను. గురుని యుత్సాహమును గ్రహించి, వాగ్మి తన యావచ్ఛక్తితో నుపన్యసించి, తుదియందు 'నా ప్రవచనములోని దోషములు నావి, గుణములు నా గురువు' వని వినయముగా పల్కి ముగింప, వానిని నాయన కౌగిలించుకొని 'నీయందున్న సుగుణములు వెల్లడియయ్యె'నని ప్రత్యుత్తరము పల్కెను.

ఈ రెండుపన్యాసములు బహు ముఖ్యమైనవగుటచే పాఠకుల ముదము కొఱకు వాటి సార మాంధ్రభాషలో దిగువ నీయబడెను:-

<u>ప్రాణమును గుఱించి వాగ్మి ప్రవచనము</u> - (18-8-1917)

ప్రాణము లేదనియు, నెనిమిదనియు, పదకొండనియు శ్రుతులందు వేర్వేఱుగా చెప్పబడెను. ఇవియన్నియు పుట్టినవిగా వచింపబడి, వీటిలో శ్రేష్ఠప్రాణముగూడ జనితమైనదానివలె కీర్తింపబడెను.

చలన స్వభావముతో ప్రాణమంతటను గలదు. ప్రాణములతో గూడినవైనను, స్థావరములకు మనస్సు లేదనిరి (అనగా ప్రత్యేక చలన లక్షణము - దీనిని చలనమందు చంచలత్వమందురు). బాహ్యదృష్టికి స్థూలమైన శ్వాసరూపమే ప్రాణమగును. దానియందు వేడిమి యొక గుణమై, యనిర్వాచ్యమగు శక్తి

విశేషముగా తోచును. ఆ వేడిమి యణుమయమై, ప్రాణముయొక్క రూపమును నిరూపించును. ఇంద్రియములు చలించుటకా రూప మవసరము. ఆ రూపమున కింద్రియములుగూడ నవసరమగుచున్నవి. చలనాత్మకములైనవాటిలో నింద్రియములకంటె మొదటిదగుటవలన ప్రాణము జ్యేష్ఠమనబడెను. దాని భావముచే మిగిలినవి తెలియబడుచు, నభావముచే తెలియబడకున్నవి (అనగా మూలవృత్తి రూపము ప్రాణమనియు, దానియం 'దహ'మ్మను నభిమానభావము గలిగినప్పుడా వృత్తిరూపము మనస్సనియు వ్యవహరింపబడుచున్నట్లు పాఠకులు గ్రహించ వలెను).

ప్రాణవ్యాపారము నాడులందు విషమైనప్పుడు సకలేంద్రియములకు (కొట్టబడిన ప్రాణముచే) నాశనము తటస్థించుచున్నది. ఇంద్రియములందున్న వ్యాపారములో క్రియాశక్తి ప్రాణమనియు, జ్ఞానశక్తి మనస్సనియు వ్యవహరింప బడును. ప్రాణమొక్కచో నున్నను, దీపమువలె శరీరమంతటను (సూక్ష్మస్థూల నాడులద్వారా) వ్యాపించగలదు. అట్లు వ్యాపించి ప్రాణము తన గమనముచే శరీరమును, మనస్సునుగూడ మన గురువువలెనే శాసించుచున్నది. గతి ప్రాణము యొక్క స్వరూపము. గతికి శక్తియను నర్థము తగదు (గతి లేదా చలనమనునది శక్తియం దొక మహిమ యగునుగాని చలనమే శక్తి యనరాదు. ఈ చలన మహిమను ప్రాణముగా గైకొనవచ్చును. దానికి శక్తి యాశ్రయమమగునని భావము).

ఆచార్యు డుత్పన్నమైన శ్రేష్ఠప్రాణమే ముఖ్యమనెను. ఎందువల్లననగా, బింబములను గ్రహించుట కదియే ముఖ్యస్ఫూర్తి స్థానమగుచున్నది. ప్రాణముతో గూడిన శరీరమం దాత్మయొక్క కాంతిరూపమే మనస్సు యావత్తు కాగలదు (అనగా పైన చెప్పబడిన విషయ జ్ఞానశక్తి). ప్రాణచలనము వలన గలుగు ముఖ్యవృత్తి యనుభవము. (ఇదియు వృత్తిజ్ఞానమే. వృత్తియం దభిమానమున్నప్పుడీ జ్ఞానము మనశ్శక్తియై విషయ-విషయభేదము గలది యగును). ఆ యనుభూతికి శ్రవణ మొక్కటియే సాధనము (ప్రాణవ్యాపారానుభవమునకు). ఆ శ్రవణమే మఱల సాధ్యమగుచుండును.

మనఃప్రాణ శరీరములు పరస్పరాధారములు. సంస్కరింపబడిన ప్రాణము శుద్ధికొఱకు శుద్ధమగును. ప్రాణమనుభవింపబడని సమయమందు మనస్సునకు ప్రభయుండదు. జీవుడు (అనగా మనోవృత్తి రూపుడు) తన యిష్టానుసారము పైకి పోజాలడు. మఱియొక డెవడో జీవుల నుద్ధరించుటకు (యథార్థ జ్ఞానము నిచ్చుటకు) యత్నించుచుండును. ఆ ప్రవృత్తియం దాసక్తిగల జీవుడు తన ప్రాణమును శుద్ధిచేసికొనును. ముఖ్యప్రాణమే పరాశక్తి యని తెలియుట సిద్ధి. ఈశ్వరుని తపస్సే ప్రాణముయొక్క ఆదిమ స్వరూపమగుటచేత, అట్టి ప్రాణము తపస్సునుండి జనించినట్లు చెప్పరాదు. ముఖ్యప్రాణ మనునది ద్వితీయ రూపము. ఉత్పన్నమైన దిదియే యగుచు, భూతముల యొక్క సారమగుచున్నది.

ఈ రెండవ రూపమైన ప్రాణవృత్తి యితర ప్రాణములగును. ఆ యితర రూపములగుటయే తృతీయరూపమును బొందుట. ద్వితీయ రూపమును ప్రథమ రూపమందైక్యము (అనగా పరాశక్తి రూపమును మూలశక్తి స్వరూపమం దైక్యము) చేయుటను సాయుజ్యమందురు. అదియే ముక్తి, యదియే సంపత్తి. అట్టి సాయుజ్యమందే మంత్రలక్ష్యము యొక్క సిద్ధి గలదు. కనుకనే పావమానవి మంత్రము 'యత్రానందాశ్చ మోదాశ్చ ముదః ప్రముద ఆసతే ! కామస్య యత్రాప్తాః కామాస్తత్రమా మమృతం కృధి' యని చెప్పుచున్నది.

## తపస్సును గురించి నాయన ప్రవచనము

19-8-1917

"తైత్తరీయములో సాధనమే తపస్సని భృగుమహర్షి వాక్యగా చెప్పబడెను. ఇతర శ్రుతులందును సాధనమే తపస్సుగా నాచరింపబడినట్లు కన్పట్టును. దీనికే పాతంజలియోగమని పేరిడెను. తపశ్శబ్దమునకు జపమనునది నామాంతరముగా వాడబడుచున్నను, నది సమన్వయము కానేరదు. ఉపనిషత్తులలో చెప్పబడిన యర్థమే మనకు ముఖ్యము. తపశ్శబ్ద మాలోచనమను పదమునకు ధాత్వర్థముగా నున్నది. ఇంక సాధనమను భావమును గైకొనినప్పుడెట్టి యాలోచన సాధనమువలన సర్వము ప్రాప్తమగుచున్నదో, అట్టి సాధన మన్ని సాధనములకంటె నుత్కృష్టమై తపస్సుగా నెంచబడుచున్నది.

తపస్సువలన కేవల బ్రహ్మప్రాప్తియేగాక, లోకసిద్ధులు గూడ ప్రాప్తించును. 'ఆత్మనాడి'యను నొక్కదానియందు వృత్తిని గోపనముచేయు సాధనమే నిజమగు నాలోచన మనబడును. అట్లు గావింపబడిన వృత్తి యితరముగా దేహమందు విక్షేపము జెందదు. విస్మృతమైనదాని నన్వేషించునప్పు డాలోచనమెట్లుండునో, అట్లుంచుటయే దాని నిజరూపమున నుంచుట. దానినే తపస్సందురు. అవిచ్ఛిన్నమైన ఆలోచనయు తపస్సేయగును. ఈ రెండు మార్గములందు తపస్సుచే సాధింపదగినది నిరుపాధిక విమర్శస్థితి (తపస్సను సాధనకు సాధ్యవస్తువు తపస్సేయగును. ఎట్టి యాలోచనవలన సాధన, సాధ్యము లేకమగునో, అట్టి యాలోచనయే తపస్సగునని భావము).

సంకల్పములయం దుపాధిసంబంధమగు విషయగ్రహణమున్నది. కనుక తపస్సున కవి విరళమును గలిగించును. ఈ విషయగ్రహణముచే ఘనీభవించిన మనస్సు జడత్వము పొందుచున్నది. ఆలోచనచే బుద్ధి సూక్ష్మత్వమును బొందును. కవులు మొదలగువారి కాలోచనము శరణ్యము. అందువల్లనే వాల్మీకి 'తప' యని రామాయణమును మొదలిడెను. ఆలోచనమను తపస్సును స్థిరముజేసికొనుట కుపనిషత్తులలో లక్ష్యము లుపదేశింపబడెను. ముఖ్యలక్ష్యములు మూడు. అవి యేవనగా–సంవర్గవిద్య, ఉపకోసల విద్య, వైశ్వానర విద్య.

1. సంవర్గ విద్య:- శకటమునకు దిగువను రైక్వుడను వాడుండెననియు, నతని మహిమ నెవరికిని తెలియదనియు, నతనితో జనశ్రుతికి వాదము గలుగగా వాదమందతడు సంవర్గ విద్య నుపదేశించెననియు నుపోద్ఘాతము చెప్పబడెను. ఇది లాక్షణిక భాష. (శకటమనగా శరీరమనియు, దానికి దిగువను మూలాధార మందున్న అగ్ని రైక్వుడనియు, జనశ్రుతియనగా శ్రవణబుద్ధియనియు పాఠకులు గుర్తించుకొనవచ్చును.) ప్రాణగతిని చూచుటవలన ప్రాణమథనమగుననియు, మథనమువలన కుంభకమగుననియు, కుంభకమువలన శక్తి కలుగుననియు నత డుపదేశించెను. కుంభకము కానట్టి ప్రాణము విక్షేపము చెందును. శక్తి ప్రాప్తికి మూలస్థానము హృదయమని యెఱుగవలెను. సూక్ష్మనాడు లిచ్చటనే ప్రవేశించును. స్థూలనాడులు శిరస్సున బ్రవేశించును. సూక్ష్మనాడులవలన రోగ నివృత్తి, యమృతప్రాప్తి కలిగి, 'యహం బ్రహ్మాస్మి' యనుభవము గూడ సిద్ధించును. ఈ విద్యయందు సాధకుడు పాషాణము వలె నుండక తన సాధనను గ్రహించు చుండవలెను. శ్రీ మహర్షి యొక్క 'హృదయకుహర' శ్లోకములో 'చిన్వతా' వఱకు నుపదేశింపబడిన దట్టి యాలోచనను గుఱించియే యగును.

2. ఉపకోసల విద్య:- జాబాలికి త్రేతాగ్ని ప్రసాదమువలన లోకజ్ఞానము గలిగెను. అక్షిపురుష విద్య దీని స్వరూపమును ప్రతిష్ఠించును. చూపుధర్మమువలన నక్షికి, సూర్యునకు నేకత్వము సంభవించును. అంతరక్షి కుడినేత్రము, బాహ్యాక్షి యెడమనేత్రము. ఇది రహస్యము.

3. వైశ్వానర విద్య:- ఇది ఛాందోగ్య శ్రుతిలోనిది. అభిమానరహితమగు నాత్మ నుపాసించుట దీని క్రమము. 'అహమ్మహ'మ్మని యేది స్ఫురించునో అది రాజువలె ముఖ్యమైనది. ఈ యహంకృతి హృదయమునుండి వెడలుచు, శిరస్సున ప్రవేశించినప్పుడు బ్రహ్మాండసంబంధము, స్థూలవిషయజ్ఞానము గలుగు చుండును. అందువలన దానిని హృదయమందే లీనము చేయవలెను. మహర్షి యొక్క శ్లోకములో 'మజ్జతావా' అనునది వృత్తియొక్క లయమునే చెప్పును. ఛాందోగ్యములో వైశ్వానర విద్యకు తరువాతనే పంచాగ్ని విద్య చెప్పబడెను. పంచప్రాణములలో ప్రతిదానికిని పూర్వ 'మహం' వృత్తి యున్నది. కనుక తొలుత వైశ్వానర విద్య యుపదేశింపబడెను. ప్రాణము, దృష్టి, 'యహం' వృత్తి - మూడింటికి జెందిన యుపాసనలు ముఖ్యమైనవి.''

శ్రీ రమణానంద నిలయ వార్షికోత్సవము లీ విధముగా ముగిసిన మఱి యాఱు దినములకు రమణగీతా సంబంధమగు ప్రశ్నోత్తరములు ముగిసెను. అటుపిమ్మట దశమహావిద్యలకు రచింపబడిన సూత్రముల గుఱించి నాయన నుపన్యసింపవేడిరి. ఒక్కొక్క విద్య కొక్కొక్క యుపన్యాసము చొప్పున పది దినములు పది యుపన్యాసములను నాయన యిచ్చెను. తుది దినము సభవారు నాయనకు

కొంత లాంఛనధనము నీయబోవుచుండగా, నరుణాచలక్షేత్రమందు బహు కాలమునుండి శ్రీ రమణునివలె స్తుతిపాత్రుడైయున్న పండితుడు, యోగి, మంత్రోపాసకుడునగు శేషాద్రిస్వామి యీ ప్రవచనము లన్నింటిని శ్రద్ధతో విని నాయన ప్రతిభకు సంతోషించినవాడై, తటాలున లేచి, యా లాంఛనధనము నందుకొని, దానిని తన హస్తములతో నాయన కర్పించి, నాయనను మెచ్చుకొనెను.

అటుపిమ్మట-అనగా సెప్టెంబర్ రెండవ వారములో - రమణగీతా ప్రశ్నోత్తరములను నాయన యధ్యాయములుగా విభజించెను. భగవద్గీతయందు వలెనే పదునెనిమిది యధ్యాయములతో కూర్పబడిన యీ గ్రంథమంతయు శ్రీ రమణుని 'హృదయకుహర' శ్లోకమునకు వ్యాఖ్యానప్రాయమగుచున్నందున, నాయన యిదివఱ కీ శ్లోకమునకు వ్యాఖ్యానము వ్రాయదలచిన తలంపే యిట్లు వెలసెనని చెప్పవచ్చును. అయిదు, ఆఱు, పదునాఱవ యధ్యాయములు భగవంతునిచే స్వయముగా నుపన్యసింపబడెను. పదునెనిమిదవ యధ్యాయమున రసవత్తరమై మనోహరమగు గమకములచే రూపొందిన రమణస్తుతులున్నవి. మిగిలిన యధ్యాయములు 36 ప్రశ్నోత్తరములతో నిబద్ధములయ్యెను. అందు విశాలాక్షమ్మ ప్రశ్నలు రెండున్నవి. గ్రంథమున కుపోద్ఘాతముగా శ్రీ రమణుడు స్వయముగా కూర్చిన 'అరుణాచల' స్తుతి చేర్పబడెను. ఈ విధముగా నీ గ్రంథ ముమాసహస్రమువలె రమణగణపతుల యుభయకృతమగుచున్నది. రమణుడు శాస్త్రప్రమాణములనుగాని, యనుమానపూర్వకమగు తర్కమునుగాని యాధారము జేసికొనక, కేవలము అంతర్దృష్టిచే స్వానుభవమునుండి ప్రత్యుత్తరముల నిచ్చెను. అందువలన నీ గ్రంథ ముపనిషత్తులకు మించినదగును. 300 శ్లోకములచే నిబద్ధమై యిది సకల శాస్త్రసారము, సజ్జనసేవ్యమునగుచు, హృదయకల్మషనాశిని యగుచున్నది.

★★★★★

౬౦

మూడవ యధ్యాయము

# సికిందరాబాదావాసము, తపశ్శక్తి పాక విశేషము

క్రీ.శ. 1917వ సం॥లో వచ్చిన దేవీ నవరాత్రోత్సవములకు శ్రీ రమణగీతా రచనము ముగింపబడి, దానికి 'చత్వారింశత్', 'గురుగీతము', 'విభక్త్యష్టకము' అను మూడనుబంధములుకూడ చేర్చబడెను. అదివఱకు శ్రీ రమణుని స్కందాంశసంభూతునిగా నాళుధారను స్తుతించిన శ్లోకములకు మఱికొన్ని చేర్చి మొదటి యనుబంధము నాయనచే కూర్చబడగా, దైవరాతునిచే మూడవది రచింపబడెను. రెండవ యనుబంధమైన 'గురుగీతము'ను నాయన తన శిష్యుడైన ప్రణవానందము (సర్వేపల్లి వరసింహము) యొక్క ప్రీతికొఱకు తెలుగ రచించినను, నిది సాటిలేని గీతమగుటచే 'రమణగీత' కలంకార భూషణమై యొప్పునని పెక్కుమంది నిశ్చయించినందున నిదియు ననుబంధముగా చేర్చబడెను. అట్లయినను, నిర్గుణ భావనారుచిరమై, యద్భుతార్థ స్ఫురితమై, నిరంతర మననయోగ్యమై యొప్పు నీ 'గురుగీతము' ప్రత్యేక ప్రకాశము బొందుటకుగూడ తగియున్నదనుటలో నతిశయోక్తి లేదు.

ఈ గ్రంథనిర్మాణమును గుఱించి భక్తు లిట్లు గానము చేసిరి:

శ్లో॥ "ఏవమధ్యాత్మ కామానాం పాకభేదానుసారతః।
రోచనా రుచిభిన్నానాం సామరస్య పరిష్కృతా॥"

శ్లో॥ "మహర్షిణోపదిష్టేయం నిత్యమాత్మని తిష్ఠతా।
అధ్యాత్మదృష్ట్యా సందోహం సందేహానాం వ్యపోహతా॥"

శ్లో॥ "శ్లోకానాం త్రిశత్యా: వాణ్యా గీర్వాణ్యా కవికుంజరః।
అష్టాదశభిరధ్యాయైః గీతామేతాం నిబద్ధవాన్॥"

(అర్థము:- అధ్యాత్మము నిశ్చయించువారి యొక్క పాకభేదానుసారముగా వారి వారి కిష్టమగువాటిని సమరసమొనర్చి సందేహనివారణము జేయుచు, నిత్యా మాత్మనిష్ఠాపరుడై యధ్యాత్మ దృష్టిగలిగిన మహర్షిచే నుపదేశింపబడిన వాటిని కవికుంజరుడు 300 శ్లోకములలో సంస్కృతమున రచించి, 18 అధ్యాయములుగా విభజించి, రమణగీతను నిబద్ధమొనర్చెను.)

రమణగీత ప్రాశస్త్యమును గుఱించి కవియే యిట్లు గానము చేసెను:

శ్లో॥ "గళంతీ గంగేయం విమలతర గీతైవ మహతో।
నగాధీశాచ్ఛ్రీమద్రమణముని రూపాజ్జని మతీ।
పథేవాణీ రూపాద్గణపతికవే ర్భక్త హృదయం।
సముద్రం సంయాతి ప్రబల మలహారిణ్యనుపదం॥"

(అర్థము:- అతి నిర్మలమగు రమణగీతయను గంగా ప్రవాహము శ్రీ రమణుడను నత్యున్నత పర్వతరాజమం దుద్భవించి, గణపతికవి వాగ్రూప మార్గమున పదే పదే బహు కల్మషనాశినియై ప్రవహించుచు, భక్తహృదయార్ణవములో సంగమమగును.)

నాయన నిజమునకు రమణగీతా రచనముచే నుపనిషత్కర్తయు, దశమహా విద్యల వ్యాఖ్యాన రచనముచే సూత్రకర్తయు నయ్యెననుట నతిశయోక్తి కాజాలదు. ఆ సమయమందు పూర్వ ముమాసహస్ర రచన ఫలముగా వృద్ధియైనట్లే, రమణ గీతా రచన ఫలముగా నాయన కాంతర్య తేజస్సు వృద్ధిబొంది, యేకాంతవాసము గోరజొచ్చెను. అమ్మకుకూడ పుర మధ్యమందుండుట రుచింపకుండెను. మహర్షి యొద్దనున్న దైవరాతుడు మహర్షి సన్నిధిని ధ్యానమొనర్చు కష్టము నెఱిగికొని, "అక్కడ మనస్సెట్టి భావములు లేక నిలచినను, విచారణగూడ శూన్యమగుటచే దుర్భరమగుచున్నది. సాధన బలము లేని వారికక్కడ ధ్యానింప కష్ట"మని నాయన కడ మొఱపెట్టి, యట్టి యర్హతకొఱకు నాయన సమక్షమందు కొంతకాలము తపస్సాధన జేయగోరెను. అప్పుడు విశాలాక్షమ్మ బుద్ధియందు 'పడైవీడు' క్షేత్రము స్ఫురించుటకు నాయన సంతసించి, మహర్షి యనుజ్ఞబడసి వెంటనే వజ్రమ్మను కాంచీపురములో పుట్టింటికి వచ్చియున్న కామాక్షమ్మకడకు బంపి, తాను విశాలాక్షి దైవరాతులతో గూడి పడైవీడు పయనమయ్యెను. అక్కడ విశాలాక్షమ్మ మాత్రము పగల్లుపవాసములచే నలుబది దినములు దీక్షబూనెను. మిగిలిన యిద్దరు దీక్షబూనకున్నను పుష్కలధ్యానమొనర్చుచు, అక్టోబర్ 1917 నుండి ఫిబ్రవరి 1918 వఱకు హాయిగా గడపిరి.

ఇంతలో కుమారుడు మహాదేవమునకు వివాహవిషయమై కలువఱాయి నుండి కొన్ని సంబంధములను గుఱించి నాయనకు లేఖలు వచ్చెను. ఆ లేఖ ప్రతిలేఖల ఫలముగా 'సుంకి' గ్రామకాపురస్థుడైన విశ్వనాథ రామసోమయాజులను నొక పండితుని సోదరియగు రాజేశ్వరినిచ్చి ఫాల్గున శుద్ధ తదియ శుక్రవారమునాడు (15-3-1918) మహాదేమునకు సుంకి గ్రామములో వివాహము జరుపుటకు నిశ్చయమైనది. అప్పటికి వ్యవధి తక్కువగా నున్నందున దైవరాతు నింటికి బంపివేసి, యమ్మనాయనలు మహర్షి యాశీర్వచనము గైకొనుటకు తిరవణ్ణామలై వచ్చిరి.

ఆ సమయమందు మహర్షి యొక్క సోదరుడు, తల్లియు నాయనను సన్న్యాస మడుగగా వారికి దీక్షనిచ్చి, మహర్షి తమ్మునకు నిరంజనానంద స్వామియను పేరు నాయన పెట్టెను. వానితోబాటు నారాయణ బ్రహ్మచారియను శిష్యుడుకూడ నాయనకడ సన్న్యాస దీక్షబొంది 'అమృతనాథు' డయ్యెను. పిమ్మట కాంచీపురము నుండి కామాక్షీ వజ్రమ్మలుకూడ తిరువణ్ణామలై వచ్చి కలియగా, వీరందరితో గూడి నాయన కాకినాడ వచ్చి, యక్కడ నుండి మహాదేవమునుగూడ వెంటనిడికొని కలువరాయి చేరెను. అటుపిదప బంధుమిత్రులతో నుంకి గ్రామము వెళ్లి పుత్రుని వివాహమును జయప్రదముగా ముగించుకొనెను. తరువాత నాయన యాఱు మాసములు కుటుంబసహితముగా కలువరాయిలోనే తనకు, తన సోదరులకుగల యాస్తి పంపకములను గుఱించి యుండిపోయెను. కామాక్షమ్మకూడ వారితోపాటు కలువరాయియం దుండిపోయెను. ఆ సమయమందు విశాలాక్షీ కామాక్షమ్మ లుభయులకు టైఫాయిడ్ జ్వరము సోకి నాయనయొక్క మంత్రజలముచేతనే తగ్గి స్వస్థమయ్యెను.

సోదరులతోడి వ్యవహారము ముగిసిన వెంటనే నాయన కుటుంబసహిత ముగా 'అరసవల్లి' క్షేత్ర యాత్ర సల్పెను. తన పుట్టుకకు కారణమైన యీ క్షేత్రము వింతకాలము నాయన దర్శింపకుండుట యొక వింతయే. ఆ వింతను గుఱించి నాయన దారిపొడవునను తలపోసెను. ఇన్ని సంవత్సరము లీ క్షేత్రయాత్రను భగవంతుడు విస్మరింపజేసి, యిప్పుడు పుత్రుని వివాహముతోడను, ఆస్తిపాస్తుల విభాగముతోడను, పుత్రున కా యాస్తుల నప్పగించుటతోడను కుటుంబబాధ్యతలు తీరి, వానప్రస్థము సార్థకమైన యీ సమయమున కీ యాత్రను సమకూర్చుటలో నేదో పునర్జన్మవంటి విశేష ముండియుండునని నాయనకు తట్టెను. ఆ కారణముచేత క్షేత్రమందు నాయన స్తుతులతోడను, ధ్యానముతోడను మూడు దినములు గడిపెను. ఆ సమయమందు రచింపబడిన స్తుతులలో ప్రసిద్ధమైనది 'సూర్యగీతము'. (ఇది పిదప 'గీతమాల'లో ప్రచురింపబడెను.)

అటుపిమ్మట అక్టోబర్ నెలలో మహాదేవము మెట్రిక్యులేషన్ పరీక్ష నిచ్చుటకు కలకత్తా వెళ్లియుండగా, మిగిలిన కుటుంబముతో నాయన సికిందరాబాదు వచ్చి పురములో ప్లేగు వ్యాధి వ్యాపించిన కారణమున కొన్నాళ్లు ప్రయాణికులతో బాటు స్టేషనువద్ద నరికట్టబడెను. మహాదేవము వచ్చువఱకు నక్కడనే యుండిరి. నగర మధ్యమున నివసించుటకంటె పరిసరములందు నిర్మింపబడిన 'ప్లేగు క్యాంపు'లలో నివసించుట శ్రేయస్కరమనిపించెను. ఈ రోగ మప్పుశాస్త్రి యింటికి సోకకుండుటకు, కుటుంబమునకు మంగళములు చేకూరుటకు నాయన యా సమయమం దప్పుశాస్త్రి యింట శ్రీచక్ర ప్రతిష్ఠ చేసెను (1919వ సం॥).

అటుపిమ్మట 1919వ సం॥ డిసెంబర్ నెలవఱకు సికిందరాబాదులోనే యమ్మనాయన లుండిపోయిరి. ఇంటియొద్దనే వేదార్థవిమర్శ జేసికొనుచు నాయన తన బుద్ధి పరిపాకమును బరీక్షించుకొనుచుండెను. అది పూర్వముకంటె మహత్తరమై, రమణగీతాసారమువలెనే యాంతర్యమందు క్రొత్త విభూతులను, క్రొత్త యనుభవములనిచ్చు పరిణామమును గల్పించుచుండెను. శిష్యు లింటి యొద్దకే వచ్చి, నాయన బోధల ననుదినము విని యభివృద్ధి జెందుచుండిరి. ఉపన్యాసముల కంతగా నాయన యా సమయమందు సుముఖుడు గాకున్నను, పెద్ద సభల కాహ్వానము వచ్చినప్పుడవి రాజకీయ సంబంధములుగానిచో నాయన వెళ్లుట కద్దు. మన దేశమం దా రోజులలో రాజకీయోపన్యాసముల కాంక్ష లధికమై, శిక్షలుకూడ ఘోరముగా విధింపబడుచుండెను. రాజకీయరంగమున గాంధీజీ క్రొత్త దుమారమును లేవదీసి, క్షణములో దానికి నాయకుడై, దేశమునంతను తన గుప్పిట బెట్టుకొని, ప్రాత నాయకులను ప్రక్కకు నెట్టెను. ఇతడు మైత్రేయ ఋష్యంశ సంభూతుడని నాయన గుర్తించి, దేశమును రాజకీయబంధమునుండి విముక్తిగావించుటకే యవతరించెననియు, నితని యుక్తులు కోమటిజన్మ కనుగుణములై వ్యాపారమువలన కోమట్లనిపించుకొనిన విదేశస్థులకు కాలులో ముల్లు కంటిలో నలుసువలె విశ్రాంతినీయవనియు తెలిసికొని శిష్యుల యుత్సాహము కొఱకు నాయన చెప్పువాడు. ఇతని కార్యవిధాన మంతయు తిరువణ్ణామలైలో క్షేత్రరథము కాలిన తత్త్వమునే సూచించుటకు నాయన కుత్సాహ మధికమయ్యెను.

ఇట్లుండగా, మెట్రిక్యులేషన్ పరీక్ష తప్పినను, మహాదేవమున కా సంవత్సరమందే యాంగ్ల వైద్యశాలలో చదువుటకు ప్రవేశము లభించెను. అందువలన పుత్రుని, పుత్రికను తిరుగ అప్పాదంపతుల యధీనమున నుంచి, యమ్మనాయనలు కొంతకాలము స్వగృహమం దుండుటకు కలువరాయి వెళ్ళి, సోదరులనుండి విభక్తములైన తమ భూములను మహాదేవము పేరున నతుకుబడి చేయించిరి. ఈ కార్యము కొఱకు దాదా పైదారు మాసములు వారు కలువరాయియం దుండవలసివచ్చెను. అప్పుడింటియొద్ద ప్రశాంతుడై నాయన యుమాసహస్రమును రెండు మూడుసార్లు సంస్కరించి, యా నెపమున తన జన్మకొఱకా గృహమొనర్చిన యుపకార ఋణమును దీర్చుకొనెను. మధ్య మధ్య నా చుట్టుప్రక్కల పండితులు నాయనను దర్శించుటకు వచ్చి, నాయనతో కొంత కాలక్షేపము సల్పువారు. అట్లు వచ్చి యధిక లాభమును బొందినవాడు మహాదేవమునకు బావమఱదియైన రామసోమయాజులు. నాయన వలన పండిత లోకమంతయు లాభము బొందవలెనని యితడెంచి 1920వ సం॥ మార్చి నెలలో నాయన యధ్యక్షతను కృష్ణారాయపురమందు సనాతన ధర్మసభల నేర్పరచెను. ఈ సభలకు మూడు నాలుగు జిల్లాలనుండి పండితులు వచ్చి సాంఘిక

విషయములను, శాస్త్రవిషయములను చర్చించి, పెక్కు సందేహములకు నాయన నిర్ణయ వాక్యములచే ప్రీతిజెందిరి.

1920వ సం॥ మే నెలాఖరున కలువకాయిలో బాధ్యతలు వదల్చుకొని యమ్మనాయనలు మరల సికిందరాబాదు వచ్చి, యక్కడనే 1922వ సం॥ మార్చినెలవఱకు తపశ్చింతనయందు మునిగిరి. 1920వ సం॥ డిసెంబర్ నెలలోనే నాయనయం దొకానొక తపఃపరిణామ మనుభవమై, మెదడుడికి, యొక పక్షము దినములు నాయన శిరఃకమలమును తీవ్రబాధకు గురిచేసెను. నాయనకు బాధ యెప్పుడు తగ్గి ప్రాణము లొడ్డెక్కెనో, అప్పుడమ్మకు విరేచనముల బాధ ప్రారంభమయ్యెను. నాయన కహర్నిశములు పరిచర్యలు సల్పినందున నామెయందీ విధమగు రోగము వేడివల్ల పుట్టినట్లందరు నాదియందనుకొని చికిత్స చేసిరి. కాని, దాని తీరుకూడ నాయన తలబాధవలెనే విచిత్రమై తోచినందున నదియు నొకానొక యోగపరిణామమని గుర్తించబడెను. ఆమెయు నించుమించొక పక్షము దినములు బాధపడిన పిదప హఠాత్తుగా తెరపిన బడుట యిందులకొక నిదర్శనమయ్యెను. అటుపిమ్మట నాయన శరీరముపై దద్దుర్లు, పొరలు పుట్టి యొక నెలలో నంతరించెను.

ఆలోచించగా, శరీరమునుండి దృష్టి నంతర్ముఖము జేసికొనువారికి నాడులయందు శక్తిమథన మొకప్పుడు ప్రారంభించి, యా మథనఫలముగా నాడుల నాశ్రయించు ప్రాణము పరిశుద్ధమగుట కందలి దుష్టవేడిమిని చిమ్మి వేయుననియు, శుద్ధమైన నాడుల ననుసరించి యీ వేడిమి యొక్కొక్క రోగ రూపమున వెలుపలకు చిమ్మబడుననియు యోగశాస్త్రము చెప్పుచున్నది. మన యందు నాడీబంధము, అభిమానము అను రెండు గ్రంథులవలన నాత్మతేజము కప్పబడి యుండునని శ్రీ రమణగీతయం దుపదేశింపబడెను. ఈ గ్రంథులు విభేదమైన వారియం దాత్మశక్తి విలాసము, తదనుభవము నాడులందు స్పష్టమై నిరభ్యంతరమగును. అయితే, యీ రెండు గ్రంథులలో నాడీబంధము తొలుత వీడవలెను. శరీరగతమగుచున్న సుషుమ్నయను శక్తినాడి తన రెండుకొనలచే సూక్ష్మనాడుల నొకవైపు, స్థూలనాడుల నింకొకవైపు పొందుచున్నందున నాడీ బంధము మరల రెండు గ్రంథులు గలదిగా చెప్పబడుచున్నది. వీటిలో నాజ్ఞాచక్రాంతరాళమందు సూక్ష్మనాడులచే నేర్పడు బంధము రుద్రగ్రంథి యనబడును. మూలాధార చక్ర పరిసరమందు స్థూలనాడులచే నేర్పడు బంధము బ్రహ్మగ్రంథి యనబడును. బ్రహ్మగ్రంథి భేదమగుటకు పూర్వము సంభవించు నాడీమథనము వలన సాధారణముగా మలమూత్రబాధ లగుపడును. రుద్రగ్రంథి విభేద మాసన్నమగువారికి మెదడు, రక్తము, వీర్యము మొదలగువానికి జెందు బాధలగుపడును. అందువలన బాహ్యదృష్టికి రోగలక్షణములుగా గన్పట్టినను,

విచిత్రతీరును బొంది వ్యక్తమైన యీ బాధలు యోగశక్తియొక్క పాక విశేషములని పాఠకులు గ్రహించవలెను.

అటుపిమ్మట యీ శక్తిపాకము బాహ్యమునకు దెలియకుండ నాంతర్యమం దెన్ని రూపములను బొంది, యెట్టి యనుభవము నిచ్చుచుండెనో చెప్పజాలముగాని, యది ప్రారంభమైన తరువాత నాయన యందును, విశాలాక్షమ్మ యందునుగూడ నిరంతర క్రమాభివృద్ధి ననుభవమందిచ్చుచున్నట్లు వారి యోజస్సులు చెప్పకయే చెప్పుచుండెను. ఈ యనుభవములను గుఱించి మహర్షితో రహస్యముగా చర్చించి వచ్చుటకు నాయన యొకసారి 1921వ సం॥ జూన్ నెలలో తిరువణ్ణామలై వెళ్లి, పదిరోజులలో కొందరపని యున్నవానివలె మార్గమం దాగకుండ సికిందరాబాదుకు వచ్చి చేరెను. ఈ వార్త విని వేలూరు, మద్రాసులలోని శిష్యవర్గము చాల నొచ్చుకొనిరి. ఇంచుమించు నాలుగేండ్ల నుండి గురుదర్శనము లేక వారు పరితపించుచుండిరి. గురువును గూర్చిన వార్తలుకూడ సరిగా వారి కందుటలేదు. అట్టి సమయమందు గురువా ప్రాంతము వచ్చియు, తమకు లేఖమూలముననైన వార్త దెలుపకుండుట కేమి కారణమని తర్జనభర్జన చేసికొనదొడగిరి. తుదకు వారందఱి తరపున కారణమరసి వచ్చుటకు సుధన్వకపాలులు చెన్నపురము నుండి సికిందరాబాదు జూన్ నెలలోనే పయనమైరి. వారమ్మనాయనలను దర్శించినప్పుడు వారి నేత్రములకు గురుదంపతులు ఋషిదంపతులవలె గన్పట్టిరి. ముఖ్యముగా నాయనయొక్క దివ్యతేజోరూపము పూర్వముకంటె నధిక విస్పష్టమై, ప్రత్యక్షగోచరమగుటకొక సన్నని తెరమాత్రమే యడ్డగించుచున్నట్లు స్ఫురించి వా రాశ్చర్యచకితులై యుండగా, వారిని నాయన తన దగ్గరగా కూర్చుండబెట్టుకొని, తన యీ నాలుగేళ్ల చరిత్రమును వారికి చెప్పి, తన యాంతర్యానుభవమును గుఱించియు వివరించెను. చిట్టచివరను "బాల్య మందు పీడించిన యరిష్టములవంటివి పీడించి, మఱల బాల్యమును పాదజూప జేసెననిపించెను. గ్రహణమునుండి విడివడినట్లు విషబాధలనుండి నాయాత్మ విడివడినది. ఇంక దాటవలసినది కొంచెమే" యని పల్కునంతలో నాయనయందు భక్త్యావేశమైనట్లుగా వాణి ఛందోబద్ధమై వెడలి, శిష్యులకు త్రుళ్లుపాటు గలిగించెను. అప్పుడా దివ్యవాణి నుండి నాలుగు శ్లోకములు వెడలెను. అవి గణపతి దైవమును ప్రత్యక్షముగా సంబోధించుచున్నట్లున్నవి. ఆ శ్లోకము లిట్లుండెను :-

శ్లో॥ "ఘోరం కరోమి న తపో యది తేఽపరాధః
కిం ప్రేరణం న కృతవా నపి రుద్రసూనో।
సంప్రేరితశ్చ భవతా యది నా చరే యం।
సంప్రేరణస్య తవ కా గజవక్త్ర శక్తిః॥"

శ్లో॥ "కిం బృంహితాని కురుషే కలుషేన భగ్నే।
మగ్నే మహావిపది దేవ నిజే వివర్తే।
నిద్రామి చే ద్వరద బోధయ హస్తఘాతా।
ద్గచ్ఛామి చే దపథ మాశు నివర్తయస్వ॥"

శ్లో॥ "వేష స్తవా య మపరో యది దేవ నాట్య।
మారభ్యతాం త దుచితం కి ముపైషి మౌనం।
ఏతాం ప్రభో యవనికా మపసారయంతు।
సాక్షా ద్గణా స్తవ కుతః క్రియతే విడంబః॥"

శ్లో॥ "ఏత త్తమో నయనశక్తిహరం గుహాయాం।
మార్గం రుణద్ధి న విలోకితు మస్మి శక్తః।
స్నేహోస్తి కాచన దశాస్తి విభో కటాక్ష।
జ్యోతిర్ఘవం సదయ దేహి పురో వ్రజేయం।"

(అర్థము:- 1. ఓ రుద్రసూనుడా! నేను ఘోరతపస్సు చేయకున్న నది నీ యపరాధమే. నీవేల ప్రేరణ సల్పలేదు? నీచే ప్రేరేపింపబడియు నేను తపస్సు చేయలేదంటివేని నీ ప్రేరణకప్పుడు పటుత్వమేది?

2. ఓ దేవా! నీ రూపాంతరముగా నున్న నేను కలుషమందు భగ్నమగు చుంటిననియు, మహావిపత్తున మునుగుచుంటిననియు బృంహితధ్వను లేల చేసెదవు? నేను నిద్రించుచున్నచో నీవు హస్తముతో తట్టి లేపరాదా? తప్పునుండి మళ్లింపరాదా?

3. ఓ దేవా, ప్రభో! ఇది నీ యపరవేషమైనచో, దాని కుచితమగు నాట్య మారంభింపక మౌనమేల బూనుచుంటివి? నీ గణములన్నియు సాక్షాత్తుగా వచ్చి తెర తీయవలెను. ఆలస్యమెందుకు చేయబడుచున్నది?

4. నేత్రశక్తిని హరించు గుహయందున్న యీ చీకటి నా మార్గమును గప్పుచున్నది. విలోకించుటకు శక్తి లేదు. స్నేహమున్నది. దశయున్నది. (మఱి యొక అర్థము చమురున్నది. వత్తియున్నది.) ఇంక నీ కటాక్ష జ్యోతిర్ఘవము నిమ్ము-దీపము వెలుగుటకు. నే నప్పుడు ముందునకు పోగల్గుదును.*)

నాయనయొక్క భక్తి యద్వైతస్థితిని బొందుచు, గంభీరమగుచున్నట్లు మధన్వకపాలులు గ్రహించిరి. అంతేగాక, నత్యుత్తమమగు తపస్సిద్ధి సన్నిహిత మైనట్లు గుర్తించిరి. 'గురుసన్నిధి నుండుట కరుణాచలము శీఘ్రముగా బయలు దేరెద'నని మధన్యుని యాహ్వానమునకు నాయన బదులిడి, వారిని సాగనంపెను. కాని, మఱి యెనిమిది మాసములవఱకు కదలలేదు.

---

* భక్త్యావేశమున వెడలిన యీ శ్లోకములు హిరంటోపస్థానమందు చేర్చబడినవి.

ఓం

## నాలుగవ అధ్యాయము

# కపాలభేదనసిద్ధి, ఇంద్రాణీస్తుతి

అరుణాచలము నాయన శీఘ్రముగా బయలుదేరి వచ్చుచుండెనను వార్త మద్రాసు, వేలూరు, అరుణాచలములలోని శిష్యవర్గములకు సుధన్వకపాలుల వలన తెలిసెను. వారాతురతతో గురుదర్శనముకొఱకు వేచియున్నను సికిందరాబాదు నాయన విడిచిన జాడ తెలియలేదు. అందువలన నరుణాచల శిష్యవర్గము వారు కపాలిశాస్త్రి ప్రోత్సాహముచే నాయన కుత్తరములు వ్రాయదొడగిరి. వచ్చుట కాలస్యము లేదని నాయన వ్రాయుచుండెను. కాని, బయలుదేరుట యగుపడలేదు. కపాలిశాస్త్రి స్వయముగా అప్పశాస్త్రికి లేఖ వ్రాసి, దానిలో నాయనను గృహవాసమున బంధించుట పాపకరమని యప్పశాస్త్రిని హెచ్చరించెను. నాయన యీ లేఖాంశములను విని యూరకుండెను. కొన్నాళ్లయిన తరువాత చెన్నపురము నుండి సుధన్వుడు వినయపూర్వకముగా లేఖ వ్రాసి, దానిలో నరుణాచలవాసము వలన గలుగు నార్థిక సమస్య తనకు విడువగోరెను. సికిందరాబా దధిక సుఖకరముగా నున్నచో తన లేఖవలన తొందరపడవలదనియు, తన సహాయ మక్కడకే పంపెదననియు తెలియజేయుచు నూరు రూపాయలు నాయనకు బంపెను. వెంటనే నాయన సుధన్వునకిట్లు సమాధానము పంపెను: "అరుణాచలములో చూతగుహ వాసయోగ్యముగా లేకయే నే నింతకాలము భగవానుని సన్నిధినుండుట కరుణాచలము వెళ్లజాలకుంటిని. నీవు పంపిన సొమ్ములో సగము వాసుదేవశాస్త్రికి పంపి, మరమ్మతులు వెంటనే ప్రారంభించవలెనని వ్రాసితిని. అక్కడివా రిదివఱకు కొంత పని ప్రారంభించి విరమించిరి. కాని, నన్నక్కడ కాహ్వానించుటలో నశ్రద్ధ జూపలేదు సరేకదా, నే నింకొకచోటనుండుట తగదని హితవుకూడ బల్కిరి. పని ప్రారంభమైనదని వినిన వెంటనే యిక్కడనుండి బయలుదేరెదను."

నాయన తత్త్వము సుధన్వున కవగతమయ్యెను. అమ్మనాయనల కింకను భారము గలిగించుచున్న మహాదేవము కొఱకుగూడ వారు తమ తపోవృత్తిని సడలించుకొనవలసి వచ్చుచుండెనని. సుధన్వుడు గ్రహించి యప్పసోదరు లీవిషయములో జూపుచున్న త్యాగమునకు, గురుసేవకు సంతసించెను. మహాదేవము చదువునకుకూడ ప్రత్యేకముగా తాను కొంత తోడ్పడుటకు సుధన్వుడు నిశ్చయించుకొనియుండగా, 1922వ సం॥ జనవరి నెలనుండి మహాదేవము మఱల చదువు మానివేసినట్లు కబురు తెలిసి చాల కించబడెను. కాని, యీసారి మహాదేవము చదువు మాని యింటికడ కూర్చుండక 'మహబూబు' కళాశాలలో చిన్న తరగతుల

కుపాధ్యాయవృత్తిని స్వీకరించి స్వేచ్ఛాజీవియయ్యెను. అదియు మంచిదేయని నాయన యా వెంటనే యమ్మను వెంటనిడికొని సికిందరాబాదు నుండి చెన్నపురము వచ్చి చేరెను.

వారు చెన్నపురములో సుధన్వుని యింట రాజోపచారములతో మార్చి నెల తుదివారమువఱకు సుఖముగా గడపిరి. ఇదివఱకు నాయనచే ననుగ్రహింపబడిన 'మాతంగి' విద్యవలన న్యాయవాదవృత్తియందు విశేషాభివృద్ధిని బొందినవాడై సుధన్వుడు తన కృతజ్ఞత నన్ని విధముల గురునకు జూపెను.

నాయన రాక వినినతోడనే శరత్సమాగమముచే వికసించు కమలములవలె నా ప్రాంతపు శిష్యులయొక్క, స్నేహితులయొక్క హృత్కమలములు వికసించెను. వారనుదినము సుధన్వుని యింట మూగి, నాయననుండి యొకానొక దివ్యతేజముతో గూడి ప్రసరించు శక్తిలహరియం దానందమున నోలలాడుచు, నితర ప్రసంగములను మరచి, యిట్టి శక్తిలహరి నుత్పన్నమొనర్చు యోగవిద్యల గుఱించి మాటిమాటికి నడుగజొచ్చిరి. నాయన ప్రాణాయామాది హఠమార్గముల నెఱిగినను, తా నెన్నడూ వాటి నభ్యసింపకయే యవి యిచ్చు ననుభవముల నాంతర్యమున పొందగల్గినందున వివిధ యోగరహస్యములను గుఱించి వాటిని బాగుగా నభ్యసించినవానివలె వారికి చెప్పజొచ్చెను. అంతేగాక, పండితుల కోర్కె ననుసరించి యా యోగవిద్యల స్వరూపములను, సాధనరహస్యములను క్లుప్తముగా జ్ఞప్తియందుంచుకొనుటకు కొన్ని * సూత్రములను రచించి యిచ్చెను. ఇన్ని యోగ విద్యలం దధికారమెట్లు ప్రాప్తించెనని పండితులు ప్రశ్నించగా, నాయన యిట్లు బదులిడెను. "మంత్రధ్యానము చేతనే నాకు నిరుపాధిక ధ్యానయోగ మలవడెను. అది దైవకటాక్షమే. ఆ కటాక్షమునకు గురుకటాక్షముకూడ తోడై నాయం దా యోగము స్థిరమై, శక్తిని వృద్ధిపరచెను. ఇది వారి యనుగ్రహమనుటలో సందేహము లేదు. శక్తి వృద్ధియై వికసించినప్పు డితర మార్గములన్నియు వశమగును గదా. ఈ నిర్విషయ విమర్శయోగ మలవడుకొలది, యీ జగద్వ్యవహారము లెన్నియున్నను నా యాంతర్యమందీ యోగసాధనము నిరంతరము సాగజొచ్చెను. ఇది యెప్పుడు సిద్ధిబొందునో చెప్పజాలను."

మార్చి నెల తుదివారములో నాయన యల్లుడైన సోమయాజులునకు మెట్రిక్యులేషన్ పరీక్ష ముగిసినతోడనే వానిని, వజ్రేశ్వరిని వెంటనిడుకొని యప్పదంపతులు చెన్నపురము వచ్చి గురుదంపతులకడ వారిని దిగవిడచి వెళ్ళిరి. మహదేవమున కుద్యోగము పోయినను, సికిందరాబా దతడు విడువలేదు.

---

* ఈ సూత్రములకే మఱికొన్ని చేర్చి 'రాజయోగసార' మను గ్రంథమును నాయన రచించెను.

ఇది యిట్లుండ చూతగుహకు మరమ్మతులు పూర్తియైనను, కుటుంబ మంతయు దానియందుండుటకు తగిన స్థలము లేక, దానికి సమీపముననున్న సరస్వతీస్వామి బంగళాలో కుటుంబమునుంచి నాయన మాత్రము చూతగుహ నధిష్ఠించెను. ఆ గుహ కడు చిన్నదియై, యొకరిద్దఱు కూర్చుండుటకుమాత్ర మవకాశముండును. నిలబడినచో నెత్తికి కప్పు తగులును. అందువలన శిష్యులు కొందఱు దానికి చేర్చి ముందువైపున నొక గది కట్టించి, నాయన కుటుంబము కూడ నివసించుటకు వీలుకల్పించు నుద్దేశముతో పనులు ప్రారంభించిరి. ఈ పనుల సందడిలో తపస్సుబూనుట దుస్సాధ్యముగావున తపస్తుల్యమైన కార్యము నప్పుడు పూని నాయన యుమాసహస్రమును సంస్కరింప మొదలిడెను.

ఈ గ్రంథమును సంస్కరించుటకది యేడవ పర్యాయము. ఎన్నవ పర్యాయమైనను, దానిని సంస్కరించినపుడెల్ల శుభములు ప్రాప్తించి, యంతశ్శక్తి పాకముచే క్రొత్త శోధము లనుభవమందు నిర్మాణమగుచున్నందున నాయన కది పవిత్రకార్యమై, తపస్సునందు నవ్యప్రబోధములను చేకూర్చు నుపాయమై యొప్పుచుండెను. ఏప్రిల్ నెల సగము ముగియుసరికి గది నిర్మాణము పూర్తియై దానితోపా టా యేడవసారి సంస్కరణమును పూర్తియయ్యెను. అప్పుడమ్మ తన కుమార్తెతో గది నాక్రమించెను. అల్లుడు మాత్రము భోజనసమయమున కిక్కడకు వచ్చుచు, మిగిలిన సమయములందు సరస్వతీస్వామి బంగళాలోనే సుఖముగా గడుపఁజొచ్చెను.

పిమ్మట నాయన దీక్షబూనియుండగా నొకనాడు చీకటిపడు సమయమున కొక వింత యనుభవమయ్యెను. అప్పుడు ధ్యానమునుండి లేచి నాయన గుహ వెలకు వచ్చి యుండెను. అకాశ మతి నిర్మలమైయున్నను, తటుక్కున నొక మెఱుపు మెఱసి, యా వెంబడి నొక దివ్య శబ్దము 'You will be helped like David' అని వినబడెను. ఇతరులకీ శబ్దము వినబడకుండుటయే యాశ్చర్యమై, దీని దివ్యత్వము నాయనచే నిర్ణయింపబడెను. అల్లనడిగి యా మాటల కర్థము 'నీవు డేవిడ్‌వలె రక్షింపబడుదు'వని నాయన గ్రహించి, బైబిలులో డేవిడ్ అను భక్తు డనుగ్రహింపబడిన కథను స్మరించుకొనెను. ఆలోచించగా డేవిడ్ మన చరిత్రము లందు పేర్కొనబడిన 'దభీతి' యను మహామునియై యుండవచ్చునని నాయనకు తట్టెను. మహర్షికి గూడ నీ శబ్దము వినబడినట్లు నాయన మహర్షి వలన వివి యది యుభయులకు జెందవచ్చునని భావించెను.

మఱియు మెఱుపుతోగూడి నిర్మలాకాశమునుండి వెడలిన యీ వాణి యింద్రాణీ సంబంధమని నాయనకు స్ఫురించి, యామె శక్తి యిదివఱకు పదైపేడు నందు, మహేంద్రగిరియందు, విరూపాక్ష గుహయందు జూపిన కటాక్షాను గ్రహముల కింతకాలమునుండి యుమాదేవిని స్తుతించిన ట్లామెను స్తుతింపకుండుట

పొరపాటయ్యెనని బుద్ధియందు దోచెను. వెంటనే యామెను స్మరించుకొని నాయన యీ విధముగా ప్రతిజ్ఞబూనెను. "ఏ మహాశక్తి నామీదను, విశాలాక్షిమీదను, మావలెనే గిరిరూపముననున్న శివశక్తులమీదను మూర్ఖుడైన ఫలనిసాధువుచే కల్పింపబడిన అపవాదమును పిడుగు రూపమున తుడిచివైచెనో, యే మహాశక్తి యుమాసహస్రమును శత్రుబాధనుండి రక్షించి స్వయముగా స్వీకరించి ప్రీతిజూపెనో, పదైపీడునం దే మహాశక్తి రేణుకారూపమున నధిష్ఠించి తన విచిత్ర దర్శనముచే ననుగ్రహించి వజ్రాస్త్రమంత్రమును బుద్ధికి ప్రదర్శించెనో, అట్టి యనుగ్రహ దేవతాశక్తియైన నింద్రాణిని స్తుతించుట కేడు వందల శ్లోకములతో గూడిన ఒక గ్రంథమును గురునిపరమున, నా పరమున నేను రచించి, యుమాసహస్రమువలెనే ప్రయోజనమును కల్పించెదగాక. దీనికొఱకు గూడ నే నిఱువది దినములు దీక్ష బూనెదగాక. ఇది గ్రీష్మఋతువై, యీ ప్రాంతములందు మేఘముల కవకాశము లేకున్నను, నిర్మలాకాశమునే యుపాధిగాగొని యామె తన దివ్యతేజస్సును బ్రదర్శించెను. నా రచనమున కామె ప్రీతిజెందినచో ప్రతి దినాంతమందు తన ప్రీతి నీరోజువలెనే మెఱుపు రూపమున జూపుగాక. నా కే దినమున రచన ముగిసినప్పుడా మెఱుపు గోచరించదో, ఆ దిన మొనర్పబడిన రచనాభాగమును జించివేయుచు, తుదకు దీక్షాకాలమునకు గ్రంథము పూర్తికానియెడల గ్రంథమునంతను చించివేయుదునుగాక."

ఈ విధమగు వ్రతముతోగూడిన రచనమును సంకల్పించి, మఱునాటి యుదయమున నాయన తన సంకల్పమును శ్రీ రమణుని కెఱుకపరచి, రమణుని యాశీర్వచనమును బొందెను. అప్పుడు శ్రీ రమణుని తల్లి జబ్బుపడి, స్కందాశ్రమమున మంచము పట్టియుండెను. అందువలన రమణుడు మాతృసేవా నిరతుడై, పూర్వ ముమాసహస్రమును వినుటకు వచ్చినట్లు సాయంత్రములందీ మాత్ర రచనమును వినుటకు రాజాలకుండెను. అట్లయినను, నాయన యీ స్తుతినిగూడ దేవతాఋణము దీర్చుకొనుటకు తన్నుద్దేశించుకొనినట్లె మాతృఋణము దీర్చుకొన బూనియున్న గురుని కార్యసిద్ధిని స్తుతిఫలముగా సంకల్పించెను.

వ్రాతసామగ్రి నమర్చుకొనుసరికి చిరుపాకం కొండయ్యాయను శిష్యుడు శుభసూచకముగా వచ్చి, నాయన యొక్క ఘోర వ్రతదీక్షను వినిన పిదప నాయనకు పరిచర్యలు సల్పుట కుండిపోయెను.

ఈ గ్రంథమందుకూడ స్తబకము లుమాసహస్రములోవలెనే యొక్కొక్క స్తబకమున కిఱువదియైదు శ్లోకముల చొప్పున విభజింపదలచెను. ఒక్కొక్క స్తబక మొక్కొక్క వృత్తముతో నిబద్ధమొనర్చుటకు చిత్రవిచిత్ర వైదిక ఛంద స్సంబంధమగు గమకము లూహింపబడెను. ప్రతి స్తబకమందు తొలి శ్లోకముచే నింద్రాణియొక్క

మందహాసమును స్తుతించుచు, భువనమందా హాస మెన్ని లక్షణములచే వ్యక్తమగుచుండెనో అన్నింటిని పేర్వేఱుగా పేర్కొని, విశ్వమందు జతమును బొందిన చైతన్యశక్తి భాగమును వివిధములుగా ప్రదర్శించుచు నామెయొక్క విశ్వరూపమును చిత్రింపనెంచెను. అట్లే ప్రతి రెంతవ శ్లోకముచే మన భారతదేశ దుఃస్థితిని దేవికి విన్నవించుటకు, నిఱువది నాలుగవ శ్లోకముచే దాని నెదుర్కొను శక్తి నర్థించుటకు నిశ్చయించుకొనెను. వైదికదేవతయగు నింద్రాణియొక్క స్తుతిఫలము నీ విధముగా వేదభూమియని ప్రసిద్ధిజెందిన భారత దేశాభ్యుదయము కొఱకు, నవైదిక తిమిర పరిహారమునకు గూడ నర్థించుచు రచనమును ప్రారంభింపదలచియుండగా నొక వింత జరిగెను.

ఆ వింత యెట్టిదనిన, పూర్వము సికింద్రాబాదులో ననుభవింపబడిన శిరోబాధ తిరుగ పొడజూపి, యప్పటికంటె నెన్నోరెట్లు తీవ్రస్థాయికి చేరెను. పవిత్రమైన దేవతాస్తుతి కొఱకు దీక్ష బూనదలచిన సమయమునకే యసాధారణ బాధ జనించుటయే వింతయై, యిది దేవతాకల్పితమని స్పష్టమైనను, దేనిని సూచించుటకై యుండునను మీమాంసకు లోనుజేసెను. కొందఱు ప్రియశిష్యులు వ్రతకాఠిన్యము తగ్గించుకొనినచో దేవత యనుగ్రహింపవచ్చుననిరి. మఱికొందఱు మహర్షి తల్లికి నయమగువఱకు దీక్ష నిలుపుచేయవలెనని ప్రేరణము గావచ్చు ననిరి. వీరి యజ్ఞతకు నాయన నవ్వుకొని, రచనమునకు పూర్వమే దేవి తన్నొక సిద్ధిచే 'దేవిత' ననుగ్రహించిన ట్లనుగ్రహించుట కీ బాధను శిరస్సునందు కల్పించె ననిగ్రహించి, దేవతాస్మరణచే బాధను సహించుకొనదొడగెను. రెండు రోజులు కొండయ్య సహాయమున సాయంత్రములందు యథాప్రకారము గురుదర్శనము గావించుకొని రాగల్గెను. కాని, మూడవనాటి సాయంత్రమునకు బాధ దుర్భర మైనందున నాయన తనకు బదులొక చీటిని మహర్షికడ కంపుకొనెను. మహర్షి యా చీటినందుకొని మౌనసమాధిని మునిగెను.

రాత్రిపడుసరికి శిరస్సంతయు వందలకొలది చీమలచే రోమకూపములంట కుట్టబడుచున్నట్లును, పదునుగో శిరస్సు లోపలి భాగము చీల్చి త్రవ్వబడు చున్నట్లును పోటుబెట్టి, పిచ్చి యెత్తిపోవునేమోయనునంతటి యనుమానమును గలిగించెను. నమలుటకుగాని, నోరు మెదపుటకుగాని నవకాశమీయని యీ బాధవలన నాయన ద్రవాహారమును మాత్రము గైకొనెను. శిరస్సును భూమిపై నుంచుటకుగాని, యొక ప్రక్కను పరుండుటకుగాని వీలొసగనందున, కొండయ్య నూతగాగొని యతని భుజముపై నాయన తన శిరస్సు నానుకొని, ప్రాణావసానము నెదురుజూచువానివలె గుహాంతర్భాగమున కూర్చుండి, యవసాన సమయమందు భగవంతునిపై భారము మోపిన ట్లన్య శరణ్యము లేక కేవల మా యింద్రదైవమునే

శరణుబొందియుండెను. క్రమముగా నొక క్రొత్త బాధ శిరోవేదనను మించి యుదయించెను విషమువంటి తీవ్రముతో నుగ్రప్రసారముగల యొకానొక తాపము వెన్నున బుట్టి, కంఠపర్యంతము వ్యాపించుచు, సహించుటకు దుర్భరమై యొప్పెను. దీనితో నరకబాధలన్నియు నొక్కపెట్టున నవతరించి, మృత్యువు తన యావత్ప్రాకారత్వమును జూపినట్లయినందున నాయన తట్టుకొనుట కసమర్థుడై, హాహాకారములతో కొండయ్య వీపుపై తన వీపు నానుకొని వానిపై సొలిపోవొచ్చెను.

అప్పటి కించుమించుగా రాత్రి సుమారు తొమ్మిది గంటలయ్యెను. 'దేవిద్ వలె నీవు సహాయమొనర్పబడుదు' వను భగవద్వాక్యముపై నాశ యింతవఱకు బలమై, యిన్ని మరణ బాధల నడుమను భగవత్సహాయ మే రూపమున వచ్చునోయను కుతూహలమును గలిగించుచున్నందున నదియే జీవగఱ్ఱయై యుండెను. ఆ యాశ యింక సన్నగిల్లుచు, మూలుగుటకుగూడ శక్తిని సన్నగిల్లజేయుచుండెను. విశాలాక్షి వజ్రమ్మ లా స్థితిని గమనించి, పగిలిన గుండెలతో గుహకెదురుగా కట్టబడిన గదిద్వారముకడ కూర్చుండిరి. అందరు శిష్యులుండియు కొండయ్యపై వారు భారమంతయు విడిచి యిళ్లకు బోయిరని విశాలాక్షమ్మ యొకపరి విలపించుచు. ఇంకొకపరి బంగళాకు బోయి నిశ్చింతాపరులై పండుకొనిన యల్లుడైన బాధ్యత మోయలేదని విచారించును. మఱియొకపరి కొండ నావరించుకొనిన చీకటిని లక్ష్యముసేయక మహర్షి కడకు బోయి శరణువేడ జూచియు నాయన నా సమయమందెట్లు విడుటయని నిరుత్సాహపడును. కూతురిని తనవంతు పంపుటకు సాహసములేకయు, కొండయ్య వంతు తా నూతగా కూర్చుండి కొండయ్యను పంపెదమనిన గుహ చిన్నదియై కొండయ్య తప్పుకొనుటకు సైతము వీలులేకయు నామె కేమి చేయుటకును దోచక యుండెను. అర్తిభారముచే నాయన, నాయన భారముచే కొండయ్య, దుఃఖభారముచే విశాలాక్షి వజ్రమ్మలు లోలోన క్రుంగుచుండ, కాలరూపు డా నిశీథసమయమం దక్కడనే తాండవమాడి నట్లుండెను. శబ్దములేని యా తాండవము గుహ నావరించిన నిశ్శబ్దమును మఱింత హెచ్చించెను. అట్టితఱి నాయన శిరస్సునుండి 'టప్' మను శబ్దమొకటి వినబడి, విశాలాక్షి వజ్రమ్మల దృష్టుల నాకర్షించెను. దాని వెంబడినే చంద్రకాంతివంటి జ్యోతియొకటి శిరస్సునుండి వెడలి, గుహ యొక్క లోపలి కప్పుపై బింబాకారముగా పడుచు, తత్కాంతిచే గుహయందలి చీకటిని తొలగించెను. ఆ జ్యోతిర్రశ్మితో గూడి శీర్షోపరిభాగము నుండి పలుచని యావిరి వంటి ధూమ మగ్నిపర్వతమునుండి త్రోసికొనివచ్చునట్లు నిర్గమింపదొడగెను. కొంప మునిగెనని విశాలాక్షమ్మ లేవ బోయినంతలో నాయన 'అమ్మయ్య' యని, బాధ నశ్యమైన వానివలె కొండయ్య వీపునుండి తొలగి, యాపనబద్ధుడై కూర్చుండెను. కొండయ్య యీ విధముగా విడుదలయై, వెనుదిరిగి జ్యోతిర్ధూమములను జూచి భయకంపితుడై 'మహర్షిని పిలుతునా?' యని నాయన

నడుగ, 'వలదు. శీర్షకపాలములు రెండును భిన్నమగుటకే యింత బాధపెట్టెను. అవి భిన్నమైనవి. బాధ తొలగెను. నీవింక గదిలో విశ్రాంతిదీసికొ'మ్మని నాయన పల్కుటతో నందరి చిత్తములు కుదుటపడెను.

కపాలభేదనమైన ధ్వని నాయనకు స్పష్టముగా వినబడెను. అట్లే భిన్నమైన స్థలమునుండి వెడలిన దివ్యజ్యోతియు, దానిచే చిమ్మబడిన యూష్మాయుత సూక్ష్మధూమసదృశ ద్రవ్యభూతముగూడ కన్నులు మూతబడి యున్నను దివ్య నేత్రమునకు స్పష్టముగా గోచరములయ్యెను. ప్రాణవాయువును పీల్చుకొని పొగను విడచు దీపమువలెనే యీ జ్యోతి బాహ్యాకాశముతో బ్రహ్మరంధ్రముద్వారా యాతాయాతమగుచున్న ట్లనుభవమయ్యెను. ఈ యాతాయాత వ్యాపారముచే నాకాశమునుండి శరీరమునకు ప్రవహించుచున్న యొకానొక శక్తి మస్తకస్థలము నుండి మూలాధార పర్యంతముగల నస్థిపంజరము నుపాధిగా జేసికొని విహరించు చున్నట్లును, నుపాధియందు బాహ్యాంతరభేదబుద్ధిని తొలగించునట్లును విశద మయ్యెను. అంతేకాక, విషజ్వాలాకథన మంతమై, నిఖాతమైన శీర్ష గుహనుండి స్వచ్ఛమైన యానందలహరిని శరీరమంతయు నింపుచున్న యమృతస్రావకథనము ప్రారంభమై, సిద్ధులన్నియు తన హస్తగతమైనట్లు, తా నాత్మగతమగుచున్న ట్లనుభవించెను. ఒకానొక నూత్న శరీర మాంతర్యమున నుదయించి మృత్యువును జయించినదానివలె స్థూలోపాధి నుంచుకొనుటకు, విసర్జించుటకు గూడ నధికారముగలదై యొప్పెను.

ఆ రాత్రి మిగిలిన భాగమంతయు నాయన పరిస్థితి విచిత్రముగా నుండెను. వేడియావిరి రూపమున బహిర్గతమగు తాపము, చందనలేపనమువంటి శీతలసుఖరూపమున నంతర్గతమగు నమృతలహరి – యీ రెండింటితోగూడి యున్మత్తుని వలెను, బాలునివలెను నొకేకాలమున దుఃఖానందములకు లోను చేయు స్థితి యది. దీనివలనే శరీరము విషయములో నుంచుకొనుటయా, మానుటయాయను ద్వంద్వస్థితి యావరించెను. తెల్లవారుసరికి నిర్గమించుచున్న యావిరి యొక్క విసురు, నుగ్రత్వము మొదలగునవి తగ్గెను. శిరస్సు నుండి సుమారొక గజమెత్తువఱకు చిచ్చుబుడ్డివలె చిమ్మిన యీ ధూమము సగము మందగించెను. అది యొకవంక తగ్గుచుండగా నింకొకవంక నాంతర్యముననున్న శక్తిలహరి యమృతనాడి నాశ్రయించి శిరస్సునుండి హృదయమునకు దిగవచ్చెను. అది దిగుచున్నప్పుడు ఒకానొక సమాధిస్థితి యావరించి, చూచుచున్నను చూడ కుండుట, వినుచున్నను వినకుండుట మున్నగు విచిత్రములతో గూడిన యనుభవముల నిచ్చుచుండెను. ఈ స్థితిలో మహర్షియొద్దకు వెళ్లవలెనవి యున్నను. వెళ్లలేక నాయన గుహకంకితుడై యుండిపోయెను. కాని, దయాళుడైన రమణభగవానుడే స్వయముగా నాయనను చూచుటకు తెల్లవారినతోడనే

చూతగుహకు దిగివచ్చి, రాత్రి జరిగినదంతయు సవిస్తరముగా విని సంతసించెను. మఱియు నాయనను స్వయముగా గుహనుండి గదిలోనికి మహర్షి తీసికొనివచ్చి, యొక మంచముపై కూర్చుండబెట్టి, నీరసము తగ్గుటకు పాల నాహారముగా నిప్పించెను. పిమ్మట నాయన తన శిరస్సును జూపగా, శీర్షపరిభాగమున నరచేయియంతమేర జుత్తంతయు గత రాత్రి యూడిపోయి, బట్టతలయగుటకు మహర్షి యాశ్చర్యపోయెను. అటుపిమ్మట మహర్షి యా గదిలో ప్రవేశించి వెలుతురు సహాయమున భిన్న కపాలభాగమును పరీక్షించి, స్వహస్తములతో నా భాగమును కొంతసేపు నిమిరి యనుగ్రహించెను. తరువాత నాయన కెదురుగా మంచముపై కూర్చుండిన మహర్షి కొండయ్యను పిలిచి ''నీవు పోయి బజారునుండి పాదుకల జత యొకటి, కొంచెము 'బాదాం' తైలము, కొంచెము చిట్టాముదము వెంటనే తీసికొనిర''మ్మని యాజ్ఞాపించెను.

అవి తెచ్చులోపున నాదర వచనములతో మహర్షి యిట్లమ్మ నుద్దేశించుచు పల్కెను. ''నాయనకింక భయము లేదు. కాని, శరీరమంతయు విద్యుచ్ఛక్తియుతమై యున్నది. ఇటుపై నిట్లే లోహముల తాకుడుగాని, యుప్పు, పులుపు, కారములనుగాని యిసుమంతయు భరించలేక యుండును. కనుక వానిని పూర్తిగా వర్జించవలెను. వట్టినేలపై గూర్చుండరాదు. అట్లే పాదరక్షలు లేనిదే గదిలోనైన మసలరాదు. అందులకే పాదుకలు తెమ్మంటిని. ఇంక శీర్షపరిభాగమందా తాపమున్నంతకాలము బాదాం తైలమును స్నానాత్పూర్వము పట్టించి, స్నానమైన తరువాత చిట్టాముదము కొంచెము పట్టించవలెను.'' ఇట్లు చెప్పి మహర్షి తన తల్లికి సేవలొనర్చుటకు వెళ్లిపోయెను. మహర్షి తల్లియగు సౌందర్యాంబయు, తమ్ముడైన నాగసుందరము 1917వ సం॥ లోనే వచ్చి మహర్షి యొద్ద యుండిపోయిరి. నాయన రమణగీతను రచించు కాలమునకు వీరు స్కందాశ్రమమున నుండిరి. 1918వ సం॥ వైశాఖలో ఫలనిస్వామి చనిపోయినప్పటి నుండి నాగసుందరము (ఇతడా సంవత్సర ప్రారంభములోనే కాషాయములను ధరించి, సన్న్యాసియై, నిరంజనానందస్వామియను నామమును వహించెను) మహర్షికి పరిచర్యలు సల్పువాడు. తల్లి సేవమాత్రము మహర్షి గైకొనెను.

మహర్షి చెప్పినవన్నియు శ్రద్ధగా పాటింపబడెను. స్వగురువీ విధముగా పూర్వము హస్తమస్తకదీక్ష నొసగినంత గుప్తముగా పాదుకాదీక్ష ననుగ్రహించెనని నాయన భావించి, కొండయ్య తెచ్చిన పాదుకలను గురుప్రసాదముగా స్వీకరించి యానాటినుండి విడువక ధరించుచుండెను. ఆ మఱునాడు వైదికసంఘ శిష్యుడైన 'కిట్టాజీ' నాయన యొక్క కపాలభేదన వార్తను విని యార్ని గ్రామమునుండి వచ్చి, నాయన శుశ్రూషలకుండిపోయి, కొండయ్యను తన స్వగ్రామమునకు బోనిచ్చెను. నాయన శిరస్సునుండి యావిరి క్రమక్రమముగా తగ్గుచు, పదిదినములకు గాని

యంతశ్శక్తిలహరి నాడులందు పూర్తిగా సర్దుకొనలేదు. మిగిలిన జుత్తుకూడ రాలిపోయి శిరస్సంతయు బట్టతలయయ్యెను. ఆ పదిదినములు నాయన మేల్కాంచియుండెనో, నిదురబోవుచుండెనో చెప్పుటకుకూడ కష్టమయ్యెడిది. అది నిజముగా జాగ్రన్నిద్రల రెండింటికి నడుమనుండు సహజ తపస్థితి గావలయును. కపాలభేదమునకు పూర్వమావరించిన దుర్భరస్థితి, కపాలభేదము వలన ప్రాప్తించిన యోగసిద్ధి, యటుతరువాత ననుభవింపబడిన దివ్యస్థితి యెట్లుండెనో శిష్యులచే నడుగబడి, నాయన ఛందోబద్ధముగా నిట్లుడివెను :-

శ్లో॥ ''తస్యాం రాత్రౌ చలంత్యా మఖిల
మపి వపుః కో పి తాపో వ్యధాక్షీత్।
ప్రాభూవం నా పి సోఢుం విషమద
మివ తం తీవ్ర ముగ్రప్రసారం।
నాసీ చ్ఛక్యం ధరిత్ర్యాం న్యసితు
మపి శిరః పార్శ్వతో వా పి శేతుం।
దష్టం లూతాశతైర్వా పరశుహతి
శతైర్భిన్నవ న్మస్త మాసీత్॥'

శ్లో॥ ''భిన్నే శీర్షః కపాలే శ్రుతియుగ
వివరా యోజనేనాధ్వనా మే।
సృష్టో ఉభూ ద్భృదనస్య ధ్వని
రపి విగత స్తత్ర ధూమశ్చ దృష్టః।
దూరే జాయా గుహాయా స్సపది
సదుహితా సర్వమైక్షిష్ఠ వృత్తం।
శుశ్రూషుః కొండయార్య స్త్వజని
మమ వపుర్ధారణాలంబదండః॥'

శ్లో॥ ''అంతర్గుహే వ కుహరం శిరసో విఖాతం
స్వచ్ఛా ప్రమోదలహరీ లసితా వహంతీ।
ఉన్మాదినీ తదను కా పి దశా ఉషసిత న్మాం
నా శక్నువం చ గురుసన్నిధి మప్యుపైతుమ్॥'

శ్లో॥ ''ఉల్లాసః కుండలిన్యాః ప్రకటుపరి
సరో ఉలక్ష్య తాంత ర్భహి ర్వా
విద్యానా మావిరాసీత్ పరికర
పటలో యోగసంబంధినీనాం।

పశ్చా దన్య చ్ఛరీరం కమపి
సముదితం నేత్రువ న్మే గరీయో।
గాత్రం సర్వం పవిత్రం సుఖ
మజని కృతం చర్యయా చంతనస్య॥''

(ఈ శ్లోకములలోని భావములన్నియు పైని వర్ణనమందు వివరింపబడెను.)

కపాలభేదనమునకు పూర్వ ముమాసహస్ర మేడవ పర్యాయము సంస్కరింప బడినట్లు చెప్పబడెను. శక్తిలహరి పరుదుకొనిన పిమ్మట నీ కపాలభేదనమైన యోగియొక్క యనుభవములను సంస్కరింపబడుచున్న గ్రంథమందు నాయన చొరబెట్టెను. ఉదాహరణమునకు, నాలుగవ స్తబకములో నాకసమునుండి శరీరమున ప్రవేశించిన శక్తి బ్రహ్మరంధ్రముద్వారా చేయు రాకపోకలను గుఱించి యెట్లు చెప్పబడెనో చూడుడు :

శ్లో॥ ''యాతాయాతవిహారే మాత
స్తస్మిన్ భవ త్యుపాధి స్తే।
అరభ్య మస్తకస్థల మామూలాధార మస్థిపంజరికా॥''

శ్లో॥ ''వృతనుపు విహర న్తీం త్వాం
ఉపాధివీణాకృతే ర్దగన్మాతః
సాదృశ్యా త్కుండలినీం
పరోక్షవాదప్రియాః ప్రభాషన్తే॥''

శ్లో॥ ''నభసః శీర్షద్వారా ప్రవహన్తీం
య ఇహ విగ్రహే శక్తిమ్।
అనుసంధదాతి నిత్యం కృతిన
స్తస్యేతరై రలం యోగైః॥''

ఈ విధముగానే తాసమధికమై, ప్రాణసందేహస్థితి గల్గుటను సూచించుటకు ''కంఠవిరుద్ధే భూరి విషాగ్ని'', ''కోపి సహస్రైరేష ముఖానాం'' మొదలుగాగల శ్లోకములను 17వ స్తబకమందు చొరబెట్టెను. అంతేగాక 15వ స్తబకమందు సహస్రారమున క్రీడించు భవానీదేవిని, 17వ స్తబకమందు మదకరీశక్తిని స్వాగత మొనర్చి, 18వ స్తబకములో కుండలినీ సముల్లాసమును కీర్తించెను. ఇట్టి శ్లోకములను పెక్కింటిని మాత్రముగా చొరబెట్టుటవలన గ్రంథ మెనిమిదవ సంస్కరణమును బొందినట్లయ్యెను. దానినప్పుడు నాయన క్షేత్రాలయములోని 'యపీతుకుచాంబ' సన్నిధి నొకపరి పఠించెను.

అటుపిమ్మట నాయన యదివఱకు సంకల్పించిన 'ఇంద్రాణీసప్తశతి'

యనుస్తుతికావ్యమును రచింపనారంభించెను. ఇంద్రాణియను గ్రంథిభేదినీ శక్త్యనుగ్రహమువలన తనయం దే విధముగా రుద్రగ్రంథివిభేదమై, శీర్షకపాలములు భిన్నమయ్యెనో నాయన కనుభవమైనందున నీ యోగసిద్ధిచే నింద్రాణీవిద్య యనబడు విరాణ్మహామంత్రఫల మాంతర్యమున సిద్ధించినట్లు నాయన భావించెను. మఱియు స్వానుభవమునుండి తన కుండలినీశక్తి యే విధముగా సహస్సు నుండి మహస్సుగా మారెనో (అనగా నుపాధితో కూడి యున్న తేజస్స్థితి నుండి విడివడి, యుపాధి నాశ్రయించక, సుషుమ్నానాడియందు మేల్కాంచిన జ్యోతిర్మయస్థితిని బొందుట) నాయన గ్రహించెను. తురీయాశ్రమమును స్వీకరించినవారు చనిపోయినప్పుడు వారి శిరస్సు సహజముగా భిన్నముగాకున్నచో నారికేళమును శిరస్సుపై కొట్టి భిన్నముచేయు నాచారమునుబట్టి తురీయాశ్రమ యోగి పొందదగిన సిద్ధి కపాలభేదనమని రూఢియగును. మఱియు మరణ సమయమందు ప్రాణ మూర్ధ్వగతమై, బ్రహ్మరంధ్రము నుండి వెడలుటకును, దానివలన తురీయాశ్రమము కంటె నుత్తమ గతి లబ్ధమగుటకును కపాలభేదనమును వారు యోగబలముచే సాధింతురనియు నీ యాచారము సూచించుచున్నది. ఈ సిద్ధిని మరణకాలమందే సాధించు నాచారమునుబట్టి చూడగా కపాలభేదనమైన పిదప జీవించియున్న యోగి యీ యాచారము ప్రవేశించినప్పటినుండియైన లేడని రుజువగును. పాతంజలము మొదలగు యోగశాస్త్రములను రచించినవా రట్టి యోగియొక్క యనుభవములను పేర్కొనలేదు. కనుక కపాలభేదనమే తుదిసిద్ధియని వీరందరు భావించిరనుటలో సందేహము లేదు. కపాలవిభేదనము వలన రుద్రగ్రంథి విభేదనమును బొందిన యోగికి బాహ్యాంతర విభేదము నశించి, సుషుమ్నానాడియందు నిద్రించు కుండలినీ శక్తి మేల్కాంచి, నిరుపాధికమై, జన్మమృత్యువులం దధికారము గలదియగుచున్నను, ఆ శక్తి హృదయగ్రంథిని భేదించుకొని, 'యహం' మూలమగు నాత్మయందు స్థిరత్వమును బొందవలసి యున్నది. అప్పుడే యోగి జీవన్ముక్తుడగును. అట్టి స్వస్వరూపసిద్ధియే తుదిసిద్ధి. వేదాంతశాస్త్ర మీ సిద్ధిని గుఱించి వచించినను, హృదయమనగా ననాహతచక్రమని భావించుటబట్టి, దానిలో వచింపబడిన దనుభవనీయముగా లేదని రూఢియగును. ఈ విధముగా శాస్త్రకాలమునాటికే హృదయగ్రంథి, రుద్రగ్రంథుల యొక్క విభేదనానుభవము యథార్థముగా తెలియ బడలేదని పెక్కుదాహరణములను జూపవచ్చును. కనుకనే రమణగణపతులు శ్రుతియుగమును పునరుద్ధరించుట కవతరించిన మహానుభావులనియు, వా రొసగిన యనుభవములచే శాస్త్రము లుద్ధరింపబడినవయ్యెననియు చెప్పబడెను. తైత్తరీయ శ్రుతియందు 'వ్యపోహ్యా శీర్షకపాలే భూరిత్యగ్ని ప్రతితిష్ఠతి' యను వాక్యము శాస్త్రానుభవములకు మించి నాయనచే పొందబడిన సిద్ధికి సాక్ష్యమగును.

ఇట్టి పరమార్థసిద్ధి ననుగ్రహించిన 'రేణుక' యను నామాంతరముగల యింద్రాణీదేవత నుద్దేశించి నాయన రచించిన 'సప్తశతి'స్తుతి సకాలములో పూర్తియయ్యెను. గ్రీష్మఋతువున కపవాదమనియైన యెంచక యా దేవత తన పుత్రుని కోర్కె ననుగ్రహించుటకు ప్రతి సాయంత్రము విద్యుత్పరంపరల నాకసమందు జూపెను. గ్రంథము ముగిసినతోడనే నాయన తన భార్యతోడను, ముప్పదిమంది శిష్యులతోడను పడైవీడనబడు రేణుకాక్షేత్రము వెళ్లి, దేవిసన్నిధి నా గ్రంథము పఠించినప్పు డామె సాక్షాత్తుగా వినినట్లక్కడికి వెళ్లిన వారందరికి యగపడుట వారి యావజ్జీవము స్మరింపదగిన దివ్యానుభవమయ్యెను. ఈ శక్తి నాయన కదివఱకు దర్శనమిచ్చి యనుగ్రహించిన యస్త్రము, దివ్యౌషధము అను రెండింటిలో మొదటిదానివలన వేదహృదయ భేదకశక్తి, తత్ఫలముగా విరాణ్మహామంత్రమనెడి యస్త్రవిద్య సిద్ధించగా, రెండవదానివలన కపాలములు భిన్నమై యమృతసిద్ధి ప్రాప్తించెను. వీనిచే సిద్ధపురుషుడైన నాయనయందు వేదముని జీవిత ప్రతాపము ఋజువయ్యెను.

ఓం

అయిదవ ప్రకరణము

# ఇంద్రాణీ యనుగ్రహముచే మహర్షి తల్లి 'మాతృభూతేశ్వరి'యై, యాశ్రమ నిర్మాణదేవి యగుట

'ఇంద్రాణీ సప్తశతి' యను గ్రంథమును నాయన రచింప నారంభించిన మొదటివారములోనే యింద్రశక్త్యనుగ్రహ మింకొక యద్భుత వేషమును జూపెను. అదివఱ కా శక్తి వివిధరీతుల నాయన ననుగ్రహించి తుదకు 'దేవిద' అను భక్తుని పూర్వము రక్షించినట్లే జీవితమందే నూత్న జన్మనిచ్చి రక్షించెను. అదే విధముగా మహర్షి కోర్కె ననుగ్రహించుట కా శక్తి యతని తల్లియైన యళఘమ్మకు ప్రాణావసాన సమయమందు జీవేశ్వరైక్యమను సిద్ధిని ఫలింపజేసి దేవతాత్వము నిచ్చిన విషయము, దేవతాత్వమును బొందిన పిదప నామె నూత్నాశ్రమ చైతన్య శక్తియై రమణాశ్రమోద్భవమునకేమి, రమణసందేశ వ్యాప్తికేమి కారణభూతురాలైన విషయము, తన కడుపున బుట్టి మిగిలియున్న బిడ్డల నీ యాశ్రమనిర్మాణము నెపమున నొక్కచో చేర్చిన విషయము మన మీ యధ్యాయమున స్మరించెదము గాక.

అళఘమ్మకు తన భర్తయగు సుందరమయ్యరు చనిపోయినప్పటినుండి యన్నియు కష్టములే. ఆమెకు రెండవ పుత్రుడైన రమణు డామెను విడిచి తిరువణ్ణామలై వచ్చి వైరాగ్యము బూనెనను వార్త పిడుగుపాటై యామెను క్రుంగదీసిన స్థితిలో పెద్దకుమారుడైన నాగస్వామి చనిపోయి (1900లో) యామె జీవితమును గాఢాంధకారమున ముంచెను. మిగిలిన సంతాన మొక కుమారుడు, కడపటిదగు నొక కుమార్తె యుండిరి. అప్పటికి వీరిద్దరు చిన్నవారు. వీరిని పెంచుట కామె కాధరువులేదు. పైగా, ఋణమొకటి పెరిగి పీడింపవచ్చెను. బిడ్డలను దీసికొని మఱదియైన నెల్లియప్పయ్యరింట నామె తిరుగ శరణు బొందవలసివచ్చెను. క్రమముగా కుమార్తెయైన 'అలమేలు'కు వివాహమయ్యెను. కుమారుడైన 'నాగసుందరము' పెరిగి యుద్యోగమును సంపాదించి, తల్లిని పోషించుచు, నామె భగ్నహృదయమం దాశాంకురమును కల్పించెను. కాని, యీశ్వరుడీ యాశనుగాని, తత్సుఖమునుగాని యెన్నాళ్లో దక్కనీయలేదు. నాగసుందరము భార్య యొక మగశిశువును బడసి 1916లో చనిపోయి,

యళఘమ్మ కా వృద్ధాప్యమున శిశుపోషణభారమునుగూడ నెత్తి నంటగట్టెను. దానితో గృహజీవన మామెకు వెక్కసమై, వెంటనే తిరువణ్ణామలైవచ్చి, వైరాగ్యమపేక్షించి, యాత్మనిష్ఠుడైన తన రెండవ కుమారుని శరణుజొచ్చెను. కాని, మనస్సంతను స్థిరపడక చిన్న కుమారునిపై పఱుగిడినందున నామె యింటికి బోయినను, రమణుని యాకర్షణచే 1917 ఏప్రిల్‌లో చిన్నకుమారునితో సహా తిరువణ్ణామలై వచ్చి, మఱి కదలకుండ రమణుని యొద్దనే నివాసముండి, తన చేతితో వండినది రమణునకు బెట్టుచు, ముద్దు తీర్చుకొనుచుండెను.

నాగసుందరము మాత్రము బంధములనింకను త్రెంచుకొనజాలక తల్లి నక్కడ దిగవిడిచి వెనుకకుబోయెను. కాని, కొద్దిరోజులకే తల్లి యతనికొక వర్తమానమంపెను. అతనియందామె కభిమాన మధికము. అందువలన నంత్యకాలమును సమీపించుదానివలె నామె తనకంటి యెదుట రమణునితోబా టతడుగూడ నుండవలెనని కోరుచు వర్తమాన మంపెను. అతడును పుట్టినదాది కష్టజీవనమును, దుఃఖమునే బడయుచుండిన కారణమున తల్లి సందేశము నందుకొని, యుద్యోగమును విడిచి, కుమారుని తన పినతండ్రి భార్య కొప్పగించి, తిరువణ్ణామలై వచ్చెను. వచ్చిన పిదప కొన్నాళ్లు గ్రామమందు వసించి భిక్షాన్నముతో పొట్ట నింపుకొనెను. కాని, కొద్దిరోజులైన పిదప 'అహం బ్రహ్మాస్మి' యను మహావాక్యోపదేశమును తల్లితోసహా పొంది, యతడు 1918లో 'నిరంజనానందస్వామి' యను పేరుతో కాషాయాంబరధారి యయ్యెను. అప్పటినుండి యితడును తల్లి వండినది తినుచు, రమణునియొద్దనే నివసింపదొడగెను.

అళఘమ్మ సంసారఫలముతో తృప్తిజెందెను. కాని, రమణుడీ విధముగా బంధుమధ్యమున జీవించుట యొక గార్హస్థ్యవిధియని కొందఱు చమత్కారమున కనిరి. తపఃప్రారంభకాలమందట్టి జీవనమొక బంధము గావచ్చునుగాని శ్రీ రమణునివంటి యాత్మనిష్ఠబొందినవాని కది బంధముగాని, విధిగాని కాజాలదని యెఱిగియుండియు చమత్కారమున కనిన వాక్య మళఘమ్మ చెవిని సోకినంతనే యామె యుదాసీనురాలై "నా కుమారునకు కుటుంబజీవన మంటకట్టుటకే నేను వచ్చితిని. లోకమంతయు వానికి కుటుంబము కాదలచినప్పుడు నావలన లోకులకు మేలగునుకదా" యని యెత్తిపొడిచెను. ఆమె వాక్యమోఘమై, సిద్ధించిన విషయమే యీ యధ్యాయము జూపుచున్నది.

అళఘమ్మ వాంఛయందు స్వార్థము లేనందున నత్యంత పవిత్రమైనదని చెప్పకతప్పదు. కాని, దానిని నెగ్గించువాడీశ్వరుడుగావున నీశ్వర పరాశక్తి కామె యధీనకావలయును. సంకుచిత దృష్టి నన్నింటియందు నతిక్రమించవలయును. అదియే సాధనరూపమగును. వాసనలను ఫలింపజేయు శక్తి యీశ్వరరూపమైన యాత్మకున్నదిగాని జీవునకు లేదు. కాని, యాత్మ సంధానముగావించు నధికారము

మాత్రము జీవునకున్నది. క్రియావృత్తులను వాంఛింపగల్గు జీవుడు వృత్తులను వాంఛింపకయు నుండగలడు. అదియే వానికున్న యధికారము. అట్లుండుటకే సర్వసాధనలు నియమింపబడినవనియు, నదియే యాత్మసంధాన మనియు నెవడు గుర్తించునో, వాడు పురుషాధికారమును గుర్తించినవాడగును. వాడే పురుషప్రయత్నమును సక్రమముగా జేసినవాడగును. వాని యిచ్ఛలన్నియు నప్పుడు పరేచ్ఛలై పరిణమించును. ఆ పరిణామమందు - అనగా వాసన లా విధముగా సిద్ధించినప్పుడు - వానికి వాటియందు పూర్వమున్న యభిలాష యుండదని రమణగీతలో స్పష్టముగా చెప్పబడెను. ఎందువల్లననగా, నాత్మసంధానమైన పిదప 'నేను, నాది' యను పృథగ్భావమిథ్యా వాసనలయందు నశించి, యవి పరేచ్ఛా వాసనలుగా మార్పుజెందును. కొంద ఱీశ్వర సంధానము వాసనలన్నియు నశించు వఱకు దుర్లభమని భావించి దుఃఖమును శాశ్వతము గావించుకొనుచున్నారు. వాసనలు నశించినప్పుడేగాక, యణగి యున్నప్పుడు సైత మీశ్వరసంధానము సుసాధ్యమని వారు గ్రహించినచో, వారు తప్పక తమ యందు పరిమితమై యున్నను నమోఘమైయుండు పురుషాస్త్ర ప్రయోగము నెఱిగినవారగుదురు. ఇతర వృత్తి వాసనల నణచుటకు సాధకు డేయే యుపాయముల నాదియం దవలంబించినను, తుదకు 'నే'నను వృత్తి పుట్టిన పిదపనే యితర వృత్తులు వాని నాశ్రయించి పుట్టుచున్నవని యెఱిగి, మూలవృత్తి నణచి, జయమును బడయుచున్నారు. రమణు డొసగిన నూత్నసందేశ మదియే యగుచు, మూలవృత్తి నిరోధకము నాదినుండి లక్ష్యము గావించుకొమ్మనుచున్నది. కాని, వారి ప్రయత్నమును ఫలింపజేయు వా డీశ్వరుడని మఱువ రాదనియు మహర్షి రమణుడు బోధించెను. బోధించుటయేగాక తనకు శరీరము నిచ్చిన తల్లి ఋణము, తన కుపచారములను జేసిన ఫలనిసాధువు యొక్క ఋణముగూడ మహర్షి యొక విచిత్ర పద్ధతిని తీర్చుకొనుటకు ప్రయత్నించి యొక దానియందు జయము, నింకొక దానియం దపజయము బొందిన విధముగూడ మహర్షి తన యనుభవమునుండి దృష్టాంతమిచ్చి, ఫల మీశ్వరహస్తమందున్నట్లు నిరూపించెను.

తల్లి యెప్పుడు తనకడకు వచ్చి శరణుబొందెనో, అప్పటినుండి యామె యందు బలీయములై యున్న ప్రారబ్ధవాసనల నణచుటకు రమణుడు తొలుత ప్రయత్నించెను. జరావస్థయందుండి ప్రారబ్ధము నించుమించుగా ముగించుకొని యవసానము నెదురుజూచుచున్న యామెయందు మిగిలియున్న వాసనలు రెండు మాత్ర మనర్థములై మహర్షికి గన్పట్టెను. అందొకటి సంప్రదాయ సంబంధము, నింకొకటి శరీరసంబంధము. మొదటి దాచార నియమముల రూపమున ప్రారంభించి, మడి-తడి-యస్పృశ్యత మొదలుగాగలవాటి నవలంబించుటయే పారమార్థికమను భ్రాంతిని పాకము గావించెను. అవి కొంతవఱకు మాత్రము

మనశ్శుద్ధి కుపయుక్తములై, యభివృద్ధికి సోపానములు కాగల్గినను, మోక్షమున కవి సాధనములు కాజాలవని యామెకు మహర్షి బోధించెను. మఱియు వాటియం దభిమాన మొక బంధమై, వాటికి భంగము కల్గినపుడెల్ల దుఃఖమును పుట్టించునని చెప్పి వాటి నంతగా పాటించవద్దని హితవు పల్కెను. ఇంక శరీర సంబంధమగు వాసన యెట్లుండెననగా, మహర్షికామె తల్లియైనందున భక్తులామెను గౌరవింప వలెనని యామె కుండెడిది. శరీరము ఆమె కాదనియు, శరీరము తన కిచ్చినంత మాత్రమున నామె తన తల్లి కాజాలదనియు రమణుడు బోధించి, దేహాత్మభావమును విడువగోరెను. పాప మామె కీ రెండును విడనాడ నలవిగానట్లు దోచెను. విడనాడవలసిన దామెకాని రమణుడు కాడు. అభిమానమే విడనాడనిచ్చుటలేదు. ఆ దురభిమానమును చంపుకొనుటకు తీర్పరుడటై రమణు డామెయం దలుకబూనుట, వెటకారములాడుట మొదలగు నస్త్రముల ప్రయోగించి యామెకు పశ్చాత్తాపము పుట్టించెను. అప్పు డామె రమణాస్త్రములు తన మేలుకొఱకని గ్రహించి, మడి-తడి భేదములను విడిచి, కాషాయాంబరధారిణియయ్యెను. క్రమముగా తనకు, రమణునకు గల శరీరసంబంధము ప్రధానముకాదని గ్రహించి, రమణునియొద్ద ప్రారబ్ధమును శేషము గావించుకొనుటకును, మోక్షార్థమనుగ్రహింపబడుటకును నాశ్రయించు భక్తురాలివలె మసలజొచ్చెను. ఈ విధముగా ప్రారబ్ధముచే పొందబడిన శరీర విషయములో వీతరాగవాసన యైనంతనే యామె మాతృప్రేమ విశుద్ధమై దివ్యాకృతిని దాల్చెను.

అప్పు డామె సంచితవాసనల నణగద్రొక్కు ప్రయత్న మొక్కటి రమణునకు మిగిలియుండెను. అవసానకాలమందందఱికి బాహ్యస్మృతి యెప్పు డణగునో, అప్పు డంతర్గత ప్రవృత్తులు, పూర్వజన్మ సంచిత కర్మవాసనలు నేవేవి భావిజన్మకు కారణములు కాగల్గునో, అవి ప్రకోపించుచుండును. అవి ప్రకోపించునప్పుడు వాటియందలి యభిమానముచే ప్రాణములు హృదయమందు లీనమగుటకు బదులు బహిర్గతములై, పునర్జన్మకు కారణములగుచుండును. కనుక నీ తరగతి వాసనలకు జేయవలసిన చికిత్సకొఱకామె యవసాన సమయము రావలసియున్నందున మహర్షి వేచియుండెను.

1920 సం॥ సగము గడచినప్పటినుండి యామె జరావస్థకు చెందిన శారీరక బాధలకు లోనగుచు, భక్తులొసగు నౌషధములను తచ్ఛాంతికొఱకు సేవించుచుండెను. కాని, యా వ్యాధి కేవల శారీరకమేగాక, చిత్తమందు దేహవిముక్తి కొఱకు ప్రారంభించిన ఆర్తికి గూడ చెందినదై, యౌషధ చికిత్సలకు లొంగుటలేదు. అంతర్గతమగు మనస్సునకు, శరీరముతో కూడియుండు వృత్తిరూప ప్రాణమునకు పోరాటముదయించినప్పుడు ప్రాణము శరీరమును విడువనొల్లక చేయు ఘోషయే

వ్యాధియై, తాపమును గలిగించుట పక్వస్థితియందు సహజము. క్రమముగా 1922 సం॥లో వైశాఖ మాసము (మే నెల) ప్రవేశించినప్పటినుండి యామె చిత్తమందు వేదన యధికమై, రమణుని సాన్నిధ్యమున్నచో నుపశమించుచు, లేనిచో భరింపనలవిగానిదగుచుండెను. ఆమె కోర్కె ననుసరించి రమణు డామె నంటియుండి మాతృసేవాధర్మమును నిర్వర్తించుకొనదొడగెను. ఇంచుమించుగా గణపతిముని కపాల భేదమునకు పూర్వమింద్రు డశరీరవాణీ రూపమున నభయమును బ్రకటించిన సమయమది. అందువలన నింద్రు డొక వంక గణపతిముని తపఃఫలసిద్ధి కభయము నిచ్చినట్లే, యింకొకవంక రమణుని కోర్కె సిద్ధింపజేయుట కభయమిచ్చెనని యూహింపదగును. గ్రంథివిభేదన మొనర్పు నింద్రశక్తివలన గణపతిమునికి శిరోగ్రంథియందును, నళఘమ్మకు చిద్గ్రంథియందును వేదన జనించెను. తొలుత గణపతిమునియం దా శక్తి కపాలగ్రంథిభేదము ననుగ్రహించెను. ఆ యనుగ్రహమును బొందిన పిదప నాడులందు శక్తిలహరి పరుదుకొనిన వెంటనే యుమాసహస్రమం దీ సిద్ధికి చెందిన యనుభవముల నత డుల్లేఖించి క్షేత్రదేవతయొక్క సన్నిధిని పఠించిన పిదప నింద్రశక్తిని స్తుతించు గ్రంథరచనము నందుకొనెను. కాని, యా శక్తి తలపెట్టిన యింకొక యనుగ్రహముకూడ పూర్తియై, యుమాస్తుతివలెనే యీ స్తుతియు తన పుత్రు లుభయుల కృతజ్ఞతకు చెందునదిగా నుండవలెనని యామె యభిలషించెను కాబోలు, దాని రచన మారంభించిన తొలిరోజులలోనే యళఘమ్మ కవసానమును కల్పించి, యది సంభవించిన దినమున రచనము నాపుచేసెను.

19-5-1922 తేదీ తెల్లవారినప్పటినుండి తల్లియం దవసాన చిహ్నాలను జూచి రమణు డామెకు బాహ్యస్మృతి తొలగువఱకు నాత్మబోధ జేయుచు, నామెప్రక్కనే గూర్చుండెను. ఆమె కిష్టుడైన నిరంజనానందస్వామి యింకొక ప్రక్క గూర్చుండి యామెకు దృప్తినిచ్చెను. ఈ వార్త విని గణపతిమునియు స్కందగుహకు భార్యాసహితుడై వెళ్లి సానుభూతి జూపుటకు రమణుని వెనుక గూర్చుండెను. స్తవబంధదీక్షయందున్నను గణపతిముని తన రచనము నా దినమున నాపుజేయుటకు తగినంత కారణమున్నది. ఎట్లనగా, గణపతిమునికి కపాలభేదమైన మఱుసటి దినమునుండి ప్రతి యుదయము పదిగంట లగుసరికి రమణుడు మాతగుహకు వచ్చి, నాయన భోజనమునకు తొందరచేయుచు, నతడు భుజించవలసిన చప్పిడి హితకరమగున ట్లతని చెంతను గూర్చుండి, మధురమగు సంభాషణము సల్పుచుండెను. గురుని సమక్షమందే గురునికంటె ముందు భుజించుటకు నాయన సిగ్గుపడగా 'శిష్యుడు ముందు తినుట దోషము కా'దని యుక్తిపల్కెను. "భగవాన్ ! మీరుకూడ నిచ్చట భుజించరాదా" యని విశాలాక్షమ్మ యడుగ, "ఈ భగవా నిక్కడ భుజించినచో, పైనున్న యమ్మ పస్తుండదా" యని

ప్రతిప్రశ్నచే చమత్కరించి "మంచము పట్టినప్పటి నుండి రాత్రు లమ్మకు బాగుగా నిద్రపట్టుటలేదు. ఉదయములం దిదే సమయమున కొక గంటసేపుమాత్రము మరచి నిద్రించుట చూచి యిక్కడకు వచ్చుచుంటి"నని సమాధానమిచ్చెను. ఆ విధముగా నళఘుమ్మ కవసానసమయ మగుటకు పూర్వదినము వఱకు రమణుడు వచ్చుచుండెను. అట్టి భక్తవత్సలుడు, గురువు అయిన రమణుడు పూర్వజన్మాంశము ననుసరించి గణపతి మునియందు సోదరభావ ముంచినవు డళఘుమ్మయందు గణపతిముని తల్లిభావమునుంచి, యామె తుదిఘడియలందు తన గ్రంథదీక్ష నుల్లఘించియైన యామె చెంత నుండుట విధియని భావించెను.

మధ్యాహ్నమగుసరి కళఘుమ్మ కూర్ధ్వశ్వాస ప్రారంభమై, బాహ్యస్మృతి తప్పెను. అది గమనించి రమణు డామె సంచితకర్మ నీశ్వరునకు కర్పూరహారతిగా నంటించి యర్పించివేయుట కద్భుతావహమగు కార్యమును జేసెను.

ఊర్ధ్వశ్వాస ప్రారంభమగుటయే తడవుగా రమణుడామె హృదయము నొక చేతితోడను, శిరస్సు నింకొక చేతితోడను నదిమియుంచి, యామెయం దాత్మశక్తి ప్రవాహమును బారబెట్టెను. శక్తిప్రవాహ మాత్మవంక కెప్పుడు నివృత్తియగునో, అప్పుడది యాత్మశక్తి ప్రవాహమై, విషయగతమైన యనుభవములను నిర్విషయ మొనర్చి యాత్మపరము జేయునని యెఱుగవలెను. ఇదేవిధముగా రమణు డెప్పుడు గణపతిమునికి చేసిన విషయమును పాఠకులు జ్ఞప్తికి దెచ్చుకొందురుగాక! అప్పు డాత్మపరిశోధనముచే గణపతిముని దీక్షపూని నిర్విషయత్వమును, నివృత్తిని స్వయముగా సాధించుచుండెను. దీక్షాంతము సమీపించుచుండగా జీవితాంతమందు ప్రాణము శరీరమును విడుచునప్పుడు శరీరమందు తోచు నీరసమువంటి దశనిక తోచెను. నివృత్తమం దొక స్థితిలో నిత్య మాత్మవంకకు నివృత్తమగు ప్రవాహ ముదయించును. సాధనమందు బలము చాలనప్పు డా స్థితిని దాటి నిత్యప్రవాహము నందుకొనుట కష్టము. ఆ స్థితియందు శరీరమునుండి విడివడు ప్రాణమువలన ముక్తి ప్రవాహము సిద్ధించనప్పుడు తిరుగ ప్రవృద్ధగతిచే మెలకువయైన సిద్ధించును లేదా శరీరగతముకూడ కాజాలని మృత్యువైన సిద్ధించును. ఆ స్థితి యోగులందు చెప్పబడు తటస్థ స్థితియై, ప్రాణముయొక్క నివృద్ధ ప్రవృద్ధగతులు రెంటింటికి నడుమ నా రెంటింటికిని చెందియు చెందని సంధిభేద సంధాన స్థితియై యుండును. ఆత్మవంకకు నిత్యనివృత్త ముదయించినవారికి వారియందు సహజమైయుండు శక్తిలహరి యుదయించును. ఈ లహరి సిద్ధమైన యోగుల కెన్ని వాసనలున్నను, వాటి యనుభవము లాత్మకల్పితములగుచు, నవి యహంకారముకొఱకు కాజాలవు. అదియే దేవతాత్వ ప్రాప్తినిచ్చు సిద్ధి. అటుపిదప నెవరు నిత్యనివృత్తిగతి యందును తటస్థముచే తిరుగ సాధనజేయుదురో, వారికా తటస్థమందు స్థిరము గలుగు

కొలది యచలము సిద్ధించుచుండును. ఈ విధముగా ప్రవృత్తినుండి తటస్థముచే నివృత్తియు, నివృత్తినుండి తటస్థముచే నచలస్థితియు ప్రాప్తించుచుండును.

అప్పుడు రమణుని యాత్మశక్తి ప్రవాహబలవశమున నళఘుమ్మయందు మృత్యుగతిని పొందుటకు పూర్వము శరీరమును విడుచుచున్న ప్రాణములు నిరోధింపబడినవగుచు, తత్కాల ప్రబోధితములగు భావిజన్మ సంబంధవాసనల నతిక్రమింపజొచ్చెను. ఈ వాసనలే భావిజన్మకు ప్రారబ్ధకర్మ వాసనలగును. అవి వాటియందు నిహితమైన యనుభవమును స్వప్నతుల్యముగా ప్రదర్శించును. తదనుభవమందు మోహమేర్పడిన వారికి ప్రాణము లంతటితో నిరోధగతిని కోల్పోయి, ప్రబోధిత వాసనలందు బంధమును బొందును. అట్లు నిరోధగతి నాశనము గానప్పు డే వాసనలు ప్రబోధమైయుండునో, వాటియందు మోహము నాశనమగును. విగతమోహమైన వాసనలందు విషయరూపము దగ్ధమగుచు, రూపమున కుపాధియగు ననుభవ వస్తు వాత్మగతమగును. ఒక వాసనా సమూహమి ట్లంతమైనప్పుడు దాని స్థలమం దింకొక వాసనా సమూహము సంచితమునుండి వ్యక్తమగుటకు ప్రబోధింపబడవచ్చును లేదా మానవచ్చును. అవి యడుగున లీనమైన స్థితినుండి మీదకు వచ్చుటకు శరీరమందున్న క్రియాశక్తి కారణమగును. రమణుడు చొరబెట్టిన యాత్మశక్తి ప్రవాహమువలన నళఘుమ్మయందు క్రియాశక్తి మూలగత మగుచు, నూత్న వాసనా ప్రబోధమున కవకాశమీయక, ప్రబోధమైనవాటిని నిశ్శేషము చేయుచుండెను. ఇట్లు రాత్రి యెనిమిది గంటలగువఱకు రమణుని యాత్మశక్తికిని, యళఘుమ్మ యందు వాసనల రూపమున నుద్గమించు ప్రాణశక్తులకును యుద్ధము సంభవించెను. ఆమె శ్వాస క్రమముగా తీవ్రతను గోల్పోవుట, ప్రాణశక్తులు హృదయమున లీనమగుట మహర్షికి గోచరించుచుండెను. తుదకు పంచత్వమైన గుర్తుగా నొకానొక సన్నని ప్రణవధ్వని యామె యంత్యశ్వాసతో వెడలెను. ఆ ధ్వని వినబడిన పిదప 'అమ్మయ్య' యనుచు రమణు డామెనుండి తన చేతులను తీసివేసెను. వెంటనే కూర్చుండిన గణపతిమునికిని, నిరంజనానందునకు నా ధ్వని స్పష్టముగా వినబడెను. ఆ సమయమందు మెఱుపువలె వెడలిన దివ్యజ్యోతి స్ఫూర్తి మాత్రము దివ్యదృష్టిగలిగిన రమణ గణపతులకే గోచరించెను. ఆ జ్యోతికి సంబంధించిన కాంతియొకటి మృతశరీరము నావరించి, శరీరము దేవాలయ తుల్యమైనట్లు నిరూపించెను. అది మఱునాడు శరీరమునకు స్నానముగావించువఱకు నుండెనని మహర్షి వల్కెను. అరుణగిరిపై మృత్యువును బొందినవారిని వెంటనే దించివేయవలెనను నియమమున్నను, నీమె శరీరము దివ్యత్వమును బొంది పూజార్హమైన కారణమున రమణుడామెను రాత్రి యంతయు స్కందగుహయం దుంచుట కభ్యంతరమును జెప్పలేదు. పైగా, నామెకు నిర్వాణము ప్రాప్తించిన

వెంటనే "మనకింక మైల లేదు. వంట చేసికొని భుజించవచ్చు" నని రమణుడు పల్కి, విశాలాక్షి గణపతులను చూతగుహకు పంపెను.

ఈ విధముగా రమణుడు తన దేహమందు శరీరమునిచ్చిన తల్లికి పరమందు శాశ్వత శరీరము నిచ్చుటద్వారా తల్లి ఋణమును దీర్చుకొనదలచి భగవత్కృపచే ప్రయత్నఫలమందు విజయమును గాంచి ధన్యుడయ్యెను. గణపతి ముని కాంతర్యమున కపాలభేదనముతోపా టుత్పన్నమైన నూత్నమగు సూక్ష్మశరీర మిట్టిదేయని పాఠకులు గుర్తింతురుగాక. ఈ ముక్తికార్యమును గుఱించి గణపతిముని ప్రశ్నించగా, రమణుడు తా జేసిన ప్రయోగమును వివరించిన పిదప 'నాప్రయత్న మమ్మ విషయములో సఫలమైనది. కాని, ఫలనిస్వామి విషయములో విఫలమైనది. నాకత డొనర్చిన సేవకు ప్రతిఫలముగా వాని యంత్యకాలమందిట్లే చేసితిని. పంచత్వము కల్గినదని చేతిని దీసివేసితిని. కాని, వానియొక్క దుశ్చింతలు పంచత్వమున కవరోధమయ్యెను. అప్పుడతడు తటాలున కన్నులు విచ్చగా ప్రాణము లా కన్నులనుండి నిర్గమించె'నని చెప్పెను. అమ్మగా రామె స్త్రీ యైన కారణమున యళఘమ్మ సమాధి కర్హురాలుకాదని కొందఱు వాదించగా, గణపతిముని వారి సందేహములను దొలగించుటకు రమణగీతలోని 13వ యధ్యాయమున విశాలాక్షమ్మ యడిగిన ప్రశ్నకు 'ముక్తురాలికి దేహమున దహనము కూడదు. సమాధియే తగు'నని రమణుడిచ్చిన సమాధానమును బ్రమాణముగా చూపి సమాధి కెల్లరను సమ్మతింపచేసెను.

అటుపిమ్మట కొండ దిగువను పాలితీర్థము చెంతనున్న యశ్వత్థవృక్ష చ్ఛాయల క్రింద యళఘమ్మ శరీరమునకు సమాధి గావింపబడెను. అక్కడకు కొలది దూరములో పురజనులను సమాధి చేయు శ్మశానమున్నందున లింగాకారముగా చెక్కబడిన కాల్లక్కర పడియుండును. రమణుడట్టి రాయి నేర్చితెచ్చి యళఘమ్మ సమాధిపై ప్రతిష్ఠించెను. వెంటనే యా లింగమునకు 'మాతృభూతేశ్వర లింగ'మని గణపతిముని నామకరణమొనర్చెను (అనగా అమ్మయయిన యీశ్వరుడని యర్థము). ఇది యితర సమాధుల వంటి సమాధిగాక దివ్యమైనదగుటచేతను, దీనిపై సిద్ధహస్తముచే లింగము ప్రతిష్ఠింపబడి సిద్ధవాక్కుగల గణపతిమునిచే దివ్యనామ ముంచబడినందునను, లింగమున కనుదినము పూజాద్యభిషేకములు సల్పుటకు స్కందగుహనుండి నిరంజనానందస్వామి వచ్చుచుండెను. అప్పుడు గ్రీష్మఋతువగుటచే పాలితీర్థ మింకిపోయి, బహు శ్రమపడినగాని నీరు పుట్టునదికాదు. సోదరుని కష్టము విని రమణు డా సమాధిచెంతగా తన చేతికో నొక స్థలమందు మట్టి నిటునటు కొంత తీసి యందుండి దివ్యమగు జలధారను పుట్టించెను. పాపములను శమింపజేయు నీ జలధారకు గణపతిముని 'అఘశమనతీర్థ'మని పేరుంచెను. కొందఱు దీనిని

'రమణతీర్థ' మనియు పిలుతురు. సహస్రారమును బోలిన యీ సమాధి స్థలమున నిది యమృతధారను స్మరింపజేయుచుండును. అటుపిమ్మట పదియవనాడీ లింగమునకు మహాపూజ కావింపబడెను. ఆ దినమున గణపతిముని యిట్లు దివ్యగానమొనర్చెను :-

శ్లో॥ "దుందుభి వర్షే వృష షష్ఠ దినే
మాధవ కృష్ణ దళీయ నవమ్యాం
భార్గవ వాసర విశి శతతారా
సంయుక్తాయా ప్రథమే యామే॥" 1

శ్లో॥ "భారద్వాజీ పారాశర్య
శ్రేష్ఠ కులోద్భవ సుందరపత్నీ
గురుగుహభాగజ రమణ మహర్షే
ర్మాతా పూతా చారిత్రేణ॥" 2

శ్లో॥ "త్యాజిత మానస సంగా హంసీ
శివపద భక్తిక్షాళిత పంకా
గుహకర శక్త్యా రుద్ధప్రాణా
తత్క్షణ ధూత సమస్త వికల్పా॥" 3

శ్లో॥ "నిగమాంతవచో వేద్యం జ్యోతిః
సర్వజగత్సు వ్యాప్తం జ్యోతిః
సుతగుహ దృష్ట్యా వ్యక్తం జ్యోతిః
సౌందర్యాంబా సమభూజ్జ్యోతిః॥" 4

శ్లో॥ "రమణమహర్షేః కర సరసిజ
ద్వయ మకరంద స్ఫుటధారేవ
అత్ర సమాధౌ సౌందర్యాంబా
దేవ్యా స్తీర్థం నవ మఘశమనం॥" 5

శ్లో॥ "జయతు మహర్షే ర్మాతా పూతా
జయతు సమాధిః కోపి తదీయః
జయతు మహర్షి స్థాపిత లింగం
జయతుచ తీర్థం నవ మఘశమనమ్॥" 6

## అర్థములు

1. దుందుభి సంవత్సర (1922) వృషభ మాసమున నాలవ దినమగు వైశాఖ బహుళ నవమి, శుక్రవారము రాత్రి శతభిషముతో కూడిన మొదటి జాము నందు -

2. భరద్వాజ గోత్రోద్భవయు, శ్రేష్ఠమగు పారాశర్యకులమందు పుట్టిన సుందరమయ్యరుని పత్నియు, గురుకుమారస్వామి యంశతో పుట్టిన రమణ మహర్షి యొక్క తల్లియు, పావనచరితయు -

3. మానసరాగములేని హంసి, శివపదభక్తిచే పాపములు కడుగబడినది, గురుని హస్తశక్తిచే ప్రాణనిరోధము బొందినది, వెంటనే వికల్పములన్నియు పోగొట్టబడినది -

4. అగు సౌందర్యాంబ యెట్టి జ్యోతి వేదాంతవాక్యములచే తెలియదగి యున్నదో, ఏది సర్వజగత్తులను వ్యాపించిన జ్యోతియో, కుమారస్వామి యైన సుతుని దృష్టి లేది జ్యోతిగా వ్యక్తమయ్యెనో, అట్టి జ్యోతిస్వరూపిణియయ్యెను.

5. సౌందర్యాంబయను దేవియొక్క ఆ సమాధియందు రమణమహర్షి యొక్క కరకమల ద్వయమునుండి జనించిన మకరంద ధారలవలె క్రొత్తతీర్థము జనించి 'అఘశమన'మయ్యెను (ఆజ్ఞాచక్రముతో కరకమల ద్వయమునకు, సహస్రారముతో సమాధికి, మకరందముతో క్రొత్త జలధారకు పోలిక).

6. పావనియైనటువంటి మహర్షి జనని ప్రకాశించుగాక; ఆమెయొక్క సమాధి ప్రకాశించుగాక; దానిపై మహర్షిచే స్థాపింపబడిన లింగము ప్రకాశించు గాక. నవ్యమైన 'అఘశమన' తీర్థము (అనగా పాపములను శమింపజేయునది) ప్రకాశించుగాక.

ఈ విధముగా గ్రంథివిభేదని యగు యింద్రాణీ శక్తి యొక్క పూర్ణ వైభవమును గణపతిముని తన స్తుతిరచన సమయమందే చూచెను. ద్విదళిత పత్రమగు నాజ్ఞాచక్రమందు వసించు నా శక్తి రమణ హస్తయుగ్మమందును వసించు చున్నట్లు స్పష్టమయ్యెను. ఆ శక్తి నాయనయందు రుద్రగ్రంథిని భేదించి యమృతధారోదయమును గలిగించినట్లే, శ్రీ రమణుని హస్తమునుండి ప్రవహించి యళఘమ్మ కమృతత్వము ననుగ్రహించుటయేకాక, యామె సమాధి స్థలమం దమృత జలధార నుదయింపజేయుట కక్కడి భూభాగమందున్న గ్రంథినిసైతము భేదించెను. స్థూలదృష్టికది జలాభావమును తొలగించుటకొఱకు చేయబడిన పనిగా తోచినను, గణపతిముని దివ్యదృష్టి కఘశమన తీర్థముతో గూడి సహస్రదళ పద్మమువలె ప్రకాశించుచున్న యా సమాధిస్థలమును వహించిన యళఘమ్మ యొకానొక పరేచ్ఛారూపిణియై, రమణునియందు జ్ఞానబోధ కార్యపు బోధినీ

దేవతాంశయగుచు, నతనికి కార్యోపాధిగాదగు నొక దివ్యాస్త్రమును నక్కడ వెలయింపజేయునని గోచరించెను. ఆ విధముగా జ్ఞానసంస్కారభారమును వహించు రమణునకు లోకహితకార్యమందు తోడ్పడుటకై గణపతిముని తనయందు సంఘసంస్కారశక్తిని, దుష్టమతములనుండి భారతీయులను రక్షించి, వారి యందు ఋషిసంప్రదాయసిద్ధమగు వీర్యవంతమైన మతమును నెలకొల్పు శక్తిని బహుళముగా ననుగ్రహింప వేడుచు పెక్కు శ్లోకముల నప్పటికి రచింపబడుచున్న యింద్రాణీ సప్తశతియందు ప్రవేశపెట్టి, దానిని భారత భూరక్షణకొఱకు నిర్మించిన స్తుతిగా తయారొనర్చెను. మచ్చున కట్టి శ్లోకములు కొన్ని దిగువ నుదహరింపబడుచున్నవి:

శ్లో॥ "శక్తాం దేవి విధే హ్యార్తానామవనే।
ఇంద్రస్యేవ భుజాం వాసిష్ఠస్య మతిం॥"

(శ. 1, స్త. 3, శ్లో. 24)

(అర్థము:- ఓ యింద్రాణీదేవీ! ఆర్తినొందిన వారిని రక్షించుట కేవిధముగా నీ వింద్రుని భుజమును శక్తివంతమొనర్తువో, వాసిష్ఠుని బుద్ధి నా విధముగా శక్తివంతమొనర్పుము.)

శ్లో॥ "అస్త్రంమమ భవధ్వంసాయ రటతాం।
సుత్రామతరుణీ శ్రీమాత రసతాం॥"

(శ.1 స్త. 4, శ్లో. 22)

(అర్థము:- ఓ సుత్రామతరుణీ, శ్రీ మాతా! నా కస్త్రమగుము, దుర్మార్గుల వినాశముకొఱకు (నా నుండి) ధ్వనిచేయుము - స్తుతిరూపమున.)

శ్లో॥ "ఛిన్నాం సంఘసహస్రైః ఖిన్నాం శత్రుభరేణ।
పాతుం భారతభూమిం మాత ర్దేహిబలం నః॥"

(శ.2, స్త.2, శ్లో. 24)

(అర్థము:- ఓ తల్లీ! వేలకొలది సంఘములుగా విచ్ఛిన్నమై, శత్రుభారముచే ఖిన్నురాలైన భారతదేశమును రక్షించుటకు నాకు బలమిమ్ము.)

శ్లో॥ "శిరసీహసతః సితభానో। రమృతేన వపు ర్మద మేతి।
హృదిభాత ఇనస్య చ భాసా। మతిమేతు పరాంశచి చేతః॥
మమ యోగమదేన నతృప్తి। ర్ని జదేశదశా వ్యథితస్య।
అవగంతు ముపాయ మమోఘం శచి భాసయ మే హృది భానమ్॥
(శ.5, స్త.4, శ్లో 19,20)

(అర్థము:- ఈ శిరశ్చంద్రుని యమృతస్రావముచే శరీరము మదము బొందుచుండ, హృదయమందు ప్రకాశించు సూర్యకాంతిచే చిత్తము జ్ఞానము పొందుచున్నది. ఓ శచీ! భారతదేశ గతిని చూచి దుఃఖితుడనైయున్న నాకు యోగముదముచే తృప్తి కలుగదు. అమోఘమైన దుఃఖనివారణోపాయము నెఱుగుటకై నా హృదయసూర్యుని ప్రకాశింపజేయుము.)

శ్లో॥ "అవీర చరితం విపాలక కథం।
విరార్ష విభవం చిరా న్మమ కులం।
ఇదం మమ మనో నికృంతతి ముహు।
స్త వాంబ! చరణం ప్రజామి శరణం॥
చిరాత్స్మృతి పథాదపిచ్యుత మజే।
తపోబలభవం త మార్షవిభవం।
స్వదేశ మధునా పున ర్గమయితుం।
త వాంబ చరణం ప్రజామి శరణం॥
హతం చ విహతం ధుతం చ విధుతం।
రుదంత మఖిలో విశిష్టకరుణే॥
ఇమం స్వవిషయం శివం గమయితుం।
త వాంబ చరణం ప్రజామి శరణం॥"

(శ. 7, స్త.2, శ్లో. 16–18)

(అర్థము:- వీరుల చరిత్ర నశించి, పాలకుల కథ మాటువడి, ఋషి వైభవము శూన్యమైయున్న నా కులము చిరకాలమునుండి నా మనస్సును మాటిమాటికి వేధించుచున్నది. ఓ తల్లీ! నీ చరణమునే శరణు బొందుచుంటిని.

చిరకాలమునుండి స్మృతిమార్గమునుండి జారియున్నను, తపోబలజనితమగు నార్షవైభవ స్థానమును తిరుగ పొందించుటకో తల్లీ! నీ చరణమునే శరణు బొందుచుంటిని.

కొట్టబడి, యణచబడి, కదల్పబడి, కల్లోలము గావింపబడి యంతటను రోదనచేయు నా స్వదేశము మంగళప్రదమగుటకో తల్లీ! నీ చరణమునే శరణు బొందుచుంటిని).

శ్లో॥ "అవ భారతక్షితి మమోఘ దయే।
శరణం భవ త్విహ త వైష జనః
విజయో: పవిత్రి చరణాంబుజయో।
ర్న విహతు మర్హసి చిరాద్భుజకం॥" (శ.7, స్త.3, శ్లో. 10)

(అర్థము:- ఓ యమోఘదయే, పవిత్రీ! ఈ భారతభూమిని నీవు రక్షింపుము. అందుకే జనుడొక సాధనమగుగాక. నీ నిజపాదపద్మమును చిరకాలమునుండి భజించుచున్న వీనిని విడువకుము).

లోకమం దప్పుడు జరుగవలసిన సంస్కారము వివిధ రంగములకు జెందియున్నందున భగవంతుడు పెక్కుమంది మహాపురుషుల నవతరింపజేసెనని గణపతిముని నమ్మియుండెను. వారిలో భారతదేశమం దట్టి యీశ్వర కార్యమును నిర్వర్తించిన మహాపురుషులను సూచించుటకు వారి కార్యతత్త్వముల నింద్రాణీ సప్తశతిలో స్మరించెను. ఆ శ్లోకము లిట్లున్నవి :-

శ్లో॥ "జగతాం చక్రవర్తి న్యసిత స్తేకటాక్షః।
జలదో భక్తి భాజాం శిఖినాం వర్తనాయ॥
సుకృతీ కోపి నాట్యే బహుళే తత్రమాతః।
జగతే సారభూతా నుపదేశా న్కరోతి॥
అపరో నవ్యకావ్యా న్యనవద్యాని ధన్యః।
విదధా త్యప్రయత్నా ద్బుధ భోగ క్షమాణి॥
ఇతరో భాగ్యశాలీ రమణీయైః ప్రపంచైః।
వితనోతి స్వజాతిం జగతి శ్రేష్ఠ నీతిం॥
జగతాం మాత రేకోమహసా పుణ్యశాలీ।
విధుతారి స్వదేశం కురుతే వీతపాశం॥
పర ఇంద్రాణి! సాధు ర్నత విస్మృత్య విశ్వం।
రమతే సిక్తగండః ప్రమదాశ్రు ప్రతానైః॥" (శ.2, స్త.3, శ్లో.6-11)

అర్థములు:- ఓ జగతాం చక్రవర్తినీ! నీ నల్లనైన కటాక్షము భక్తులనెడి నెమిళ్లయొక్క నాట్యముకొఱకు మేఘమగుచున్నది (వర్షమువలె ననుగ్రహించుటకు) తల్లీ! వివిధములైన ఆ నాట్యములో నొక పుణ్యపురుషుడు జగత్తుకొఱకు శ్రేష్ఠమైన యుపదేశమును చేయును - (రమణమహర్షి).

ధన్యుడైన వేఱొక డప్రయత్నముగా పండితుల ముదముకొఱ కనింద్యములగు నూత్నకావ్యములను సృష్టించును - (గణపతిముని).

భాగ్యశాలియైన యింకొకడు రమ్యప్రపంచములచే జగత్తునందు తమ జాతివారికి శ్రేష్ఠమైన నీతినిచ్చుచున్నాడు. (అర్విందుడు).

ఓ జగన్మాతా! పుణ్యాత్ముడైన మఱియొకడు తన తేజస్సుచే శత్రువుల నోడించి నిజదేశమును బంధమునుండి విడిపించుచున్నాడు - (గాంధి).

ఓ యింద్రాణీ! సాధువైన యింకొకడు విశ్వమును మఱచి యానంద బాష్పములుగల చెక్కిళ్లతో క్రీడించును - (అరవిందుడు) ఆశ్చర్యము!

అటుపిమ్మట శక్తి ప్రబోధముకొఱకు గణపతిముని మాతగుహలో తపోనిష్ఠుడై నాలుగు మాసములు గడిపెను. ఆ లోపున నొక విచిత్రము జరిగెను. మహర్షి సోదరుడైన నిరంజనానందస్వామి యొకానొక మాతృసంబంధమగు ప్రేరణము పొంది, యళగమ్మ సమాధిస్థలము తడియకుండుటకు దానిపై నొక పాకవేసి, రెండు గదులుగల కుటీరముగా నిర్మించి, తా నొక గదిలో నివసింపదొడగెను. అళగమ్మ నిర్యాణమైనప్పటినుండి స్కందగుహయందు వంట మాని యెచ్చెమ్మో తెచ్చు భోజనముతో మహర్షియు, పురములో భిక్షాన్నము తెచ్చుకొని సోదరుడును గడుపుకొనుచుండిరి. కావున సోదరుడు తన బస మార్చుకొనుటవలన మహర్షి కిబ్బంది లేకపోయెను. ఆ సమయమందు 'దండపాణి' యను నొక రమణ భక్తుడు వచ్చియుండెను. ఇతడు బలాఢ్యుడు, సాహసము గలవాడు. అళగమ్మ సమాధిస్థలము కొండనుండి దిగువకు వ్యాపించి యడవిచే కప్పబడి, చిఱుత పులులు వచ్చుచుండుట కవకాశముగా నున్నందున నిరంజనానందస్వామి దండపాణితో దపేక్షించెను. దండపాణి యతనికి తోడువెళ్లి యూరకుండలేదు. దూరముననున్న తన స్నేహితులను సత్కార్యముకొఱకు లేఖలమూలమున ప్రోత్సహించి, తగినంత ధనము రప్పించుకొని, యతడా సమాధి కిటునటు దాలమేరవఱ కడవిని నరికించి, భూమిని సమతలముచేయించి, చుట్టూ నావరణముగా కంచె వేయించి, యా స్థలమంతయు కార్తిక మాసము ముగియు సరికి కన్నులపండువుగా చేసెను. ప్రతిదినము వాహ్యాళికా దిక్కునకు వచ్చుచున్న రమణున కతని భక్త్యుత్సాహములు సంతోషము కలిగించెను.

పిదప మార్గశిర మాసములో వచ్చు రమణ జయంతి నా స్థలమందే జరుపవలెనని దండపాణికి గాఢముగాతోచి, యానాడు పేదల కన్నము వండిపెట్టుటకు నిశ్చయించి, బియ్యము మొదలగు వస్తువులను చేకూర్చెను. అతని కీ కార్యమందు మఱియిద్దఱు రమణభక్తులు తోడైరి. కాని, రమణు డక్కడకు వచ్చుట కంగీకరించునో లేదో యను శంక వారందరి నలముకొనెను. అసలట్టి యుత్సవము లతనికి గిట్టవు. భక్తులొకవేళ తామున్న స్థలముకడ వారి భక్తికొలది యేమి జరిపినను కిమ్మనడు. అత డుత్సవము జరిపించుకొనుటకొక చోటికి వచ్చునను నాశ వారి కందువలన నిరాశకాజొచ్చెను. ఇట్లుండ వారి ననుగ్రహించుటకో యనినట్లు జయంతికొక వారము దినములకు పూర్వ మొకనాడు శ్రీ రమణుడు వాహ్యాళికి వచ్చినట్లే వచ్చి యక్కడనే యుండిపోయెను. మఱునాడు స్కందగుహ మూయబడుటకు రమణుడు తన సోదరున కాజ్ఞ గూడ నొసగి, తన వాహ్యాళికి సమాధిస్థలమునుండి స్కందగుహవఱకు - అనగా పూర్వదిశనుండి తిరుగ వేసినట్లు-

మార్చుకొనెను. ప్రత్యక్ష దైవమువలె స్కందగుహనుండి పురమున కన్ని వేళల యందు గోచరించు రమణుడా గుహయం దదృశ్యుడగుట పురములో కొందఱికి దురదృష్టమనిపించెను. వారు రమణుని సమీపించి యీ మార్పునకు కారణమడుగగా, తన నిజేచ్ఛవలన తాను రాలేదనియు, నొకానొక పరేచ్ఛ వలన తనకు కదల బుద్ధి పుట్టినదనియు రమణుడు ప్రత్యుత్తరమిచ్చెను. ఆ పరేచ్ఛాశక్తిగా వెలసినదే యళగమ్మయై తన బిడ్డల నిద్దఱను తన చెంతకు తెచ్చుకొనెను. అప్పుడక్కడ జరుపబడిన జయంతి రమణాశ్రమోద్భవమునకు కారణమై, రమణునకు మాతృ జన్మనిచ్చెను.

౬౦

## అఱవ ప్రకరణము

# నూత్న బాధ్యతలు, రాజకీయము

క్రీ.శ. 1922 సం॥ డిసెంబర్ 7వ తేదీ పునర్వసు నక్షత్రయుక్త గురువారమునాడు జరుపబడిన జయంత్యుత్సవమునాడు రమణాశ్రమమొక్క కుటీరముగల స్వల్పాకృతితో రూపొందినను, గుహేశుడైన రమణునకు లోకహిత కార్యోపాధి యగుట కుద్భవించిన ఆ యాశ్రమము మానవదేహమువలె సర్వాంగోపేతమై వృద్ధిజెంది వర్ధిల్లునని గణపతిముని చూచినవాడై, తన చిరకాల వాంఛ యొకటి యీశ్వరునిచే ననుగ్రహింపబడినట్లు సంతసించెను. ఉమాసహస్రము రచింపబడినది మొదలు గణపతిమునికి వాంఛ యుండి, రమణునియందు కార్యప్రబోధమగుటకు దాని నెనిమిదిసార్లు సంస్కరించెను. ఒక్కొక్క సంస్కార మొకొక్క శుభపరిణామమును తనయందో, రమణునియందో కలిగించెను. ఒక్కొక్కప్పుడట్టి పరిణామానంతరము దేవతపై కృతజ్ఞత జూపుటకు గూడ గ్రంథము సంస్కరింపబడెను. ఇప్పటి కా ఫలము పూర్ణమైనట్లు సంతసించినందున దాని నీసారి యింద్రాణీ సప్తశతితో సహా సంస్కరించి తుదిరూపము నిచ్చుటకు గణపతిముని వెంటనే పూనుకొనెను.

ఆ సమయమందు దొక నూత్న శిష్యుడు లభించి యమ్మనాయన నుభయులకు ప్రీతిగూర్చెను. ఇతని పేరు గోవిందరాజుల సుబ్బారావు. విజయవాడ కాపురస్థుడు. నూత్నముగా విదురుడై యిత డాధ్యాత్మ ప్రవృత్తిచే తన వకీలు వృత్తిని మాని తిరువణ్ణామలై చేరి, శ్రీ రమణునిచే హృదయ విద్యోపదేశమును బడసి, మహర్షి సనువున నాయనకు శిష్యుడయ్యెను. నాయన తన కప్పటి కనుభవసిద్ధమైన సహస్రారతత్త్వము నితని కుపదేశించెను. దత్తాత్రేయ భక్తుడైన యితని యందున్న చిత్తనైర్మల్యము, సాధనదృష్టి నాయననట్లు ప్రేరేపించెను. అంతేగాక, నాయన తనకీ శిష్యు నింద్రాణి యనుగ్రహించినట్లు భావించి, వాని వలన ముమ్ముం దాంధ్రరాష్ట్రమున తనకొక కేంద్రము స్థిరపడునని యాశించెను.

1923 సం॥ ఫిబ్రవరి నెల ముగియుసరి కింద్రాణీ సప్తశతి లోని నాలుగు వందల శ్లోకము లించుమించుగా నుమాస్తుతి లోనికి చొరపెట్టబడి, దానికి తృప్తికరమగు రూపమీయబడెను. అది తుదిసంస్కారముగా నెంచి, దానికొక శుద్ధ ప్రతిని * వ్రాసి నాయన రమణున కర్పించెను. అటుపిదప ఉమాస్తుతి నుండి

* 1942 సంలో ఉమాసహస్ర ముద్రబడినప్పుడీ ప్రతియే యాధారమయ్యెను.

తీసివేయబడిన శ్లోకములలో కొన్నింటిని మాత్ర మింద్రాణీ స్తుతిలో ప్రవేశపెట్టి, మిగిలిన గ్రంథ భాగమును క్రొత్త కూర్పులతో పూరించి, దానికి మరల చక్కని తీరు తెచ్చెను. ఈ కార్యమంతయు శ్రావణమాసము వచ్చుసరికి పూర్తిగావించి, పెద్ద ఋణభారమునుండి విముక్తి పొందినట్లు వాసిష్ఠుడు సంతసించెను. రమణుడు సైతము మాతృఋణము దీరిన తరువాత పంజరమునుండి విడివడిన విహంగము పగిది సంతసింపజొచ్చెను. కాని, నూత్నాశ్రమము వలన నూత్న బాధ్యత లతని కెదురయ్యెను. అట్లే నాయనకు కొన్ని నూత్న కుటుంబ బాధ్యత లెదురుకాజొచ్చెను.

ఎట్లనగా, కుమారుడగు మహాదేవమున కా శ్రావణ మాసములో విషేకము నిశ్చయింపబడెను. ఈ కార్య మతని యత్తవారింటనో, కలువఱాయిలోనో చేసి కొనినచో విశేష వ్యయము లేకుండ ముగించుకొనవచ్చుననియు, దానికి విశాలాక్షమ్మ మాత్రము వెళ్లివచ్చిన సరిపోవుననియు, విషేకానంతర మామె కలువఱాయి లోని సొంతగృహమందు కొడుకును, కోడలిని కాపురముపెట్టి, వజ్రేశ్వరినికూడ వారి కొప్పగించినచో నమ్మనాయనలకు సంసారముక్తి చేకూరుననియు మొదట భావింపబడెను. అంతకుపూర్వమే విశాలాక్షమ్మ శరీరమస్వస్థతచెంది, చెన్నపురములో 'కేసరీ కుటీర'మందు పొందబడిన చికిత్స వలన తిరుగ స్వస్థత చెందెను. ఆమె కలువఱాయివఱకు దూరప్రయాణము సల్పుట యుక్తము గాదనియు, చికిత్సాలయమునకు చేరువలోనుండుట మంచిదనియు తలచబడి నందున కుమారుని విషేకోత్సవము తిరువణ్ణామలైలోనే జరుప నిశ్చయించి, పురమందు కాపురము మఱల పెలకొల్పవలసివచ్చెను. ఈ విధముగా విశాలాక్షమ్మ సంసారపంకమున తిరుగ జిక్కుకొనినను, నాయన మాత్రము చూతగుహను విడువలేదు.

ఈ నూత్న బాధ్యతవలన నాయనకుమాత్రము ధనసంబంధమగు చిక్కులు కొన్ని తటస్థించెను. పురమం దమ్మ కాపురము స్థాపించెనను వార్త వినినంతనే పూర్వము వేలూరులోవలెనే వైదికసంఘ శిష్యు లమ్మనాయనలను దర్శించుటకు తరచు వచ్చిపోవుచుండిరి. అమ్మ చేతి ప్రసాదమును వాంఛించువా రందులో సాధారణముగా నెక్కుడుగా నుండువారు. శిష్యవాత్సల్య మీ విధముగా నామెకొక వంక శ్రమము కలిగింప, నింకొకవంక గృహవ్యయము నధికము గావించెను. చిరకాలమునుండి యమ్మనాయనల పోషణభారమును సుధన్వుడు చాలవఱకు వహించుచుండెను. ఇప్పుడతని సహాయమునకు తోడుగా పొన్నుస్వామి, శంకరశాస్త్రి, జి.వి. సుబ్బారావు మొదలుగాగల ముఖ్య శిష్యుల సహాయమును పూర్వము వేలూరులోవలె నాయన తిరుగ నపేక్షించవలసివచ్చెను.

రమణాశ్రమములో దండపాణి యాధ్వర్యమున వంట ప్రారంభమై, అన్యగ్రామములనుండి రమణభగవానుని దర్శింప వచ్చినవారికి భోజనసత్కార

మొసగబడుచుండెను. వస్తురూపముననో, ధనరూపముననో చందాలెత్తబడుచుండెను. అవి సమకూరుటకు రమణానుగ్రహము ప్రవహించక తప్పదుగదా! రమణ గణపతుల కీ విధముగా బాధ్యత లంకురించినను, నొకరి కళ్యమ్మ వాంఛించినట్లవి లోకకుటుంబపరమైయుండి, యింకొకరికి స్వకుటుంబపరమై యుండెను.

ఇది యిట్లుండగా, నింద్రాణీ స్తుతి ఫలముగా నేదైన దేశహిత కార్యమం దీశ్వరుడు తనకుగూడ శక్తినిచ్చి, ప్రేరేపించునని వాసిష్ఠుడు విశ్వసించి, యట్టి యనుగ్రహముకొఱకు నిరీక్షించుచున్న సమయమందు 1923 సం॥ డిసెంబర్ నెలలో కాకినాడ పట్టణమందు జరుప నిశ్చయించిన 'కాంగ్రెసు' మహాసభా సమ్మేళనమున కాహ్వాన సంఘాధ్యక్షుడైన బులుసు సాంబమూర్తిగారి యొద్దనుండి నాయనకు ప్రత్యేకాహ్వానము వచ్చెను. ఈ యాహ్వాన మెందుకొఱకు పంపబడెనో, యెవరు ప్రేరేపించిరో యని నాయన తర్కించుకొనెను. గాంధీ నాయకత్వమున దేశస్వాతంత్ర్యమునకై పోరాటము సల్పుచున్న 'కాంగ్రెసు' సంస్థపై నాయన కభిమానమున్నను, నది రాజకీయ సంస్థయగుటవలన దానియందు పాల్గొనలేదు. కాని, యదివఱ కొకసారి 1916 సం॥లో కీ.శే. బయ్యా నరసింహశర్మగారి యధ్యక్షతను జరిగిన 'రాష్ట్ర కాంగ్రెసు' సభయందు స్వల్పముగా పాల్గొనిన ఫలముగా నీ యాహ్వానము వచ్చియుండుననియు, నప్పటివలెనే యిప్పుడును శాస్త్రీయ విషయములందు సహాయ మపేక్షింపబడి యుండవచ్చుననియు నాయనకు తట్టి, యిది యీశ్వరప్రేరణము కావచ్చునని భావించెను. ఇంతలో సాంబమూర్తి గారియొద్దనుండి ముప్పది రూపాయలుకూడ 'మనియార్డరు' రూపమున వచ్చి వాసిష్ఠుని మోమాటమున ముంచెను. అందువలన నాయన కా సమ్మేళనమునకు వెళ్లుట విధియయ్యెను.

కాకినాడ వెళ్లిన పిదప స్త్రీల హక్కులను గురించి శాస్త్రీయధోరణిలో చర్చించుటకై కీ.శే. సదాశివాచారిగారి యధ్యక్షత నేర్పాటుగావింపబడిన సభలో నాయన నుపన్యసింపగోరిరి. సాంబమూర్తిగా రపేక్షించినవాటిలో నిది మొదటిది. ఈ సభలో సంస్కృతమున, తెనుగునకూడ పద్యముల కొర్కెపై నాయన యుపన్య సించెను. పెక్కుమంది వక్త లుద్యోగములందును, ఆస్తి విభాగములందును స్త్రీలకు పురుషులతో సమాన హక్కుల నీయవలెనని యుపన్యసించగా, నాయన తన యుపన్యాసమందు పారమార్థిక విషయములో నిర్వర్తింపవలసిన కర్మకాండ పురుషుల కెంత విధియో, స్త్రీలకంత విధియనియు, నట్టి కర్మకాండయం దధికారము నిచ్చు నుపనయనము, హోమము, శ్రాద్ధము, యజ్ఞము, వేదశాస్త్ర పఠనము మొదలగు విధులయందు స్త్రీలకు పురుషులతో సమానమగు హక్కులున్నవనియు వేదశాస్త్ర ప్రమాణములచే బుజువొనర్చిన పిదప స్త్రీల నీ హక్కులను తిరుగ సముపార్జించుకొనుటకు హెచ్చరించెను. ఈ హక్కులను

విస్మరించి, వాటిని స్త్రీలు పాటించని కాలమందు రచింపబడిన అర్థికన్యాయ శాస్త్రము లీ హక్కులనుండి స్త్రీలను తొలగించి, పురుషులకు ప్రత్యేకత జూపెను. కనుక స్త్రీలు కర్మకాండకు చెందిన హక్కులను తిరుగ స్థిరపరచుకొనినగా డితర హక్కులు తమంతటనే సంక్రమించుననని నాయన ప్రబోధించెను. మధ్యకాలములో మన దేశమం దంకురించిన సంప్రదాయానర్థములను పరమార్థములుగా భావించి పూజింపక, మన జాతి కులకర్తలైన యార్యఋషుల సంప్రదాయములను తగు విధమున గ్రహించి యవలంబించుకొని, తద్వారా స్త్రీలు, పురుషులు గూడ పరస్పర క్షేమమును బడసి సుఖింతురుగాక యను నాశీర్వాదముతో నాయన తన యుపన్యాసమును ముగించెను.

గంభీరమై, యపూర్వమగు విమర్శ దృష్టితో కూడుకొనియున్న యీ యుపన్యాస మాంధ్ర కాంగ్రెసు నాయకులందును, పండితులందును సంచలనము పుట్టించెను. వాసిష్ఠు నాహ్వానించి, యాంధ్రులం దంతటి ప్రజ్ఞగల ధీరుడున్నాడని పరిచయము గావించినందులకు సాంబమూర్తిగారి నాంధ్ర కాంగ్రెసు నాయకులు కొనియాడిరి. అంతేగాక, కాంగ్రెసు సమ్మేళనమున కనుబంధముగా జరుపుటకు నిశ్చయించిన యొక సనాతన ధర్మసభకు వాసిష్ఠు డధ్యక్షుడు కావలెనను సాంబమూర్తిగారి యింకొక యాశయమును వా రేకగ్రీవముగా నామోదించిరి. ఈ సభ కాకినాడ సభలు ముగిసిన తోడనే 'అలమూరు' గ్రామమందు జరుపుటకు నిశ్చయించి, గాంధీ మహాత్ముడు చేరబెట్టిన యస్పృశ్యతా నివారణోద్యమమువలన సనాతన ధర్మములకు హాని కలుగునా యను విషయము శాస్త్రీయముగా చర్చింపబడుటకు పెక్కుమంది యాంధ్రపండితు లాహ్వానింపబడిరి.

నాయనను గురించి తమిళ రాష్ట్ర పండితుల కున్నంత పరిచయ మాంధ్ర రాష్ట్ర పండితులకు లేదు. పరిచయమున్న యే కొలదిమందియో తాతారాయుడు శాస్త్రివంటి ప్రథమ శ్రేణి పండితులే. వారివలన నాయన పాండిత్యవైభవ మాంధ్ర రాష్ట్రమున వ్యాపించుట కవకాశములుండియు వ్యాపించకపోవుట ఆంధ్రుల దురదృష్టము కావచ్చును. అలమూరు సభకు విచ్చేసిన పెక్కు పండితు లా కారణముచేత ఋషితేజముగల నాయనను జూచినప్పుడును, నాయన యధ్య క్షోపన్యాసమును వినినప్పుడును అబ్బురపడిరి. అంతటి మహాపండితుడు, వక్త, తేజస్సంపన్నుడు తమ యాంధ్రులలోనున్నను, వారి కతని నెరుకపరచని ప్రథమ శ్రేణి పండితులపై వారు కిన్కబూని, యది వారి యసహనముగా నెంచిరి.

అస్పృశ్యతను సమర్థించుటకా సభకు విచ్చేసిన ఛాందస పండితులకు మాత్ర మీ యుపన్యాసము గొడ్డలిపెట్టయ్యెను. కాని, వారిలో పెక్కుమంది నాయన యుక్తులకు సంతసించకపోలేదు. ధర్మస్వరూపమును శాస్త్రవిమర్శ వలనగాని, తపస్సు వలనగాని యెఱుగుటకు ప్రయత్నింపక దేశకాల భేదములచే మార్పుచెందు

నాచారసంప్రదాయములం దా స్వరూపము నుపపాదించుట పండితులకు తగదని నాయన చెప్పిన హితవాక్కు వారికి నచ్చెను. స్పర్శదోషము తురకలపట్ల, క్రైస్తవులపట్ల, మతి యితర మతస్థులపట్ల సడలియబడినప్పుడు స్వమతమునకు చెందిన పంచముల విషయములో సడలించుకొనుట కార్పాటములు సల్పుట హాస్యాస్పదమగునని నాయన హెచ్చరించి, సభలోని యధిక సంఖ్యాకుల నస్పృశ్యతా నివారణమునకు సుముఖుల గావించెను. ఇతరు లెదురాడలేకపోయినను, చిరకాల సంప్రదాయ శృంఖలముల నొక్కసారిగా వదల్చుకొనుటకు ధైర్యము చాలక తమ యనుమ్మతినిగాని, సమ్మతిని గాని వెలిబుచ్చక తూష్ణీంభావమును వహించిరి. అందువలన నధ్యక్షోప న్యాసము తోడనే యెట్టి ప్రతిఖండనము లేక యీ సభ ముగిసి నాయనకు దిగ్విజయము చేకూర్చెను. మహాజన మనస్సమావర్జన పటుతరముగల నాయన ప్రవచనాధోరణి కాంధ్ర కాంగ్రెసు నాయకు లాశ్చర్యానందములను బ్రకటించి, రాజకీయపాత్రను గూడ వాసిష్ఠుడు వహించినచో దేశనాయకులలో శిరోమణివలె ప్రకాశించునని స్తుతించిరి.

పిమ్మట కొందఱు నాయకులు, పండితులుగూడ తమ గ్రామములలో నస్పృశ్యతానివారణమును గుఱించి యుపన్యసించుటకు నాయన నాహ్వానించినను, తాను తిరువణ్ణామలైకి పోవు మార్గమందున్న కొన్ని గ్రామములం దుపన్యసించుటకు మాత్రము నాయన యంగీకరించెను. ఈ యుపన్యాసములద్వారా నాయన పెక్కుమంది పండితులకు, పామరులకు గూడ విచక్షణ గఱపెను. ఆచారవంతులకు నాయన చెప్పిన హితవెట్టిదనగా, నొక్క కుటుంబములోని వ్యక్తులకున్న యాచారములు వేర్వేరుగానున్నను, కుటుంబాచారమునకు కట్టుబడి యున్నట్లే యొక వర్ణమందు వివిధములైయున్న కుటుంబాచారములు సైత మా వర్ణముయొక్క సామాన్యాచారమునకు కట్టుబడియుండి, మొత్తమును శాసించుటకు విభాగములకు హక్కు లేకయున్న విషయమును జ్ఞప్తిచేసెను. ఒక వ్యక్తియొక్క ప్రత్యేకాచార మింకొక వ్యక్తిపై శాసించినప్పుడు సోదరులకైనను సంఘర్షణ తప్పదు. అట్లే యొక కుటుంబము తన ప్రత్యేక సంప్రదాయాచారము నా కుటుంబమునకు వెలుపల వర్తింపచూపినప్పుడు వివాదము తప్పదు. అట్టితఱి గుంపులో దొరబడి యొక వర్ణస్థు డితరులను దూరముగా నుండుమనుట తగునా ? తగదు గావున ఆచారవంతులు విరంకుశుల వలె ప్రవర్తించక, తమ యాచారమును తమ యింటి వెలుపలనున్నవారు మన్నించవలెనని యపేక్షించరాదని పదే పదే నాయన చెప్పుచువచ్చెను.

ఈ యుపన్యాసములలో నాయన నాలమూరునుండి 'మల్లాది శ్రీకృష్ణచయను'లను పండితుడు వెన్నంటి వచ్చెను. అలమూరులో వాసిష్ఠుని ఖండించుటకు సామర్థ్యము లేక యూరకుండిన కొందఱు పండితు లీ కృష్ణచయనుని

నేతగా నెంచుకొని పంపిరి. ఇతడు వాసిష్ఠుని యుక్తులన్నింటిని విని, వాసిష్ఠుడు తిరువణ్ణామలై చేరుకొనిన పిదప నాంధ్రపత్రిక మూలమున నతనిని ఖండించగా, వాసిష్ఠుడు ప్రతిఖండనము వ్రాసి పంపెను. రెండుమాసము లీ ఖండన ప్రతి ఖండనములు పత్రికాముఖమున జరిగిన పిమ్మట వాసిష్ఠుడొక దీర్ఘవ్యాసమును ప్రచురించి శ్రీకృష్ణచయనుని, యతని వర్గమువారిని కూడ ప్రత్యుత్తరము తోచకుండ చేసెను. కాంగ్రెసునాయకు లీ వ్యాసమును ప్రమాణముగా గైకొని భద్రపరచిరి.

కొంద ఱగ్రనాయకు లాంధ్రరాష్ట్రమునుండి వచ్చి, తమ రాష్ట్ర కాంగ్రెసు సంస్థలో వాసిష్ఠుని చేర్చుకొనుటకు యత్నించిరి. నాయనయొక్క యుపన్యాస పాటవము వినియోగించుకొనుటకు వారట్లర్థించగా, రాజకీయరంగము నీశ్వరాజ్ఞ లేనిదే ప్రవేశించుట యిష్టము లేదనియు, నట్టి యాజ్ఞ బొందక తాను ప్రవచనముల వలన సాధింపబూనుట వ్యర్థమనియు వాసిష్ఠుడు సమాధానమిచ్చెను. మఱికొద్ది దినములకు తమిళ కాంగ్రెసు నాయకు లర్థించగా, వాసిష్ఠుడు తన తపోవృత్తి కభ్యంతరము గలిగించుకొనుట యిష్టపడలేదు. వీరంతటితో విడువక "మీ పేరిచ్చిన చాలును, కార్యములను మేమే నెరవేర్చుకొందుము. మిమ్ములను ప్రచార కార్యములకైన వినియోగింప"మని తెగ పోరుపెట్టి ద్రవిడ రాష్ట్రీయ కాంగ్రెసు సభాధ్యక్షపదవి నంటగట్టిరి. ఈ విధముగా దాక్షిణ్యవశమున తన యిష్టము లేకున్నను 1924 సం॥లో వాసిష్ఠుడు కాంగ్రెసు సంస్థకు సభ్యుడై రాజకీయ వ్యూహమున జిక్కుకొనినవాడయ్యెను.

ఆ సంవత్సరమందే తిరువణ్ణామలైలో ద్రవిడ రాష్ట్రీయ కాంగ్రెసు సమ్మేళనము జరిగెను. దానియందు నాయన గంభీరమైన తన స్వాగత సంఘాధ్యక్షోపన్యాసము నిచ్చి, తన రాజకీయభావములను నిర్భయముగా ప్రకటించుటకు 'హిందూ' దినపత్రిక మిగుల కొనియాడెను. స్వరాజ్య పక్ష వాదులు తమ పక్షమును వాసిష్ఠుడు బలపరచెనని కొనియాడిరి. మఱియు వారు నాయన నఖిల భారత కాంగ్రెసు సభ్యునిగా నెంచుకొని, బెల్గాము పట్టణమందు 1924 సం॥ డిసెంబరలో గాంధీమహాత్ముని యధ్యక్షత క్రింద జరిగిన కాంగ్రెసు మహాసభలలో పాల్గొనుటకు తీసికొనివెళ్ళిరి. అక్కడ వాసిష్ఠు డస్పృశ్యతా నివారణము శాస్త్రసమ్మతమని సంస్కృతమున నుపన్యసించి, గాంధీ, బెసెంటు, మాలవ్యా మొదలగు దేశ ప్రముఖులచే కొనియాడబడెను. ఆ మఱునాడు 'హిందీ' దేశభాష కావలెనని గాంధీచే ప్రతిపాదింపబడిన తీర్మానమును నాయన విషయ నిర్ణాయక సభలో ఖండించుట కుపన్యసింపదలచి యుండగా, గాంధీమహాత్ముడు దేశభాష రాజకీయ సంబంధమని నాయనకు జ్ఞప్తిచేసి, 'మా రాజకీయములకు మీ రడ్డు తగులుట ధర్మముకా'దని పల్కెను. వాసిష్ఠు డా పల్కులకు సంతసించి, తన వాదము నుపసంహరించుకొని, రాజకీయ రంగములోని తన సభ్యత్వమునకు స్వస్తిచెప్పెను. అట్లయినను, సాంఘిక

విషయమైన యస్పృశ్యతా నివారణమునకు 1929 సం॥ వఱకు చేయూత నిచ్చుచునేయుండెను. ఆ సమయమందు రాష్ట్రవిభాగము మన దేశమం దుండ వలసిన క్రమమును గుఱించి రాజకీయ నాయకు లాలోచించుచుండగా, వారిని ప్రేరేపించుటకు 'రాష్ట్ర విబంధన'మ్మను గ్రంథమును నాయన రచించి నాయకులను సంతోషపెఱచెను.

ఓం

ఏడవ ప్రకరణము

# 'పూర్ణ' యను కథాఫలముగా గృహబాధ్యతలు నివారించుట

బెల్గామునకు దగ్గరలోనే గోకర్ణ మున్నందున కాంగ్రెసు మహాసభలు ముగిసిన పిదప దైవరాతుని చూచివచ్చుటకు వాసిష్ఠుడు గోకర్ణము పయనమయ్యెను. అంతకు మూడేండ్లకు పూర్వమే దైవరాతునకు వివాహమై, యొక యేడాదినుండి యతని భార్య కాపురమునకు వచ్చియుండెను. నాయన వెళ్లుసరి కామె గర్భవతియైయుండి, పురిటి కెక్కడికి పోవుటాయని బెంగగొని యుండెను. ఆమె బెంగను గుర్తించి 'నీవు భీతిచెందకుము. నిన్ను తిరువణ్ణామలై పంపుటకు నీ భర్తతో చెప్పెదను. అక్కడ నీ కమ్మ పురుడుపోయు'నని యామెకు నాయన ధైర్యము పల్కెను. గురుని పరిచయ మదివఱకు లేకున్నను, చల్లని యా పల్కుల కామె సంతాపము తొలగెను. పిమ్మట భర్తతో పాటు గురుసేవ భక్తితో సల్పుచు, వెంటనే తిరువణ్ణామలై పోదలచిన గురుని యామె రెండు మాసము లా గోకర్ణమం దుంచివేసెను. ఆమె పేరు శ్రద్ధాదేవి.

దైవరాతునకు బొంబాయి కాపురస్థుడైన 'మగన్‌లాల్' అను నొక ధనిక శిష్యుడుండెను. అతడు గణపతిముని రాక విని తన గురునకు పూజ్యుడైన మహానుభావుని దర్శింపగోరి బొంబాయి నుండి వచ్చెను. దర్శనము గావించుకొనిన పిదప గణపతిముని నొక్క మాసము తన యింట నుంచుకొనగోరెను. అప్పటికి శ్రద్ధాదేవి కేడవ మాసము దాటజొచ్చెను. గోకర్ణమునుండి పయనమగుట కామెకు గూడ నదియే మంచి సమయమని యతడు పల్కి, గణపతిమునితోపాటామెను, దైవరాతుని గూడ బొంబాయి తీసికొనివెళ్లి, వారందరికి గొప్ప సత్కారము చేసెను. అయిదారు వారము లక్కడ విందులు గుడిచిన పిదప వారు పయనము కాబోవుచుండగా మగన్‌లాల్ యొక్క భార్య శ్రద్ధాదేవిని పురిటికక్కడనే యుంచివేయుటకు యత్నించెను. కాని, మహర్షిగారిని, విశాలాక్షమ్మను చూడవలెనను కోర్కె గాఢమగుటవలన శ్రద్ధాదేవి తొమ్మిదవ మాసపు గర్భవతియైనను దూర ప్రయాణమునకు లెక్కసేయక తిరువణ్ణామలై వచ్చెను.

విశాలాక్షమ్మ యాదరణమును చూచినప్పు డామెకు నిజజనని యొద్ద నున్నట్లే అనిపించెను. పిమ్మట మహర్షిని దర్శించినప్పు డామెకు సాక్షాద్భగవంతుడే

మానవరూపమును బొందినట్లనిపించెను. పాపమీ భక్త్యుద్రేకములు, ప్రయాణపు టలసటతోబా టామె గర్భమం దొత్తిడి కలిగించెను. గాబోలు, నవమాసములు నిండకుండ పురుడు వచ్చి, మగశిశువు పుట్టి వెంటనే చనిపోయెను. అందరు దుఃఖించినను, బేలతనమున వామెకు దుఃఖము తెలిసినదిగాదు. పిమ్మట జ్యేష్ఠమాసమువఱకు శ్రద్ధాదేవియు, దైవరాతుడును తిరువణ్ణామలైలో గడిపి, యా మాసములో వజ్రేశ్వరికి జరుపబడిన నిషేకోత్సవమును, రాజేశ్వరికి జరుపబడిన సీమంతోత్సవమును చూచిన పిదప గోకర్ణము వెళ్లిపోయిరి. వెళ్లునప్పుడు వారు గురుదంపతులను గోకర్ణ మాహ్వానించిరి. 'సరే' యని యమ్మ పల్కినను, గృహకార్యభారమామెకు బంధమై, యెక్కడికిని వెళ్లనీయలేదు. ఇంతలో నాషాఢమాసము (జూలై, 1925) నుండి మూడు మాసములు నాయన యతిమూత్రముతో బాధపడి, కుటుంబముతోపా టింటియొద్దనే నివసించుచు, చికిత్సపొందెను. ఆ జూలై నెలలో తిరువణ్ణామలై హైస్కూలునందు సంస్కృతోపాధ్యాయపదవి లభించగా, మహాదేవము తనకు సంస్కృతమునందు ప్రవేశమేకాని పాండిత్యము లేకున్నను, దానిని స్వీకరించుటకు సాహసించెను. నాయన యనుగ్రహమున్నచో సామర్థ్యమొక్క క్షణములో వచ్చునని వాని ధైర్యము. ఈ వార్త విని మహర్షి కడుపు చెక్కలగునట్లు నవ్వెను.

భక్తుల చరిత్రలను విని, కొందరు భగవంతుని యాపద్బాంధవ లక్షణము నపార్థము జేసికొని, యిట్లే విషమావస్థలను స్వయముగా కల్పించుకొని భగవంతుని పరీక్షించుట కద్దు. మహాదేవము యొక్క సాహస మీ విధమును బోలియున్నదని గాబోలు మహర్షికి నవ్వు వచ్చెను. అప్పుడు మహర్షి వానిని చేరబిలిచి 'యేరోజు పాఠ మారోజు నాయన యొద్ద చెప్పించుకొమ్ము, క్రమముగా కొంత బోధించు ప్రజ్ఞ యలవడు'నని హితవు పల్కెను. అతడట్లే చేయుచు, నుద్యోగమును చక్కగా నిర్వర్తించుకొనదొడగెను. రెండు మూడు మాసములలో స్వయముగా పాఠముల నర్థముజేసికొను ప్రజ్ఞ పొంది యతడు తృప్తిచెంది, తన యుద్యోగమున కాపదలేకుండ చేసికొనెను. పిమ్మట రాజేశ్వరి పురిటికి పుట్టింటికి పంపబడగా, గృహభారము పుత్రునిమీదను, పుత్రిక మీదను విడిచి, విశాలాక్షమ్మ యింటియొద్దనే తనకు ప్రియమైన శ్రీవిద్యామంత్రముతో నహోరాత్రములు గడపుచు, తన దేహాభిమానములన్నియు తీరిపోయినదానివలెను, సంసారమందు నిర్లిప్తురాలివలెను ప్రవర్తింపజొచ్చెను. నాయన కప్పుడు చాల సంతోషము కలిగి, తానుగూడ మాతగుహ తిరుగ నధిష్ఠించెను.

మాతగుహయందు నాయన పెక్కు సూత్రగ్రంథముల* నదే సమయమందు రచించెను. పిమ్మట 'విశ్వమీమాంస' యను పేరుతో 393 శ్లోకములుగల

* ఈ గ్రంథముల పట్టిక కనుబంధము చూడుడు.

నొక గొప్ప గ్రంథమును రచించెను. ఈ గ్రంథమందు వేదాంతులు నేర్చుకొనదగు విశ్వరహస్యములను, యోగరహస్యములను పేర్కొని గ్రంథనామమును సార్థకము చేసెను. తుదిశ్లోకమందు కవియే యీ గ్రంథమును గుఱించి యిట్లు గానము చేసెను:

శ్లో॥ ''ఖణ్డీయం విశ్వమీమాంసా వాసిష్ఠేన ప్రవర్తితా।
యద్యత్రాప్రాప్యతేజ్ఞేయం తత్సర్వమిహవిద్యతే॥''

అటువిమ్మట మాతగుహయందు నాయన తపస్సున గడపదలచినను, కాంగ్రెసు మిత్రులేదో నెపమున మధ్య మధ్యను వచ్చి తపస్సున కభ్యంతరము కలిగింపజొచ్చిరి. ఒకసారి యొక విచిత్రమైన వివాదము నాయనకడకు పరిష్కారమునకు వచ్చెను. అది శర్మదేవిక్షేత్రమందు 'వ.వే. సుబ్రహ్మణ్య అయ్య' రను పేరుగల కాంగ్రెసు సభ్యునిచే నెలకొల్పబడిన 'భారద్వాజ గురుకులాశ్రమ' మునకు చెందియుండెను. ఈ గురుకులమం దతడు నానాజాతి బాలురను చేర్చి, వారికి నివాస మక్కరనే కల్పించి, స్వయముగా విద్య గరపుచు, విద్యతోపాటు సహపంక్తిభోజనముద్వారా వారియందు సమరసభావము, సోదరత్వము, దేశాభిమానము, జాతీయత మొదలగు కాంగ్రెసాదర్శములను పెంపొందించుటకు యత్నించుచుండెను. వంటకుమాత్ర మతడు బ్రాహ్మణునే నియమించి జాతిభ్రష్టముగాకుండ కాపాడుచుండెను. కాంగ్రెసు సంస్థకు చెంది, యీ గురుకులాశ్రమమునకు చందాదారులుగా నున్న బ్రాహ్మణేతర నాయకులు కొందఱీ యేర్పాటున కభ్యంతరము తెల్పి, తమ వర్ణస్థుని వంటకుంచవలెనని యొత్తిడిచేసిరి. 'రామస్వామి నాయకర్' యొక్క ప్రేరణమును బొంది వారు సుబ్రహ్మణ్య అయ్యరుపై జాత్యుత్కృష్టత చూపిన నింద మోపి యల్లరిచేసిరి. పైగా, గురుకుల నిర్వహణ మొక్కని యధికారముపై జరుగరాదనియు, నిబంధనావళి నేర్పర్చవలెననియు వారు పేచీపెట్టిరి. సుబ్రహ్మణ్య అయ్యరు తన సర్వాధికారమును వీడుటకు సమ్మతించనందువ వాదప్రతివాదములు పెరిగి, తుదకు వంటవాని సమస్యపై నుభయ పక్షములవారును నాయన తీర్పుగోరి, యా తీర్పెట్లున్నను మన్నించుట కొప్పుకొనిరి. 'పెళ్ళి కుదిరినగాని పిచ్చి కుదురదు, పిచ్చి కుదిరినగాని పెళ్ళి కుదురదను సామెతను నాయన తలచుకొని ప్రతికక్షిదారుల కిట్లు చెప్పెను: ''మీ వర్ణస్థుడు వంటవాడైనంతమాత్రమున జాత్యుత్కృష్టతాభావము నివారించు ననుకొనుట పొరపాటు. అట్టి భావమును మీరు నిష్పక్షపాతబుద్ధితో తొలగింప దలచితిరేని, యేయొక్క బాలునకు జాత్యుత్కృష్టత దక్కకుండునట్లొక పంచమ వర్ణస్థుని వంటకు నియమింపుడు.''

ఈ తీర్పునకు బ్రాహ్మణేతర నాయకులు భయపడి, వాసిష్ఠునితో వాదింపగోరి

కొన్ని లేఖలను వ్రాసిరి. ఇంతలో సుబ్రహ్మణ్య అయ్యరు హఠాత్తుగా చనిపోయిన వార్త నాయన విని, బ్రాహ్మణేతర నాయకున కొక ప్రాచీన కవి శ్లోకము నర్థ సహితముగా వ్రాసి పంపెను. ఆ శ్లోక మిది:-

శ్లో॥ రాత్రిర్గమిష్యతి భవిష్యతి సుప్రభాతం।
భాస్వానుదేష్యతి హసిష్యతి పంకజాతం।
ఇత్థః విచింత యతి కోశగతే ద్విరేఫే।
హా! హంత! హంత! నళినీ గజ ఉజ్జహార॥'

(అర్థము :- రాత్రిపడి పంకజము ముకుళించెను. అందున్న తుమ్మెద యిట్లనుకొనెను: 'రాత్రిపోయి తెల్లవారును గదా. అప్పుడు సూర్యుడుదయించగా పంకజము వికసించును గదా.' ఇంతలో నొక యేనుగు వచ్చి యా చెరువులోని పద్మములను పీకి నలిపివేయగా తుమ్మెద చచ్చెను).

1925 సం॥ నవంబరునెలలో చూతగుహనుండి నాయనకు మరల చలనము కల్గించెను. పండితుల యనురోధము వలన మచిలీపట్టణములో జరిగిన సనాతన ధర్మసభకు నాయన వెళ్లవలసివచ్చెను. సభయం దత్యంత జయప్రదముగా నాయన యుపన్యసించి, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారిచే (తిరుపతి వేంకటకవులని ప్రసిద్ధిగాంచిన జంటకవులలో నొకరు) మిగుల కొనియాడబడెను. మచిలీపట్టణ మందు నాయన తనకు శిష్యుడైన 'చెరువు రామకృష్ణయ్య' యింట బసచేసెను. రామకృష్ణయ్య తండ్రి యగ్నిహోత్ర విధుల ననుదినము పాటించు గొప్ప కర్మిష్ఠి. సభయందు నాయన యుపన్యసించిన విషయముల నితడు వినినంతనే తన యగ్నిహోత్రమునకు, తన కర్మానుష్ఠానమునకు నాయన రాకవలన నపచారము కల్గునను భయముతోచి, యస్పృశ్యతను పాటించని నాయనను తన గృహము చేరనీయరాదని పట్టుబట్టెను. కాని, కుమారుడు తన తండ్రి నీ విషయములో మన్నింపజాలక గురు నాహ్వానించి గురునితోపాటు కొందఱు పెద్దలకుగూడ విందు గుడిపెను. తండ్రి కోపవశమున గృహము విడిచి, తిరుగ సాయంత్రము వచ్చి తన యగ్నిహోత్ర విధిని సల్పుచుండగా నతని కా యగ్ని జ్వాలారూపమే నాయనగా వెలసిన వ్యక్తియను దివ్యస్ఫూర్తి కలిగెను. వెంటనే యతడు నాయన పాదములను ధరించి భక్తుడయ్యెను. మచిలీపట్టణమునుండి నాయన విజయవాడ, కాకినాడ పట్టణములకు వెళ్లి యక్కడి శిష్యులయొద్ద కొన్నాళ్లు గడపిన పిమ్మట తన స్వగ్రామము వెళ్ళి, యక్కడనుండి 'సుంకి' గ్రామము చేరెను.

విజయవాడ చేరినప్పుడు నాయన జి.వి. సుబ్బారావను శిష్యుని యింట నొక వారము దినములు గడిపెను. అప్పుడు సుబ్బారావు వేడుకపడి నాయనను మంగళగిరి క్షేత్రము తీసికొనివెళ్లెను. అది నరసింహస్వామి క్షేత్రముగా ప్రసిద్ధిబడసి

యున్నను, నాయన కది గొప్ప ఇంద్ర క్షేత్రముగా స్ఫురించెను. ఈ స్ఫూర్తి గాఢమై, నాయన స్థలపురాణము నడిగి తెలిసికొనగా, నాయన స్ఫూర్తి నిజమయ్యెను. అక్కడనుండి విజయవాడ మరలిన పిదప నొక విచిత్రము సంభవించి, యది యింద్రానుగ్రహముగా నాయనకు తోచెను. ఎట్లనగా, నొక పత్రికయందు నాయనకు తన ధర్మశాస్త్రాభిప్రాయముల నుక్రోషము కొలది దూషణ విధానమున ఖండించిన నొక వ్యాస మగపడెను. నాయన ప్రతివిమర్శను శాస్త్రీయధోరణితో వ్రాయదలచియుండగా, విమర్శను తొలుత ప్రచురించిన 'పాకయాజి' యను పండితుడే స్వయముగా వచ్చి నాయన శరణుబొంది క్షమింపవేడెను.

ఆ సమయమం దింకొక యద్భుతముగూడ నింద్రానుగ్రహ సూచకముగా సంభవించెను. నాయనతో గూడి యున్న శివరామ శాస్త్రికొక స్వప్నము వచ్చి, స్వప్నమందు పంజాబీ వేషమున నున్న భార్యాభర్త లిరువురు వీధి తలుపు తట్టి, శివరామశాస్త్రిచే తలుపు తెరువబడినంతనే సుబ్బారావుకొఱకు వచ్చినట్లు వారు పలికి, వలదనుచున్నను గృహముఁజొచ్చి, మఱికొద్ది నిముసములైన తరువాత వారిలో పురుషుడు మాత్రమే బయటికి వెడలుచు, తనతో వచ్చిన స్ఫురద్రూపిణి యైన స్త్రీ నా యింట దిగవిడచినట్లు సూచించెనట. ఆమె యలంకార వర్ణనను విని యామె నిశ్చయముగా సుబ్బారావు ననుగ్రహించుటకు వచ్చిన మంగళగిరిక్షేత్ర దేవతయగు ఇంద్రాణి యని నాయన నిశ్చయపరచెను. ఆ యనుగ్రహ మతనియం దీ జన్మలో పరోక్షముగా నున్నను, అతని కాధ్యాత్మరంగమందు గొప్ప యభివృద్ధి నిచ్చునని నాయన నిష్కర్షగా నుడివెను. నాయన వాక్కు ఫలించిన ట్లతడు పిదప నభివృద్ధిగాంచి, శ్రీ రమణమహర్షికికూడ ప్రీతిపాత్రుడయ్యెను. మహర్షి సనుపున నతడు 1944 సం॥ నుండి తిరువణ్ణామలైలో శ్రీ రమణ సన్నిధియందు వసించెను. ఇప్పుడత డనకాపల్లిలో నొక యాలయమం దాశ్రమమును గల్పించు కొనియున్నాడు.

నాయన తిరువణ్ణామలై వీడక పూర్వమే రాజేశ్వరికి పురుడు వచ్చి యాడపిల్ల పుట్టెను. ఇది తిరువణ్ణామలైలోనే సంభవించినందునను, ప్రథమ సంతానమగుట వల్లను పిల్ల యొక్క నామకరణోత్సవము గొప్పగా జరుపుటకు నిశ్చయించి తన నిశ్చయమును కాకినాడ, విజయవాడల లోని ముఖ్యశిష్యులకు నాయన దెల్పెను. వారీ యుత్సవములకు వలయు ధనసహాయమును పంపుదురన్న తలంపుతో స్వగ్రామములో వసూలైన స్వల్ప శిస్తుధనమును నాయన తన తిరుగు ప్రయాణమునకు వెచ్చించెను. అనుకొనినట్లు శిష్యులనుండి ధనసహాయము రాలేదు. రాకుండుటకు ధనసహాయము కావలెనని వారిని స్పష్టముగా నాయన యడుగకపోవుట యొక కారణమై యుండవచ్చును. మహాదేవముపై వారికున్న కోప మింకొక కారణమై యుండవచ్చును. అతడు స్వగ్రామమందు నివసించి, భూములపై

హాయిగా బ్రతుకుట మాని, భూఫలము నితరులకు విడిచి యితరు లమ్మనాయనలకు పంపు సహాయముపై విశేషముగా నాధారపడుచు, వారికి శాంతిలేకుండ చేయుచుండెనని నాయన శిష్యులందఱికి బాధగానున్నది. వీరి బాధ నాయనకు తెలియును గావున ధనసహాయ మే మూలనుండియు రానందుకు కించపడలేదు. ఉత్సవమెట్లో ముగింపబడి, పిల్లకు వజ్రేశ్వరి యను పేరుంచబడెను.

ఆ సమయమందు - అనగా 1925వ సంవత్సర యంత్యభాగమందు రమణాశ్రమ వ్యవహారములుకూడ మహర్షి మనస్సునకు నొప్పి కలిగించు విధమున పరిణమించెను. ఆశ్రమము పెత్తనము భక్తుల చేతులలో పడి, యొకరి కంటె నొకరా పెత్తనమునం దధికమగుటకు తగవులాడజొచ్చిరి. మాటిమాటికి పెత్తనము మారుటయేగాక, పైనుండి ధనరూపమున వచ్చు విరాళములను వారు మాయము చేయజొచ్చిరి. పురమందు రమణానంద నిలయ మొకటి యిదివఱకే నెలకొల్పబడియుండెను. కొన్ని విరాళముల నా నిలయమువారు తమవేయని యపహరించుచుండిరి. ఈ మోసముల నరికట్టుటకు 1926 సం॥ ప్రారంభము నుండి రమణుడు తన సోదరుని బిలిచి, యతని నాశ్రమ సర్వాధికారిగా నియమించెను. అంతవఱకు నిర్లిప్తుడైయున్న నిరంజనానందస్వామి మహర్షి యాజ్ఞచే పెత్తనము వహించి, మోసగాండ్ర యాట కట్టించి, యాశ్రమమును చక్కని పద్ధతులపై నడపుచు, దాని యభివృద్ధికి నడుముకట్టెను.

1926 సం॥ ఫిబ్రవరి నెలలో నొక విచిత్రము జరిగెను. అప్పటి కేడునెలల గర్భవతియై యున్న వజ్రేశ్వరికి రక్తగ్రహణి ప్రారంభించెను. ఆమె తన భర్తతోడను, సోదరునితోడనుగూడ చెప్పెను. వా రుపేక్షచేసిరి. ఆమె కింతలో బాధ తీవ్రముకాగా, నాయనతో చెప్పుకొనెను. నాయన నివాసమప్పు డింటియొద్దనే యుండెను. ఉబుసుపోవుటకు 'పూర్ణ'యను కల్పిత కథను సంస్కృతమున రచించుచు, తద్ద్వారమున మన దేశమందు పూర్వ మాడి వడబోసిన ప్రజాహిత రాజ్యవిధాన మెట్లుండెనో రాజకీయ వర్గమువారి కాదర్శ మొకవంక జూపుచు, నింకొకవంక గీర్వాణభాషయం దదివఱకు లేని 'నవల' రచనాపద్ధతిని జొరబెట్టు చుండెను. కుమార్తె బాధను విని నాయన 'పేయవాజ* ఫలములు దొరికిన బాగుండును. సాయంత్రమున కెక్కడనైన ప్రయత్నించి తెచ్చెద'నని యామె నోదార్చెను. సాయంత్రములందు 'పూర్ణ' కథను వినుటకు పెద్ద కోవెల ప్రాకారమందు తన పుత్రుని, యల్లునితోపాటు కొందఱు శిష్యులు మూగుచుండిరి. ఆ దిన మక్కడ 'పేయవాజ' ఫల ప్రసంగము నాయన తేగా, దానిని సంపాదించుట కష్టమని యందరు పల్కిరి. కష్టమైనను సంపాదించవలెనని నాయన భావము. కాని కష్టపడుట కెవరికి నిచ్చలేనట్లు నాయన గ్రహించి, కుమార్తెకొఱకు కొంత

* ఇది యొక జాతి యరటిపళ్ళు.

తరువు జాలిచెందెను. వా రింతలో కథకొఱ కాతురపడిరి. కథ వెట్లో చెప్పుచున్నను, నాయన మన స్ఫంకొక విధముగా నుండెను. ఇట్లొక యరగంట సాగుసరి కెవరో నూత్న వ్యక్తి యొకడు వచ్చి, నాయనకు నమస్కరించి, తన చేతనున్న పేయ వాజ ఫలముల పెద నక్కర పెట్టి కోవెలవైపు పోయెను. అతడు వెళ్లిపోయిన పిదప నాయన దానివైపు చూచి యాశ్చర్యపోయెను. నలువైపుల శిష్యులు వెతకినను నూత్నపురషు డగపడలేదు. ఆ పండ్లలో రెండింటిని తినుసరికి వజ్రమ్మ బాధ మాయమయ్యెను. అప్పుడు నాయన తన బాధ్యతలను భగవంతుడు నివారింపనున్నాడని యీ స్వల్ప విషయము నుండి గ్రహించి సంతసించెను. ఈ యద్భుతము 'పూర్ణ' యను కథాఫలమని శిష్యులు నిశ్చయించుకొనిరి.

౬౦

## ఎనిమిదవ ప్రకరణము

# విశాలాక్షమ్మ నిర్యాణము, ఆశ్రమములో 'శ్రీ'చక్ర ప్రతిష్ఠ

క్రీ.శ. 1926 సం॥ మార్చి నెలనుండి విశాలాక్షమ్మ కారోగ్యము క్రమముగా క్షీణింపదొడగెను. చిరకాలము నుండి మంత్రవిభూతిని తరచుగా నోటిలో వేసికొను నలవాటామె కున్నది. వేసికొనునప్పుడెల్ల బహు స్వల్పమైనను, మొత్తముమీద దాని ఫలముగా రక్తము విరిగిపోయి, జీర్ణశక్తి క్షీణించెను. మంత్రదీక్షయందెల్లప్పుడు నుండగోరువారు తమ దీక్షకు నడుమ నడుమ నంతరాయము కల్గినప్పుడుగాని, భక్తిసంబంధములగు పులకాంకురితములను బొంది నప్పుడుగాని విభూతిని నాలుకపై వేసికొను నాదారము దక్షిణాదిని బహుళముగా నున్నది. ఈ యాదార మవలంబించిన కారణముగా నామె కారోగ్యము చెడినను మానసికముగా పవిత్రత హెచ్చినట్లామె భావించుచుండెను. ఏదెట్లున్నను, శ్రీ విద్యామంత్రము నామె ప్రీతితో బహుళముగా జపించి, మంత్రశక్తిభరితురాలయ్యె ననుటలో సందేహము లేదు. మంత్రబలమువల్లనే యామె యందు 1924సం॥ నుండి కుండలినీ ప్రబోధమగుచుండెను. ప్రాణములందు మంత్రాక్షరముల నైక్యము చేయుటయే యామె లక్ష్యముగా గొని నాలుగైదు మాసములనుండి తదేకదీక్షతో సాధించుచుండెను. అట్లైక్యము గావించినప్పుడే మంత్రసిద్ధియగు ననియు, ప్రాణము లప్పుడు పరిశుద్ధమూర్తి మంత్రదేవతా స్వరూపమును బొందుననియు నాయన స్వానుభవమువలన నామెకు బోధించెను. పతి వాక్కు నాదర్శముగాగొనినను, పతివలె జీవించియుండగా సిద్ధిబడయుట కామెకు కష్టము గావున, నళుమ్మవలె ప్రాణనిర్గమన సమయమందైన సిద్ధిబొందవలెనని కాంక్షించు చుండెను.

ఇట్లుండగా, గోకర్ణములో దీక్షిత దత్తాత్రేయు డొక యజ్ఞము తలపెట్టి, నాయన కాహ్వానమంపి, ప్రయాణధనముగా నూరు రూపాయలు పంపించెను. ఆహ్వాన లేఖ దైవరాతునిచే వ్రాయించబడెను. నాయన యా పత్రమును, ధనమును గూడ నందుకొనినను, విశాలాక్షమ్మ పరిస్థితివిబట్టి వెళ్ళజాలక, క్షమాపణవేడుచు, నిట్లు జవాబు వ్రాసెను:-

''వత్సా, దైవరాతా !

నీ యుత్తరమందినది. నీవు పంపిన నూరురూపాయలందినవి. దత్తాత్రేయ దీక్షితుని యజ్ఞము, నీ యాశ్రమము గూడ చూడ వేడుకయున్నను, నీ మాత విశాలాక్షి వ్యాధిగ్రస్థురాలైన కారణమున చికిత్సాదికార్యముల కామె చెంత నుండుట నాకు విధియైయున్నది. కనుక నా యీ యపరాధము క్షమింపదగినదని వారితో చెప్పవలెను.

ఇట్లు,

- వాసిష్ఠగణపతి.''

దైవరాతుడు గోరక్షణకొఱకు, యువకులందు బ్రహ్మచర్యమును పెంపొందించుటకు గోకర్ణమం దాశ్రమమును స్థాపించెను. అతడు భార్యాసహితుడై తిరువణ్ణామలై 1925 సం॥ లో వచ్చినప్పు డీ యాశ్రమోద్దేశమును నాయనతో చర్చించి, నాయన యాశీర్వచనమును గైకొనెను. ప్రాచీన ఋష్యాశ్రమపద్ధతికి పునర్జీవనమిచ్చుటకు విద్యాప్రకర్షచేతను, ఉపనిషత్సంబంధయోగవిద్యల నభ్యసింప జేయుటచేతను, బ్రహ్మవిద్యను బ్రకాశింపజేయుటయే యతని బ్రహ్మచర్యాశ్రమ లక్ష్యము గనుక నాయన నా యాశ్రమమున గురుస్థానము స్వీకరింప గోరెను. అప్పుడు నాయన తన యభిప్రాయము నిట్లు చెప్పెను: ''ఈ సమస్త భారతభూమి నాశ్రమపద మొందించుట మహత్తర తపఃప్రభావముచే ప్రయత్నింపదగును. నిష్కామ కార్యావలంబనముచే నట్టి గొప్పది సాధింపబడినచో ప్రయోజనముండును గాని, నాచే నొక్క స్థల మాత్రమపద మొందింపబడుట వలనగాదు. అట్లయినను, నీ సంకల్ప మనుసరింపదగినదే. చిన్నదిప్పుడు చేసినచో, పెద్దది తరువాత చూచుకొనవచ్చును.'' అప్పుడు దైవరాతుడు గురుని విశాలాదర్శమును గుర్తించి, తా సంకల్పించిన యాశ్రమమందు గురుస్థానము వహించుటకు గురునివంతు గురుని పాదుకలను భరతునివలె నర్థించి గైకొని పోయెను. తన యభిలాష నీ విధముగా కార్యరూపమున పెట్టిన పిదప దైవరాతు డూరకుండక గురుని యభిలాషకు తోడ్పడదలచెను. 1926 సం॥ ఏప్రిల్ నెలలో తన సోదరుడైన 'సీతారాం భరతి' నివాసమున్న 'శిరసీ' యను గ్రామమందొక ముద్రణాలయ మమ్మకమునకు రాగా, గురుని కార్యములకది యుపకరించునని యెంచి దైవరాతుడు తన సోదరునిద్వారా దానిని వెంటనే కొనెను. దాని నిర్వహణ భారమును సోదరునిపై మోపినను, దాని హక్కు సర్వస్వము గురున కర్పించుకొనుచు దైవరాతు డొక లేఖ నిట్లు నాయనకు వ్రాసెను! ''మీ సేవార్థమై యుమాసహస్రాది గ్రంథప్రకాశనము లొనర్చుటకు మూడువేల రూపాయలకు నేను శిరసీ గ్రామములోని 'నందినీ' ముద్రణాలయమును కొంటిని. దానివలన మీ గ్రంథములు సునాయాసముగా ప్రచురితములై లోకమున కందగలవు. మీ సాన్నిధ్యమే యిచ్చట

కోరబడుచున్నది. ఆ ముద్రణ యంత్రము సర్వస్వము మీ చరణముల కిదే సమర్పించుకొనుచుంటిని."

దైవరాతుని లేఖ విని విశాలాక్షమ్మ చాల సంతసించి 'మహర్షి తల్లికి నిరంజనానందస్వామి యెట్లో, నా కీ దైవరాతుఁ డట్లుపకరించుచున్నాడు. ఆమె పొందిన సిద్ధివంటిది నాకు ప్రాప్తించినచో, నా కీ ముద్రణాలయ ముచిత కార్యరూప మేల కారా'దని నాయనతో రహస్యముగా పల్కెను. ఈ పల్కులనుబట్టి యామె తన యంత్యకాలము సమీపించుచున్నదని గుర్తించినట్లు నాయనకు విశదమయ్యెను. కాని, దాని సమయమెప్పుడో నిష్కర్షగా తెలిసినవానివలె నాయన యప్పటికేమియు తొందరపడలేదు. విశాలాక్షమ్మ క్షీణించుచున్నను, ప్రతిదినము నాయనతో గూడి నెమ్మదిగా కాలినడకనో లేక బండిమీదనో రమణాశ్రమము వెళ్లి, రమణభగవంతుని దర్శనము చేసికొనుచుండెను. ఆమె దృష్టికి శ్రీవిద్య కాదిమ గురువైన దక్షిణామూర్తియే (దక్షిణ+అమూర్తి = మనకు దక్షిణ భాగమున నుండు హృదయమందు మూర్తి లేక యధిష్ఠించిన స్వరూపము) శ్రీ రమణుఁడని యుండెడిది. ఆ కారణముచేత నిరంజనానందుఁడప్పుడు మహర్షి కూర్చుండుటకై నిర్మించుచున్న 'హాలు' నామె చూచి, యతనికి రహస్యముగా నిట్లు చెప్పెను: "ఆశ్రమాభివృద్ధికై నీ యుత్సాహము నే నెఱుగుదును. దానికి మంత్రశక్తి తోడ్పడుటకు నీ వొక పని చేయవలెను. మహర్షిని దక్షిణామూర్తిగా గుర్తించి, యతనికి ప్రియమైన 'శ్రీ'చక్రము నాశ్రమమందు ప్రతిష్ఠించు నేర్పాటు గావింపుము." ఆమెయందున్న యభిమానముచే మహర్షి యామె సలహా నామోదించెను.

మిమ్మట ఏప్రిల్ నెలలో వజ్రేశ్వరికి పురుడు వచ్చి యాడపిల్ల పుట్టెను. పిల్లకు 'భానుమతి' యని నామకరణము చేయబడెను. ఆ యుత్సవమునకు వజ్రమ్మను పెంచిన యప్పాదంపతులు రాజాలకపోయిరి. కారణ మేమైయుండునని చింతించుచుండగా నొక తంతి వచ్చెను. యోగసాధనలచే గలుగు బాధవంటిది తనను పీడించుచున్న ట్లప్పశాస్త్రి యా తంతి నిచ్చి నాయన సాన్నిధ్యము నపేక్షించెను. అందువలన నాయన సికిందరాబాదు విశాలాక్షమ్మ మనస్సంతోషము కొఱకు వెళ్లవలసివచ్చెను. అప్పశాస్త్రి కాసనములో వ్రణమయ్యెను. కాని, తన బాధ వ్రణసంబంధము కాదనియు, యోగశక్తి సముల్లాసమును భరించుటకు దేహ మపరిశుద్ధమైనపుడు గల్గు నాడీసంబంధమగు బాధయనియు నతఁడు చెప్పగా, శిష్యుని యభిప్రాయమును నాయన ఖండించక వ్రణమునకొక చికిత్సచేసి, యోగసంబంధ దోషము తొలగుట కాశీర్వాదపూర్వకమగు శ్లోకము నిట్లు చెప్పెను:

శ్లో॥ "అజ్ఞాన ధ్వాంతాంధా నసహ్యరోగాగ్ని కీల సన్తప్తాన్।
భాసుర శీతల దృష్టి ప్రభయా పరదేవతా ఽవతాదస్మాన్॥"

(అర్థము:- అజ్ఞానాంధకారముచే నంధులమై, సహింపనలవిగాని రోగాగ్ని జ్వాలలచే తపించు మనలను చల్లని దృష్టితో ప్రకాశించు పరదేవత రక్షించుగాక).

అప్పశాస్త్రి కొన్ని దినములలో బాధ తగ్గినందున నాయన వెంటనే మరలెను. మరలిన వెంటనే యమ్మనాయనలు తమ కాపురమును బెజవాడ మార్చదలచిరి. ఆంధ్రమండలమందు రమణ సందేశమును వ్యాప్తమొనర్చు లక్ష్యముచే నట్లు తలపోసి, విజయవాడలో జి.వి. సుబ్బరావను శిష్యుని యింట నుండుటకు నిశ్చయింపబడెను. కాని, విషయము లింకొక విధముగా పరిణమించెను. జూన్ నెలాఖరున చిదంబరం విశ్వవిద్యాలయోత్సవ సందర్భములో నుపన్యసింపగోరుచు నాయన కాహ్వానము వచ్చెను. వెళ్లుటకు నాయన సందేహించెను. కాని, సుమారిఱువది సంవత్సరములనుండి దక్షిణ ప్రాంతమందున్నను చిదంబరము దర్శించని యమ్మ యీ అవకాశమును బోనీయక నాయనను ప్రయాణోన్ముఖునిగావించి, తానుగూడ యాత్రార్థమై వెంటవెళ్లెను. 5-7-26వ తేదీ సోమవారమునాడు వారు మరలివచ్చిరి. 18-7-26వ తేదీ నుండి విశాలాక్షమ్మ మంచముపట్టి, మందు ముట్టక నవరాత్రిదీక్ష పూని, పండుకొనియే శ్రీమంత్ర ధ్యానము సల్పుచు, ద్రవాహారమును గైకొనజొచ్చెను. ఎనిమిదవనాటి రాత్రి యామె 'నే కోరిన సిద్ధి యాంతర్యమం దనుభవముగుచున్నది. మీరు సంతోషింపు'డని నాయనకు తెల్పెను. శిష్యులకు నాయన ముందుగానే వ్రాసినందున పెక్కుమంది యామె నిర్యాణమునకు పూర్వమే వచ్చి, యామె యాశీస్సును గొనిరి. తొమ్మిదవనాడామె యంత్యశ్వాసవఱకు జాగరూకురాలై, మంత్రధ్యానమందే ప్రాణమును విడిచెను. ఈ విధముగా 45వ యేడు గడచుచుండగా 26-7-1926వ తేదీ ఆషాఢ బహుళ విదియ, ధనిష్ఠా నక్షత్రయుక్త సోమవారమునాడామె పరమపదమును బొందెను. ఆ వార్త వినిన తోడనే రమణు డవ్యాజ ప్రేమవశమున దుఃఖించెను.

౨౦

తొమ్మిదవ ప్రకరణము

# సికింద్రాబాదు, హైదరాబాదులలో సంచారము

అళఘమ్మ నిర్యాణమునకు, విశాలాక్షమ్మ నిర్యాణమునకు నాంతర్యానుభవము బట్టి భేదములేకున్నను, బాహ్యమునకు భేదము గోచరించును. ఒకరికి శ్రీ రమణుని సహాయమున వాసనారూపములందు ప్రాణమున కభిమానము నశించగా, ప్రాణము పరిశుద్ధమై దేవతాత్వమును బొంది, యిచ్ఛయు పరేచ్ఛ రూపమును బొందెను. ఇంకొకరికి స్వయంసాధనబలమువలన భక్తి మంత్రాక్షర రూపమునుండి తదంతర్వాహినియగు మంత్రదేవతాపరమైన కారణమున ప్రాణములా శ్రేష్ఠప్రాణమందు లీనమై, దేవతాసాయుజ్యమును బొందెను. ఇదియు దివ్యత్వము బొందుటేయైనను, విధానమందున్న వ్యత్యాసమువలన నంత్య సమయమందు విశాలాక్షమ్మ కళఘమ్మవలె ప్రాణనిష్వన మితరులకు తెలియునట్లు ప్రణవనాదముతో వెడలలేదు. ఒకరియం దిచ్ఛావృత్తిపరమమగుటకు ప్రాణము ప్రణవరూపమున నాకాశమును బొందెను. మఱియొకరికి ప్రాణవృత్తి పరమమగుట కిచ్ఛ భక్తిరూపమున మంత్రదేవతను బొందెను. ఒకరికి సన్న్యాసాశ్రమదీక్ష గైకొనిన పిదప నిట్టి ముక్తితో గూడిన నిర్యాణము ప్రాప్తించెను. మఱియొకరి కట్టి దీక్ష లేకుండ ప్రాప్తించెను. పూజింపదగిన అర్హత యిఱువురకు తుల్యమై ప్రాప్తించినను, సంఘపు కట్టుబాట్ల చొప్పన నళఘమ్మకు నిర్ణయించినట్లు నాయన విశాలాక్షమ్మ విషయములో సమాధిని నిర్ణయించలేదు. పైగా, స్వాభిమతము ననుసరించి, యామెకు యథావిధిగా పుత్రునిచే దహన సంస్కారము గావించెను.

తలిదండ్రు లెట్టి పరమార్థసిద్ధి పొందినను, పుత్రులు కూడ సిద్ధపురుషుల వలె కర్మకాండను విసర్జించి కర్మభ్రష్టులగుట నాయన యభిమతము కాదు. మఱియు వైదికఋషులకు మన దేశమం దెక్కడను సమాధులున్నట్లు చెప్పబడని కారణమున సమాధి పద్ధతి యే సాకుతో చేయబడినను, అన్యమత సంప్రదాయ మనియు, భూమి నీ విధముగా సేవ్యమున కనర్హమొనర్చుట యార్యమత మెన్నటికీ కాజాలదనియు నాయన విశ్వాసము.

భార్యానిర్యాణమైన పిదప నాయన యజ్ఞోపవీతమును విసర్జించి, కాషాయాంబరధారియై సన్న్యసించునని పెక్కుమంది తలచిరి. కాని, నాయన యట్లు

చేయక, బాహ్యవేషమం దితరుల మెప్పుకొఱకు బ్రాహ్మణ్యమునకు మోసము తలపెట్టలేదు. శ్రీ రమణుడు తెల్ల గోచీని విడువనట్లే నాయన యజ్ఞోపవీతము నెన్నడు విడువలేదు. దానిని విడిచి ప్రజలిచ్చు మోక్షస్థానము నాశించలేదు. తెలిసినవారికి శ్రీ రమణుడు ఋషియైనట్లే, నాయన గణపతిముని యగును. తెలియనివారికి వా రితరులకు సన్న్యాసమిచ్చు నధికారవంతులైనను, తా మింకను తమ పూర్వాశ్రమముల నతిక్రమించనివారైరి. వారి జీవిత పరమార్థము, వారియందు రెండు విధములైయుండు ఆత్మసిద్ధులలో చెరియొకటిగా వ్యక్తమై లోకమం దాదర్శమైన పరమార్థము పెక్కుమంది గుర్తించక, వారియెడ గానుగెద్దులవలె తమ తమ సంకుచిత దృష్టితోడనే ప్రవర్తించిరి. అట్టి సంకుచిత దృష్టిగలవా రెప్పుడును కయ్యములవలన వర్ధిల్లజాలరు. మన దేశమం దెన్నో సంస్థ లిట్టివారివలన నాదర్శములనుండి జారి నవ్వుల పాలగుచుండెను. వీరికి ప్రవేశమీయనిచో నెగతాళిచేసి, యపవాదములను కల్పింతురు. ప్రవేశమిచ్చినచో కీచులాటలను కల్పించి, సంస్థయందు పవిత్రభావములు గలవారెడమగువఱకు నిదురించరు. ఇట్టివారివల్లనే రమణాశ్రమమందు తొలుత యాజమాన్య కలహములు ప్రారంభించెను. ఈ కలహకారకులు క్రమముగా నంతవఱకు నెల్లరిచే సమానముగా పూజింపబడుచున్న రమణ గణపతులకే వ్యత్యాసములు కల్పించుటకు సాహసించిరి. గణపతిముని యాదర్శము విప్లవాత్మకమనియు, నతనికి, నతని శిష్యవర్గమునకు ధ్యేయము శక్తియనియు నొక విమర్శ లేవదీసిరి. క్రమముగా గణపతిముని కాంగ్రెసుతో పాల్గొనిన విషయము, అస్పృశ్యతా నివారణమును సమర్థించిన విషయము గోరంతలు కొండంతలుగా నిర్వచింపబడి, గణపతిమునియొక్క యాదర్శములు, సంస్కారభావములు రమణాశ్రమ లక్ష్యమునకు విరుద్ధములను నొక భావము నెదజల్లబడెను.

ఈ దుమారమునకు గణపతిముని చలించలేదు. రమణుడు యథారీతి నచలత్వమునే, తటస్థత్వమునే వహించి యూరకుండెను. కాని, గణపతిముని యొక్క సన్నిహిత శిష్యులు మాత్రము సంకటపడిరి. రమణాశ్రమమునకు దూర మగుటయే యప్పటి సందర్భములనుబట్టి వారి కుచితమనిపించెను. రమణ గణపతుల కుభయులకు ప్రియులై, చక్కని యాశ్రమముచే పుదుచ్చేరియందు ప్రకాశించుచున్న యరవిందుని తాము చేరినచో గణపతి మునికిగూడ మున్ముందు ప్రశాంతమగు స్థానము కల్పించవచ్చునని వారిలో కొంద రూహించిరి. వారి నమ్మవలె పూర్వమాదరించిన విశాలాక్షమ్మవలెనే యరవిందాశ్రమమున 'శ్రీమాత' యను నొక ప్రేమమూర్తి యుండుట వారి తప్తచిత్తములను మఱింత యాకర్షింప జొచ్చెను. సుధన్వ దాకవరి దేశనాయకులలో ప్రసిద్ధిగాంచిన చిత్తరంజనదాసుతో అరవింద, శ్రీమాతలను దర్శించి వచ్చెను. అరవిందునితో రాజకీయరంగమం దంతకుపూర్వమే

సుధన్వునకు పరిచయమున్నందున అరవిందాశ్రమమున చేరుట కతనికి సులభమైనను అతడు తొందరపడలేదు. కపాలియు శ్రీమాత పరిచయము నదివఱకు పొందినను నాయనను విడుచుటకు సంకటపడుచుండెను.

ఇట్లుండగా, సికింద్రాబాదునుండి నాయనకు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయమువా రాహ్వానము పంపిరి. ఆ నిలయముయొక్క రజతోత్సవములు జరుపుటకు నిశ్చయించి, వారు నాయన నా సభల కధ్యక్షులుగా నెంచుకొనినట్లా యాహ్వానము, దానితో పంపబడిన లేఖాంశములు తెల్పెను. సభలు 1927 సం॥ ఫిబ్రవరి నెలలో 16, 17, 18 తేదీలలో మూడు దినములు జరుపుటకు నిశ్చయించి, నాయన నొక నెల ముందైన రమ్మని వారు కోరిరి. కాని, నాయన యప్పు డతిమూత్రవ్యాధికి లోనై చికిత్సపొందుచు నీరసించి యింటి నంటి పెట్టుకొని యుండెను. విశాలాక్షమ్మ చనిపోయినప్పటినుండి యీ రోగ మంకురించి చికిత్సకు లొంగక, క్రమముగా హెచ్చుచుండెను. ఇంటియొద్ద కూతురు, కోడలు పరిచర్యలెన్ని చేసినను, ఆహారమందెంత శ్రద్ధగైకొనుచున్నను నవి విశాలాక్షమ్మ సేవకు, వంటకు సాటిగాకుండెను. ఇట్టి పరిస్థితిలో స్థలము మార్పైన మేలు చేయవచ్చునని నాయన భావించి సికింద్రాబాదునుండి వచ్చిన యాహ్వానము నింటివైద్యుడు వలదనుచున్నను నంగీకరించి, జనవరి నెలలో సంక్రాంతి పండుగలు ముగిసిన వెంటనే బయలుదేరుటకు నిశ్చయించెను.

ఈ నిశ్చయమున కింటిలోని వారందరు దూరప్రయాణమును దలచుకొని భీతిల్లిరి. ఇట్లుండగా, సంక్రాంతి పండుగలకు పూర్వమొక విచిత్రము సంభవించెను. ఒకనాటి మధ్యాహ్నము వీధి యరుగుమీద నాయన యల్లుడైన సోమయాజు లొక్కరు కూర్చుండి యేదో ఆలోచించుకొనుచుండగా నొక సాధు పురుషుడు వచ్చి "కావ్యకంఠ వాసిష్ఠ గణపతిమునిగా రున్నారా ? ఉన్నయెడల కన్యాకుమారీ క్షేత్రమునుండి వారికొఱ కొక సాధువు వచ్చెనని చెప్పెదరా" యని ప్రశ్నించెను. సాధువు ధరించవలసిన కాషాయ కమండలములు లేకున్నను 'సాధు' వని యతడు పిలుచుకొనుటకు సోమయాజులునకు నవ్వు వచ్చినను ప్రకటించక, 'సరే' యని పల్కి, లోనికేగి నాయన కా వార్త చెప్పి, మెల్లగా వీధిలోనికి తీసికొనివచ్చెను. వారు వచ్చునరికి సాధువు లేడు. ఇంతలో నెటుపోయి యుండునని సోమయాజులు రెండు వీధులు చప్పున పోయి వెతకెను. కాని, సాధువగపడలేదు. ఈలోపున నాయన తన యంతర్దృష్టితో నతడు నిజముగా మానవుడు కాడని తెలిసికొని చల్లదనము కొఱకు లోనికి పోయెను. నాయన గ్రహించినట్లే యతడు తన రోగమును హరించుటకు వచ్చిన దివ్యపురుషుడని బుజువయ్యెను. ఎట్లనగా, సాధువు మాయమైనట్లే నాయన రోగ మావాడే యాశ్చర్యకరముగా మాయమై, నీరసముకూడ మాయమగుట కెల్లరు విభ్రాంతులైరి.

భగవత్కృప నీ విధముగా పొంది, మొదట యనుకొనిన సమయమునకు నాయన సికింద్రాబాదు చేరెను. చేరినది మొదలు నాయనకొఱకు వేచియున్నట్లు పెద్ద పెద్ద యుద్యోగస్థు లొకరి వెంబడి యొకరుగా తమ యిళ్లలో నాయనకు విందులేర్పరచిరి. విందుసందర్భములో నాయన మనస్యసింహమనుట యొక వేడుకయయ్యెను. వారు రహస్యముగా నాయనకడ వారి కోర్కెల ననుసరించి మంత్రోపదేశములనుగూడ పొందిరి. వీరి యనురోధమున నాయన 'జెమ్‌షెడ్ హాలు'లోను, మహబూబు కళాశాలలోను, అల్బర్టు రీడింగు రూములోను, తమిళ సిద్ధాంత సంఘములోను, 'చిత్రాటాకీసు'లోను వందలాది జను లొక్కొక్కచోట మూగియుండగా బహిరంగోపన్యాసములనిచ్చి, మహర్షి సందేశమును సికింద్రాబాదులో మూలమూలల కందజేసి పెక్కుమందికి మంత్రదీక్షల నిచ్చెను. ఈ సంస్థలన్నియు సికింద్రాబాదులోనివే. ఇదేవిధముగా హైదరాబాదుకు చెందిన శ్రీ మాడపాటి హనుమంతరావుగారు (ప్లీడరు), శ్రీ బి. రామకృష్ణారావుగారు (అడ్వోకేటు, ప్రస్తుతం గవర్నరు; ఆనాటి యుత్సవ సంఘ కార్యదర్శి), వీరభద్రరావుగారు (ఆంధ్రభాషా నిలయమునకు సెక్రెటరీ అయినను హైదరాబాదు లోనే కాపురము) మొదలగు ప్రముఖులచే సత్కరింపబడి నాయన యా నగరమందు 'నైజాము' కళాశాలలోను, 'రెడ్డి హాటలు' భవనమందును రెండు వేదాంతోపన్యాసముల నిచ్చెను.

ఇట్లే సికింద్రాబాదు కాఱుమైళ్ల దూరమున నున్న 'బోలారమ్' నగర మందు రావుసాహెబు వేంకటరెడ్డి (యన్.జి.యస్. రైల్వేలో పెద్ద యుద్యోగి), రావుసాహెబు శివశంకర అయ్యరు (హైస్కూలు ప్రిన్సిపాల్) గార్లచే నాహ్వానింపబడి రెండు మూడుపన్యాసములను నాయన యిచ్చెను. కొద్దిరోజులలో నిట్లుపన్యాసములను వర్షములుగా కురిపించి నాయన యీ నగరములందు నవచైతన్యమును పుట్టించి, వైదికమత వికాసమును పునరుద్ధవింపజేసెను. అంతేగాక, సిద్ధమునివలె వేలకొలది జనులకు మంత్రదీక్షలనిచ్చి, వారియం దాధ్యాత్మిక ప్రబోధముచే జీవితమున మార్పును కలిగించెను. ఈ శిష్యవర్గములో నున్నత వర్గమునకు చెందిన సి. రాజా బహదూర్‌పిళ్లే (బి.ఏ.బి.యల్), బాజీ కృష్ణారావు (బి.ఏ.బి.యల్), కె. తాతాచారి (బి.ఏ.బి.యల్.), శ్యామారావు, అయ్యా అయ్యరు (ఆర్థిక శాఖలో పెద్ద యుద్యోగి) మొదలగువారు సికిందరాబాదావాసులే. ప్రొఫెసర్ టి. వీరభద్రుడు, ప్రొఫెసర్ రాయప్రోలు సుబ్బారావు మొదలగు కళాశాలా ప్రముఖులు నాయన శిష్యులై, రమణగణపతుల కీర్తిని విద్యానిలయములందు ప్రతిష్ఠించి, బహుతర సేవచేసిరి. ఒక మీటింగులో 'హోమముచేయు నలవాటున్నవా రెవరైన గలరా ' యని నాయన వేసిన ప్రశ్నకు 'సాయంకాల హోమము నా కలవాటున్న'దని పల్కిన పవిత్ర జీవి రాయప్రోలు సుబ్బారావుగారు.

స్వల్పకాలములో మూడు పట్టణములందుగల ఆంధ్ర-తమిళ-కన్నడ-మహారాష్ట్రులలో నూత్న తేజస్సును వెదజల్లి పెద్ద అలజడిని కల్పించగలిగిన నాయన భారతదేశమంతయు ప్రచారముకొఱకు పర్యటించినచో నెక్కడ జూచిన నక్కడనే శ్రీ రమణాశ్రమములో, రమణానంద నిలయములో ఉద్భవించి, యితర వేదాంత సంస్థలయొక్క రోకళ్ల పాట సిద్ధాంతముల కోటకట్ట జాలకుండునా ? కాని, యింత ప్రవాహరూపమును బొందిన తన ప్రచార ధోరణిని నాయన హఠాత్తుగా నిలిపివేసెను. దానికి తిరువణ్ణామలైనుండి వినవచ్చిన ఆశ్రమ కలతలె కారణములు. అవి నాయన యుత్సాహమున కంతరాయమును కల్పించినవి.

ఇంతలో నాంధ్రభాషానిలయ రజతోత్సవములు సమీపించి నాయన యుత్సాహమును సారస్వత విషయములకు మఱల్చెను. ఈ యుత్సవములు నాయన యధ్యక్షతనే మూడు దినములు జరుప నిశ్చయించి, తొలినాటి యధ్యక్షోపన్యాసము నచ్చుకొట్టించుటకు సభవారు తీర్మానించిరి. కనుక దానిని ముందుగనే వ్రాసి నాయన యిచ్చెను. భాషానిలయముల ప్రయోజనము గుఱించి, గ్రాంథిక భాషను కవులు సంపాదించు నవసరమును గుఱించి, సరస్వతి నారాధించు విధమును గుఱించి నాయన తన యభిప్రాయముల నీ యుపన్యాసము ద్వారా వెల్లడిచేసి సభకు విచ్చేసిన వారియందు పవిత్రాదర్శములను గల్పించుటయేగాక, వారి నమితోత్సాహమున ముంచెను. అట్లే తుదినాటి యుపసంహారోపన్యాస మప్పటికప్పుడాశువుగా నొసగబడినను గంభీరభావములతో గూడి, వాఙ్మయమున కాధారభూతమగు శబ్దతత్త్వ ప్రసక్తితోడను, పరావాక్కునకు నిలయమగు మూలాధారము నొక గ్రంథాలయముతో పోల్చి, దానిని పూర్వఋషులవలె కవు లారాధించి చేయదగిన సేవాప్రసక్తితోడను నిండి యాంధ్రులొక్కరికేగాక, సారస్వత లోకమునకంతకు నుద్బోధకమయ్యెను. ఈ రెండుపన్యాసములను 1928 సం॥లో వెలువడిన రజతోత్సవ సంచికలో భాషానిలయమువా రచ్చొత్తించి గొప్ప ఉపకార మొనర్చిరి (పాఠకుల ముదముకొఱకవి యీ గ్రంథము చివర ననుబంధములుగా నీయడమైనది).

ఈ సభలు ముగిసిన వెంటనే శ్రీ తనికెళ్ల వీరభద్రుడు (ప్రొఫెసరు) గారి యధ్యక్షతను మూసీనది ప్రాంతమున నాదిద్రవిడ సమ్మేళన మొకటి వైభవోపేతముగా జరుపబడెను. ఆదిద్రవిడ నాయకుడైన భాగ్యారెడ్డి నాయన నా సమ్మేళనమున కాహ్వానించి, దానియం దుపన్యసింపచేసెను. కొందఱు పండితులు మునిపుంగవుడైన నాయన యీ సభలకు వెళ్లరాదని తలచిరి. కాని, నాయన తన సంస్కారభావములను ప్రకటించుటకు వెఱువక భాగ్యారెడ్డి కోర్కె నామోదించెను. అందుల కతడు గొప్పగా సంతోషించి నాయన నొక యలంకరింపబడిన పల్లకిపై మేళతాళములతో ఊరేగించి సమ్మేళనమునకు తీసికొనివెళ్లెను. సికింద్రాబాదునుండి 'రెసిడెన్సీ' రోడ్డుద్వారా హైదరాబాదుమీదుగా వెళ్లిన యీ ఊరేగింపుటుత్సవమును, దాని

వైభవమును ప్రజలెల్లరు కన్నుల పండువుగా తిలకించిరి. పిదప సమ్మేళనమందు నాయన విజృంభించి యొసగిన గంభీరోపన్యాసమును విని, యందుండి వెడలిన దివ్యస్పందనముల ననుభవించినవారు నాయన యొక్క గణపతి దైవాంశమును తిలకించి ధన్యులైనట్లు భావించిరి. కనుక ఆదిద్రవిడులతోపాటు సభకు విచ్చేసిన యితర వర్ణములకు చెందు తమిళాంధ్ర కర్ణాటక మహారాష్ట్ర ప్రముఖులందరు గూడి నాయన నభినందించి ముని బిరుదమొసగిన ట్లొక తీర్మానము చేసిరి. మఱియు వారు తమ విజ్ఞాపనము నొక పట్టుగుడ్డపై ప్రముఖ సభ్యుల పేర్లతో గూడ నచ్చొత్తించి, దాని నొక చట్రమున బిగించి నాయన కొసగగా, నాయన దానిని ప్రీతితో స్వీకరించి వారి ముదమును సఫలమొనర్చెను.

ఈ యఖండ సమ్మానమునకు పిదప నాయనను సందర్శించుటకు 'గద్వాల' మొదలగు గొప్ప సంస్థానముల కధీశులు కూడ రాదొడగిరి. ఇంతగా కొనియాడబడిన నాయన యొక్క మహోన్నతిని గుఱించి వినినప్పు డమూయాపరు లెట్టి భావోద్రేకములను తిరువణ్ణామలైలో పొందిరో తెలియదుకాని, యీ వార్త లా ప్రాంతము చేరులోపున సుధన్వ కపాలు లరవిందాశ్రమమును చేరి నాయనను విరసించినవారికి బలము, నాయనకు సంతోషాతిశయభంగము చేకూర్చిరని మాత్రము సికింద్రాబాదు, హైద్రాబాదు శిష్యులకు తెలిసెను.

ఆలోచింపగా, సుధన్వుని భార్య యంతకుపూర్వమే యరవింద భక్తురాలై పుదుచ్చేరిలోని యరవిందాశ్రమము చెంతనే యొక గృహము కొనుక్కొని, దాని యందు నివాసమేర్పరచుకొనినందున క్రమముగా సుధన్వునకు చెన్నపుర మందు ప్రత్యేకముగా నుండుట కష్టమయ్యెను. అతనికి తన వకీలు వృత్తిపై విరక్తికూడ తోచిన కారణముగా నతడును భార్యతోబాటు అరవిందభక్తుడు కావలసి వచ్చెను. అతడు నాయనకు శిష్యుడై, నాయనయం దెంత గురుభక్తి కల్గియుండెనో, అంత భక్తి యరవిందునియందును చిరకాలము నుండి కలిగియున్న విషయము నాయనకు తెలియును. కనుక స్థూలముగా సుధన్వుడు మారినట్లు తలపబడినను, చిరకాలమునుండి యతని చిత్తము నాక్రమించుకొనిన గురుద్వయభక్తి యిప్పుడు బాహ్యమునకుగూడ సార్థకమైనట్లు నాయన యెంచి యతని నాశీర్వదించెను. కాని, కపాలిశాస్త్రి విషయములో నాయనకీ మార్పు సక్రమమనిపించలేదు. అతడు పండితుడు, మేధావి, విమర్శబుద్ధిగలవాడని యెంచి, నాయన వేదవిమర్శచే తానెంచుకొనిన శాస్త్రాది సంస్కార కార్యమందతనిని వినియోగించుకొనుటకు చిరకాలమునుండి యపేక్షించుచు, నతనియం దట్టి దృష్టిని, పాటవము నెంతో పెంపొందించి, వానిని తర్ఫీదుచేసెను. ఈ కార్యమున కింక యంకితము కాదలచిన సమయమునకు సరిగా కనీసము తనతో చెప్పనైన చెప్పకుండ కపాలి తన పండితోద్యోగమును (చెన్నపురమం దొక హైస్కూలులో సంస్కృత పండిత పదవి)

విడిచి స్వేచ్ఛాజీవియయ్యె నిట్టి లోకహిత కార్యమునకు దూరమగుటయు, తద్ద్వారమున తన యాశనుగూడ దూరమొనర్చుటయు నాయనకు క్లేశము కలిగించెను. అతడది బుద్ధిపూర్వకముగా చేసినట్లు నాయన శంకించుచుండగా, పుత్రునినుండి, యింకొక శిష్యునినుండి వచ్చిన లేఖ లా శంకను బలపరచెను. శిష్యుడు వ్రాసిన లేఖలో కపాలి మార్పును గురించి 'యీశ్వరవిలాస మట్లున్నది, యేమిచేయగల'మని శ్రీ రమణు లుడివినట్లును వ్రాయబడెను. ఆ సానుభూతివాక్యము నాయన క్లేశమును కొంత యుపశమింపజేసెను. పిదప పుత్రుని లేఖ ననుసరించి విశాలాక్షమ్మ సాంవత్సరిక శ్రాద్ధములకు నాయన కలువరాయికి ప్రయాణసన్నద్ధుడయ్యెను.

ఓం

పదియవ ప్రకరణము

# కష్టదినములు

1927 సం॥ (జూలై) ఆషాఢ బహుళ విదియనాడు నిర్వర్తింపవలసిన విశాలాక్షమ్మ యొక్క ప్రథమ సాంవత్సరిక శ్రాద్ధకార్యములకు మహాదేవము కుటుంబసహితుడై తిరువణ్ణామలైనుండి కలువరాయి బయలుదేరగా, వాని మార్గమందు విజయవాడలో నాయన కలసి, వానితోగూడి కలువరాయి వెళ్లెను. ఈ కార్యములైన వెంటనే వజ్రేశ్వరి నత్తవారింటికి పంపి నాయన తన కొడుకుతోడను, కోడలు తోడను తిరువణ్ణామలై మఱలివచ్చెను. ఈసారి నాయన పరాభవము పొందినవానివలె గురుని సమీపించి, గుర్వాజ్ఞనుబొంది, తన జీవితమందు క్రొత్త పాత్రను వహించువానివలె మాతగుహ నధిష్ఠించెను. శ్రీ రమణుని కళఘమ్మ వలెనే నాయనకు విశాలాక్షమ్మ నూత్న కార్యప్రబోధకారిణియై, యామెవలెనే గుప్తరూపిణియై నాయనకు తప్ప ఇతరుల కందుబాటులో లేకపోయెను. అందువలన నామెయందాశ పెట్టుకొనిన పూర్వశిష్యు లితరాశ్రమములకు పోదలచినను నాయన యడ్డుచెప్పదలప లేదు. వారిలో పెక్కుమంది నాయన కడ మంత్రదీక్షలను బొందినను, అమ్మయొక్క శిష్యులుగనే రూపొంది, యమ్మ యొక్క యనుగ్రహమును గ్రోలినవారే. ఆ యలవాటుచొప్పున వారిలోనే యరవిందాశ్రమమందలి శ్రీమాత నాశ్రయించవలెనను కోర్కె కొందరికి మిక్కుటము కాజొచ్చెను. కపాలిశాస్త్రి తన మార్పునట్లు సమర్థించు కొనినప్పుడు నాయన మాఱుపల్కలేదు. కాని, శ్రీమాతయొక్క దివ్యశక్తులను వర్ణించిన పిదప నామెయం దరవిందుడు తన తపశ్శక్తి ప్రాభవముచే కాళి యవతరణమును సాధించినట్లు నాయన నమ్మించుటకై చెప్పిన కపాలిశాస్త్రి వాక్యములను వినినప్పుడు మాత్రము నాయన వాని యభిప్రాయమును ఖండించి వ్యతిరేకించెను. మఱియు నట్టి యభిప్రాయభేదమువలన మఱికొందరు ప్రియశిష్యులుగూడ కపాలివలె తనకు దూరము కావచ్చుననియు గ్రహించి నాయన యందులకు విస్మయపడ దలచలేదు.

ఈ పరిణామములను విస్మరించుటకు నాయన తపస్సు పూనినను, తపస్సునకు విఘ్నములు సంభవింపజొచ్చెను. 1927 సం॥ డిసెంబర్ నెలలో చెన్నపురమునుండి వచ్చిన యొక పండితాహ్వానము నాయనకు స్థలచలనముగూడ కలిగించినదయ్యెను. ఈ యాహ్వానము వాసిష్ఠుని గౌరవభంగమునకుకూడ కారణమైనందున, నది పంపబడిన విధానము, దానిని సభచేసిన పెద్దలామోదించక పూనిన మూకీభావము మనమిక్కడ కొంత చెప్పుకొనక తప్పదు.

ప్రభవ (1927) సం॥ కాంగ్రెసు మహాసభ కొక తీర్మానమును బంపి, కాంగ్రెసుయొక్క యస్పృశ్యతా నివారణోద్యమమును ఖండించు నుద్దేశముతో చెన్నపుర వర్ణాశ్రమ సంఘమువా రొక సభ నేర్పరచి, దానిలో వాదప్రతివాదములచే సమస్యను చర్చించుటకు పండితుల ననేక గ్రామములనుండి యాహ్వానించిరి. ఈ సంఘ కార్యవర్గములోని సభ్యులు ప్రథమ శ్రేణి పండితులైనను, కార్యనిర్వాహకుడుగా తత్కాలమునకు నియమింపబడిన వ్యక్తిమాత్రము పండితుడుగాడు. అయినను, స్వతంత్రుడు. ఈ పండితులు తమ భావములకు విరుద్ధముగా నస్పృశ్యతా నివారణము నదివఱకు సమర్థించుచున్న ప్రముఖుల కాహ్వానము పంపవలదని కార్యనిర్వాహకున కాజ్ఞనొసగిరి. కాని, యీ సభలు జరుగు సమయమునకు కాంగ్రెసు ప్రచారము నెపమున పండిత మదనమోహన మాలవ్యా చెన్నపురము రానున్నాడని విని, యతడు తమకు వ్యతిరేకియైనను, అతనికి ప్రత్యేకాహ్వానము పంపనియెడల నగౌరవము చూపినవారమగుదుమని వారు తలచి తమ యాజ్ఞను తామే నుల్లంఘించుకొనిరి. అది గమనించినతోడనే వాసిష్ఠ గణపతిముని యేల విడువబడవలెనని కార్యనిర్వాహకు డాలోచించెను. పండితప్రవరుడైన వాసిష్ఠుని ధర్మశాస్త్రాభిప్రాయములు బహు సునిశితములై, వారికి వాదింపనలవిగాక భయము నిదివఱలో కలిగించిన విషయము కార్యనిర్వాహకు డెఱుగును. కనుక వాసిష్ఠుని పరోక్షమం దీ పండితులు వీరులవలె విజృంభించుట యతని కనీతిగా తోచెను. అందువలన వారిచే చీవాట్లు తినుటకైన సిద్ధపడి, వారు మాలవ్యాపండితున కాహ్వానము పంపినట్లే, యితడు వాసిష్ఠున కొక యాహ్వాన పత్రమును వారితో చెప్పకుండ పంపి, వినోదమును జూడదలచెను. పండితుల కోర్కె మన్నించుటకు తన తపస్సునైన దూరముచేయు నేమముగల వాసిష్ఠు డీ యాహ్వానము నందుకొని మాలవ్యావలెనే వచ్చి సభ నలంకరించెను.

వాసిష్ఠుని జూచినతోడనే సభలోని ప్రముఖ పండితులు తెల్లబోయి, కార్యనిర్వాహకు నడిగిరి. అతడు నిర్భయముగా తాను జేసిన పనిని సకారణముగా చెప్పి, వారిని ముగ్ధులగావించెను. వాసిష్ఠ మాలవ్యాలు సభలో నొకరి నొకరు కలిసికొని తమ పూర్వపరిచయమును స్మరించుకొనుచు సంతోషమున నుండగా, వారి చెవి నీ తగవు సోకెను. అంతేగాక, వాసిష్ఠుని సొమ్మనుటకు ధైర్యము లేక పండితులు సభను ప్రారంభించక స్తంభింపదలచినట్లు వా రనుమానించిరి. అప్పుడు వాసిష్ఠు డవమానభరితుడై యుండగా, మాలవ్యాపండితు డతని చేయి పట్టుకొని 'యీ అవమానము మన కిఱువురకు చేయబడెను. ఈ సభకు జవాబుగా నే నీ సాయంత్రమే యొక సభ నేర్పరచి, పురప్రముఖులతోపాటి సంఘ సభ్యులను గూడ నాహ్వానించెదను. వచ్చెదరో, రారో చూచెదగాక' యని పల్కి, సాదర వచనములతో వాసిష్ఠుని సభ వెలుపలకు తీసికొనివెళ్ళి, యతనితో సహా సభని

విడిచి యింటికి పోయెను. ఆ సాయంత్రము మాలవ్యా తన యధ్యక్షత క్రింద హిందూ హైస్కూలులో బ్రహ్మాండమైన సభ నేర్పరచి, వర్ణాశ్రమ సంఘ పండితవర్గ మా సభకు వచ్చినట్లు గ్రహించినంతనే వాసిష్ఠుని వేదికపై కాహ్వానించి, యస్పృశ్యతా నివారణావసరమును గుఱించి సంస్కృతమున నుపన్యసింపగోరెను. సంఘ పండితులు తా ముదయము చూపిన యసభ్యతకు పశ్చాత్తాపముచెంది, యిక్కడనైన సభ్యత, సరసత చూపుటకై తమ కా ప్రసంగ మిష్టములేకున్నను సభనంటి కూర్చుండిరి. వాసిష్ఠుడు గంభీరముగా నుపన్యసించి, మాలవ్యాచే నభినందింపబడెను. కాని, యానాటి కలి సంఘటనను తలచుకొనినప్పు డాంధ్రదేశ పండితు లభ్యుదయశూన్యులైనట్లు నాయన జాలిచెందెను. అంతేగాక, పండితుల సభల కింక వెళ్లరాదనియు, వారిని సంస్కరించుటకు యత్నించి, వారిచే పరాభవింపబడుటకంటె వారు కాలగతిచే పరాభవింపబడు వఱకు వారిని విడిచినచో వారే సంస్కారమును బొందుదురనియు నాయన నిశ్చయించుకొని తన తపస్స్థలమునకు మఱలెను.

ఈసారి తపస్సునకు బదులు తన కార్యప్రేరణముకొఱ కింద్రాణీ సప్తశతిని నాయన సంస్కరింపబూనెను. నాయన యీ కార్యమును జేయు సమయములో శ్రీ రమణుడు తా నదివఱకు రచించిన 'ఉపదేశ ఉందియా'* యను తమిళ గీతమునకు తానే సంస్కృత శ్లోకములను రచింప సమకట్టెను. వానిని పూర్తిజేసి యొకనాటి మధ్యాహ్న మతడు నాయన యొద్దకు పంపగా, రమణుని శ్లోకము లందలి యొప్పిదమునకు, రచనలోని సౌలభ్యమునకు నాయన యబ్బురపడి, తనతో నప్పుడు ప్రసంగించుటకై వచ్చియున్న కొందఱు పండితుల కా గ్రంథమును జూపి 'మనముగూడ పండితులమైనట్లు సంతసింతుము. కాని, యిట్టి దొక్క శ్లోకమైన రచించి చూపగలమా' యని ప్రశ్నించెను. వారుకూడ గ్రంథమును బ్రశంసించిన పిదప నాయనను దాని కొక వ్యాఖ్యానము వ్రాయగోరిరి. 'సరే' యని నాయన పల్కి, వారితో గూడి రమణాశ్రమమునకు బయలుదేరి, మెల్లగా నడచుచు, గ్రంథమును మఱిచూడ నవసరము లేకుండ మార్గమందే వ్యాఖ్యాన రచనము సంస్కృతమున నారంభించి, రమణాశ్రమము చేరుసరి కొక లఘు వ్యాఖ్యానమును పూర్తిగావించి, గురునకర్పించి, గురుని మెప్పు వడసెను.

ఇట్లు తన్నావరించిన యనర్థకాలమును దాటుటకు నాయన గ్రంథ సంస్కారము చేతను, గురునకు సంతోషము గొల్పు కూర్పులచేతను దినములను వెళ్లబుచ్చుచు, సాయంత్రములం దాశ్రమమునకు గురుదర్శనార్థము వెళ్లుచున్నను, ఆశ్రమ వ్యవహారములందుగాని, రమణుని యెదుట నప్పుడప్పుడు జరుగు శాస్త్రసల్లాపములందుగాని పాల్గొనక, కొద్ది క్షణములుమాత్ర మక్కడ గడపుచు, నితర వేళల మాతగుహ నంకితుడు కాజొచ్చెను. మాతగుహయందైన నే కొలది మంది

* దీనినే 'ఉపదేశసార' మందురు.

పండితమిత్రులతో తప్ప, ఇతరులకు దర్శనావకాశమైన నిచ్చుట మానెను. అది కోపముకాదు; క్లేశము కాదు. అక్కడ జ్ఞానము పేరిట కొందఱు రమణా శ్రమమునకు వెళ్ళి, యీవలకు వచ్చినంతనే యొకరిపైనొక రీర్ష్యతో ప్రసంగించుటయు, రమణాశ్రమమును వ్యాజ్యముల కీడ్చుటకై యుక్తులు పన్నుటయు మొదలగు కలుషపూరిత చేష్టలచే వాతావరణమును చెఱుపుట గమనించుకొలది నాయన కా యూరు విడిచి కొన్నాళ్లెక్కడకైన పోవలెనను తలపు గాఢము కాజొచ్చెను. ఒకటికి పది కల్పింపబడుచున్నందున నాయన యెవరితోడను సంభాషించుటను మానుకొనెను.

ఇట్లుండగా, తన్నరవిందుడు చూడగోరినట్లు సుధన్వునినుండి యొక లేఖ రాగా, నాయన దానినందుకొని రహస్యముగా రమణునకు చూపెను. 'సరే వెళ్లిరండి' యని రమణు డనుజ్ఞనిచ్చెను. అది సెపముగా నాయన తిరువణ్ణామలై 1928 సం॥ ఆగష్టు రెండవ వారములో వీడుటకు సిద్ధముకాగా, సుధన్వుడు స్వయముగా వచ్చి నాయనను తీసికొనివెళ్లెను. అదిమొదలు మబ్బు వీడినట్లు కష్టములు వీడిపోయి వాసిష్ఠునియందు క్రొత్త జీవితఘట్ట మారంభమైనందున మనమొక క్రొత్త ఖండముచే దానిని చెప్పుకొందముగాక.

# VIII. వేదవాసిష్ఠ ఖండము

-: అధ్యాయములు :-

1. శ్రీ అరవిందయోగిని సందర్శించుట
2. స్వీయచరిత్ర వివరణము
3. గురుప్రేరణమున బహుదూరమున నున్న 'శిరసి' పోయి ఋషితుల్యుడగుట
4. ఆనందాశ్రమము, శిరసి
5. కుళువేలో వేదవాసిష్ఠ తత్త్వము స్ఫుటమగుట

ఓం

ప్రథమ ప్రకరణము

# శ్రీ అరవిందయోగిని సందర్శించుట

'అథాము' డను శిష్యుని వెంట నిడికొని నాయన సుధన్వునితో చెన్నపురము వచ్చి, యక్కడనుండి సుధన్వుని మోటారులో 'పుదుచ్చేరి' చేరి, సుధన్వుని యింటనే బసచేసెను. నాయన పాదస్పర్శవలన తమ నూత్నగృహము పవిత్రమైనట్లు సుధన్వదంపతులెంచి సంతోషించిరి. నాయన వెళ్లిన కొద్ది దినములకు, అనగా ఆగష్టు 15వ తేదీనాటి కరవిందుని జన్మదినోత్సవమై యా నా డతనిని దర్శించుటకు విచ్చేసిన భక్తజనులచే పురమత్యంత సమ్మర్దమైయున్నది. అట్లయినను, ఆశ్రమ ప్రాంతమంతయు ప్రశాంతవాతావరణముచే నలంకృతమై భక్తుల కరవిందునిపై గల గౌరవమును చాటుచుండెను.

శ్రీ అరవిందుడు అంగిరస నామ సంవత్సర శ్రావణ శుద్ధ ఏకాదశి, గురువారమునకు సరియగు 15-8-1872 నాడు కర్కాటక లగ్నమందు జన్మించెను. ఇత డింగ్లాండు దేశమున విద్యనభ్యసించి, తుదకు 'ఐ.సి.యస్' పరీక్షకు చదివియు, దానియందు డిగ్రీని విసర్జించుటకు చివరి పరీక్షకు హాజరుగాక (గుఱ్ఱపుస్వారి పరీక్ష), బ్రిటిష్ ప్రభుత్వోద్యోగమును చేయరాదను నిశ్చయముతో స్వదేశమునకు మఱలెను. ఇంగ్లాండు వీడక పూర్వ మితనికి బరోడా మహారాజు పరిచయము ప్రాప్తించుటయు, నతడరవిందుని యందు విద్యతోపాటు ప్రతిభావంతమగు బుద్ధి, సుగుణములునుండుట కాకర్షింపబడుటయు సంభవించెను. అప్పటి కరవిందునకు 21 సం॥ లేతవయస్సైనను, మహారాజతనిని తన కాంతరంగిక కార్యదర్శిగా నియమించుకొనెను. ఇట్లు బరోడాలో రాజోద్యోగమును కొన్నాళ్లు, ప్రొఫెసర్ పదవిని కొన్నాళ్లు నిర్వర్తించుచు 1906 సం॥లో దేశసేవాతత్పరుడై యుద్యోగమును విసర్జించెను. 29వ యేట వివాహమైనను బ్రహ్మచర్యనియమమును బూని యోగసాధనలను స్వీకరించిన కారణముగా భార్యకు దూరముగా వసింప జొచ్చెను. సాధుస్వభావుడైనను, విప్లవ పరిచర్యలయం దితడు పాల్గొనిన ట్లొక నేరము మోపబడినందున, సుమారొక సంవత్సరము గొప్ప వ్యాజ్యమున జిక్కుకొని తుదకు నిర్దోషిగా విడుదల పొందెను. ఆ సమయమం దనుభవించిన కారాగారవాస మితని యోగసిద్ధికి తోడ్పడెను. 1910 సం॥లో రాజకీయ రంగమును విడిచి యితడు పుదుచ్చేరి వచ్చి, యొక పత్రిక ద్వారా తనకుగల లోకోద్ధరణాశయములను బ్రకటించిన పిదప నచ్చటనే నాలుగేండ్లించుమించుగా యోగమందు నిమగ్ను డయ్యెను. అటుపిమ్మట తనకు సాక్షాత్కారమైన కొన్ని దివ్యానుభవములను ప్రకటించుటద్వారా మానవ బుద్ధిని

ప్రేరేపించుటకు 'ఆర్య' యను నొక మాసపత్రికను నడపెను. ఆ పత్రికను చదివినప్పటినుండి నాయన తన పూర్వజన్మ తపస్సఖులలో నొకనిగా అరవిందుని గుర్తించి, తన శిష్యులకు చెప్పుచుండెను. నాటినుండి యతనిని చూడవలెనను కుతూహలముకూడ నాయనకున్నను తరుణము ప్రాప్తించలేదు. అది ప్రాప్తించుసరి కరవిందు డొకవిధమగు మౌనముచే నేకాంతవాసియై, సంవత్సరమందు మూడు దినములు తప్ప (ఫిబ్రవరి 21; ఆగష్టు 15, నవంబర్ 24 తేదీలందు) ఇతరులకు దర్శనమిచ్చుటయు మానుకొనెను. ఈ దర్శనములందైన చూడవచ్చినవా రొకరి వెంబడి యొకరుగా వెళ్ళి, యెట్టి సంభాషణము సల్పక దర్శన మొకటి రెండు నిముసములలో ముగించుకొని, హస్తముచే నతడు సూచించు నాశీర్వాదమును బొంది రావలసినదే. నియమము లిట్లున్నను, ఆగష్టు 15వ తేదీ నాడతనిని సందర్శించి, యతని తేజమును తిలకించి వచ్చుటకు నాయన నిశ్చయించుకొనెను. నాయన నరవిందుడు చూడదలచిన కోర్కెయు నట్టి యవకాశమందే యైయుండెను.

తనకంటె వయస్సున పెద్దవాడు, తపశ్శాలి, పూర్వజన్మ తపస్సఖుడైన అరవిందుని సందర్శించుటకుగాని, యతనికి నమస్కరించి యతని యాశీస్సు బడయుటకుగాని నాయన మనస్సు శంకించలేదు. అరవిందుని యోగశక్తి ప్రవేశముచే 'శ్రీమాత'యై, యవతారరూపిణిగా కపాలిచే స్తుతింపబడిన వ్యక్తిని గూడ నదేసమయమున చూడవచ్చునని నాయన యెంచెను.

'శ్రీమాత' ఫ్రెంచి దేశపు స్త్రీ. పది పంద్రెండేళ్ల వయస్సునుండి యోగానుభవములను గాంచుచు, తన మాతృదేశము నిజమున కార్యావర్తమని విశ్వసించుచు నీమె 1914 సం॥లో భారతదేశము వచ్చి, శ్రీ అరవిందుని పుదుచ్చేరిలో చూచినంతనే యతని మహత్తును గుర్తించెను. అరవిందునివలెనే యామెకును పూర్ణయోగముద్వారా భూలోకమందు దివ్యజీవన పరివర్తనమును మానవకోటికి కలిగింపవలెనను నాశయమున్నందున వారొకరిచే నొకరాకర్షింప బడిరి. కాని, అప్పుడు ఫ్రాన్సులో సంభవించిన మహాసంగ్రామ పరిస్థితులవలన ఈ దేశమం దామె కొన్ని నిర్బంధములకు గురియై, వానిని తొలగించుకొనుటకై భారతదేశ మప్పుడు విడువవలసివచ్చెను. 1920 సం॥లో ఏప్రిల్ 24వ తేదీనాడామె తిరుగ పుదుచ్చేరి వచ్చి, యిచ్చట స్థిరనివాస మేర్పరచుకొనెను. నాటినుండి యామె తన సంసారమును విసర్జించెను. పిమ్మట నామె యరవిందు నాశ్రమ నిర్మాణమునకు ప్రోత్సహించి, తద్ద్వారమున నొక యోగసాధన నిలయ స్థాపనకు, అరవిందుని లక్ష్యసాధనకు ప్రేరేపించెను. ఆమె ప్రేరణోత్సాహమువల్లను, శక్తిసామర్థ్యములవల్లను వెలసినదే నేటి యరవిందాశ్రమము. ఈ యాశ్రమనిర్మాణమైనది మొద లరవిందునకు సాధనావకాశము లధికముగా ప్రాప్తించెను. ఆశ్రమ నిర్వహణభారముతోపాటు శిష్యులకు యోగమం దుపదేశాదేశముల నిచ్చు భారమామెయే వహించినందున

అరవిందుడు 1926 సం॥ నవంబర్ 24వ తేదీనుండి యేకాంతవాసమును స్వీకరించి, గాఢయోగమున నుపవిష్టుడయ్యెను. పరిచర్యలు సల్పు నొకరిద్దరితోడను, శ్రీమాతతోడను తప్ప, ఇతరులతో మాట్లాడుటయు మానుకొనెను. తనకు లక్ష్యమైన యోగ శక్తి యామె యుపాధి ద్వారా ప్రవహించి తన కార్యసిద్ధి కవకాశములను గల్పించుచున్నట్లు భావించి యామె కతడే 'శ్రీమాత' యను పేరుంచెను.

1928 సం॥లో వచ్చిన జయంత్యుత్సవమునకు పూర్వమరవిందునిచే నింగ్లీషున ప్రణీతమైన 'జనని' ('Mother') అను పద్యకావ్యమును జదివిన పిదప సుధన్వున కొక ప్రేరణమై, నాయనచే రచింపబడిన 'ఉమాసహస్రము' నరవిందు డొకపరి పఠించుటకు పంపెను. దాని నరవిందు డందుకొని సాంతముగా పఠించిన పిదప 'కావ్యకంఠ గణపతిముని యతి మానుషవ్యక్తియని నాకీ గ్రంథము నుండి విస్పష్టమయ్యెను. అతని దివ్యవాణి యిందలి ప్రతి పత్రమందు తాండవమాడెను. నేనా వ్యక్తి నొకసారి చూడగోరుదు'నని యభిలాషను బ్రకటించెను. సుధన్వున కీవార్తను శ్రీమాత తెల్పి, నాయన నాహ్వానించి స్వయముగా పుదుచ్చేరి తీసికొని వచ్చుట కతని కాజ్ఞనుగూడ నిచ్చెను. కావుననే సుధన్వుడు స్వయముగా వెళ్లి తిరువణ్ణామలైనుండి నాయనను తీసికొనివచ్చెను.

నాయన పుదుచ్చేరి వెళ్లుట కీరీతిగా సందర్భము లనుకూలించినందున అవి యీశ్వరకల్పితములనక తప్పదు. తన పూర్వజన్మ తపస్సఖుని సందర్శనమునకు చిరకాలమునుండి కుతూహలపడుచున్న నాయనకది యీశ్వరప్రసాదముగనే తోచినందున నెందు సంతోషముతో నతడు అధాము సుధన్వుల సహాయమున పుదుచ్చేరి వెళ్ళెను. సిమ్మట జయంతి దినమున నరవిందుని నాయన సమీపించు సమయమునకు పైగ్రామములనుండి వచ్చిన భక్తులు, ఆశ్రమవాసులుకూడ తమ తమ దర్శనములను ముగించుకొనిరి. నాయన యరవిందునికడకు వచ్చుచున్న వార్త ముందుగనే తెలియజేయబడినందున నరవిందుడును, శ్రీమాతయు సంతోషవదనులై నాయనకొఱ కెదురుజూచుచుండిరి. వారిరువురు నొక గదిలో నమర్చబడిన పొడవైన సోఫాపై కూర్చుండియుండిరి. ఆ గదియం దితరాసనములు లేవు. ఇతరులవలెనే వెళ్ళి, రెండు నిముసము లతిక్రమించకుండ తన దర్శనమును ముగింపదలచుకొనిన నాయన కాసమయమందు ప్రత్యేకపు టేర్పాట్లను సుధన్వు డెట్లర్థించలేదో, ఆ స్వల్పకాలమున కా సనమునుకూడ నట్లే నాయనకొఱకాత డడుగలేదు. అట్టి మర్యాదలకు వ్యవధియైన చాలని ఆ రెండు నిముసములలో నాయన-అరవిందు లొకరి నొకరు తనివిదీర చూచుకొనిరి. నాయనకు తోడుగా వెళ్లిన సుధన్వుడు గది వెలుపల నిలబడి యవసరమైనచో లోనికాసమయమందు వెళ్లుటకు, లేనిచో నాయనకు పిదప తన దర్శనము ముగించుకొనుటకు వేచి యుండెను. నాయన యీవలకు వచ్చెను. వెంటనే సుధన్వుడు లోనికి వెళ్లినది

తడవుగా నాయనను గుఱించి యరవిందుడొక సందేహమును దీర్చుకొనుట కనినట్లు 'కావ్యకంఠుడు గణపతి యుపాసకుడా' యని ప్రశ్నించెను. అందులకు సుధన్వుడు 'కాదు, సాక్షాద్గణపతి యంశయే' యని బదులిడి, తన సమాధానమున కరవిందుని ముఖమందు వికసించిన దివ్యతేజమును తిలకించిన భాగ్యముతో సెలవుగైకొని యీవలకు వచ్చి నాయనను కలసెను. మఱికొంతసేపటి కరవిందుని యనుభవము శ్రీమాతద్వారా తెలిసెను. నాయన ముఖమం దరవిందుడు గజాననాకృతిని జూచి, సుధన్వుని సమాధానముచే దివ్యోత్సాహము ననుభవించెనట. అది విని సుధన్వుడు గర్వించెను. అట్లే యరవిందుని యం దద్భుతశక్తి తేజమును జూచినట్లు నాయన చెప్పగా సుధన్వుని గర్వ మతిశయము బొందెను.

పిమ్మట శ్రీమాత యా సాయంత్రమో, మఱునాటి సాయంత్రమో నాయనతో గూడి ప్రత్యేకముగా ధ్యానము సల్పవలెనని యామెకున్నట్లు కబురంపెను. అరవిందుని దర్శించుటకు వెళ్లినప్పు డా చెంతనే యామెయున్నను, నాయన కామె యోజస్సును తిలకించుట కవకాశము చాలకపోయెను. అందువలన నామె యాహ్వానమును సంతోషముతో స్వీకరించి, యామె ధ్యానసమయమున కీసారి కపాలిశాస్త్రిని తోడు తీసికొని నాయన వెళ్లెను. ఒక గదియందు నాయనకొఱ కొకటియు, యామెకొఱ కొకటియు – రెండాసనములు మాత్రముండెను. వారుభయులు సమాసీనులైనతోడనే కపాలిశాస్త్రి యావలకు బోయెను. పిమ్మట వారొక ముప్పావుగంటసేపు ధ్యానమునల్పి యీవలకు వచ్చిరి. ఆ ధ్యానమందామె కన్నులు మూసికొనియు, నాయన కన్నులు తెరచియు నెవరి యలవాటు ననుసరించి వారు ధ్యానించిరి. కన్నులు విచ్చిన నాయన కామె సిలువ వేయబడిన క్రీస్తువలె శరీరమును సడలించి ధ్యానించుట గోచరించెను. ధ్యానము ముగిసిన పిదప కపాలిశాస్త్రితో నాయనను గుఱించి యామె రెండు విషయము లిట్లు చెప్పెను: 'ధ్యానము నారంభించిన మఱుసటి క్షణమందే మనస్సు నగాధములకు పోజొనిపిన నాయన నిశ్చయముగా గొప్ప యోగి. పుదుచ్చేరి వచ్చు వ్యక్తులలో 40 నిముసములు నాయనవలె నా యాధ్యాత్మదృష్టి పథమందు (Spiritual Consciousness) నిలిచిన వ్యక్తిని నేనిదివఱకు చూడలేదు.

అటుపిమ్మట నాయన మఱియొక వార మించుమించుగా సుధన్వునితో గడిపి తిరువణ్ణామలై మరలెను. పుదుచ్చేరి వీడునప్పుడు శ్రీమాత 'మీరరవిందుని జూచుట కనుమతి బడయనక్కరలే'దని తెల్పగా, 'సంతోషము. కాని, నాకింక చూచుట కేముండు'నని నాయన చెప్పెను. పిమ్మట నాయన కరవిందుని యందు గల్గిన యభిప్రాయము శ్రీమాతయందు గల్గలేదని కపాలి విని పరాభవమును బొందినట్లెంచెను. ఆలోచించగా అరవింద, శ్రీమాతలనుకొనిన స్థాయిని వారిని కపాలి చిత్రించలేదు. నాయనయొక్క దివ్యదృష్టినికూడ కాదని, తనకు గల్గిన యభిప్రాయమే

సత్యమని యహంకరించుటద్వారా నాయన నతడు న్యూనతపరచుచున్నట్లు మిత్రులు కొందఱు భయపడిరి.

నాయన యింకను పుదుచ్చేరియందే యుండగా తిరువణ్ణామలైలో కొందఱికి నాయన వెంటనే మరలిరాకుండుటను గూర్చి శంకతోచి, యొకనాడు శ్రీ రమణుడు గిరిప్రదక్షిణకేగిన సమయమందు 'ఓ భగవాన్! నాయన యింకను పుదుచ్చేరి నుండి రాలేదేల? అక్కడనే యుండిపోరుగదా' యని ప్రశ్నించిరి. వారి బుద్ధిలో నాయన, యరవిందులు శక్త్యుపాసకులనియు, ఆత్మోపాసకుడైన రమణునికంటె నరవిందుడందువలన నాయన నధికముగా నాకర్షించియుండుననియు కలదు. దీనిని బట్టి 'శక్తి' యను పదము మన దేశమం దీనాటి వేదాంత పరిభాషలో నెంత సంకుచితభావమును బొందెనో తెలియవచ్చును. వారి సందేహమును గ్రహించి రమణుడు వారికిట్లు ధైర్యము సల్పెను: "పుదుచ్చేరిలో నేమున్నదో చూచుటకు వెళ్ళిరి. అది చూచిన పిదప నిశ్చయముగా నాయన వత్తురు. అట్టిదేదైన చూడవలసినప్పు డొక్క దృష్టితో గ్రహించు ప్రజ్ఞ నాయనకే చెల్లును. చూడవలసినది చూచినప్పుడు మఱల పుదుచ్చేరి వెళ్ల పనియేముండును." ఇట్లుడివిన పిదప కొంచెమాగి 'యీ పూజవంటిదే నాయన కక్కడ జరిగెనటగదా' యని రమణుడు పల్కినప్పుడు వారి హృదయములలో శ్రీ రమణునకు చేయబడు పూజవంటిది నాయన పొందినట్లర్థమై మిగుల సంతసించిరి. రమణ గణపతుల యేకత్వము ధ్వనించుట కింతకంటె దృష్టాంత మేమి కావలెను?

నాయన పుదుచ్చేరిలో నున్నప్పుడొక నా డరవింద ప్రణీతమైన "జనని" యను గ్రంథమును కపాలిశాస్త్రి నాయనకడ విమర్శపూర్వకముగా చదివిన పిమ్మట నిట్లర్థించెను: "నా కీ గ్రంథమును సంస్కృతమున తర్జుమా చేయవలెననియున్నది. మీ దివ్యహస్తముతో నాకొక పీఠికను రచించి యీయగోరుదును." వెంటనే నాయన దానికొక పీఠిక నత్యంత వైభవముగా నుండునట్లు రచించి యిచ్చెను. దాని నరవిందుని కడకు పంపగా "మూలముకంటె మించిన వైభవముతో నిది యొప్పుచున్న"దని యతడభినందించెను. ఆ మెప్పు కపాలికి రుచించలేదని కొందఱు గ్రహించి యతనిపై జాలిగొనిరి.

ఇంకొకనాడు సుధన్వుని బంధువైన 'కోదండరామయ్య', యను పేరుగల యోగాభ్యాసకు డొకడు నాయనయొద్దకు వచ్చి యోగముల స్వరూపభేదములను గుఱించి కొన్ని సూత్రముల నర్థించెను. వెంటనే నాయన 108 సూత్రములతో నొక చిన్న గ్రంథమును రచించి యతని కిచ్చెను. అదియు నరవిందుని మెప్పుబడసెను. దీనికి 'తత్త్వానుశాసన'మ్మను పేరుంచబడెను.

౭౦

## రెండవ ప్రకరణము

# స్వీయచరిత్ర వివరణము

నాయన పుదుచ్చేరినుండి మఱల తిరువణ్ణామలై చేరిన వెంటనే శ్రీ రమణుని దర్శించి, పుదుచ్చేరిలో తా బొందిన యనుభవములు, తన కక్కడ శ్రీమాత యొనర్చిన గౌరవమర్యాదలు వివరించి, 'నన్ను జూచి మిమ్ములను జూచినట్లక్కడి వారు గౌరవించుటకు నే నెంతయు సంతోషించితి'నని చెప్పినప్పుడు రమణుని ముఖము మందస్మితముచే వికసించెను. నాటినుండి రమణ గణపతుల కిదివఱకు వ్యత్యాసములను కల్పించి, నాయన యాధిక్యతను తగ్గింపజూచిన వర్గమువారు నాయనపై యథోచిత గౌరవము చూపదొడగిరి. తామదివఱకు జూపిన వక్రబుద్ధికి వారు పశ్చాత్తాపము గూడ చెందిరి. గుర్వనుగ్రహమువలన నపవాద తిమిరమిట్లంతమగుటకు నాయన యీ అరవింద సందర్శన ఘట్టము కారణమయ్యెనని యెంచి, దానిని స్మరించెను. అదేవిధముగా కపాలి విచక్షణను గప్పిన పొరయు వీడి యతని బుద్ధి యథాపూర్వరీతిని మఱల ప్రకాశించుననియు నాయన విశ్వసించెను.

ఇమ్మట మాతగుహయందున్నచో భోజన మింటి నుండి వచ్చుటకుగాని, తానింటికి భోజనముకొఱకు వెళ్లుటకు గాని కష్టమగుచున్నదని యెంచి నాయన మహాదేవముతో పురమందే వసింపజొచ్చెను. కాని, రెండు మూడు మాసములగు సరికే పురజీవన మసహ్యమై తోచెను. ఇట్లుండగా రమణాశ్రమము చెంతనున్న పనసతోటలో నొక కుటీరమున వసించుచున్న 'మురుగనార్' అను తమిళ కవియు, ఆర్. విశ్వనాథమను నాయన శిష్యుడును తమ కుటీరమునకు నాయన నాహ్వానించిరి. అక్కడకు నాయన భోజనము రెండుపూటలందు పురమునుండి తెచ్చి యందిచ్చుటకు విశ్వనాథ మొప్పుకొనెను. నాయన తిను పదార్థములు ప్రత్యేకము లైనందున నాశ్రమ పాకములు సరిపడవు. 1928 సం॥ డిసెంబరునెల ముగియుచుండగా నాయన యీ తోటలోనికి మారెను. అప్పటివఱకు నింటియొద్ద గూర్చుండి వేదమునుండి యేరిన వేయి యింద్రనామములను శ్రీ రమణునకు చూపగా, వానిలో 'అచక్రయా స్వధయా వర్తమానః', 'అనీలః', 'సువర్ణః', 'కీజః' మొదలుగాగల విచిత్ర నామములకు రమణుడు వినోదమును జూపెను. ఈ నామములను 108 శ్లోకములం దిమిడ్చి లలితా సహస్రము వంటి గ్రంథమును గూడ నాయన బహు పటుతరముగా సమకూర్చెను. 'ఇంద్ర' నామముతో ప్రారంభించి, 'సమ్రాట్' నామముతో నంతమైన యీ ఇంద్రస్తోత్రమును గురించి కవియే యిట్లు గానము చేసెను:-

శ్లో॥ ఇదం సహస్ర మింద్ర స్య
నామ్నాం పరమ పావనమ్।
ఋగ్వేదతో గణపతి:
సంగృహ్య వినిబద్ధవాన్॥ 1

నాత్ర నామ్నః పౌనరుక్త్యం
న 'చ'కారాది పూరణమ్।
శ్లోకమధ్యే న చారబ్ధా
శతక స్యోపసంహృతిః॥ 2

నామ్నా మేషాం ధాన్యసత్యా
త్పర్యేషాం చ స్వరూపతః।
అవలోక్య యథాఛన్దః
శబ్దశుద్ధి విచక్షణైః॥ 3

అనేక పదనామాని
వినియోజ్యాని పూజనే।
చతుర్థ్యంత ప్రయోగేషు
వ్యుత్క్రమాచ్చ యథాన్వయమ్॥ 4

అస్య నామ సహస్రస్య
వేదమూలస్య సేవనే।
పూర్ణం ఫలం తు విజ్ఞేయం
య త్స్వాధ్యాయ నిషేవణే॥ 5

మంత్రేభ్యః సంభృతం సార
మేత న్నామ సహస్రకమ్।
ఐంద్రం యో భజతే భక్త్యా
తస్య స్యుః సిద్ధయో వశే॥ 6

ఇంద్రో విజయతే దేవః
సర్వస్య జగతః పతిః।
వేదమూలం జయత్యేత
త్తస్య నామ సహస్రకమ్॥ 7

పురమునుండి కోటలోనికి మారు సమయమందు నాయన కత్యంత ప్రియశిష్యులలో నొకడగు పన్నుస్వామి యొక కార్యార్థమై నాయనను దర్శించెను.

అరవింద శిష్యుడు కావలెనని యతనికి గాఢముగా తోచి నాయన యనుజ్ఞ కొఱకతడు వచ్చెను. ఆ రోజులలో శిష్యులు కాగోరువారిని శ్రీమాత బహు కఠినముగా పరీక్షించుచుండెడిది. అది తనయెడ సులభమగునట్లు గూడ నాయన నత డనుగ్రహింపగోరెను. నాయన యతని ననుగ్రహించియు శ్రీమాత కొక లేఖను చమత్కారముగా వ్రాసియిచ్చెను. దానిలో 'భగవతీ', 'శ్రీమాతా'యను రెండు సంబోధనలను చేసి, మొదటి సంబోధనచే శ్రీమాతయం దవతరించినట్లు తలచబడు శక్తి నుద్దేశించెను. ఆ శక్తి యెల్లరకు పూజనీయమే గావున లేఖలోని మొదటి భాగము నాశక్తి నుద్దేశించియు, రెండవ భాగమును శ్రీమాత యను వ్యక్తి నుద్దేశించియు నాయన వ్రాసిన చమత్కారమును పాఠకులు గ్రహింతురు గాక. మొదటి భాగములోని విషయములు శ్రీమాతకు చెందవని స్ఫురింపజేయుటకు 'బహు సంవత్సరముల నుండి'యను పదము చాలును.

"భగవతీ, శ్రీ మాతా,

దురదృష్టవశమున నేను దూరమున నున్నను, నా మనస్సుచే నీ పాదములను స్పృశించుచునే యుంటిని. నా జీవితయాత్రలో ధన్యతమమైన దివసమందు నీ తేజస్సెట్టిది చూడబడెనో అది మోహమును ఖండించు నంతఃప్రభ నాకిచ్చుగాక! నీ పుత్రుడు దూరముగా నుండెనని యుపేక్షింపవలదు. బహు సంవత్సరముల నుండి నీ చరణములను ధరించిన నే నెచ్చట నున్నను, నీ సాన్నిధ్యమందున్నట్లెంచి యనుగ్రహించవలెను.

మఱియొక మనవి. అరవిందునియందు భక్తిగలవాడును, శ్రీమాతయందు దృఢవిశ్వాసము గలవాడును, నాకు శిష్యుడును అయిన పొన్నుస్వామి అయ్యా రభ్యనుజ్ఞను బొందుటకే యీ పత్రము నీ జనుడు వ్రాసికొనెను. వాని కభ్యనుజ్ఞ నిచ్చుటకు నీవు తగుదువు. వాడు ధన్యుడగుగాక!

ఇట్లు
నీ నిత్యభక్తుడు, హృదయపుత్రుడు,
– వాసిష్ఠగణపతి."

ఈ లేఖను చూచిన తక్షణమే శ్రీమాత పొన్నుస్వామి కభ్యనుజ్ఞనిచ్చి, నాయనయం దామెకు గల గౌరవమును బ్రదర్శించెను.

పనసతోటలో ప్రవేశించిన కొద్దిదినములకే నాయన యొక్క జీవిత చరిత్రము నడిగి వ్రాసికొనుటకు చెన్నపురము నుండి శ్రీ బి. వి. నరసింహస్వామి యను నొక న్యాయవాది వచ్చెను. ఇతడు తొలుత మహర్షి రమణుని జీవిత చరిత్ర కొఱకు వచ్చి, మహర్షిని స్వీయచరిత్ర చెప్పగోరెను. 'నాయన చెప్పిన పిదప



శ్రీమతి మరియు శ్రీ డి. యస్. విశ్వామిత్ర
(నాయనగారివ్రాత ప్రతులను భద్ర పఱచిన వారు)



శ్రీ కపాలి శాస్త్రి

నేను చెప్పెద'నని మహర్షి పల్కి, నాయనయొక్క చరిత్రావశ్యకతను, దాని నాదియందు రచించుటకు గల ప్రాముఖ్యమును ఆ స్వల్ప సమాధానములోనే సూచించెను. అది గ్రహించినను గ్రహింపకున్నను, నరసింహస్వామిగారికి నాయన పరిచయము గావించుకొని, తాననుకొనినదానికంటె నధికముగా శ్రమించక తప్పినదికాదు. నాయన తమిళమందే తన చరిత్రమును సంక్షిప్తముగా, చెప్పబడినదంతయు నాయన చెప్పినట్లతడు వ్రాసికొనెను. పిమ్మట మహర్షి జీవితము నతడట్లే వ్రాసికొని, దాని నింగ్లీషు భాషలో విపులపరచి తొలుత రచించెను. నాయన చరిత్రము నట్లే వ్రాయదలచెనేమో కాని, వ్రాయలేదు. దానికొఱకు కొందరి కుంభకోణము కారణమయ్యెనో లేక నరసింహస్వామిగారి యలసత కారణమయ్యెనో చెప్పనలవికాదు. నరసింహస్వామిగా రాశ్రమమందా చరిత్రమును వ్రాయకున్నను, తన స్వగృహము చేరిన పిదప వ్రాయదలచినవానివలె తాను వ్రాసికొనిన 'నోట్సు' తీసికొనిపోవుచుండగా, శ్రీ రమణు డా స్వామిగారిని ప్రశ్నించి, వారేమి శంకించెనోగాని, వారినుండి 'నోట్సు' గైకొని భద్రపరచెను. ఈ విధముగా మహర్షి చరిత్రము 'Self Realisation' అను పేరుతో రమణాశ్రమము వారిచే ముద్రింపబడినను, నాయన చరిత్రము విపులీకరింపబడలేదు. సంక్షిప్తముగా మన్నను, ఆ నోట్సు శ్రీ రమణునిచే రక్షింపబడుటబట్టి లోకమున కిప్పటికైన నాయన దివ్యచరిత్రము తెలియు నవకాశము సంభవించెను (నాయన నిర్వాణానంతర మీ నోట్సు నదేవిధముగా సంస్కృతీకరించి శ్రీ టి.వి. కపాలిశాస్త్రిగారు తమచే రచింపబడిన 'వాసిష్ఠవైభవము'లో ప్రథమ భాగముగా నచ్చొత్తించిరి).

ఆ పనసతోటలో నున్నప్పుడు నాయన సహాయమున మురుగనారొక గొప్పకార్యమును చేసెను. శ్రీ రమణు డదివఱకు తత్త్వబోధకొఱ కతనికి రచించి యిచ్చిన తమిళ పద్యముల నతడు నాయన సహాయమున నొకవరుసగా కూర్చెను. నలువది పద్యములు గలిగిన ఆ కూర్పువలన నున్న సత్యము బోధ యగుచున్నందున 'ఉన్నది నలుబది' యని దానికి పేరుంచి ముద్రణముకొఱ కాశ్రమమున కర్పించెను.

☆ ☆ ☆

౬౦

మూడవ ప్రకరణము

# గురుప్రేరణమున బహుదూరముననున్న శిరసి పోయి ఋషితుల్యుడగుట

1929వ సంవత్సరములో మార్చి నెల ప్రారంభమందే తిరువణ్ణామలైయందెండలు తీవ్రమై గాడ్పులు వీవఁజొచ్చెను. ఆ సంవత్సరమది వింతయై, వసంత ఋతువుకూడ గ్రీష్మమువలె తాపమును కలిగించునను భీతి తోపఁజేసెను. తోట మధ్యమందున్నను నాయనకా గాడ్పులు బాధ కలిగించెను. శిష్యుడైన విశ్వనాథము శీతలోపచారములు సల్పుచున్నను లాభములేక, వసంతాగమమునకు పూర్వమే యేదైన శీతలప్రాంతమునకు బోయినగాని ప్రాణము లా సంవత్సరము నిలుచుట కష్టమని నాయనకు తోచెను. కపాలభేదనమైనప్పటినుండి తాపమోర్చుకొనుట కష్టమగుచున్నను, నాయన శరీరమందా పనసతోటలో నున్న కాలమందు శక్తిపాత మధికమై, నాడులందు సునిశితత్వము హెచ్చుటవలన స్వల్ప తాపముగూడ సహింపనలవిగాకుండెను.

ఇట్లుండగా, గోకర్ణమునుండి దైవరాతుని శిష్యులిద్దఱు మహర్షిని, నాయనను దర్శించుకొనుటకా మార్చి నెల మొదటి పక్షములోనే వచ్చి, నాయన యవస్థ చూచి, తమ గ్రామమున కాహ్వానించిరి. గోకర్ణమందుకూడ కష్టమనిపించిన యెడల బహుశీతలసుఖమునిచ్చు 'శిరసి' ప్రాంతమునకు జేరవచ్చునని వారు సలహానిచ్చిరి. వీరిచ్చిన సలహాను మహర్షియు విని, నాయనను వారితో వెళ్ళుటకు హెచ్చరించెను. అందువలన దైవ మనుకూలించినట్లెంచి నాయన సంతోషవదనుడై వారితోగూడి గోకర్ణము చప్పుచప్పున చేరెను. పుత్రునకు దూరమైనను, నాయన కాదరణలోపము లేకుండునట్లన్ని దిక్కులను పుత్రసమానులైన భక్తులను, శిష్యులను భగవంతుడు బహుళముగా సమకూర్చెను. అందులో గోకర్ణ మదివఱకు బ్రహ్మరథము పట్టిన స్థలమై, యక్కడ దైవరాతుని గృహము నాయనకు స్వగృహమువంటిదయ్యెనని పాఠకులకు తెలిసిన విషయమే. అందువలన నాయన తన వెంట మహాదేవమును రావలెనని కోరలేదు. పైగా, వాని నుద్యోగము మాని తిరువణ్ణామలైనుండి కలువరాయికి కాపురమెత్తివేయుటకు నాయన యాజ్ఞాపించెను.

నాయన గోకర్ణము వచ్చుచున్నట్లు తెలియక దైవరాతుడు తపోవ్రతుడై, కృష్ణనదికి శాఖయగు 'భద్రా' నదీతీరమున నొక పుణ్యక్షేత్రమున కేగి, యచ్చట

నిరశనవ్రతమూని దుస్తర తపోదీక్షయందు ప్రవేశించెను. అట్లయినను, దైవరాతుని భార్యయగు శ్రద్ధాదేవి నాయనకు సుస్వాగతమిచ్చి పుత్రికవలె సేవ చేసెను. గోకర్ణము చేరిన మఱునాడు నాయన దైవరాతునకొక చమత్కారమైన లేఖ నీ దిగువ విధముగా వ్రాసెను :

18-3-1929
(విభవ సం॥) ఫాల్గున శుక్లాష్టమి

"వత్సా దైవరాతా !

నేను నిన్ననే గోకర్ణము వచ్చితిని. పవిత్ర కృష్ణాతీరమందు నీవు దుస్తరమగు తపస్సు నాచరించుచుంటివని వింటిని. అది విని నా యంతరాత్మ ప్రసన్నమయ్యెను. నీయం దెట్టి సహజశక్తి, బహుజన్మార్జిత శ్రద్ధాతిశయములు కలవో, అవి తపస్సున బ్రవర్తించు నీ కుత్సాహమునిచ్చుగాక. నేనిచ్చట మూడు మాసములు దాదాపుందును. నిన్ను చూడవలెననియున్నది. కాని, ఘోరతపస్సునందున్న నిన్ను రమ్మనుట నా కిష్టములేదు. నీవు నాకెంత ప్రియమో, నీ తపస్సు నా కంతకంటె నధిక ప్రియము. నా రాక నీకు కొంచెమైనను విఘ్నము కలిగించకుండుగాక. ఇంతవఱకే నా ప్రీతిపూర్వకమైన యాజ్ఞ. జవాబు వెంటనే వ్రాయవలెను.

నీవు చేయు తపస్సున కిచ్చటకు వచ్చుటవలన భంగముండదని యెంచినచో, నీ రాకకు నా హృదయము స్వాగతమిచ్చును. భంగమగునని నీ వెంచితివేని, నీ నియమమును విడువక నాకును ప్రియతమమైన తపస్సు నక్కడనే నీవు మానక చేయుము. అప్పుడు నేనే నీ తపస్థలమునకు వచ్చి, నిన్ను జూచి, తిరుగ రమణసన్నిధికి పోయెదను. మనవారికి నన్నిక్కడ స్థిరపరచవలెనని యున్నది. అది సఫలమైనచో, కాలము మన యుభయుల కిచ్చటనే తపస్సున కవకాశ మిచ్చును. నీకు ప్రియమైన గోవులు శ్రద్ధతోడను, సోముతోడను కుశలముగా నున్నవి.

ఇట్లు, నీ తపోభివృద్ధిని గోరు,
- వాసిష్ఠగణపతి."

నాయన గోకర్ణము వెళ్ళుసరి కక్కడ దైవరాతుడు లేకుండుట యాశా భంగమై తన కీసారి గోకర్ణవాసము భగవంతుడనుకూలము గావింపక శిరసి ప్రాంతము బహుశః నిర్ణయించియుండునని యూహించెను. అట్లయినను, భగవత్సంకల్పమును నిశ్చయించుటకు పూర్వ మీ లేఖ చాలదూర మాలోచించి వ్రాయబడినట్లున్నది. దీనివలన దైవరాతుని యందు భగవంతుడు కల్పించు పరివర్తనమునుబట్టి నాయన నిశ్చయించుకొనుట కీ లేఖ నింత నేర్పుగా వ్రాసినట్లగుపడును.

దైవరాతుని నుండి ప్రత్యుత్తర మొక నెలకుగాని రాలేదు. అంతవఱకు నాయన గోకర్ణమందు వేచియుండెను. ఈ లోపున నాయన కక్కడి యెండలుకూడ హెచ్చుగనే తోచి, యుష్ణమునకు రక్తమందు మేహము పొడజూపి, నేత్రము లెఱ్ఱపడెను. దైవరాతుని తమ్ముడైన సీతారామభరతి యొకటి రెండుసార్లు 'కుళువే'నుండి వచ్చి నాయనకు చికిత్స చేసెను. 'కుళువే' యను పల్లెగ్రామము 'శిరసి' తాలూకాకు చెంది, 'శిరసి' యను ముఖ్యగ్రామమున కేడెనిమిది మైళ్ల దూరమున నున్నది. సీతారాముడు కుళువేలో కాపురముండి శిరసియం దాయుర్వేద వైద్యశాలను బెట్టి, యనుదినము శిరసి పోయివచ్చుచు, వైద్యవృత్తితో జీవించుచుండెను. కుళువేలో భూములు, తోటలు మొదలగునవి యున్నందున నితడు పల్లెకాపురమును విడువలేదు. శిరసిలో నొక ముద్రణాలయమును దైవరాతు డొకప్పుడు కొని నాయన కర్పించుకొనిన విషయము పూర్వమే చెప్ప బడెను. ఆ ముద్రణాలయమును నడుపు బాధ్యతకూడ సోదరుని యాజ్ఞచొప్పున సీతారాముడు వహించి, దానిని శ్రద్ధతో నిర్వర్తించుచుండెను. ఇతడుకూడ నాయన రాకను గుఱించి దైవరాతున కుత్తరము వ్రాసి, దానిలో నాయన కెండతాపమువల్ల సోకుచున్న శారీరక బాధలను పేర్కొనెను. దైవరాతుని నుండి నాయనకు వచ్చినప్పుడే యితనికిని ప్రత్యుత్తరము వచ్చెను. ఆ ప్రత్యుత్తరములో దైవరాతుడు నాయనను గోకర్ణమందుండగోరి, సీతారాముని గోకర్ణము వచ్చి నాయన కుపచార చికిత్సలు సల్పుమనెను. అటుపిమ్మట సీతారాము డింకొక లేఖ వ్రాసి, నాయనను తనతో కుళువే తీసికొనిపోవుట కనుజ్ఞ వేడెను. అనుజ్ఞవచ్చుట కింకొక నెల పట్టెను. అంతవఱకు నాయన గోకర్ణమందే యున్నను, సీతారాముని చికిత్సవల్లనో లేక శిరసి వెళ్లుటకు దైవముచే కల్పింపబడిన కారణములు ఫలించుటవల్లనో ఎండ లధికమగుచున్నను, నాయన బాధలు తగ్గి, శిరసి పయనమగుసరికి యథాపూర్వారోగ్యము ప్రాప్తించెను.

గురుని సేవ నెన్నడూ నశ్రద్ధచేయని వాడైనను, దైవరాతుడు గొప్ప మీమాంసలో పడెను. తుదకు తన వంతు తన భార్యయు, సోదరుడును గురునియందు శ్రద్ధవహించిరను సంతృప్తితో నతడు తన దీక్షను విరమించ కున్నను, గురునకది సంతోషమే కలిగించెను. అది నాయనచే శిరసి వెళ్లునప్పుడు వ్రాయబడిన లేఖనుండి విశదమగుచున్నది. ఆ లేఖ యిట్లుండెను :-

"వత్సా ! దైవరాతా ! 25-5-1929

నీ పత్రఖండము చేరెను. నీవు యథోచిత నియమముతో తపస్సునం దుండుట విని చాల సంతసించితిని. బ్రాహ్మణునకు పాలుత్తమము. భగవాన్ అత్రేయుడు నీకు శీఘ్రముగా ప్రసన్నుడగుగాక ! నీ తపస్సు వర్ధిల్లుగాక !

ఇట్లు, నీకు నిత్యము జయముగోరు,

- వాసిష్ఠుడు."



భగవాన్ శ్రీరమణమహర్షి



శ్రీ గణపతిముని

గోకర్ణము సముద్రతీరమం దుత్తర సహ్యాద్రికొక కొనయందుండగా, శిరసిప్రాంత మా కొండపంక్తులయందే సముద్రమునకు బహుదూరమై, తీరమునకు 2,000 అడుగుల యెత్తున నున్నది. అందువలననే వేసంగియందును శిరసి వాతావరణము బహు శీతలమై యుండును. కాని, మన్య ప్రాంతమువలె జలము పూతివాయు (మలేరియా) దోషము కలిగి, యగ్నిసంస్కారము కోరుచుండును. పల్లెలయందు పోకలు, మిరియములు, ఏలకులు మొదలగు పంటలధికముగా నుండి, మంచి యాదాయము నిచ్చుచుండును. ఈ పంట ద్రవ్యముల వ్యాపారమునకు శిరసి గ్రామమొక గొప్ప యునికిపట్టయి, యెగుమతి వ్యాపారస్థులతోడను, పల్లెలందు తోటలను బెంచు బహుళ భూస్వాములతోడను నిండియుండును. సారస్వతవైభవమం దభిరుచిగలవారు శిరసియందును, శిరసికి సమీపపు పల్లెలందునుగూడ నధికముగా నున్నారు. కాని, పల్లెలలో గృహములు శిరసియందువలెగాక, చెదరి చెదరి, ఇల్లిల్లు ఫలవృక్షములతోడను, పంటలనిచ్చు తోటలతోడను పరివృతమై, యేయింటికా యిల్లొక రమణీయాశ్రమమువలె నుండును. ఒక్కొక్క పల్లెయం దట్టి గృహముల సంఖ్యకూడ-వందకు లోపే యుండును. ఈ పల్లెలయందు క్షీరము సమృద్ధమై, సాత్వికాహార సంపన్నులకు నివాసార్హత నిచ్చుచుండును. ప్రజలుకూడ సుజనులై, న్యాయశీలమునకు, భక్తిప్రవత్తులకు ఖ్యాతివడసి యుండిరి. అట్టి పల్లెలలో నొకటి కుళువే.

గోకర్ణమునుండి శిరసికిగాని, కుళువేకుగాని రైలుమార్గము లేదు. అందువలన నాయన మోటారుబండిపై తీసికొని వెళ్లబడెను. మార్గమందొకచోట శాల్మలీ నదీతీరమున నొక శంకరమఠమందు నాయనకు విశ్రాంతి సమకూర్చబడెను. ఇక్కడి పీఠము బహుపురాతనమై, విశ్వానంద సరస్వతీస్వామి యను మహానుభావునిచే స్థాపింపబడి 'లక్ష్మీనృసింహ చంద్రమౌళీశ్వర పదపీఠ' మని పేర్కొనబడుచుండెను. దీనికి 'సోందా-స్వర్ణవల్లీ' సంస్థానాధిపతులు ధర్మకర్తలు, పోషకులై యున్నను, వారి బహుళ పోషణ క్రిందనున్న సోందా-స్వర్ణవల్లీ మఠ యాజమాన్య మీ పీఠముపై నుంచబడెను. అందువలన నా మఠము నధిష్ఠించిన 'శ్రీమత్సర్వజ్ఞేంద్ర సరస్వతీ' స్వామియే యీ పీఠమునప్పు డధిష్ఠించియుండెను. అదివఱ కుడిపి, గోకర్ణములందు వ్యాపించిన నాయనయొక్క తపోవైభవకీర్తి నితడు బాగుగా నెఱిగినవాడై, నాయనను వినయవిధేయతలతో సత్కరించెను. మఱియు నాయన కా పీఠమును జూపి, దాని నప్పటి కావరించిన దుఃస్థితిని గుఱించి యతడిట్లు చెప్పెను: "ఈ పీఠము బహు పురాతనవైభవము గలదియైనను, దీని పోషకుల మధ్య చెలరేగిన నొక వారసత్వ వ్యాజ్యము తెమలక, దీని పోషణము మూడు నాలుగు

సంవత్సరములనుండి నిలుపు చేయబడెను. ధూపదీప నైవేద్యములుకూడ కర్వై, దీని వైభవమున కపకీర్తి కల్పింపబడుచుండెను.''

ఈ మాటలు వినుటకు నాయన మనస్సు చాల బాధపడెను. వెంటనే పీఠముయొక్క పునఃశ్రేయస్సుకొఱకా పీఠదైవమునే స్మరించి నాయన యొక యాశీర్వాద శ్లోకమును వ్రాసి మఠాధిపతి కిచ్చెను. దాని నతడు కన్నుల కద్దుకొని, స్వీకరించి నాయనను గౌరవలాంఛనములతో సాగనంపెను. మఱి కొద్ది రోజులకు నాయన వాక్కు చెప్పిన వ్యాఖ్యము పరిష్కారమై, పీఠమునకు యథాపూర్వ వైభవము ప్రాప్తించగా, పీఠాధిపతి కృతజ్ఞుడై, నాయన కీర్తి యా పీఠమందు స్మరింపబడుటకా శ్లోకము నద్దమందుంచి గోడయందు స్థాపించెను.

ఈ విధముగా పీఠాధిపతులచే పూజింపబడిన కీర్తి కలిగిన వాసిష్ఠుడు కుఱువే చేరుసరి కచ్చట సీతారాముని యింటి యొద్ద సమావేశమైన నలుబది, యేబదిమంది భక్తహృదయులా మహానుభావునకు సామగానముచే స్వాగతము పల్కి, యతని నా యింటియొద్ద నిర్మింపబడిన చక్కని పర్ణశాలకు చేర్చిరి. ఈ భక్తులు నాయన రాక విని శిరసి, తత్ప్రాంతభాగములనుండి విచ్చేసిరి. వీరదివఱకు గోకర్ణమునుండి యెప్పటికప్పుడు వచ్చిన వార్తలద్వారా నాయన దివ్యచరిత్రమును వినియున్నను, ఆ దివ్యమూర్తిని సందర్శించుకొనలేక తమ యభాగ్యమును తామే నిందించుకొనిరి. ఇప్పుడు నాయనయే తమ మధ్యకు వచ్చుట వినినప్పుడు తమ సుకృతము ఫలించిన ట్లుత్సాహవంతులై, నాయనయొక్క దర్శనము చేసికొని, పరిచయము గావించుకొని ధన్యులైన ట్లెంచిరి. నాయన యొక్క పవిత్రపాదము లే రోజున 'కుఱువే'యను భూస్థలమును తాకెనో, ఆ రోజున నమృతవర్ష మక్కడ కురిసి, తాపము తొలగుటయేగాక, లతాపుష్పఫలజాతులుకూడ తలలెత్తి సంతోషించినవి. నాయనకు స్వాగతము పల్కుటకు వచ్చినవారిలో శిరసి వాస్తవ్యుడైన 'దేవేంద్ర సుబ్రహ్మణ్య విశ్వామిత్ర' యను వకీ లెన్నదగినవాడు. ఇతడు విద్యార్థిదశయందున్నప్పుడు 1913వ సం॥మున కుమటా పాఠశాలయందు జరిగిన యొక సభలో నాయనను తొలుత చూచి, యా సభయందు నాయన యిచ్చిన యుపన్యాసమున కాకర్షింపబడెను. అటుపిమ్మట నాయన వచనముల నాదర్శముగా గొని విద్యార్థిదశ దాటువఱకు నాహార నియమముతో గాయత్రీజపమును దీక్షతో సల్పెను. విద్య ముగిసినను సాధన విడువక నాధ్యాత్మ విషయములందు శ్రద్ధకలిగి యితడు 'దర్శన మంజూషము', 'స్వప్నపేటిక' యను నుపనామములను వహించి, కొన్ని తత్త్వరహస్యములను వ్యాసములద్వారా ప్రచురించెను. నాయన కుఱువే వచ్చుటకు పూర్వము సీతారామ భడతితో నితడు గోకర్ణము వెళ్లి, నాయనను గురువుగా నెంచుకొని యర్పించుకొనెను. కుఱువే చేరినప్పటినుండి వాసిష్ఠున కీ విశ్వామిత్రయే వ్యాఖ్యాతయయ్యెను.

వాసిష్ఠుని దివ్యశక్తిప్రభావ మా ప్రాంతమందు ప్రచారమగుటకు తోడ్పడిన కొన్ని యద్భుత విషయములను గూడ మన మిక్కడ స్మరింతము.

వాసిష్ఠుడు మంత్రమూర్తి యని విని, యొక శ్రీమంతుని పుత్రుడొకనాడు తన భార్యకు పట్టిన యనర్థమును నివారించుకొనుటకు వచ్చి యతని కథ నిట్లు చెప్పుకొనెను : "నేను కురువే ప్రాంతమునుండి వచ్చితిని. నా పేరు గణేశభట్టు. నా భార్యపే రహల్య. అహల్యకు నేనన్న చాల ప్రేమ. ఆమె కాపురమునకు వచ్చిన పిదప మా యిల్లు కళకళలాడెను. కాని, యైదాఱు మాసములకే యేమి యరిష్టము సంభవించెనోగాని యహల్య నొక పీడ సోకి మమ్ములను దుఃఖమున ముంచెను. అది యెట్టిదనగా, మాటిమాటికి వస్త్రమును విసర్జించి యామె యేదేని గోడమూలకు పోయి, ముఖము గోడవైపుండునట్లు కూర్చుండును. జ్ఞప్తిచేసినప్పుడు బట్ట కట్టుకొనును. చెంత నింకొక రున్నంతసేపు బట్ట విడువదుకాని, మతిలేని దాని వలె నిలబడును. పలుకరించినచో నొకటి, రెండు మాటలు మాట్లాడినను తన బాధ చెప్పదు. ఇంకొక యల్లరి లేదు. అన్ని రకములైన వైద్యములు మూడేళ్ల నుండి చేయించుచుంటిమి. భూతవైద్యులకు గూడ నేమియు వశముకాలేదు. కాని, యిది పిశాచ సంబంధమని కొందఱు, దేవతాసంబంధమని కొందఱు వివిధములుగా పల్కిరి. మంత్రస్వరూపులైన మీ యనుగ్రహము నర్థించుచున్నాను. అహల్యను తీసికొనివచ్చి యక్కడ గదిలో కూర్చుండబెట్టితిని. ఆమెపై మీ దయ ప్రసరించుగాక."

ఈ పల్కులను విని వాసిష్ఠుడు "నే నావలికి వెళ్లి యిప్పుడే వచ్చెద నుండు"మని పల్కి, తోటలవైపు కొంత దూరము పోయి మరలివచ్చెను. వచ్చునప్పు డహల్యయున్న గదియొద్దకు వాసిష్ఠుడు వెళ్లి, గది తలుపు కొంచెము తెఱచి, వివస్త్రయై కూర్చుండిన అహల్య నుద్దేశించి 'అమ్మాయీ! వస్త్రమును ధరించి యీవలకు రమ్మ'ని యాజ్ఞాపించిన పిదప తన స్థానము జేరుకొనెను. ఇంకొక్క నిముసములో వస్త్రమును ధరించి యహల్య వాసిష్ఠుని ముందరకు వచ్చి, సాష్టాంగ నమస్కారము సల్పిన పిదప 'నాకు పునర్జీవితమునిచ్చి రక్షించితిరి. మీ పాదము లెప్పుడును నా చిత్తమం దుండునుగాక' యని విజ్ఞానపురస్సరముగా పల్కి, భర్తతో గూడి వాసిష్ఠుని యనుమతిని బడసి యింటికి పోయెను. మఱి కొద్దిరోజుల కామె భర్తకు టైఫాయిడ్ జ్వరము సోకగా, అహల్య వైద్యులను నమ్మక వాసిష్ఠ పాదమును శరణు గోరెను. అప్పుడు వాసిష్ఠుడు తనకడ నున్న 'యింద్రాణీ సప్తశతి' గ్రంథము నామెకిచ్చి, దాని నొకసారి భర్తయొద్ద పారాయణము చేయుటకామె నాజ్ఞాపించెను. ఆ గ్రంథము సంస్కృత లిపిలో వ్రాయబడి యున్నందువ నామె సులభముగా చదివెను. వెంటనే వాసిష్ఠ మహిమ వలనే

వాసిష్ఠ ప్రణీత గ్రంథమహిమయు విదితమై, గణేశభట్టు జ్వర మా నాడే మాయమయ్యెను.

ఇంకొక నాడొక పొలములోనున్న యొక పాకలో వాసిష్ఠుడిరువది, ముప్పది మంది భక్తులతో గూర్చుండి యేదో ప్రసంగించుచుండెను. పాక చుట్టును దడియున్నది. దడికావల పది గజముల దూరములో వట్టి గడ్డి మేట్లు చుట్టును వేయబడియున్నవి. మేటికి, మేటికి నడుమ నొక పశువు దూరుటకు మాత్ర మెడముండెను. హఠాత్తుగా మేట్లన్నియు నొక్కసారిగా నంటుకొని పాకచుట్టును చక్రమువలె జ్వాల లేచి, పాకను, పాకలోని వారినిగూడ దగ్ధము జేయుటకు సిద్ధమై యుండగా, వాసిష్ఠుడు విరాట్ ఛందస్సుతో రెండు పాదములుగా నున్న పారాశర్యుని యగ్నిమంత్రమును స్మరించి యస్త్రముగా ప్రయోగించెను. ఉత్తరక్షణమున వగ్నిమిత్రుడైన వాయువా పాకయున్న స్థలమునుండి సుడివలె పుట్టి యన్ని దిక్కుల నతి బలముగా వ్యాపించుచు గడ్డిమేట్ల నగ్నిసహితముగా దూరమునకు చిమ్మి, విపత్తును కొద్దిక్షణములలో తొలగించెను. ఈ యద్భుత దృశ్యము నక్కడివారు చూచి వాసిష్ఠుని మంత్రశక్తికేగాక వేదమం దస్త్రముగా ప్రసిద్ధి కెక్కిన మంత్రములందున్న యనిర్వాచ్యమగు మహిమకు విభ్రాంతులైరి. ఆ మంత్రమిది :

"వనేమ పూర్వీరర్యో మనీషా।
అగ్నిః సుశోకో విశ్వాన్యశ్యాః॥"

నాయన కుళువే చేరిన యొకటి, రెండు నెలలకు కలువళాయినుండి శివరామశాస్త్రి వచ్చెను. అతడు వచ్చి, యా ప్రాంతమందు దినదినాభివృద్ధియగు నాయనయొక్క భక్తసంఖ్య యంతయు ధనసంపన్నులై యుండుట కనిపెట్టి మహాదేవమునకు రహస్యముగా నేదో వ్రాసెను గాబోలు. మహాదేవము తిరువణ్ణామలైలోని యుద్యోగమును వీడి కలువళాయి వెళ్లిపోవుచు, సామాన్లను మాత్రము ప్యాకింగుచేసి కుళువే పంపెను. అవి చేరిన పిదప నాయనకు కోపము రాకుండు విధమున శివరాముడు సర్ది చెప్పి, మఱికొద్ది రోజుల కతడును కలువళాయి పయనమయ్యెను. మహాదేవమును శిరసిలో స్థిరపరచు నుత్సాహము తప్ప వేఱొండు సంకల్ప మతనికి లేకున్నను, కలువళాయిలోగూడ నతడు నాయనకు ప్రాప్తించిన ధనిక శిష్యులను గురించి చెప్పుటవలన నతని పినతండ్రియైన సర్వేశ్వర శాస్త్రిగారి కొక పిచ్చియూహ కల్పించినవాడయ్యెను. అప్పుడీ సర్వేశ్వర శాస్త్రిగారి భూమియంతయు తనఖా బాకీలకు లోనైయుండెను. భూమి యన్యాక్రాంతమగుటకంటె కుటుంబమందుండుట కతడొక ఉపాయము నాలోచించెను. ఎట్లనగా, ఋణముతో సహా తన భూమి నతడు మహాదేవమునకు

ట్రాన్స్ఫరు చేయ నిశ్చయించుకొనెను. అట్లు చేయుటవలన నాయన యీ ఋణవిముక్తికొఱకు శిష్యసహాయము పొంద ప్రేరేపితుడగునని యాలోచింపబడెను. అందువలన దస్తావేజుపత్ర మతడు వ్రాయించి, దానిని జూపి నాయనను సమ్మతింపజేయుటకు శివరాముని మఱల కురువే పంపెను. 6-2-1930వ తేదీనాడు శివరాముడు మఱల కురువే వచ్చి, నాయన కాశ్చర్యము కలిగించెను. నాయన కతడు నమస్కరించి యేమియు పల్కకుండ గృహములోనికి పోవుచుండగా నాయన ముఖము నుండి "యేమిది! దేహయాత్రావసానమునకు వచ్చినవానివలె గన్పట్టుచున్నా"డను వాక్యము చెంతనున్న వారికి మాత్రము వినబడునట్లు వెడలెను.

ఆ రాత్రి శివరాముడు వెందలకడనే నిద్రపోయెను. మఱునాడు కాలకృత్యములను దీర్చుకొని, నాయనతో దస్తావేజు సంగతి చెప్పుటకు కూర్చుండిన శివరామశాస్త్రి మఱుక్షణమందే గుండెనొప్పి యని వెనుకకు వ్రాలి, మఱి కొంచెము సేపటిలో ప్రాణములు గోల్పోయెను. అతని పెట్టి చూడగా నాయన కందులో తనఖాదస్తావేజుపత్ర మగుపడెను. కడపటికాలమం దది శివరామునియందు దోసమై యతని ప్రాణహరణమునకు కారణమైనను, సోదరున కతడొనర్చిన నిష్కపట సేవాఫలముగా సోదరుని పాదములందే తన యసువుల నర్పించి, మహాభక్తునివలె క్షమార్హుడయ్యెను.

చిన్ననాటినుండి తన తపోయాత్రలందు తోడునీడయై పరిచర్యలు సల్పిన సోదరుని మరణమునకు వాసిష్ఠుడు చాల విచారించెను. అమాయకుడైన శివరాము నుద్బించి, దస్తావేజు వ్రాయించి సంతకముకొఱకు పంపిన సర్వేశ్వరశాస్త్రిగారు తమ దోషమున కితనిని బలియిచ్చిరని వాసిష్ఠుడు గ్రహించెను. పుత్రుడైన మహాదేవశాస్త్రి కూడ ఋణగ్రస్తమైన యీ ఆస్తి విషయములో వంచింపబడి యుండవచ్చుననియు నూహించి, దస్తావేజుపత్రము నేమి చేయుటయా యని వాసిష్ఠు డాలోచించునంతలో మహాదేవుడే స్వయముగా కురువే వచ్చెను. సంతకముకొఱ కేర్పయైన తండ్రిపై నొత్తిడిచేయుట కితడు ప్రేరేపింపబడి, శివరాముని మరణవార్త చేరులోపున కలువాయినుండి పంపబడెను. ఆ కారణముచేత కురువే చేరి, పిడుగువంటి పినతండ్రి మృత్యువార్త విని, మహాదేవుడు తన కెట్టి విపత్తు సంభవింపనున్నదో యని భయపడి, తండ్రి కీ భూమి వ్యవహారమును గుఱించి యథార్థమిట్లు వచించెను: "భూమి మన కుటుంబమం దుండవలెనని తాతగా రభిమానించిరి. మనము దానిని తనఖాబాకీలకు లోబరచి విక్రయించినచో, ఋణమును మీరు శిష్యసహాయమున నిట్టే తీర్పగలరని భావింపబడెను."

వాసిష్ఠు డీ వాక్యములను విని, తాను శిష్యులకడ చేయి చాచి ధనమర్థింప వలెనని బంధువులందఱు వాంఛించుచున్న యల్పబుద్ధికి వగచి, పుత్రునితో నిష్కర్షగా నిట్లు చెప్పెను: ''నే నెన్నటికీ నట్టి పని చేయను. ఆ భూమిపై వచ్చు రాబడితో నెమ్మదిగా ఋణము చెల్లుకట్టుకొనవచ్చునను ధైర్యము నీకున్నచో నే నిప్పుడే దస్తావేజుపై సంతకముచేసి సర్వేశ్వర శాస్త్రిగారికి పంపెదను. ఏమందువు ?'' మహాదేవు డట్లు ప్రయత్నించుటకు సంసిద్ధుడై, సంతకము చేయించుకొని, తా వచ్చిన పనినేకాక శివరాముని తుదికోర్కెగూడ సాధించు కొనినవానివలె సంతసించెను. కాని, యీ భూమికి పట్టిన దోషమెట్టిదోగాని మహాదేవముకూడ తత్ఫలముగా మఱికొద్ది దినములకే గొప్ప విపత్తుకు గుఱియై తండ్రిచే రక్షింపబడెను.

అది కుఱువేనుండి యతడు కలువఱాయి మఱలక పూర్వమే సంభ వించెను. ఎట్లనగా, నొకరి యింటి కాతిథ్యమునకై మోటారులో తండ్రీకొడుకు లిద్దరూ వెళ్లుచుండిరి. మహాదేవ మెడమ చేయి కిటికీ వెలుపలకు పెట్టుకొని కూర్చుండెను. కొంతదూరము వెళ్లిన పిదప మలుపు తిరుగబోయి శకటమా యెడమవైపునకే నెమ్మదిగా తిరుగబడెను. మహాదేవము మోదేయి శకటము క్రిందపడి విరిగెను. ఇతరుల కెట్టి గాయములు తగులలేదు. శకటము వెంటనే సరిచేయబడి మహాదేవము నాస్పత్రికి తీసికొనివెళ్లగా వైద్యుడు కట్టుకట్టి, పెద్దాస్పత్రికి తీసికొని వెళ్లుట యుచితమని సలహా చెప్పెను అప్పుడు భీతిల్లియున్న పుత్రుని జూచి వాసిష్ఠుడు జాలిచెంది. ఋగ్వేదములో కణ్వపుత్రుడైన మేధాతిథికి దర్శనమైనట్లు ప్రసిద్ధిగాంచిన 'అస్థిసంధాన' మంత్రమును పఠించి ప్రయోగించగా, మహాదేవముయొక్క భగ్నహస్త మొక్కక్షణములో నతుకుకొని వైద్యునకు వింత కలిగించెను. ఆ మంత్రమిది : -

''య ఋతే చిదభిశ్రిషః పురా జత్రుభ్య ఆతృదః।
సంధాతా సన్ధిం మఘవా పురూవసురిష్కర్తా విహ్రుతం పునః॥''

(ఋ 8-1-12)

ఇమ్మట పుత్రుడు స్వగ్రామము వెళ్లదలచియుండగా, నిట్టి యాపదల కింకను మార్గమందేమి గుఱియగునో యను భీతిచే వాసిష్ఠుడు వానితోగూడి పయనమై, వానిని భద్రముగా కలువఱాయి చేర్చిన పిదప కుఱువే మఱలివచ్చెను. మార్గమందు వాసిష్ఠుడు మహర్షిదర్శనము గావించుకొని, కుఱువేయందు తనకు ప్రాప్తించిన అనుకూలతను గుఱించి, తత్ఫలముగా తనయందు వృద్ధివికాసములను బొందిన తపస్సును గుఱించి చెప్పగా రమణుని ముఖము వికసించెను.

ఈసారి వాసిష్ఠుడు భారములేని శిరస్సుతో శిరసి ప్రాంతము చేరినందున నతని యోజస్సింకను ప్రస్ఫుటమై, యతని యాంతర్యమందు తపశ్శక్తి పాకము

తీవ్రతరమయ్యెను. ఆలోచింపగా, బాల్యమం దాయసాగ్ని చికిత్స సల్పిననాడే నాయనయొక్క యంతర్నాడులందున్న తమస్సులు తొలగి ప్రాణ (వాక్) మనోబుద్ధులు పవిత్రములయ్యెను. అభిమానముకూడ శరీరమును వీడి శరీరాకృతులకు కారణమగు మహాశక్తి పరమయ్యెను. కాని, బాహ్యమున నాయనపై నకారణ కక్షపూనిన శత్రువర్గ తమస్సు మాత్రము రూపభేదముచే బాల్యము దాటినప్పటినుండి పొడజూపుచుండుట నాయన చరిత్రయందొక ప్రత్యేకతయై కన్పట్టకమానదు. వీరివలన నాయన కీర్తికి నీడలేర్పడిన మాట నిజమే. కాని, సూర్యుని కీర్తి నెంచగోరువారు మేఘములవలన నక్కడక్కడ నేర్పడు నీడల నెట్లు. లెక్కసేయరో, అట్లే నాయన కీర్తి నా నీడలనుబట్టి విమర్శింపబూనని యెడల, దాని నిష్కళంక ప్రకాశమన్ని విషయములందును గోచరించును. కుళువేయందును నాయన నీ పూర్వతమస్సు కొన్నాళ్లకు మఱల వెంటాడిన విషయము మున్ముందు తెలియును. కాని, యది తనకు తానే చెదరి తొలగి పోయెను. అందువలన జీవితమంతకు కుళువేయందలి జీవితమే తమోవర్జితమై, సుప్రకాశసుఖవంతమై యొప్పెను. మఱియు సహజముగా నున్న మహత్తపోవైభవ మక్కడ నాయన చేరినప్పటినుండి తమస్సుకు దూరమగుటయే.

1928వ సం॥ మే నెల తుదివారమునుండి 1931వ సం॥ ఫిబ్రవరి నెలవఱకు నాయన కుళువేయందు నిశ్చల తపస్సున గడిపెను. శిష్యులతో సాయంత్రములందు ప్రసంగించు స్వల్పకాలము తప్ప మిగిలిన వేళలన్నియు నత్యంత ప్రశాంతములై తపస్సున కెంతో తోడ్పడెను. సీతారామభరతి యొనర్చిన సేవాపరిచర్యలుకూడ విశేషముగా సహాయపడెను. సిమ్మట నొక కారణ మవశ్యమై నాయన కొక సంవత్సరము శిరసియం దావాసమును కల్పించినను, మఱల స్వతస్సిద్ధాశ్రమమువలె నొప్పిన సీతారాముని గృహమే నాయన జీవితాశయసిద్ధికి సహాయపడిన విషయములను వేఱధ్యాయమున ముచ్చటింతము.

ఓం

నాలుగవ ప్రకరణము

# ఆనందాశ్రమము, శిరసి

1931వ సం॥ ఫిబ్రవరిలో 'విశ్వామిత్ర' యను శిరసి శిష్యు డొకనాడు తన యింటికి వాసిష్ఠు నాహ్వానించి విందు చేసెను. ఆ విందునకతనికి ప్రియ మిత్రుడైన 'యస్.పి. పండిట్' అను వకీలును, ఆ వకీలుకు తండ్రియై, శిరసి వకీళ్ళందరకును పూజ్యుడైన పుండరీకరాయుని ప్రత్యేకముగా విశ్వామిత్రు డాహ్వానించి, వారికి వాసిష్ఠ పరిచయము గావించెను. విశ్వామిత్రునివలెనే యస్. పి. పండిట్ తన విద్యార్థి దశయందే కుమటాలో వాసిష్ఠుని యుపన్యాసము వినినను, విశ్వామిత్రునివలె నధ్యాత్మ ప్రబోధము నప్పుడు పొందలేదు. కారణ మతని బుద్ధి ప్రవర్తియం దున్నది. అధ్యాత్మిక విద్యయం దభిరుచి యతని కున్నను, పాశ్చాత్య సంస్కారము, వకీలు వృత్తియందున్న యొత్తిడి యతని యభిరుచుల నభివృద్ధి గాకుండజేసెను. అట్లయినను, స్వతస్సిద్ధముగను, సంప్రదాయసిద్ధముగను నతనియం దనేక సుగుణములున్నవి. ఈ సుందర పండితుని తండ్రియైన పుండరీకరాయుడు ప్రఖ్యాతివహించిన లాయరు. ఇతడు పాశ్చాత్య దేశయాత్రలు సల్పిన నవనాగరికుడైనను, ప్రాచ్య విద్యా సంప్రదాయములం దభిమాని, బాహ్యావేషములకు మోహము జెందని విజ్ఞాని. మతవిషయములలో నారితేరినవాడై యితడు తన యాత్రలం దిటలీ దేశములో క్రైస్తవమత చక్రవర్తియైన 'పోపు'ను సందర్శించి, కొంత ప్రసంగించిన దిట్టరి. తండ్రీకొడుకుల కిట్లు స్వల్పవ్యత్యాసమున్నను, సుగుణములందును, సత్పురుష సమాదరణమందును నుభయులు సమానులు. వీరివలెనే సుందరపండితుని కనిష్ఠసోదరుడైన మాధవపండితుడు బాలుడైనను సుగుణసంపదగలవాడు.

విశ్వామిత్రుని యింట విందు సందర్భములో పుండరీక వాసిష్ఠులకు గలిగిన పరిచయమే వాసిష్ఠుని తపస్థలము కుకువేనుండి శిరసికి మారుటకు కారణమయ్యెను. శిరసి గ్రామమున కొక చివరను చక్కని తోటమధ్యమున పుండరీకరాయుడు తన వార్ధక్యము నానందముగా ప్రకృతిసౌందర్యమును గ్రోలు తన్మయత్వముతో గడపుట కొక సుందరమైన భవనమును 'ఆనందాశ్రమ'మను పేరున నిర్మించెను. కాని, దాని నిర్మాణము పూర్తియగుసరి కేదో వ్యాధి యతని శరీరమున సోకినందున నతడు దానిలో ప్రవేశించక పుత్రునితోడనే పూర్వమువలె గ్రామమం దుండిపోయెను. ఇతడు వాసిష్ఠుని జూచినప్పుడే యాకర్షింపబడి, తరువాత చేసిన సంభాషణచే వాసిష్ఠు దనార్యజమూతమున జిక్కుకొనిన

భారతదేశమం దార్యతేజమును నెలకొల్పుటకు పుట్టిన మహానుభావుడని గుర్తించెను. కావున వాసిష్ఠ సాంగత్యమును గోరి యతడు తన యానందాశ్రమమున వాసిష్ఠునుండ వేడుకొనెను. తండ్రి యాహ్వానమును పుత్రుడు బలపరచి, వాసిష్ఠునకు వండిపెట్టుట కొక మంచి బ్రాహ్మణయువకు నేర్పరచెను. అంతేకాక, దూరస్థలములనుండి వచ్చిపోవు వాసిష్ఠభక్తులుకూడ వాసిష్ఠునితోపా టాశ్రమమున భుజించుట కేర్పాట్లొనర్చి, యా స్థలనామమును సార్థకమొనర్చుట కుత్సాహపడి నందున వాసిష్ఠున కా తండ్రికొడుకుల కోర్కెను మన్నించక తప్పినది కాదు.

ఆనందాశ్రమమున వాసిష్ఠుడుండుటకు పుండరీకరాయునికంటె నధిక ముగా విశ్వామిత్రుడు సంతసించి, వాసిష్ఠ ప్రవచనముల నాలకించుటకు శిరసిలోని ప్రముఖులను హెచ్చరించి, ప్రవచనముల నాశ్రమమందే యేర్పరచెను కాని, యాశ్రమ పవిత్రతను గాపాడుటకై జనబాహుళ్యమునకు పురమందే యుపన్యసించుటకును, శిష్యులైనవారి కాశ్రమమందు బోధించుటకును వాసిష్ఠుడు నిశ్చయించి, తొలుదొల్త యాశ్రమ వాతావరణమందు వేదస్పందములను నెలకొల్పుట కొక వారము దినములు సుస్వరమెఱిగిన వేద పారాయణ దక్షులతో గూడి వేదత్రయమును పఠించెను. పిదప ప్రాతస్సాయంత్రములం దగ్ని, యింద్రుల సంప్రీతికొఱకు శిష్యులతోసహా హోమములను సల్పుచు నా స్థలమందు ఋష్యాశ్రమకళను ప్రతిష్ఠించెను.

నాయన మూడునాలుగు ప్రవచనములను పురమందు కన్నడ భాషలో ధారాళముగా నిచ్చెను. శిష్యులుగా పెక్కుమంది చేరి, మంత్రదీక్షలను గైకొని, యాశ్రమమం దనుదిన బోధలచేతను, గురుని సమక్షమందు గురుని తపశ్శక్తి ప్రవాహముతో చిత్తముల నైక్యము గావించుకొని కొంతతడ వనుదినము సల్పుచున్న మంత్రధ్యానము చేతను వృద్ధిగాంచి, యభివృద్ధి సూచకములగు ననుభవములచే హెచ్చరిక పొందజొచ్చిరి. ధ్యానము సాధించువారికి ధ్యాన మనాయాసమై, వాసిష్ఠశరీరమునుండి ప్రసరించు విద్యుత్తరంగములు తమ శరీరముల దొచ్చుచున్న స్ఫూర్తియగుచుండెడిది. యోగమం దిచ్ఛగలవారికి యోగలక్ష్యముతో సంధానము సులభమగుచు, నాదబిందు కళల విస్ఫూర్తియయ్యెడిది. మహర్షిని గుఱించి వాసిష్ఠుడు చెప్పినప్పుడు వారి మనస్సులందు వాసిష్ఠ నేత్రమునకు గోచరించు మహర్షి రూపము హత్తుకొని, స్వప్నమందా రూపదర్శనము పొందుచుండిరి.

ఆ సమయమందు వాసిష్ఠుని తపస్సుతోపా టనుగ్రహ శక్తి ప్రస్ఫుటము కాజొచ్చెను. మఱియు కపాలభేదనసిద్ధితోపా టాంతర్యమున నుత్పన్నమైన దివ్యశరీరము వాసిష్ఠునకు తెలియకుండగనే యితరుల బుద్ధి నావహించి, విచిత్ర ప్రబోధములను కల్పించి వ్యవహరించుచున్నట్లు వాసిష్ఠుడు గ్రహించి, దానిని వశమొనర్చుకొనుటకు యత్నింపదొడగెను. ఆ శరీరమొకసారి స్వయముగా నేక

యనుగ్రహకార్యమును నిర్ణయించుకొని యత్యద్భుత మహిమను జూపెను. ఎట్లనగా, రామచంద్రభట్టను శిష్యుడు వాసిష్ఠ వచనామృతమును గ్రోలుటకు నిత్యము వచ్చువాడు. ఒక్కొక్కప్పుడు సంస్కృత మెఱిగిన శిష్యుల కోర్కె ననుసరించి వాసిష్ఠుడు వారికి సంస్కృత మిసుమంతయు బోధపడకున్నను రామచంద్రభట్టట్టి ప్రసంగములకుగూడ వచ్చి వారి హాస్యమునకు గురియగుచుండెను. ఎవరెంత పరిహాసించినను లెక్కసేయక గురుని వాగమృతమందు గల ప్రీతితో నతడు గానము వినునట్లా బోధలు విని, తనకు లభించిన యానందముతో తా తృప్తిపడి, యింటికి పోవువాడు. కొద్దిరోజుల కతనికి మాతృభాషవలెనే సంస్కృతము బోధపడి, యితరుల సహాయము లేకయే శ్లోకార్థములను గ్రహించు శక్తి యలవడెను. సత్పురుషుల యనుగ్రహము క్రియారూపమున ప్రవహించి మూగవానికి మాటలు, సొట్టవానికి గిరిలంఘన శక్తియుగూడ ప్రసాదించగలదను సూక్తి రామచంద్రభట్టు విషయములో ప్రత్యక్షగోచరమై వాసిష్ఠునకు గూడ నాశ్చర్యకరమయ్యెను. అప్పుడు వాసిష్ఠుడది నిశ్చయముగా తన దివ్యశరీర ప్రభావమనియు, దాని ప్రభావము రామచంద్రభట్టు ననుగ్రహించినట్లే శివరామ మహాదేవములను శిక్షించియుండు ననియు నిశ్చయించుకొనెను.

వాసిష్ఠు డానందాశ్రమమున బ్రవేశించిన కొద్దిరోజులకే తిరువణ్ణామలైనుండి విశ్వనాథ బ్రహ్మచారి యొక కార్యార్థమై వచ్చెను. ఆ కార్య మెట్టిదనిన శ్రీ రమణ మహర్షిచే రచింపబడిన 'ఉళ్లదు నార్పదు' (ఉన్నది నలుబది) అను తమిళ పద్యగ్రంథమునకు శ్రీ లక్ష్మీనరసింహశాస్త్రియను నొక పండితుడు సంస్కృతమున ననువదించి శ్లోకములను వ్రాయగా, మురుగనారా యనువాదమును మహర్షి యనుమతి బొప్పున వాసిష్ఠునిచే పరిశీలింపబడుటకు విశ్వనాథముద్వారా పంపెను. తమిళ గ్రంథములోని పద్యములున్న పద్యస్తువును గుఱించి మురుగనారు కుపదేశించుట కప్పుడప్పుడు మహర్షిచే రచింపబడినవైనను, వాని నొక క్రమమున వాసిష్ఠుడే రమణాశ్రమము చెంతను పనసతోటలో నున్నప్పుడు పేర్చెను. కనుక సంస్కృతానువాదము వాసిష్ఠామోదము పొందనిదే ప్రచురింప బడరాదను నిశ్చయముతో ప్రత్యేకముగా పంపబడెను.

1931వ సం॥ మార్చి మొదటి వారములో విశ్వనాథ మానందాశ్రమము జేరి సంస్కృతానువాదమును నాయనకు జూపగా, నాయన దానిని జదివి "యిందులో చాల స్థలములందు సవరణలు చేయవలసియున్నవి. ఇంతకంటె క్రొత్తది వ్రాయుట మంచి" దనెను. విశ్వనాథ మప్పుడు 'మే మట్లగుననుకొంటి' మని పల్కి క్రొత్తదానికొఱకు నాయన నర్థించెను. నాయన దానిని బ్రారంభించు లోపున కపాలిశాస్త్రి భార్యాసహితుడై వచ్చి యానందాశ్రమమందే బస చేసెను. ఒకటి, రెండు రోజులు ముందువెనుకలో మహాదేవము కలువళాయినుండి

వచ్చెను. సీతారామభరతి కుమార్తె యంతకుపూర్వమే కులువేనుండి వచ్చి నాయన పరిచర్యల కుండిపోయెను. సీతారాము డనుదినము తన వైద్యవృత్తి చొప్పున శిరసి వచ్చి నాయనను జూచిపోవుచుండెను. వీరందరి రాకవలన నాయన కానందాశ్రమ మధికముగా నానందము నిచ్చెను. కపాలి తన్ను జూడవచ్చుటకు నాయన చాల సంతసించెను. ఆ యానందవశమున నాయన 10-3-1931వ తేదీనాడు శ్రీ రమణమహర్షి కొక లేఖ వ్రాసెను. దానిలో నాయనయొక్క యంతఃస్థితి తిరువణ్ణామలై విడిచిన పిదప నెంత యభివృద్ధి జెందెనో విశదముకాగలదు. ఆ లేఖ యిట్లుండెను:

ఆనందాశ్రమం, శిరసి,

"భగవాన్, గుహావతార, 10-3-1931

సుందరపండితుడు, విశ్వనాథుడు, కపాలిగార్ల లేఖల వలన నేననుచరులతో గూడి యిక్కడ తపస్సు చేయుచున్నట్లు భగవాన్‌కు విశదమై యుండును. అందరికి మూడుదినముల నుండి - ముఖ్యముగా నాకు - విశేషానందము పుట్టించునట్టి యనుభవములగుచుండెను. పెక్కుమందికి స్వప్నమందు మహర్షి దర్శనమయ్యెను. ఈ యభివృద్ధికి భగవానుని కటాక్షమే కారణమని వారు దృఢముగా విశ్వసించియున్నారు.

ప్రభో! భగవంతుని కటాక్షమువలన నాకే నిష్ఠ ప్రాప్తించెనో, అది నా కిక్కడ విజ్ఞానాత్మకమగుచున్నది. శరీరముకంటె భిన్నముగా నాత్మ నీ గుహాయం దనుభవించుచుంటిని. అట్లయినను, ప్రపంచానుభవమునుండి యిది భిన్నత్వము పొందనందున పూర్ణనిష్ఠగాదని తలచుచుంటిని. అట్టి పూర్ణనిష్ఠకై బహు యోజనములు లంఘించగల్గు తమ కటాక్షమును బంప వేడుచుంటిని. నాయొక్క పూర్వపు లహరి మదభారముతోగూడి కేవల శక్తిప్రవాహినియైయుండినను, ప్రస్తుత శక్తిలహరి లఘువై తేజఃప్రవాహినియైనట్లు కన్పట్టుచున్నది. మహా కార్యసిద్ధికై భగవన్మహర్షి యొక్క కటాక్షవశమున దేవతలు నా కొఱకు ప్రేరేపితులై నన్ను సంస్కరింతురని నేను విశ్వసింతును. దయాపూర్ణమగు కటాక్షమునే మీరు నాకు ప్రత్యుత్తరముగా పంపుదురుగాక.

ఇచ్చట మహాదేవము, విశ్వనాథము, రంగ, సీతారాముని పుత్రిక, భార్యతో గూడిన కపాలి యాశ్రమములో నిత్యులు. సుందరపండితుని యక్కయు, దేవేంద్రశర్మయు సాయంత్రములందు వచ్చుచుందురు. వీరందరు భగవాన్ రమణ కటాక్షము నర్థించువారే.

ఇట్లు, భగవంతుని కింకరుడైన

- వాసిష్ఠగణపతి."

ఈ లేఖను బంపిన మఱునాడే విశ్వనాథము కోరిన యనువాదము రచించుటకు నాయన ప్రేరణ పొందెను. అటుపిమ్మట విశ్వనాథ కపాలుల కొకవంక తమిళ పద్యములలోని సారమును బోధించుచు, వింకొకవంక వాటి కనువాద శ్లోకములను రచించి, 14-3-1931వ తేదీ శనివారము నాటికి పవిత్ర గురుకార్యమును నాయన ముగించెను. ఈ యనువాదమును 'సద్విద్య', 'సద్దర్శనము', 'ఉన్నది నలుబది'యను వివిధ నామములతో శిష్యులు పిలిచినను, నాయనచే 'సద్దర్శన'మని పేర్కొనబడి, తిరువణ్ణామలై పయనముగుచున్న మహాదేవముద్వారా మహర్షి కొక శుద్ధప్రతి పంపబడెను. ఈ యనువాదమును ముగించినప్పటినుండి నాయన దృష్టి మఱింత విలక్షణమై, సర్వపదార్థములందు రూపవికారములు పోగా, మిగులు సద్రూపవస్తువును తిలకించుటకు, తద్ద్వారమున నంతటను నున్న స్వరూపమొక్కటియే యను నభేదానుభవమును సాధించుటకు ప్రయత్నింపదొడగెను. తనయం దెప్పటికప్పు డభివృద్ధి చెందుచున్న నంతరనుభవమును మహర్షి కెఱిగించు నుద్దేశ్యముతో వారమునకొక లేఖ వ్రాయుటకుగూడ నాయన నిశ్చయించుకొనెను. పూర్వ పత్రమునకు పిదప వారమున కొకసారి వ్రాయబడిన యీ పత్రము లనుభవవేద్యములు, హృదయంగమములు గావున, వానినీ యధ్యాయమందే చివర నీయడమైనది.

నాయన 'సద్దర్శనము' ముగించిన తోడనే కపాలిశాస్త్రి దాని కాంగ్లమున నొక భాష్యము వ్రాయ సమకట్టెను. 1931వ సం॥ జూన్ నెలాఖరుకుగాని యిది పూర్తికాలేదు. ఈలోపున మూడువందల శ్లోకములచే నిబద్ధమైన 'ప్రచండ చండీత్రిశతీ' యను స్తోత్రగ్రంథమును నాయన రచించి, శిష్యుల కోర్కెపై ఈశోపనిషత్తున కొక లఘుభాష్యమును (అనుబంధము చూడుడు) గూడ వ్రాసెను.

ఇట్లుండగా, దైవరాతుడు తన పుత్రునకు గోకర్ణమం దుపనయన సంస్కారము చేయ నిశ్చయించి నాయన కాహ్వానమంపెను. సీతారామభరతితో గూడి నాయన యీ కార్యమునకు వెళ్లి, పది దినములలో మఱలివచ్చెను. కపాలిశాస్త్రి తన భాష్యరచనము నప్పటికిని ముగించక సుందరపండితునకు వేదాంతమును బోధించుటయం దధికముగా కాలమును వినియోగించినట్లు నాయనకు తెలిసెను. నాయన గోకర్ణమునుండి వచ్చుసరి కప్పుదంపతులు కూడ శిరసి వచ్చియుండిరి. సుందరపండితుని కపాలిశాస్త్రి వశమొనర్చుకొనుట కెట్లు పాటుపడుచుండెనో, సుందరపండితుని తండ్రియైన పుండరీకరాయుని వశమొనర్చుకొనుట కప్పుశాస్త్రి తావచ్చిన నాటినుండియు పాటుపడుచున్నట్లు నాయన వినెను. ఒకరి కరవిందుని యనుగ్రహము, ఇంకొకరికి రోగోప శమనమునకై నాయన యనుగ్రహము ప్రాప్తింపచేయు నెపముచే కపాలి యప్పుశాస్త్రు లిరువురు పురమందున్న పుండరీకుని గృహమునకు చేరియొక

త్రోవను వెళ్లి, యాషాఢభూతులవలె నక్కర ప్రవర్తించి, నాయన వచ్చిన పిదప నొకరిపై నొకరు ఫిర్యాదులు చేసికొని తగవులాడఁజొచ్చిరి. నాయన వారి నిరువురను చీవాట్లు పెట్టెను. ఇఱువురకు నౌదాసీన్యము కల్గెను. సుందరపండితునకు కపాలి నిరోధింపబడుట కష్టముగా తోచి, యతనికొఱకు పురమందొక ఋష ప్రత్యేకముగా నమర్చెను. అప్పటి కతని దృష్టిలో నాయనకంటె నరవిందు డధికుడనియు, నాయన పద్ధతులకంటె నరవిందుని పద్ధతు లధిక శ్రేష్ఠములనియు నాటబడెను గాబోలు! అట్టి వ్యత్యాసములను కపాలియే కల్పించినవాడై, నాయనకు దెలిసినందులకు సిగ్గుపడి క్షమాపణ చెప్పుకొనుటకు బదు లప్పుశాస్త్రిపక్షము నాయన వహించెనను నపోహచే నుదాసీనుడయ్యెను. ఇంక అప్పుశాస్త్రియు నపోహవల్లనే యుదాసీనతచెంది, శిరసి విడిచి భార్యాసహితుడై సికింద్రాబాదు వెళ్లిపోయెను.

తనయందీ ప్రియశిష్యులు కిన్కపూనినందులకు నాయన విచారపడ తున్నను, తన కానందాశ్రమమున నాతిథ్యమిచ్చిన సుందరపండితుడీ సందర్భములో కపాలి నింకొక ఋషచే వేఱుచేయుటకు బాధపడెను. మఱియు నానందాశ్రమమున దానుండుటకు గూడ లజ్జపడినను, అపోహలన్నియు తొలగునని నాయన యాశించెను. అట్లు తొలగని పక్షమందు కపాలి తన భాష్యరచనమును ముగించువఱకైన నెట్లో లజ్జను భరింప నిశ్చయించుకొనెను.

విచిత్రమేమనగా, నాయన నాహ్వానించిన పుండరీకరాయునకీ విషయము లెవ్వరును చెప్పలేదు. అతడు వార్ధక్యము వల్లను, దీర్ఘరోగమువల్లను గృహము దాటి మసలుట మానుకొనెను. మధ్య మధ్యను నాయనయే వెళ్ళి యతనిని జూచుచుండెను. అరవింద దర్శనముకొఱ కతని పుత్రు డాయత్తపడుచున్నట్లు కొరలైన నతనికి తెలుపలేదు. నాయనకెట్లో పుండరీకునకట్లే యీ రహస్యము నెఱిగించుటకు సుందర కపాలులవలె నింటిలోనివారుగూడ భయపడి యుందురు. ఏదెట్లున్నను, కపాలి తన భాష్యము నరవిందజయంతి సమీపించు వఱకు విలంబనము చేసెను. అది ముగియువఱకు విశ్వనాథముకూడ నిలుపు చేయబడెను. తుదకది ముగిసిన పిదప విశ్వనాథముద్వారా పంపినచో మార్గ మందు మోటారుశకటములో వర్షమునకు తడియునని యెంచబడి, 1-7-1931వ తేదీని పోస్టుద్వారా మహర్షికి పంపబడెను. ఆ దినమే విశ్వనాథము, రంగారావులుకూడ వెళ్లిపోయిరి.

పిమ్మట విశ్రాంతికొఱకు కపాలిదంపతు లానందాశ్రమమునకు వచ్చి, యాగస్టులో వచ్చు అరవిందజయంతి కొక వారము ముందుగా పుదుచ్చేరి వెళ్లిపోయిరి. వారు వెళ్లునప్పుడు వారితోగూడ సుందరపండితుడుకూడ వెళ్లినట్లు నాయనకు తెలిసెను. తనయందు గురుభావముంచి యానందాశ్రమమున

కాహ్వానించియు, తనతో చెప్పకుండ సుందరపండితు డరవింద దర్శనమునకు వెళ్ళుటనుబట్టి యతని గురుభావము నతడు కపాలి ప్రేరణమున విసర్జించినట్లు నాయన భావించి, వెంటనే యానందాశ్రమమును వీడి, సీతారామభరతి సహాయమున 'సాగర సారిబా'యను జలపాత కేంద్రమునకు వెళ్ళిపోయెను. అప్పుడు సీతారాముడు తన కుమార్తె నాగమ్మనుగూడ పరిచర్యలకొఱకు వెంట తీసికొనివెళ్లెను. ఈమె చిన్నపిల్లయైనను, నాయన సేవయందు పెద్దలకంటె నధిక శ్రద్ధ చూపెడిది.

నాయన యానందాశ్రమము వీడిన వార్తను దానికి గల కారణములతోసహా విశ్వామిత్రునివలన పుండరీకరాయుడు విని చాల బాధపడెను. అతడు రుగ్ణతతో నున్నను వెంటనే సాగరగ్రామము వెళ్ళి, తన పుత్రునికొఱకు గాక తనకొఱ కానందాశ్రమమునకు తిరుగ రావలెనని నాయనను బ్రతిమాలెను. దయార్ద్రుడైన నాయన 'సరే'యని పల్కి, యా వృద్ధుని శాంతపరచెను. ఆ మాటకతడు సంతసించి యక్కడ నుండియే విశ్వామిత్రునకు లేఖ వ్రాసెను. నాయన సాగరగ్రామము నుండి తుఱువే వచ్చి, యటనుండి సుందరపండితుడు మఱలి వచ్చెనను వార్త వినువఱకు శిరసి వెళ్లలేదు. సుందరపండితు డరవిందాశ్రమము వెళ్లి, యక్కడ సుధన్వాది ప్రముఖుల పరిచయము పొందిన తరువాత నాయనను గుఱించి తనకుండిన సంకుచితాభిప్రాయములను తొలగించుకొనెను. పైగా, నాయన యనుమతిని బొందని లోప మక్కడకు వెళ్లిన పిదప అతనికి విశదమయ్యెను. అందువలన నతడు తుఱువే స్వయముగా వచ్చి నాయన క్షమాపణను వేడి, నాయనను తోడ్కొని శిరసి వెళ్లి, తన తండ్రి కుత్సాహముగూర్చెను. కపాలియు లేఖ మూలమున నాయన క్షమాపణను వేడుకొనెను. ఆనందాశ్రమఘట్ట మీ విధముగా పునరానందదాయకమయ్యెను.

దీర్ఘకాల శిష్యులు నాయన సాంగత్యమువలన నానాముఖాభివృద్ధితోపాటు నాయనయందు ప్రత్యేకతయై యొప్పు స్వతంత్ర విచారశీలమనెడి వైభవమునుగూడ నేర్చి, తదాచరణమందు గురునితో నభిప్రాయభేదము చెందిరేని, వారియం దుదారబుద్ధితో నాయన స్వకీయవైభవమునే చూచి, తన వాత్సల్యమున కెన్నడును భంగము రానీయలేదు. ఈ వాత్సల్యమువలన శిష్యులు తమ యల్పబుద్ధిని తామే గ్రహించుకొనుచుండిరి. కావున తుదకు నాయనకే జయమయ్యెడిది.

(శ్రీ రమణమహర్షికి గణపతిమునిచే వ్రాయబడిన లేఖలు).

ఆనందాశ్రమం, శిరసి,

"భగవాన్, విశ్వగురో; 17-3-31

ప్రతివార మొక లేఖ భగవత్సన్నిధికి పంపవలెనని హృదయము ప్రేరేపించు

చున్నది. 'సద్దర్శనము' శనివారము (14-3-31) నాడు ముగింపబడెను. అందులో భగవంతుని శుక్లఛందస్సు (అనగా యాజ్ఞవల్క్యసూత్ర) తాత్పర్యము యథాశక్తిగా నుపజాతి వృత్తములలో కూర్చబడెను. నా యనువాదమందు గుణమున్నచో, నది భగవానుని యనుగ్రహమే. ఆ శనివారమునుండి నా దృష్టి విలక్షణము కాజొచ్చెను.

సర్వపదార్థము నేకస్వరూపముగా చూచుచుంటిని. ఈ యభ్యాసము దృఢమై యనుభవరూపమున నుండుటకు భగవంతుని ప్రార్థించుచుంటిని. నీటియందు బుడగలవలెనే యొక్క సద్వస్తువునం దీ రూపవికారములను తిలకించుచుంటిని. ఆ వికారములను విడిచి శుద్ధసద్రూపమును బొందుటకు యత్నించుచుంటిని.

ఇట్లు, మీ యనుగ్రహార్థి,
– వాసిష్ఠుడు.''

ఆనందాశ్రమం, శిరసి.

''భగవాన్, కారణగురో, 24-3-31

భగవంతుని యనుగ్రహముచే మేము తేజస్స్వరూపమగు భగవత్కరుణ యందు మునిగియుంటిమి. ఓ మాయాపుంజ సంహారీ! ఇప్పటికిని నాకు భేదబుద్ధి యస్తమించలేదు. మీ యొక్క క్షణిక సంకల్పమున్నచో నాకది సర్వాత్మభావమగునని నేనెఱుగుదును. స్వేచ్ఛగా మీ మనస్సునం దొక్క సంకల్పమైన నుండజాలదని నే నెఱుగుదును. ఈశ్వరుడే మీ మనస్సునం దట్టి సంకల్పమును బుట్టింప సమర్థుడు. ఇట్టి ద్రావిడ ప్రాణాయామవిధ మేల యని ప్రశ్న రావచ్చును. ఈశ్వరుడే స్వయముగా ననుగ్రహించక మఱొకనికి సంకల్పము పుట్టించుట కేల ప్రయాసపడవలెను ? నిజమే, యీ రహస్యము పుణ్యాత్ము లెఱుగదగినది. అవతారపురుషుడు జాగరూకుడైయుండగా, నతనిద్వారా యీశ్వరుడు తన కర్తవ్యమును చేయునుగాని స్వయముగా చేయడని సిద్ధాంతము. అందువల్లనే తమ మనస్సునం దట్టి సంకల్పము బుట్టించుట కీశ్వరుని నేను ప్రార్థించుచుంటిని.

ఇట్లు,
మీ జన్మాంతరసోదరుడు.''

ఆనందాశ్రమం, శిరసి

''భగవాన్, పారాశర్యా, 7-4-31

భగవత్కటాక్షమువలన మేమందర మిచ్చట క్షేమముగానుంటిమి. వత్సకపాలిచే సద్దర్శనభాష్యము ప్రారంభింపబడెను. మూలగ్రంథము యొక్క గౌరవమువలన దానికి భాష్యమను పేరు నేనే సూచించితిని. విమర్శించగా సద్దర్శన

మతి గంభీరమైయున్నదని కపాలి యనెను. అది మీచే రచింపబడినప్పుడే దాని గాంభీర్యము నాకు తెలిసినది. ఆ గ్రంథము మితమైనను, గొప్పదైన తత్త్వయోగశాస్త్ర రహస్యములకు సూత్రప్రాయమైయొప్పను. పరమతఖండన మించుకయు లేదు. అట్లయినను, నితరుల ధోరణి విచిత్రముగా పూర్వపక్షము చేయబడెను. అందున్న యుక్తులు పండితపామరుల కుభయులకు హృదయమునంటును. ఇందు ప్రమాణగ్రంథ మేదియు గైకొనబడకున్నను, వేదసారసంగ్రహమువలె ప్రకాశించుచున్నది. దీని వివరణముచే భాష్యకారుడు ప్రతిఘటింపవలసినది మిగుల కలదు. నూత్నముగా తెలియదగినవియు కలవు. అయినను భాష్య మతి విపులముగా నుండరాదు. విషయములు విడువదగినవికావు కనుక, ప్రాముఖ్యమైనవి నిరూపించవలసియున్నవి. ఈ భారము సర్వము నిర్వర్తించుటకు భగవంతుని నిరుపమాన కటాక్షలేశమున్నచో కపాలి సమర్థుడు కాగలడు.

నేను 'ప్రచండ చండీత్రిశతి' యను చిన్న స్తోత్రమును రచించితిని. అందొక్క స్తబకము రంగారాయుడు వ్రాసికొని వెళ్లెను. ఇప్పు డింద్రసహస్రము నారంభించితిని, నా యీ కర్మ తుదిముట్టుటకు రమణునిదే భారము.

ఇట్లు, రమణభాగవతుడైన
— వాసిష్ఠుడు."

ఆనందాశ్రమం, శిరసి,
14-4-31.

"భగవాన్, దహరశయా,

మా సంవత్సరాది వందనములు స్వీకరించి మమ్మాశీర్వచనములతో వృద్ధిపొందించ గోరుచున్నాను. తమ కరుణచే మాకీ సంవత్సరము జయ మంగళప్రదమగుగాక. నాథా! తపస్సు పరిపక్వమై, అహంకారము నశించి, సహజస్థితియందు స్థిరమై, యింద్రియ సమూహమంతయు భగవదాయత్తమైయుండగా సర్వము సాధింప బడినట్లు నేను తలచుచుంటిని. విజ్ఞానాత్మ విష్ణ నాకు మూలవిష్ణకు మార్గము జూపుగాక. తమ కరుణ సన్నిధియందే సర్వాభీష్టసిద్ధి పూర్ణమొందునని నేనెఱుగుదును. అట్టి శుభకాలమునకై ప్రతీక్షించుచుంటిని. ఈ జను డిప్పుడు దూరములో నున్నను, తమ చిత్త సామీప్యమందున్నవానివలె ప్రకాశించుగాక. ప్రభో! మీ రెప్పుడూ నా హృదయమందే శయనించుచున్నారు. నే నెప్పుడూ మీ పాదములయొద్దనే శయనించుచుంటిని. మీరు నాకు నియోగించు ప్రభువులు, నేను మీకు కార్యదాసుడను.

ఇట్లన్ని విధముల మీవాడైన,
— వాసిష్ఠుడు."

గోకర్ణము,

"భగవాన్, సర్వాంతరా, 21-4-31.

చిరంజీవి దైవరాతుడు తన పుత్రుని యుపనయనమునకు నేనుండవలెనని యవరోధించినందున గోకర్ణము వచ్చితిని. ఇచ్చటనుండి శనివారము బయలుదేరెదను. ఎవడు గుహావాసియో, స్వయముగా నెవడు గుహుడో, యెవడు సంసారుల దేహములందు శయనించుచు యోగులందు విజృంభించుచున్నారో, యెవని యంతర్విజృంభణమునే ద్వితీయ జన్మగా చెప్పుచున్నారో, మంత్రవేత్త లెవని వైశ్వానరునిగాను, శాస్త్రవేత్తలు విరాట్పురుషునిగాను కీర్తించుచున్నారో, యెవనికి జ్ఞానమే స్వరూపమో, జ్ఞానమే స్థానమో, జ్ఞానమే ఆయుధమో నాకు కనిష్ఠుడైన అతనికి నమస్కారము.

ఇట్లు,
- మీ జ్యేష్ఠరాజు."

ఆనందాశ్రమం, శిరసి,

"భగవాన్, కరుణామయా, 28-4-31.

వత్సలైన మహాదేవ, సుందరుల పత్రములు చేరగా నేను గోకర్ణము నుండి శనివారము వచ్చితిని. సికిందరాబాదునుండి అప్పాదంపతులు వచ్చిరి. చిరంజీవి విశ్వనాథముకూడ నాతో గోకర్ణమునుండి మరలి వచ్చెను. వత్స కపాలియొక్క సద్దర్శన భాష్యము జరుగుచుండెను. సద్దర్శనములో నాచే చేయబడిన మార్పు మూలముయొక్క తాత్పర్యము ననుసరించియే యున్నట్లు మీరు చెప్పిరని మహాదేవుని నిజపత్రములో లిఖింపబడెను. అది నా కధికోత్సాహకరమయ్యెను. కపాలి భాష్యము పూర్తియైన పిదప నసాధారణ రామణీయకతను బొందును. గుహాగణపతుల తత్త్వప్రసంగములో నాచే నుదాహరింపబడిన ద్రావిడ పద్యము మహర్షికి నవ్వు పుట్టించెనని మహాదేవుడు వ్రాసెను. అట్టి నవ్వుతో కూడిన ముఖదర్శనభాగ్యము వానికైనది. మాకా వార్తయే సంతోషముకొఱకయ్యెను. నా యొక్క పిల్లయైన గీతమాల * భగవంతుని హస్తముచే లాలింపబడుగాకయని కోరుచుంటిని.

ఇట్లు, మీయం దేకాయత్తచిత్తుడైన,
- గణపతి."

* (గీతమాలయను గ్రంథమును ముద్రించుటకు సుందర పండితుడు మహా దేవమునకు ధనసహాయ మొనర్చెను. దీనిలో గణపతిముని విరచితములైన అగ్ని, గణపతి, యింద్ర, వాయు, సూర్య, దశావతార, అంబికా, రేణుకా, గురు, యోగసార గీతము లున్నవి.)

అనందాశ్రమం, శిరసి,

''భగవాన్, మాయామానుషా,

5-5-1931

ఇచ్చటంతయు నిర్మలముగా నున్నది. ప్రభో! నా స్థితిని కొంచెము తమ చరణసన్నిధిని నివేదించుకొనుటకు నే నుత్సాహపడుచుంటిని. గొప్ప ఆనందమును పరమ లక్ష్యముగా కొందఱెంచుదురు. నిరతిశయ యోగసిద్ధి ముఖ్యలక్ష్యమని మఱికొందఱు తలంతురు. సుఖదుఃఖాతీతస్థితి నింకను కొందఱికి లక్ష్యమగుచున్నది. కొందఱు మృత్యువిజయము గొప్పదందురు. నేను మాత్రము కామోపశాంతి కమనీయ లక్ష్యమని తెలియుచుంటిని. విస్తారములైన కొన్ని కామము లుపశాంతి నొందెను; కొన్ని యనుభవింపబడి శాంతిబొందెను. దూరము చేయబడి మఱికొన్ని యుపశాంతి గావింపబడెను. పారమున్నదో లేదో కాని నాకొక్క కామ్యము * మాత్రముండిపోయెను. దానిని నిషేధించుటకు శక్తిలేదు; దూరముగా పొమ్మనుట కిచ్ఛలేదు. నా కష్టములో భగవంతుని సహాయమును యాచించుచుంటిని. ఆ నా కోర్కె భగవంతునకు తెలిసియే యుండును.

ఇట్లు

.....................''

అనందాశ్రమం, శిరసి,

''భగవాన్, దీనబంధో,

3-6-1931,

భగవంతునిచే నుపదేశింపపడిన యర్థమును సుందర కృష్ణవాసిష్ఠుడు పత్రముద్వారా తెలియజేసెను. అందువల్ల మా సంశయములు నివృత్తమయ్యెను (ఇది పద్విద్యలో మహర్షి తమిళ పద్యమున కొకచోట గణపతిముని వ్రాసిన సంస్కృతార్థము సరిగాలేదని కొందఱు విమర్శించగా, నాయన భావమునే మహర్షి సమర్థించుట).

''పరిచ్ఛిన్న భావముయొక్క అభావము ముక్తునకు, నీశ్వరునకు నొక్కటే'' యనిన మీ వాక్యము మా యిచ్చటి సందేహములనన్నింటిని తొలగించెను. జగత్తున కధికారియై యీశ్వరుడు కలడు. ముక్తపురుషునకు వ్యక్తిత్వము కలదు. వారి యనుభవములు సమమై, భావాభావశూన్యమైయుండును. ఇది మీ వచనమునుండి మాకు స్పష్టమయ్యెను. దీనివలన మీ సద్దర్శనము దృష్టి సృష్టి సంవాదమున కవకాశమిచ్చు చున్నదని పల్కు పక్షము ఖండింపబడెను. ఆ జవాబు సద్దర్శనములోనే కలదు.

ఇట్లు, మీ చరణకమలభ్రమరమైన,

–గణపతి.''

* 22-7-31వ తేదీ గల లేఖయందిది సూచింపబడెను.

ఆనందాశ్రమం, శిరసి,

"భగవాన్, లీలామానవా, 9-6-31

శ్రీమాత (అళఘుమ్మ) యొక్క మహాపూజా దినములందు మా వందనములను స్వీకరింపవలెను. మునులను రక్షించిన శ్రీరామునకు కౌసల్యవలెను, యోగవిద్య నుపదేశించిన శ్రీకృష్ణునకు దేవకివలెను. ఆకౌమార బ్రహ్మచారియైన పరశురామునకు రేణుకవలెను, సర్వభూతముల కభయమొసగిన శాక్యమునికి (బుద్ధునకు) మాయాదేవివలెను, భక్తుల పాదములను భరించిన మనుష్యకుమారునకు (క్రీస్తునకు) మేరీ వలెను- ఈ గుణములన్నింటికోగూడి పూజ్యులైన మిమ్ములను లోక హితముకొఱకు, అవిద్యాంధకార ధ్వంసముకొఱకు, కువాదులను దూరమొనర్చుటకు, సత్యమును బోధించుటకొఱకెవర్తె కనెనో, సుందరప్రియురాలైన ఆ సౌందర్యాంబకు నా నమస్కారములు. ఆమె యధిష్ఠానమొందిన మాతృభూతేశ్వరీ భగవతికి నా నమస్కారములు.

★ ★ ★ ★ ★

సుందరుని కుసుమపత్ర మందినది. దాని పరిమళముచే నాశ్రమము పరిమళించినట్లయ్యెను. దాని ననుసరించి భగవంతుని సందేశము వెలుకపరచిన లేఖయు చేరెను. నా యంతరాత్మకు ప్రశాంతము చేకూరెను. కపాలియొక్క సద్దర్శనభాష్యము చాలవఱకు పూర్తియయ్యెను.

ఇట్లు, శ్రీ రమణ భాగవత చరణధూళిధారియైన,

— వాసిష్ఠుడు"

ఆనందాశ్రమము, శిరసి,

"భగవాన్, మహాశయనా, 1-7-31

సద్దర్శన భాష్యమునకు శుద్ధప్రతులు రెండు తయారయ్యెను. ఒకటి యీ దినమం దాశ్రమమునకు పంపబడుచున్నది. మీ చరణదర్శనోత్సుకులై విశ్వనాథ, రంగారాయ లీ దినమందే బయలుదేరుచున్నారు. కొద్దిరోజులలో తమ సన్నిధి చేరగలరు. ఇక్కడ వర్షాకాల మారంభమయ్యెను. మోటారుశకటములో వర్షమున కది తడిసిపోవునను భీతిచే వారిచేతి కీచ్చిపంపలేదు. పోస్టుద్వారా పంపబడుచున్నది. కపాలి భాష్యము నాకమిత సంతోషమును కలిగించెను. ఇది భగవంతుని హృదయమునుగూడ స్పృశించునని నేను విశ్వసింతును.

ఇట్లు, మీ చరణబంధువైన,

— గణపతి."

అనందాశ్రమం, శిరసి,

"భగవాన్, పుణ్యశ్లోకా, 15-7-31

ఇక్కడ భగవంతుని కృపచే నందరు కుశలము. ఈ ప్రాంతములలో సంతతము వర్షములవలన దినములు మందగిల్లెను. అయినను, భగవత్ప్రేరితమైన నొక శక్తిచే పాకము గావింపబడిన మా యంతరంగములు తీవ్రముగానే యున్నవి. ఎచ్చటను సూర్యప్రభ గోచరించుటలేదు. అయినను, వెండలో నున్నట్లుంటిమి. మా యీ పాకమందు ముఖ్యమైన వంటవాడు భగవంతుడని మేము మరువలేదు. భగవంతుని యీ పాచకవృత్తి జీతములేనిది. ఈ కర్మలో నొక స్త్రీగూడ తమకు సహాయ మొనర్చుచున్నది. ఆమె యెవరు ? మదోద్ధతిచే గర్వితులైన రాజుల దర్పమును త్రొక్కిన షష్ఠావతారపురుష భగవంతుని తల్లియైన రేణుక. సకలమును ప్రేరేపించు యజమాని యొకడు భక్తులపైని, పామరులపైని, సర్వము తెలిసిన జ్ఞానులపైనికూడ కలడు. అతడీ పాచకునిద్వారా శీఘ్రముగా చేయించుచు, పక్వమైన అన్నమును భుజించుగాక.

ఇట్లు, నరరూపమైన

—పక్వాన్నము."

అనందాశ్రమం, శిరసి,

"భగవాన్, భక్తవత్సలా, 22-7-1931

మంత్రజప మహిమ వీక్షించబడెను; యోగసారము విలోకించబడెను; శాస్త్రసారము విపులముగా విచారించబడెను; ఏకాగ్రాలోచనతో తపస్సాచరించబడెను; కుండలినీ శక్త్యుల్లాసము పరీక్షింపబడెను; 'అహం' యొక్క జన్మస్థలము నిరీక్షించబడెను; మౌనముచే ప్రకృతిపాక మన్వీక్షింపబడెను; భేదభావము దూరీకృతము గావింపబడెను; విషయసంగము నిరాకరింపబడెను; చపలత్వము నిరస్తము చేయబడెను; స్థైర్య మభ్యసింపబడెను. అట్లయినను, నేను తృప్తిచెందలేదు. ఇప్పుడింక భక్తి చేతనే తృప్తి పొందగోరుచుంటిని. ఆ భక్తికి మూడు స్థానములున్నవి. ప్రథమ స్థానము భగవాన్ మహర్షి, ద్వితీయ స్థానము భగవానింద్రుడు, తృతీయ స్థానము భగవతిమాతా భారతభూమి.

ఇట్లు, మీ చిరకాల భక్తుడైన,

— గణపతి,"

కుటుచే.

"భగవాన్ 18-8-1931

ఇచ్చుట వర్షాధిక్యముచే దార్లు చెడి శిరసి కింకను నేను చేరలేదు. సన్నిధికి

వారపత్రము వ్రాయుటకుగూడ అటంకమేర్పడినది. రెండు రోజులలో శిరసికి చేరి తాజా జాబు వ్రాసికొనగలను. అచ్చట కొన్నాళ్లుండి నేరుగా భగవద్దర్శనమునకే వచ్చి కొన్నాళ్లుండిన పిమ్మట కలువరాయి వెళ్లి, కొన్ని వ్యవహారములు సర్దుకొని తిరుగ తపస్సుకై బయలుదేర నుద్దేశ్యము.

– గణపతి,''

శిరసి

''భగవాన్, 14-9-31

కుంకుపేనుండి అయిదారు రోజుల క్రిందట శిరసి వచ్చి, యిచ్చటనుండి 'సాగర-సారిబా' వెళ్లి, తిరుగ శిరసి వచ్చియున్నాను. నవరాత్రికి పాదసన్నిధికి వచ్చెదను. కపాలియొక్క భూమికా పరిశిష్టపు కాపీ చూచితిని, దిద్ది పంపించితిని. ఈమధ్య కుగ్రామములో నుండుటవలనను, వర్షాధిక్యమువలనను రాకపోకలకు చాల అభ్యంతరముగా నున్నందునను వారపత్రములు వ్రాయుట కాటంకమేర్పడినది.

విధేయుడు,

– గణపతి,''

''ప్రభో, 30-9-31

ఈమధ్య బెలగాం వెళ్లియుంటిని. సుందరరావు అన్న రాఘవేంద్రరావు ఇంట ఒక వారము గడపితిని. నవరాత్రికి పాదసన్నిధికి చేరెదను. మహర్షి అనుగ్రహమువలన ఇచ్చట జరుగు విషయము లుత్సాహవర్ధకములుగా నున్నవి. భవిష్యత్తు గురించి శ్రద్ధ బలపడుచున్నది.

ఇట్లు, అనుగ్రహీతుడు,

– గణపతి.''

ఓం

అయిదవ ప్రకరణము

# కుళువేలో వేదవాసిష్ఠతత్త్వము స్ఫుటమగుట

1931వ సం॥ అక్టోబర్ నెలలో దేవీ నవరాత్రములకు శ్రీ రమణదర్శనము గావించుకొనుటకు నాయన తిరువణ్ణామలై వెళ్లుటతో శిరసి యందలి యానందాశ్రమ జీవిత ఘట్టము ముగిసెను. అప్పుడు సీతారామభరతికూడ నాయన వెంట పయనమై, తిరువణ్ణామలైలో కొద్దిరోజులున్న తరువాత నాయనతోగూడి కలువళాయివళకు వెళ్లెను. అక్కడ రెండు మాసములు వా రుభయులు గడపిరి. అటుపిమ్మట మఱలినచ్చునప్పుడు మహాదేవమును, వజ్రేశ్వరి, రాజేశ్వరమ్మలను సీతారామభరతి కుళువే యాహ్వానించెను. మఱికొన్నాళ్లకు వా రీ యాహ్వానము చొప్పున కుళువే వెళ్లి, సీతారాముని యింటియందే యొక భాగములో ప్రత్యేకముగా కాపురముపెట్టి, నాయనకు పరాధీనత తొలగించిరి.

ఈ విధముగా ప్రశాంతమైన కుళువేయందు మఱల నివాసము స్థిరపడి నప్పటినుండి నాయన ఋగ్వేద మథనమునకు తిరుగబూని, దానియందు భారత చరిత్రకు చెందిన మంత్రముల కొఱకు గాలింపజొచ్చెను. సుమారొక సంవత్సరము చేసిన యీ కృషి ఫలముగా నా చరిత్రకు చెందిన మంత్రభాగము లన్నింటిని నాయన వేఱుచేయగలిగెను. పిమ్మట 1933వ సంవత్సరములో చాల వఱకు నాయన యీ మంత్రముల సహాయముచే భారతేతిహాసమందు వర్ణింప బడిన చరిత్రను విమర్శించుచు నొక పెద్ద గ్రంథమును రచించి, దానికి 'భారత చరిత్ర పరీక్ష'యను పేరుంచెను. శిష్యులు దీనిని మహాభారత 'సంగ్రహ' మనియు, 'విమర్శ' యనియు, 'మీమాంస'యనియు పిలువదొడగిరి. తుదకిది 'భారత చరిత్ర పరీక్ష' యను పేరుతోడనే రూపొందెను. భారతకథకు చెందిన మహావీరులందఱు శ్రీకృష్ణునితోసహా ఋగ్వేదమందు మంత్రద్రష్టలుగా నుండుట, వారు తపస్సంపన్నులైనను దేశముకొఱకు కౌరవులతో యుద్ధము సల్పి ధర్మమును గాపాడుట మొదలగు విషయములనుబట్టి ఋగ్వేద ఋషుల వీరగాథలే మనకు ప్రసిద్ధ పురాణములైనట్లీ విమర్శనుండి విదితమగును. అంతేకాక, వేదకాలపు ఋషులు తమ తపశ్శక్తి నీనాటి వేదాంతులవలె యధ్యాత్మసౌభాగ్యమునకే కేవలము వినియోగించుకొని, దేశసౌభాగ్యము నశ్రద్ధ చేయలేదనియు, స్వాతంత్ర్యమునకు భంగముకలిగినప్పు డాంతర్యమం దెట్లో బాహ్యమం దట్లే చికిత్సచేయుట కుపాసాది ధర్మముల నడ్డురానీయలేదనియు విశదమగును. మఱియు కురువంశమునకు చెందిన కౌరవులు, పాండవులవలె భారతీయులు కారని ధ్వనించుచుండును.

మహాభారత పురాణమం దితిహాస కల్పనకొఱకు ప్రపంచమున వ్యాపించిన మహాసంగ్రామ మొక్క భారతదేశమునకే కేవలము చెందినట్లు పంక్షిప్త దృష్టితో పురాణమందు వర్ణింపబడెనను విషయము ద్యోతకమగును.

ఈ విమర్శ చదివినవారికి కలియుగ ప్రారంభమున సంభవించిన మహాసంగ్రామ కారణము లీనాడు ప్రపంచమందంతటను కాలచక్రవశమున నుద్భవించి మానవ క్షోభకు హేతువై, యానాటివలెనే కాలసంస్కారముకొఱకు విపుల పంహారము నపేక్షించుచుండెనను సామ్య మవగతమగును. ప్రతి విషయమును వాదభూయిష్ఠము గావించి కలి (కలహము) నన్ని రంగము లందును తాండవమాడించుచు, ధర్మస్వరూపమున కపర వేషములను గల్పించి మోహింప జేయు నితర రాజ్యములతోగాని, మతములతోగాని ధర్మస్వరూపము నెఱిగిన భారతీయు లెంతవఱకు ననుకరించవచ్చునో, ఏయే విషయములందు భారతీయ ధర్మశాసనముల నుల్లంఘించి పాశ్చాత్యుల మెప్పుకొఱకు పుణ్యమార్గమునకు దూరము కాగూడదో, ధర్మమును రక్షించు ప్రభుత్వమం దెట్టివారు నాయకులు కావలెనో మొదలగు నంశములం దీ విమర్శ తగు విచక్షణను గఱపును. కావుననే యీ గ్రంథరచనమందు వాసిష్ఠగణపతిముని చూపిన పరాక్రమ మసమానమని కపాలిశాస్త్రి, దైవరాతుడు మొదలగు పండితశిష్యులు పేర్కొనిరి.

ఈ గ్రంథమువలన మహాభారత పురాణము పంస్కరింపబడుటయేకాక, యితర పురాణేతిహాసములందు నీచపఱుపబడిన ఋషిచరిత్రములన్నియు పంస్కరింపబడినవయ్యెను. అట్లే ఋషిపంప్రదాయములనెడిపేరుతో మనుచున్న కొన్ని న్యాయము లన్యాయములని తేటపఱుపబడినందున మన వైదికాచారములను శాసించు శాస్త్రములు పంస్కరింపబడినవయ్యెను. మఱియు నిట్టి వేదార్థ మథనముచే విజ్ఞానకోశమనదగు ఋగ్వేదమునుండి యితర రహస్యముల పరిశోధనకు పూనుకొనవలెనని పండితుల కాదర్శ మేర్పడును. కాని, యిట్టి యాదర్శములచే నాకర్షింపబడని యీనాటి పండితులు గానుగెద్దులవంటి వారేకాని ప్వతంత్ర విచారశీలురుకారని నాయన కదివఱకే యనుభవమయ్యెను. లోకహితముకొఱకిట్టి పరిశోధనలచే పండితులు తోడ్పడవలెనని నాయన యెన్నాళ్లు చెప్పినను, నొక్క పండితుడైన ముందునకు రాలేదు. ఆలోచింపగా, పండితు లీనాడు పామరులకంటి నధిక ధనలంపటులై, ధనరూపమున కిట్టుబడి కాని కార్యము లెంత పుణ్యప్రదములైనను తీరుబడిలేనివారివలె వాటి నంటకుండిరి. కావున వేదమునుండి యింతవఱకు చేయబడిన దేవతాతత్త్వ పరిశోధన, అస్త్రమంత్ర పరిశోధన, ఋషి జీవితచరిత్ర పరిశోధనకాక మిగిలిన పరిశోధనలకు గూడ నాయన తనశేషజీవితము నంకితముగావించి, ఆ నెపమున వేదహృదయమందే తన దృష్టి నెల్లప్పుడూ ప్రవర్తింపజేయ నిశ్చయించెను.

భారత పరీక్షను రచించునప్పుడే నాయన ఋఙ్మంత్ర కోశమును పలుసార్లు మథించెను. దానివలన జనించిన పవిత్రాలోచనాగ్నిచే చిదగ్ని విజృంభించి, యనేక సంవత్సరముల తపస్సువల్లనైన సాధింపశక్యముగాని దివ్యశక్తి విలాసముల నాంతర్య మందు వృద్ధిపరచెను. మఱియు నొక సంవత్సరమునకు పైగా వైదిక ఛందస్సు నందు నిరంతరము దృష్టినుంచిన ఫలముగా నాయన వాక్కుకూడ ఋషుల వాక్కువలె వైదిక ఛందోరూపిణియైన పరదేవతాధీనమై, పరావాక్ప్రవాహమున కుపాధికాజొచ్చెను. ఒకనాడిట్లే గోకర్ణమునుండి తన్ను దర్శించుటకు వచ్చిన దైవరాతుని జూచిన సంతోషముచే నాయన ముఖమునుండి రెండు స్తవ మంత్రములు వైదిక ఛందోబద్ధమై వెడలెను. అప్రయత్నముగా వెడలిన యీ మంత్రరూపముల రెండింటిని దర్శనములుగా నాయన భావించి, దైవరాతునికొఱకవి వెడలినట్లెంచెను. కనుక నాయన యీ రెండు మంత్రములను దైవరాతునకిచ్చి, యా దివ్యవాణీ రూపమునకు 'ఛందస్స్రవన'మని పేరుంచెను. ఈ రెండింటిలో వైశ్వానర దేవతా స్తుతిమంత్రమై యొకటి, విష్ణుదేవతాస్తుతి మంత్రమై యింకొకటియు నిట్లున్నవి:

(1) సరస్వతీకవైదిక ఛందస్సుతో దర్శనమైన వైశ్వానర దేవతాస్తుతి మంత్రము :-

> "దివో గభస్తిరరతిః పృథివ్యాస్త్వేషం
> రూపం విద్యుతో యో౽న్తరిక్షే।
> వైశ్వానరః సహసా వాం అమర్త్యో
> మధుమన్మారోహతు దస్మ ఈళామ్॥"

(2) గాయత్రీ వైదిక ఛందస్సుతో దర్శనమైన విష్ణుదేవతా స్తుతి మంత్రము :-

> "అక్రమిష్ట భువనేషు బ్రహ్మణాహం విదూర్యతః।
> ప్రవరో౽థాస్మి విప్రః॥"

ఈ విధముగా మంత్రద్రష్టయై వాసిష్ఠగణపతిముని సాక్షాద్వైదిక ఋషివలె ప్రకాశించుటకు శిష్యుడైన దైవరాతు డాశ్చర్యపోయెను. వేదమందిట్టి స్తుతి మంత్రములలో గంభీర భావములు కలవాటి నేరి, వాటిని శ్లోకరూపమందు పెట్టుట నాయన యప్పుడు తలపెట్టిన కార్యములలో నొకటియై యుండెను. ఆ యనువాదములను గూడ దైవరాతుడు వేడుకతో చదివి, నాయనయొక్క దివ్యసరళవాణీ ప్రవాహ మే విధముగా శ్లోకములందును నపూర్వ ఋషివైభవమునే ప్రదర్శించి, దేవతాతత్త్వములను మంత్రములందువలెనే సన్నిహితపరచుచుండెనో గమనించినప్పుడు దైవరాతుడు తన గురునియందాబాల్యప్రసిద్ధమై వచ్చిన

వాణీవైభవము యొక్క పక్వస్థితిని జూచినవారమ్యేను. మచ్చున కట్టి యనువాద శ్లోక మొకటి యీ యభివృద్ధిని సూచించుటకు దిగువ నీయబడెను తిలకింపుడు.

సరస్వతిని స్తుతించిన ఋఙ్మంత్ర మూల మిట్లుండెను -

''మహో అర్ణః సరస్వతీ ప్రచేత యతికేతునా।
ధియో విశ్వావిరాజతి॥'' (1-3-12)

ఈ మంత్రభావమునకు శ్లోకరూపము :

శ్లో॥ ''అంభోదివ్యం వలక్షస్మితలసితమతి
జ్యోతిషా చేతయన్తీ।
విశ్వాస్సారావగత్యై: సువిమలధిషణా:
ప్రాణినా భాసయన్తీ।
గంభీరం వజ్రవీణాం కిసలయ మృదునా
పాణినా వాదయన్తీ।
విద్యుద్రూపా సరస్వత్యమలతమరుచాం
వాహినీ నః పునాతు॥''

(అర్థము:- మిగుల కాంతిచే తెల్లని నవ్వువలె ప్రకాశించు దివ్యోదకము లను చైతన్యవంతము చేయునది, ప్రాణుల యొక్క సమస్త సారమును గ్రహించుటకు బుద్ధులను నిర్మలమొనర్చి ప్రకాశింపజేయునది, మృదుహస్తముతో వజ్రదంతముగల వీణను గంభీరముగా వాయించునది (హృదయమందు స్థిరమైన దేవి ప్రాణులందు ధరించి మీటించు వీణయే వజ్రదంతము - అనగా సుషుమ్నా ప్రవాహమును భరించు వెన్నెముక), మిగుల నిర్మలకాంతులను బ్రవహింపజేయు నదియైన విద్యుద్రూపిణియగు సరస్వతి మమ్ములను రక్షించుగావుత)

వేదకోశమునుండి యీ విధముగా చరిత్రాంశములను, స్తుతులను, తంత్రశాస్త్రోదిత మహావిద్యలకు ప్రమాణములై యున్న మంత్రమూలములను, * రిపురోగాద్యరిష్టముల నెదుర్కొను నష్టమంత్రములను వెలువరచిన పిదప నాయన రసాయనాది రహస్యములకు చెందిన ఋషిపరిశోధన లెట్లుండెనో తెలియచేయు మంత్రములను వెలువచేయుటకు పూనియుండగా, పుత్రుడైన మహాదేవుడు 1934వ సం॥ ప్రవేశించగానే కుటుంబసహితుడై కలువరాయికి

---

* మహావిద్యలకు వేదమూలములు కొన్ని యుదాహరణముగ కీయబడుచున్నవి :-

1. ఓర్వప్రా అమర్త్యానివతో దేవ్యుద్వతః జ్యోతిషాబాధతేతమః
(మహాకాళీవిద్య-ఋ. 10-127-2)

వెళ్లిపోయెను. ఆ సమయమందు 'దేవదత్తు'డను నొక శిష్యుడు నాయనకు పిశాచమువలె దాపురించెను. ఇతడు నాయనకొక బృహత్తరమగు నాశ్రమ మవసరమని శిరసి శిష్యవర్గమువారికి ప్రచారము చేయుచు, నాయనను కుటువేనుండి శిరసి కదల్ప యత్నించుచుండెను. శిరసిలో నుండవలసినచో నాయనకొఱకు రమణీయమైన యానందాశ్రమమెప్పుడును సిద్ధమైయుండగా, నింకొకటి యా గ్రామములో నిర్మించవలసిన హేతువు లేకున్నను, శిరసి శిష్యులందు చీలికలు కల్పించుట దేవదత్తుని యుద్దేశ్యము. మఱియు నాశ్రమ నిర్మాణ పాకుచే ధనములాగి తన ఋణములకు దానిని వినియోగించి ఋణవిముక్తు డగుట యింకొక యుద్దేశ్యము. ఈ వార్తలు నాయనచెవిని సోకినప్పుడు నాయన చాల బాధపడి, తనవలన చీలికలు పుట్టకుండుటకు తానా ప్రాంతము కొన్నాళ్లయిన వీడుటయే శ్రేష్ఠమైన యుపాయమని మనస్సులో నిశ్చయించుకొనెను.

ఆలోచించగా, శిరసి శిష్యవర్గమువారికి గురుభక్తి యున్నను, నాయనకొనర్పవలసిన ముఖ్యసేవను విస్మరించిరని చెప్పక తప్పదు. శిరసిలోని 'నందినీ ముద్రణాలయము' దైవరాతునిచే నాయన కంకితము గావింపబడినట్లెల్లరకు తెలియును. ముద్రణాలయమును నాయన మెడకు కట్టుకొని తనదిగా నెన్నడూ భావింపకున్నను, నాయనచే రచింపబడిన గ్రంథములను దానిలో శిష్యులు ముద్రింపించి, దానిని నాయనకొఱకా గ్రంథములన్నియు వెలువడువఱకైన వినియోగించియున్నచో నాయనకేకాక, లోకమునకుగూడ వారు గొప్ప సేవ చేసినవారై యుందురు. ఒక్క గ్రంథమునకు కాగితము మొదలగువానికొక వెయ్యి రూపాయలు పెట్టుబడి పెట్టియున్నచో, దాని విక్రయముద్వారా ఇంకొక గ్రంథము ముద్రితమై, యిట్లొకదాని రాబడి యింకొకదాని పెట్టుబడి యగుచు, మొదట పెట్టిన పెట్టుబడి కూడివచ్చినను, రాకున్నను నాయన గ్రంథములన్నియు ప్రకాశనము బొందుట కవకాశ మయ్యెడిది. దీనివలన నాయన కమిత సంతోషమై యుండెడిది. ఇట్టి సేవ నర్థించు స్వభావము నాయనకు లేకున్నను, శిష్యుల

---

2. సంహోత్రం స్మపురానారీ సమానం వావ గచ్ఛతి।
వేధా ఋతస్య వీరిణీంద్రపత్నీ మహీయతే విశ్వస్మాదింద్ర ఉత్తరః॥
(ప్రచండచండికావిద్య ఋ. 10-86-10)

3. తదిదాస భువనేషు జ్యేష్ఠం యతో జజ్ఞ ఉగ్రస్త్వేష నృమ్ణః।
సద్యో జజ్ఞానో నిరిణాతి శత్రూనను యం విశ్వే మదయన్త్యూమాః॥
(బగలాముఖీవిద్య ఋ. 10-120-1)

(ఇతర మహావిద్యలకొఱకు వాసిష్ఠగణపతి విరచితమైన మహావిద్యావ్యాఖ్యాన సూత్రగ్రంథమును చూడుడు.)

విచక్షణ కిది పరీక్షవంటిదై, యొక్కటైనను నిట్టి సత్కార్యప్రేరణమును బొందక యేది నాయన కవసరములేదో, అట్టి యాశ్రమ నిర్మాణమున కెగబడుట నాయన యాశయములకు విరుద్ధమై గన్పట్టెను.

విశ్వామిత్రుడను శిష్యుడీ విషయములో నొక పత్రికను నెలకొల్పి, నాయన బోధలకు ప్రచారము సల్పెను. కాని, గ్రంథ ప్రచురణోద్దేశము మాత్రము వ్యక్తము కాలేదని ఫలమునుబట్టి యూహింపవచ్చును. నాయనకంటే నధికముగా మహాదేవమీ విషయములో బాధపడుటయే యతడు స్వగ్రామము పోవుటకు కారణమై యుండును. అతడు నాయనచే రచింపబడిన 'గీతమాల'ను సుందరపండితుని సహాయముచే ముద్రింపించి మచ్చుచూపెను. అది చిన్న గ్రంథమై సులభముగా స్వల్పధనముతో ముద్రణము పొందెను. కాని, యటుపిదప హెచ్చరిక నెవ్వరు నొసగకుండట యతని యభిమానమునకు కారణమై యుండును. ఇంకొక కారణమేమనగా, దేశమందు 1931, 1932 సంవత్సరములలో సంభవించిన నొకానొక మహత్తరమైన యార్థిక మాంద్య ఫలముగా భూమి ధరలు పడిపోయి, ఋణగ్రస్తులకు సంకటము సంభవించెను. ఋణభారమును నెత్తిపై వేసికొనిన మహాదేవ మా ఋణమునుండి భూమి నెంతకైన నమ్మి విముక్తుడగుటకు తొందరపడవలసివచ్చెను. అతడు తుదకు తనఖా భూమితో పాటు తనఖాలు లేని సొంతభూమిని కొంత యమ్ముకొని దీనుడయ్యెను. ఆ దీనావస్థయం దతనికి నాయనయొక్క శిష్యులందరిపై నొకవిధమగు నిరాశ తోచి, నాయనకొఱకు పౌరుషవంతుడై, లేఖల మూలమున నాయన గూడ కలువఱాయి వచ్చివేయుట కొత్తిడి చేసెను.

ఇన్ని కారణములుగా నాయన 1934వ సం॥ ఫిబ్రవరిలోనే, మార్చి నెలలోనే శిరసి విడవలసివచ్చెను. కాని, శిరసి శిష్యవర్గమునకుగాని, కురువే శిష్యవర్గమునకుగాని యీ కారణములు కొంచెమైనను చెప్పబడలేదు. స్వల్ప కాలములో మహాదేవము కుదుటపడి, తనతో శిరసి తిరుగవచ్చుట కున్ముఖుడగుననియే నాయన విశ్వసించెను. కావుననే నాయన గ్రంథములన్నింటిని శిరసిలోనే యుంచి, ఉమాసహస్రము, ఇంద్రాణీ సప్తశతి, విశ్వమీమాంసయను మూడు గ్రంథములను మాత్రము శిరసి విడునప్పుడు తన పెట్టెలో వేసికొనెను. ఇతర గ్రంథములతో పాటు తన కుటుంబముయొక్క పాత్రసామాను గూడ శిరసిలో విడువబడినందున గోకర్ణ, శిరసి, కురువే ప్రాంతపు శిష్యులందరు కొద్దిరోజులలో నాయన మఱలివచ్చుననియే యూహించి సాగనంపిరి. కాని, విషయము లింకొక విధముగా పరిణమించిన కారణమున శిరసివాప మీ పయనము తోడనే యంతము గావలసివచ్చెను. అది నాయన గూడ యూహింపనిది కావున దైవనిర్ణయమని యెంచక తప్పదు.

గోకర్ణ, శిరసి, కుళువే వాసములు నాయనయొక్క తిరువణ్ణామలై వాసము కంటే ప్రఖ్యాతి ఘట్టములని చెప్పక తప్పదు. కాని, నాయనయొక్క గణపతి దైవాంశను నిరూపించుటకు తిరువణ్ణామలై యావాస ముపకరించెననియు, వేదవాసిష్ఠ ఋష్యంశను నిరూపించుటకు మిగిలిన మూడు నుపకరించెననియు పాఠకు లూహించుకొనుట యుత్తమము. నరరూప తనువు, దేవతాసంబంధమైన గజముఖము కలిగి, లక్షణ ద్వంద్వముతో ప్రకాశించు గణపతి తత్త్వమందు దైవ, ఋష్యంశల మేళన మాశ్చర్యముగానక్కరలేదు.

ఈ పశ్చిమతీర వైభవ ప్రస్తావనలో నచ్చటి మేటి శిష్యులను గురించియు కొంచెము చెప్పుట ధర్మము. దైవరాతుడు క్రమేణా గొప్ప పండితుడై, సంసార మందున్నను సాధకుడయ్యెను. ఇతడు పిదప పండిత మదన మోహన మాలవ్యావంటి మహనీయుని శ్లాఘనముగూడ పొంది, వాసిష్ఠగణపతి మునికి సార్థక శిష్యుడయ్యెను. ఇతని సోదరుడైన సీతారామభరతి యొనర్చిన నిష్కల్మష భక్తి యుక్తమైన సేవ కతనిని స్మరింపక తప్పదు. విశ్వామిత్ర సుందర పండితులు నాయన కానందాశ్రమ జీవిత సౌఖ్యమున కెట్లు సహకరించిరో, అట్లే నాయన యనంతరమందు కపాలి సహాయమును బడసి యుమాసహస్ర ప్రచురణమునకు సహకరించిరి. వృద్ధుడైన పుండరీకరాయుని మైత్రియు శ్లాఘింపదగినదే. ఆ పశ్చిమప్రాంత శిష్యులలో వీరే ముఖ్యులు. వీరే నాయన కీర్తివైభవములకు సూత్రధారులైరి.

# IX. సిద్ధపురుష ఖండము

## -: అధ్యాయములు :-


1. కలువరాయిలో నాయన కాశ్రమ నిర్మాణము, తత్ప్రవేశమునకు ఖర్గపురము వెళ్లుటచే భంగము
2. ఖర్గపురమందు ప్రచారలోపము
3. కలకత్తావాసము
4. భౌతిక దేహమును వీడి, దివ్యశరీరధారియై సిద్ధపురుషుడగుట
5. ఉపసంహారము

ఓం

మొదటి ప్రకరణము

# కలువఱాయిలో నాయన కాశ్రమ నిర్మాణము, తత్ప్రవేశమునకు ఖడ్గపురము వెళ్లుటచే భంగము

శిరసినుండి నాయన బొంబాయి, రాయపూర్, విజయనగర మార్గమున కలువఱాయి చేరెను. ఈ మార్గమునకు తిరువణ్ణామలై బహుదూరమైనందున గురుదర్శనము గావించుకొనుట కవకాశము లేకపోయెను. ఎంత దూరమైనను పూర్వమువలె రైలుప్రయాణమున కుత్సాహముగాని, దార్ఢ్యముగాని లేకుండెను. శక్తిపాత మాంతర్యమం దధికమగుకొలది శరీరనాడులు ప్రయాణజనితోష్ణమును సహించుకొనలేకపోవుటయేకాక. యేబదియైదు సంవత్సరముల వయస్సుచే వృద్ధాప్యము చేరబడిన కారణమున నరముల బలము క్షీణించి, యేమాత్ర ముష్ణమునకైన మూత్రబాధను గలిగించుచుండెను. కనుక కలువఱాయి తొందర తొందరగా చేరి, నాయన యొక వారము రోజుల విశ్రాంతితో బాధలన్నింటిని తగ్గించుకొనెను. పిమ్మట చుట్టుప్రక్కలనున్న బంధువులనందరిని చూచివచ్చుటకు మధ్య మధ్య కృష్ణరాయపురము, గొల్లాది, సాలూరు మొదలుగాగల సమీప గ్రామములకు ప్రయాణము సల్పినను, నాయాసము లేని విధమున ముగించుకొనెను. సాలూరు చేరియుండగా నాయన కాంధ్ర విశ్వవిద్యా పరిషత్కళాశాల వార్షికోత్సవములకు ప్రత్యేకాహ్వానము వచ్చి, నాయన యుపన్యాసము లా యుత్సవ సందర్భమున నర్థింపబడెను. అందువలన తన వెంటనున్న మహాదేవముతోగూడి నాయన సాలూరునుండి విశాఖపట్టణము పయనమయ్యెను.

విశాఖపట్టణము చేరిన పిదప తాతా సుబ్బారాయుడుశాస్త్రిగారు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు మొదలగు చిరకాల పరిచితులీ యుత్సవములకు తనవలెనే విచ్చేసి తలవని తలంపుగా కలియుటకు నాయన మిగుల సంతసించెను. వారిద్వారా శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణయ్యగారును నాయన పరిచయమును పొంది, నాయన బసను తన యింటికి మార్పించి, నాయనకు ప్రత్యేక గౌరవము చేసిరి. ఈ రాధాకృష్ణయ్యగారు తన పినతండ్రియైన సర్వేపల్లి నరసింహముగారి ద్వారా (ఇతడు వేలూరులో నాయనకు శిష్యుడై, పిదప సన్యసించి, ప్రణవానందమను పేరు వహించిన వ్యక్తి) నాయనను గురించి

చిన్నతనమందు వినినను, నాయన నదివఱకు చూడలేదు కనుక తనకా లో టిప్పుడు తీరినట్లు భావించెను.

పిమ్మట పరిషత్తులో నాయన భారత చరిత్ర పరిశోధకుల కుపకరించుటకై ''భారత చరిత్ర పరీక్ష''కు చెందిన రెండు ప్రవచనములనిచ్చెను. భారత కథాపురుషులు ఋగ్వేదకాలమునాటి వారనియు, వారు స్వయముగా మంత్ర ద్రష్టలనియు, వారు కౌరవులతో సల్పిన యుద్ధము వేదమందు పేర్కొనబడెననియు నాయన సప్రమాణముగా నుపన్యసించి, సభలోని ప్రాచీన, నవీన పండితులకు విస్మయమును గలిగించెను. ఈ యుపన్యాసములలోని ముఖ్యాంశములను కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు తమ 'ఆంధ్రపత్రిక'లో ప్రచురించి, యీ సభలకు వెళ్లనివారికెంతో యుపకార మొనర్చిరి (ఆ ముఖ్యాంశములకొఱకీ గ్రంథము చివర నీయబడిన అనుబంధము చూడుడు). శాస్త్రోపనిషత్తులను భేదించు పాండిత్యమునకే మిగుల నతిశయముకల మహామహోపాధ్యాయ తాతా సుబ్బారాయశాస్త్రిగారీ యుపన్యాసములను వినిన పిదప వాసిష్ఠుడు తనకు మించిన పండితుడని గ్రహించెను. అట్లే వేదసారమెఱుగకున్నను వేదాంతిగా కీర్తిబడయుటకు రాధాకృష్ణయ్యగారును, పాశ్చాత్యుల ననుకరించి మన వేదకాల నాగరికత నల్పదృష్టితో చూచుటకు చరిత్ర పరిశోధకులును తమ లోపములను గుర్తించుకొని యుందురు. వేదార్థములను భేదించగల్గిన నసమాన పాండిత్య తపోవైభవములను రెండింటిని సమముగా పొంది, నవీనులకు మించిన విమర్శనాపాటవమును, సంస్కారదృష్టిని గలిగిన నాయన నచ్చటి సభ్యులందరు పునరుద్భవించిన వేదవాసిష్ఠునిగా కొనియాడిరి.

ఈ యుపన్యాసముల ఫలముగా నాయనను విశ్వవిద్యాలయమం దుంచు కొనినచో, ప్రాచీన విద్యా పరిశోధన శాఖ యభివృద్ధిజెందునని పెక్కుమంది యూహించిరి. వైస్ ఛాన్సలరైన రాధాకృష్ణయ్యగారికిని యట్టి యభిప్రాయము జనించెను. పూర్వమొకప్పుడు కలకత్తా విశ్వవిద్యాలయమందిట్టి పదవి లభింప నున్నను నాయన నిరాకరించిన విషయము కొందరికి తెలిసి, యీసారి యాంధ్రమాతను దలచియైన నిరాకరింపవలదని నాయనను బ్రతిమాలిరి. కాని, నాయన తపోవృత్తిని వీడుట కిష్టపడలేదు. వృద్ధాప్యమం దిట్టి వృత్తి యుపకరించునని యుపకార మొనర్చువానివలె రాధాకృష్ణయ్యగారు హితవు పల్కగా, నాయన తన పుత్రుని జూపి 'తండ్రుల వృద్ధాప్యమందు పుత్రులార్జించి భారమును వహించుటయే పెద్ద యుపకారము కనుక వీలైనచో వీనికేదైన యుద్యోగ మిచ్చినచో నాకది యుపకారమగు'నని చమత్కారముగా బదులు పల్కి కలువరాయికి మఱలెను. ఈ యావేశమంతయు నాయన వెళ్లిపోయిన తోడనే సమసిపోయి, నాయన సమక్షమందు పెద్దలు పల్కిన పల్కులన్నియు దాంభికము

కొఱకని ఋజువయ్యెను. ఉన్నతోద్యోగులయం దదియొక మర్యాదయై పరిగణింపబడుచున్నను, ఇతరులకిది డాంబిక లాంఛనమువలె తోచకమానదు.

మహాదేవమునకు మఱల పౌరుషము వచ్చి, నాయన నందరు తమ లాభముకొఱకు వినియోగించుకొనువారేకాని, నాయన కొక్కరును వినియోగపడరని విసుగుతోచెను. అది విచారపడదగినదియైనను, నాయన పరముగా యోచించినప్పుడు నాయన యొక్క నిష్కామ్య లోకహిత దృష్టిని చాటించుట కీయొక్క విషయమే సరిపోవును.

ఆ విసుగుదలతోను, ఆ పౌరుషముతోను మహాదేవము తన తండ్రి నింక సభలకు వెళ్లవలదని కోరెను. మఱియు నిట్లనెను: ''మన మామిడితోట చల్లగా, ప్రశాంతముగా నుండును. అందు మీకొక కుటీరము నేబది రూపాయల ఖర్చుతో నిర్మించెదను. దానిలో మిమ్ముల నుండగోరెదను.'' నాయన 'సరే' యనెను. వెంటనే కలపకొఱకు మహాదేవము యత్నములు ప్రారంభించెను. శ్రావణమాసము వచ్చుసరికి గోడలు లేచెను. మఱి యిఱువది దినములలో తలుపులు, కిటికీలతో సహా రెండు గదులుగల కుటీరము సిద్ధమయ్యెను. ఈలోపున సీతారామభరతి కుఱువేనుండి యొక లేఖ వ్రాసెను. దానిలో 'దేవదత్తుడనువాడు వాసిష్ఠ శిష్యుడనని చెప్పుకొనుచు, మీ కొఱ కాశ్రమము నిర్మించుటకు చందాధన మిమ్మనుచున్నాడు. అతడైదువందల రూపాయ లిచ్చునట' యని తెల్పి, నాయన నా సందర్భము లాలోచించి తొందరగా శిరసి రమ్మని ప్రార్థించెను. ఈ దేవదత్తుని గుఱించి పూర్వప్రకరణములో వ్రాయబడెను. ఇతడు నాయన కడ మంత్రదీక్ష గైకొనినట్లు శిరసిలో నెవ్వరికీ తెలియదు. వాని తత్త్వమును నాయన పోల్చుకొనబట్టియే వాని శిష్యత్వమును రహస్యముగా నుంచెను. కాని, వాని రహస్యము కొందఱికైన నిప్పుడు తెలుపక విధిలేక నాయన తన ప్రత్యుత్తరము నీ దిగువ విధమున వ్రాసి పంపెను:

'''ప్రియా సీతా,

నీ యుత్తర మందినది .... దేవదత్తుని ప్రోత్సాహము చేతనే మీ రాశ్రమ నిర్మాణమున కంగీకరించినట్లు విశదమగుచున్నది.. వీడు నాకు తాంత్రిక మంత్ర శిష్యుడు. వీనికి నాయందు భక్తియున్నను, స్వార్థమందంతకంటె హెచ్చు భక్తి కలదు. స్వల్పవిద్యగలవాడైనను, వాచాలుడు. ధ్యానమార్గము నామమాత్రమైన లేక విగ్రహములను బూజించును; సిద్ధులను గాంక్షించును. తాంత్రిక మంత్రకల్పజ్ఞానమందు కుతూహల మధికము. మఱియు నిర్భయుడు, అసత్యవాది. నా కాశ్రమము కట్టించుట కైదువందల రూపాయలిచ్చెదనని వంచనకొఱకు పల్కెనుగాని, వాని కంత ధనమిచ్చు శక్తి నిజముగా నుండుటవలన కాదు.

వానిని నమ్మి మీ రొక్క కానియైన వానిచేతి కీయవద్దు. ఒకవేళ దారి ఖర్చులకని మిమ్ముల నేమైన బదులడిగినను, భ్రాంతిపడి మీరేమియు నీయరాదు. వాని విషయమై మీరు జాగ్రత్తగా నుండవలెను. వాడు దాతవలె వేషము వేయును. ఇక్కడ మా మామిడితోటలో నొక కుటీరము రూ.50/-లతో పూర్తియైనది. ఇది నాకు చాలు. ఇక్కడ తోటయందు (కుటీరము నిర్మింపబడు సమయములోనే) నేను తపస్సాచరించుచుంటిని. ఈ పత్రము దేవేంద్రుడు, మహాబలేశ్వరుడు, నీవుమాత్రమే చూడదగినవారు. ఇందున్న భావము లెవరికిని చెప్పరాదు. ఈ తత్త్వ మెవరికీ తెలియకుండుగాక.

ఇట్లు మీ

– వాసిష్ఠుడు.'

తోటలో కుటీరము సిద్ధమైన పిదప దానియందు ప్రవేశించుటకు నాయన భాద్రపద శుద్ధ పంచమి (14-9-1934) మంచిదని యంతవఱకు గడువు పెట్టెను. ఆ శుభదినమునకు నాలుగైదు రోజుల పూర్వము ఖర్గపురమునుండి నాయన పినతండ్రి కొడుకైన సూర్యనారాయణశాస్త్రియొక్క కూతురు, అల్లుడు కలువఱాయి విచ్చేసిరి. ఈ యల్లుని పేరు 'మరువాడ ప్రసాదరావు', కూతురు పేరు 'చిట్టిపిల్ల'. వీరుభయులు నాయన కలువఱాయిలో నుండుట విని, వెంటనే తోటలోనికి పోయి నాయనను సందర్శించిరి. అటుపిమ్మట వారు నాయనను ఖర్గపురము తమతో తీసికొనివెళ్లుటకు యోచించి, మహాదేవమునకు రైల్వే యుద్యోగ మాశ చూపించి, యతనివి మొదటఁ యొప్పించిరి. 'నాయన పేరు ఖర్గపురములో వ్యాప్తమైన పిదప నీవు వచ్చినచో, నీ కుద్యోగము నిముసములో దొరకును. అంతవఱకు నేను నాయనతో పాటు సింహాలును తీసికొనివెళ్ళెద'నని ప్రసాదరావు చెప్పిన మాటలకు మహాదేవ మియ్యకొనెను. ఈలోపున ప్రతిదినము చిట్టిపిల్ల నాయనయొద్ద "నేను కూతురునైనను, నా యింట మీ పాద మొక్కసారియైన మీ రిదివఱకు మోపలేదు. ఈసారి మాతో మీరు రాక తప్ప"దని హృదయమార్ద్రమగునట్లు పల్కుచుండెను. తుదకు మహాదేవ మనుజ్ఞను బొంది ప్రసాదరా వాహ్వానించినంతనే నాయన యొప్పుకొని, యే రోజు వఱకు కుటీరప్రవేశమునకు గడువు పెట్టెనో, ఆ శుద్ధ పంచమి నాడు (14-9-34) సింహాలుతోగూడి, చిట్టిపిల్ల ప్రసాదరావుల వెంట ఖర్గపురమునకు పయన మయ్యెను. ఇట్లు జరుగునని తెలిసియే గడువు నా దినమువఱకు సరిగా పెట్టి కుటీర ప్రవేశమునకు బదు లా ముహూర్తమందు ప్రయాణము సల్పియుండునను భావమసమంజసము కాదేమో !

౬౦

రెండవ ప్రకరణము

# ఖడ్గపురమందు ప్రచార లోపము

ఖడ్గపురము కలకత్తా నగరమునకు 72 మైళ్ల దక్షిణమున నున్న యొక రైల్వేకాలనీ. ఇది బి.యన్. రైల్వే కంపెనీవారిచే నిర్మింపబడెను. ఇక్కడ రైల్వేకి చెందిన గొప్ప కర్మాగారములున్నవి. ఇది రైల్వే జిల్లాలలో నొక జిల్లా కేంద్రముగాకూడ నున్నది. ఆఫీసులలోను, కర్మాగారములలోను పనిచేయువారి మొత్తము సంఖ్య పాతిక వేలుండును. వీరందరికిని నిర్మింపబడిన వసతిగృహములతో గూడ దాదాపిఱువదియైదు చతురపుమైళ్ల విస్తీర్ణము కలిగి పురము వ్యాపించి యుండును. ఉద్యోగస్థులలో ఆంధ్రుల సంఖ్య యధికము. కాని, వీరిలో పెక్కు మంది కూలిపనివాండ్రు, విద్యాగంధము లేనివారూను. ఈ పుర మొకప్పు డడవిచే కప్పబడి, ఖడ్గపాణియగు దుర్గకు క్షేత్రమట.

నాయన యీ గ్రామము చేరిన పిదప ప్రసాదరావున్న యింటనే యొకటి రెండుపన్యాసముల నిచ్చెను. ఇల్లు కుశలమైనను, ఇంటి కెదురుగా నున్న వీధి సామాన్యపు బాట కానందున నుపన్యాసములకు వీలిచ్చెను. అటుపిమ్మట 'ఇండియన్ ఇన్స్టిట్యూట్'లో నొక బహిరంగోపన్యాస మీయబడెను. ప్రసాదరావు యొక్క ప్రచారబలము చాలకను, ప్రజల కాధ్యాత్మికాస్థ తక్కువ యగుట వలనను నంతమంది యాంధ్రులలో నాయనయొద్ద మంత్రదీక్ష గైకొనినవారి సంఖ్య నలుబదికి మించలేదు. మిగిలినవారు నాయనయొక్క జ్యోతిషప్రజ్ఞను మాత్రమే వినిరి. శిష్యులైనవారుకూడ నాయనను గుఱించి విన్నది తక్కువ. ఆ విన్నదైనను సింహాలు, ప్రసాదరావులకు తెలిసిన స్వల్పమే. వేదాంత తత్త్వ పరిచయ మంతగా లేనివారి కెంతమాత్రము బోధచేయవలెనో, నాయన యంతమాత్రమే చేసి యూరకుండెను.

అయినను, నాయనయందు భక్తివిశ్వాసము లున్నవారు లేకపోలేదు. వారిలో ముఖ్యులు వేదుల రామమూర్తి, సింహాచలము, అచాళ్ల పార్వతీశము. జయంతి జగన్నాథము, సోమయాజుల సూర్యనారాయణ మొదలగువారు పది పండ్రెండు మంది కలరు. వీరిలో పార్వతీశమునకు పెద్ద వసతి యుండెను. అతడు నాయనను తన యింటి కాహ్వానించగా, 'కొద్దిరోజుల తరువాత వచ్చెద'నని నాయన బదులిడెను.

పైన పేర్కొనబడిన బహిరంగోపన్యాసము నవంబర్ నెలలో జరిగెను.

ఈ యుపన్యాసమునకు కలకత్తా రైల్వే హెడ్డాఫీసునుండి ఖర్గపురమేదో తనిఖీ నిమిత్తము వెళ్లిన 'నేమాని సూర్యనారాయణ' యను నొక అకౌంటెంటు హాజరగుట తటస్థించెను. అత డుపన్యాసమును శ్రద్ధగా విని యాకర్షింప బడినవాడై, నాయననేవో కొన్ని ప్రశ్నలడుగుటకు ప్రసాదరావు బసకు వెళ్లెను. అక్కడ తొలుత ప్రసాదరావుతో మాట్లాడి నాయనను గుఱించి యతడు కొంత తెలిసికొనిన పిదప నాయన సమక్షమునకు వెళ్లి, తన్ను గుఱించి పరిచయము. కావించుకొని, తన ప్రశ్నల నడుగదలచియుండగా, నాయన వాని శంకలను దెలిసికొనినవానివలె ప్రత్యుత్తరములనిచ్చి, వానిని విస్మయపరచెను. వెంటనే యతడు నాయన యందు మహత్తర ప్రజ్ఞ యున్నట్లు గుర్తించి, నాయన పాదములకు ప్రణమిల్లెను.

అటుపిమ్మట నాయన నతడు కలకత్తా కాహ్వానించి, కలకత్తాలోనున్న యాంధ్రులను గుఱించి యిట్లు చెప్పెను· "కలకత్తాలో విద్యాగంధమున్న యాంధ్రులున్నారు. కంపెనీలలో నుద్యోగముచేయువా రక్కడక్కడ చెదరి యున్నను, బి.యన్. రైల్వే హెడ్డాఫీసుకు చెందినవారందరు, దాదాపుగా కిద్దర్‌పురమందు దగ్గర దగ్గరగా నివసించుచున్నారు. వీరు తమ పిల్లలకు మాతృభాష యందు విద్య గరపుటకొక పాఠశాలను నడుపుకొనుచున్నారు. దాని యుద్భవమునకు కారకుడైన గుంటూరు లక్ష్మీకాంతము దానికొక కార్యదర్శియైయుండి, యొక పెద్ద భవనమును మొత్తముగా నద్దెకు గైకొని, దిగువ నొక ప్రక్క భాగమంతయు పాఠశాలతో నింపెను. ఈ దిగువ భాగములో పెద్ద హాలు ముంగిలి వాకిలితో కలసియున్నది. దానిలో తరచు తరచుగా హరికథలు, ఉపన్యాసములు, రామలీలా కృష్ణలీలోత్సవములు మొదలగువాటి నేర్పరచి స్త్రీ పురుషులకు మే ముత్సాహము కలిగించుచుందుము. మీ యుపన్యాస మొక్కటి వినినచో వారు మిమ్ములను విడువక, మీవలన ధన్యులగుట కెన్నాళ్లయిన మీ బోధలను గ్రోలుచుందురు. నా యాహ్వానము మాయందరి తరపున చేయబడినట్లెంచి యంగీకరింపవేడెదను. మీ రెన్నాళ్లయిన మీ యనుచరునితోసహా మా యింట నుండవచ్చును."

నాయన యంగీకరించెను. 'నేను 24-11-1934వ తేదీ శనివార మిక్కడ మెయిలులో బయలుదేరి పగటి భోజనమున కక్కడికి వచ్చెద'నని నాయన చెప్పగా, రెండవ తరగతిలో ప్రయాణము చేయుటకు రెండు టికెట్లకగు ధనము నాయనచేత నతడుంచి వచ్చెను.

నారాయణ మఱునాడు కలకత్తా వచ్చి, పాఠశాల కార్యదర్శితో 'గణపతి శాస్త్రిగారను పేరుగల మహానుభావులొకరు ఖర్గపురము వచ్చియుండిరి. ఆయన యుపన్యాసమొకటి నేను విని యాకర్షింపబడి, నే నాయనను కలకత్తా

కాహ్వానించితిని. వారు రాబోవు శనివారమునాడు వచ్చుట కంగీకరించిరి కనుక ఆదివార మిక్కడ నుపన్యాసమున కేర్పాటుచేసి, స్త్రీ పురుషులందరికి నోటీసు పంపగోరుదు'నని చెప్పెను. కాంతము 'సరే' యని పల్కి ''నేను క్రితము నెలలో ఖర్గపురము వెళ్లినప్పు డీ గణపతిశాస్త్రిగారు మరువాడ ప్రసాదరావింట్లో బసచేసి యున్నట్లును, జ్యోతిశ్శాస్త్రమునందు గొప్ప పండితుడనియు వేదుల రామమూర్తిగారు చెప్పగా వింటిని. వారేనా వీ''రని కాంతము ప్రశ్నించెను. 'ఔను, వారే'యని నారాయణ బదులు పల్కగా 'సరే, వారు వచ్చిన పిదపనే యందరికి నోటీసు పంపవచ్చునని కాంతము నిశ్చయించుకొనెను. ఆ నిశ్చయ మొక విధముగా మేలుకొఱకయ్యెను. ఎందువల్లననగా, నుపన్యాసము దేనిని గురించియో స్పష్టముగా చెప్పబడలేదు. కాని, వక్తనుబట్టి యూహించుకొనినచో జ్యోతిశ్శాస్త్రమునకు చెందియుండునని ధ్వనించెను. దానికి పిలువబడవలసినవారు పురుషులు మాత్రమగుదురని తలచి కాంతమట్లనుకొనెను. ఈ విధముగా నాయన ప్రచారమగుటకు లోపమెవరిది? ప్రసాదరావుదో, నాయనవెంట వచ్చిన పింహాలుదో లేక నాయనయం దంతమాత్రమే గ్రహించినట్లు వివరించిన రామమూర్తి నారాయణలదో చెప్పజాలము.

ఓం

మూడవ ప్రకరణము

# కలకత్తావాసము

(రచయిత యిటుపై చరిత్రను యనుభవమునుండి వ్రాయుచు, నుత్తమ పురుష వచనమును పేర్కొనెను).

నాయన కలకత్తా రావలసిన 24-11-1934వ తేదీ గల శనివార మిట్టే సమీపించెను. ఉదయము పదిగంటలకుగాని ఖడ్గపురమునుండి మెయిలు రాదు. అందువలన స్టేషనుకడ నాయన నెదుర్కొనుటకు నేమాని సూర్యనారాయణ యా దిన మాఫీసునకు సెలవు పెట్టదలచెను. అంతేకాక, నాయనను విందుభోజనముతో సత్కరించుట కుత్సాహపడెను. కాని, శనివారమునాడు తెల్లవారినతోడనే యతని భార్య బహిష్ఠురాలై యతని యుత్సాహమును భగ్నమొనర్చుటయేగాక, కుమార్తె కతిథివంటయందు సహాయపడవలసిన కష్టమును గూడ నతనికి కల్పించెను. మఱియొక గంట కతని పెద్దదొరగా రతని నేదో తొందరపనిపై బంగళాకు రమ్మని కపురంపుటతో స్టేషనుకు వెళ్లవలసిన విధికిగూడ నాటంక మేర్పడెను. ఇట్లన్ని విధముల నారాయణ భగ్నహృదయుడై నా కొక చీటి వ్రాసి పంపి, తనవంతు రెండు విధములగు బాధ్యతను నన్ను వహింపుమని కోరెను.

నారాయణ, నేను నొకే యాఫీసునకు చెందినవారము. మా మైత్రికది తొలికారణమైనను, అతని సుస్వభావము నన్ను మఱింత యాకర్షించి మా మైత్రిని గాఢముచేసెను. కనుక అతనికి ధైర్యము కలుగునట్లు జవాబును వెంటనే పంపిన పిమ్మట నా భార్యతో నే నీ విషయమును జెప్పి, యతిథులకు ప్రత్యేకముగా విశేషముగా మడిగట్టుకొని వండవలెననియు, వారికి రెండు మడిబట్టల నారవేసి యుంచవలెననియు శాసించితిని. అతిథిని గుఱించి తెలియక సర్వము మడితో నుండుట మంచిదని తలచి యట్లు చేసితిని. అప్పటి కామె మామూలువంట ముగసెను. నే నాదిన మాఫీసునకు వెళ్ళక తప్పనందున నేనా వంటలోనిది భుజించి, మా యింటియం దప్పు డతిథియైయున్న అర్. పంజవరావును ప్రత్యేకపు వంట యగువఱకు వేచి, రానున్న యతిథులతో సహపంక్తిని భుజించి, నావంతు మర్యాద చూపగోరితిని. అంతేగాక, స్టేషనుకుకూడ అతనినే పంపితిని.

ఈ పంజవరావు మా యిరుగు పొరుగూరివాడే. ఇతడుద్యోగముకొఱకు కలకత్తా వచ్చెను. ఇతడు వచ్చిననాడే మా పాఠశాలకొక మిత్రునిచే బహూకరింప

బడిన రెండువేల పుస్తకములతో గూడిన గ్రంథాలయమంతయు వచ్చి చేరెను. ఆ పుస్తకముల నతడు హెడ్మాష్టరుతోగూడి పేర్చి, తన కొంకొక యుద్యోగము దొరకువఱకు గ్రంథాలయ నిర్వహణమే యుద్యోగముగా వహించి, చక్కగా నిర్వర్తించుచుండెను. ఇతనికిని, హెడ్మాష్టరుగానున్న బి.యస్. రామారావునకును గాఢమైత్రి యేర్పడెను. చదువునందు, సంస్కారమందు నుభయులు నీడుజోడై, సాంఘిక సేవాభిలాషచే మా పాఠశాలకు కట్టుబడి, నాకీ పాఠశాల సంబంధ కార్యము లన్నింటియందును రెండు కుడిభుజములవలె తోడ్పడుచు, నాకు ప్రేమాస్పదులై యుండిరి. అందువల్లనే నేను చనువుకొలది సంజీవరావునకు నా బాధ్యత నంటగట్టి యాఫీసుకు పోయితిని.

ఆ దినము శనివారమగుటవలన మధ్యాహ్న మాఫీసు లన్నింటికీ సెలవు. అందువలననే నొంటిగంట కింటికి వచ్చి, మేడమీద నా భాగములోనికి వెళ్లబోవు చుండగా, నా గదిముందు తలుపు ద్వారబంధములతో నమర్చబడియున్న పొడవైన వరండాలో నొక మంచముపై గూర్చుండి యేదో వ్రాసికొనుచున్న గణపతిశాస్త్రిగారిని జూచితిని. ఆయన నావైపు చూడకున్నను, నా కాయన ముఖము బాగుగా కనిపించెను. ఆ ముఖమగపడిన తక్షణమే నా పాదములా వరండా ద్వారమున కావలనే యాగిపోయి, శరీరమంతయు నుద్రేకవశమున చెమటగ్రమ్మి, నా చేతులు ద్వారబంధము నానుకొన్నవి. పదేళ్లక్రిందట నాకొక స్వప్నమందగపడిన దివ్య పురుషాకృతినే నేను మూర్తీభవించినట్లు — మున్మూర్తులా నా ముందరనున్న వ్యక్తి యందు జూచినవాడనై, పైకుప్పొంగిన యానందోద్వేగముచే నేనట్లు పరవశుడనైతిని. హృదయమునుండి శిరస్సునకు హఠాత్తుగా తట్టిన యా స్ఫురణవలన శిరస్సునంటి యున్న నాడీమండలమంతయు సంతోషాతిశయమున కంపించి, నా కంఠముగూడ రుద్ధమైపోయెను. రెండు మూడు నిముసములకుగాని నా పాదములను కదల్ప లేకపోతిని. అవి కదలినంతనే నేను త్వరగా లోనికి బోయి, దుస్తులను మార్చి, కాలుచేతులు కడుగుకొని, చిత్తమందింకను కొలదిగా పొంగుచున్న యావేశమును తగ్గించుకొనుటకు నా గదిలో కూర్చుండియుండగా, నా భార్య వచ్చి నా కింకొక సంతోషవార్త తెల్పెను.

"ఈయన కపాలభేదనమైన సిద్ధపురుషుడట. ఒక్క జ్యోతిశ్శాస్త్రమందే కాక, సర్వశాస్త్రములందును చిన్ననాడే పారంగతుడై, సిద్ధకవి యయ్యెనట. 'నాయన' యను క్లుప్తనామము వీరికి ప్రసిద్ధమట. నేను నాయనకు, నాయన ప్రక్కనున్న సంజీవరావునకు, అతని ప్రక్కనున్న సింహాలునకు వడ్డనచేసి, యభిఘరించి, పరిషేచన చేయవచ్చునంటిని. నా మాట వినినను, నాయన యేదో పరధ్యానమున నున్నట్లుండగా, నేను మఱల చెప్పితిని అప్పుడు నావైపు జూచి 'నారాయణ యేడీ, ఆఫీసునకు వెళ్లెనా' యని ప్రశ్నించిరి. పరిషేచన చేయకుండుట కప్పుడు

కారణమును నేను గ్రహించి 'యిది నారాయణగారి యిల్లు కాదు. వారి యింట నొక యాటంకము వచ్చినందున మీ కాతిథ్యమిచ్చు భాగ్యము మాకు దక్కినది. మావా రాఫీసుకు వెళ్లిరి. వారికి నేనే వండిపెట్టితిని. మీరు పరిషేచన సేయవచ్చు' నంటిని. వెంటనే మన యింటి పేరు, మన పేర్లు వరుసగా నడిగిరి. నేనన్నింటికీ సమాధానములు చెప్పినతోడనే నాయన యొకటి రెండు క్షణములు కన్నులు మూసికొని, యేదో రహస్యము తెలిసినవానివలె చిఱునవ్వు నవ్వుచు కన్నులు విచ్చి 'నే నెవరికోఱ కీ యూరు వచ్చితినో తెలిసిన'దని నెమ్మదిగా తనకు తాను చెప్పుకొనిన ట్లుచ్చరించిన పిదప 'సూరమ్మా! నే నీయూర నున్నంతకాలము మీ యింట నుండుట నీ కిష్టమేనా' యని నన్ను ప్రశ్నించిరి. నేను వెంటనే 'అంతకంటే కావలసిన దేమున్నది? మీవంటివారి సేవ లభించుట కంటే మేము కోరదగిన భాగ్యము వేఱులేదు. మీరు ఫలానావారని స్పష్టముగా తెలిసియున్నచో, మావా రీవేళ ఆఫీసు మానివేసి యుందు'రని చెప్పిన మీదట సంతోషపడి నాయన పూర్వ పరిషేచనము చేసెను...''

ఈ మాటల కామెను మెచ్చుకొని ''నీకు పదేళ్ళ క్రిందట చెప్పిన నా స్వప్న * మిప్పుడు ఫలించినది. ఆ స్వప్నపురుషుడే యీయన. ఆహా! గురువే వెతకుకొనినట్లు వచ్చెను గదా'' యని నేను పల్కుచుండగా మరల

---

స్వప్న వివరము :-

నాకీ స్వప్నము 1924వ సంఀలో వచ్చినది. నాకు పిల్లనిచ్చిన మామ (శ్రీ ఆకెళ్ల సూర్యనారాయణగారు - పిదప తురీయాశ్రమము గైకొని జ్ఞానానంద భారతి యను పేరు వహించిరి) నాకు వేదాంత పరిచయము చేసియుండిన కారణముగా నేననేక వేదాంత గ్రంథములను చదివి, గ్రంథములనుండి గ్రహించినంతవఱకు పెక్కు సాధనములను చేసియు నభివృద్ధిగాంచక సరియగు గురువుకొఱ కన్వేషించుచుంటిని. ఇద్దరు ముగ్గురు మహానుభావులను దర్శించితిని కాని, వారిలో నొక్కరిని గురువుగా సేవించుటకు బుద్ధి మొగ్గలేదు. శ్రీ రమణ గణపతులను గురించి యొక్క పత్రికయైన ప్రచురించనందున నాంధ్రలోకమునకు వారి మహత్త్వ ప్రసిద్ధి వ్యాపించలేదు. అట్టి సమయములో నా జిజ్ఞాస తీరుటకనినట్లు స్వప్నము వచ్చెను. స్వప్నములో గంగానది కొకవైపునున్న గట్టుపట్టి, సిద్ధగుర్వన్వేషణముకొఱకు పోయి పోయి, తుదకు కైలాస పర్వత శిఖరము చేరితినట. శిఖరమం దొక బిలమునుండి గంగానది మహా వేగముతో నొక యడుగుకంటె హెచ్చులేని మందముగల్గి వెడలుచున్నను, కొంచెము దూరములో పెద్ద నదీప్రవాహమగుటకు ఆశ్చర్యము చెంది, యది కైలాసేశ్వరుని మహిమగానున్నదని తలచితిని. వెంటనే శిఖరము వంటి మహా మునులెందరో తపస్సు సల్పుచుందురని తట్టి నా తిలకము నామకొని తలయెత్తి శిఖరోపరి భాగమును జూడగా, నొక్క మహానుభావుడుమాత్రము నాకు గోచరించెను. అప్పు డస్తమించుచున్న సూర్యకాంతి యతని ముఖముపై బడుచు, నొక వింత తేజస్సుతో నిండి నా కా ముఖము స్పష్టముగా గోచరమయ్యెను. ఒక నిముసము తరువాత సిద్ధపురుషు డక్షయమిచ్చుటకు లేచి, బిలము కావలవైపునకు వచ్చి యొకసారి గంగను దోసలినిండ

చిత్తముప్పొంగి, యీసారి కంటివెంట నానందబాష్పధారలు కాలువలయ్యెను. ఈ విధముగా నిండిన హృదయముచే నుద్విగ్నుడనై నేను నాయనకు ప్రణమిల్లుటకు, నా కృతజ్ఞతను దెల్పుకొనుటకు కూడ శక్తిలేనివానివలె వెఱ్ఱక స్తంభించిపోతిని. ఇంతలో నేమాని సూర్యనారాయణ మఱి యిద్దఱిని వెంటబెట్టుకొని వచ్చుచున్నట్లు నా భార్య చెప్పెను. చప్పున నేను లేచి, నాయన కెదురుగా వెళ్లి 'మీ రాకకు ధన్యుడనైతిని, మిమ్ములను స్వయముగా నెదుర్కొని స్టేషనునుండి తీసికొనివచ్చు భాగ్యమబ్బనందులకు బాధపడుచుంటి'నని రెండు వాక్యములెట్లో కంపముతో చెప్పుకొని సాష్టాంగప్రణామము సల్పి లేచుసరి కాశ్చర్యము ! నా యుద్వేగమంతయు చల్లారెను. అది యనుగ్రహ మహిమగా తలచి, నేనా శీతల సుఖముతో గూడిన స్వస్థతను బొందుచుండగా, మిత్రులు మేడమీద కేతెంచిరి.

వచ్చిన మిత్రులకు 'టీ' నిచ్చితిని. దానిని సేవించి వారు నాయనకు నమస్కరించి, యెదురుగా కూర్చుండిరి. నే నొకప్రక్కను గూర్చుంటిని. నేమాని సూర్యనారాయణ తన కానాడు జరిగిన విఘ్నములను గుఱించి నాయనకు చెప్పగా, నాయన 'నీవేమియు విచారింప నవసరములేదు. నాకిక్కడ సదుపాయముగానే యున్న'దని యతని నోదార్చెను. పిమ్మట తన వెంట వచ్చిన స్నేహితుల నతడు పరిచయమొనర్చిన తరువాత ''మీరేదైన చెప్పినచో విందు'' మనెను. నాయన చిఱునవ్వు నవ్వి 'మీరేదైన అడిగినచో చెప్పెద'నని బదులిడెను. అడుగుట కేమియు తోచక వారొకరినొకరు చూచుకొని, తుదకు నన్నడుగుమనిరి. వెంటనే నాయన వైపు జూచి నేను 'మీ దివ్యచరిత్ర విన కుతూహలముగా నున్న' దంటిని

నాయన వెంటనే తన చరిత్ర చెప్పనారంభించి, యొక గంటలో ముగించెను, ముగింపు వాక్యములో 'ఖడ్గపురమునుండి యిక్కడకు వచ్చుటకి నారాయణయే కారకుడు. ఎందులకు రప్పించెనో వానినడిగి తెలిసికొను'డని

---

పట్టి యర్ఘ్యమిచ్చెను. నన్ను చూచి యతడు శపించునేమో యని నాకప్పుడు భయముతోచెను. నాకు మూరెడు దూరములో నున్న ఆ వ్యక్తికిని, నాకును నడుమ గంగాఝరిమాత్రమే యున్నది. నేనా మూర్తినే చూచుచున్నను, నన్నామూర్తి యింకను చూడలేదని నేనునుకొనుచుండగా నతడు రెండవసారి దోసిలితో నీరు పట్టి, హఠాత్తుగా నన్ను పలుకరించి, నాచేతియందా నీరు విడచుటకు హస్తములు నన్ను చాచుమనెను. అంతవఱకు భయపడుచున్న నే నీ యనుగ్రహసూచకమగు వాక్యములు కమిత సంతోషమునుబొంది, నా దోసిలి తదాలున జాచి, గోడకు తగిలిన నొప్పిచే మెలకువ గాంచితిని. అనుగ్రహము పొందుసమయమున కిట్లు స్వప్న మంతమగుటకు విచారించితిని. కాని, నా కా స్వప్నపురుషు డెప్పటికైన భూమిపై గోచరించి, నాకు గురువై యనుగ్రహము పూర్తిగావించునను విశ్వాసము గాఢమై తోచెను.



శ్రీమతి సూరమ్మ మరియు శ్రీ గుంటూరు లక్ష్మీకాంతము
(నాయనగారిని కలకత్తాలో సేవించి వారి రచనలను మరియు
వారి జీవిత చరిత్రను ముద్రించిన వారు)



శ్రీమతి చెల్లాయమ్మారావు (సుబ్బలక్ష్మి) మరియు శ్రీ జె.జి.కె. మూర్తి
(నాయన గారిని కలకత్తాలో సేవించి వారి రచనలను ముద్రించినవారు)

చమత్కరించుట కెదుటనున్నవారు నవ్వుకొని నారాయణతో పరిహాసముగా నేదో మాట్లాడుచుండగా, నేను నెమ్మదిగా నాయన నొక సందేహ మడిగితిని. "మీరు హిమవత్పర్వత శిఖరమున నెప్పుడును తపస్సు చేయలేదా" యని నా స్వప్న కథలోని స్థలమును స్మరించి యడిగిన తక్షణమే యితరులకు వినపడకుండునట్లు నావలెనే నెమ్మదిగా "నే నక్కడనుండి వచ్చినవాడనే. అక్కడ నా తపస్స్థలమును నీవు చూచితివి కాదా" యని నాయన పల్కి నా నేత్రములో నొక రశ్మిని బ్రసరింపజేసెను. వెంటనే నా నేత్రములు మూతపడి, ధ్యానమందున్న వానివలె నా మనస్సింద్రియములను విడిచి యాంతర్యమం దెక్కడనో కొన్ని క్షణములు నిర్విషయముగా స్తంభించిపోయెను. మరల బాహ్యస్మృతి కలిగి నేను కన్నులు విచ్చుసరికి మిత్రులు వెళ్లిపోయిరి. నే నప్పుడు తృప్తితీర సాష్టాంగపడి లేచిన తోడనే నాయన యనుగ్రహపూర్వకముగా నన్నుద్దేశించి యిట్లనెను: "నీ శంకలింక విడిచి నే చెప్పినది వినుచుండుము."

ఆ రాత్రి పాఠశాలలో శనివారపు భజనకు ముప్పది నలుబదిమంది చేరి యొక యరగంటలో భజన ముగించి, నాయన నేదైన నుపన్యసింపగోరిరి. మధ్యాహ్నమువలెనే యుపన్యాస విషయము నన్నెంచుమనిరి. నేను నాయనవైపు పనుజ్ఞకొఱకు చూచితిని. నాయన మందస్మితవదనుడై 'అడుగు' మనెను. అప్పుడు నే నడిగినదిది: 'ఉపాధులీ లోకమున బుట్టుటకు కర్మ కారణమైనచో, నవతార పురుషుల యుపాధి కెవరి కర్మ కారణమగుచుండును?' నా ప్రశ్నకు సంతసించి నాయన యొక పావుగంట యుపన్యసించెను. దాని సార మిట్లుండెను.

"అవతారములు రెండు విధములు. ఒకటి రామ, కృష్ణాదులవంటి యజ్ఞావతారము. మానవుల నిష్కామ్యకర్మ యేది యజ్ఞరూపమును బొందుచున్నదో, అది యీ యవతారమున కుపాధియగును. రెండవది తేజోంశావతారము. సాధారణముగా (1) జన్మాంతరపుణ్యబలము గలవారును (2) పై లోకములకు బోయిన సిద్ధపురుషులయొక్కగాని, యీ లోకములోని సిద్ధపురుషులయొక్కగాని యావేశము బొందినవారును తేజోంశావతరణమునకు తగియుందురు. రెండవ తెగవారు జన్మాంతర పుణ్యబల మవసరము లేకనే లోకకార్యమం దావేశము పొందుచుందురు. వారియందు తేజోంశావతరణము స్వల్పకాలమున్నను, లోకమందు చేయదగు కార్యముకొఱకు పటుతరమై కన్పట్టవచ్చును.

మొదట చెప్పబడిన జన్మాంతరపుణ్యబలమున తేజోంశమును బొందిన వారిలో వారుపాసించు దైవాంశ తరచుగా నవతరించును. ప్రతిదినము వీరు తమ జీవితమందు దివ్యభావమును బొందుచుందురు. కనుక వీరియందవతరించు తేజోంశ వీరియొక్క దివ్యానుభవమువల్లనే వ్యక్తమగుచుండును. ఇట్టి యోగి

యందు దేవతా సాయుజ్యమును బొందించుటకే సాధారణముగా తేజోంశావతరణ మగునుగాని, లోకకార్యముకొఱకు కాదు. అందును, లోకకార్య ప్రేరణమేదైన యనుబంధమువల్లనో, మఱి యే యితర కారణమువల్లనో వారు పొందవచ్చును. కాని, దానిని పొందునప్పుడు భగవంతుని యిచ్ఛకు వశులగుచు, కార్యమందు నిర్లిప్తులై యుందురు. అట్టి వీ రాధ్యాత్మిక ప్రపంచమునకు గురువులు, ఆదర్శులు కాగల్గుదురు. ఒక పుణ్యోపాధియం దవతరించిన తేజోంశ యీశ్వరేచ్ఛ ననుసరించి యుద్ధము సల్పినను, అహంకారము లేమివలన నీశ్వరకార్యముగానే సల్పును.''

ఈ యుపన్యాసము స్వల్పమైనను, అందరి నొకేరీతి నాకర్షించి నాయన వాక్కునం దొకానొక దివ్యత్వమును, గంభీర విషయములను సైతము వినువారికి సులభగ్రాహ్యమగునట్లు చెప్పు ప్రజ్ఞను దోపజేసెను. మఱునాడు నోటీసు పంపబడినప్పు డుపన్యాసమేదో వచింపబడకున్నను, నాయన వాక్కు నాలకించుట కాంధ్రులందరు - స్త్రీలు, పురుషులుకూడ - విచ్చేసి నాయన కుత్సాహము కలిగించిరి. ఆదివారము సెలవు దినమగుటచే సెల్లరును వచ్చుటకు మఱింత తోడ్పడెను. ఆ దినము 'వేదకాలము' గుఱించి నాయన స్వయముగా సెంచుకొని యుపన్యసించెను. ఋషులయొక్క దర్శనములతో నిండిన వేదమునకు కాలమనగా ఋషివంశములు పరంపరగా తమ తపోవైభవముచే నింపిన కాలమంతయు నర్థమగునని జెప్పిన పిదప దానియందు మహోన్నతస్థితికి వచ్చిన కాలభాగమే మహాభారతచరిత్ర పురుషులు వసించిన పుణ్యకాలమని నాయన పెక్కు నిదర్శనములచే ఋజువొనర్చెను. అటుపిమ్మట వేదకాలమునాటి సంఘజీవనమును వర్ణించి యెల్లరకు నట్టి నానాత్వభావము లేని సరళ, ప్రేమమయ జీవితసౌఖ్యము కొఱకు చవులు పుట్టించెను. తరువాత సంఘర్షణ లేని విధమున నార్యులవలంబించిన మతదృష్టి వచింపబడి, వారిచే సాధింపబడిన వివిధ శాస్త్రపరిశోధనలు, కళాభివృద్ధి, నాగరికత మొదలగునవి కథలవలె శ్రోతల చిత్తములందు హత్తుకొనునట్లు మనోహరముగా వర్ణింపబడెను. ఈ యుపన్యాసము వినిన పిదప నాయన నిజముగా వేదకాలమునాటి ఋషియై, నాటి స్మృతులతో జన్మించిన వ్యక్తియని మాకు దోచెను.

సోమవారమునా డిట్లే శ్రీ రమణభగవానుని గుఱించి, యా మహానుభావుడు లోకము నుద్ధరించుట కొసగిన దివ్యోపదేశమును గుఱించి నాయన యుపన్యసింపగా మోక్షమరచేతికి దొరకినట్లందరికిని తోచెను. అంతట మంత్రోపాసన యొక్క ప్రాముఖ్యమునుగూడ నాయన వచించి, మంత్రధ్యానముచే బలవంతులు, భగవదనుగ్రహమున కర్హులునగుటకు స్త్రీపురుషులనందరిని హెచ్చరించిన ఫలముగా నాయనయొద్ద నేదైన మంత్రోపదేశమును బొంది నాయనను గురువుగా

నుంచుకొని జపించుట లాభకరమను భావమందరి చిత్తములందు నుద్భవించెను. ఆ మఱునాటినుండి యందువలన నుపదేశకాండ మారంభమై, యొక్క వారము ముగియులోపున కిద్దరపురముననున్న యాంధ్రులలో ముప్పాతికపాలు స్త్రీ పురుషులు నాయనకు శిష్యులు, శ్రీ రమణ మహర్షికి భక్తులునైరి. ఇంటింటికి రమణమహర్షి పటము వెలసెను. రమణచరిత్రము, రమణగీతాది గ్రంథములు పెక్కుమందిచే చదువబడెను. శ్రీ రమణాశ్రమమునుండి వీటిని వ్రాసి తెప్పించు భాగ్యముకూడ నాకే దక్కెను. చెన్నపట్టణములో 'కామత్' అను భక్తునిచే ప్రచురింపబడు 'సండే టైమ్స్' అను వారపత్రికయొక్కటి మాత్రమేవో కొన్ని వార్తలు, వింతలు శ్రీ రమణుని గుఱించి ప్రతి వారము ప్రచురించుచున్నట్లు తెలిసి, యా పత్రికలను పెక్కుమంది కొనజొచ్చిరి. ఈ విధముగా శ్రీ రమణ మహర్షిని గుఱించి నాయన యుపన్యసించిన నాటినుండి మాయందొక నూత్న సంచలనము ప్రారంభమై, యధ్యాత్మ విచారణమం దుత్సాహము లేనివారికిగూడ శ్రద్ధాసక్తులను గలిగించెను.

మహర్షిని గుఱించి మే మదివఱకు వినకుండుటకు మాలో మేము కారణములను చర్చించుకొంటిమి. 1907వ సం॥లోనే గణపతిమునిచే రమణుని యందు దైవాంశావతరణము గుర్తింపబడి, నాటినుండి తద్విషయము పలుసార్లనేక స్థలములందు, విద్వజ్జనుల సమావేశములందు గణపతిమునిచేతనే యుపన్యసింపబడినను, నొక్క దక్షిణాది పత్రికయైన నీ విషయమును పేర్కొనలేదు. పోనిండు, వార్తాపత్రికల కట్టివి వార్తలుగా తోచవేమో యనుకొనినచో, గారడీవిద్యలచే బ్రతుకు యోగుల గుఱించి పత్రికలందు తఱచుగా మనము చూచుచునే యున్నాము. 'సైంటిఫిక్' యోగులకు, 'సినిమా' బాబాలకు, స్వయంనామక మహర్షులకు పత్రికాధిపతులు ఘనమైన ప్రచారముచేయుట మన మెఱిగినదే. కనుక సత్పురుషులైన రమణ గణపతుల గుఱించి వీరెన్నడూ ప్రజలకు రవ్వంతయైనను తెలియజేయకుండుటనుబట్టి వీరు పత్రికలను నడపుటద్వారా చేసిన సేవ యే తరగతికి జెందునో మాకు విశదమయ్యెను. ఈ పత్రికలవలెనే 'ప్రబుద్ధభారత', 'వేదాంతకేసరి' మొదలగు ప్రసిద్ధ మాసపత్రికలుగూడ తమ విధిని విస్మరించి, రమణోపదేశమును వేదాంత ప్రపంచమున కందీయకుండుట నాలోచించగా మాకు మఱియు వింతయై కన్పట్టెను. రమణ గణపతుల దివ్యత్వమును ప్రసిద్ధికెక్కిన రామకృష్ణ మఠస్థులైనను స్మరించకుండుట చూడగా నితరులవలె వీరుకూడ మతమందేవో హద్దులు కల్పించుకొని, దివ్యపురుషుల విషయమందు 'పార్టీ' తత్త్వమును ప్రకటించుకొనినట్లు ఋజువయ్యెను. ఆనాటినుండి యా మఠస్థులు చాల తరచుగా పేర్కొను 'రామకృష్ణమఠ' మను మాటయందు నాకొక పార్టీ ప్రత్యేకతయే ధ్వనింపజొచ్చెను.

అటుపిమ్మట శిష్యుల కోర్కె చొప్పున నాయన ప్రతి సాయంత్రము నుపన్యసించుచు, మఱి పదునైదుపన్యాసముల నా పాఠశాలయందే యిచ్చెను. ఈ యుపన్యాస ప్రసంగము లప్పటికప్పుడు శిష్యులడిగిన ప్రశ్నలపై ముఖ్యముగా నాధారపడియుండెడివి. ఆ ప్రశ్నలు కూర్చుటలో రామారావు (హెడ్మాష్టర్), పంటివరావు లధిక ప్రజ్ఞ జూపి నాయనకు ప్రేమాస్పదులు కాగల్గిరి. తరచుగా నడ్డు ప్రశ్నలు వేయుటయందీ యిరువురు నసమానులైనను, వారి ప్రశ్నలు చొప్పదంటు గొడ్డుప్రశ్నలుకాక, విజ్ఞానముతోగూడి, వారి బుద్ధిని వారే సంస్కరించుకొనుచున్నట్లుండెడివి. ఉపన్యాస సమయములందేకాక, యితర సమయములందు గూడ వీరు తమ బాల్యచాపల్యముచే నాయనయొద్ద మాటిమాటికి వితర్క బుద్ధిని జూపుచు నితరులకు వికటపురుషులవలె తోచినను, వీరే నిజమున కధికముగా నాకర్షింపబడినవారనియు, నధికముగా నాయన యొక్క యనుకంపతో గూడిన స్మితలవకాంతులను బొందినవారనియు చెప్పక తప్పదు. వీరి యుత్సాహమే వీరిని ప్రేరేపించగా, వీరు కలకత్తా నలుమూలల తిరిగి, మేము కార్యోపాయముల నాలోచించుకొనులోపున నాయన కీర్తిని చాటించి వచ్చిరి. ఆ కారణముచేత భవానీపురము మొదలగు దూరస్థలములందు వసించు తమిళులు, మలయాళీలుగూడ నచిర కాలములో నాయన దర్శనార్థము రాదొడగిరి.

తమిళ, మలయాళీలలో పెక్కుమం దదివఱకు నాయనను జూడకున్నను, నాయన వైభవము నెఱిగిన వారే. నాయన కదివఱకే శిష్యులైనవారు ముగ్గురు నలుగురుండిరి. వారిలో 'సుబ్రహ్మణ్య అయ్యరు' చెప్పదగిన భక్తుడు. ఇతడు సి.ఐ.డి. ఆఫీసులో రూ. 1,200/-లు వేతనముపై సూపర్వైజరుగా పెద్ద యుద్యోగమున నున్నను, నిరాడంబరుడై, రమణ గణపతులను నిత్యము స్మరించువాడు. ఇతనికి ఫొటోగ్రాపులు తీయుటలో వేడుక, మంచి నిపుణతయు నుండెడివి. నాయన రాక వినినంతనే యితడు నాయన దర్శనము గావించుకొని, దూరమున నివసించుచున్నను రోజు విడిచి రోజు నియమపూర్వకముగా వచ్చువాడు. వచ్చినపుడు సాధారణముగా నాయనకొక ఫొటో తీయనిదే వెళ్ళువాడుకాడు. పలు రకముల ఫొటోలు తీసి యితడు పెక్కుమందికి పంచిపెట్టెను. వాటిలో నొకదానిని పెద్దది గావించి, నాయన కూర్చుండు స్థలమున వ్రేలగట్టుట కిచ్చెను. ఇతని ప్రేరణమున తమిళ, మలయాళ సంఘములు రెండునూ నాయన నాహ్వానించి గౌరవించెను. తమిళ సంఘములో నాయన రెండుపన్యాసములను, మలయాళ సంఘమం దొకటి యిచ్చి, పెక్కుమందికి మంత్రదీక్షల నిచ్చెను.

సుమారొక మాస మి ట్లుపన్యాసములచే నాయన గొప్ప సంచలనమును బుట్టించిన పిదప మంత్రదీక్షలు గైకొనినవారియెడ ప్రత్యేక శ్రద్ధ తీసికొనుటకు నిశ్చయించి, వారికొక నియమావళి నేర్పరచెను. ప్రతి సాయంత్రము వారు

సమావేశమై నాయన సమక్షమందు నాయనతోకూడి 108 సార్లు 'ఇంద్రాణీ' మంత్రమును జపించుట, వారమున కొకసారి హోమయుక్తముగా దీనిని జపించుట పురుషులకు మాత్రము విధిగా కల్పించెను ఈ జపమైన పిమ్మట సాధన సంపత్తులను గురించి యొక యరగంట బోధ. అటుపిమ్మట శిష్యులకు సాధనమందు గల్గు సందేహములున్నచో పరిష్కరించుట. ఇంక స్త్రీల విషయములో నవకాశముండి రాగల్గినవారికి మధ్యాహ్నము వేళగా నియమింపబడెను. పురుషులనీ జపముకొఱకు చేర్చు బాధ్యత నేమాని సూర్యనారాయణపై నుంచబడెను.

పై నియమావళిని నియమించిననాడే దయాళుడైన నాయన నన్ను రహస్యముగా పిలిచి "యీరోజునుండి నీకు, సూరమ్మకు రాత్రివేళల ప్రత్యేక బోధచేయదలచితిని కనుక రాత్రిభోజన మేదున్నరకు ముగించి, యెనిమిది గంటలగుసరికి మీరు సిద్ధము కావలెను. ఎవ్వరును లోనికి రాకుండ తలుపు బిగించవలె'నని శాసించెను. ఈ యేర్పాటు నిర్ణయింపబడునాటికి నే నా యింటికి చేరి ప్రత్యేకముగా నున్న నొక భాగము నింటివానియొద్ద నాయనకొఱకు తీసికొంటిని. దానిలో మేడమీద రెండు గదులు, క్రిందను వంటగదితో పాటు ప్రత్యేకముగా దొడ్డి, కొళాయి మొదలగునవి యుండెను. మేడకు పైన గల డాబాకు పోవుటకు ప్రత్యేకముగా మెట్లుండెడివి. దీని యద్దె యైదాఱుగురము కలసి భరించుచుంటిమి. ఈ భాగమునకు, నేనున్న భాగమునకు నడుమ నొక ప్రత్యేక మార్గముండెను. కనుక మే మా మార్గముగుండా నాయనయుండు భాగములోని కెనిమిది గంటలకు వెళ్ళి, బోధ పొందుచుంటిమి.

నాయన కీ ప్రత్యేక బస ప్రశాంతముగను, తపస్సున కనుకూలముగను నున్నట్లా సమయమునకు కలువఱాయి నుండి వచ్చిన మహాదేవము చెప్పగా విని నేను సంతసించితిని. ఇందులో నాయన యున్నంతకాలము పరిచర్యల కొకరి సహాయ మక్కరలేదనియు పల్కి, యతడు సింహాలును కలువఱాయి పంపివేసెను. పిమ్మట మహాదేవముకూడ రెండు మాసములలో వెళ్ళిపోయెను. స్థలానుకూల్యముతో పాటు నాయనకు సమకూర్చబడుచున్న ఆహార పానీయ పద్ధతి కతడు సంతసించెను. ఈ యాహార పానీయము లెట్టివనగా, ప్రాతఃకాలమందు పంచదార కలుపని చిక్కని పాలు, పది గంటలకు భోజనము, మధ్యాహ్నము కొంచెము పాలొకసారి, పండ్ల రసము రెండుసార్లు, సాయంత్రము రెండు మూడు గోధుమ రొట్టెలు - పాలలో నానబెట్టినవి. అతిమూత్ర బాధ రాకుండుటకు పంచదార విసర్జింపబడెను. నరములలో శక్తివిలాసమును భరించు దార్ఢ్యముండుటకు 'ఆపిల్' పండ్లయొక్క రసమే ముఖ్యముగా తీసి రెండుసార్లు

మూడేసి ఔన్సుల చొప్పున నిచ్చుచుంటిమి. ఇంక భోజనములో నాయన తినునవి పప్పుతో కొంచెమన్నము, ఇంటియొద్ద తోడుబెట్టి, చిల్కరించి, వెన్న తీసివేసిన చిక్కని మజ్జిగ బాగుగా వేసికొని దానితో కొంచెమన్నము - అంతే. నంజుకొనుటకు చేతి నరిపేలేకాని, పచ్చడి-కూర-ఊరగాయ మొదలగునవి లేశమాత్రమైన పనికిరావు. పప్పులో విధిలేక వేయబడిన ఉప్పుతప్ప మఱి దేనియందును దానిని వాడరు. మజ్జిగ కొంచెము పులిసినను నోటబెట్టుట నాయనకు కష్టమయ్యెడిది. ఇది నాయనయొక్క సాత్వికాహారము. పిండివంటలు, టిఫిన్లు ముట్టరు. యోగశరీరుల కాహార మెట్లుండవలెనో, కల్పనలు, మార్పులు నెట్లపథ్యము లగునో, శ్రద్ధాభక్తులు జూపక చేతికి వచ్చినట్లో, మనకు తోచినట్లో చేయబడిన దెట్లు హితకరము కాజాలదో నా భార్యకు చిన్నప్పుడు తండ్రి చెప్పిన పాఠములిప్పు డుపకరించెను. ఆ కారణముచేతనే భోజనమున కెవరైన పిలిచినచో నాయనకు బెంగ తోచెడిది. ఒక్కపూట మాప్పుకూడ శరీరమునకు బాధాకరమగుటచే నితరుల యిళ్లకు వెళ్లుట మానుకొనెను. తన నియమములు, అభిరుచులు ముందు చెప్పుకొనుటకు సిగ్గు. పిదప వారు బలవంతము చేసి యపథ్యమైనది తినుట కొత్తిడి చూపినప్పుడు వారికి తన బాధయే ప్రియము కాబోలునని తలచి, వారి ప్రీతికొఱకేదో కొరికి, తరువాత నాలుక వాపుచేతనో, కడుపులో వికారము చేతనో రెండు మూడు దినములు బాధపడుట. ఇది చూచి యితరులు పిలుచుటకుగూడ భయపడజొచ్చిరి. నిజమే, యెదుటివారి హితవును మన్నించ లేనప్పుడు భయము రెండు ప్రక్కల నావహించునుగదా!

ఆ సమయమందు నా మఱదలు సుబ్బలక్ష్మి మా యొద్ద నుండెడిది. ఆమెకప్పు డెనిమిదేండ్ల వయస్సు. ఆమెను 'చెల్లాయి' అని పిలుచుట వాడుక. కాని, నాయన 'చెల్లాయమ్మారా'వని వెలమ, క్షత్రియ జమీందారిణులను పిలిచినట్లు పిలుచువారు. నాయనకు పండ్లరసము తీయుట, సాయంత్రములందు రొట్టెలు చేయుట యామె కల్పించుకొని బాగుగా చేసి నాయన మెప్పు పొందెడిది. కాని, రస మొకవంక తీయుచు, నింకొకవంక బుట్టలోని సగము పండ్లను మాయముచేయుటకే యామె పూనుకొనినట్లు నాయన కనిపెట్టి, యామె కొంటెతనమునకు ముచ్చటపడుచు, ఆ పని నుండి యామెను తప్పించుటకుగాని, యామెను కసరుటకుగాని యొప్పుకొనువారు కాదు. రొట్టెల విషయములో ప్రతి రొట్టెనుండి యొక ముక్క తాను శబరివలె రుచిచూచుచు, అఱు కాల్చి, మూడింటికి సరిపడు ముక్కలను మిగుల్చుచుండెడిది. 'నాయన కిచ్చిన పిదప నీకు కావలసినవి తినవలెనని యెన్నిసార్లు చెప్పుట' యని యామె యక్క మొఱపెట్టుకొనినను, ఆమె తాను తిని తృప్తిపడిన తరువాతగాని నాయన కెన్నడూ నీయలేదు. అందరిని యాకర్షించు నాయన యీమెయందున్న యీ విచిత్రమున

కాకర్షింపబడి, తనకు రుచికరమైన దీయవలెనను తలంపే గాఢమై చెల్లాయమ్మారావు నట్లు ప్రబోధించుచుండెనని నాయన వ్యాఖ్యానించువారు.

ఇంక నా భార్యకు, నాకు చేయబడిన ప్రత్యేక బోధలను గుఱించి కొంచెము చెప్పెదను. రాత్రులందు బోధ సమయమున నా భార్యయు శ్రద్ధతో వినుచుండినను, కొన్ని శాస్త్రీయ విషయము లామె గ్రహింపజాలకుండెడిది. అట్టివే రాత్రులందు నాకొఱకు చెప్పి, నే నదివఱకు చదివి గ్రహించిన వేదాంత విషయము లెట్టివో నాయన తెలిసియున్నట్లు వాటినే కొన్నాళ్ల వఱకు సమవలోకనము చేయుచు, నాకా విషయములం దేర్పడిన పొరపాటు భావములను సంస్కరించెను. అంతేకాక, వైదికమత స్వరూపమెట్టిదో, దానిపై రుద్దబడి దానిని గడబిడ చేసిన అన్యమతభావములేవో, అన్యమతభావములవలనే యవైదిక పదములను కొప్పించి కవులెట్టి యనర్థములను కల్పించిరో, భాష్యములు మూలము కంటే క్లిష్టములై మూలము గుఱించి లేని సందేహములను సృష్టించి తమ చర్చల బాహుళ్యముచే బుద్ధినెట్లు చెదరగొట్టి మఱింత భ్రమింపజేసెనో మొదలుగాగల విషయములను బోధించి, నాయం దొక సమన్వయబుద్ధిని పెంపొందించెను. దానివలన నాయందు విచక్షణ బలపడెను. పిమ్మట వైదిక దేవతాతత్త్వములను గుఱించి కొన్నాళ్లు బోధచేసి, యధ్యాత్మమందా తత్త్వనిరూపణచే దశమహావిద్యా స్వరూపముల సార్థక్యమును జూపెను. అటుపిమ్మట మహర్షి యుపదేశాన్వయము చేసి, హృదయమే స్వరూపముగా కలిగి యందరియందు నంతర్యామియైయున్న బ్రహ్మానెఱుగుట కుపాయములు సులభముగా దోచినను, అపక్వచిత్తుల కవి యందరానివనియు, చిత్తము పక్వమగుటకు భక్తితోగూడిన మంత్రజపస్తోత్రారాధనలు నిరపాయమార్గములనియు విశదపరచెను. దేవతానుగ్రహము లేనిచో నాంతర్యాభివృద్ధి చేకూరదని నిష్కర్షగా చెప్పబడెను. దీనినే శ్రీ రమణ మహర్షి యాత్మానుగ్రహమనిరి. ఈ యనుగ్రహమువలన 'నే'నను వృత్త్యభిమానము వృత్తినుండి తిరుగబడి యాత్మగతమగు భాసమానమగుననియు, నట్టి భాసమాన 'ఘృణి' తత్త్వముచే కేంద్రమందాత్మానుభవము గల్గుననియు, నంతదనుక సాధన మవసరమనియు నాయన పేర్కొనెను. అటు తరువాత వివిధ యోగముల నీ సూత్రములో సమన్వయించుకొను తెరగు, లాక్షణిక భాషతో కూర్చబడిన పెక్కు పౌరాణిక కథల నన్వయించుకొను తెరగు చూపబడెను. రాత్రి ప్రసంగింపబడు విషయములు సూరమ్మకు గ్రాహ్యమగుటకామె కుపమానముల తోడను, పిట్టకథలతోడను మధ్యాహ్నములం దొక గంటసేపు మఱల చెప్పుచు, నాయన నాయందు విచక్షణను పెంపొందించిన ట్లామెయందున్న భక్తిప్రపత్తిని పెంపొందించెను. మా కొఱకింత శ్రమపడి నాయన మా యందిట్టి ప్రేమానుగ్రహముల నించుమించుగా నొక సంవత్సరము ప్రసరింపజేయుట కేమి

పుణ్యము మాచే పూర్వజన్మలం దార్జింపబడెనో తెలియకున్నను, అంత శ్రమకు, ప్రయత్నమునకు గాని వీడని కిల్బిషమెంతో మా యం దలముకొనియుండునను విషయము మాత్రము మాకు స్పష్టమయ్యెను.

ఈ బోధలింకను జరుగుచున్న కాలమందే యొకనాడు నాయనకు మా యుభయులయందు నపూర్వానుగ్రహము హఠాత్తుగా కలిగెను. ఆ రోజున ప్రాతఃకాలమందే నా భార్యను పిలిచి 'సూరమ్మా! నీకీవేళ గాయత్రీమంత్ర ముపదేశించి, నిన్ను దత్తపుత్రికగా స్వీకరించవలెనని హృదయము ప్రేరేపించు చున్నది. స్నానమాచరించి రమ్మనెను. ఆమెన ట్లుదయమున నను గ్రహించిన పిదప సాయంత్రము నన్నింకొక విధముగా ననుగ్రహించెను. ఎట్లనగా, నేనా నా ఆఫీసు నుండి వచ్చుసరి కేడుగంటలు దాటెను. పనిచే అలసివచ్చిన కారణమున కాలుచేతులు కడుగుకొనినతోడనే నేను జమ్మైన చేసికొనకుండ 'నాయనా! నాకీవేళ నీరసముగా నున్నది. చప్పున భుజింతమా' యని యడిగిన తోడనే నాయన నన్ను చూచి జాలిచెంది, తాను రొట్టెల దినుటకు వెంటనే వచ్చిరి. భోజనమైన పిదప నాయన మంచముపై కూర్చుండి యేదో వ్రాయ మొదలుపెట్టగా, నేనా ప్రక్కగదిలో నాయన కెదురుగా నింకొక మంచముపై కొంత శ్రమ తీర్చుకొనుటకు నాయన యనుజ్ఞబొంది నడుము వాల్చితిని. ఒక్క నిముసములో నిద్ర యావహించి నాకొక స్వప్నము వచ్చెను. స్వప్నములో నా శిరస్సుపై చేయి యుంచి నాయన నాకొక మంత్ర ముపదేశించెను. వెంటనే తెలివి వచ్చి నాయన కీ విషయము చెప్పగా 'ఈ పూట కేమియు చెప్పను, పోయి పండుకొం'డని నాయన మమ్ముల నుభయులను పంపివేసిరి. పండుకొనిన వెంటనే మఱల నిద్రపట్టి తెల్లవారువఱకు నాకు తెలివి రాలేదు. తెలివి గాంచినప్పటినుండి నాయన శరీరము నన్నావహించినట్లు నాకు గడ్డము, విశాలమైన మదురు, బట్టతల స్ఫురించుచు, నా మాటలు నాయన కంఠస్వరముతో మాట్లాడినట్లు నాకు వినబడజొచ్చెను. ఇతరులకు నే నెట్లగపడుచుంటినో యని కొంతసేపు కనిపెట్టి, వారికి నాయం దావహించిన యాకృతి తెలియబడలేదని గ్రహించిన పిమ్మట భయము లేదని యెంచి, యెంతసేపా యనుభవము నన్నుబట్టి యుండునో జూడ వేడుకపడితిని. మఱునాటి సాయంత్రమువఱకు నేనీ యనుభవమును భరించి, యటుపిమ్మట నాయన కెఱుకపఱచకుండుట పొరపాటని యూహించి తెల్పితిని. అప్పుడు నాయన నా నేత్రములో నొక్క క్షణము దృష్టి నిలిపిరి. వెంటనే యావేశము వీడెను. పిమ్మట నాయన యొక రహస్య మిట్లు చెప్పెను: "ఇది నా దివ్యశరీరము యొక్క యనుగ్రహచేష్ట. ఇదియే సూరమ్మ ననుగ్రహించుటకు నన్ను ప్రేరేపించిన పిదప నాకు తెలియకుండ స్వయముగా నిన్ననుగ్రహించెను. దీని యుద్యమము నాకు కపాలము భిన్నమైనప్పుడే తెలిసినను, ధ్యానమందున్నప్పుడు

మాత్రము నాకు దాని మహిమ గోచరించుచు, మిగిలిన వేళలందు దాని వ్యాపారసంచారములు తెలియబడుటలేదు. అది తెలిసినప్పుడు నా తపస్సు పూర్ణసిద్ధిని బొందినట్లగును. అందుకొఱకు నే నిఱువది దినములు రేణుకాదేవి యాజ్ఞాపించిన దీక్షపూనవలెను. కాని, దీనికి పూర్వము గోచరించవలసిన సిద్ధి యభివ్యక్తము కానందున నా తపస్సునం దా దీక్షకు పాకము రాలేదని జాప్యమొనర్చుచుంటిని."

అటుపిమ్మట యర్ధరాత్రివఱకు నాయన యా దీక్షాకాలమం దితరులు జూపవలసిన శ్రద్ధను గుఱించి చెప్పెను. ఎవరైన శరీరము నీరసించకుండ కాపాడ వలసిన బాధ్యత వహించవలెననియు, లేనిచో శక్తిభారమునకు తట్టుకొనలేక శరీరము రాలిపోవుననియు చెప్పి, యప్పుడీయదగిన యాహార పానీయములను గుఱించి, సమకూర్చవలసిన నిశ్శబ్ద పరిశుభ్ర వాతావరణమును గుఱించి విపులముగా బోధపరచెను. ఈ ప్రసంగము 1935వ సం॥ ఆగస్టు నెలలో జరిగెను. మఱియొక వారమునకు ఖర్గపురమునుండి వేదుల రామమూర్తి, మరువాద ప్రసాదరావు వచ్చి, గొప్ప కార్యము ఖర్గపుర శిష్యులు తలపెట్టినట్లు, నాయన రాక కెదురుచూచుచున్నట్లు దెల్పి నాయనను ఖర్గపురము తీసికొనివెళ్లిరి. వెళ్లు నప్పుడు నాయన 'తొందరగా వచ్చెద'నని చెప్పి వెళ్లెను.

ఆగస్టు మూడవ వారములో కాబోలు నాయన ఖర్గపురము వెళ్లెను. వెళ్లిన పిదప నాలుగైదు రోజులు వేదుల రామమూర్తి యింట బసచేసిన తరువాత విశాలమై, హెచ్చు బెదదలు లేని అచార్ల పార్వతీశమింటికి బస మార్చెను. కలకత్తాలో వలెనే నాయన ఈ పార్వతీశమున్న యింట సుఖమును బొందెను. అటుపిమ్మట ఖర్గపుర శిష్యులు తలపెట్టిన కార్యములు రెండని విశదమయ్యెను. అందొకటి - నాయన కాశ్రమము నిర్మింపవలెనను తలంపు. ఇది ప్రసాదరావు ప్రేరణమున వేదుల రామమూర్తి చిత్తమందు గాఢముగా నాక్రమించిన తలంపు, 'నింపురా' కాలనీ పరిహద్దు దగ్గర నొక నాయుడు తాలూకు నివేశస్థలమును కొని, దానిలో నాయన కాశ్రమము కట్ట నుద్దేశించిరి. కాని, నాయుడు తన స్థలమమ్ముట కంగీకరించనందున నాయనను జూపి నాయుడుపై వత్తిడి తేవచ్చునని యెంచి వీరు నాయనను ఖర్గపురము తీసికొనివెళ్లిరి. ఈ సందర్భములో ప్రజలకుగూడ కొంత యుత్సాహము గలిగించి, వారిద్వారా నాయుడుపై కొంత మార్పు పుట్టించుటకు రెండవకార్య మూహింపబడెను. ఎట్లనగా, 1-9-1935వ తేదీ నాడు గణేశచతుర్థి రానుండెను. ఆనాడు నింపురా పరిహద్దులో నూత్నముగా నిర్మింపబడిన ఆంధ్ర పాఠశాలా భవనములో నాయననే గణపతి దైవముగా కూర్చుండబెట్టి పూజించి, తద్ద్వారమున నాయన దైవాంశము చాటించవలెనని సంకల్పింపబడెను.

నాయన వెళ్లిన పది పంద్రెండు దినములకే యీ పూజాదినము సంభవించి నందున మొదట దీనికొఱ కట్టహాసము చేయబడెను. నాయన కిట్టి పూజలు గిట్టకున్నను, ఖడ్గపురములోని బుద్ధిమంతులనుగూడ సంకుచితదృష్టి యిట్లావరించి భ్రమింపజేయుట జూచినప్పు డక్కడ వారి విపరీతధోరణి నరికట్టుట కంటె దాని ప్రవాహమునకు మార్గమిచ్చుచు, వారిని వశమొనర్చుకొనుట యుత్తమమని నాయన నిశ్చయించుకొనెను. గణేశోత్సవమును వారు నాయనకు చేయబడిన ఫలపత్ర పుష్పాక్షత పూజలతో ముగించి సంతోషించిరి. కాని, విగ్రహపూజయం దావాహన వలెనే విసర్జనమంత్రమును పురోహితుడు తన యలవాటుచొప్పున నేకరవుపెట్టి నాయనకు నవ్వు పుట్టించెనట. అది యపశకునమయ్యెనని యప్పటి కెట్లు తెలియును ?

ఆ మఱునాడే (2-9-1935) కలువఱాయిలో రాజేశ్వరికి పురుడు వచ్చి, మగ శిశువు పుట్టెను. అంతకుపూర్వమామె కాడపిల్లలేకాని, మగపిల్లలు పుట్ట నందున మహాదేవము పురుషసంతానమునకు సంబరపడి, బారసాలకు నాయన నాహ్వానించెను. వెంటనే నాయన కలువఱాయి వెళ్లి, పుట్టిన మనుమనికి 'పురందరు'డని పేరుంచెను. ఆ బారసాల యుత్సవమునకు నాయన వెళ్లునప్పుడు పార్వతీశము పాతిక రూపాయ లిచ్చెను. దానిలో టికెట్టుఖర్చులు పోగా మిగిలినది యుత్సవమునాడు దక్షిణతాంబూలములకు నాయన ఖర్చు పెట్టెను. ఒక రాగిడబ్బుమాత్రము మిగులగా, దానిని పరాకుగా చేతితో పట్టుకొని యెవరితోడనో మాట్లాడు ధోరణిలోపడి నాయన యుండగా, లోహస్పర్శ కారణమున చెమటపోసి చేతి నరములు లాగఁజొచ్చెను. అప్పుడు చేతియందున్న డబ్బును నాయన యొక దూలముమీద దాచి, కొంచెముసేపైన పిదప దానిని తీసి జేబులో వేయుటకు మహాదేవము నాజ్ఞాపించెను. ఆజ్ఞ చొప్పున దానినతడు తీసి చూడగా, రాగి యంతయు సువర్ణముగా మారి, పదునాఱువన్నెను మించియుండుట కతడాశ్చర్యపోయి నాయనకు జూపెను. దానికి తన చెమట సోకిన ఫలము జూచి నప్పుడు నాయన తనయం దెదురుజూడబడుచున్న స్వర్ణసిద్ధి విపాకమైనటుల గుర్తించుకొని, రేణుకాదేవి యాజ్ఞాపించిన దీక్ష కర్తవ చేకూరినట్లు సంతసించెను.

పిమ్మట దీక్షనెక్కడ సల్పుటయను విషయమును పుత్రునితో చర్చించెను. అంతకుపూర్వము మామిడితోటలో నిర్మింపబడిన కుటీరము శబ్దములకు దూరమై, పదుపాయకరమై యుండుటయేగాక దీక్షపూనినప్పుడు తన శరీరము గుఱించి యందరికంటెను నధిక శ్రద్ధ దీసికొను కొడుకు, కోడలు, కూతురు మొదలగువారి కా కుటీరమందు విడిగా నుండుట మఱియు లాభకరమై నాయనకు తోచెను. కాని, యాపిల్పు వంటి పులుపులేని బరవర్ధకమగు పండ్లరసములా కుగ్రామమం దెట్లు లభ్యమగును ? దీక్షాకాలమందు కేవలమట్టి రసములే యాహారముగా

కావలెను. పైనుండి యిట్టి పండ్లను రప్పించుకొనుట కష్టముగావున ఖర్గపురములో నిర్మింపదలచిన యాశ్రమమందు దీక్షపూనిన యెట్లుండునని యోచింపబడెను. అక్కడ పండ్లు చౌకయేగాక సమృద్ధిగా దొరకును. మహాదేవము కుటుంబముతో వచ్చియున్నచో ఖర్గపురమంతకంటె లాభకరము గావచ్చునని నిశ్చయింపబడెను. రాజేశ్వరి కోడలు పచ్చితీయులోవున ఖర్గపురాశ్రమము నిర్మింపబడజాలదు కనుక నామెకు పచ్చి వదలిన పిదప నామెతో ఖర్గపురమందు కాపురము నిర్మించుటకు మహాదేవము సంసిద్ధుడయ్యెను. మున్ముందుద్యోగ ప్రయత్నమునకుగూడ ఖర్గపురావాసము లాభించునని యతడూహించెను.

ఇట్లాలోచనలతోడను, స్వర్గసిద్ధిపొందినట్లు వ్యాప్తమైన వార్తను విని నాయనను జూడ వేడుకపడి వచ్చుచున్న బంధువుల ప్రేమాభిభాషణములతోడను నొక నెల గడచిపోయెను. ఇట్లుండగా, పురాతన శిష్యుడైన 'కిట్టాజీ'యను 'అర్ని' కాపురస్థుడు నాయనను దర్శించుటకు కలువజాయి వచ్చి నాయన కమిత సంతోషము కలిగించెను. ఇతడు కలకత్తా కొలుత రాగా నే నతనిని ఖర్గపురము పంపితిని. ఖర్గపురమునుండి నాయన కలువజాయి వెళ్లినట్లు తెలియక నే నట్లు చేసితిని. అతనివలెనే 'రావాడ మహాదేవ'మను పేరుగల విచిత్రవ్యక్తి యొకడు మహాత్ముల సేవాసాంగత్యము గోరి గాంధీమహాత్ముని వార్ధాశ్రమమందు కొన్నాళ్లున్న పిదప నాయన కీర్తిని విని, నాయనను దర్శించి సేవించుటకు ఖర్గపురము వచ్చి, నాయనకొఱ కక్కడ వేచియుండెను. ఇతనిని కిట్టాజీకి తోడిచ్చి ప్రసాదరావు, రామమూర్తిగారలు కలువజాయి పంపిరి. మఱియు నాయనను ఖర్గపురము తీసికొనివచ్చు భారము సైత మీ రావాడ మహాదేవమునకు వారొప్పగించి ధనమిచ్చిరి. ఇతడు కలువజాయి చేరినప్పటి నుండి నాయన సేవయందు నిమగ్నుడై, తన యప్రమత్తత, నిరహంకార సేవాలక్ష్యముచే నాయనకు సంతోషము కలిగించెను.

కిట్టాజీ రెండురోజులుండి స్వగ్రామము వెళ్లిపోయెను. నాయనయందు వికసించిన స్వర్గసిద్ధి కతడు విస్మయముచెంది 'మా కదివఱకు చెప్పబడిన క్రమము చొప్పున మీయందింక పరకాయసిద్ధి మిగిలియున్నది. అది లభ్యమై నప్పుడు శ్రీకృష్ణుడు కల్పించినట్లు సంగ్రామ వ్యూహములను మీరు కల్పించి పాశ్చాత్య దుష్టనాగరికతయొక్క పతనముచే కలి నంతరింపజేయుదురని నేను విశ్వసింతు'నని వెళ్ళిపోవునప్పుడు తన పూర్వాశయములను విడనాడనివానివలె వచించి వెళ్లెను.

పిమ్మట 21-9-1935వ తేదీనాడు నాయన కలువజాయి నుండి బయలుదేరి రావాడ యోగితోగూడి ఖర్గపురము చేరెను (ఇతడు సంసారియైనను, బ్రహ్మచర్యవ్రతమును బూనినందున నాయన యితనికి 'యోగి' బిరుదము

విచ్చెను). ఐన పూర్వమువలెనే పార్వతీశమింట నుండెను. నాయన కలువరాయిలో నుండగా నేమాని సూర్యనారాయణకు కలకత్తా నుండి ఖడ్గపురము బదలీయైనందున నతని కార్యోత్సాహము నూతకొని యాశ్రమ ప్రయత్నమును రామమూర్తి పంతులు చురుకుగా చేయదలచెను. కాని, స్థలమిచ్చెదనన్న నాయుడు దాతవలె దానపట్టా వ్రాసియిత్తునని పల్కి, కొన్నాళ్లు కాలవిలంబనముజేసి, తుదకు స్థలము హక్కును విడువనొల్లక, ఆశ్రమ మక్కడ కట్టుకొని కొన్నాళ్లుండుటకుమాత్ర మనుమతించెను. అదియే భాగ్యమని తలచి నారాయణ రామమూర్తులా స్థలమందాశ్రమ నిర్మాణమునకు నాయనచే డిసెంబర్ నెలలో శంకుస్థాపన చేయించిరి. ఈ శంకుస్థాపనోత్సవమున కాహ్వానింపబడి నేను, నా భార్య కలకత్తానుండి పార్వతీశ మింటికి వచ్చితిమి. అంతవఱకు గుట్టుగా నుంచబడిన స్వర్ణసిద్ధిని గురించి యానాడు నాయన వెల్లడిచేయగా, పార్వతీశ మా యోగమహిమ నొకసారి చూచుటకు కుతూహలపడెను. కాని, పగలు శంకుస్థాపన సందడివలన చూప సమయము చిక్కక రాత్రిపడిన పిదప నాయన యొక అర్ధణాకాసుకు (ఇది రూపాయి సైజున నప్పుడుండెడిది) తమ చెమట పట్టించిరి. అది తెలుత మాడిన రంగు పొంది, తరువాత క్రమముగా పసుపు వర్ణము లోనికి మారి, స్వర్ణమగుట మేము స్పష్టముగా జూచితిమి. ఆ సమయమం దక్కడ ప్రసాదరావు, మఱికొందఱు కూడ గలరు. ఆ నాణెము కొఱకు వారిలో నాశ జనించుట నాయన చూచి, నాచేతనే దానిని చెంతనున్న డొంకలో విసరివేయించిరి.

ఆ రాత్రి పరుండబోవునప్పుడు నాయన పార్వతీశముతో నేను వినుచుండగా నిట్లు చెప్పిరి: ''నేను కాంతముతో కలకత్తావెళ్లి, మఱల వచ్చెదను.'' నావలెనే పార్వతీశము కూడ పెద్దవారి నిర్ణయములను ప్రశ్నించు స్వభావము లేనివాడై 'సరే' యనెను. పైగా, మేమిరువుర మొక్క యూరికి జెంది, సోదరతుల్యులమై యుండెడివారము కనుక వాని యింటినుండి నాయన మా యింటికి వచ్చుట యతని కంత ఖేదముగాగాని, న్యూనతగాగాని తోచలేదు. తెల్లవారుఝామున వచ్చు రైలెక్కి నాయన, నేను, నా భార్య కలకత్తా చేరితిమి. ఈసారి నాయన కలకత్తా వచ్చినప్పుడు మా మరదలుకు మారుగా మా బావమరది 'విఠల్' నాయొద్ద యుండెను. ఇతడు 'బి.యే.' చదువుచు, తన కధికముగా తెలిసినవానివలె రాజకీయ విషయములందు నాయనతో వాదించుచు నాయనకు వినోదము పుట్టించువాడు. బాలుర బుద్ధిని రెచ్చగొట్టి సంస్కరించుటలో నాయన ప్రజ్ఞ యధికము.

నాయన తిరుగ కలకత్తా వచ్చిన మూడు నాలుగు రోజులకే సుధన్వుడు తన కుమార్తె కమలమ్మ నామె భర్తయొద్ద దిగబెట్టుటకు కాశీ వెళ్లుచు,

మార్గమందు నాయనను దర్శించుకొనుటకు కలకత్తాలో ప్రొద్దుట దిగి, రాత్రి మఱల రైలెక్కెను. అతని రాకకు నాయన యా దినమంతయు చాల మురిసెను. సాయంత్రము శిష్యులందరు పూర్వాచారము చొప్పున చేరగా, వారికి సుధన్వుడు నాయనయొక్క వైభవములను గుఱించి కొంచెము పరిచయమొనర్చెను. ''బొంబాయిలో ముద్రణము పొందిన సంస్కృత భారతమును తెప్పించుకొనుటకు మీకు రూ. 40/- లిచ్చుచున్నాను. దానికి నాయనచే నర్థము చెప్పించుకొనుడు, దానికి చెందిన ఋగ్వేద సూక్తములను నాయనవలన విని మీ రుత్తేజమును బొందు'డని మాకతడు హితవుకూడ పల్కి ధనమిచ్చెను. మఱికొద్ది రోజులకు తిరువణ్ణామలై నుంచి రమణభక్తుడైన 'శేషుఅయ్య'రను వకీలు తన కుమారుని జూచుటకు కలకత్తా వచ్చి. నాయనను దర్శించి, శ్రీ రమణుని వార్తలతో నాయనకు భక్తివెల్లువలను, కంటిధారలను బుట్టించెను. ఆ సమయమందు గురుభక్తి యెంత గాఢమై నాయనయందుండెనో, అది కొన్ని ప్రియస్మృతులవలన కదలినప్పుడు నాయన యొక్క శిరఃకపాలములు భిన్నమైన స్థలమునుండి విద్యుత్ప్రసారమెట్లధికమగుచు నాయనకు బాధ కలిగించునో శేషుఅయ్యరుతో పాటు మేమును తిలకించి, నాయనయొద్ద గురుప్రసక్తి నంతగా తెచ్చుట ప్రమాదకరమని తెలిసికొంటిమి. నాయననుండి చిమ్మిన విద్యుత్తరంగములను బరీక్షించుటకు నేమాని సూర్యనారాయణ యొక తీగమును నాయన శిరస్సున కడుగున్నర యెత్తున రెండు మూడు నిముసములు పట్టుకొనిన పిదప విద్యుత్ప్రయోగముచే తీగ మాకర్షణ శక్తియుతమైన ట్లది కొన్ని గుండుసూదుల నయస్కాంతమువలె నాకర్షించుటవలన కనుగొని మా కందరికి జూపెను. అది శేషుఅయ్యరుకు క్రొత్తయైనందున, నాయన శక్తియొక్క యద్భుత ప్రవాహమున కతడు విస్మయము చెందియుండగా నాయన యతనికిట్లు చెప్పెను: ''నాయందు చాలకాలము క్రిందటనే యుత్పన్నమైన దివ్యశరీరముయొక్క శక్తివ్యాపారము నన్ను కేంద్రముగాగొని భ్రమణమగుచున్న సుడివలెనున్నది. దాని పరిధి దినదినము వ్యాపించుచున్నది. ఆ శరీరమిప్పుడు దేవకార్యమునకు సుఘటితమై యున్నది.''

సుధన్వు డిచ్చిన ధనముతో భారతము తెప్పించి శిష్యులు దాని పారాయణము సాయంత్రములందు కోరిరి. అది ప్రారంభింపబడినను నాయనను నేను రెండు కోర్కెలు కోరితిని. అందొకటి విశ్వసృష్ట్యాది రహస్యముల నన్నింటిని పేర్కొని జిజ్ఞాసువులకు అధ్యాత్మ విషయజ్ఞాన సంహితవలె నుపయోగించు 'విశ్వమీమాంస' యను గ్రంథములోని శ్లోకములకు తెనుగు తాత్పర్యము. రెండవ కోర్కె యేమనగా, నాయనయే తన జీవితచరిత్రమును తన యనుభవములతో సహా విపులముగా వ్రాయవలెననునది. నాయన యనుభవములు నానా ముఖములై, యే తరగతియందైనను నాదర్శప్రాయములు. అవి యితరుల

కూహించుటకును కష్టమని తలచి, గాంధీమహాత్ము డాత్మకథను వ్రాసినట్లు నాయన తన దివ్యలీలా చరిత్రమును వ్రాయుట బహుజనోపయోగకరమగునను నుద్దేశముతో నే నడిగితిని. నా యీ రెండు కోర్కెలను దీర్చుటకు నాయన వ్రాత ప్రారంభించెను. ఇట్లుండగా, నా భార్య యింకొక కోర్కెనిట్లు కోరెను: "మీరు చెప్పిన 'పూర్ణ' యను కథను మీరు తెనుగున వ్రాసినచో, సాంఘిక, రాజకీయ, విప్లవాత్మకముగా నుండగలదు." అదియు నాయన వ్రాయుట మొదలిడెను.

ఈ మూడింటిని యించుమించొకే కాలమున నాయన ప్రారంభించినను 'పూర్ణ' యను నవలాత్మక కథకు హెచ్చు ప్రాముఖ్యమునిచ్చి తరువాత 'విశ్వమీమాంస'కు, అటు తరువాత స్వీయచరిత్రకు క్రమముగా ప్రాముఖ్యము నిచ్చిరి. ఒకనాడు విశ్వమీమాంసలోని యోగసాధన ప్రసక్తి వచ్చి, 'మీ రిదివఱకు హృదయవిద్యను గుఱించి యుపన్యసించినప్పటినుండియు నా కుపదేశపూర్వకముగా నింకొకసారి బోధ పొందవలెనని మనస్సపేక్షించుచున్న'దని నేను విన్నవించుకొనగా, నాయన యొకటి రెండు క్షణములు ధ్యానముద్ర వహించిన పిదప నాకొక వాగ్దాన మిట్లు చేసెను: "నీ కోర్కె గ్రహించితిని. కొంచెము కాలములో మిమ్ములి నిద్దరిని నేను స్వయముగా మహర్షి కడకు తీసికొని వెళ్లెదను. అప్పుడు నేను మహర్షి చేత నీకు హృదయవిద్య నుపదేశింప చేసెదను. దీని నుపదేశించుట కాయనయే యధికారి. మహర్షి దీనిని గుఱించి ప్రతిదిన ముపన్యసించుచున్నను, కేవల ముపన్యసించుట యుపదేశమగునా? ఉపదేశ మనుగ్రహశక్తితో గూడియుండునని తెలియక మహర్షి ప్రసంగమును వినినవారందరు నుపదేశింపబడినట్లు భ్రమించుచుందురు. మహర్షి యనుగ్రహము కడు దుర్లభమైనను, మీ యిఱువురియందది ప్రసాదించునట్లు నేను చేసెదను. నా మాట నమ్మి కొన్నాళ్లింకను వేచియుండుడు." నే నీ మాటలకు స్వర్గమందుకొనినట్లు సంతసించి నా కృతజ్ఞత నిట్లు దెల్పితిని: 'తప్పక వేచియుందుము. మీ రీ విధముగా మమ్మనుగ్రహించుటకంటే కోరదగిన దేమున్నది? నా విశ్వాసముకూడ మీ యనుగ్రహమువల్లనే మహర్షి యనుగ్రహము చిల్కునని. కానిచో గణపతిపూజ తొలుత చేయవలెనను మాట కర్థమేమి? క్రమము విడిచి రమణభగవానుని ప్రసాదమాశించువారికది దుర్లభమనియు నేను నమ్ముదును. రమణ భక్తులది గుర్తించియున్నచో శ్రీ రమణునినుండి మిమ్ములను భిన్నముగా జూతురా?' నా యీ పల్కులకు నాయన ముఖము విచిత్రముగా కాంతిమయమై వికసించెను. ఒక పావుగంటవఱకు నాయన నిమీలితనేత్రుడై దివ్యావేశము పొందినట్లు కూర్చుండగా, కాంతి క్రమముగా హెచ్చి చూడ వేడుకయయ్యెను. అదివఱకెన్నడూ గాంచని దృశ్యము నానాడు నేను, నా భార్య చూచి, నాయన మాకానాడు తన దివ్యత్వమును స్పష్టముగా జూపి యనుగ్రహించినట్లు భావించి, యా దివ్య గణపతికి సాష్టాంగపడితిమి.

ఈ గణపతితత్త్వ మొక్కొక్కప్పుడు ప్రాతసమయమందు నాయనను రహస్యముగా నిదానించువారికి గోచరించెడిది. అట్టి సమయములందు నాయన చేయి వ్రాయుచుండును. దృష్టి వ్రాయుదానిపై పడక, కొంచెమెత్తబడిన ముఖముచే దేనినో అలంబన చేయుచున్నట్లుండును. పెక్కుసార్లు నే నీ వైభవము జూచితిని. కొన్నాళ్లిది యష్టావధాన ప్రజ్ఞ కాబోలునని హఠాత్తుగా చూచినప్పు డనుకొంటినిగాని తరువాత నిదానించిన ఫలముగా నాయనయొక్క నిజస్వరూప వైభవమని తెలిసికొంటిని.

ఇట్లే నాయనయందున్న యితర ప్రజ్ఞలుగూడ నతిమానుషములని చెప్పక తప్పదు. మొదటిసారి కలకత్తా వచ్చియున్నప్పుడు 1935వ సం॥ సెప్టెంబర్ నెలలోనో, అక్టోబర్‌నెలలోనో 'అబిసీనియా' అనే చిన్న దేశముపైన 'యిటలీ' దేశము యుద్ధము ప్రకటించినట్లు రెండు పంక్తులుమాత్రము వార్తాపత్రికలందు పడగా మేమది చదివి, యబిసీనియా దేశమెక్కడిది, దాని బలమెంత, రాజెవరు, యుద్ధకారణము లేమైయుండునను విషయములు చర్చించుకొంటిమి. మాలో నెవ్వరికి నంతమట్టు కాఫ్రికాఖండములోని చిన్న దేశములను గుఱించి తెలియక శుష్కప్రసంగము చేసికొనుచుండగా నాయన విని, యబిసీనియా దేశమును గుఱించి యావత్తు భోగట్టాను - విస్తీర్ణము, జనసంఖ్య, మతనాగరికతలతో సహా చెప్పి, 'నైలు'నది పుట్టుక స్థలముకడ 'డాము'కట్టడమును గుఱించి యంత కేబది సంవత్సరముల పూర్వ మిటలీ దేశమున కా చిన్న దేశముపై గలిగిన ద్వేషకథ నంతయు చెప్పెను. ప్రపంచములోని చిన్న, పెద్ద దేశము లన్నింటి చరిత్రలు, వాటి భౌగోళిక పరిస్థితులు, పంటలు, ఆర్థిక, రాజకీయ స్థితులు, జనుల నాగరికత, మతాచారములు మొదలగునవి తెలియు కుతూహలముతో చెన్నపట్టణమందు 'కన్నెమరా' గ్రంథాలయమునుండి కొన్ని యేండ్లకు పూర్వమొకప్పుడు పుస్తకములను దెప్పించి చదివించి, యొక్కసారి నాయన వినిన సంగతులన్నియు బహు సంవత్సరములు గతించినను స్మృతినుండి జారకుండుట, నానావిధములై యే యొక్కనికి తెలియ సాధ్యముగానన్ని విపుల విషయము లొక్కసారి వినినంత మాత్రమున బుద్ధిచే నాకలింపబడి, యవసరమున్నను లేకున్నను ధారణ చేయబడుట మాకప్పుడు స్పష్టముగా విశదమై, మేము మా సంకుచితప్రజ్ఞలకు సిగ్గుచెందితిమి. నాయనయం దంతటి ధీప్రజ్ఞ యతి మానుషమని మేము గుర్తించితిమి. మఱియు వివేకానందస్వామివలె నాయన పాశ్చాత్య దేశములు వెళ్లియున్నచో, వారు మనవారికంటె నాయన వైభవముల నవలీలగా గుర్తించి యుందురనియు, వారి ముద్ర పడినప్పుడు మన దేశస్థులు నాయనను వివేకానందునికంటె నధికముగా పూజించి యుందురనియు మేము విమర్శించుకొని, మన దేశస్థుల విచక్షణ కుంటువడిన విషయమునకు

సిగ్గుచెందితిమి. మా విమర్శ విని నాయన చిఱునవ్వు నవ్వుచు "విచక్షణ లేమింజేసియే మనము పాశ్చాత్యులకు భావదాసులమైతిమి. పురాణములు, భాష్యములు మన దేశమం దుద్భవించిన కాలములోనే పండితు లన్యభావదాస్యలంపటులై తమ మతమున కాధారగ్రంథమగు వేదమునకు భిన్నార్థములను జెప్పిరి. విచక్షణను వీడినప్పుడు మానవబుద్ధి యిట్లే యనర్థములను గల్పించుకొనుచుండు"నని పల్కెను.

ఇట్లే పదే పదే పలుసార్లు బుద్ధియందు విచక్షణను, సత్యవిమర్శనాదృష్టిని పెంపొందించుకొండని నాయన మమ్ములను హెచ్చరించుచు, సంప్రదాయ సిద్ధములుగా వచ్చుచున్న భావము లసమంజసములుగా తోచినప్పుడు వాని నతిక్రమించుటకుగూడ వెరవవలదని ధైర్యము పల్కుచుండెను. ఒక కాలమందు మన పండితులు, కవులు చొరబెట్టిన కల్పనాజాలమునుగూడ విమర్శించు కొండనియు, వేదకాలమున లేని విధములకుగాని, వేదప్రామాణ్యమును పాటించని యుక్తులకుగాని తలయొగ్గ నవసరము లేదనియు ప్రబోధించుచు, నట్టి యనర్థములను దొంతరలుగా పేర్కొనువారు. అప్పుడప్పుడు నేను కాగితముపై వ్రాసికొనిన ఇట్టి ప్రసంగముల సారమును పాఠకుల కుపయోగించునను భావముతో దిగువ నిచ్చుచుంటిని.

1. నిష్కామ్యము గొప్పదైనను, స్వలాభమునకు కానట్టి కర్మలు సకామ్యములైనను గొప్పవే. ఇంక తనకొఱ కేదేని కోరవలసివచ్చినప్పుడు తోటిమానవుని యాచించి ఋణపడుటకంటే భగవంతుని యాచించుట శ్రేష్ఠము. నిష్కామ్యముగా చేయుట చేతకాదని తపస్సును మానువారికంటే కామ్యమపేక్షించియైనను తపస్సు నలవరచుకొనువా రుత్తములు. వీరికొకప్పుడు తపస్సాధనబలమువలన కామ్యము సిద్ధించుటకు పూర్వము స్వస్వరూప ప్రాప్తియగును. అప్పుడు మొదటి కామ్యముగూడ సిద్ధించినను, దానియం దపేక్ష యుండదు (గణపతిముని కిది స్వానుభవము. కపాలభేదన సిద్ధికి పూర్వమున్న లోకహిత కార్యసంబంధములగు కొన్ని యపేక్షలా సిద్ధికి పిదప రుచించలేదు).

2. సంధ్యావందనములో మూలమంత్రమున కటునిటు నున్నది కల్పించ బడినదై కల్పమనబడెను. ఇట్లే శ్రాద్ధకార్యమందును ముఖ్యమంత్రములకు కల్పమెంతైనా చేర్చబడెను. కల్పమునకు ప్రాముఖ్యమిచ్చిన యనర్థముగా దానిని కంఠస్థము చేయలేనివారు మూలమంత్రములను గూడ నాచరించుట మానిరి. మధ్యకాలమందు పూజాప్రార్థన విధానములందు పెంచబడిన కల్పముయొక్క ఫలమిది.

3. యుగములు:- ఇవి జ్యోతిష యుగములు, ధర్మ యుగములు అని రెండు విధములు. జ్యోతిశ్శాస్త్రమందు దినములు, నెలలు,

సంవత్సరములవలనే యుగశబ్దము కాలమానమును సూచించుచు, కొన్ని వేల సంవత్సరము లొక్కొక్క యుగమునకు ప్రమాణముగా గైకొనబడెను. దీనిలో 'కృత, త్రేతా, ద్వాపర, కలి' యను యుగవిభాగము లేదు సరికదా జ్యోతిష యుగము లన్నియు నొకే ప్రమాణము కలిగియుండును. అట్టి జ్యోతిష యుగములు నాలుగు చేరినచో మహాయుగమగును. ధర్మయుగములు మానవబుద్ధియందు దైవస్వరూపము నారాధించుటకున్న వీర్యబలము సాముదాయికముగా పొందు వృద్ధిక్షయముల నుద్దేశించి నిర్ణయింపబడెను. నిర్గుణ సత్యవస్తువే దైవమని చింతింపగల్గు కాలమును సత్య (కృత) యుగమనిరి. దీని ప్రమాణము 1,200 సంవత్సరములని మనుధర్మ శాస్త్రమందు, మార్కండేయ పురాణమందు వచింపబడెను. తరువాత బుద్ధిబలము క్షీణించి, దైవము నుత్కృష్ట సగుణరూపముచే నారాధించు కాలము. ఈ సగుణ రూపములు నిర్గుణమగు చిదగ్నిస్వరూపమునకు మూడు- సౌర-వైద్యుత-పార్థివ లక్షణములచే విభాగమైన అగ్నిదైవతము 'త్రయి' యనబడును. ఈ రూపములుగా దైవము నారాధించు కాలము త్రేతాయుగమనబడును. ప్రమాణము 2,400 సం॥ చెప్పబడెను. తరువాత ద్వాపరయుగము 'ద్వేపరా' బుద్ధిధర్మమును సూచించును. అనగా, పరావస్తువును గురించి ద్వంద్వముగా డోలాయమాన మగుట. దీని ప్రమాణము 3,600 సం॥లు. అటుపిదప పరావస్తు నిర్ణయమును గురించి, యారాధన గురించి భిన్నాభిప్రాయములచే కలహించుకొనుకాలము కలికాలము (కలి=కలహము). దీని ప్రమాణము 4,800 సం॥లు. నాలుగింటి మొత్తము 12,000 సం॥లు. అటుతరువాత దైవనిర్ణయముకొఱకు కలహించి, కొన్ని యసువులను గోల్పోయిన పిదప మానవబుద్ధి విచక్షణను తిరుగ పొంది, వీర్యవంతమై, కృతయుగధర్మమును స్వీకరించును. కనుక ధర్మయుగములు చక్రములవలె తిరుగుచుండును. కాలచక్రమున కిదియే సాంకేతికము. ఒక యుగధర్మ మింకొక యుగధర్మములోనికి మార్పుచెందునప్పుడు యుగమునకు, యుగమునకు నడుమ సంధికాలములుగూడ నిర్ణయింపబడెను. అవి 50, 100,150,200 సం॥లు. కలియుగ ప్రమాణ మిఱువైపుల సంధి భాగములలోని కలి ఛాయలతో చేర్చి 5,000 సం॥లుగా వచింపబడెను. పంచాంగములందు ధర్మయుగమునకున్న పేరు, జ్యోతిషయుగమునకున్న ప్రమాణముతో పండితు లసందర్భముగా చేర్చుట వాడుకయ్యెను. సంధ్యావందన కల్పమందు 'కలియుగే ప్రథమ పాదే' యను పాటయు నిట్టి పండితుల సృష్టియే.

4. మతములు:- 'మత' శబ్దము సామాన్యముగా నభిప్రాయమను నర్థమున కుద్దేశింపబడెను. మతిమంతులు దైవవస్తువును గురించి యెట్టి యేకాభిప్రాయమును జెందుచున్నారో, అట్టి యభిప్రాయమును సూచించునది

నిజమునకు మతము. అనగా, సత్యమునకు సంబంధించిన యెఱుక యగును. దాని కుపాయము లెన్ని విధింపబడినను, జగజ్జీవేశ్వరులు మూడుగా తోచుటకు కారణమును నిర్వచించి, విభేదమును గల్పించు కారణము తొలగింపబడగా, ననుభవవేద్యమగు సత్యస్వరూపమా మూడింటియం దొక్కటియేయని నిరూపించుట మతమగును. వైదికమత మొక్కటి యిట్టి తరగతికి చెందును. 'మత' నామముతో బరగు నితరము లేవియు నీ ప్రమాణమునకు సరిరావు. కనుక వాటిని మతములుగా పరిగణించుట తగదు. అట్లయినను, కలికాల మహిమకొలది పెక్కుమంది తమ నమ్మికలనేమి, తమ యప్రమాణ భావములనేమి మతనామముతో వ్యవహరించి కలహకారకులైరి. మన దేశమం దిట్లే బుద్ధుడు పుట్టుసరి కెన్నో మతము లుద్భవించి భారతీయుల బుద్ధిని వైదికమతమునుండి చెదరగొట్టెను. సత్యమును గుఱించి వేదమందు చెప్పబడిన ప్రమాణవాక్యముల నుండి తమకు తోచినంత భాగమును గైకొని, వానికి పూర్వాపర సందర్భములను విడిచిన ఫలముగా నేర్పడు క్రొత్త యర్థములచే క్రొత్త మతములను సృష్టించుట వేడుకయయ్యెను. వీరు తమ మతములకు వేదమే ప్రమాణమనుటయు విచిత్రమే. వేదార్థము నెంత భంగము జేసినను, వేదమును ప్రమాణముగా జెప్పుకొననివారిని వీరు నాస్తికులని పిలుచుచు, తమ హస్తమం దాస్తిక వేదమతము సురక్షితమై యున్నట్లు తలచిరి. కయ్యముచే వీరి బుద్ధిని సంస్కరించుటకే బుద్ధు డుపాయ మాలోచించి, తనకు వేదము ప్రమాణము కాదనెను. నాస్తికుడుగా పరిగణింపబడినను, వారియందు పౌరుషమును కల్పించి, వారి బుద్ధి వేదపరమగుటకు వలయు విచక్షణాబీజములను బుద్ధుడు నాటినవాడయ్యెను. దీనినే 'Negative Force' విధానమందురు. ఈ యనర్థ మతము లర్థవాక్యముల నాధారముగా జేసికొని యుద్భవించెననుటకు కొన్ని నిదర్శనములను దిగువ నుదాహరించుచుంటిమి.

జగత్కారణమును గుఱించి :- 1. 'సూక్ష్మాత్ సూక్ష్మతరం కించిత్' అను ప్రమాణముచే కర్త ప్రమేయము లేకుండ అణుమయమైన పంచభూతము లొకదానితో నొకటి పడుగుపేకలవలె కలసి వివిధాకార జగద్రూపమయ్యెనని స్థిరపరచునది 'నైయాయిక' మతము. అణుత్వదశకు పూర్వము పంచభూతములు ధూళిరూపమున నున్నవనుట వైశేషిక మతము. ఈ మతము చొప్పున ఆ ధూళిరూపము జగత్కారణమగును. 'జగత్కర్తారః పీలవః' అను శ్రుతివాక్యము వారికి ప్రమాణము. ఇంక సాంఖ్యులలో కొందఱు గూడ కర్త ప్రమేయము లేకయే సత్త్వరజస్తమో గుణాత్మకమగు ప్రకృతియందు గుణవ్యత్యాసమై జగత్కారణమగునట్లు వచింతురు. 'అజామేకాం, లోహిత శుక్ల కృష్ణాం, బహ్వీం, ప్రజాం జనయంతీం సరూపాం' అను శ్రుతివాక్కు నా ప్రకృతి

కన్వయింతురు. ఆ ప్రకృతి యీశ్వర సన్నిధానమువలన జగత్సృష్టి చేయునని 'తత్సాన్నిధ్యా జగదిదం ప్రవర్తే' అను శ్రుతివాక్యమునుబట్టి కొందఱు సాంఖ్యులు స్వల్పమగు సవరణ చేసికొనిరి. మఱికొందఱు 'మాయాంతు ప్రకృతిం విద్యాత్, మాయినంతు మహేశ్వరం, తత్సంసర్గ వశాచ్చైవ ఏతత్సర్వం ప్రజాయతే' అను శ్రుతివాక్యమును గైకొని ప్రకృతిపురుష సంయోగము జగత్తుకొఱ కగుచున్నట్లు వచింతురు. ఇంక జగత్కర్త నంగీకరించినవారా కర్తను పేర్కొనుట కర్థవాక్యముల నాధారముగొని విభిన్నమతస్థులైరి. (1) 'సహస్ర శీర్షా పురుష స్సహస్రాక్ష స్సహస్రపాత్' అను శ్రుతివచనముబట్టి విరాట్పురుషుడే కర్తయనియు, (2) 'శివాత్పరతరం నాస్తి, ఏక ఏవరుద్రో నద్వితీయో యతస్తే' అను వచనముచే కర్త శివుడనియు, (3) 'నారాయణోవా అకామయత ప్రజాస్సృజేయేతి' అను వచనముచే కర్త విష్ణువనియు, (4) 'చిదేవ బహిరంతరనుప్రవిశ్య స్వయమేకైవ విభాతి' అను వచనముచే శక్తియే జగత్కారణరూపిణియనియు వైషమ్యములకు లోనైరి. వీరివలెనే (5) 'సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ' అను ప్రమాణమునుబట్టి సూర్యుడు జగత్కర్త యనుచు కొందఱు సూర్యమతమును లేవదీసిరి. మఱికొందఱు (6) 'గణపతి రేవాగ్ర ఆసీత్' అను వచనముచే గణపతియే జగత్కర్త యనునట్టి గాణపత్య మతమును, (7) 'హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే జాతః పతిరేక ఆసీత్' అను శ్రుతినిబట్టి హిరణ్యగర్భుడు కర్తయనునట్టి హిరణ్యగర్భ మతమును లేవదీసిరి. (8) 'భైరవాదన్యో న విద్యతే' అను వాక్యమునిట్లే కాపాలిక మతస్థులు ప్రమాణముగా గైకొని విశ్వసూచకమగు కాశియందు భైరవాజ్ఞను పేర్కొని భైరవుడే జగత్కర్త యందురు. పూర్వపక్షమున కీ ప్రమాణము లేవియు నిలువజాలవు.

5. వేదముల ఘనత :- బ్రాహ్మణములకును, ఉపనిషత్తులకునుగూడ మంత్రసంహిత మూలమగును. ఉపనిషత్తులకు విధిశేషత్వమె ట్లభిమతము కాదో, అట్లే మంత్రములకు కర్మాంగత్వ నియమమే అభిమతము కాజాలదు. మంత్ర సంహితనుండి కర్మకాండాత్మకము, జ్ఞానకాండాత్మకము అను రెండు శాఖ లుత్పన్నమైనందున కర్మపరమైన వ్యాఖ్యానమే సర్వమంత్రములకు సమంజసము కాదు. కర్మలందు వినియుక్తములగు పెక్కు మంత్రముల కధ్యాత్మపరమగు వ్యాఖ్యాన మొప్పుచున్నది. ఇది తెలియకుండుట పండితలోకమం దనర్థమై యున్నది.

సంస్కృతవాఙ్మయమందు నాయనకు ప్రీతికరములైనవి రెండు కోశములు. ఒకటి ఋగ్వేదసంహితమనబడు బ్రహ్మకోశము, రెండవది వేదాదిశాస్త్ర రహస్యములకు కోశమగు మహాభారతసంహిత. ఈ రెండు కోశములను తరచి,

రెండవదానినిగూడ మంత్రసంహితయందు గాంచిన విశ్రమము నాయన జూపి, తన గణాధిపాంశను ఋజువు చేసికొనెను.

వైష్ణవ జయస్తంభమగు వేదాంతదేశికుడు తన 'సంకల్ప సూర్యోదయ' మను గ్రంథములో తాను విష్ణుఘంటావతారమని స్వయముగా చెప్పుకొనెను. ఆనందతీర్థుడు తాను వాయువు యొక్క తృతీయావతారమని చెప్పుకొనెను. అట్లే గణపతిముని తన దైవాంశ నిశ్చయము నుమాసహస్ర గ్రంథమందొక చోట సూచించుకొనుటయేగాక, తన మహత్తర దివ్యాంశను తన యతిమానుషబుద్ధి వైభవమందే స్పష్టము గావించుకొనెను. ఆ యంశానుభవము సువ్యక్తమైన విధ మితరు లెంత ప్రయత్నించినను వర్ణించుట కష్టమని యెంచియే నేను నాయననే తన యాత్మకథను వ్రాయగోరితిని. 'పూర్ణ' యను నవలాత్మక కథను, 'విశ్వమీమాంస'కు తాత్పర్యములను చాలవఱకు ముగించిరి. కాని, యాత్మకథయందు మాత్రము మూడధ్యాయములు ముగియుపరికి ఖర్గపురమువారు వచ్చి తమచే నిర్మింపబడిన యాశ్రమమందు ప్రవేశించుటకు నాయనను కడు తొందరచేసిరి. ఇష్టము లేకున్నను, విధివి మన్నించువానివలె నాయన 25-4-1936వ తేదీ నాడు వారితో వెళ్లెను. అసంపూర్ణమైన పై మూడు గ్రంథముల నక్కడ పూర్తిచేయుటకు నాయన తనతో తీసికొనివెళ్లెను. వెళ్లునప్పుడుమాత్రము 'నేను కబురంపువఱకు నీవు నీ భార్య నన్ను జూచుటకు రావల'దని యాజ్ఞాపించెను. ఖర్గపురము వారి కసూయబుట్టకుండుట కట్లంటిరని నేను తలచితిని.

ఓం

నాలుగవ ప్రకరణము

# భౌతికదేహమును వీడి, దివ్యశరీరధారియై సిద్ధపురుషుడగుట

25-4-1936వ తేదీ నాటి రాత్రి నాయనను ఖర్గపురము తీసికొని వెళ్లి, నింపురా చివఱను నిర్మించిన ఆశ్రమములో ప్రవేశపెట్టిరి. నాయన పరిచర్యల కొఱకా సమయమునకు కలువకాయినుండి సింహాలు ఖర్గపురము వచ్చి యుండెను. ఆశ్రమము ప్రక్కను సోమయాజుల సూర్యనారాయణ యను బ్రాహ్మణు డిల్లు కట్టుకొనియుండెను. మఱి యొదాఱు కొంపలా ప్రక్క ప్రక్కల లేచినను, అవి బ్రాహ్మణులవి కానందున నాయనకు పగటిపూట భోజనము సోమయాజుల సూర్యనారాయణ యింట నమర్చబడి, రాత్రి భుజించు రొట్టి లింకొక కాలనీనుండి పంపబడుచుండెను. ప్రసాదరావు, సింహాచలము, వేదుల రామమూర్తి, పార్వతీశము, నేమాని సూర్యనారాయణ మొదలగు ప్రముఖు లందఱు రెండు మూడు మైళ్ల దూరములో చెదరియున్నందున నాయనయం దనుక్షణము శ్రద్ధజూపుటకు వారెవ్వరికీ నవకాశము లేకుండెను. వీరిలో రామమూర్తిపంతు లాశ్రమ నిర్మాణమున కెట్లు బాధ్యతవహించెనో, నిర్వహణమం దట్లే బాధ్యత వహించినందున ననుదినమో, దినము విడిచి దినమో వచ్చి నాయనను జూచుచుండెను. ఇతరులుకూడ వీలుచిక్కినప్పుడు వచ్చుచు, సింహాలు వలన నెప్పటి వార్తలప్పుడు వినుచుండిరి. అప్పటికి కొద్ది జీతగాడై, బహు కుటుంబభారముతోనున్న సోమయాజుల సూర్యనారాయణపై సింహాలుయొక్క భారము నుంచుట గూడ యుక్తముగాదని యెంచి, యతని కీ ప్రముఖుల యిళ్లలో వారభోజనము లేర్పరుపబడెను. అందువలన వానిద్వారా వారికి నాయన వార్త లందుచుండెను. వారమున కొకరోజున-శనివారము మధ్యాహ్నములం దాఫీసులు ముగించిన వెంటనే - శిష్యులందరు నాయనయొద్ద చేరి. హోమము సల్పుచుండిరి. హోమమైన పిదప కొంతసేపు బోధయో, చర్చలో యుండెడివి. ఆశ్రమమందలి యేర్పాట్లవి.

రెండు పూటలు సింహాలుకు పురమధ్యమమున కాహారయాత్రనై పోయివచ్చుట, అక్కడ కొంతసేపు నాయనను గుఱించి ముచ్చటించుట వినోద కరముగానే యుండెను. అతడాశ్రమముయొద్ద లేనప్పుడతని వంతక్కడ కూర్చుండుటకు సోమయాజుల సూర్యనారాయణ తమ్ముడున్నందున పురములో

మరికొంచెమునే పుండవలసివచ్చినను సింహాలుకు బెంగలేదు. దీనినిబట్టి యాశ్రమస్థాపకులు నాయనను సోమయాజులవారికి విడిచి, నాయన పరిచర్యలకు వచ్చిన సింహాలుకు వారు బాగుగా పరిచర్యలు సల్పుచున్నట్లు కొందఱికి తోచుటలో నాశ్చర్యపడవలసినది లేకుండెను. కాని, యాశ్రమస్థాపకు లీ విషయము నాలోచించకపోలేదు. ఆలోచించి నాయన కేదో విధముగా గడచుట యప్పటికి ముఖ్యమని యెంచి, 'యెట్లు, ఎవరివలన' అను విమర్శలకు ప్రాముఖ్యము నీయ నవసరములేదని నిశ్చయించుకొనిరి. వా రీ విధముగా భావించుటకు కారణ మేమనగా, విమర్శించు వ్యక్తు లాదియం దాశ్రమవిషయములో ప్రగల్భములు పల్కి, తుదకు మొండిచేయి జూపినవారే. అందువలన నొక్క పనియు వేదుల రామమూర్తి యాశించినట్లు పరిణమించక, నన్నింటియందు తానే శ్రమపడి యెట్లో అసలు కార్యమును పంతముచే సాగించెను. ఈవిగల పెద్దలుకూడ ఆశ్రయింపుగోరి మూకీభావము వహించిరి. రాను రాను అభివృద్ధి కార్యములకు దిగి, పేరు గణించుటకు కొందఱు వేచి వెనుకకుండిరి. అందువలన నొక పాకమాత్రమే నాయనకొఱ కాశ్రమముగా వెలసెను. కొద్దిరోజులైన పిమ్మట ఆశ్రమములో వంట ప్రారంభింపబడెను.

వీరందరి దృష్టి యా పాక నేరూపమునకు మార్చుట యను భవిష్యదభివృద్ధి విషయములకు మాటిమాటికి గడంగుచు, పాకలోని వ్యక్తియొక్క వర్తమానావసరములను విస్మరించెను. సింహాలైనను వారికి చెప్పక నొకానొక తమప్పుతో వ్యవహరించెను. యోగయుక్తమైన నాయన శరీరమునకు పాలకంటె పండ్లరసము ముఖ్యము. అదియే లేక, నాడులం దుష్టనిరోధక పటుత్వము క్షీణింపఁజొచ్చెను. శరీరమం దెల్లప్పుడు నిస్పృహ చెందియున్న నాయన యిట్టి శారీరక విషయములను స్మరించలేదు. చిక్కని మజ్జిగయైన భోజనమందు లేక క్రమక్రమముగా చెడువేడిమి పెగగర్భవంటి వ్రణరూపమును బొంది వ్యక్తమయ్యెను. అప్పుడైనను కారణము సమర్థముగా విచారింపబడలేదు. కొద్దిరోజులలో వ్రణ మంతరించెను.

వ్రణము తగ్గిన పిదప శరీరమం దదివఱ కణగియున్న అతిమూత్రపు బాధ పొడజూపెను. కాని, నాయన దాని నితరులకు చెప్పక రహస్యముగా నుంచెను. ఆ సమయమందు నాయన యేదో ప్రసంగధోరణిలో "నే నిక్కడ మూడు మాసములుందు"నని చెప్పగా సోమయాజుల సూర్యనారాయణ 'తరువాత ఎక్కడకి వెళ్లదలచితి'రని ప్రశ్నించెను. అప్పుడు 'నాచే ప్రణీతమైన గ్రంథములను ముద్రింపించి, నా యభిప్రాయములను లోకమందు ప్రకాశింపజేయుటకు వెళ్లెద'నని చమత్కారముగా నాయన బదులుపల్కెను. ఈ మాటలలో నాయన తన స్థూలశరీర పతనమును సూచించినను, అతని కది

ధ్వనింపలేదు. ఇంకొకనాడు 'ఏ. మాణిక్య'మను శిష్యుడు నాయన జాతక చక్రమును పరిశీలింపగోరి యడుగగా, నాయన దానినొక కాగితముపై వేసి యిచ్చి 'దీనికిప్పుడు మారకస్థితి పట్టెను. పరిశీలించు'మని స్పష్టముగా చెప్పినను, అతడా విషయము నితరులతో చెప్పక, దాని సంభవాసంభవములను పరిశీలించుటకు జ్యోతిష గ్రంథములందు నిమగ్నుడైపోయెను. మఱియొకనాడు సింహాలుతో 'నా దివ్య శరీరము సుఘటితమై, స్థూలసంబంధమును వీడి నాకు వశమైయున్నది. సిద్ధపురుష స్థితి ప్రాప్యము కానున్న' దని నాయన చెప్పగా, నతడేదో యోగరహస్య ముపదేశింపబడినట్లెంచి యా వార్తను కడుపులో దాచుకొనెను.

నా కీ మాటలన్నియు తరువాత తరువాత తెలిసినవి. ఖర్గపురము వెళ్లినప్పటినుండి నాయన క్షేమముగా నున్నట్లుతప్ప మిగిలిన వార్తలు కలకత్తావారి కేమియు తెలియలేదు. కబురు వచ్చువఱకు వెళ్లుట కాజ్ఞ లేక నేను నాయనను జూచుటకైనను వెళ్లలేదు. వెళ్ళియున్నచో పై మాటలు కొన్ని చెవిని పడి, నాయన సూచించునది గ్రహింపగలిగియుందునేమో యని నేను తరువాత ననుకొంటిని. కాని, నే నింతకంటెను పెద్ద భ్రాంతిలో కప్పబడిన విధ మాలోచించుకొనినప్పుడు నే నిప్పటికిని సిగ్గుచెందుచుందును. ఆ భ్రాంతిని గుఱించి చెప్పెదను. జూలై 23వ తేదీనాటి రాత్రి నాకొక టెలిఫోను వార్త నేమాని సూర్యనారాయణ యిట్లు పంపెను.. "21-7-1936వ తేది మధ్యాహ్నము మామూలుగా భుజించి వచ్చిన నాయన మంచముపై విశ్రాంతికొఱకు పండుకొని, తెలివి వచ్చినను లేవలేకుండెను. మాటకూడ లేదు. వైద్యుడు చూచి నీరసము హెచ్చుగా నున్నదని పల్కెను. కాని, మంచినీరైన నాయన ముట్టుటలేదు. వెంటనే నీ భార్యను దీసికొని రావలెను. మహర్షికి, మహాదేవమునకు నిన్నను తంతివార్త లంపితిని."

ఆ రాత్రియే నా భార్యతోగూడి రెండు డజన్ల ఏపిల్ పండ్లను, రెండు గ్లూకోజు డబ్బాలను తీసికొని నేను కలకత్తా నుండి బయలుదేరి ఖర్గపురము చేరి, మఱునాడుదయ మాఱుగంటలగుసరి కాశ్రమము చేరితిని. మాకంటే మహాదేవ మరగంట ముందు వచ్చి చేరెను. మేము నాయనకు నమస్కరించి, మా కందిన టెలిఫోను వార్తను చదివిన పిదప, దానిలో తెలుపబడినవి 'నిజమేనా' యని యడుగగా నాయన మా కర్థమగునట్లు చిఱునవ్వు నవ్వెను. మేము వెంటనే పండ్లరస మీయగా ప్రీతితో త్రాగిరి. అరగంట కొకసారి రెండౌన్సుల చొప్పున పండ్లరసము, గ్లూకోజు మార్చుచు నా భార్య యీయదొడగెను. రెండుగంట లట్లిచ్చిన పిమ్మట నేను నాయన మాట్లాడుటను గుఱించి ప్రశ్నించగా, నా ప్రశ్నను తప్పించుటకు ప్రక్కనున్న కలము, కాగితము నందుకొని 'దేవము, మీరు ఇప్పుడే వచ్చితిరి. కనుక మీకీ దిన మాటవిడు'పని నాయన వ్రాసియిచ్చెను. నేనప్పుడిట్లు బ్రతిమాలితిని: 'మీరు నీరసముకొలది మాట్లాడలేకుండిరో లేక దీక్షనేదైన

పూనితిరో తెలియుట కదుగుచుంటిని. ఈ రెండునుగాక వేఱొక కారణమున్నచో ప్రాసియైన చూపగోరుదును.' అప్పుడు నాయన గుటక మ్రింగి కంఠనాళములను సవరించుకొన్నినట్లు సవరించుకొని 'నేను మాట్లాడగలను. నీరసము తగ్గుచున్న'దని స్పష్టముగా చెప్పెను. ఆ మాటలతో నాకు కథయంతయు విశదమయ్యెను. ఆశ్రమములో ప్రవేశించినప్పటినుండి పండ్లరస మీయబడలేదని సింహాలు చెప్పి, 'వారొక్కొక్కప్పుడు బత్తాయి, నారింజపండ్లనిచ్చిరి. కాని, నాయన వానిని ముట్టనందున రసము లక్కరలేదనుకొంటి'నని తన తప్పును తుడిచివేసికొనెను.

మధ్యాహ్న మొంటిగంట యగుసరికి మఱింత బలము కలిగి నాయన స్వయముగా మంచమునుండి లేచి, వరండాలోనికి వెళ్ళి, యల్పాచమన క్రియ చేసికొన్ని, బట్టలు మార్చుకొనెను. ఈలోపున పడకమీది బట్టలుకూడ మార్చబడెను. మఱి యరగంటకు పెద్ద వర్షము కురిసి, పెక్కుచోట్ల పాక కురిసెను. మఱి నాలుగు డజన్ల ఏపిల్ పండ్లు తెప్పించి, రసములను పూర్వముకంటే నాయన మాట ననుసరించి యెదము చేసి యిచ్చుచుంటిమి. కాని, వర్షమునకు పాకలో నాయన మంచమున్న స్థలముతప్ప మిగిలిన భాగము కూర్చుండుట కర్యానమయ్యెను. అది చూపి నేను నాయనతో నిట్లంటిని: "ఈ పాక మీకు యుక్తముగా లేదు. నీరసము తగ్గవఱకు పార్వతీశమింటికి మారిన, నటుపైని నిర్ణయించుకొనవచ్చును. మీ కభ్యంతరమున్నదా ? లేనిచో వర్షము వెలిసినతోడనే బయలు దేరెదము. లేదా మంచి ఘడియలు మీరేమైన చెప్పినచో, ఆ ఘడియలందే మార్చెదము.' వెంటనే నాయన "రేపు శనివారము మధ్యాహ్నము రెండున్నర గంటల కిక్కడనుండి వెళ్లుటకు బాగుండు" నని స్పష్టముగా మాట్లాడి చెప్పెను. ఆ సందర్భములో మా కా మాటలం దెవరికిని వేఱర్థము ధ్వనించలేదు. కనుక మమ్ము కప్పిన యీ మాయయే మూడు మాసములనుండి ఖర్గపుర శిష్య వర్గమునంతను గప్పి, 'వారన్నియు చేయదగు నుత్తమ భక్తిమంతులైనను వారి బుద్ధినణచి, వారి నకారణ విమర్శలకు గురిచేసెను. మాయయొక్క బహుళ ప్రభావమున కంత యవసరమగుటయే నాయనయొక్క యవతారతత్త్వమున కొక గుర్తు, కానిచో, రవ్వంత తెలిసిన మాత్రమున రెక్కలు కట్టుకొనివచ్చు పూర్వభక్తుల కిసుమంతయు తెలియకుండాజేసినదేది? స్వగురునకు, ముఖ్యశిష్యులకు, బంధువులకు దూరముగా తన భౌతిక దేహమును విడువదలచిన నాయన కోర్కె ననుసరించి కుళువే వీడినప్పటినుండి యొకవంక నాయనయందు వక్రస్థితిని గల్పించుచు, నింకొకవంక యితరులయందు భ్రాంతిజాలమును గప్పినదేది ? నిజముగా నాయనయొక్క తపస్సాధనచే సాయుజ్యము పొందబడిన మహాశక్తియే యది.

మాయందు కప్పబడిన భ్రాంతిచే మేమా మఱునాటికి పండ్లరసములు

మఱింత దార్ఢ్యమునిచ్చి, పార్వతీశమింటికి రోగివలెగాక యథాప్రకారముగా వెళ్లనిచ్చునను నుద్దేశమును నాయన పొందినట్లెంచితిమి. మా యభిప్రాయమునకు తగినట్లు సాయంత్రము వైద్యుడు వచ్చి మేమిచ్చు రసములకు మెచ్చి, పరీక్షించిన పిదప నీరసము చాలవఱకు తగ్గెనని చెప్పెను. పండ్లరసములవలన విరేచన విష్టము తొలగి, మఱునాటికి యథారోగ్యము రావచ్చుననియు నతడు ధైర్యము పల్కెను. పిమ్మట చీకటిపడుచుండగా శ్రీ రమణాశ్రమము నుండి నారాయణ యిచ్చిన యింకొక తంతికి తంతి జవాబు వచ్చెను. అది నిరంజనానందస్వామిచే పంపబడెను. ''మీరిచ్చిన రెండు టెలిగ్రాములు భగవాన్ తనయొద్ద నుంచుకొని సమాధానము పల్కలే'దని యా తంతిలోని వార్త. నాయన దాని నందుకొని చించిపారవేసెను. అటుపిమ్మట నేను, నా భార్య ఆ రాత్రి కక్కడ యుండుటకు స్థలము లేక, పండ్లరసములిచ్చు పనిని సింహాలు కొప్పగించి, పురములోనికి వచ్చితిమి. వచ్చునప్పుడు నాయన 'నీవు కలకత్తా వెళ్ళిపోయెదవా' యని నన్ను ప్రశ్నించగా, 'లే'దని నేను బల్కియు, పురము చేరిన పిదప భావమును మార్చుకొని, నా భార్యను ఖర్గపురములో విడిచి నేనుమాత్రము కలకత్తా వచ్చితిని. ఆఫీసులోని ముఖ్యమగు బీగెముకటి నా జేబులో గృహమందుండిపోయెను. దాని నొప్పగించి తిరుగు రైలులో వచ్చి శనివారము మధ్యాహ్నము రెండున్నర లోపున నాశ్రమము చేరగలనని లెక్కవేసికొంటిని. నేను వచ్చుటతో నిమిత్తము లేకుండా పార్వతీశము స్వయముగా 'టాక్సీ'లో నాయనను తన యింటికి తీసికొనివచ్చుట కంగీకరించి నాకు ధైర్యము చెప్పెను.

మఱునాడుదయమున వారము రోజులనుండి విష్టము కట్టిన మల మంతయు నాయన ప్రేగులనుండి యైదాఱు విరేచనములద్వారా యూడిపడెను. దానితో నాయన తెరపిని బడి, తేలిక నొందిరి. మధ్యాహ్న మొంటిగంటన్నరకు శిష్యులందరు శనివార హోమమునకు వచ్చిరి. రెండుంపావువఱకు హోమము సల్పిరి. వారితోబాటు నాయనయు మంచము దిగి యాసనబద్ధులై కూర్చుండెను. తరువాత శిష్యులను బంపి నాయన మఱల మంచముపై పండుకొని, కాళ్ళవైపు నిలబడిన నా భార్యను జూచి ''కాంతము వచ్చినాడా'' యని ప్రశ్నించెను. 'ఇంకను రాలే'దను జవాబు విని కన్నులు మూసికొని ప్రాణమును విడుచుచుండగా మహాదేవము పొల్చుకొని 'నాకేమి చెప్పెద'రని వేడికొనెను. వానికి ప్రత్యుత్తర మిచ్చుట కా ప్రాణము వెళ్ళు క్షణము నాయన పిలిపి 'నీకు జపము చేసికొమ్మని చెప్పితినికాదా' యను మాటలను మాత్రము పల్కి, శరీరమును నిమేషమువలె విడిచిపుచ్చిరి.

అప్పటికి రెండున్నరయైనదని టాక్సీపై నాయనను తీసికొనివెళ్లుటకు

పార్వతీశము వచ్చి, నాయన దివ్యరథముపై వెళ్ళిపోవుట కాశ్చర్యపోయెను. ఆ సమయమునకు కలకత్తా నుండి రాదలచిన నా కొక విచిత్రము సంభవించెను. ఆఫీసునుండి పంద్రెండు కొట్టక పూర్వమే యింటికి వచ్చి బట్టలు మార్చుకొను చుండగా పొరుగు భాగములోని యిల్లాలు 'రెండు నిముషము లాగుడు. 'టీ' కలుపుచున్నాను. అది త్రాగి వెళ్లవచ్చు'ననెను. సరేయని నేను తొందరగా బట్టలు మార్చుకొని, 'టీ' వచ్చులోపున కొంచెము బడలిక తీర్చుకొనుటకు మట్టబెట్టబడియున్న పరుపున జేరబడి కన్నులు మూసితిని. మఱుక్షణము గాఢనిద్ర నన్నావహించెను. ఇల్లాలు 'టీ' తెచ్చి, కొంతసేపు కేకలుపెట్టి, నిద్రాభంగ మొనర్చుట కిష్టపడక వెళ్ళిపోయెను. రెండున్నరవఱకు నన్నా తమస్సావహించి, గోడపైనున్న గడియార మరగంట కొట్టుటతో త్రుళ్ళిపడి లేచితిని. లేచునప్పుడు నా మనస్సులో నాయన చెప్పిన శుభసమయము తన శరీరము వీడుటకని హఠాత్తుగా స్ఫురించి, నా శరీరము కొంతసేపు కంపించెను.

తరువాత రైలెక్కి నేను వెళ్లి, నాయన నర్థముచేసికొనలేని లోపమున కితరులతో పాటు వగచితిని. తుదిక్షణములలో నాయనయొద్ద నుండుటకుగూడ నా కవకాశము లేకుండునట్లు నన్నావహించిన దంతకాలము మమ్ము భ్రాంతిని బడద్రోసిన మహాశక్తియేయని గ్రహించితిని. యోగులకు సమాధినిచ్చు శక్తియే యజ్ఞానులకు నిద్రనిచ్చుచు, మనయందున్న జ్ఞానాజ్ఞాన వ్యత్యాసములచే నామెయే రెండు విధములైనట్లు భావింపబడుచున్నది.

కలువరాయి, సికింద్రాబాదు, తిరువణ్ణామలై, శిరసి గ్రామములకు నాయన నిర్యాణవార్త తంతిమూలమున తెలియజేయబడెను. ఆదివార ముదయము పదిగంటలకు వజ్రేశ్వరి వచ్చెను. అటుపిమ్మట నాయన శరీరమునకు సమాధియా, దహనసంస్కారమాయను మీమాంసను కొందఱు లేవదీసిరి. నాయనకు సమాధి పద్ధతి యిష్టములేకయే మెడలోని యజ్ఞోపవీతమును విసర్జించ లేదని పెక్కుమంది నిశ్చయించిరి. కావున దహనసంస్కారమే చేయబడెను.

సికింద్రాబాదు నాయన నిర్యాణవార్త చేరక పూర్వము శనివారము నాటి రాత్రి శ్రీ పి. మహాదేవన్ (అప్పుడు జియోలాజికల్ సర్వేకు చెంది, పిదప ఆంధ్ర విశ్వకళాశాల ప్రిన్సిపాలై చనిపోయెను) గారి భార్యకు స్వప్నమందు నాయన నిర్యాణము పొందినట్లు, నాయన శరీరము దహనముగుటతోడనే చితి నుండి యొకానొక దివ్య పురుషాకృతి లేచి తపస్సు కొఱకు వెడలినట్లు గాంచి భర్తకు, మఱికొంతమందికి తెల్లవారినతోడనే చెప్పెను. మఱికొంత సేపటికి టెలిగ్రామందె, యామె స్వప్నము నందరు నమ్మిరి. అట్లే తిరువణ్ణామలైలోని భక్తులు శ్రీ రమణుని చేష్టవలన నాయన నిర్యాణము గుఱించి టెలిగ్రాము చేరకపూర్వమే తెలియగల్గిరి. శనివార ముదయమునుండి మహర్షి రమణుడు

మహామౌనమును వహించి, మధ్యాహ్న భోజనమునకు లేవనైన లేవలేదు. అందువలన వంటలైనను, ఆశ్రమవాసులు రమణుని మౌనకారణము గ్రహించి, రమణునితోపా టా పగలంతయు పస్తుండిరి. మధ్యాహ్నము రెండున్నర దాటిన పిదప మహర్షి మౌనము వీడి, స్నానము చేయుట జూచి యందరు దుఃఖించి స్నానమాచరించిరి. సాయంత్రము టెలిగ్రాము చేరినతోడనే యొక భక్తుడు 'నాయన మమ్ము విడిచి వెళ్ళిపోయెనా, భగవాన్ అని విలపించుచు సమీపించగా, మహర్షి వానితో 'నాయన నాయొద్దకే వచ్చిరి. ఇంకెక్కడికి వెళ్ళుదు'రని పల్కెను. అది విని నాయన నింక నెవ్వరును పొమ్మనలేరుగదా యని యెల్లరు సంతసించిరి. పిమ్మట పది దినములవఱకు హాలులో రమణమహర్షి నాయనను గుఱించియే చెప్పుచు, గత విషయములను స్మరించి భక్తుల వీనులకు విందుగొల్పెను.

ఓం

## అయిదవ ప్రకరణము

# ఉపసంహారము

ధాత సంవత్సర శ్రావణ శుద్ధ సప్తమీ శనివారమునకు సరియగు 25-7-1936వ తేదీనాటి మధ్యాహ్నము రెండున్నర గంటలకు 'నాయన'యను ప్రియనామముతో ప్రకాశించిన కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని తన భౌతికదేహమును వీడి, యంతకుపూర్వమే సిద్ధమైయున్న తన దివ్యామృతమయ శరీరమును వహించి, యనామయపదము పొందెను. ఈ దివ్యపురుషుని భౌతికదేహ మంతరించినను, తదాకృతి వేలకొలది ప్రతులై, భక్తుల చిత్తముల నాక్రమించి వారిని ప్రేరేపించుచుండెను. మఱియు తన గ్రంథములందు బోధరూపమున ప్రకాశించు నీ దివ్యపురుషుని తేజోమయ శరీర మా గ్రంథములను శ్రద్ధతో పఠించువారికి విదితస్ఫూర్తియగుచు, వారి బుద్ధిని తేజోవంతమొనర్చుచున్నది.

జీవించియుండగా కపాలసిద్ధిని బొందిన నాయన యా సిద్ధిని పొందిన నాటినుండి సిద్ధపురుషుడై, మహస్స్వ శరీరముగా గల్గియున్నను, భక్తులయందున్న యవ్యాజప్రేమచేతను, నిగమాగమ శాస్త్రేతిహాస రహస్యములకు సరియగు నర్థములనిచ్చి, వాటిని సంస్కరించుటద్వారా నూత్న యుగ బీజములను నాటవలెనను ప్రేరణముచేతను మానవ వేషధారియై జీవించెను. అయిదున్నర యడుగుల యెత్తుగలిగి, బక్కపలుచగా నున్నను, బంగారు బొమ్మవలెనున్న యీ మానవాకృతి యెట్టివారి దృష్టినైన నరికట్టి యాకర్షించెడిది. విశాలమైన ఫాలము, బట్టతల, పూర్ణవికాసమును స్ఫురింపజేయు తీరుగల శిరస్సు, విజ్ఞానదృక్కులను బ్రసరించు నేత్రములు, గాంభీర్యమువిచ్చు కనుబొమ్మలు, సన్నని మీసము, పలుచగా వ్రేలాడు చిన్న గడ్డము గల నాయన యాకృతి గత యుగమునకు జెందిన ఋష్యాకృతి నెట్టివారికైన స్మరణకు తెచ్చుచుండెడిది. పిల్లలకు, పెద్దలకు, వృద్ధులకుగూడ నాయనను జూచుసరికి పేరునకు తగినట్లు పితృభావము స్ఫురించి, బిడ్డలవలె శరణుపొందుటకు చిత్తము ప్రేరేపించుట యా మూర్తి విశేషము. అందుల కనుగుణముగా నాయన చూపునందేగాక, యావత్తు ముఖ వికాసమునందు వెల్లువలైనట్లు వాత్సల్యానుకంపము లవ్యాజముగా నుట్టిపడు చుండెడివి. ఇక కంఠము విప్పినచో ఘంటానాదము ధ్వనించి, సత్యప్రకర్షతో గూడి యధికారయుతమైనను మధురరసపూరితములగు మాటలు వెడలి హృదయ సమావర్జన మొనర్చు చుండెడివి. ఆ యోజస్సునందు గౌరవముతోపాటు చనువుపుట్టించు విశేషముండెడిది. చిఱునవ్వు మాటిమాటికి వెల్లివిరిసి, కలకలధ్వనులతో గిలిగింతలు పెట్టుచున్నట్లుండి, సంతోషమును వ్యాప్తిజేయు చుండెడిది. ఇతరు లేవిషయము

చెప్పినను శాంతముగా విని, వారి సొంత ఘోష యైనచో వారి చిత్తవృత్తితో నైక్యమై, దాని కుపశాంతినిచ్చు ప్రజ్ఞ సహజమై యుండెడిది. అట్లే చర్చలం దాధ్యాత్మిక విషయములందేకాక, సాంఘిక, రాజకీయ, దేశవ్యవహారములందును సమానమైన యుత్సాహమును నాయన జూపుచు, తా నాధ్యాత్మిక ఋషియో, రాజకీయ ఋషియో తెలియనిరీతి నితరులకు కన్పించువారు. నిజమున కా ముఖమందు యోగసిద్ధులకుండు తేజస్సుతో పాటు శాస్త్రజ్ఞులకుండు ప్రౌఢత, రాజకీయవేత్తలకుండు చతురత ప్రతిఫలించుచు, సర్వతోముఖప్రజ్ఞను ప్రతిబింబింపజేయుచుండుటవలన నాయనను 'నవయుగ యోగి చక్రవర్తి'గా నెంచవచ్చును.

అట్టి దివ్యజ్యోతిస్స్వరూప మేది ఢుంఠిగణపతినుండి మూర్తిభవించిన ట్లెంచబడెనో, ఆ విఘ్నేశ్వర తత్త్వమునకు నాయనయొక్క శ్రాద్ధకర్మఫలమును కైంకర్యము గావించు నుద్దేశముతో మహాదేవము పితృకర్మ నాచరించుటకు కాశికేగెను. అట్లే మఱుసటి సంవత్సరమున నాయన యొక్క సాంవత్సరిక శ్రాద్ధకర్మఫలమును భగవంతుడైన శ్రీ రమణున కంకితము గావింపదలచి, యతడు 1937 జూన్ నెలలో తిరువణ్ణామలై వెళ్లెను. నాయనవెంట తపోయాత్రలందు శివరామశాస్త్రి వెళ్ళినట్లే యీ యాత్రయందు మహాదేవమునకు సహాయభూతుడై శివరామశాస్త్రి పుత్రుడైన నరసింహశాస్త్రి వెళ్లి తన తండ్రి పుణ్యమును బంచుకొనెను. వీరు వెళ్లినట్లు తెలియకున్నను దివ్యప్రేరణము పొందినట్లు వారు తిరువణ్ణామలై చేరిన వారములోనే నా భార్యతోగూడి నేను శ్రీ మహర్షి దర్శనము గావించుకొనుటకై తిరువణ్ణామలై వెళ్ళితిని. నాయన బ్రతికియున్నచో మేమీ యాత్ర నాయనతో గూడి చేసి, మహర్షి ముఖము నుండి హృదయ విద్యోపదేశ మనుగ్రహయుక్తముగా పొందియుండెడివారముగదా యని దారి పొడవునను నాకనిపించినది. నా దురదృష్టము నా కదివఱకు నాయన స్వప్నదర్శన మిచ్చినప్పటి దురదృష్టమునకు పరిపోయియున్నట్లు నేను లోలోన దుఃఖించితిని. కాని, నా కక్కడ చేరిన పిదప ప్రాప్తించిన రమణానుగ్రహ విశేషములనుబట్టి నాయన వాక్కు వరము వంటిదని గ్రహించితిని. ఆ విశేషముల నిక్కడ రమణ గణపతుల పరస్పర సంబంధమును, నొకరి వాక్కింకొకరు చెల్లించు పరస్పర బాధ్యతను నిరూపించుటకు మాత్రము పేర్కొందును. దీనినిబట్టి నాయన నాశ్రయించి కృపబడయని వారికి మహర్షి యనుగ్రహప్రాప్తియు దుర్లభమని విశదము కావచ్చును.

మే ముదయము పదిగంటల కాశ్రమము చేరితిమి. సుమా రొకటిన్నర మాసము లుండదలచి నే నాశ్రమమందొక ప్రత్యేక బస నర్థించగా, నిరంజనానంద స్వామి మా కొక తడకల గదిని ప్రత్యేకముగా నిచ్చి మా యందు తొలి హెచ్చరికను

కల్పించెను. పిమ్మట మేము స్నానమాచరించుకొని భగవానుని దర్శించుకొని, యా మూర్తియందు నాయనయందు కంటెను హెచ్చైన దివ్యత్వమున కాశ్చర్యపోయి, రెండు నిముసములు ముగ్ధులమైయుండగా భోజనమునకు గంట కొట్టబడెను. వెంటనే మహర్షియు, హాలులోనివారును లేచిరి. మహర్షి వెంట భోజనశాలకు వెళ్ళి మేము భుజించిన పిదప మహర్షి దినచర్యను పరికించవలెనను కుతూహలము మాకు జనించి మహర్షి యెక్కడికి వెళ్ళిన నక్కడకు వెళ్ళి స్వయముగా గ్రహింప నిశ్చయించితిమి. అందువలన భోజనమైన వెంటనే యల్పాచమన నివృత్తికి మహర్షి గోశాల వెనుకకు వెళ్లుచుండగా మేముకూడ గోశాలవఱకు వెంబడించి, మహర్షి యటు వెళ్లుటకు కారణము నప్పుడు గ్రహించుకొని, కాలకీవల దూరముగా నిలబడితిమి. అంతవఱకు మేము హాలు లోనికి వెళ్ళినది లగాయతు మమ్ములను కన్నెత్తియైన చూడలేదను నుదాసీనత మమ్ములముకొని యున్నందున మహర్షి దృష్టి నాకర్షించుటకు మేము మార్గ మధ్య మున నిలబడితిమి. కాని, మహర్షి మఱలి వచ్చునప్పుడు ప్రక్కకు మళ్లి, గోశాల యరుగెక్కి, దానిపైనున్న గదిలో నెవరితోడనో మాట్లాడుటకనినట్లు (ఈ గదియం దిప్పుడాశ్రమ పోస్టాఫీసున్నది) గదిద్వారము కడ నిలబడెను. మేమూ యరుగెక్కి, గదిలోని మహానుభావు డెవడైయుండునని తొంగిచూచితిమి. అతడు మహాదేవము. నన్నతడు, నే నతనిని చూచిన సంతోషమున నుభయులము మధ్యనున్న మహర్షి నొక్క క్షణము విస్మరించి, బిగ్గరగా పలుకరించుకొంటిమి. ఆ క్షణమందే మహర్షి మెట్లు దిగి వెళ్లిపోయెను. మమ్ముల నా విధముగా కలుపుటకే మహర్షి యరుగెక్కి యుండునని మేము విమర్శించుకొని. మహర్షి యనుగ్రహ పద్ధతియం దట్టహాసము, ఆర్భాటము కొపజేయని యొకానొక నిరాడంబరత్వ ముండుట గ్రహించితిమి. అంతయు క్రొత్తగానున్న మాకు మహాదేవము సంధాన మనుగ్రహముగా తోచెను.

కొంతసేపు మేము మహాదేవము గదిలో కూర్చుండి సంభాషించిన పిదప మే మతనిని ముందిడుకొని మహర్షి సన్నిధికి వచ్చి, మహాదేవముతోపాటు ధైర్యముగా మహర్షిగారి సోఫాప్రక్క నొక గజము దూరములో కూర్చుంటిమి. సోఫావెనుకనున్న కిటికీక్రింద నరసింహశాస్త్రి యంతకుపూర్వమే స్థలము కల్పించుకొని, మహర్షి యొద్దనున్న 'ఉమాసహస్ర' ప్రతి నడిగి కాపీచేయుచుండెను. అతనికి, మాకు మధ్యనొక యడుగుదూరమే యుండెను. రెండు, మూడు నిముసములైన పిదప మహర్షి నెమ్మదిగా మా ప్రక్కకు తిరిగి కూర్చుండి, నరసింహము నుద్దేశించి 'యెంతవఱకు వ్రాసితి'వని ప్రశ్నించెను. 96వ శ్లోకము ముగించి, 97వ శ్లోకము వ్రాయుచున్నట్లతడు బదులుపల్కెను. శ్లోకసంఖ్య చెప్పబడుటకు మహర్షి నవ్వుకొని,

యీ రెండు శ్లోకములను, 98వ శ్లోకమునుకూడ చదువగోరెను. అప్పుడా శ్లోకము లిట్లు చదువబడెను:

శ్లో॥ "చిత్తమణీయో విత్తం య
ఇదం మూల్యే ప్రపంచతో ప్యధికం।
హృదయ గుహాయాం నిహితం
జానీ తే స విజహాతి బహిరాశా॥" 96

(ఎవడీ చిత్తముయొక్క విలువ ప్రపంచముకంటె నధికమనియు, మిగుల గుప్తమై యది హృద్గుహయందు దాచబడిన విత్తమనియు తెలియునో, వాడు బాహ్యాశలనుండి విడువబడిన వాడగును).

శ్లో॥ "అప్రాప్త మూర్ధానం హృదయాత్
సంప్రస్థితా ధృతా నాడ్యా।
త్వద్రుచిరుక్తా బుద్ధి స్త్వయి నిష్ఠా
భవతి దేవి! తన్నిష్ఠా॥" 97

(ఓ దేవీ! హృదయమునుండి వెడలి, శిరస్సు నింకను బొందక, అమృతానాడిచే ధరింపబడు నీ కాంతిని బుద్ధి యను పేరుతో వచింతురు. అట్టి బుద్ధియందు నిష్ఠయే నీయందు నిష్ఠయగును).

శ్లో॥ "అన్నమ యాణుం ప్రాప్తం ధీ
జ్యోతి శ్చంద్రమార్క మివతేజః।
పరిభాష్యతే మహేశ్వరి
మన ఇతి సంకల్ప సంభవస్థానం॥" 98

(ఓ మహేశ్వరి! సూర్యుని తేజస్సు చంద్రునినుండి ప్రతిఫలించు కళ యెట్లగునో, అట్లే అన్నమయాణువును శిరస్సునందు బొంది ప్రతిఫలించు బుద్ధి జ్యోతిని సంకల్ప సంభవస్థానమగు మనస్సుని పరిభాషచే పిలుచుచున్నారు).

ఆ శ్లోకములను విని, చురుకుగా వ్రాయబడుచున్నందుకు నరసింహశాస్త్రిని మహర్షి హెచ్చరించి 'యర్థమును గ్రహించుచుంటివా' యని మరల ప్రశ్నించెను. అతడు 'స్థూలార్థము తెలియుచున్నది. తత్త్వార్థము నాకెట్లు తెలియు'ననెను. వెంటనే మహర్షి 'యేమి? ప్రతి శ్లోకమందును రెండర్థములున్నవనియా నీ భావము? తత్త్వ మెంత గంభీరమైనను, సరళమైన భాషచే బోధించుట నాయన ప్రజ్ఞగదా! నీవు 'విద్వాన్' పరీక్ష చదివియు బోధపడదందువేమి' యని హాస్యవచనమును బల్కిన పిదప నెమ్మదిగా నిట్లువన్యసించెను: "చిత్తముయొక్క విలువను మొదటి శ్లోకమందు ప్రస్తుతించిన

తరువాత నాయన తన సాధనానుభవమును వివరించిరి. హృదయమునుండి శిరస్సును బొందు రశ్మి యింద్రియ సంపర్కముచే విషయగతమగుచున్నను, సంపర్కమును సడలించుకొని నిరుపాధి విమర్శ సాధించువారికా రశ్మిశిఖ విదితమగునని భావము. సాధనబలముచే నిర్విషయత్వము స్థిరము కాగా, రశ్మిని సాధించువారికి, రశ్మి మూలమందు నిష్ఠ పొందువారికి ననుభవమందు శక్తీశ్వర తత్త్వముల గుఱించి ప్రసంగించు వ్యత్యాసము బాహ్యమునకు తోచినను, సిద్ధి యుభయులకు సమానమేయని చెప్పక తప్పదు. ఈ రశ్మి తన మూలమైన హృదయముకంటే భిన్నముకాదు. చిత్తమను నాకాశవస్తువు బహు సూక్ష్మము. దీనిని కోశముగా పొంది, దానితోపాటు శిరస్సువఱకు వ్యాపించునది రశ్మి యనబడును. ఆ చిత్తాకాశమును బొందని స్థితి యొకటి యున్నట్లు తెలియుటలేదా ? ఆ స్థితివఱకు నిర్విషయము సాధింపదగినదే. అప్పుడు కోశస్థితి పోగా, రశ్మిభావము పోవును. మిగులునది చిన్మయస్థితియే. అదియే చిదాకాశమై, హృదయమగుచున్నది. సృష్టి కాశ్రయమైన యీ హృదయమే సర్వకారణములకు ప్రబోధ చైతన్యమునిచ్చు కర్త. కావున నిది విశ్వమునకు మూలమైనట్లే శరీరమునకును మూలమగును. అత్యంత సూక్ష్మమై, యంతటను నిండియున్న హృదయమందీ విశ్వము, శరీరము మొదలగునవి యున్నట్లు చెప్పవలెనుగాని, దీనిని పరిమితమొనర్చి శరీరమందొకచో నున్నట్లు వచింపరాదు. అట్లయినను, శరీరమందు వ్యాపారస్ఫూర్తి యెక్కడ పుట్టుచున్నదో, ఆ స్థలము హృదయ స్థలమని నిర్దేశించక తప్పదు. అది యనుభవమందు తెలియబడవలసినదైనను, రొమ్మునకు దక్షిణ భాగమం దదిగో, అక్కడే..." యని దాని నిర్దేశస్థలము స్ఫురించుటకు నా వైపు దృష్టి నొకసారి హఠాత్తుగా పరపి, మహర్షి యటుప్రక్కకు తిరిగెను.

అంతవఱకు ప్రసంగధోరణియందైన నా వైపు చూడక, తుదివాక్యములలో 'అక్కడే' యని వచించునప్పు డొక్కసారి నా వైపు హఠాత్తుగా పరపిన యా దృష్టిప్రసార మనుగ్రహ లక్షణముతో గూడియుండెను గాబోలు నాయందొక మెఱుపు మెఱసిన ట్లనుభవమై, శరీరమంతయు కంపించి చెమట గ్రమ్మకొచ్చెను. నన్నితరులు చుల్కనగా జూతురను సిగ్గుచే నేను హాలునుండి యీవలకు వచ్చి, మహర్షికి మాత్రము నే నగపడునట్లు వరండాలో కూర్చుండి కన్నులు మూసి కొంటిని. వెంటనే కంపము పోయి నన్నొక సుఖ మావహించెను. కొద్ది క్షణములైన పిదప నే నొక ప్రబోధమును బొంది హాలులోనికి వెళ్ళి, రమణ భగవానునకు కృతజ్ఞతాపూర్వకముగా సాష్టాంగప్రణామము సల్పిన పిదప 'భగవాన్! మీ దర్శనము గావించుకొని పొందనలవిగాని సంతోషము పొందితిని. ఈ దివ్యక్షేత్రమందు క్షేత్రవిధిని దీర్చుకొనుటకు మేమేమి చేయవలెనో ఆజ్ఞాపింప వేడుదు'నని నే నడిగినంతనే దయాళుడైన రమణ భగవానుడు మందస్మితవదనుడై

'గిరిప్రదక్షిణ మిక్కడి విధి. ఈ నరసింహమును తోడు తీసికొనిపోయి రండు. ఇప్పుడొంటిగంట దాటినది. రెండుగంటలకు బయలుదేరినచో నప్పటి కెండ వాలి శిరస్సునకు బాధ కల్గజేయదు. ఏమిరా! నరసింహా! నీ వప్పుడే పండాపైతివి కదూ! వీరితో వెళ్ళి వీరికి నాయన తపస్థులము మొదలగునవి చూపు'మని మాతోపా టతనిని యాజ్ఞాపించెను.

మేము సిద్ధమగుటకు మహాదేవ నరసింహములతో గూడి వెలుపలకు వచ్చితిమి. మా బసలోనికి మేము, వారి బసవైపునకు వారు వెళ్లుచుండగా ''నేనాశ్రమమునుండి 'టీ' తెప్పించి యుంచెదను, చప్పున రం''డని మహాదేవము మమ్ము హెచ్చరించెను. 'సరే' యని మేము చప్పున తెమలి ధనము తీసికొని, మహాదేవమున్న బసకు తొందరగా బోవుచుండగా, దారిలో నా భార్యకు హఠాత్తుగా నొక పాదము యొక్క గుత్తి బిగబెట్టి, ముందడుగు వేయనిచ్చినది కాదు. అంతకు పూర్వమామె కొక పాదము విరచి యింకొక పాదముగా నాలుగుమాసములనుండి మూడురోజుల కొకసారి బిగబెట్టుచు, నొక్కదినముమాత్రముండి, వచ్చినట్లే హఠాత్తుగా మాయమగుచుండెను. చికిత్సలవలన బాధ యెడమిచ్చుచుండెనుగాని తగ్గలేదు. స్థలము మార్పును వైద్యుడు సలహా యిచ్చిన కారణముగా మేము తిరువణ్ణామలై వచ్చితిమి. అప్పుడు బాధ వచ్చుటచే మా యుత్సాహమంతయు భంగమయ్యెను. కాని, రమణుని యాజ్ఞ మన్నించుట కామెను బండిపై ప్రదక్షిణమునకు తీసికొనివెళ్ళ నిశ్చయించి, నెమ్మదిగా నేనామెను. రెక్కసహాయమిచ్చి, మహాదేవముయొక్క గదిలో చేర్చితిని. అక్కడ మేము 'టీ' త్రాగి మాట్లాడుకొనుచుండగా, ఆ దిక్కున కల్పాచమనమునకు వచ్చిన మహర్షి మా కడకు వచ్చెను. నేను నా భార్యను లేవదీసి, యామెతో వెలుపలకు వచ్చునంతలో మహర్షి మా యాలస్యమును ప్రశ్నించుటయు, జట్కాబండిపై వెళ్లదలచి కొంచెముసేపు కూర్చుంటిమని నేను చెప్పుటయు సంభవించెను. నా మాట వినినతోడనే మహర్షి 'బండిపై గిరిప్రదక్షిణమా? ఏమి వచ్చిన'దని ప్రశ్నించెను. నేను కారణము చెప్పుసరికి నా భార్య తలుపు, గోడ సహాయమున ముందునకు వచ్చి ''బండిపై వెళ్లను, భగవాన్! క్షమింపుడు. నడువలేకున్న దేకుచునైన వెళ్లి వచ్చెద''నని మహర్షికి విన్నవించుకొనెను. నేను సిగ్గుచెంది తడబడుచుండగా మహర్షి యామె నెగాదిగా చూచి యనుగ్రహించిన పిదప 'నడచియే వెళ్లవలెనమ్మా, ఆలస్యముచేయక పోయిరం'డని పల్కి మెట్లు దిగెను. అది యనుగ్రహదృష్టి యని నేను గ్రహించి ధైర్యముచెంది, మహర్షి పాదములను స్పృశించవలెనను వాంఛ హాలులో తీరనందున నిక్కడ తీర్చుకొనుట కరుగు గెంతి, మహర్షి కెదురుగా వచ్చి, పాదములంటి నమస్కరించితిని. నేను లేచుసరికి నా భార్య మ్రొక్కుచుండుట జూచి, యామె బాధ మాయమైనట్లు గ్రహించితిని. పిదప మేము మహర్షి వెనుక కొంతదూరము నడచి, యనుజ్ఞవడసి రోడ్డెక్కితిమి.

నరసింహము మమ్ము కలసెను. మా సహాయ మపేక్షించి యింకొక స్త్రీ కూడ మమ్ములను కలియగా నామెతో నుబుసులాడుచు నా భార్య చకచక నడుచుచు మా వెంట వచ్చెను.

రోడ్డెక్కి రెండడుగులు నడిచితినో లేదో నాకొక గజము దూరమున ముందుగా మహర్షి నడచుచు, మాచే స్వయముగా గిరిప్రదక్షిణము చేయించు చున్నట్లు నా నేత్రములకు గోచరించెను. కొంత తిరిగి పెద్దకోవెలకు మఱలివచ్చు వఱకు నాకీ దృశ్యమట్లే యుండి, నేను తొందరగా నడచినను, నెమ్మదిగా నడచినను నొకే దూరమున గోచరించెను. అదియు ననుగ్రహమే యని నేను గ్రహించుకొని, దారిపొడవునను నా చిత్తముతో ఆ దివ్యపాదపద్మములను సేవించుకొంటిని. మే మాశ్రమము చేరుచుండగా రాత్రిభోజనమునకు గంటకొట్టిరి. రోడ్డుపై నున్న కుళాయియొద్ద నేను, నా భార్యమాత్రము కాళ్లుచేతులు కడుగుకొని భోజనశాలకు చప్పున వెళ్లితిమి. అప్పటికి వడ్డన పూర్తియైనది. మమ్ములను చూచి మహర్షి 'అరుగో, వారును వచ్చి'రని మాకొఱకు వేచియున్నట్లనెను. నేనా విస్తళ్ల మధ్యనుండియే భక్తివశమున సాష్టాంగపడితిని. ఎచ్చెమ్మాళ్ అడ్డు చెప్పినను లెక్కసేయక నా భార్య మహర్షికి ప్రదక్షిణము సల్పగా మహర్షి యామెతో 'ఏమమ్మా! కొండకంతకు ప్రదక్షిణము సల్పితివి, చాలదా? నాకుకూడ చేయవలెనా' అనెను. ఆమె భగవానుని యమోఘానుగ్రహమువల్లనే యా నాడు ప్రదక్షిణము చేయగల్గినందున హృదయము మహర్షి యందు భక్తిసంభరితమై, 'మీ కొనర్చిన ప్రదక్షిణమునకు విశ్వప్రదక్షిణముకూడ సాటి కాజాల'దని బదులిడి, సారవంతమైన ఆ వాక్యముచే మహర్షికి ముదమును, ఇతరులకు త్రుళ్లిపాటును గలిగించినదయ్యెను.

ఈ రీతిగా నాయన మా కొనర్చిన వాగ్దానములు మించి ఫలించుటకు మా చిత్తము లుప్పొంగెను. శ్రీ రమణుడా వాగ్దానముల నెఱిగినవానివలె తీర్చుటనుబట్టి రమణ గణపతుల దివ్యసంబంధము గురుశిష్య న్యాయమునకు, సోదరన్యాయమునకు గూడ మించి, తేజమునకు, నుష్ణమునకు గల యన్యోన్యత వంటిదని మాకు స్ఫురించెను. నాయన చరిత్రమునకు చెందిన నా యింకొక కోర్కెయు నిట్లే సఫలమగుటకు శ్రీ మహర్షి యనుగ్రహించినచో బాగుండునని నేనా సంతోషమున దలచితిని. దానికొఱ కప్పుడే మహర్షి యొక మార్గమును సంకల్పించినట్లు నాకా మఱునాటికిగాని తెలిసినదికాదు. మహర్షి తనకడనున్న నాయన చరిత్ర సంబంధమగు నోట్సును తెనిగించుటకై మహాదేవమున కతడు తిరువణ్ణామలై చేరిననాడే యిచ్చెను. తొలినాడే మూడధ్యాయముల నతడు తెనిగించగల్గుటకు మహర్షి సంతసించి, తరువాత యెంతవఱకు ముగించెనో విన కుతూహలము పుట్టినట్లు మేము వెళ్లిన మఱునాడతనిని ప్రశ్నించెను. అప్పుడత డిట్లు చెప్పెను: "ఈ నోట్సు నింటికి పట్టుకొనివెళ్ళి, తెనుగున చరిత్రము

విపులముగా వ్రాయవలెననియున్నది. అందువలన నోట్సుగా తెనిగించుటేలయని యాపుచేసితిని'' తనయొద్దనున్న కాగితములనుగాని, పుస్తకములనుగాని యితరు లాశ్రమము దాటించి పట్టుకొని వెళ్ళుటకే యిష్టపడని మహర్షి కా మాటలు రుచించినవి కావు. కనుక ''అది మఱెప్పుడు చేయవచ్చునులే. ఇప్పటికా నోట్సు నిచ్చివేయుము. దానికొక ప్రతియైన నాయొద్ద లే''దని సాదరముగానే మహర్షి పల్కి, నోట్సు తీసికొనెను. తీసికొనిన వెంటనే శ్రీ మహర్షి నావైపు తిరిగి ''వజ్రమ్మ యిందలి విషయముల నన్నింటిని వ్రాసికొనినట్లు జ్ఞాపకము. ఆమెనడిగి నీవు వ్రాసుకో. ఆమె యీ విషయములను విపులముగా చెప్పగలదు. 'అప్పు' నడిగితే మఱికొన్ని లభించగలవు. ఇట్లే నలుమూలలనుండి సేకరించినప్పుడు చరిత్రను కూర్చవచ్చు''నని నాతో చెప్పి, మఱల యటు తిరిగి పోవునప్పు డొక వింతగొల్పు దృష్టిప్రసారమును నాపై పరపెను. ఆ మాటల వెనుకనున్న భావము 'నీవే నాయన చరిత్రను వ్రాయు' మనినట్లు నా కా దృష్టియం దవగతమయ్యెను.

అప్పుడు నేనింకొక సందేహము తీర్చుకొనుటకు నాయనచే ప్రణీతమై చెదరియున్న గ్రంథము లెప్పటికైనా ముద్రణ భాగ్యము పొందునాయని యడిగితిని ''సమయము రావలెను. అది వచ్చినప్పు డన్నియు సిద్ధించు'' నని మహర్షి పల్కి, నా సందేహమును నివారించెను.*

ఈ చరిత్ర రచనకు నే నసమర్థురాలనైనను, శ్రీ రమణానుగ్రహమే నాకు బలమై, నన్నీ కార్యమందు కృతార్థురాలనర్చునని నేను విశ్వసించితిని. నా విశ్వాసముకొలది శ్రీవారి ప్రేరణానుగ్రహములే క్రమాభివృద్ధిగా పెరిగి, యీ గ్రంథరూపమును దాల్చెను. ఇది ప్రాప్తించుటకు దీర్ఘకాలము పట్టినను, ఆంధ్ర మహాపురుషుల చరిత్రలోని లోపమును బూరించుట కిదియొక యపూర్వ ఘట్టము కాగలదు. కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిమునుల దివ్యానుభూతు లాకల్పాంతస్థాయులుగదా !

నాయనచే ప్రణీతమైన నొక జయవాచక శ్లోకము చేతనే మనము వారి దివ్యచరిత్ర వింక ముగింతముగాక !

శ్లో॥ ''జయతు భరతక్షోణీఖండం విషాద వివర్జితం।
జయతు గణప స్తస్యక్షేమం విధాతుమనా మునిః।
జయతు రమణ స్తస్యాచార్యో మహర్షి కులాచలః।
జయతు చ తయోర్మాతా పూతా మహేశవిలాసినీ॥''

శ్రీ గణపతి రమణ దివ్యచరణార్పణమస్తు.

సంపూర్ణము.

---

* ఈ రచనలు నాకు పిదప లభ్యమై, నాచే ప్రత్యేక ప్రకాశనము పొందెను (అనుబంధము (IV) చూడుడు).

## అనుబంధము I

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవ సంచిక
(1928వ సం॥) నుండి - కావ్యకంఠ శ్రీ వాసిష్ఠ గణపతిముని
1927వ సం॥ ఫిబ్రవరి 16, 17, 18 తేదీలలో జరుపబడిన
రజతోత్సవ సందర్భములో నొసగిన
యధ్యక్షోపన్యాసము.

''సోదర సోదరీమణులారా !

ఈ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ రజతోత్సవ సందర్భమున నా కధ్యక్షపీఠమునిచ్చి గౌరవించినందులకు నిలయమువారికి నే నెంతయు కృతజ్ఞుడను. ఇట్టి స్థానము నుండి నా దేశీయ సోదరుల యెదుట మాటలాడుట కవకాశము లభించుటచే ఈ దినమును నా భాగ్యదినములలో నొకటిగా నెన్ను కొనెదను. విస్తృతోపోద్ఘాతములచే సభ్యుల కాలమును వ్యర్థపుచ్చను. శీఘ్రముగా నేను చెప్పదలంచిన విషయమునకు వచ్చుచున్నాను.

భాషానిలయ ప్రయోజనము :

కొలది గ్రంథముల పఠనముచేతనే భాషయందు వ్యుత్పత్తి సిద్ధించినను, అంతమాత్రమున విజ్ఞానము విస్తరిల్లజాలదు. విజ్ఞానాభివృద్ధికి రెండు మార్గములు గలవు. మొదటిది బహుగ్రంథావలోకనము. రెండవది వృద్ధసేవ. వృద్ధులనగా నిచ్చట విద్యావృద్ధులుగాని కేవల పలిత శిరస్కులు గారు. పుస్తకాలయములు స్థావర గ్రంథాలయములనియు, విద్యావృద్ధులు జంగమ గ్రంథాలయము లనియును జెప్పవచ్చును. స్థావర గ్రంథాలయములందు భగవతి యగు మహాసరస్వతియొక్క యాధిభౌతిక స్వరూపమును, జంగమ గ్రంథాలయము లందు అధ్యాత్మిక స్వరూపమును వ్యక్తమగుచుండును. కనుక గ్రంథాలయములు సరస్వతీ దేవాలయములనియే నా యభిప్రాయము. సరస్వతి యొక్క యాధిభౌతిక స్వరూపమునుగాని, యాధ్యాత్మిక స్వరూపమునుగాని శ్రద్ధతో భజించిన నామె తప్పక యనుగ్రహించును. ఇప్పుడు పుస్తకాలయ ప్రయోజనము మీకు బోధపడియుండును. దక్షిణ దేశములోని దేవాలయములందు నాటకోటసేట్లు ఖర్చుపెట్టు డబ్బులో పదియవ వంతైనను ఈ సరస్వతీ దేవాలయమునకు వ్యయపఱుపబడినయెడల ఫల మచ్చటికంటె నిచ్చట కోటి గుణముగా నుండుననుటలో నాకు సంశయ మావంతయైనను లేదు.

ఆరాధన ప్రకారము :

సరస్వతియొక్క యాధిభౌతిక స్వరూపారాధనమే మనకిప్పుడు ప్రకృతము కనుక దానిని గుఱించి మఱికొన్ని మాటలు చెప్పదలచియున్నాను. ఇచ్చట ఆరాధించుట యనగా నుపాసనము. ఏకాగ్రతతో మననము సేయుటయే యుపాసనము. పాఠకు డే పుస్తకమును జదివినను సవిమర్శముగా చదువుట యందే యీ సరస్వత్యుపాసనము సిద్ధించుచున్నది. విమర్శనాదృష్టి లేనివాని కేకాగ్రమనన ముండజాలదు. రాజయోగమునందుగూడ విమర్శనాదృష్టియే యేకాగ్ర మననబీజమైయున్నది. ''ఈ నా దృష్టికి మూలమేది'' అని యన్వేషించుటయేగదా రాజయోగముయొక్క ప్రథమ సూత్రము.

"అంతర్యశ్చ ముముక్షు భిర్నియమిత
ప్రాణాది భిర్మృగ్యతే." - కాళిదాసు

(ఏ పరమేశ్వరుడు ముముక్షువులగు ప్రాణాదులను నిగ్రహించినవారిచే, లేదా ప్రాణాదులను నిగ్రహించిన ముముక్షువులచే లోపల అన్వేషింపబడు చున్నాడో అని దీని యర్థము).

"అభ్యాస నిగృహీతేన మనసా హృదయాశ్రయం
జ్యోతిర్మయం విచిన్వంతి యోగినస్త్వాం విముక్తయే." - కాళిదాసు

(ఇది దేవతాకృతి విష్ణుస్తుతి-యోగులు అభ్యాసముచే నిగ్రహింపబడిన మనస్సుచే హృదయాశ్రయుడును, జ్యోతిర్మయుడును అగు నిన్ను ముక్తికొఱకు అన్వేషించుచున్నారు అని దీని యర్థము).

రాజయోగములో అన్వేషణాపర పర్యాయమగు విమర్శయొక్క ప్రాధాన్య మును మహాకవి యెట్లు గుర్తించియున్నాడో చూడుడు.

"విమర్శ రూపిణీ విద్యా" - లలితా సహస్రనామము.
(మహాశక్తి సాక్షాత్ విమర్శరూపిణి) యని యిచ్చట చెప్పబడినది.

హఠయోగ, రాజయోగ, భక్తియోగ, కర్మయోగాదులవలె చదువుటకూడ నొక యోగమే. దీనిని పెద్దలు స్వాధ్యాయయోగమని చెప్పుదురు. యోగ యుక్తముగాని కర్మ యెట్లు చిత్తశుద్ధికి హేతువు కాజాలదో, అట్లే యోగయుక్తము గాని స్వాధ్యాయము విజ్ఞానాభివృద్ధికి తోడ్పడజాలదు. కర్మకు యోగయుక్తత్వము ఫలాపేక్షారాహిత్యము. స్వాధ్యాయమునకు యోగయుక్తత్వము సవిమర్శత్వము. గ్రంథము నవలోకించు ప్రతివాడును ఈ సూత్రమును గమనింపవలయును.

**స్వాధ్యాయ నిత్యత్వము :**

విద్యార్థిదశలోనేకాక, జీవిత కాలమునందంతటనుగూడ మన పెద్దలు స్వాధ్యాయనిత్యులై యుండిరనుట కనేక నిదర్శనములున్నవి.

"తపస్స్వాధ్యాయ నిరతం
తపస్వీ వాగ్విదాం వరం" - రామాయణము

దీనివలన నారదుని స్వాధ్యాయనిత్యత్వము విశదమగుచున్నది. తపస్స్వాధ్యాయములనుండి ప్రమాదమును పొందగూడదని వేదముకూడ బోధించు చున్నది. ధర్మములను బోధించునపుడు వేదము - "తపశ్చస్వాధ్యాయ ప్రవచనేచ, దమశ్చస్వాధ్యాయ ప్రవచనేచ, శమశ్చ స్వాధ్యాయ ప్రవచనేచ" - ఇత్యాది వాక్యములచే ప్రతి ధర్మముతోను స్వాధ్యాయ ప్రవచనములను జేర్చి చెప్పుటచేత

వీటి ప్రాధాన్యము మఱింత స్పష్టమగుచున్నది. స్వాధ్యాయమనగా చదువుట, ప్రవచనమనగా నింకొకరికి చెప్పుట. ముఖ్య ధర్మచర్చలో గూడ వేదమునందు మూడు మతములు కీర్తింపబడినవి.

"సత్య మితి సత్యవచా రాథీతరః
తప ఇతి తపోనిత్యః పౌరుశిష్టిః
స్వాధ్యాయ ప్రవచనే ఏవేతి
నాకో మౌద్గల్యః"

(రథీతర పుత్రుడగు సత్యవచస్సు అనెడి మహర్షి సత్యము గొప్పదియనెను. పురుశిష్ట పుత్రుడగు తపోనిత్యుడను మహర్షి తపస్సు ఘనమనెను. ముద్గల పుత్రుడగు నాకుడను మహర్షి స్వాధ్యాయ ప్రవచనములే గొప్పవనెను).

స్వాధ్యాయ ప్రవచనములను ధర్మకోటిలో జేర్చి నిత్యములనగా వేదము విధించినట్లు దీనివలన మనము తెలిసికొనుచున్నాము. పతంజలి కూడ యోగ సూత్రములలో క్రియాయోగ ధర్మపట్టికలో స్వాధ్యాయమును విశదపరచినాడు. స్వాధ్యాయ శబ్దము వేదాధ్యయనమునందే రూఢియైయున్నను, సాంగోపాంగ వేదాధ్యయనమే వివక్షితమైనందున వేదానుకూలమగు సకల వాఙ్మయము సంగ్రహింపబడును. వేద ప్రతికూలమగు వాఙ్మయముగూడ పూర్వపక్ష స్థానీయ ముగా మనము పఠింపదగినదే యగును.

**ప్రామాణిక బుద్ధి – విమర్శనము:**

ప్రామాణిక బుద్ధి, విమర్శనము – ఈ రెండు పరస్పర విరుద్ధములు. ఎవనియందు మనకు ప్రామాణిక బుద్ధి యుత్పన్నమగునో, అతని గ్రంథములను మనము విమర్శింపజాలము. అతని గ్రంథములను విమర్శించుట మనకొక విధమగు అవినయముగా తోచును. సాధారణముగా మనవారు ప్రాచీనులయందు భక్తిగలవారు. భక్త్యుద్రేకముచేతనే వీరికి ప్రాచీనులయందు ప్రామాణిక బుద్ధి కలుగుచున్నది. కనుక వీరు ప్రాచీనుల గ్రంథములను చదివి యథాశ్రుతముగా గ్రహింతురేగాని కొంచెమైనను విమర్శింప పూనుకొనరు. కనుక మనవారికి ప్రాయికముగా విమర్శనా శక్తి క్షీణించిపోయినది. ఇప్పటి మన పండితులలో ప్రాచీన భక్తులను విస్తారముగా చూచుచున్నామేగాని, విమర్శకుల నధికముగా చూడజాల కున్నారము. ఎవరైన కొలదిమంది ప్రాచీనులను విమర్శింప సాహసించినను, వారు నాస్తికులవలె నిందింపబడుచున్నారు. మన ప్రామాణిక బుద్ధి మితిమీరుట చేతనే మన విమర్శనా శక్తి క్షీణించి మనము భావదాసులమై యున్నాము. వేదములు తప్ప తక్కిన గ్రంథములన్నియు విమర్శకు రంగస్థలములగుటకు తగినవే. వేదములయందు గూడ సత్యమగు తదర్థమును

గ్రహించుటలో మన విమర్శనా శక్తి నుపయోగించుట తప్పుగాదు. ప్రాచీనుల భాష్యగ్రంథములకు మనము భావదాసులము గానక్కరలేదు. ఒక గ్రంథకారుని యందు ప్రామాణిక బుద్ధిని మనము విమర్శనాంతమునందు ఎంతవఱకు స్థిరపఱచుకొనవచ్చునో చూచుకొన వచ్చును. ముందే గ్రంథకారునియందు ప్రామాణిక బుద్ధిని స్థిరపఱచుకొని గ్రంథమును జూడ నారంభించినయెడల విమర్శనమునకు తావే యుండదు. ఈ సంగతిని ప్రతి గ్రంథావలోకియు గమనింపవలెను.

**సంస్కృతము – దేశభాషలు :**

ప్రాయికముగా భరతఖండములోని దేశభాషలు సంస్కృతోపజీవ్యములై యున్నవనుటలో నెవ్వరికిని ఆక్షేపణముండదని నేను నమ్ముచున్నాను. ఒక దేశభాషయందలి పాండిత్యము సంస్కృత భాషయందు పాండిత్యముండినగాని పూర్ణము గాదని చెప్పిన నయ్యది యతిశయోక్తి కానేరదు. అందువలన దేశభాషా గ్రంథ నిలయములలో గూడ సంస్కృత గ్రంథములుండుట యావశ్యకమని నా తలంపు. ఈ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయములో సంస్కృత గ్రంథములుగూడ గలవని వినినపుడు నా సంతోషమునకు మేరలేకపోయినది.

**ఆంధ్రభాష :**

ద్రావిడ భాషలలో ఆంధ్రభాష సంస్కృతభాషతో తన సోదరీలకంటె అధికమగు సంబంధమును సంపాదించుకొని యున్నది. దీర్ఘ సంస్కృత సమాసములు ఆంధ్రభాషలో నిమిడియున్నట్లు ఇతర ద్రావిడ భాషలలోనేకాక యే యుదీచ్య భాషలోగూడ నిమిడియుండలేదు. అందువలన ఆంధ్రభాష మాధుర్యమునేగాక తేజోగుణమునుగూడ చక్కగా ప్రదర్శింపగలుగుచున్నది. అవ్యయములు, సర్వనామములుతప్ప తక్కిన సంస్కృతపదములన్నియు ఆంధ్ర తత్సమరూపములలో కనపట్టుచున్నవి. ఇంత తత్సమ బాహుళ్యము ఏ యితర భారతీయ భాషలోగూడ లేదు. పెద్ద యాంధ్ర నిఘంటువొకటి యుండిన యెడల సంస్కృత నిఘంటువు లేని లోపము పూర్తియగునన్న సంగతి మా కనుభవవేద్యముగానున్నది. సంస్కృతభాషా సంబంధమువలన ముందే సుందరముగా నుండిన యాంధ్రభాషా స్వరూపము మఱింత సుందరమయ్యెను. పాశ్చాత్య దేశభాషలలో ఇటలీ దేశపు భాషవలె భరతఖండ భాషలలో ఆంధ్రభాష మిక్కిలి సుందరమైనదని భాషా తత్త్వవేత్త లంగీకరించియున్నారు. క్రొత్త ఆంధ్ర విశ్వవిద్యాలయము వచ్చినందువలన అనేక శాస్త్రములకు సంబంధించిన సాంకేతిక పదములు సృష్టింపబడుట యావశ్యకమైయున్నది. అట్టి సృష్టి ముగించిన పిమ్మట ఆంధ్రభాష మఱింత శోభించును.

ఈ ఆంధ్రభాషలో నన్నయభట్టుగారికి ముందు కవిత్వమే లేదనిగాని,

యే విధమగు వ్యాకరణముగూడ లేదనిగాని నేను వాదించువాడనుగాను. కాని, నన్నయభట్టుగారి కాలము నుండియే యీ భాష వికసింప నారంభించినదియని చెప్పుటలో నాతో నెవ్వరును వివాదపడరని నా నమ్మకము. ముఖ్యులగు ఆంధ్రభాషాధిభౌతిక దేవతాస్వరూప శిల్పులగు కొందఱు మహాకవులను కీర్తించుట యిచ్చట యప్రస్తుతము కానేరదు. ఆ కవి సంకీర్తనమును ఈ క్రింది ద్విపదలలో పొందుపఱుచుచున్నాను:

దేశి కవిత పద్ధతిం జూపినాడు
నాశ రహిత కీర్తి నన్నయభట్టు. 1
రెండవ వ్యాసుడే ఋషిసన్నిభుండు
పండితమండలీ పతి తిక్కయజ్వ. 2
సూరియలంకర్త సుందరీకాంధ్ర
భారతికి ప్రబంధ పరమేశ్వరుండు. 3
వీరు మువ్వురు భిక్ష పెట్టి రాంధ్రులకు
భారతము తెనుంగు బాస రచించి. 4
భాస్కరాదులు తెన్గు బాసకొసగిరి
భాస్కరకులరాము పావన కథను. 5
రంగనాథ కవీంద్రు రామాయణంబు
బంగరుటందియ భాషారమణికి. 6
భీమన కేతన పినవీరనయును
సోమనాథుండును శూరులాంధ్రమున. 7
ఖ్యాతినురుశ్లోక హరిగాయకంబు
పోతన కృతి యాంధ్రభూమికి తెచ్చె 8
పైనుంచి దారు ప్రబంధరాజముల
శ్రీనాథకవి బాస సేవించె మిగుల. 9
టెంకణాదిత్యు పటీయః ప్రబంధ
మంకిత మాచార్యు వంశ్యులకొప్పు. 10
విష్ణుచిత్తీయము విద్వన్నుతంబు
కృష్ణదేవ నృపతి కృతి చిత్రతమము. 11
ధామజితర్షి పెద్దన్న తిమ్మన్న
రామభద్రుండు ధూర్జటి మల్లనయును 12
సూరనార్యుండు వసుచరిత్రకర్త
దారువాగ్రామ కృష్ణకవీశ్వరుండు 13

ఆంధ్రభూనందను లక్షరవేత్త
లాంధ్రభాషాభూమి కష్టదిక్కరులు. 14
ఇంక ననేకు లహీన భాషితులు
కింకరు లాంధ్ర వాగ్దేవికి గలరు. 15

సుమారు వేయి సంవత్సరములలో నాంధ్రభాష గొప్ప యభివృద్ధిగాంచినది యనియే చెప్పవచ్చును. కాని, యింకను ఎంతయో యభివృద్ధిని పొందవలసి యున్నది. ప్రకృతమునందు ఆంధ్రభారతిని సేవించుచున్న కవులకు నే నొక సూచన చేయుచున్నాను. పద్యగ్రంథములకంటే వచన గ్రంథములను నిర్మించుటయందు వా రెక్కుడు పరిశ్రమను దీసికొనవలెను. సంస్కృతవాఙ్మయము నందలి వేదశాస్త్ర గ్రంథములు వచనములోనికి పరివర్తనము గావలెను. కీ.శే. కె.వి. లక్ష్మణరావుగారి సంపాదకత్వము క్రింద విజ్ఞానచంద్రికా మండలివారు కడపటి విషయములో కొంత కృషి చేసియున్నారు. కాని, తమ నాయకుని నిర్యాణముచే ఆ మండలి యిపుడు మంచము పట్టియున్నది. ఆ మండలికి ద్విగుణీకృతశక్తితో పునరుద్ధరణము కావలెను. అది పునరుద్ధృత మగునపుడు మావంటి గిరిగుహావాసులముగూడ దానికి తోడ్పడగలుగుదుమని సంతోషముతో చెప్పుచున్నాను. పద్యగ్రంథములను మంచి వ్యుత్పన్నులేతప్ప సామాన్యజను లర్థముచేసికొనజాలరు. సులభశైలిగల వచన గ్రంథములే సర్వజనోపయుక్తములై యుండును. ఒక భాషయొక్క ఘనత దానిలోనుండు శాస్త్రగ్రంథములపై నాధారపడియున్నది. తక్కిన సగము గ్రంథములు రసపుష్టిగల వచన కావ్యములుగా నుండవచ్చును.

వచన కావ్యములలో నవలలు ప్రధాన స్థానము నాక్రమింపదగినవి. భాషాంతరీకృతములుగాక స్వతంత్రముగా నాంధ్రకవులచే రచింపబడినను నవలలో నూటికి పదిగూడ మంచివి చిక్కకపోవుట శోచనీయముగా నున్నది. గ్రంథమండలి ప్రభువులు తొందఱ పఱచుచుండుటయు, గ్రంథకారులు వారికి లొంగి శీఘ్రముగా పఱుగెత్తుచుండుటయు ఇందులకు కారణమని యూహింపవలసియున్నది. ఈ సందర్భమునందు భోజరాజుతో నొక కవి చెప్పిన మాటను మీకు జ్ఞాపక పఱచుచున్నాను.

"కావ్యం కరోమి న హి చారుతరం కరోమి
యత్నాత్కరోమి యది చారుతరం కరోమి."

(నేను కావ్యమును చేయుదును. కాని, చక్కని కావ్యమును చేయజాలను. ప్రయత్నమువలన చేయునెడల చక్కని కావ్యమును చేయగలుగుదును) అని దీని యర్థము.

కేవల ధనమునే లక్ష్యముగా నుంచుకొనిన గ్రంథమండలులు బయలు

దేరుటయు, వారికితగిన గ్రంథకారులే దొరకుచుండుటయు ఈ యవస్థకు కారణము. నిదానించి వ్రాయునెడల మన యాంధ్రకవులు మంచి నవలలను వ్రాయగలుగుదురను విశ్వాసము నాకు గలదు.

## గ్రామ్య గ్రాంథిక వాదము :

ఈ సందర్భములో గ్రామ్య గ్రాంథిక వాదమును గుఱించి నాలుగు ముక్కలు చెప్పుట యప్రస్తుతము కానేరదు. కాలవశముచే భాష వివిధ పరిణామములను బొందుచుండునను సిద్ధాంతమును నేనంగీకరించెదను. ఋగ్వేదమునందలి సంస్కృత భాష వేఱు, ప్రకృత సంస్కృత భాష వేఱు. అయినను గ్రంథములను వ్రాయువాడు ఛందోవ్యాకరణాది నియమముల నుల్లంఘించి వ్రాయుట మంచి పద్ధతి గాదు. నియమము అభ్యుదయావహమని పతంజలి చెప్పియున్నాడు. ప్రకృతము శిష్టవ్యవహారములలో నుండిన ఆంధ్ర భాషను గ్రంథకరణోపయుక్తముగా చేయనెంచి గ్రామ్యవాది యెవరైన అట్టి శిష్టవ్యవహార భాషకు పూర్ణమైన వ్యాకరణము నొకదానిని ముందుగా వ్రాయవలెను. పిమ్మట దాని ననుసరించి లక్ష్య గ్రంథములు బయలుదేరుటపై వ్యావహారిక భాషాభివృద్ధి యాధారపడియున్నది. ఎట్టి వ్యాకరణమును వ్రాయక గడబిడ సేయుటచే వారి యుద్దేశము నెఱవేఱకున్నది. ఎవరి ప్రయోగము వారికి వ్యాకరణమను సిద్ధాంతము సర్వనియమాతిలంఘియై యున్నందున నే నంగీక రింపజాలను.

## శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము :

ప్రసక్తానుప్రసక్తిచే చాల దూరమువఱకు పోయినందులకు సభ్యులు నన్ను క్షమింతురుగాక. ఈ ఆంధ్రభాషా నిలయమునకు స్థాపకులు 'కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ'మని పేరిడినారు. అది యెంతయును సమంజసముగా నున్నది. గొప్ప విజ్ఞానమును, సముజ్జ్వలమగు క్షాత్రమును ఆ విజయనగర చక్రవర్తి యందు మూర్తీభవించి యుండినవి. కనుక ఆంధ్రుల కతడు ఆదర్శపురుషు డనుటలో సందేహము లేదు. అతని నామము స్మరణకు వచ్చునప్పుడెల్ల ప్రతి యాంధ్రుని హృదయ ముత్సాహపూరితమగుచుండును. అట్టి మహాపురుషుని నామాంకమువలన ఈ ఆంధ్రభాషా నిలయము మిక్కిలి శోభించుచున్నది.

## ఐకమత్యము :

సోదరులారా! నే నుపసంహరించుటకు ముందు నాలుగు మాటలు మీకు చెప్పదలచియున్నాను. వాస్తవమగు ఆంధ్రదేశము బ్రిటిషువారి యాంధ్ర దేశమా, నిజామువారి ఆంధ్రదేశమా అను వివాదము బయలుదేరుచున్నట్లు వినుచున్నాను.

ఈ చర్చ నిష్ప్రయోజనమైనది. ఈ రెండును కూడ ఆంధ్రదేశముగాక బీహారు ప్రాంతమే పూర్వోక్తాలాంధ్రదేశమైనను మనకు చింతలేదు. ప్రకృతము రెండును గలసి ఆంధ్రదేశముగా నున్నవి. ఉభయత్రా ఆంధ్రులు నివసించుచున్నారు. వీరి పరస్పరైకమత్యముపైనను ఆంధ్రుల పురోభివృద్ధి యాధారపడియున్నది. మఱియొక మాట. మన యాంధ్రాభిమానము ముదిరి ద్రావిడ మహారాష్ట్రాది ద్వేషముగా మాఱగూడదని నేను మిమ్ములను హెచ్చరించుచున్నాను. స్విట్జర్లండులో నుండిన జర్మను, ఫ్రెంచి, ఇటలీవారివలె నిజాము రాష్ట్రములో నున్న ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటకములు ఐకమత్య ముండిననే మనగలుగుదురు. లేనియెడల సుందోపసుంద న్యాయమే.

**ఉపసంహారము:**

ఈ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము స్థాపింపబడి యిరువదియైదు వర్షములైనవి. కీర్తిశేషులగు రంగారావు, లక్ష్మణరావుగార్ల యొక్కయు, శ్రీయుత ఆదిపూడి సోమనాథరావుగారి యొక్కయు ప్రోత్సాహముపై దక్షిణ హిందూస్థానములోని యొక సుప్రసిద్ధ రాష్ట్రకూట వంశమునకు చేరిన శ్రీయుతులు మునగాల రాజావారు ఈ సరస్వతీ దేవ్యాలయమును ప్రతిష్ఠించినారు. ఆంధ్రులలో మునగాల రాజాగారివంటివారు మఱి పదిమంది యుండిన చాలును, ఆంధ్రదేశోద్ధారమగుటలో సందియముండదు. ఆంధ్ర భూపుత్రులలో శ్రేష్ఠులును, మహోదారులును, బహు సద్గుణశాలురునగు రాజావారికి ఇంకను ఆంధ్రభూమిని సేవించుటకు తగిన శక్తిసామర్థ్యములను, ఆయుర్దాయమును భగవంతు డనుగ్రహించునుగాక! వారిచే ప్రతిష్ఠింపబడిన ఈ సరస్వతీ దేవ్యాలయము చిరస్థాయియై ఆంధ్రుల విజ్ఞానాభివృద్ధికి తోడ్పడునుగాక!"

# రజతోత్సవోపసంహారోపన్యాసము

## మహాముని కావ్యకంఠ అయ్యల సోమయాజుల గణపతిశాస్త్రులవారు

(రజతోత్సవ తృతీయ దినమున సభ నుపసంహరించుచు అధ్యక్షుల వారీ క్రింది విధముగ నుపన్యసించిరి:)

వాఙ్మయమును జర్చించుటకు ముందుగా, దాని కాధారభూతములగు తత్త్వములను దెలిసికొనవలసియున్నది. తమ శరీరమునందు మూడు అనర్ఘములగు పరమాణువులు కలవు. ఒకటి - పార్థివము, దానినే మనస్సందురు. దాని స్థానము శిరస్సు. ఇంకొకటి - అప్యము. దానినే శ్రేష్ఠమగు ప్రాణమందురు. దాని స్థానము హృదయము. మఱియొకటి - తైజసము. దానినే వాక్కందురు. దాని స్థానము మూలాధారము. మనకిప్పుడు వాక్కనెడు పరమాణువే ప్రధానము గనుక దానిని గురించియే వివరించుచున్నాను. ఈ తైజస వాగ్రూప పరమాణువును 'గణపతి' యని తాంత్రికులును, 'బ్రహ్మణస్పతి' యని వైదికులును జెప్పెదరు. తత్త్వజ్ఞుల భాషలో నిది 'పరా'వాక్కు. ఈ పరావాక్కునుండి విద్యుచ్ఛక్తివంటి యొక శక్తి బయలుదేరుచున్నది. అది హృదయమునకు వచ్చి ప్రాణశక్తితో కలియగానే సర్వార్థములను చూడగలుగునంత ప్రకాశశక్తి కలది యగుచున్నది. మనము ఏమి తలంచినను, అవ్యక్తముగా శబ్దించుచునేయున్నాము. మన తలంపులన్నియు శబ్దమయములుగానే యున్నవి. ఈ వాక్కుకే 'పశ్యంతి' యను పేరు వచ్చినది. ఈ వాక్ఛక్తి జిహ్వారంగస్థలమునకు వచ్చి వర్ణాత్మక ధ్వనుల నుచ్చరించునపుడు ''వైఖరి'' యను పేరును వహించుచున్నది. ఈ వాక్ఛక్తియే కేవల ధ్వన్యాత్మకమై ఆకాశమునంతటిని వ్యాపించి, 'మధ్యమ' యనెడు పేరుగలది యయ్యెను.

### పశ్యంతీ వైఖరుల భేదము :

ఇంద్రియములచేతను, మనస్సుచేతను అనుభవింపబడిన విషయములను అనువదించుటయే వైఖరియొక్క పని. కనుక మన యింద్రియజ్ఞాన మెంత పరిచ్ఛిన్నమో వైఖరీ జ్ఞానము అంత పరిచ్ఛిన్నమే. మనస్సు యొక్క సంబంధము లేక కేవలము హృదయముచేతనే విషయములను జూడగలుగునది పశ్యంతి. ఈ పశ్యంతియందు విజ్ఞానేంద్రియము అందరికిని తెరువబడియుండలేదు. మంత్రద్రష్టలగు ప్రాచీన మహర్షులు ఈ పశ్యంతిని తెరచియే వేదములను ప్రాదుర్భవింపజేయగలిగిరి. కవియొక్క కావ్యమునందు కావ్యకారణములగు ఉత్పత్తియు, శక్తియు రెండునుకూడ కవివ్యక్తివే. వేదములందు వ్యుత్పత్తిమాత్రమే ఋషివ్యక్తిదైనను, శక్తి మాత్రము సమష్టిశక్తియై (పారమేశ్వరమై) యున్నది. అనగా, కవి తన అనుభవములను తన భాషలో చెప్పును. ఋషి ఈశ్వరశక్త్యను గృహీతానుభవమును ఈశ్వరశక్తి ప్రేరితుడై తన భాషలో చెప్పును. వేదములు

ఋషి యొక్క భాష కావున అర్థములైనను ఈశ్వరశక్తి నిర్మితములుగాన పారమేశ్వరములుకూడ అగుటలో విరోధము లేదు. పశ్యంతీ వాక్కుయొక్క మహిమవలననే ఋషులు మంత్రద్రష్టలైనారని తెలినది. సాధారణ మనుష్యుల యందు పశ్యంతి కనులు తెరువక అస్వతంత్రమైన మనస్సుయొక్క అనుభవమునే యనువదించుటకు (తలచుటకు) తోడ్పడును. ఋషులయందు పశ్యంతి కనులు తెరచి, మనస్సుయొక్క అపేక్ష లేక స్వయముగా నింద్రియములకు గోచరముగాని విషయములను గూడ చూడగలుగును. ఇప్పుడు వాఙ్మయములోని భేదమును మనము గుర్తింపగలిగితిమి. మొదటిది - పశ్యంతీ మూలకమగు వేద వాఙ్మయము. రెండవది - వైఖరీ మూలకమగు లోక వాఙ్మయము. వేదవాఙ్మయము ప్రమాణము. లోకవాఙ్మయముయొక్క ప్రామాణ్యము యుక్త్యాదులపై నాధారపడియున్నది.

**భాషలకు సంస్కృతముతో కల సంబంధము :**

అర్యులు ఏ మాతృభాష కలవారయినను, సంస్కృతమును విడిచి కేవలము తమ మాతృభాషతో తృప్తినొందజాలరు. వారియొక్క ఘనమగు నాగరికతయంతయు వేద వాఙ్మయమందే యిమిడియున్నది. కనుక ఆంధ్రులు తమ మాతృభాషయగు తెలుగుతో గూడ సంస్కృతమును అభ్యసించు విషయమును మరువకుందురుగాక!

**భాషాభ్యసనోపాయములు :**

భాష నభ్యసించుటకు రెండుపాయములు గలవు. ఒకటి - పూర్ణముగా చదువుకొనుట. ఇంకొకటి - తపస్సు చేయుట. సంస్కృతమునందుగాని, యాంధ్రమునందుగాని మహాకవులందరును తపశ్శక్తిచేతనే గొప్ప గొప్ప ప్రబంధములను వ్రాసిరని మనకు తెలియుచున్నది. తపోబలమువలన మూలాధారమునందలి పరావాక్కు శక్తిగలదై, ఉపాసకుల ననుగ్రహించును. పరావాక్కు అనుగ్రహించిన వానియొక్క వాణి నిరంకుశమై సర్వతోముఖముగా ప్రవర్తించును. సాధారణముగా చదువుటను గురించి నాకు మంచి యభిప్రాయమే యుండినను, తపస్సునే యధికముగా నమ్ముచున్నాను. అనేక సంవత్సరములు చదివినవానికంటె కొన్ని మాసములు తపస్సు చేసినవాడే యధిక వాక్ఛక్తి సంపన్నుడు కాగలడు. బయటి గ్రంథాలయము లన్నిటికంటెను ఈ మూలాధార గ్రంథాలయము గొప్పది. ఆ మూలాధార గ్రంథాలయమునకు 'బ్రహ్మగ్రంథి' యనెడు బీగము వేయబడి యున్నది. దానిని తెరచుట కుపాయము తపస్సే. కనుక ఒక్కొక్క విద్యార్థియు, ఒక్కొక్క గ్రంథావలోకియు, ఒక్కొక్క కవియు ప్రతిదినము జపరూపమగు తపస్సు చేసి ఆ గ్రంథిని తెరచుటకు ప్రయత్నించు చుండవలెను. అప్పుడు ప్రపంచమునంతటిని ఇముడ్చుకొనిన తన లోపలి గ్రంథాలయము తెరువబడును. ఇదియే ఉపసంహారమునందు మీకు నేను చేయవలసిన సూచన.''

## అనుబంధము II

# "భారతవీరులు ఋగ్వేదకాలీయులు"

## అను ఉపన్యాససారము

మహాభారతవీరులు ఋగ్వేద సమకాలికులని ఋఙ్మంత్ర పరిశోధనవలన స్పష్టమయ్యెను. అందుల కీ దిగువ కారణములు ముఖ్యమైనవి:

1. పాండవులకు ప్రపితామహుడైన శంతనుడు ఋగ్వేదసూక్త కర్తయైన దేవాపికి కనిష్ఠ సోదరుడు. దేవాపి యొక్క సూక్తభాష బహు ప్రాచీనమైయున్నది.

2. ఖాండవ దహనమం దుదాహరింపబడిన శార్ఙ్గకులాగ్ని గీతము ఋగ్వేదములోని శార్ఙ్గకులాగ్ని సూక్తమును బోలియున్నది.

3. ఛాందోగ్యపనిషత్తులో దేవకీనందనుడగు కృష్ణునకు గురువైన అంగిరసఘోరుడు ఋగ్వేదమందు సూక్తకర్తయై ప్రసిద్ధినొందెను. ఇతని కొడుకగు కణ్వుడును, మనుమడైన నారదుడుగూడ సూక్తకర్తలైరి. కణ్వ నారదులు శ్రీకృష్ణునితోగూడి దుర్యోధన సభకు వెళ్లినట్లు భారతమే చెప్పుచున్నందున వీరందరు సమకాలికులని విశదమగును.

4. శ్రీకృష్ణునకు శైవదీక్షాగురుడైన మహర్షి యుపమన్యుడును, వాని తండ్రియగు వ్యాఘ్రపాదుడును ఋగ్వేద మంత్రకర్తలు.

5. పాండవ పురోహితుడైన ధౌమ్యుడు ఋగ్వేదమందు ప్రసిద్ధిగాంచిన దేవలునకు కనిష్ఠ భ్రాత.

6. దక్షుని మొదలు చంద్రగుప్తుని వఱకు 153 పురుషులు రాజ్యము చేసిరనియు, దక్షునకు 15వ పురుషుడే శ్రీకృష్ణుడనియు గ్రీకుదేశపు రాజదూతయైన 'మెగస్థనీసు' మన దేశము వచ్చినప్పుడు వ్రాసికొనివెళ్ళి చెప్పినట్లు గ్రీకుదేశ చరిత్రలం దున్నది. భారత పురాణమం దనుశాసనిక పర్వములోను, హరివంశమను గ్రంథములోనుగూడ దక్షునకు శ్రీకృష్ణుడు 15వ పురుషుడుగానే కీర్తింపబడెను. అందువలన చంద్రగుప్తునినుండి 138 తరముల వెనుకటివాడు శ్రీకృష్ణుడగును. దీనినిబట్టి పాండవు లత్యంత ప్రాచీనులనియు, ఋగ్వేద మించుమించుగా భారతకాలమునాటిదనియు తెలియును.

పురాతనమైన యితిహాసరూపమున మహాభారతము రచింపబడినను, నది పాండవుల చరిత్ర యనుటకు సందేహములేదు. అయినను, ఋగ్వేదసంహితయం దీ చరిత్ర పేర్కొని స్మరింపబడెనా యను ప్రశ్న వచ్చును. బాగుగా పరిశీలించినవారి కీ కథ వేదమందు లిఖింపబడినట్లే దిగువ విషయములనుబట్టి విశదమగును:

'ఏతసుడు, కుత్సుడు, అర్జునుడు, అర్జునేయుడు, ఋజ్రాశ్వుడు, ద్యోతనుడు' అను నాలు పేర్లచే ఋగ్వేదమందు పిలువబడుచున్న మంత్రద్రష్టయే మహాభారత ప్రసిద్ధుడగు అర్జునుడు. ఉత్తరఫల్గునీ నక్షత్రమున 'కర్జునీ నక్షత్ర' మను పేరు కలదు. అందువలన ఫల్గునీ నక్షత్రమున జన్మించి ఫల్గునుడైనట్లే యత డర్జు నార్జునేయ నక్షత్ర నామములతో వేదమందు పిలువబడెను. ఋజ్రాశ్వుడను పేరు శ్వేతవాహనుడను పేరునకు సమానార్థకము. ఇతడే శ్విత్రునకు పుత్రుడని రెండు మంత్రములందు పేర్కొనబడెను. 'శ్విత్రః' అనగా శ్వేతవర్ణుడు లేదా త్వగ్దోష దూషితుడగు పాండురోగి. ఇతనిని భారత గ్రంథకర్త 'పాండు' శబ్దముతో వ్యవహరించి 'పాండురా'జని పేర్కొనెను.

అంబరీషుడు, భయమానుడు, ఋజ్రాశ్వుడు, సురాధసుడు, సహదేవుడు అను నైదుగురు పుత్రులు శ్విత్రునకు గలరని ఋగ్వేదమందు స్పష్టముగా చెప్పబడెను. వీరిలో జ్యేష్ఠుడైన అంబరీషునకు 'శముడు, వృషభుడు. అజాతశత్రువు' అను నామాంతరములును గలవు. ఇతడే భారత ప్రసిద్ధ ధర్మరాజు. 'శమ' శబ్దము శాంతిపదము. 'వృషభ' శబ్దము ధర్మస్వరూప సూచకము. కనుక 'వృషభ' శబ్దార్థభూతమైన ధర్మరాజను పేరుతో భారతమందు పిలువబడినట్లగును. ఇక భారతమం దజాతశత్రు నామము గైకొనబడినను, ధర్మరాజున కంబరీష నామము విడువబడి, యా పేరున నన్యుడొకడు పిలువబడెను. ఆ యంబరీషునకు 'నాభాగు'డను నామాంతరము చెప్పబడెను. 'నాభాగ' పదమున కర్థము (న+అభాగ= దయారహితుడు కానివాడు= దయామయుడు) గమనింపబడినప్పుడు మాత్రమిది ధర్మరాజునకే అన్వయించును గాని యింకొకని కన్వయించదు. కనుక 'నాభాగ' నామాంతరముగల నింకొక యంబరీషుడుండుట పౌరాణిక కల్పనమగును.

రెండవ పుత్రుడైన 'భయమాను'డనగా భయమును గలిగించువాడు. ఇతడే భారత ప్రసిద్ధ భీమసేనుడు. మూడవవాడైన ఋజ్రాశ్వు డర్జునుడేయని యిదివరకే చెప్పబడెను. నాలుగవవాడు సురాధసుడు. 'సురాధస' శబ్దము మంచి సోదరునకు చెందును. కనుక నితడు సత్పురుషుడైన నకులుడగును. అయిదవవాడు వేదపురాణములు రెండింటియందును సహదేవుడే.

ఈ పాండవుల తల్లి 'వృష్ణి' యని వేదమందు చెప్పబడెను.

పాండవ సోదరులయొక్క భార్య 'ఘోష' యని వేదమందు వ్యవహరింప బడెను. ఆమె యశ్వినీదేవతల యనుగ్రహమువలన అర్జునుని బొందినట్లుగూడ వచింపబడెను. మఱియు నామెను పంచమరుత్తులు తమ రథమునం దిడికొని పోయి తమ కర్మ భాగస్వామినిగా జేసికొనినట్లును రెండు మంత్రములలో వచింపబడెను. అట్టి ఘోషయే ద్రౌపది. వేదమం దీమెకు 'కాక్షీవతి', 'వజ్రవంశజ' అను నామాంతరములు గలవు. వజ్రవంశములోని కక్షీవతుని కుమార్తె యైనందున

నట్టి నామాంతరములు వచ్చెను. కక్షీవతునకు 'విదధి' యను నామాంతరము కలదు. విదధి యనగా కర్మనిష్ఠగలవాడు. కనుక 'యజ్ఞసేను'డను భారత ప్రసిద్ధ నామమున కర్థాంతర మగును. పంచమరుత్తులే పంచపాండవులుగా నవతరించిరి.

'శుష్ణుడు, శుక్రవసుడు, అసుషుడు, తూర్వయాణుడు, వృషాకపి, కర్ణుడు, గౌ, సూరుడు, సూర్యుడు' అను తొమ్మిది పేర్లుగల వీరునితో కుత్సునకు (అర్జునునకు) యుద్ధము తటస్థించినట్లు ఋగ్వేదమందు చెప్పబడెను. ఈ పేర్లలో 'సూరుడు, సూర్యుడు' అను పేర్లా మహాపురుషుడు సూర్యావతార పురుషుడని ద్యోతనచేయును. ఆ మహాయుద్ధమందు 'శౌరదేవుడు, కృష్ణుడు, వైకుంఠుడు' అను పేర్లతో కీర్తింపబడిన యింద్రావతార పురుషుడు కుత్సునకు సారథ్య మొనర్చినట్లును వేదమందు చెప్పబడెను. ఇతడే భారత ప్రసిద్ధ శ్రీకృష్ణుడు, ప్రతినాయకుడే కర్ణుడు. ఆ ఘోరసంగ్రామమందు కర్ణపరాక్రమము విజృంభించి బలవత్తరమై యుండగా, జయపరాఙ్ముఖుడై యున్న అర్జునుడు పలాయన మొనర్చుటకు సిద్ధమైనట్లును, సారథియైన కృష్ణు డతని పలాయనమును వారించి, కర్ణ రథము నశ్వసహితముగా నరికట్టి, యా రథచక్రమును విరుగగొట్టి, రథమును భూపతన మొనర్చినట్లును ఋగ్వేదములో వర్ణింపబడెను. భారత గ్రంథములో కర్ణ రథచక్ర మకస్మాత్తుగా కూరుకొనిపోయినట్లు వచింపబడెను. ఇందులకు హేతువు శ్రీకృష్ణుడు తటస్థుడై యుండెనని పోషించుటకు కావచ్చును.

కర్ణు డిఱువదిమంది రాక్షసులను చంపినట్లు ఋగ్వేదమందు కలదు. వారు ఘటోత్కచుడు, వాని మిత్రరాజులునై యుందురు. ఒక మంత్రములో ఇంద్రావతార పురుషుడైన కృష్ణుడు కర్ణుని తేజోమయచక్రమును యాచించి, యపహరించినట్లున్నది. ఇంకొక మంత్రములో కర్ణుడు తన చర్మము నిచ్చెనని యున్నది. మఱియొక మంత్రములో కర్ణార్జున పోరాటసమయమం దష్టమంత్రములు కర్ణునకు జ్ఞప్తికి రాకుండునట్లు కృష్ణుడు చేసినట్లు స్పష్టముగా గలదు. దీనికొక శాపకారణము భారత గ్రంథకర్తచే కల్పింపబడెను.

పై విషయములనుబట్టి శౌరదేవుడు, కుత్సుడు, శుష్ణుడు అను ముగ్గురును భారత ప్రసిద్ధ కృష్ణార్జున కర్ణులని స్పష్టమగును. ఈ శౌరదేవుడే భారతాది గ్రంథములలో 'శౌరి' యని పిలువబడెను. 'వాసవ' యను నింద్ర నామమునందున్న 'వసు' శబ్దముతో 'దేవ'పదమును చేర్చి 'వాసుదేవ' యను నామమును పౌరాణికులు కూర్చి 'శౌరదేవ' నామములోని 'దేవ' పదమును విడిచినట్లును తోచును. వేదములో నింద్రావతార పురుషుడుగా కీర్తింపబడిన కృష్ణుని (వాసవ సంపర్కము ధ్వనింపకుండుటకై వసుదేవుని పుత్రుడగుటచే వాసుదేవుడైనట్లు ధ్వనింపజేసి) విష్ణ్వవతారపురుషుడుగా పౌరాణికులు కీర్తించిరి. మఱియు విశ్వాధ్యక్షుడు మహేంద్రుడని వేదము చెప్పగా, పురాణములు విష్ణువని చెప్పి, వేదోక్తమైన సార్వభౌమ స్థానమునుండి యింద్రుని తొలగించి, నీచకథలచే

భ్రష్టుడుగా చిత్రించి, యతనికి పర్జన్య (మేఘాధిపతి) స్థానమును కల్పించిరి. ఇంద్రవిభూతి పర్జన్యుడగునుగాని యింద్రుడే పర్జన్యుడు కాజాలడు గదా! ఏ విష్ణుపదము వేదములో యజ్ఞపరముగా వాడబడెనో, విష్ణువనెడి యా పదము సర్వేశ్వరపరముగా భాగవతమందు వాడబడి, యజ్ఞ మతని విభూతిగా వచింపబడెను. ఇట్టి యభిప్రాయభేదమే యవతార కథన భేదమునకు గూడ హేతువయ్యెను.

ఇంక కౌరవులను గుఱించి వేదమం దెట్లున్నదో పరిశీలింతము. 'కుయవుడు, కుయవాక్, వృద్ధవాక్, దుర్యోణుడు' అను పేర్లుగల నొక మహావీరుని యుద్ధమందు కుత్సుడు జయించినట్లు ఋగ్వేదములో స్పష్టముగా కలదు. కుయవుడే దుర్యోధనుడు. 'దుర్యోణ' నామమే దుర్యోధన యని మార్పుబొందెను. 'కుయవుడు, కుయవాక్' అను శబ్దములు కుత్సిత వచనములు గలవానికి జెందును.

దుర్యోధనాదుల తల్లి పేరు 'పర్శు' అని వేదమందున్నది. ఈమె 20 మంది పుత్రుల నొక్కసారి కనినట్లు వేదములో రెండుచోట్ల చెప్పబడెను. భారతములో గూడ కర్ణపర్వ ప్రారంభమందు చనిపోయిన పర్శుపుత్రుల సంఖ్య తొమ్మిదనియు, మిగిలినవారి సంఖ్య పదునొకటనియు చెప్పబడెను. మూలభారత వాక్యము మొత్తమును గుఱించియు నిఱువదియని స్పష్టము చేసియున్నదేమో! దుశ్శాసనుడను నింకొక పర్శుపుత్రుడును పేర్కొనబడెను. ఇతడే భారత దుశ్శాసనుడు. ఈ పర్శుపుత్రులచే పాండవ పక్షపాతియగు 'తపసు'* డను నొక ఋషి మథింపబడినట్లొక వేదసూక్తమందు కలదు.

ఇంద్రావతార పురుషుడు తనకు మిత్రులైన శ్విత్రపుత్రుల ద్వారా క్షేత్రమును సాధించినట్లొక మంత్రమందు చెప్పబడెను. "నీ సహాయమువలన శత్రువులచే జయింపబడిన మా భాగమును మేము పొందెదముగాక" యని కుత్సునియొక్క యింద్రప్రార్థన మంత్రములో కలదు. అందువలన కురుపాండవ యుద్ధము రాజ్యభాగ సంబంధమని స్పష్టపడును.+

---

* ఈ తపసుడు ధృతరాష్ట్రునకు వైశ్య స్త్రీయందు పుట్టిన 'యుయుత్సుడు' కావచ్చును. అతడు పాండవ పక్షపాతియని దుర్యోధనునిచే వెడలగొట్టబడి పాండవులను చేరినట్లు భారతమందున్నది.

+ఇది దాయాది భాగ సంబంధమైనచో 'కురువంశ' నామము కౌరవు లనబడు పర్శు పుత్రులకున్నట్లు శ్విత్రపుత్రుల కేల లేదని ప్రశ్న వచ్చును. పాండవులను పేరు పాండురోగము గల్గిన తండ్రివలన వచ్చినదనుటయు సబబుగాలేదు. వీరు తెల్లజాతివారై యుండిరనుట సమంజసమై, పాండురాజునకు పాండురోగ మున్నదనుకొనుట పాండువర్ణము వలన గలిగిన భ్రమయై యుండవచ్చును. ఆలోచింపగా, కురుపాండవు లుభయులు విదేశీయులై, భరతఖండమునకు వచ్చి, ఆ కాలమున పాలించిన హయహయులు, యూదులు (వీరే యాదవులు) వంటివారగుదురు.

పర్ను పుత్రులవలన కుత్సు డొక సమయమం దొక నూతిలో త్రోయబడి నట్లును, దేవతలను రక్షణకొఱకా నూతినుండి ప్రార్థించి తనకు శిరస్సునకు మీదుగా నగుపడు నక్షత్రమును స్తుతించినట్లును కుత్సుని సూక్తములలో నొకదాని నుండి తెలియుచున్నది. ఈ కుత్సుని రెండు మంత్రముల వలన మహాభారత యుద్ధము హస్తానక్షత్రమందు రవి యుండగా (అనగా దక్షిణాయనమందు) జరిగినట్లు విశదమగుచున్నది.

---

వీరిలో పాండవు లొక్కరే మధ్యఆసియానుండి వచ్చిన స్వచ్ఛమైన ఆర్యులనియు, యూరల్ పర్వతప్రాంతములు కురుపితృభూమి అనబడుచున్నందున కౌరవు లచ్చటనుండి వచ్చి యాదవ - హయహయులవలె భారతదేశపు పశ్చిమ భాగముల నాక్రమించుకొనిన అనార్యులనియు నాయన యొకప్పుడు చెప్పె. వారికి వచ్చిన తగవు రాజకీయసంబంధమేకాని, దాయాది సంబంధము కాదని స్పష్టపరచెను. వారి కితిహాసమందు కూర్చబడిన దాయాది సంబంధము కల్పితమనియు చెప్పబడెను.

### అనుబంధము iii

# ఈశోపనిషదః లఘుభాష్యమ్

**అథ వాజస నేయినాం సంహితోపనిషదం వ్యాఖ్యాస్యామః.**

మం॥ ఓం ఈశావాస్య మిదగ్ం సర్వం
యత్కించ జగత్యాం జగత్।
తేన త్యక్తేన భుంజీథా
మాగృధః కస్యస్విద్ధనమ్॥ 1

**భాష్యమ్**

(1) జగత్యాం=ప్రపంచే; (2) యత్కించ జగత్ = గతిమత్ప్రాణవదితి యావత్; (3) (తత్) ఇదం సర్వం; (4) ఈశా = సర్వశక్తేన పరమాత్మనా; (5) వాస్యమ్ = ఆచ్ఛాద్యమ్-వ్యాప్తమిత్యర్థః (6) తేన = జగదంశేన; (7) త్యక్తేన = పరిత్యక్తేన-అవిషయీకృతేనేతి యావత్; (8) భుంజీథాః = అనుభవ (ఈశ్వరమితి శేషః).

(ఘటే కంబుగ్రీవత్వాదే ర్వికారాంశస్య పరిత్యాగేన మృదను భవత్, జగత్యాం నామరూపాది వికారాంశ పరిత్యాగేన కారణభూత సదనుభవః సిధ్యతీతి తాత్పర్యమ్. ఏవమనయా త్రిపాద్యా జ్ఞానయోగ ఉక్తః, ఉత్తరయా పంచమాద్యా (చతుర్థాద్యా?) కర్మయోగమాహ).

మం॥ కుర్వన్నే వేహ కర్మాణి
జిజీవిషేచ్ఛతగ్ం సమాః।
ఏవం త్వయి నాన్యథేతోఽస్తి
న కర్మ లిప్యతే నరే॥ 2

(9) మాగృధఃధనం కస్యస్విత్ = మాకామంకృథాః ధనం కస్య చిదిత్యర్థః.

**భాష్యమ్**

(1) ఇహ = లోకే; (2) కర్మాణి = విహితాని; (3) కుర్వన్నేవ; (4) శతంసమాః = చిరం; (5) జిజీవిషేత్ = జీవితుమిచ్ఛేత్-శాశ్వతమేవాత్ర (జీవితం) వివక్షితం కర్మయోగఫలభూతమ్; (6) ఏవం త్వయి నరే కర్మ; (7) నలిప్యతే = సంగాయన భవతి; (8) ఇతో (మార్గాత్) అన్యథా నాస్తి = నిష్కామ విహిత కర్మాచరణా దన్యో మార్గోనాస్తి కర్మలేపాభావయేత్యర్థః

మం॥ అసుర్యానామ తే లోకా
అన్ధేన తమసావృతాః।
తాంస్తే ప్రేత్యాభిగచ్ఛన్తి
యేకేచాత్మహనో జనాః॥ 3

## భాష్యమ్

(1) అన్ధేన తమసావృతాః = జ్ఞానశక్తి ప్రవిలయనాత్; (2) అసుర్యానామ = అసూన్-ప్రాణాన్-రాన్త్యప హారన్త్యపగత ప్రజ్ఞా కుర్వన్తీతి ప్రజ్ఞా పరిపన్థినో భావాః అసురా ఉచ్యన్తే, తద్ధితత్వాదసుర్యానామ; (3) తేలోకా = తేఽస్మద్దృష్టి పరోక్షాః లోకా స్సన్తీతిశేషః (4) యేకే చాత్మహనః = ప్రకరణాదాత్మజ్ఞాన శూన్యత్వాత్కర్మ లేపత్వాచ్చహేతుభ్యాం శరీరాద్విజ్ఞానమయస్య పృథక్కరణా భావా దన్తకాలే ఆత్మనోహంతారః ప్రజ్ఞాపరిచ్యుతేః స్థావర సామ్యమితా ఇత్యర్థః; (5) తే జనాః (6) తాన్ = పూర్వోక్తా నసుర్యాల్లోకాన్; (7) ప్రేత్యాభిగచ్ఛన్తి = మూర్ఛితస్య యాదృశో లోకస్తాదృశా ఏషాంలోకా అభిగచ్ఛన్తి ఇతి విజ్ఞాయతే.

(జ్ఞానయోగిత్వి హైవాత్మాన మనుభవతి. కర్మయోగిత్వలిప్తత్వా దన్తతః ప్రాప్నోత్యమృతత్వమ్, అపరస్త్వాత్మహా జుగుప్సిత గతిర్భవతీతి పర్యవసన్నం తాత్పర్యమ్).

మం॥ అనేజదేకం మనసో జవీయో
నైనద్దేవా అప్నువన్పూర్వ మర్షత్।
తద్ధావతో ఽన్యా నత్యేతి తిష్ఠత్
తస్మిన్నపో మాతరిశ్వా దధాతి॥ 4

## భాష్యమ్

(1) ఏకం = సర్వోపాదానత్వాత్సర్వాత్మకమితి కేవలం కిమపివస్తు; (2) అనేజత్ (న+ఏజత్) = స్వభావాద చంచలమ్; (3) మనసో జవీయో = మనసః వేగవత్తరం ధర్మీభూతజ్ఞానద్వారా; (4) పూర్వమ్ అర్షత్ = పూర్వమేవ గచ్ఛత్; (5) ఏనత్; (6) దేవాః, (7) న అప్నువన్ = పశ్చాన్నప్రాపుః, (8) తత్ తిష్ఠత్ = తత్ అచంచలమేవ; (9) ధావతః అన్యాన్; (10) అత్యేతి = అతిలంఘతే; (11) తస్మిన్మాతరిశ్వా = తస్మిన్ నిజక్రియాశక్తిరూపో, వాయురూపో; (12) అపః = రసం; (13) దధాతి = ధారయతి.

(యదలేపత్వా త్సూక్ష్మాతి సూక్ష్మత్వా త్సర్వాతి గద్భాన్యాభిర్విభూతి రస్పృశ్య మాసీత్తత్ర మాతరిశ్వనా నిమిత్తేన రసః సూక్ష్మీభూత్వా ప్రాణాత్మకో(ధ్రియమాణో యోగం ప్రాపేత్యర్థః).

మం॥ తదేజతి తన్నైజతి
తద్దూరే తద్వన్తికే।
తదన్తరస్య సర్వస్య
తదు సర్వస్యాస్య బాహ్యతః॥ 5

## భాష్యమ్

(1) తదేజతి తన్నైజతి ప్రాగుక్తరీత్యా; (2) తద్దూరే = సూర్యమండలాన్తర్వర్తిత్వాత్; (3) తద్వన్తికే = హృదయాన్తర్వర్తిత్వాత్; (4) తదస్య సర్వస్య అన్తరః = న కేవలం మండల హృదయయోః తదస్య సర్వస్యాన్తరః, (5) తత్+ఉ అస్య సర్వస్య బాహ్యతః (పూర్ణమిత్యుక్తం భవతి. ద్విరుక్తి-స్సర్వస్యేతి-పాదపూరణాయ).

మం॥ యస్తు సర్వాణి భూతాని
ఆత్మన్యేవానుపశ్యతి।
సర్వ భూతేషు చాత్మానం
తతో నవిజుగుప్సతే॥ 6

## భాష్యమ్

(1) యస్తు సర్వాణి భూతాని ఆత్మని ఏవ అనుపశ్యతి, ఆత్మానం సర్వ భూతేషుచ అనుపశ్యతి; (2) తతః = తదనుభవాత్; (3) (సః); (4) న విజుగుప్సతే = కస్మిన్ చిద్వస్తుని జుగుప్సవాన్ భవతి. (సర్వత్రాత్మ దర్శనాత్, అస్యానుభవస్తుతేన త్యక్తే నేత్యేవ).

మం॥ యస్మిన్సర్వాణి భూతాని
ఆత్మైవా భూద్విజానతః।
తత్ర కోమోహః? కః శోక ?
ఏకత్వ మనుపశ్యతః॥ 7

## భాష్యమ్

(1) విజానతః = ఆత్మజ్ఞానినో; (2) యస్మిన్ = దశావిశేషే; (3) సర్వాణి భూతాని ఆత్మైవాభూత్ = అపృథగ్భావేన దర్శనాత్; (4) తత్ర = దశావిశేషే; (5) ఏకత్వ మనుపశ్యతః (పురుషస్య); (6) కోమోహః కః శోకః = మోహశోకౌ నస్యాతామిత్యర్థః.

(పూర్వత్ర వికారాంశత్యాగేన బ్రహ్మానుభూతిర్వివక్షితా. అత్ర సర్వస్యాపి బ్రహ్మత్వేన దర్శనం వివక్షితమ్. వికారాణాం విషయత్వేన సేవా సంసారః. విభూతిత్వే నోపాసనంతు పూర్ణానుభూత్య ప్రతిద్వంద్వీతి).

మం॥ సపర్యగాచ్ఛుక్ర మకాయ మవ్రణ
మస్నావిరగ్ం శుద్ధ మపాపవిద్ధమ్।
కవిర్మనీషీ పరిభూః స్వయంభూ
ర్యాథా తథ్యతోఽర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః 8

## భాష్యమ్

(1) సః = పూర్వోక్తముక్తపురుషః; (2) అకాయం = అశరీరం; (3) అవ్రణమ్ = అభేద్యత్వాత్; (4) అస్నావిరమ్ = అభౌతికత్వాత్; (5) శుద్ధం = అమలినం; (6) అపాపవిద్ధమ్ = అసంగత్వాత్; (7) శుక్రం = అమృతం, జ్యోతిర్మయం దివ్యం వపుః; (8) పర్యగాత్ = ప్రాప (9) కవిః =మంత్రదర్శీ; (10) మనీషీ = మనస ఈశః (11) పరిభూః = సర్వాత్మభావేన వ్యాప్తః; (12) స్వయంభూః = అమృతే దివ్యేవపుషి స్వయమావిర్భావాత్; (13) (సపురుషో) అర్థాన్ = వేదితవ్యానంశాన్; (14) యాథాతథ్యతః = సత్యతయా; (15) శాశ్వతీభ్యః సమాభ్యః = చిరం లోకే జిజ్ఞాసూనామర్థే స్థితయే; (16) వ్యదధాత్ = రచయామాస - అభిదధావిత్యర్థః.

(ఋషే రాత్మాన్యేతైవ పరోక్షవదేషోక్తిః ఈశ్వరాధికారోయ మిత్యేకే).

మం॥ అన్ధన్తమః ప్రవిశన్తి
యేఽవిద్యా ముపాసతే।
తతో భూయ ఇవతమో
య ఉ విద్యాయాగ్ం రతాః॥ 9

## భాష్యమ్

(1) యే అవిద్యాం ఉపాసతే = నిద్రామిత్యర్థః సాహ్యవిద్యా-కేవలా యతస్తదా నకించిద్విజానాతి- యః ఉపాసతే; (2) (తే) అన్ధన్తమః ప్రవిశన్తి = జ్ఞానశూన్యత్వాత్; (3) యే విద్యాయాం = కేవలాయాం త్రయ్యాది విద్యాయాం లోకజ్ఞానాత్మికాయాంచ; (4) రతాః = సక్తాః; (5) (తే) (6) తతః = పూర్వోక్తాత్తమసః (7) భూయ ఇవ తమః (ప్రవిశన్తి).

(వికారా విజ్ఞానేనా సముచ్చితం విజ్ఞానం కదాచిన్న బ్రహ్మాజ్ఞానే. భేదేన వికారగ్రహః, అభేదేన బ్రహ్మానుభవ ఇతి పరస్పర విరోధాత్. నైవం విభూత్యుపాసనోచ్ఛేదః, తత్రవికారాణాం పృథక్త్వేనాగ్రహణా దనిద్యైవేతి. 'ఉ' పాదపూరణః).

మం॥ అన్యదేవాహు ర్విద్యయాఽ
న్యదాహు రవిద్యయా।
ఇతి శుశ్రుమ ధీరాణాం
యేనస్త ద్విచచక్షిరే॥ 10

## భాష్యమ్

(1) విద్యయా (వక్ష్యమాణయా) అన్యదేవ (ఫలం) ఆహుః; (2) అవిద్యయా (వక్ష్యమాణయా) అన్యత్ (ఫలం) ఆహుః; (3) యే, నః (తత్ప్రకరణం) విచచక్షిరే; (4) (తేషాం) ధీరాణాం (సకాశాదితి శేషః); (5) ఇతి = పూర్వోక్త ప్రకారేణ; (6) శుశ్రుమ (స్మః) = శ్రుతవన్తః స్మః.

(యద్యత్య విద్యావిద్యే నిష్ఫలే కేవలే, తథాపి తే ప్రకారాన్తరేణ సముచ్చితే ఫలదే ఇతి భావః, తదేవాహ).

మం॥ విద్యాంచా విద్యాంచ
యస్తద్వేదో భయగ్ంసహ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా
విద్యయాఽమృత మశ్నుతే॥ 11

## భాష్యమ్

(1) విద్యాంచా విద్యాంచో భయం తత్సహ = విద్యా విద్యా సముచ్చయేన (2) యః వేద = యుగపద్విద్వా నవిద్వాంశ్చ భవతీత్యర్థః-(కస్య విద్వాన్కస్యాఽవిద్వానితి చేత్. ఈశ్వరస్య విద్వాన్, పార్థక్యేన వికారాణామవిద్వానితి వ్యాఖ్యాస్యామః); (3) సచాఽవిద్యయా = పార్థక్యేన వికారాణా మపరిజ్ఞానేన నిమిత్తేన; (4) మృత్యుం = ప్రమాదం; (5) తీర్త్వా; (6) విద్యయా = ఈశ్వరానుభూత్యాం; (7) అమృతం = శాశ్వతం బ్రహ్మభావేనస్థితిమ్; (8) అశ్ను తే = ప్రాప్నోతి.

జగత్ యః పృథగ్భావేన జానన్ననుభవతి, స ఈశ్వరం లక్షణతో జానన్నపి నైవానుభవతి. అత ఏవ కేవలాం విద్యాం న్యషేధత్. ఈశ్వరస్యాఽవిద్వాన్ ప్రపంచ

మనిజానన్నపి న సామాధిష్ఠః, తంతునిద్రితమేవ పశ్యామః. అతః కేవలా అవిద్యా అనింద్యత. అవిద్యా విద్యయోః ప్రాగుక్తరీత్యా సముచ్చయః స సమాధిరేవ).

మం॥ అన్ధం తమః ప్రవిశన్తి
యేఽ సంభూతి ముపాసతే।
తతో భూయ ఇవ తమో
య ఉ సంభూత్యాగ్ంరతాః॥ 12

భాష్యమ్

(1) యే; (2) అసంభూతిం = సంభూతి ప్రతిద్వంద్వినం వినాశమ్; (3) ఉపాసతే = కేవలం మ్రియన్తమితియావత్; (4) (తే) అన్ధంతమః ప్రవిశన్తి; (5) య ఉ సంభూత్యాంరతాః = జన్మప్రాప్తా ఇతి యావత్ సక్తాః (6) (తే) తతో భూయ ఇవ తమః (ప్రవిశన్తి).

(కేవలేభ్యో మృతేభ్యో, జాతాః కేవలా అధికే తమసి ప్రవిష్టా ఇతి భావః).

మం॥ అన్య దేవాహుః సమ్భవా
దన్యదాహు రసమ్భవాత్।
ఇతి శుశ్రుమ ధీరాణాం
యేనస్త ద్విచచక్షిరే॥ 13

భాష్యమ్

(1) సంభవాదన్యదేవ (ఫలం); (2) ఆహుః = వక్ష్యమాణాత్; (3) అసంభవాత్ = వినాశాత్; (4) అన్యదేవ (ఫలం); (5) ఆహుః = వక్ష్యమాణాత్; (6) యే; (7) నః = అస్మద్భ్యః (8) తత్ (ప్రకరణం) విచచక్షిరే; (9) (తేషాం) ధీరాణాం (సకాశాదితి శేషః); (10) ఇతి = పూర్వోక్తప్రకారేణ; (11) శుశ్రుమ = శ్రుతవన్తః (స్మః).

(యద్యపి మరణ జన్మనీ కేవలే తమఃప్రవేశ హేతూ, తథాపి ప్రకారాన్తరేణ సముచ్చితే ఫలదే ఇతి భావః).

మం॥ సమ్భూతించ వినాశంచ
యస్తద్వేదో భయగ్ంసహ।
వినాశేన మృత్యుం తీర్త్వా
సమ్భూత్యాఽమృత మశ్నుతే॥ 14

### భాష్యమ్

(1) సమ్భూతించ వినాశంచ; (2) తదుభయంసహ = సముచ్చయేన; (3) యః వేద = అనుభవతి యుగపజ్జాతో మృతశ్చ భవతీత్యర్థః - (అభిమానత్యాగాదత్ర శరీరే మృతః, తపసాఽఽభ్యన్తరే జ్యోతిషి తాదాత్మ్యే జ్ఞాత ఇతి వివేకః); (4) సచవినాశేన = దేహాభిమానత్యాగేన అత్ర శరీరే మరణేన; (5) మృత్యుం = ప్రమాదం; (6) తీర్త్వా; (7) సంభూత్యా = అభ్యన్తరే జ్యోతిషి తాదాత్మ్యర్ధిద్వేన జన్మనా; (8) అమృతం = బ్రహ్మాభావం; (9) అశ్నుతే = ప్రాప్నోతి.

మం॥ హిరణ్మయేన పాత్రేణ
సత్యస్యాపిహితం ముఖమ్।
తత్త్వం పూషన్నపావృణు
సత్య ధర్మాయ దృష్టయే॥ 15

### భాష్యమ్

(1) సత్యస్య = ప్రత్యగాత్మనో; (2) ముఖం = భ్రూమండలవర్తి దివ్యమాన్తరం చక్షుః (3) హిరణ్మయేన పాత్రేణ = అక్షోరుపరిభాగేన పాత్రాకారత్వాదేషభాగః పాత్రం హిరణ్మయమితి రూపితః; (4) అపిహితం = అచ్ఛాదితమ్ - అతో వయమన్తరన్ధాః (5) హేపూషన్ = హే సూర్యమండలాన్తర్వర్తి పురుష; (6) త్వంతత్; (7) అపావృణు = కుర్వపావృతమ్; (కస్మై ప్రయోజనాయ ?) (8) సత్యధర్మాయ = ప్రత్యగాత్మ ధర్మాయ; (9) దృష్టయే= ప్రతీచ్యైవృష్టయ ఇతి భావః

మం॥ పూషన్నేకర్షే యమసూర్య ప్రాజాపత్య
వ్యూహ రశ్మీన్సమూహ తేజోయత్తే।
రూపం కల్యాణతమం తత్తే పశ్యామి
యోఽసావసౌ పురుష స్సోఽహమస్మి॥ 16

### భాష్యమ్

(1) హేపూషన్ = హే పోషక! (2) హే ఏకర్షే = హే సర్వమంత్రాణాం ద్రష్టః! (3) హే యమ = హే నియామక! (4) ప్రాజాపత్య = ప్రజాపతే రఖండాత్మనో హిరణ్యగర్భాత్మనో మండలే ప్రాదుర్భూత; (5) హే సూర్య = హే సూర్యభగవాన్! (6) వ్యూహ = సన్నాహయ; (7) రశ్మీన్ = కిరణాన్; (8) సమూహ = ఏకీకురు; (మమ ప్రాణానాం సర్వేషాం సజాతీయానా

మనుగ్రహాయేతి భావః. రశ్మయోహి ప్రాణా అధ్యాత్మమ్.) (9) తేజః = తేజోమయం; (10) యత్తే కల్యాణతమం రూపం; (11) తత్తేపశ్యామి; (12) అసౌయః పురుషః (13) సః అహమస్మి.

(సాక్షాత్కారాదనన్తర మిద ముచ్యతే).

మం॥ వాయు రనిల మమృతమ్
అథేదం భస్మాన్తగ్ం శరీరమ్।
ఓం క్రతోస్మర కృతగ్ం స్మర
క్రతోస్మర కృతగ్ం స్మర॥ 17

## భాష్యమ్

(1) వాయుః = శ్రేష్ఠప్రాణః; (2) అనిలం = నియనరహితమ్; (3) అమృతమ్ = వస్తుసంగరహిత మితియావత్; (4) అథ ఇదం శరీరమ్; (5) భస్మాన్తం = నశ్వరమిత్యర్థః; (6) ఓం = ప్రణవరూప! (మాతరిశ్వన ఏవైషా స్తుతిర్భవతి); (7) క్రతో = సర్వ క్రియాకారిన్ వాయో! (8) స్మర (మాం ఇతి శేషః); (9) కృతం మయాకృత పుణ్యం; (10) స్మర.

(వాక్యస్య ద్విర్వచనం ప్రార్థనాయా మాదరాతిశయార్థమ్).

మం॥ అగ్నేనయ సుపథా రాయే
అస్మాన్విశ్వాని దేవ వయునాని విద్వాన్।
యుయోధ్య స్మ జ్జుహురాణమేనో
భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ॥ 18

## భాష్యమ్

(1) హే అగ్నే=హే పృథివీస్థానం దేవ! (ద్యుస్థాన మంతరిక్ష స్థానంచ దైవతే ప్రార్థితే, అథ పృథివీస్థానం ప్రార్థ్యతే): (2) అస్మాన్; (3) రాయే = సంపదే; (4) విశ్వాని = సర్వాణి; (5) వయునాని = స్థానాని; (6) విద్వాన్ (త్వం); (7) సుపథా = శోభనేన మార్గేణ; (8) నయ; (9) అస్మత్ (మత్తో); (10) జుహురాణం = లజ్జకరం; (11) ఏనః=పాపమ్; (12) యుయోధి = పృథక్కురు; (13) తే = తుభ్యం; (14) భూయిష్ఠాం నమ ఉక్తిం విధేమ.

(యదీశోపక్రమ్య సూర్య-వాయు-వైశ్వానరాణాం స్తుత్యోప సంహరతి. తత్ జ్ఞాపయతి ఉపనిషత్ ఈశస్త్వస్రా ఏతా దేవతా విభూతయ ఇతి విభూతయ ఇతి)

అత్రాయం శ్లోకో భవతి :

శ్లో॥ సంహితాన్త్యానువాకో౽యం।
గోప్యో వాజసనేయినామ్
భాష్యేణ లఘునానేన।
దీపేనేవ ప్రకాశితః॥

గద్య:- ఇతి శ్రీ భగవన్మహర్షి రమణాంతేవాసినో వాసిష్ఠస్య నరసింహ సూనోర్గణపతేః కృతిః వాజసనేయి సంహితోపనిషద్భాష్యం సమాప్తమ్.

అనుబంధము iv

# శ్రీ గణపతిముని రచనలు

అచ్చుపడినవి :–

1. ఉమాసహస్రము-నాగరిలిపిలో శ్రీ కపాలిశాస్త్రిగారి భాష్యసహితముగా శ్రీ యం.పి. పండిట్, పుదుచ్చేరి. గారిచే ప్రచురింపబడెను.

   డిటో - తెలుగు తాత్పర్యములతో 3 వాల్యూములుగా శ్రీ పంతుల లక్ష్మీనారాయణశాస్త్రి, విజయనగరం గారిచే ప్రచురింపబడెను.

2. శ్రీ రమణగీత,
3. సద్విద్య (ఉన్నది నలువది) } శ్రీ రమణాశ్రమమువారిచే ప్రచురింపబడెను.

గుంటూరు లక్ష్మీకాంతముచే
తెలుగు తాత్పర్యసహితముగా ప్రచురణపొందినవి.

4. మహావిద్యాది సూత్రగ్రంథావళి (మొదటి భాగములో దశమహా విద్యలను గురించి, రెండవ భాగములో గాయత్రీ, యోగ, సీతా, కృష్ణ, రుద్ర కుటుంబ, ఇంద్రేశ్వరాభేద, సృష్టి, రాజయోగసార వ్యాఖ్యానములను గురించి సూత్రములు).
5. ఖండకావ్య ద్వయము (పాండవ ధార్తరాష్ట్ర సంభవము, సుకన్యాదస్ర సంవాదము).
6. సదాచారబోధిని.
7. తత్త్వఘంటాశతకము.
8. గీతమాల (అగ్ని, గణపతి, ఇంద్ర, వాయు, సూర్య, దశావతార, అంబికా, రేణుకా, గురు, యోగసార గీతములు).
9. విశ్వమీమాంస.
10. ఇంద్ర సహస్రనామ స్తోత్రము.
11. భారత చరిత్ర పరీక్ష.
12. ఇంద్రాణీ సప్తశతి.
13. స్తోత్రచతుష్కము (ప్రచండచండీత్రిశతి, ఉమాశతకము, దేవీస్తోత్రమంజరి).
14. ఈశోపనిషల్లఘుభాష్యము
15. పారాశర్య కేరళీయ సముచ్చయ జ్యోతిష శాస్త్రము.

అనుబంధములుగా పై గ్రంథములం దచ్చుపడిన లఘురచనలు.

| | | |
|---|---|---|
| (1) | అక్షరావళి (మహావిద్యాది సూత్ర గ్రంథావళిలో). | |
| (2) | శ్రీ తారకరామనామస్తుతి, | ఖండకావ్య ద్వయములో. |
| (3) | అకారాదిమాలా శ్రీ విష్ణుస్తుతి | |
| (4) | హేరంబోపస్థానము | |
| (5) | గణపతి గీతము - తెలుగున | గీతమాలలో |
| (6) | ఇంద్రగీతము - తెలుగున | |
| (7) | అగ్నికి నాల్గు విభూతులు | |
| (8) | దేవరుణ నిరూపణము | |
| (9) | శబ్దప్రమాణ విచారము | విశ్వమీమాంసలో |
| (10) | సిద్ధాంతసార సూత్రము | |
| (11) | దర్శనమాల - 2వ దర్శనం | |
| (12) | గురుమంత్ర భాష్యము | |

## BOOKS AVAILABLE IN ENGLISH

1. NAYANA (Biography)
2. THE GLORY OF GANAPATHI (Herambopasthanam)
3. EPISTLES OF LIGHT (Ganapathi Muni's letters to Ramana)

64589
500 044



కీ॥శే॥ శ్రీ గుంటూరు లక్ష్మీకాంతము

శ్రీ గుంటూరు లక్ష్మీకాంతముగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. గొప్ప స్నేహశీలి. నిరాడంబరజీవి. పరోపకార పరాయణుడు. స్వార్థరహితుడు. భగవద్భక్తిపరుడు. కలకత్తాలో తెలుగు బాల బాలికలకోసం ప్రత్యేక పాఠశాలని నెలకొల్పి, కొద్దికాలంలోనే విద్యావేత్తగా, గొప్ప పేరుప్రతిష్ఠలని సంపాదించారు. శ్రీ వివేకానందస్వామి రచనలను చదివి ప్రభావితు లయ్యారు.

శ్రీ నాగపూర్ బాబా, శ్రీ రమణమహర్షి గార్ల అనుగ్రహాన్ని పొందారు. శ్రీరమణమహర్షి శిష్యులైన శ్రీ కావ్యకంఠ గణపతిముని గారితో వీరికి పరిచయ భాగ్యం కలిగింది. వారి అముద్రిత రచన లెన్నింటినో ప్రచురించిన ఘనత శ్రీ లక్ష్మీకాంతముగారికి దక్కింది. వారి జీవితచరిత్రని "నాయన" అనే శీర్షికతో రచించి, ముద్రించారు.

ఎవరెటువంటి కష్టాల్లో ఉన్నా, వారిని ఆదుకునే స్వభావం శ్రీ లక్ష్మీకాంతముగారిది. అచంచలకార్యదీక్ష, ప్రజాసేవ ఆయన ఉచ్ఛ్వాస నిఃశ్వాసాలు. అటువంటి వ్యక్తి "నభూతో న భవిష్యతి".